
Sripada Sri Guru Sangamam
Seva Trust




Title of Book:Sripada Sri Vallabha Katha Sudha
Sankalanam: Dr. Duvvuri Bhakskar Rao
Copy Rights Donated By SSGSS Trust: Dr. Duvvuri Bhakskar Rao
Total Pages: 144
Format: PDF

భక్తులకు గమనిక:

మన SSGSST ట్రస్ట్ భక్తులకు శ్రీపాద శ్రీ చరణుల వారి ఆధ్యాత్మిక గ్రంధాలను అనేకం మన వెబ్సైట్ ద్వారా ఉచితంగా అందించింది. ఆర్థికంగా శక్తి ఉన్న భక్తులు దయచేసి ఎంతో కొంత ద్రవ్యాన్ని ట్రస్ట్ కి పంపిస్తే ఆమొత్తం ఆయా గ్రంధకర్తలని, సంకలనకర్తలని సన్మానించడానికి వినియోగిస్తాము. భక్తులు ఈ విషయాన్ని గమనించవలసిందిగా ప్రార్ధన.

SSGSSTrust

# మీ ముందు నా మాట

**"పలికెడిది భాగవతమట - పలికించెడివాడు రామభద్రుండట"** అన్న శ్రీపోతనామాత్యుల అనుభవం ఎన్నో శతాబ్దాల నుండి, ఎంతోమంది గ్రంథకారులకు ఆధ్యాత్మికంగా ఎంతగానో స్ఫూర్తినివ్వడమేగాకుండా, సత్యమని కూడ నిరూపించబడినది. ఆ అనుభవము పొందినవారిలో నేను కూడ ఒకడినే. విషయపరిజ్ఞానాన్ని నా కలంలో పోసి, నా చేత ఈ గ్రంథాన్ని శ్రీవల్లభులే వ్రాయించుకున్నారని తెలుపుటలో అతిశయోక్తి లేదు. గ్రంథ రచనతో పెద్దగా పరిచయంలేని నాకు ఈ బాధ్యత అప్పగించిన, గణేశ తత్త్వముతో విరాజిల్లుతూ 33 కోట్ల దేవతలకు ప్రభువైన, శ్రీవల్లభుల వారి దివ్యచరణారవిందములకు శతకోటి వందనములు.

ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేయడంతోబాటు, దానిని ఒక నిత్యకృత్యంగా చేసి, నాలో భగవద్భక్తిని నెలకొల్పి, నన్ను సన్మార్గంలో నడుపుతూ, కర్మసోపానము నుండి జ్ఞాన సోపానమునకు నన్ను ఎక్కించిన యోగీశ్వరేశ్వరుడు, నాకెంతో మేలు చేస్తున్న నా గురుదేవులు శ్రీ షిరిడీ సాయిబాబా వారికి శతసహస్ర ప్రణామములు.

నా జీవితానికి ఒక గమ్యాన్ని ప్రసాదించి, నాచే నిత్యపూజలందుకుంటూ, వెన్నంటి ఉంటూ వివిధ క్షేత్రములలో కొలువైయున్న ఆదిదంపతులు శ్రీపార్వతీపరమేశ్వరులకు వందలాది వందనములు.

నా సారధ్యంలో నిర్మింపబడిన దేవాలయంలో కొలువైన శ్రీవిజయగణపతివారికి, ఆ దేవాలయప్రాంగణ దేవత లందరికీ నా హృదయ పూర్వక మనోవాకములు. గణేశచతుర్థశినాడు అవతరించి, గణేశతత్త్వమును సంతరించుకొనిన శ్రీవల్లభులు దేవాలయనిర్మాణాన్ని ప్రథమావకాశంగా నాకిచ్చి తరింపజేసారు. మరల ఈ గ్రంథరచనను మరొక అవకాశంగా నాకు కలుగజేసినందుకు వారి చరణముల ముందు కృతజ్ఞుడనై సాష్టాంగ ప్రణామము చేయుచున్నాను.

ఒక్క సూర్యుడు తన కాంతిపుంజముల ద్వారా పశు, పక్ష్య, వృక్ష మానవజాతులకు ఈ సృష్టి పెంపొందుటకు కారణభూతుడగుచున్నాడు. అలాగే వల్లభుడొక్కడే కలి మాయను తప్పించి మానవాళిని సన్మార్గంలో నడిపి, మోక్షాన్నీయగల సమర్థుడు. కొంతమందికి దేవుడ్ని చూడాలనే భక్తివున్నప్పటికీ, దేవాలయానికి వెళ్లాలని అనిపించదు. అయితే, మానవ ప్రయత్నంగా దేవాలయం అరుగుమీద కూర్చోవడం అలవాటుచేసుకుంటే, ఆ వ్యక్తిని అనతికాలంలో భగవంతుడే తనవైపుకు త్రిప్పుకుంటాడంటారు శ్రీరామకృష్ణ పరమహంస. ఆ సంకల్పంగూడ పూర్వజన్మ సుకృతమే. దేవాలయానికి వెళ్లడం సద్గ్రంథాన్ని పఠించడం హిందువుల కనీసధర్మంగా గుర్తించాలి. దృష్టిపెడితే ఇది కష్టమైన కార్యంగాదని గుర్తించండి.

తూర్పుగోదావరిజిల్లా వాసినైన నేను చాల ఆలస్యంగా శ్రీవల్లభుల వారి గూర్చి తెలుసుకున్నాను. శ్రీపాదుల వారి లీలలు అనూహ్యములు. కారణములేని కార్యము సంభవింపదు గదా ! శ్రీపాదుల వారి చరితామృతమును శ్రీ శంకరభట్టు గారు ఎన్నో శతాబ్దముల క్రితం సంస్కృతంలో లిఖించి శ్రీవల్లభుల వారి ఆశీర్వాదములు పొందారు. ఈనాటి భక్తుల మనస్తత్త్వమునకు సరిపడునట్లుగా, కాలానుగుణ్యంగా ఆశక్తిని గొలిపేరీతిలో, శ్రీవల్లభులపై భక్తి భావము పాఠకుల మదిలో దృఢంగా నాటుకునే విధంగా, అందరికీ సులభంగా అర్థమయ్యేటట్లు, వారి లీలలను ఒక క్రమపద్ధతిలో వ్రాయాలనే తలంపు శ్రీవల్లభులు నాలో కలుగజేసారు. తొలుత కొన్ని అవరోధాలేర్పడి, ఆలోచనా విధానంలో స్తబ్దత చోటు చేసుకుని వృధాగా కాలం సాగిపోయింది. కాని, శ్రీవల్లభులు తిరిగి నాలో సంకల్పసిద్ధిని రగిలించి, తమ ఆశీర్వాదబలంతో కార్యోన్ముఖునిగా తీర్చిదిద్ది ముందుకు నడిపారు. ఏ కారణమువల్లనో, శ్రీచరణులు నాపై ఈ భారం మోపారు. నా శాయశక్తులా కృషి చేసాను. పనితనం నాది, పర్యవేక్షణ వారిది అనే రీతిలో ఈ గ్రంథం రూపుదిద్దుకుంది. ఈ గ్రంథంలో కొంతభాగం

అమెరికాలో, మరికొంత భాగం వారణాసిలో, మిగిలినది హైదరాబాద్‌లో శ్రీవల్లభులు నాచేత వ్రాయించారు. సమాచార సేకరణ కొరకై పిఠాపురం, శ్రీవల్లభాపురం మరియు కురువపురాలను దర్శించే భాగ్యం కూడ కలుగజేసారు.

కర్మయోగికి నైతిక వర్తనం అవసరం. అతనికి నీతినియమాలు ప్రాణం, చిత్తశుద్ధి, సచ్ఛీలత ముఖ్యం. జ్ఞానయోగికి విషయపరిజ్ఞానం అంతరవలోకన అవసరం. రాజయోగికి అంతశ్శుద్ధి ముఖ్యం. యోగం చేసినా, చేయకపోయినా ఆధ్యాత్మిక జీవనం గడపదలచిన వారికి సంయమనం, సత్యసంధత, నీతి ఎంతో అవసరం. వీటి ఆచరణ క్రమంలో కొన్ని మలినాలు వద్దన్నా వారికి అంటకమానవు. శరీరంపై ఉండే మలినాలు కడుక్కుంటే పోతాయి. అంతర్గతంగా లోపల తిష్టవేసిన మలినాలను సజ్జనసాంగత్యం, పురాణశ్రవణం, సద్గ్రంథ పఠనంతో మాత్రమే శుద్ధి చేసుకొనవచ్చు. దీనికి ఆత్మజాగృతి కావాలి. ఒక మహాపురుషుని జీవితాన్ని అధ్యయనం చేస్తేనే ఆత్మజాగృతమవుతుంది. అందుకు మహాత్ముల జీవితాలే ముఖద్వారాలు, ముఖ్యద్వారాలు కూడ. లేదంటే సద్గురువును ఆశ్రయించి, శుశ్రూష చేసి ఆత్మను జాగృతం చేసుకోవాలి. వెనుకటి రోజుల్లో గురుకులాలుండేవి. ఆశ్రమాలుండేవి. గురువులపట్ల భక్తి, శ్రద్ధలుండేవి. విద్యను గురుముఖంగా నేర్చుకునేవారు. ఈనాడు ఆస్థాయి గురువులను పొందడం దుర్లభం. ఒక మంచి గురువును ఎంచుకోవాలంటే అహర్నిశలు ఎంతో శ్రమించాలి. ఆ తరువాత ఆ ఎంపిక ఎంతవరకూ సత్ఫలితాలనిస్తుందో, అంచనా వేయడం ఊహలకందని కార్యం. ఈ నేపథ్యంలో పుస్తకమే గురువు. గ్రంథస్థమైన విషయాలు అనుభవజ్ఞుల జ్ఞానభండాగారాలు. పుస్తకం ఒక జ్ఞానప్రవాహం. చదవడం వల్ల, చదివినది అర్థం చేసుకోవడం వల్ల అనేకానేక విషయాలు తెలుస్తాయి. మంచిచెడులను తాపీగా విశ్లేషించుకునే వీలుంటుంది. తద్వారా నచ్చిన పద్ధతులను అవలంబించుకోవచ్చు. మన అభివృద్ధి ఎలా సాగుతుందో గ్రహించడానికి, పూర్వయోగుల అనుభవాలు ఉపకరిస్తాయి. అవి మార్గదర్శకమై, గమ్యంవైపుకు నడిపిస్తాయి. అందుకే సద్గ్రంథాన్ని తొలిగురువుగా స్వీకరించాలి.

ఆధ్యాత్మికచింతన ఒక అనంతసాగరం. ఇది ఉప్పునీటిసాగరం కాదు. తీపినీటిసాగరం. ఎంత గ్రోలితే అంత మాధుర్యం. ఆ మాధుర్యం వెనుక సాటిలేని తృప్తి, శాశ్వత ఆనందం. ఇహలోకంలో కష్టాలను దాటే వారధి. పరలోక సుఖానికి పునాది. అందుకే ఆధ్యాత్మికతవైపు వయోబేధం లేకుండా, అందరూ అడుగులు వేయాలి. అదే హిందూ సమాజలక్ష్యం. లక్షణము కూడా.

హిందూ ధర్మశాస్త్రములు అంతుపట్టనివి. వేదములకంటే కూడా భిన్నమైనవి. అందువలన శైవ, శాక్తేయ, వైఖాన సాద్యాగమాలు కొంత తెలిసిననూ, నేనేమి తెలియని వాడనని ఎంతటివారైన అంగీకరింపకతప్పదు. సమగ్రముగా తెలుసుకుని వ్రాయవలెనని కోరిక ఉన్ననూ, దత్తభాగవతము వ్రాసిన కృతికర్తలు ఇప్పుడులేరు. వివిధ గ్రంథాలను పరిశోధిస్తే, ఒక్కొక్క గ్రంథం ఒక్కొక్క విధంగా చెపుతుంది. అన్ని గ్రంథాల సారం ఒకటే అయినా, ఆయా సంఘటనల తాలూకు మీమాంసలు వెంటాడుతూనే ఉంటాయి. ఎందుకంటే దత్తచరిత్ర ఎంతోప్రాచీనమైనది. దీనితోబాటు శ్రీదత్తులుగాని, శ్రీపాదశ్రీవల్లభులు గాని తమతమ చరిత్రలు వెనువెంటనే బహిర్గతము చేయుటకు అంగీకారము తెలుపలేదు. ఈ మధ్య వ్యవధి కాలంలో వారి చరిత్రలోని మూలాంశాలు, ముఖ్యాంశాలు కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. దత్తచరిత్రలు చాలా వ్రాతప్రతులుగానే పూర్వకాలంలో వెలిసాయి. దత్తుని ఆనతిప్రకారం కొన్ని గంగాప్రవేశం చేసాయి. అందువలన మహా, మహిమాన్వితులైనప్పటికీ, వారి చరిత్రలు మరుగునపడ్డాయి. దత్తుడిగా ఎక్కడో జన్మించినా, తన ప్రథమ అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుల అవతారానికి శ్రీదత్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పిఠాపురాన్ని ఎన్నుకోవడం, మనరాష్ట్ర ప్రజల అదృష్టం. శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానము పిఠాపురమయినప్పటికీ, ఇంటిమందు వంటపట్టదన్న సామెత వలె మనరాష్ట్ర ప్రజలకింకా వారిపై అవగాహన పూర్తిగా ఏర్పడకపోవుట శోచనీయం. ఈ క్షేత్రానికి వచ్చే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తుల సంఖ్య ఎక్కువ. మన రాష్ట్ర భక్తుల సంఖ్య తక్కువ. ఏదిఏమయినా, జరిగిన ఆలస్యానికి చింతించక, ఇప్పటికైనా భక్తులు శ్రీవల్లభులవారి ఈ క్షేత్రాన్ని దర్శించి వారి ఆశీస్సులు పొంది తరించాలని మనవి. ఈ గ్రంథ పఠనంతో శ్రీవల్లభుల కరుణకు పాత్రులై, 16 సంవత్సరాలు వారు నివసించిన పిఠాపురాన్ని, 14 సంవత్సరాలు అనుష్టానం చేసిన కురువపురాన్ని దర్శించగలరని విశ్వసించుచున్నాను.

ఇక, ఈ గ్రంథంలో ఆది గురువు, జ్ఞాననిధియైన దత్తుని చరిత్ర పొందుపర్చబడింది. దత్తుడే ఈ లోకానికి బోధ గురువు. జగద్గురువుగా అతిలోక విఖ్యాతిగాంచిన, శ్రీశంకరాచార్యుల వారికి గూడ శ్రీ దత్తాత్రేయుల వారు ఉపదేశమిచ్చిన సంఘటన చరిత్రలో జాజ్వల్యమానంగా ప్రకాశిస్తోంది. గురువులకే గురువు శ్రీదత్తాత్రేయుడు. దత్తాత్రేయుడు పిఠాపురంలో శ్రీపాద శ్రీవల్లభునిగా జన్మించారు. వారిది గూడ గురుస్వరూపమే. అందువల్ల గురువుల వైభవం, శ్రీవల్లభులవారి జననము, పీఠికాపురంలో వారి బాల్యము, మహిమలతోబాటు శ్రీవల్లభులవారి జీవిత విశేషాలను వెలుగులోనికి తెచ్చిన శంకరభట్టును గూర్చి గూడ ఈ గ్రంథమందు వివరించబడింది. శ్రీపాదవల్లభుల కొరకు ప్రత్యేకంగా ఒక అష్టోత్తర శతనామావళి యేర్చికూర్చడమైనది.

కన్యాకుమారి నుండి బయలుదేరి కురువపురం శంకరభట్టు చేరేనాటికన్నా, ఎంతో ముందుగానే, శ్రీవల్లభులు కురువపురం చేరుకున్నారు. శంకరభట్టు శ్రీవల్లభులను దర్శించేనాటికే వారు తమ ఆధ్యాత్మికబోధన, శిష్టరక్షణ, దుష్టపరివర్తనలను ప్రారంభించి, ఎంతోప్రాచుర్యం పొందారు. శంకరభట్టు విరచితగ్రంథంలోని అంశాలన్నీ మార్గమధ్యంలో అతని అనుభూతులు, శ్రీవల్లభుల భక్తులద్వారా సంగ్రహించిన సమాచారంతోబాటు కురువపురం చేరిన తరువాత శ్రీవల్లభుల సహచర్యంలో అతని అనుభవాలు మాత్రమే. తరువాత కాలంలో వచ్చిన శ్రీవల్లభభక్తులు మరింత సమాచారాన్ని కురువపురంలో శ్రీవల్లభుల నిత్యకృత్యాలతోబాటు, వారి బోధనలెన్నో కూడ ఆనాటికి కురువపురం ప్రాంతంలోనున్న భక్తుల ద్వారా సేకరించారు. దీనిలో ముఖ్యంగా నివృత్తి సంగమము, శ్రీవల్లభాపురంలలో వారి జీవనశైలి మరియు కురువపురంలో బోధగురువుగా వారు చేసిన ప్రవచనాలు చోటుచేసుకున్నాయి. అయితే శంకరభట్టు రాసిన గ్రంథాన్ని శ్రీవల్లభులు స్పృశించారు. శ్రీవల్లభుల అవతార పరిసమాప్తి జరిగిన పిదప సేకరించిన సమాచారానికి ఆ అవకాశం కలుగలేదు. కాని అదృశ్యరూపంలో వారు దీనికి కూడ ఆమోదముద్ర వేసినారు గావుననే ఈ సమాచార సేకరణ జరగడంతోబాటు, ఆ విలువైన సమాచారం ఎంతో ప్రాచుర్యం పొందింది. స్థూలంగా ఈ పై అంశాలన్నీ ఒక క్రమపద్ధతిలో, అధ్యాయాలుగా రూపొందించబడి, పొందుపర్చబడినవి. సులభశైలిలో నిడివి తక్కువ గ్రంథమైనా, దాదాపుగా అన్ని అంశాలను విడువకుండా సంక్షిప్తంగా చెప్పాను. ఈ గ్రంథధ్యేయం మరింతమంది భక్తులను వల్లభుల వారి సన్నిధికి చేర్చడమేకాకుండా, దత్తతత్త్వాన్ని ఎంతో మందికి పరిచయం చేయడమే. ఈ లక్ష్యాన్ని సాధించగలననే ధీమా నాకుంది. ఆపై శ్రీవల్లభుల దయవుంది.

జన్మలలో కెల్ల మానవజన్మ ఎంతో ఉత్తమమైనది. ఈ జన్మ కలిగిన కారణంగానే ఆధ్యాత్మికతను పొందడానికి అవకాశం కల్గింది. దానికి కారణభూతులైన నా తల్లిదండ్రులకు ఈ గ్రంథం అంకితం చేస్తూ కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

దత్తుడు గత జన్మలో ఆగిపోయిన సాధనను గుర్తుచేసి, దానిని ఈ జన్మలో కొనసాగించుటకు దోహదం చేస్తారని, అదే దత్త సాంప్రదాయ విశిష్టత అని ప్రతీతి. ఆత్రేయసగోత్రోద్భవుడనయిన నాకు ఇది నా షష్ఠిపూర్తి సంవత్సరము. ఆ శుభసందర్భంలో నా జన్మము ధన్యము చేయుటకు శ్రీవల్లభులు నాకీ పుణ్యకార్యము అప్పగించడం మహాద్భాగ్యముగా భావించుచున్నాను.

ఈ గ్రంథాన్ని పఠించి ఆత్మోన్నతిని, ఆనందాతిశయాన్ని పొందగలరని నా ఆశయము! ఆకాంక్ష!

ఈ గ్రంథంపై మీ అభిప్రాయాలను, అమూల్యమైన సలహాలను drduvvurirao@gmail.com కు లేదా లేఖ ద్వారా తెలియజేస్తే కృతజ్ఞుడను.

గ్రంథంలో తప్పులు దొర్లితే అవి నా అవగాహనాలోపంగా తలచి పెద్దమనసుతో మన్నింపవలసిందిగా మనవిచేస్తూ.......

భవదీయుడు

డా॥ దువ్వూరి భాస్కరరావు

# “శ్రీపాద శ్రీవల్లభ కథాసుధ” పుస్తక పారాయణ విధానం

శ్రీపాద శ్రీవల్లభుల వారి సచ్చరిత్ర సాక్షాత్తూ పరమేశ్వరస్వరూపము. ఈ చరిత్రనందలి అక్షరములలో సిద్ధశక్తులు, యోగ శక్తులున్నవి. ఇటువంటి చరిత్రలు మనస్సుపెట్టి, ఏకాగ్రతతో చదివిన యెడల ప్రతీ పాఠకుడు శ్రీపాదులవారి కృపాకటాక్షములకు పాత్రుడు కాగలడు. తద్వారా భక్తులు శారీరక, ప్రాణ, మానసికరుగ్మతలు, ఈతి బాధలు, కష్టనష్టములు అధిగమించి, కోరుకున్న కోర్కెలు సిద్ధించి సుఖములు పొందగలరు. ఇది ముమ్మాటికి అక్షర సత్యము.

1. ‘శ్రీపాద శ్రీవల్లభ కథాసుధ’ అనే ఈ పుస్తకాన్ని నిర్ణీత వ్యవధి లేకుండా, నిత్యకృత్యంగా ప్రతీరోజు ఏదో సమయంలో వీలును బట్టి కొన్ని పేజీలయినా చదివితే సర్వశుభాలు కలుగుతాయి. పనుల నిమిత్తం వేరే ఊర్లలో ఉన్నా, ఆ ఊర్లో కూడ గ్రంథ పారాయణం చేయవచ్చు. పుస్తకం మీ వెంట ఉంచుకోండి.
2. ప్రతిరోజూ ఎన్ని పేజీలు వీలుంటే అన్ని పేజీలు పారాయణ చేస్తూ ఒక వారం నిర్ణీత వ్యవధిగా ఎంచుకుంటే ఆ వారంలో అనగా గురువారం ప్రారంభించి, తదుపరి వారంలో వచ్చే బుధవారం పూర్తిచేయవచ్చు (లేదా) పదిహేను రోజులలో పారాయణ చేయాలనే నిర్ణీత వ్యవధి విధించుకుంటే, ప్రారంభించిన గురువారం తరువాత వచ్చే రెండవ బుధవారం పూర్తిచేయవచ్చు. ఉదయం మరలా సాయంత్రం రెండు పూటల పారాయణం చేయవచ్చు.
3. అనుకోని అడ్డంకి ఏర్పడి, పారాయణ ముందుకు సాగకపోతే, భయపడి, బాధపడి, అపశకునంగా భావించవద్దు. అవాంతరము తీరగానే తిరిగి పఠించండి. దీనికి ఎట్టి అభ్యంతరము లేదు. దీనిని భగవంతుని పరీక్షగా తలచి, మరింత పట్టుదలతో ఆ పరీక్షలను అధిగమించి, స్వామివారి మెప్పు పొందండి. భక్తులకు పరీక్షలు పెట్టడంలో దత్తుడు బహు నేర్పరి. భక్తుడు వారి పరీక్షలలో గెలువగానే అతనికి దత్తుడు ప్రసన్నుడౌతాడు.
4. పారాయణ చేయడానికి వీలుపడని వారు ప్రతీరోజు కొన్ని పేజీలు చదువుకుంటూ గ్రంథాన్ని పూర్తి చేసుకొనవచ్చు.

ఈ పుస్తకం పఠించడానికి విపరీతమైన పూజలుగాని, దీక్షలు గాని, ఆచార వ్యవహారాలు గాని అవసరం లేదు. శ్రీవల్లభుల యెడ భక్తి, విశ్వాసం, ఏకాగ్రత ఉంటే చాలు. ఉదయమయితే స్నానం చేసి, సాయంత్రమయితే ముఖము, కాళ్ళు, చేతులు కడుక్కుని చదవండి. రెండు పూటలా పారాయణం చేయవచ్చు. అశుచి (బహిర్భుమి) వస్తే మాత్రం స్నానం చేయండి. చదివేటప్పుడు శుచిగా, శుభ్రమైన దుస్తులతో, కుంకుమ, విభూది ధరించి పరిపూర్ణ విశ్వాసంతో, ప్రశాంత వాతావరణములో చదవండి. మరీ తప్పనిసరి పరిస్థితులలోగాని పారాయణ మధ్యలో లేవకండి. ఒక వేళ విధిలేక పారాయణ మధ్యలో అంతరాయం కలిగితే పదిసార్లు దత్తనామస్మరణ చేసి తిరిగి పారాయణ ఆపిన చోట నుండి ప్రారంభించండి. మూఢభక్తి అవసరంలేదు. పారాయణ ప్రారంభించే ముందు ప్రతీసారి ఈ క్రింది దేవతలను ధ్యానించండి.

1. ఓం శ్రీ గణేశాయ నమః 2. ఓం శ్రీ సరస్వత్యై నమః 3. ఓం శ్రీ అనఘాలక్ష్మీ సమేత అనఘస్వామినే నమః
4. దిగంబరా, దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా 5. ఓం శ్రీ పాదరాజం శరణం ప్రపద్యే

స్త్రీలు, పిల్లలు, ఎవరయినా ఈ పుస్తకం చదవవచ్చు. నిషేధమేమియూ లేదు. శ్రీ వల్లభుల వారికి జాతి, కుల, వర్ణ, వర్గ, మత విభేదాలు లేవు. అందువల్ల ఈ పుస్తకం పారాయణ చేయడానికి అందరూ అర్హులే. అయితే స్త్రీలు బహిష్టు సమయాలలోగాని, ఎవరికయినా మైలు, పురుడు, వగైరాలు వస్తే మాత్రం ఈ పుస్తక పారాయణ చేయకూడదు. ప్రతి రోజూ పారాయణ ప్రారంభంలో ఈ గ్రంథంలో గల శ్రీవల్లభుల అష్టోత్తర శతనామావాళిని చివరలో సిద్ధమంగళస్తోత్రాన్ని పఠించండి. ఈ పుస్తకం మీ వద్దకు చేరుకోవడం శ్రీవల్లభుల సంకల్పమే. మీ పూర్వజన్మ పుణ్యఫలమే. దీనిని పఠించి సర్వశుభాలు పొందండి. ఈ పుస్తకాన్ని ఎవ్వరికీ ఇవ్వకుండా జీవితకాలం మీ పూజ మందిరంలో భద్రపరచుకుంటే దత్తుడు అదృశ్య రూపంలో మీ ఇంట సంచరిస్తూ మిమ్మల్ని కాపాడును. ఇది సత్యము. దత్తుని అభయం కూడా.

పుస్తక పారాయణం పూర్తి అయ్యాక మీకు అందుబాటులో ఉన్న షిరిడీ సాయిబాబా లేదా దత్తాంశ గలిగిన ఏ గురువు దేవాలయానికైనా వెళ్లి వారిని దర్శించండి. మీ ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తే, కొన్ని పుస్తకాలు తెప్పించుకుని పారాయణ చేయాలనే శ్రద్ధాశక్తులు గల వారికిచ్చి, వారిచే పారాయణ చేయించి, దత్తతత్త్వంపై ప్రచారంలో భాగస్వాములై తరించండి. ఈ గ్రంథంలోని అంశాలను మీకు తోచినరీతిలో నలుగురికి తెలియచేసి, దత్త భక్తుల సంఖ్యను పెంచండి.

ఈ గ్రంథ పారాయణ చేసి, ఇహపర సౌఖ్యాలు పొంది, శ్రీవల్లభుల కరుణాకటాక్షములకు పాత్రులు కండి.

శ్రీపాద రాజంశరణం ప్రపద్యే

# గురుస్వరూపం-వారి వైభవం

దత్తాత్రేయస్వామి వారు మొట్టమొదటిగా శ్రీపాద శ్రీవల్లభులుగా అవతరించారు. అటుతర్వాత దత్తాంశతో సిద్ధగురువులు లెందరో జన్మించారు. దత్తాత్రేయుడు సృష్టికి ఆది గురువు. వారి పరంపరంలో వచ్చిన వారందరూ సద్గురువులే. ఈ గురుమణిహారమంతా జ్ఞానబోధనలమయం. కాబట్టి ఈ గ్రంథపారాయణ చేసే వారందరూ తొలుత గురువంటే ఎవ్వరు ? వారి స్వరూపం ఏమిటి ? గురుశిష్యుల సంబంధ బాంధవ్యాలేమిటి ? మొదలగు అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అలా తెలుసుకున్న తరువాత, గురువుపై గురి కుదురుతుంది. అప్పుడు గురుతత్త్వాన్ని పూర్తిగా విశ్వసించాలి. లేనిచో గ్రంథపారాయణ సత్ఫలితాలనివ్వటం కష్టతరము. కావున ఏకాగ్రతతో గురుస్వరూపాన్ని ఆకళింపు చేసుకుందాం.

లోకమున ప్రతిప్రాణి 'సుఖయేభూయాత్ - దుఃఖమేనశ్యాత్' అని కోరుకుంటుంది. అంటే నాకు సుఖమే కావాలి గాని దుఃఖం వద్దు అని అర్థం. అయితే ఎక్కడ సుఖముంటుందో, దానిని అంటిపెట్టుకుని దుఃఖం కూడ ఉంటుంది. ఏది సుఖమో, ఏది దుఃఖమో, దేనివలన దుఃఖం తొలగి సుఖము లభించునో తెలుసుకునే మార్గం గుర్తించుట దుర్లభము. దుఃఖం తొలగాలంటే అద్వైతాత్మజ్ఞానం ఆవశ్యకం. అట్టి ఆత్మజ్ఞానము, శోత్రియ బ్రహ్మనిష్ఠులగు ఉత్తమగురువుల ద్వారానే దొరుకుతుంది. కనుక ఆత్మతత్త్వ జిజ్ఞాస గల సాధకులు. ఆత్మానుభవము కలిగిన సద్గురువులను ఆశ్రయించాలని సకల శాస్త్రములు, పురాణములు నొక్కివక్కాణిస్తున్నాయి. సద్గురువు శరణాగతియే మోక్షమునకు మూలమని భగవద్గీత తెలియజేయుచున్నది. ఇహపరశ్రేయస్సుకు సద్గురువును సేవించి, ఆయన అనుగ్రహానికి పాత్రులగుటే ముఖ్యం. ప్రాయశ్చిత్తం కూడలేని మహాపాపాలను గూడ సద్గురువు నీడలో పోగొట్టుకొనవచ్చు. కనుక ఆధ్యాత్మిక చింతనగల వారందరికీ సద్గురువునాశ్రయించుటే తరుణోపాయం.

ఆత్మనాశనములేనిది. మానవదేహము ఆత్మను తనమాయాబంధనములో బంధించగానే మానవజన్మము కల్గును. ఎప్పుడయితే సర్వస్వతంత్రమైన ఆత్మకు నరదేహము ప్రాప్తించునో, అప్పుడే దానికి సంసారిక, సుఖ, దుఃఖములు, తాపత్రయములు ఆరంభమగును. ఈ తాపత్రయములకు మూలకారణము త్రిగుణాత్మకమగు మాయయే. తద్వారా మానవునిలో సత్వ, రజో, తమోగుణములు ప్రవేశించి, అతనిలో అహంకారము, వ్యామోహము మొదలగు దుర్గుణములు కలిగి, అతనిలోనున్న జ్ఞానదృష్టి మసకబారిపోవును. దానితో ఈ నరదేహమొక విలక్షణమైన శక్తిగా అవతరించును. ఆ చీకట్లు పారద్రోలుటకు గురుసాంగత్యమెంతో అవసరం. 'గు' అంటే చీకటిని 'రు' అంటే పారద్రోలేవాడని అర్థం. ఇక్కడ చీకటి అంటే సన్మార్గానికి చేరే దారి కనపడనీయక అడ్డంగా, ప్రతిబంధకముగా నిలచే, ఆ చీకటిని పారద్రోలేవాడే గురువని, ఆ శబ్దానికి పూర్తి అర్థం. బడిలో గురువు వేరు. గుడిలో గురువువేరు. సిద్ధగురువులు వేరు. సద్గురువులైన సిద్ధగురువులు సాధారుణులగు ఇతర గురువులవలె ఉండరు. వారి కృపవలన శుద్ధ జ్ఞానము శిష్యునియందు ప్రకాశించును. కావున జ్ఞానము, వైరాగ్యము, భజనము, స్వధర్మకర్మము, సాధనము, కథానిరూపణము, శ్రవణము, మననము, నీతి, న్యాయము, నిరాడంబరత మొదలగు లక్షణములు కల్గి తన యుపదేశ ప్రభావముచే గురువు ఆత్మదర్శనము శిష్యునకు అనుగ్రహించును. అనాధుల పాలిట రక్షకుడు, జ్ఞానము కొరకై శిష్యులకు బోధన చేయువాడు, అవిద్యను శిష్యుని యందు వ్రేళ్లతో పెకలించి, ఇంద్రియదమనము గావించువాడు సద్గురువనబడును. దత్తాంశతో జన్మించిన సద్గురువులందరూ ఈ కోవకు చెందినవారే.

కలియుగమందు శ్రీ ఆంజనేయస్వామి అవతారమైన శ్రీసమర్థరామదాసు 'దాసబోధ' అను గ్రంథమున గురువైభమును ఎంతగానో వివరించి, గురుశిష్యసంబంధములతోబాటు ఈ వ్యవస్థను కూలంకషంగా ఆ గ్రంథములో

విశదీకరించాడు. శిరిడీ సాయిబాబా తమ భక్తులనందర్నీ దాసబోధ తప్పనిసరిగా చదివమని తెలిపేవారు. అది చదివి అర్థం చేసుకుంటేగాని గురుతత్త్వం బోధపడదని పదేపదే భక్తులకు బోధించేవారు.

ఎన్నో జన్మల అనంతరంగాని మానవ జన్మ లభించదు. ఈ జన్మ లభించిన కారణంగానే మానవునికి పరమార్థిక విషయముల గూర్చి తెలుసుకునే అవకాశం దొరికింది. అసంఖ్యాకులగు సిద్ధులు, సాధువులు, సజ్జనులు తాము హితమును సాధించుకుని సన్మార్గము నెంచుకునేందుకు వారికి మానవ దేహమెంతో ఉపకరించింది. మానవ దేహము పొందిన పిదపనే సంశయములు నశించి, సద్గతులు పొందవీలగుచున్నది. అందువలన సాధకులందరూ శీఘ్రముగా తమ మనస్సులను అదుపు చేసుకుని, మనస్సుతోబాటు దేహాన్ని గూడ పరమార్థమందు ప్రవేశపెట్టవలయును. వృద్ధాప్యము సమీపిస్తే, రోగాలు తప్పవు. అప్పుడు దైవంపై ధ్యాస కుదరదు. అందువల్ల నడివయస్సు నుండీ దైవచింతన ప్రారంభం కావాలని ముముక్షువులంటారు. ఆ వయస్సులోనే గ్రంథపఠనం వల్ల సద్గురువు లభ్యమయ్యేందుకు అవకాశాలుంటాయని వారంటారు. పశుపక్ష్యాదులకు లేని ఈ అవకాశము మానవునికి కల్గించినందుకు భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, మానవదేహమే ధన్యమనే పరమార్థం గ్రహించాలి.

శిరిడీసాయి ఒకప్పుడు భక్తులతో తమ గురుసేవ గూర్చి ఇలా తెలిపారు. నా గురువును 12 సం॥లు ఏకాగ్రతతో, ఆకలిదప్పులు తెలియకుండా సేవించేవాడిని. ధ్యానమునందున్న వారికి దేహము సంగతే తెలిసేదిగాదు, ఆయన చేత ఆహారం తినిపించి, బట్టలుమార్చి, ఆ ప్రదేశం శుభ్రం చేసేవాడిని. ఈనాటి నా ప్రతిభకు కర్తలు వారే అని అనేవారు. దీనినిబట్టి గురువుపట్ల వారి వాత్సల్యం, అంకితభావం అర్థమవుతుంది. గురువు యొక్క ఔన్నత్యం, ఉన్నతస్థానం గోచరిస్తుంది.

భగవంతుని చేరాలంటే గురువును ఆశ్రయించాలి లేనిచో భగవంతుని చేరుట దుర్లభము. శ్రీకృష్ణునికి అత్యంత భక్తురాలైన మీరాబాయి, స్వామినెంతగానో సేవిస్తూ, కొలుస్తూ ఉండేది. ఒకసారి శ్రీకృష్ణుడు ప్రత్యక్షమై, ఆమెను ఏదైనా వరం కోరుకొమ్మంటే, ఆమె శ్రీకృష్ణునిలో ఐక్యం చేసుకొమ్మని కోరింది. దానికి శ్రీకృష్ణుడు, భగవంతుని చేరాలంటే ఆత్మసాక్షాత్కారము అవసరమని, అది సద్గురువు ద్వారానే లభ్యమవుతుందని, కావున సద్గురువును ఆశ్రయించమని ఆమెకు ఉద్బోధిస్తాడు. అటుపిమ్మట, ఆ పరమభక్తురాలు 'రైదాస్' అను గురువును ఆశ్రయించి, వారిని సేవించి, ఆత్మసాక్షాత్కారము పొంది, శ్రీకృష్ణునిలో లీనమయ్యింది. దీనినిబట్టి గురువు యొక్క ప్రాముఖ్యత తేటతెల్లమవుతుంది.

ఒకసారి శుకశౌనకాది మునులందరూ కలసి నైమిశారణ్యంలో దీర్ఘసత్రయాగం చేయుచున్నారు. మునులందరూ ధ్యానంలో నిమగ్నమై నారాయణుని స్మరించుచుండగా, కోటి సూర్యుల కాంతితో ఒక దివ్యజ్యోతి పరిమళ భరితంతో వారి నడుమ సాక్షాత్కరించింది. అప్పుడు మునులందరూ ఆ రూపాన్ని దర్శించగలిగే శక్తి ప్రసాదించమని, ఆ కాంతి పుంజానికి నమస్కరించారు. ఆ కాంతి పుంజము తొలుత మహావిష్ణువుగా, అటుపిమ్మట మల్లిఖార్జుననిగా చివరగా చతుర్ముఖ బ్రహ్మగా దర్శనమిస్తూ, అంతలోనే ఆ రూపాలన్ని మిళితమై త్రిమూర్తుల కలయికగా శంఖము, చక్రము, త్రిశూలం, డమరుకం, మాల, కమండలం ఆరు చేతులతో ధరించి, సూర్యచంద్రులు, అష్టదిక్పాలకులు, మను, వసు, రుద్రులూ, నక్షత్ర గ్రహాది దేవతలు, కిన్నెర, కింపురుష, సిద్ధ, సాధ్య గరుడోరగ, దివ్యకాంతులూ ఆ త్రిమూర్తి స్వరూపుని స్తోత్రము చేయుచుండగా సప్త సముద్రాలు, సకల నదీతీరాలు, పర్వతాలు, సకల సృష్టి, సకల జీవరాసులు ఆ దివ్యరూపంలో గోచరించుచుండగా, ఆ త్రిమూర్తి స్వరూపుడైన స్వామి దర్శనమిచ్చారు. అంత ఆ మునులందరూ ఆ దేవాదిదేవుని, అర్ఘ్య, పాద్యములతో షోడశోపచారములుచేసి, వారిని కృతార్థులను చేయమని సాష్టాంగ ప్రణామం చేసారు. పిమ్మట మునులు వారిని స్తుతింపగా, స్వామి వారికి ఆశీర్వాదములందజేసారు. అప్పుడు మునులందరూ వారి ఈ నూతనస్వరూపం గూర్చి తెలియజేయమని కోరిరి. అంత స్వామి యోగోపదేశం చేయడానికి, సాధన సాగించడానికి, తగిన పుణ్యఫలం ఆశ్రితులకు అందించడానికి, తాను అత్రి, అనసూయల కుమారునిగా జన్మించి, దత్తాత్రేయుడను నామధేయంతో సకల లోకాలలో సంచరిస్తుంటానని తెలిపారు. మరిన్ని నా ఈ అవతారవిశేషాలను సూతమహర్షి మీకందించగలడని తెలిపిరి. వారందరికీ మంగళ ఆశీర్వాదము పలికి దత్తస్వామి అదృశ్యమైరి. వెంటనే మునులందరూ సూత మహర్షి కడచేరి, వారికి నమస్కరించి, దత్తాత్రేయ స్వామి చరిత్రను తెలుపవలసిందిగా కోరిరి. అంతసూతుడు అనేక విధముల దత్తుని స్తుతించి ధ్యానించగా,

చిరునవ్వులు చిందుతున్న ముఖపద్మం, శిరస్సుపై పింగళజటాజూటం, సూర్యచంద్రులు నేత్రాలుగా, కటియందు పీతాంబరం ఆరు చేతులతో కరుణార్ద్ర హృదయుడైన దత్తాత్రేయుడు సాక్షాత్కరించినాడు. సూతునితో దత్తుడు ఈ శౌనకాది మహామునులకు నా మహిమలు వినిపించు, నీకు అంతా కరతలామలకమవుతుంది. నా చరిత్ర నీకు స్ఫురిస్తుంది అని తెలిపి అదృశ్యమయ్యారు.

అపుడు సూతమహర్షి వారందరితో నాయనలారా ! దత్తదేవుని అనుజ్ఞ అయినది, భక్తి శ్రద్ధలతో ఆలకించండి. దత్తాత్రేయుడే ఆదిగురువు. ఇది గురుశిష్యుల సంవాదంగా ఉంటుంది. ఇది సకల మనోభీష్టప్రదం. దీన్ని వినడం కన్నా మరో తపస్సే లేదు. సకల సంపత్కరం, విద్యాప్రదాయకం, జ్ఞానప్రదం, సకల ప్రదేశాలలో సమస్త కాలాలలో ఎంతటి కష్టాలు సంభవించినా దత్తుని ధ్యానించిన వారికి జయమే తప్ప అపజయముండదు. ఇది సకల బంధ విమోచకం. దత్తుని నామాన్ని జపిస్తేనే సర్వాభీష్టఫలప్రదం. అందువల్ల వారి చరిత్ర తెల్సుకోవడం సకల శ్రేయస్కరం అని తెలిపారు.

అంత ఆ మునులందరూ దత్తాత్రేయుడే ఆదిగురువైనందువల్ల ముందుగా గురువంటే ఎవరు? శిష్యుడంటే ఎవరు? వీరి లక్షణాలేమిటి? తెలియజేయవలసిందిగా కోరిరి.

అంత సూతుడు వారి కిట్లు తెలిపెను. గురువు యొక్క గొప్పతనాన్ని తన సృష్టి ఆదిలో బ్రహ్మదేవుడు కలికి వివరించాడు. పద్మకల్పానికి ఆరంభంలో నారాయణుని నాభి నుండి కమలం ఆవిర్భవించినది అందుకూర్చుని బ్రహ్మ సకలచరాచర జగత్తును సృష్టించ నారంభించాడు. భూలోకంలో మానవులను సృష్టించి, వారికి వర్ణాశ్రమ ధర్మాలను ఏర్పరచి, వాటి అమలుకై మనువులను సృష్టించాడు. కాలాన్ని యుగాలుగా ఏర్పరిచాడు. కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలకు అధిపతులుగా మనువులను నియమించాడు. వారిలో కలియుగానికి చెందిన కలి కలహాశీలుడు, పిశాచమువలె నల్లని రూపుగలవాడు. పుణ్యకార్యాలు ఆచరించే వారంతా ఈతని శత్రువులే. భగవంతుని నామజపం, పుణ్యతీర్థ స్నానం, సత్సంగం, పుణ్యక్షేత్ర సందర్శనం ఆచరించే వారిని ఏదో విధంగా తప్పు దారి పట్టించి, వారిని భ్రష్టులను చేయాలన్నదే ఇతని నిర్విరామసంకల్పం. ఆ సంకల్పంతో బయలుదేరుతున్న కలిని బ్రహ్మదేవుడు పిలచి వ్యసనాలకు అరిషడ్వర్గాలకు, ధాంభికాలకు, అసత్య, అనాచారాలకు దాసులైన వారిని నీవు మరింత భ్రష్టులుగా, దుర్మార్గులుగా మార్చవచ్చు. కాని పురాణ పఠనం, శ్రవణం చేసే వారిని గాని, నిరంతరం గురుని ఆశ్రయించి సేవించేవారి దగ్గరకు గాని పోవద్దని, వారి గూర్చి ఆలోచించినా సరే పరాభవానికి గురై, సర్వబాధలు పడతావని హెచ్చరించాడు. అంత కలి, ఆగి, బ్రహ్మదేవునికి నమస్కరించి, తనకు అంతగా అడ్డంగా నిలుస్తున్న గురువంటే ఎవరని? అతని వృత్తాంతం తెలుపమని కోరాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు, కలితో నాయనా ! గురువు చాల గొప్పవాడు. 'గురు' శబ్దమే పరమ పవిత్రం. ఈనాడు లోకాలను శాసించే త్రిమూర్తులు కూడ ఒకప్పుడు ఏదో గురువు దగ్గర శిష్యులుగానున్నవారే. గురు శబ్ధములో 'గ'కారానికి గణపతి, 'ర'కారానికి అగ్ని, ఉకారానికి విష్ణువు అధిదేవతలు. అందువల్ల గురు శబ్దమే మంత్రంతో సమానం. ఇది చతుర్విధ పురుషార్థాలకు సాధనం. తల్లి, తండ్రి పరాత్పరుడూ గురువే. త్రిమూర్తులకు శిష్యునిపై కోపం వచ్చినా, ఆతడు గురువునాశ్రయిస్తే, అతనిని గురువు రక్షించగలడు. కాని గురువుకు కోపంవస్తే త్రిమూర్తులు గూడ రక్షించలేరు.

శాస్త్ర పరిజ్ఞానం, ధర్మాధర్మ వివేకం, భక్తివైరాగ్యాలు, సదాచారం, సమస్తం గురుసేవవల్లే లభిస్తుంది. పూర్వజన్మ సుకృతం వల్లే ఉత్తమ గురువు లభ్యమవుతాడు. గురువు బోధిస్తే తప్ప శాస్త్రపరిజ్ఞానం ఏర్పడదు. శాస్త్రజ్ఞానం ఉంటేగాని, ధర్మాధర్మ వివేకం అబ్బదు. అది అబ్బకపోతే తత్త్వం తెలియదు. తత్త్వం తెలియకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం కలుగకపోతే ముక్తి లభించదు. కావున ముక్తికి మూలం గురువే. పురాకృతపుణ్యం లేనివారికి గురువు లభించడు. గురువు లభించనివారు అదృష్టహీనులే. గురుశబ్దం ఎంతో దైవాంశ గలిగిన శక్తివంతమైన ఆయుధం. దీనిలో గకారం సర్వసిద్ధి ప్రదం, రకారం సర్వపాపనాశకరం, ఉకారం విష్ణుతత్వానికి వాచకం, ఎవరయితే 'ఓం గురవేనమః' అను షడక్షరమంత్రం భక్తి, శ్రద్ధలతో జపిస్తారో, వారికి గణపతి, అగ్ని విష్ణువులు ధర్మార్థకామ, మోక్షాలను కలుగజేస్తారు. మానవరూపంలో అవతరించిన, నారాయణుడు గూడ సద్గురువును ఆశ్రయించాడు. శ్రీరాముడు వశిష్ట, విశ్వామిత్రులను గురువులుగా సేవించాడు. శ్రీకృష్ణుడు సాందీపమహర్షికి శిష్యరికం చేసాడు. కావున గురుమహిమ వర్ణనాతీతం. గురుప్రసాదం సకలార్థసాధకం. సంసారసాగరాన్ని తరించడానికి, జననమరణాల చక్రం నుండి బయటపడడానికి ఏకైక మార్గమయిన

బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించేవాడు పరమగురువు. అతడే పరతత్వం. అతడే త్రిమూర్తి స్వరూపం. అతడే సకల దేవతా స్వరూపం. మానవరూపంలో ఉన్నాడని అనుమానించవలసిన అవసరం లేదు. బ్రహ్మజ్ఞానంతో శిష్యుని పరబ్రహ్మను చేసే పరబ్రహ్మమతడే. ఇహపరాలలో శ్రేయస్సుని కలిగించేవాడే గురువు. సద్గురువులను ఆశ్రయిస్తే పొందలేనిదేదీ ఉండదు. కనుక సద్గురువులను ఆశ్రయించడం ప్రథమకర్తవ్యం. ఆధ్యాత్మికత పొందాలంటే అంతరింద్రియ, బహిరింద్రియ నిగ్రహం ఉండాలి. వేదవేదాంగ పరిజ్ఞానం ఉండాలి. వీటి అన్నిటికీ మార్గదర్శకుడు సద్గురువే.

ఇలా, బ్రహ్మదేవుడు కలికి గురువు యొక్క విశిష్టతను తెలిపి, వారిని ఆశ్రయించిన వారిని కన్నెత్తయినా చూడవద్దని తెలిపెను. గురువు యొక్క మహోన్నత వ్యక్తిత్వాన్ని ఆకళింపుచేసుకున్న కలి, గురుని నీడలో ఉన్నవారి దరి జేరరాదని నిర్ణయించుకొని తన స్వధర్మము నిర్వర్తించుటకు భూలోకమును పయనమయ్యెను.

సభాసమ్మోహనా మంత్రములు, గారడీ విద్య, భూత వైద్యము, ఔషధ ప్రయోగము, కనికట్టు మొ॥ విద్యలెరిగినవారు దొంగ గురువులు. కిరాయి శిష్య గణము నేర్పరుచుకుని, క్షుద్రవిద్యలతో జనబాహుళ్యాన్ని వంచించి తద్వారా ధనము సంపాదించి, కోట్లకు పడగలెత్తు వారందరూ నకిలీ గురువులే. వారి దరిజేరరాదు. వారి గూర్చి వినరాదు. ఈవిధంగా మునులందరికీ గురువైభవాన్ని సూతుడు తెలియజేసాడు.

సద్గురువు లభించాలంటే గురువుకు సంబంధించిన సద్గ్రంథ పఠనమెంతో ఉపకరిస్తుంది. ఆ గ్రంథం పఠించి, వారిని తదేక దృష్టితో సేవిస్తూ, వారియందే ఏకాగ్రత కల్గి ఉంటే వారే స్వప్న దర్శనమిచ్చి మార్గదర్శనము చేస్తారు. వారందరూ దత్తాంశతో జన్మించిన దత్త గురువులు. ధ్యానిస్తే చాలు, వారే మన ముందుకు వస్తారు. ఎక్కడికీ వెళ్లి, ఎవ్వరినీ ఆశ్రయింప పనిలేదు.

గురుశిష్యుల బంధమెంతో పవిత్రమైనది. ఒకసారి పార్వతీదేవి పరమేశ్వరుని గురుశిష్యుల బంధం గూర్చి తెలుపమని అడుగగా, పరమేశ్వరుడు ఆమెకు గురువు భగవంతుని కంటే గొప్పవాడని, గురువైభవాన్ని కొనియాడుతూ ఎంతో వివరంగా తెలియజేస్తాడు. దీనినే గురుగీత అంటారు. అలాగే శ్రీకృష్ణుడు గూడ అర్జునునికి ఒక గురువు రూపంలో భగవద్గీత బోధించినపుడు గురువును ఎంతగానో శ్లాఘిస్తాడు. గురుగీతలో గురుశిష్యుల లక్షణములు, గురుకృప, మహిమ, గురుభక్తి ప్రభావము గూర్చి విపులముగా పరమేశ్వరునిచే వర్ణింపబడినది.

ఇక శిష్యుని విషయానికొస్తే, మంచిమాటలతో గురువుచేత శాసింపబడేవాడే శిష్యుడు. నీడలాగ గురువు వెంటవుండి, విద్యనభ్యసిస్తూ, సేవిస్తూ, జీవించేవాడు. శిష్యునికి ఏది హితమని భావిస్తాడో దాన్నే అతనికి గురువు బోధిస్తాడు. మారుమాట్లాడకుండా, శిష్యుడు దానిని శిరసావహించాలి. హితమంటే, ఇహలోకంలో సుఖాన్ని, పరలోకంలో ముక్తిని ప్రసాదించేది. ఒక్కొక్కప్పుడు గురువు చెప్పింది ఇహలోకంలో కష్టంగావచ్చు. అయినా శిష్యుడు అశక్తతత వ్యక్తం చేయకూడదు. వేద, శాస్త్ర పురాణాలు ఏది, ఎవరికి హితమని నిర్ణయిస్తాయో అదే గురువు శిష్యులకు బోధిస్తాడు. ఆచరణకు అనుగుణం అయిన సాధన సంపత్తినే ఎంపికచేసి బోధిస్తాడు. నిత్యానిత్య, వస్తు వివేకం కల్గిస్తాడు. భోగాలు క్షణికమని గ్రహించి, వైరాగ్యంతో గురువు పాదాలను ఆశ్రయించడమే శిష్యుని కర్తవ్యం. తత్త్వజ్ఞానం ఉపదేశం పొందడానికి అర్హుడైనవాడే భవిష్యత్తులో గురువవుతాడు. ఉత్తమ శిష్యులను తయారుచేసి, తద్వారా తన గురువు ఋణం తీర్చుకుంటాడు. ఇలా ఈ వ్యవస్థ ఒకరి ద్వారా మరియొకరికి ఉపకరిస్తూ, నిర్విరామంగా పృథ్వి ఉన్నంతవరకూ కొనసాగుతూనే ఉంటుంది. శిష్యుడు మనసా, వాచా, కర్మణా, గురువే తన ప్రాణంకన్నా మిన్న అని భావిస్తూ సేవించాలి.

శ్రీరామచంద్రుడు తన గురువైన విశ్వామిత్రునికిచ్చిన మాటను నిలుపుకునేందుకు తన భక్తుడైన యయాతిని సైతం సంహరించుటకు సిద్ధమై, శిష్యుడైన హనుమంతుని గూడ లెక్కచేయకుండా అతనితో యుద్ధానికి సిద్ధమైనాడు. ఒక మంచి శిష్యునికి రాముడు ఆదర్శం. మహర్షులందరూ కూడ గురుస్వరూపులే ఎందుకంటే వారి ద్వారానే భగవంతుని శక్తి, స్వరూపాలు మానవాళికి ప్రస్ఫుటమయ్యాయి. అటువంటి గురువులు శిష్యులను విడువక, వారికి ఆపదలు, ఇబ్బందికర పరిణామాలు సంభవిస్తే సాక్షాత్కరించి, వారిని కష్టాల నుండి గట్టెక్కిస్తారు. శ్రీరామచంద్రుడు రావణసంహారం సమయంలో రావణుని సంహరిస్తున్నా, అతని తలలను తెగనరుకుతున్నా, అతడు అతని తపఃశ్శక్తితో తిరిగి బ్రతుకుతూ ఉంటాడు. అసలు రావణవధ జరుగుతుందా అని రాముడు తడబడుతుండగా, ఒక గురువు రూపంలో అగస్త్యమహాముని సాక్షాత్కరించి,

రామునికి, రావణుని అంతానికి సూర్యుని ప్రార్ధించమని, 'ఆదిత్య హృదయం' అనే సూర్యస్తోత్రాన్ని బోధిస్తాడు. అపుడు సూర్యుని సహాయంతో రావణసంహారం సుగమమవుతుంది. దీనినిబట్టి గురువుకు శిష్యులపట్ల ఎంత బాధ్యత, వాత్సల్యం, అనురాగం ఉంటుందో అర్థం చేసుకొనవచ్చు. గురుశిష్యుల మధ్య వయస్సుతో సంబంధముండదు. యువకుడైన దక్షిణామూర్తి, వృద్ధులైన సనకాది మహర్షులను శిష్యులుగా గైకొని వారికి పరబ్రహ్మతత్త్వము నుపదేశించెను. కాబట్టి గురువు అన్నింటికీ అతీతుడు.

గురువులు ఎన్నో విధాలుగా, చాల సంవత్సరాలు శిష్యులను తీర్చిదిద్దుతారు. విద్యాభ్యాసం పూర్తి అయ్యే సమయంలో గురువులు వారి శిష్యుల యొక్క శక్తి యుక్తులను పరీక్షిస్తారు. కృతకృత్యులైన వార్కి ఎన్నో వరాలనిస్తారు.

పూర్వము వేదధర్ముడనే మహర్షి ఉండేవారు. వారి శిష్యులలో దీపకుడనే శిష్యుడు అగ్రగణ్యుడు. దీపకుడు బుద్ధిలోను, గుణంలోనూ, వినయవిధేయతలలోను, నిష్టలలోను గూడ చెప్పుకోదగినవాడు. వేదవేదాంగాలు అభ్యసించి, గురుసేవే పరమావధిగా జీవించేవాడు. ఒకనాడు వేదధర్ముడు, దీపకుని, శక్తి, యుక్తులతోబాటు, గురుసేవాతత్పరత, దీక్షలను పరిశీలింపగోరి, తన శిష్యుడైన దీపకునితో నాయనా! పుణ్యఫలాల మాదిరిగానే పాపఫలాలను దేవతలు, మానవులు అందరూ కూడ అనుభవించవలసినదే. నేను నా పాపఫలాలు కాశీలో అనుభవించాలని నిర్ణయించుకున్నాను. నేను అనుభవించగోరిన పాపఫలాలు కుంటి, గ్రుడ్డి, కుష్ఠు వ్యాధుల రూపంలో నన్ను ఇరవై సంవత్సరాలు బాధిస్తాయి. అందువల్ల నన్ను నీవు కాశీలో దీర్ఘకాలం శ్రద్ధ, ఓర్పు, అంకితభావాలతో, అన్యచింతనలకు తావివ్వకుండా సేవించుటకు సిద్ధమేనా ? అని అడిగాడు. అంత దీపకుడు ఆనందముతో గురుసేవ చేయుట కంటే తనకు మరొక భాగ్యములేదని, ఎంత కాలమైనా, విసుగు విరామం లేకుండా దీక్షగా సేవిస్తానని, ఆ అవకాశం తనకీయమని కోరాడు. అవసరమని మీరు తలిస్తే, మీ బదులుగా ఆ రోగాలు నేనే అనుభవించి, మిమ్ములను పాపకర్మల నుండి విముక్తుడ్ని చేస్తానన్నాడు. దానికి గురువు ఎవరి పాపకర్మములు, వారే అనుభవించాలని తెల్పి, శిష్యునితో కాశీ పయనమ్యాడు. కాశీ చేరుకుని మణికర్ణికాఘట్టంలో స్నానంచేసి, డుండీ గణపతిని, కాలభైరవుడ్నీ అర్చించారు. విశ్వేశ్వరుడు, విశాలాక్షి, అన్నపూర్ణలను దర్శించాడు. కాశీకి ఉత్తర దిక్కుగానున్న ఒక కంబలాశ్వతరు సన్నిధిలో చిన్న కుటీరం ఏర్పాటు చేసుకున్నారు. తెల్లవారేసరికి వేదధర్ముడు కుష్ఠు, కుంటి, గుడ్డి తనంతో విలవిలలాడిపోవడం ప్రారంభమయ్యింది. గురువు రోగబాధతో వికృతుడైనాడు అయినా దీపకుడు ఎంతో ఓర్పుగా గురువును సేవిస్తూ, భిక్షాన్నంతో వారి పొట్టనింపి, మిగిలినది తాను తింటూ కాలక్షేపం చేస్తున్నాడు. అయితే గురువు తన రోగ బాధవలన శిష్యుని సూటీ, పోటీ మాటలతో బాధిస్తూ ఉండేవాడు. తిట్టి పోసేవాడు. అయినా దీపకుడు ఓర్పుతో, తిట్లను దీవెనలవలే తలచి వారిని సేవించేవాడు. ఇలా సంవత్సరాలు గడుస్తున్నాయి. పరీక్షలన్నీ తట్టుకుంటూ శిష్యుడు గురుశుశ్రూష చేస్తూనే ఉండేవాడు.

ఒకనాడు శిష్యుడు గంగా స్నానమాచరించి, ఆశ్రమానికి వస్తుండగా, కాశీవిశ్వేశ్వరుడు ప్రత్యక్షమై, అతని గురుసేవకు మెచ్చానని, ఏదైనా వరం కోరుకొమ్మని అడిగాడు. గురువుని అడిగివస్తానని ఆశ్రమంలోనికి వెళ్లి, గురువుకు ఈ విషయం తెలిపాడు. గురువు అనాశక్తి చూపగా, బయటకువచ్చి, విశ్వేశ్వరునితో, గురువు అనుమతి లేదని, తనకే వరము వద్దని తెలిపి, విశ్వేశ్వరునికి నమస్కరించి, ఆశ్రమంలోకి వెనుతిరిగాడు. విశ్వేశ్వరుడు సంతసించి ఈ విషయం శ్రీమన్నారాయణునికి తెలుపగా, నారాయణుడు ఆ శిష్యుని చూడాలని ఆతృతతో, దీపకునికి సాక్షాత్కరించి, ఇష్టం వచ్చిన వరం కోరుకొమ్మని అడిగాడు. అంత దీపకుడు నారాయణునితో తనలో గురుభక్తి స్థిరమగునట్లు వరము ప్రసాదింపమని కోరాడు.

అతని గురుభక్తికి పరమానంద భరితుడైన శ్రీమన్నారాయణుడు దీపకునితో నాయనా! గురుస్వరూపమే బ్రహ్మపదాన్ని అందిస్తుంది. ఉదరపోషణకు అవసరమయిన లౌకికవిద్యలు నేర్పేవాడు సాధారణగురువు. ధర్మాధర్మ వివేకాన్ని కలిగించేవాడు అతనికంటే ఘనుడు. వేదశాస్త్రాలను బోధించేవాడు అతని కంటే ఘనుడు. వేదార్థ బోధికుడు అధికుడు. బ్రహ్మవిదోయపదేష్ఠ అందరికన్నా గొప్పవాడు. అతడే సిద్ధగురువు. అతడు మనకు అభిన్నుడే. అరిషడ్వర్గాలలో చిక్కుకుని అల్లకల్లోలమవుతున్న శిష్యుని మనస్సుకు పురాణేతి శాస్త్రాల ప్రభోధంతో ఊరడింపు కలిగించి, ధర్మపథంలో నడిపించే గురువే ప్రత్యక్ష దైవం. వారిని మనోవాక్కాయ కర్మలతో సేవించుటకు మించిన పురుషార్థం మరొకటి లేదు. అదియే భుక్తి, ముక్తి ప్రదం. ఈ తత్వం నీవు గ్రహించి గురుసేవలో ఉన్నావు. అందువల్ల నీవు ధన్యుడవు. లోకాలకు ఆదర్శ ప్రాయుడవు.

సద్గురువులను సేవించే సచ్ఛిష్యులంటే మా త్రిమూర్తులు ముగ్గురికీ ఎంతో ఇష్టం. నీకు సర్వశుభాలు కల్గుతాయి, అని ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు.

దీపకుడు ఆశ్రమంలోనికి ప్రవేశించగానే రోగాలన్నీపోయి సంపూర్ణ ఆరోగ్యవంతుడైన గురువును చూచి, ఆశ్చర్యంతో వారి కాళ్లకు ప్రణామం చేసాడు. అంత గురువు శిష్యునితో నాయనా ! నీ గురుభక్తి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అష్టసిద్ధులు, నవనిధులు నీకు సంప్రాప్తమవుతాయి. ఇక నుంచి గురుశుశ్రూష విషయంలో నిన్నే ముందు లోకులందరూ స్మరిస్తారు అంటూ శిష్యునికి కాశీక్షేత్ర మహిమను వివరించాడు. కాశీకి వచ్చిన ఏ ప్రాణికోటినయినా తరింపజేస్తాడు విశ్వనాధుడు. ఈ భూగోళంలో కాశీని మించిన మరొక క్షేత్రం లేదు. విశ్వనాధుడ్ని మించిన దైవం లేదు. ముక్తిని కోరుకునే వారందరికీ కాశీవాసము కొంగు బంగారం. మహాప్రళయములో కూడ నశింపక నిలిచే ఏకైక అద్భుత క్షేత్రం కాశి. యమనియమాలతో, అంతరేంద్రియ, బహిరింద్రియాలను బంధించి విశ్వనాధుని పాదాలను ఆశ్రయించిన వారు జీవన్ముక్తులౌతారు. కాశీలో నివసిస్తూ గంగానది, కాలభైరవుడు, డుండీ విఘ్నేశ్వరుడు, దండపాణి, విశాలాక్షి, విశ్వేశ్వరుడు అను ఆరుగురిని సేవించేవారిని షడంగయోగులంటారు. ఎక్కడెక్కడో నివసిస్తూ యమ-నియమ-ప్రాణాయామ-ఆసన-ప్రత్యాహార-ధ్యానధారణ-సమాధులను అవలంబించే, అష్టాంగయోగులు కన్నా వీరు పుణ్యాత్ములు కాబట్టి నీవు కాశీలో స్థిర నివాసుడవై ఉండమని వేదధర్ముడు తన శిష్యుడైన దీపకునికి తెలిపెను. ఇంకా, దీపకునితో అతని గురుసేవను మెచ్చానని, ఏదైనా వరం కోరుకొమ్మని గురువు అడిగాడు.

అంత దీపకుడు చేతులు జోడించి, ఆనందంతో కన్నీరుకారుస్తూ మహాతపస్వి, బ్రహ్మతేజస్వీ అయిన మీ అనుగ్రహానికి పాత్రుడనయిన నాకు అన్ని లభించినట్లే, నాకు అణిమాది సిద్ధులు-చతుర్విధ పురుషార్థాలు మీ సేవతోనే లభించాయి. దత్తాత్రేయస్వామి చరిత్ర మీ ముఖస్థంగా వినాలని కోరిక చాలా కాలంగా నా మనసునందున్నది. అందువల్ల ఆయన చరిత్ర నాకు తెలపవలసినదిగా కోరుచున్నానని, గురువు గారి పాదాలకు సాష్టాంగప్రణామం చేసాడు. దీనిని బట్టి గురువైభవమెంత గొప్పదో అర్ధమవుతుంది. శిష్యుని కోరికమేరకు దత్తాత్రేయుని జీవిత విశేషాలను వేదధర్ముడు అతని శిష్యునికి వివరిస్తాడు. దత్తాత్రేయస్వామిపై ఒక అష్టోత్తర శతనామావళిని కూర్చి శిష్యునికి బోధిస్తాడు. తద్వారా ఆ స్తోత్రం బహుళ ప్రచారములోనికి వచ్చింది.

ఇక, ఎంతో వాత్సల్యంతో పెనవేసుకుపోయిన గురుశిష్యుల అనుబంధం ఎంతో అద్వితీయమయినది. వారిరువురి మధ్య ఎడబాటు గూడ ఎంతో బాధాకరమై యిరువురిని గూడ వికలిత మనస్కులను చేస్తుంది.

శిరిడీ సాయిబాబాకు అత్యంత సన్నిహితుడైన మేఘుడనే శిష్యుడుండేవాడు. అతడు బాబాకు విశేషమైన సేవచేస్తూ, ద్వారకామయిలో ప్రతీరోజు అన్ని హారతులు బాబాకు స్వయంగా తన చేతులతో యిచ్చేవాడు. ఆ కారణంగా వారి మధ్య అనుబంధం ఎంతగానో పెనవేసుకుంది. విధి బలీయమై, మేఘుడు అకాలమరణం చెందెను. సర్వజ్ఞుడైన సాయి, జననమరణములను గూర్చి ఔపోసనపట్టిన మహానుభావుడైనప్పటికీ, అతని మరణంపట్ల దుఃఖించి కన్నీరు కార్చారు. అతని శవముతో గూడ ఊరేగింపులో నడుచుకుంటూ స్మశానవాటిక వరకూ వెళ్లి, ఆయన స్వంత ఖర్చులతో అతనికి అంత్యక్రియలు జరిపించారు. ఎవరయినా మేఘుడు గూర్చి విచారిస్తే, అతడు మహాభక్తుడని, ఎడబాటును భరించలేక నిట్టూర్చేవారు. ఇదే గురుశిష్యుల మధ్య అనురాగం, వాత్సల్యం, విడదీయరాని అద్వితీయ అనుబంధం. ఆత్మసాక్షాత్కారం పొందిన యోగి అయిన సద్గురువుకు పూర్వ జన్మములోని కర్మఫలములేమియూ మిగలవు. యోగికి ఆత్మ సాక్షాత్కారమైనపుడు శృతి కర్మలు, వాటి ప్రతిఫలములు శాశ్వతమైన పరమాత్మలో లీనమవుతాయి. దానితో యోగి వ్యక్తిత్వ రహితుడగును.

శుద్ధ బ్రహ్మజ్ఞానియైయుండియు, సత్కర్మల నాచరించుచు కర్మయోగిగా నుండే వాడే సద్గురువు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచమున ఎన్ని సద్గుణములు గలవో అవి అన్నియు సద్గురు లక్షణములే. సద్గురువును ఎవరయినా అవమానిస్తే పరమాత్ముడు గూడ క్షమించడు. దాసబోధ అను గ్రంథము వ్రాసిన సమర్ధరామదాసస్వామి తన దేశాటనలో భాగముగా కాశీకిపోయి, గర్భాలయమున శ్రీ విశ్వేశ్వరుని దగ్గరకు పోవుచుండగా అచ్చట విశ్వేశ్వరునికి రుద్రాభిషేకము జరుపుతున్న అర్చకులు, స్వామిని నిర్లక్ష్యముగా చూచి, విశ్వేశ్వరుని దర్శింపనీయక వెళ్లగొట్టిరి. కొంతసేపటికి ఆ అర్చకులకు విశ్వేశ్వరలింగము గోచరించలేదు. కేవలం ఆ ప్రదేశమంతా ఖాళీగా కనిపించగా, వారు భయపడి, అపచారము

జరిగినది తలచి, స్వామి సమర్థను వాకిలి బయట పట్టుకుని, వారికి ప్రణామములు చేసి క్షమాపణలు కోరి, వారిని లోనికి ఆహ్వానించి, అభిషేకములో పాల్గొనగా, తిరిగి అచ్చట వారందరికీ విశ్వేశ్వర లింగము గోచరమయ్యెను. సద్గురువుపట్ల అవమానము భగవంతుడు కూడ సహించడని ఈ సంఘటన ఋజువుచేయును. అందువలననే సద్గురువే దైవ స్వరూపమని శాస్త్రములు ఎన్నో విధముల రుజువుపరచినవి. యోగ్యుడైన గురువు చెప్పిన దారిలో సాగిన భాగ్యశాలియైన సాధకుని మానసములో సందేహములుండవు. లేకున్న స్వప్రయత్నముచే సందేహములు కొన్ని మాత్రమే తీరును. అసలు జ్ఞానులైన సద్గురువులు అవతరించకపోతే వేదాలపై వివరణలు, పురాణాలపై భాష్యాలు అరణ్యరోదనగా మిగిలియుండేవి. అందువల్ల జ్ఞానులైన సద్గురువులు వేదజీవనాదులు. దేవుడు గొప్పా? జ్ఞానిగొప్పా? అని అడిగితే మహాత్ములందరు జ్ఞానినే ఎంపిక చేసుకున్నారు. ఒకసారి విశ్వామిత్రుడు తనను బ్రహ్మజ్ఞానిగా బ్రహ్మదేవుని కంటే అతని కుమారుడు, జ్ఞానియయిన వశిష్ఠుడు ఒప్పుకుంటేనే తాను అంగీకరిస్తానని తెలిపాడు. జ్ఞానిగా మారాలంటే ఒకే ఒక మార్గమున్నది అది జ్ఞానులు అనుసరించిన మార్గాన్ని అనుసరించడం. జ్ఞానమన్నది సిద్ధాంతం గాదు అది ఒక అనుభూతి అటువంటి అనుభూతిని మరొక అనుభూతి ద్వారానే గ్రహించవచ్చు అందుకే దీనికి సద్గురువులు సర్వశ్రేష్ఠులు.

ఒక పర్యాయము ఒకానొక బీద బ్రాహ్మణుడు తన దారిద్ర్యము తీర్చుకొనుటకై, ధనమును కోరి ఒక యక్షుని గూర్చి తపస్సు చేసెను. యక్షుడు ప్రత్యక్షమై, తనకు ధనప్రాప్తి కలుగజేయు శక్తిలేదని, బ్రాహ్మణులు జ్ఞానమర్థించాలిగాని, ధనముగాదని, తన అసమర్థతను కప్పిపుచ్చుకొను ప్రయత్నము చేసెను. అంత బ్రాహ్మణుడు జ్ఞానమును ఆర్జించుటకు తగిన గురువు దొరకని కారణంగా ధనము అర్థిస్తున్నానని యక్షునికి తెలిపెను. అప్పుడు యక్షుడు బ్రాహ్మణునికి జ్ఞానమార్జించు ప్రదేశము చూపించెదనని, ఆ బ్రాహ్మణుని కొంతమంది మహాత్ములైన ఋషిపుంగవుల మధ్య విడచివచ్చెను. అనతి కాలంలోనే ఆ యోగుల సహచర్యంతో, ఆ బ్రాహ్మణుడు జ్ఞానమార్జించి, మహాయోగిగా మారి, ఒక ఏకాంత ప్రదేశమునకు చేరి తపమాచరించుకొనుచుండెను. ఆ దారినపోతున్న యక్షుడు బ్రాహ్మణుని చూచి, జాలిపడి, బ్రాహ్మణుని కడకేగి, అతడు ధనంకోసమే తిరిగి తపమాచరించుచున్నాడని తలచి, ఆ బ్రాహ్మణునితో కుబేరునితో చెప్పి ధనమిప్పించెదనని, తపమాపిరమ్మని తెలుపగా, బ్రాహ్మణుడు నవ్వి, తన దగ్గర జ్ఞానమనే ఎన్నోరెట్ల ధనమున్నదని, దానికి ఏదీసాటికాదని, అతనివెంటపోవుటకు నిరాకరించెను. ఈ సంఘటన జ్ఞానము యొక్క ఔన్నత్యము, ఉన్నత స్థితిని తెలియజేయును.

దైవం తన దైవస్థితి నుండి శిష్టరక్షణకై అవతారం దాలుస్తాడు. భగవంతుని యొక్క అనుభూతిని పొందిననూ మానవుడు సద్గురువుగా అవతరిస్తాడు. భూమిపై అవతారం దాల్చిన భగవంతునికి సృష్టిలోని సమస్తానుభవం కలుగుతుంది. సద్గురువు అనుభవంలో సృష్టిలేదు. అహంబ్రహ్మస్మి నేనే భగవంతుడను. సర్వమునేనే అనే అనుభవం తప్ప వారికి మాయాసంబంధ జ్ఞానముండదు. భక్తులకోసం, తమ విధి నిర్వహణకోసం మాయాసంబంధిత జ్ఞానం ఉన్నట్లుగా గోచరిస్తారు. కాని అది నిజంగాదు. దీనివల్ల సద్గురుస్థితికి, అవతారం ధరించిన దైవస్థితికి యిసుమంతైనా బేధం లేదని తెలుస్తుంది. అందుకే గురువే దైవం.

తదనుగుణంగానే సద్గురువులందరూ తమనే ధ్యానించమని, తమ చరిత్రలు పఠనం చేసి, సన్మార్గంలో నడచి, తరించమని బోధిస్తారు. ఎందుకంటే సర్వకాలసర్వావస్థల యందు సర్వస్వం సద్గురువే. కాబట్టి దత్తాత్రేయుడు, శ్రీపాదవల్లభులతోబాటు దత్తగురువులందరూ బోధగురువులే. వారిని స్మరించి, వారి జీవిత విశేషాలను వారివారి సచ్చరిత్రల ద్వారా తెలుసుకొని తరించే భక్తులు ధన్యులు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-2

# ఆధ్యాత్మిక అన్వేషణ

గురువుయొక్క వైభవం తెలుసుకున్న తరువాత, ఆ గురువెల లభిస్తాడనే ఆతృత మొదలవుతుంది. గురువునుంచి ఏమి గ్రహించాలి అన్నది కూడ తెల్సుకోవాలని ఉంటుంది. అయితే సద్గురువు లభించే వరకూ ముముక్షువు 'స్వాధ్యాయము' అంటే సద్గ్రంథములను పఠించాలని శాస్త్రం పేర్కొంది. 'సద్గ్రంథమే' తొలి గురువు. దానిని పఠించే ముందు పాఠకునికి ఆత్మసంస్కారం కావాలి. లేనియెడల సద్గ్రంథం పఠనం వలన ఫలితం కలుగదు. సద్గ్రంథాలను కాలక్షేపగ్రంథాలుగా పరిగణించకూడదు. ఆయా గ్రంథాలలో అంతర్లీనంగా దైవశక్తి ఉంటుంది. అందుకే మననెలా సంస్కరించుకోవాలో అన్వేషించుకోవాలి. ఆధ్యాత్మిక విధానాల ద్వారానే మానవుడు తనను తాను సంస్కరించుకోగలడు. అందువలన సువిశాలమైన ఆధ్యాత్మిక ప్రపంచాన్ని ముందుగా అర్థం చేసుకోవాలి. ఆధ్యాత్మికతను చేరే మార్గాలు అన్నింటికంటే భిన్నంగా ఉంటాయి. ఈ అన్వేషణ ప్రాథమికంగా ఎన్నో విషయాలతో ముడిపడి ఉంటుంది. ముందుగా ఆ విషయాలను ఆకళింపు చేసుకోవడంతో అన్వేషణ అనే సోపానంలో ముందుకు సాగుతున్నట్లే.

ఈ సృష్టికి మూలం భగవంతుడని, వారి ప్రమేయంతోనే ఈ జగత్తునందు సర్వకార్యములు అనుక్షణం జరుగుతున్నాయనే భావన ముందుగా సాధకుని మనోఫలకంపై ఎంతో విశ్వాసంతో ధృఢంగా నాటుకోవాలి. ఆ భగవంతుని గూర్చి తెలుసుకోవాలనే ఆతృత, ఆ సాధకునిలో మొదలగుటయే ఆధ్యాత్మిక అన్వేషణకు నాందిగా గుర్తించాలి.

అసలు ఆధ్యాత్మికత సంతరించుకున్న సద్గ్రంథం పఠించాలంటే ముందుగా ఆధ్యాత్మికత, దైవచింతన, భగవంతుని యందు పరిపూర్ణ విశ్వాసం కల్గియుండాలి. భగవంతుని స్వరూపం, వారి లీలలు కేవలం అనుభూతితో అనుభవించాలే గాని, కళ్లకు ఎదురుగా కన్పించవు. దృష్టికి గోచరించని కారణంగా నాస్తికవాదము తగదు. కలి ప్రభావముతో మొదలయ్యే నాస్తికవాదము మానవుని పతనానికి దారితీస్తుంది. శాస్త్రీయ దృక్పథం విచక్షణా జ్ఞానమును వృద్ధిచేసుకొనుటకు గాని, నాస్తికవాదము పెంపొందించుకొనుటకు కాదని గ్రహించాలి. అందువల్ల ఎల్లప్పుడూ ఆస్థికులతోనే స్నేహ, బాంధవ్యాలను ఏర్పాటు చేసుకోవాలి. గురువును ఆశ్రయించేది ముఖ్యంగా ఆత్మజ్ఞానం పొందుట కొరకే. ఆత్మజ్ఞానము స్వయంసిద్ధం. స్వప్రయత్నమే దానికి మూలాధారం. ఒక్క భారతదేశము తప్ప, ఇతర దేశములు ఆత్మజ్ఞానం సంపాదించుటకు పనికిరావు. కర్మభూమియగు భారతావని ఆధ్యాత్మికతకు అత్యంత శ్రేష్ఠమైనది. మనదేశములో ఏ ఇంటికి వెళ్లినా భగవంతునిదో లేక సద్గురువుదో చిత్రపఠం దర్శనమిస్తుంది గాని, టాటా, బిర్లా లేదా ఎవరైనా శాస్త్రవేత్తల చిత్రపటాలు కానరావు. కనిపించినా చాల అరుదు. అదే మన దేశ ఔన్నత్యం. ఆధ్యాత్మికతత్త్వం. గొప్పతనం. అందువల్ల భారతావనిలో జన్మించిన వారందరూ వారి పూర్వ జన్మ సుకర్మల వల్ల అవతరించినవారే. ఇక్కడ పుట్టిన వారెవరయినా, పాశ్చాత్య పోకడల పట్ల, నాస్తికవాదము పట్ల ఆకర్షితులుకాకుండా, ఈ పుణ్యభూమికి పట్టుకొమ్మ అయిన ఆధ్యాత్మికతవైపు మనస్సు లగ్నం చేసి, దానిని సాధించేందుకు అన్వేషణ సాగించే ప్రయత్నం చేసుకుంటూ తమ తమ జన్మలు సార్థకం చేసుకోవాలి.

భగవంతుని అవతారాలన్నింటిని నిశితంగా పరిశీలిస్తే దైవత్వం మాత్రమే దర్శనమిస్తుంది. కాని దత్తాత్రేయునిలో గురులక్షణాలతోబాటు, దైవలక్షణాలు కూడా ఉంటాయి. వారే ఆధ్యాత్మికతకు పునాది. అందుకే వారిని గురుబ్రహ్మ, గురుర్విష్ణు, గురుదేవో మహేశ్వరాః అంటూ స్తుతిస్తారు. ఆధ్యాత్మికతకు బోధగురువైన దత్తుడే ఆధారం. మూలం కూడా.

అసలు ఆధ్యాత్మికతవైపు మళ్లాలంటే గురు శుశ్రూష అవసరం. ఇది సాధించాలంటే ఆధ్యాత్మిక చింతన అవసరం. ఆధ్యాత్మిక చింతన దాని అన్వేషణపై లగ్నమవుతుంది. ఏదైనా ఆధ్యాత్మిక విషయం సరిగ్గా బోధపడితే జ్ఞానోదయమయినట్లుగా గుర్తించాలి. అది అర్థం కాకుండా ఉన్నంతకాలం, ఆసక్తి, తెలుసుకోవాలన్న ఆరాటం ఉంటుంది.

దానినే జిజ్ఞాస అంటారు. అది ప్రాథమిక దశ. తెల్సుకోవడానికి చేసే ప్రయత్నమే సాధన. ఆ విధంగా అర్థమైనది తనకుగాదని, తన ఆత్మకేనని, సర్వం ఆత్మమయమని గ్రహించడం ఆత్మజ్ఞానం. ఆత్మ తనది గాదు. తాను ఆత్మగాదు. సర్వం పరబ్రహ్మ సంకల్పమని, సర్వం బ్రహ్మమయమని విశ్లేషించుటే బ్రహ్మజ్ఞానం. ఏది సాధించాలన్నా, ఆత్మనే ఆధారం చేసుకుంటూ ముందుకు సాగాలి. బ్రహ్మసూత్రాలలో దీనినే బ్రహ్మజ్ఞానం, బ్రహ్మవిద్య అని అంటారు. ఉపనిషత్తులలో దానినే ఆత్మదర్శనం, ఆత్మజ్ఞానం అన్నారు. జ్ఞానజ్యోతి తనంతతానుగా వెలుగుతుంది. వెలుగుల్ని ప్రసరిస్తుంది. కనిపించదు. అంతులేనిది. శక్తిగలవారే దానిని అందుకుంటారు. అటువంటి శక్తిని అందుకున్న దత్తుడు బోధగురువై ఎంతోమందికి జ్ఞానోపదేశం చేశాడు. శ్రీపాద శ్రీవల్లభుల అవతారంలో గూడ దత్తుడు అదే వాణిని, బాణిని అనుసరించాడు. ఆధ్యాత్మిక అనుభవాలకు హద్దులుండవు. గమ్యంకూడ ఉండదు. ఆరంభమే తప్ప అంతంలేనిది ఆధ్యాత్మిక ప్రపంచం. ఆహారం తీసుకున్నప్పుడు జీవుడు ఎంతగా ఆనందిస్తూ, ఆస్వాదిస్తాడో, అదేవిధంగా భగవంతుని స్మరించే సమయంలో అంతే అనుభూతిని పొందాలి. అదే అనన్య చింతనాభక్తి. మనయిద్దరి మధ్య బేధమే లేదనట్లుగా ఏకాగ్రతను నిలపాలి. ఇది ఒక సద్గురువు ద్వారానే లభ్యమవుతుంది. అందుకే సద్గురువుల చరిత్ర పారాయణ, అటువంటి అనుభూతిని కల్గించి, ఆధ్యాత్మికతవైపు మనసుసను మరలించి దాని అన్వేషణకు మార్గదర్శకమవుతుంది.

మనం ఎంత మంచిగా ప్రవర్తిస్తే, ఆధ్యాత్మికంగా అంత వేగంగా అభివృద్ధి చెందవచ్చు. ఆత్మవైపు పురోగమించవచ్చు. అదే ఆత్మ నా పథం – ఆలోచనలు, అలవాట్లు మంచిగా ఉండాలి. మనస్సును అదుపుచేస్తూ, మంచి పనులు చేస్తూ ముందుకు పోవాలి. అప్పుడు మంచి ప్రవర్తనా ఫలితం అనుభవానికి వస్తుంది. వ్యక్తిత్వవికాసానికి దారితీసే 'నేను' అన్న పదం అహంకారానికి హేతువు. ఇది లేకపోతే జీవన కాంతి లేదు. అయితే ఆ కాంతి అహంకారాన్ని ప్రతిబింబించగూడదు. దాని నుండి బయట పడితేగాని, దైవత్వం గోచరించదు. ఆధ్యాత్మిక అన్వేషణలో పురోగమనానికి అహంకారం అడ్డుకట్టగా నిలుస్తుంది. సర్వదేవతా స్వరూపమైన గోవు, విషాహారం తింటే మరణిస్తుంది. అదేవిధంగా దుష్ప్రవర్తన వల్ల ఆధ్యాత్మిక చింతన అంతమై దాని అన్వేషణ మొక్కుబడిగా, ప్రచార సాధనంగా మారిపోయి, దాని గూర్చి ఆశించిన అసలు ప్రయోజనం శూన్యమైపోతుంది.

మన పూజలు, కానుకలు, నివేదనలు భగవంతుని ఆకట్టుకోవు. మొదట ఆయన ఉనికిని, మనం మనస్ఫూర్తిగా నమ్మాలి. ఆయన గుణగణాలు, శక్తిసామర్థ్యాలు, దివ్యత్వం వంటి విశిష్టతలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. అటుపై ఆయన దర్శనం కోసం ఆర్తితో తపించాలి. ఆయన ఇష్టపడే లక్షణాలను మనం పెంపొందించుకోవాలి. సర్వప్రాణులను ఆత్మస్వరూపులుగా చూడడానికి మనం అలవాటు పడాలి. అప్పుడు మనలోని కల్మష భావాలన్నీ కరిగిపోయి స్వచ్ఛత ఏర్పడుతుంది. అటుపైనే ఆధిక్యత, న్యూనతా భావాలకు మనం అతీతంగా ఉండగలుగుతాం. మొట్టమొదటి సారిగా నిర్మల ప్రేమ మన అనుభవంలోనికి వస్తుంది. ఎవర్నీ ద్వేషించాలని ఉండదు. అందర్నీ ప్రేమించగలుగుతాం. ఇవన్నీ ఆధ్యాత్మికతను మనలో పెంపొందించి, దైవానికి దగ్గరగా చేరుస్తాయి. బట్టను ఉతికినకొద్దీ దానిలోని మురికి, మాలిన్యం పోయి శుభ్రంగా మారి తెల్లగా మెరుస్తుంది. అలాగే మనలోని మాలిన్యాలనే దుర్లక్షణాలను వదిలించుకుంటున్న కొద్దీ మనసు ఉత్తేజితమవుతుంది. ఆత్మ ప్రబోధితమవుతుంది. మనలో ఆధ్యాత్మిక వికాసం ఆరంభమవుతుంది. ఆధ్యాత్మిక వ్యక్తిత్వం నిర్మాణమవుతుంది. అప్పుడు మన మాటల్లో, పనుల్లో మార్పు కలిగి, విభిన్నమనస్తత్వం కల్గియుంటాము. అందరిలాగా ప్రవర్తించడం – సిరిసంపదలను అనుభవిస్తూ, భక్తునిగా రాణించగలవాళ్లు చాలా అరుదుగా కనిపిస్తారు. సుఖభోగాలకు విరక్తులైన వారే చాలామంది భగవంతునిపట్ల ఎంతో భక్తి కల్గి ఉంటారు. భక్తుడు అల్పసంతోషిగా, తృప్తిగా జీవిస్తాడు. తనకు కలిగే, ఆర్థిక ఇబ్బందులనుగాని, సామాజిక అవమానాలనుగాని మందహాసంతో స్వీకరిస్తాడు. జ్ఞాని భగవంతుని గూర్చి తెలుసుకొనగలడు. భక్తుడు భగవంతుని సాన్నిహిత్యాన్ని పొందగలడు. ఇదే వారిద్దరి మధ్య తేడా.

నిష్కల్మషమైన ఏ ఆధ్యాత్మిక మార్గమైనా యోగమేనని గీతాచార్యుడైన శ్రీకృష్ణ భగవానుడు తెలిపాడు. యోగ్యత కలిగించేది యోగం. దైవానుగ్రహ యోగ్యతే యోగానికి ప్రధాన లక్ష్యం.

భగవద్గీతలోని గుణత్రయ విభాగ యోగంలో శ్రీకృష్ణుడు సాధకుడు తాను త్రిగుణములైన సత్వ, రజో, స్తమో గుణముల కంటే భిన్నంగా ఉన్నానని తెలుసుకుని త్రిగుణాతీతుడుగా ఎప్పుడు ఉంటాడో అతడు ముక్తిని అప్పుడు సాధించగలడని తెలిపాడు. స్థిత ప్రజ్ఞత్వం సాధకుడు సాధిస్తే తప్ప త్రిగుణాత్మకుడు కాలేడు. స్థిర చిత్తంతో ఫలాపేక్షరహితంగా కర్మాచరణ చేస్తూ రాగద్వేషాలకు అతీతంగా, కేవలం సాక్షిగా ఉండుటయే స్థితప్రజ్ఞ అందురు. దత్తుడు ఏనాడో తెలిపిన ఈ మార్గాన్ని తిరిగి కృష్ణుడు మరోసారి గీతాచార్యుని రూపంలో ప్రభోదించాడు. భక్తి మార్గం ద్వారా సత్త్వగుణం అభివృద్ధి చెందుతుంది. సత్యాసత్య, నిత్యానిత్య, ధర్మాధర్మ వివేచనతో జ్ఞానమార్గం ద్వారా రజోగుణాన్ని అదుపు చేయాలి. తమోగుణం అజ్ఞాన జనితం. తనచుట్టూ ఉన్న రూపములలో దైవాన్ని చూస్తూ, నిష్కామభావంతో సేవించుటవల్ల తమోగుణాన్ని అదుపుచేయవచ్చు. అపుడు రజో, తమో గుణాలు సత్త్వగుణంలో లీనమయి సాధకుడు జ్ఞానం సంపాదించగలడు. స్థితప్రజ్ఞతకు దగ్గరవుతాడు.

మనుషులు ముందుగా తమకు సిరి సంపదలు లేవని, అందని ఆనందం కోసం బాధపడుతూ ఉంటారు. సుఖంలాగే దుఃఖం కూడా మనస్సులో నుంచి వచ్చే వికారమే. నేను ఆనందంగా ఉన్నాననే తృప్తితో మనస్సును సమాధానపరిస్తే, దుఃఖం మనని అంటదు. అందుకే రాజ్యాధికారంపోయి విలపిస్తున్న అలర్కుని దుఃఖం అంటే ఏమిటో వివరించమని దత్తుడు ప్రశ్నిస్తాడు. అందువల్ల భావదారిద్రాన్ని మానవులు వదిలించుకోవాలి. నిన్ను నువ్వు తెలుసుకోవడమే ఆధ్యాత్మికత పరమార్థం అని అర్షధర్మం చెబుతోంది. తన సంప్రదాయం ఏదైనా వ్యక్తి తానేమిటో, తన ఉనికి ఎందుకన్న విషయాన్ని అంతర్గత వివేచన ద్వారా అర్థం చేసుకోవాలి. మనిషి యొక్క చంచలమైన మనస్సు వైరాగ్యపూరితమైన అభ్యాసంతో గాని మన మాటవినదని శ్రీకృష్ణుడు గీతలో తెలిపాడు. అందుకే ఆహార, నివాస, అనుష్ఠాన నియమాల్ని పాటిస్తూ ఏకాగ్రతతో దైవాన్ని ధ్యానిస్తూ ఉండాలి. మనస్సు బుద్ధి చెప్పినట్లు నడుచుకుంటూ ఉంటుంది. అందుకే మనస్సును సాధనతో, ఆరాధనతో పవిత్రంగా ఉంచాలి. అప్పుడే లక్ష్యాన్ని సాధించగలం. బంధానికి, మోక్షానికి మనస్సే అసలు కారణం. స్వేచ్ఛను హరించేది బంధం. బంధాన్ని వదిలించేది మోక్షం. బంధానికి మూలకారణం కోరిక. సుఖాలు పొందితే అవి మనిషిని స్వేచ్ఛగా ఉండనీయవు. ఒకదాని తరువాత మరొక సుఖం ఉంటూనే ఉంటుంది. మోక్షానికి మూలం సర్వసంగ పరిత్యాగం. 'మమ' అంటే ఇదంతా నాది అని అనుకుంటే బంధమని 'నమమ' అంటే ఇదంతా నాదికాదు అనుకుంటే మోక్షం అని మహాత్ములంటారు. మనిషి బంధాల నుంచి విముక్తి పొందాలంటే జ్ఞానాన్ని ఆశ్రయించాలి.

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని బుద్ధుడు నిర్వచించాడు. సుఖాసనంలో కూర్చుని చేతులు రెండూ కలిపి, కళ్లు మూసుకుని, సహజంగా జరిగే ఉచ్ఛ్వాస, నిశ్వాసలపై దృష్టి నిలపడమే ధ్యానం. ఆ సమయంలో వచ్చే ఆలోచనల్ని కట్టడి చేస్తూ, శ్వాసమీద ధ్యానం నిలిపితే మనలోని అంతర్వాహిని గోచరిస్తుంది. ఆలోచనారహితమైన మనస్సు అన్ని పరిమితుల్ని అధిగమిస్తుంది. ఇది కొన్ని రోజుల సాధన పిదపే సాధ్యమవుతుంది.

మన దేశం కర్మ భూమిగాని, భోగ భూమి గాదు. ఏ పని మనం చేస్తున్నా అది చేయిస్తున్నది భగవంతుడనేది మన సిద్ధాంతం నేను నిమిత్తమాత్రుడను. ఈ కర్మ ఫలితం ఏదైనా భగవంతుడిచ్చే ప్రసాదమని తలచే సంస్కృతి మనది. ఫలితంపై ఎటువంటి తపన, వ్యామోహం, అధికారం ఉండకూడదనే భావనతో త్రికరణ శుద్ధిగా మన పనులను మనం చేసుకుంటూ పోవాలి. ఫలితం ఆశించి చేసే ప్రతీ పని ప్రమాదకరమైనదని మహర్షులు ఏనాడో తెలిపారు. ఎందుకంటే ఫలితం మీద లేనిపోని ఆశలు, ఊహలు పెంచుకుంటే, దానిమీదే ధ్యాసతో ఆపని చేస్తే, ఆకర్మ సక్రమంగా పూర్తికాదు. చిత్తశుద్ధి, శ్రద్ధ, ఆసక్తి లోపిస్తాయి. వ్యతిరేక ఫలితాలొస్తే స్వార్థం, అవినీతి, ఆగ్రహం, ద్వేషం చోటుచేసుకుంటాయి. మనం పనిచేయగల సామర్థ్యం, ఆత్మవిశ్వాసం, దీక్ష కలిగియుండాలి. ఆ విధానంతోనే ప్రతిపనికీ ఉపక్రమించాలి.

ఎన్నో పుస్తకాలు పఠించి, ఆధ్యాత్మిక చర్చల్లో పాల్గొని, సభలకు వెళ్లి, సమావేశాలు నిర్వహించినా, తద్వారా జ్ఞానం సంపాదించినా, నిజానికి అంతరంగంలో ఉండే అజ్ఞానం మాత్రం తొలగిపోవాలి. పైకి మనం జ్ఞానులుగా ఉన్నా, మన అంతరంగపు లోతుల్లో అజ్ఞానం ఉండనే ఉంటుంది. దీనిని ఆధ్యాత్మిక మార్గాల ద్వారానే అంతరింపచేయగలం. దీనికి సాధన ఒక ముఖ్య సాధనంగా గ్రహించాలి. అందుకే మనకు సరిపడే ఆధ్యాత్మికత కొరకు అన్వేషించాలి.

ఆధ్యాత్మికతకు వైరాగ్యం కన్నా, ఆత్మ సంస్కారమే ఎక్కువ అవసరం, అసలు ఆధ్యాత్మిక జీవనం పట్ల ఆశక్తి పెరిగిన వారికి, ప్రాపంచిక విషయాలపట్ల అవగాహన మారిపోతుంది. మనిషిపైన మనస్సు పెత్తనం వదిలించుకుని, మనస్సుపై మనిషి పెత్తనం చెలాయించాలి. అప్పుడే ఆధ్యాత్మిక అన్వేషణలో కృతకృత్యులౌతారు. జీవించడంలో 'జీవం' ఉంది. బ్రతకడంలో 'జవం' మరియు 'సత్వం' ఉన్నాయి. ఇవన్నీ కలిస్తే పరిపూర్ణ వ్యక్తిత్వం వస్తుంది. వ్యక్తిత్వానికి దివ్యత్వం వన్నెతెస్తుంది. ఆధ్యాత్మికత అందాన్ని అద్దుతుంది. వ్యక్తి వికాసానికి నిజాయితీ అవసరం. నిజాయితీకి అండ నీతి. వీటన్నిటికీ మూలం ఆధ్యాత్మికతత్వం.

ఈ ఆధ్యాత్మికతత్త్వం చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామ మోక్షాలను సాధించడానికి తొలి ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. అయితే ఈ చతుర్విధపురుషార్థముల సాధనలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము, అసూయ, పైశున్యం (చాడీలు చెప్పడం) లాంటి దుర్గుణములు శత్రువుల వలే అవరోధాలుగా నిలుస్తాయి. సాధకుడు తొలి దశలోనే వీనిపై విజయం సాధించాలి. దీనికి సాధనే గొప్ప ఆయుధం.

చనిపోయిన మనిషి భౌతిక శరీరం నశించిపోతుంది. ఆత్మ శాశ్వతమైనప్పటికీ ఎవరికీ కన్పించదు. వేరే జన్మపొందే శరీరంలో ఆత్మ ప్రవేశిస్తుంది. అయితే కొన్ని ఆత్మలకు మరుజన్మలుండవు. ఆత్మకూడ నాశనము లేనిది. ఆ మరుజన్మలేని పుణ్యాత్ముల ఆత్మలు మనకెప్పుడూ అందుబాటులో ఉంటాయి. భక్తితో సేవించి, కొలిస్తే బదులిస్తాయి. అవే పరమగురువుల ఆత్మలు. ఆత్మలు అనుభూతికేంద్రాలు. అంటే అనుభూతికి మాత్రమే అవి స్పందిస్తాయి. అనుభవం తరువాత మెట్టు అనుభూతి. నేను మరణించినాక కూడ నా సమాధి మాట్లాడుతుంది అని అందుకే శిరిడీసాయి అన్నారు. సద్గ్రంధ పఠనం ద్వారా అటువంటి అనుభవాలతోబాటు అనుభూతులను పొందవచ్చు. పిమ్మట స్వప్న దర్శనం ద్వారా గురువులు మార్గదర్శకత్వం చేస్తారు.

అనేక జన్మములలో చేసిన పాపములు క్షీణదశకు వచ్చినపుడు పుణ్యకర్మలు ఫలితమునివ్వ ప్రారంభించినప్పుడు మాత్రమే దత్తుని పట్ల భక్తి కల్గుతుంది. అదే ఆధ్యాత్మిక అన్వేషణకు దారితీస్తుంది. తొలుత దైవం గురించి తెలుసుకొనుటతో మొదలిడి, సత్సంగము, సజ్జన సాంగత్యము ద్వారా ఆ ఆధ్యాత్మిక చింతన బలపడి, సద్గ్రంధ పఠనము ద్వారా దైవమునందు విశ్వాసమేర్పడి, ఆధ్యాత్మికత చిత్తములో ధృఢమై, స్థిరనివాసమేర్పరచుకొనును. అటుపై అంచెలంచెలుగా భగవంతునితో సాన్నిహిత్యమేర్పడి, వారి ఉనికిని తెలిపే అనుభవాలు, అనుభూతులు కలుగుచుండును.

లోకంలో అన్ని అధ్యాత్మిక సాధనా సంప్రదాయములు దత్తుడిని ఆధారంగా చేసుకుని విలసిల్లుచున్నవే. దత్తునికి విగ్రహారాధన అంటేనే మక్కువ. వారు సగుణోపాసననే సమర్ధించారు. దత్తునియొక్క అనంతకల్యాణ గుణవైభవమును స్మరిస్తూ, కీర్తిస్తూ, ఆయనపట్ల నిర్మలమైన భక్తి, ప్రేమ, శరణాగతి భావమును పెంపొందించుకోవాలి. తద్వారా దత్తుడు ప్రసన్నుడై, మనతోనే ఉంటూ మార్గదర్శకుడౌతాడు. తగుమాత్రంగా పూజ, అర్చన, స్తోత్ర పఠనము నిత్యం చేయుట అలవర్చుకోవాలి. దానితోపాటు సత్వ, దైవ గుణములను పెంపొందించుకుంటూ ఈశ్వరార్పణ బుద్ధితో విహితకర్మలు చేయాలి. ఇవన్నీ తదుపరి మెట్టయిన ఆత్మసాక్షాత్కారం పొందడానికి ఎంతో దోహదపడతాయి.

కావున ఈ గ్రంథం పఠించే వారు ఆధ్యాత్మికతను అలవరచుకుని శ్రీవల్లభులపట్ల ఏకాగ్రత, ధృఢ విశ్వాసములతో పారాయణచేస్తే సకల ప్రయోజనాలు చేకూరును. అటుపై సద్గురువు తనంతగా తానే నీ చెంతకువస్తారు.

**శ్రీపాదరాజం శరణంప్రపద్యే**

అధ్యాయం-3

# దత్తాత్రేయుడే ఆదిగురువు

కృతయుగమున దక్షిణామూర్తి, త్రేతాయుగమున శ్రీదత్తాత్రేయుడు, ద్వాపరయుగమున వ్యాసభగవానుడు, కలియుగమున శ్రీ శంకరాచార్యులు, అను నల్గురు గురువులు సృష్టి ఆది నుండీ, ఒకరితరువాత మరియొకరు ధర్మరక్షణార్ధము భూమిపై అవతరించారు. ఇందు దక్షిణామూర్తి, శంకరాచార్యుల వారిని శివాంశగల్గిన శివుని అవతారములుగా, దత్తాత్రేయుడు, వ్యాసభగవానుడు విష్ణువు యొక్క అంశ కల్గిన విష్ణు అవతారములుగా చెప్పబడినది. దత్తాత్రేయుడు మాత్రం యోగాదేశమునకై అవతరించినట్టివాడు. జ్ఞానానికి సోపానము వంటిది యోగము కావున, ఈ అవతారము అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నది. దత్తాత్రేయుడు శైవ, వైష్ణవ మతముల వారందరికీ ఆద్యుడు. దత్తాత్రేయుని ఆవిర్భావం 170 కోట్ల సంవత్సరముల క్రితమే జరిగినట్లుగా చెప్పబడినది. మరియు సృష్టి ఆరంభం నుండే దత్తుడున్నట్లుగా తెలియుచున్నది.

విష్ణువు యొక్క అవతారములు అనేకములు. అందు పన్నెండు అవతారములు ముఖ్యములు. వీనిలో పది అవతారములను దశావతారములుగా ఆబాలగోపాలమెరిగినవే. అవి మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, రామ, పరశురామ, కృష్ణ, బుద్ధ మరియు కల్కి అవతారములు. అయితే మరి రెండు ప్రముఖములైన అవతారములు విష్ణువుకు గలవు అది దత్తాత్రేయఅవతారము మరియు వ్యాసావతారము. విష్ణుసహస్రనామస్తోత్రము నుండి వ్యాసుడే విష్ణువని ప్రస్ఫుటముగా తెలియును. విష్ణువు ఇన్ని అవతారములు ధరించి పృధివిపై సంచరించుటకు దుర్వాసముని శాపమే కారణముగా పురాణములు తెలుపుచున్నవి. భాగవతంలో దత్తాత్రేయుని అవతారం విష్ణువు యొక్క ఇరవై ఒక్క అవతారాలలో ఆరవదిగా, శ్రీమన్నారాయణుని లీలావతారాలలో నాల్గవదిగా తెలుపబడినది. దత్తావతారం దశావతారాల కంటే ఎంతో పురాతనమైనది.

అంబరీషుడను రాజు విష్ణు భక్తుడు, ఏకాదశి తిథి రోజు, విధివిధానముగా విష్ణుపూజను, ఉపవాస, జాగరణములను పూర్తిచేసికొని, ఆ మరునాడు ద్వాదశితిథి రోజున, అంబరీషుడు ఏకాదశీవ్రతమును ముగించుటకు సంసిద్ధుడగుచుండగా, దుర్వాసమహాముని అంబరీషుని కడకువచ్చెను. దుర్వాసమహామునిని అతిథిగా భోజనమునకు రాజు ఆహ్వానించెను. నదికిపోయి స్నానమాచరించి, ధ్యానం ముగించుకుని వచ్చెదనని దుర్వాసుడు నదికిపోయెను. ఏకాదశివ్రతము చేయువారు ద్వాదశీ గడియలు ముగియులోపు ఏకాదశీవ్రతము ముగించవలెనని, లేనిచో ఫలితము దక్కదన్న నియమం గలదు. ద్వాదశి ఘడియలు పూర్తి అగుటకు సమయం దగ్గర పడుతున్నందువల్ల, అతిధిగా ఆహ్వానించిన దుర్వాసమహాముని రానందువల్ల, ద్వాదశి ఘడియలు పూర్తి కాకుండా, విష్ణువుని స్మరించి, అంబరీషుడు జలము సేవించెను. కొద్దిసేపటికి అరుదెంచిన దుర్వాసుడు, ఆగ్రహించి, అతిథిని ఆహ్వానించి, మర్యాద ఉల్లంఘించినందుకు, భూమిపై అనేక జన్మలెత్తుదువని అంబరీషుని శపించెను. భయభ్రాంతుడై అంబరీషుడు, విష్ణువును ప్రార్ధించెను. విష్ణువు సాక్షాత్కరించెను. భక్తుని రక్షించుటకు అతనికి బదులుగా ఆ శాపాన్ని తానే అనుభవించెదనని దుర్వాసునికి తెలుపగా, అతడు అంగీకరించి, తద్వారా లోకకళ్యాణము గూడ జరుగగలదని తెలిపెను.

విష్ణువు ధరించిన పన్నెండు అవతారములు నెలకొక అవతారము చొప్పున పూజించి అర్చించవలెనని, దీనినే విభూతీ ద్వాదశీ వ్రతమందురని మత్స్య పురాణములో పేర్కొనబడినది. దత్తాత్రేయునిది విష్ణువు యొక్క అంశ అయినప్పటికీ వారిది త్రిమూర్త్యాత్మక స్వరూపము. విష్ణువు తన అవతారాలన్నియూ, ఆయా అవతారకార్యము ముగియగానే ఆయా అవతారాలను చాలించాడు. కాని దత్తావతారాన్ని ధర్మాన్ని ఎల్లవేళల నిలిపేందుకు భూమిపై శాశ్వతముగా నిలిపాడు. అందువల్ల దత్తులు నేటికీ గూడ ఏదో ఒక రూపంలో భూమిపై సంచరిస్తుంటారని భక్తుల విశ్వాసం. ఎన్నో అనుభవాలు కూడ భక్తులకు నిదర్శనాలయ్యాయి.

సృష్టికార్యములో తనకు సహాయపడగలందులకు బ్రహ్మదేవుడు అత్రిమహాముని సృష్టించాడు. 'త్రి' గుణములకు అతీతుడైన ఆ మహాతపశ్శాలి అత్రి అనునామమును బడసినాడు. అత్రిమహాముని భార్య అయిన అనసూయాదేవి మహా పతివ్రత. ఆమె తన పాతివ్రత్య ప్రభావముతో ఎండిన గంగానది యందు తిరిగి నీరు నింపినది. అనసూయ అంటే అసూయలేనిదని అర్ధము. ఆమె ముల్లోకాలకు ఆరాధ్యదేవతయై విలసిల్లింది. ఒకసారి త్రిలోక సంచారియైన నారదుడు త్రిమూర్తుల నివాసాలకు వెళ్ళి, అక్కడ అనసూయాదేవి పాతివ్రత్య మహిమను ఎంతగానో ప్రశంసించాడు. త్రిమూర్తుల భార్యలు ఆమె పాతివ్రత్యమహిమను తగ్గించాలనే మిషతో, ఆమె పాతివ్రత్యాన్ని పరీక్షించిరమ్మని తమ భర్తలైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కోరారు. అపుడు త్రిమూర్తులు బ్రాహ్మణ వేషాలతో అతిధులుగా అత్రిమహాముని ఆశ్రమానికి చేరుకున్నారు. అత్రిమహాముని ఆశ్రమమందున లేనికారణంగా, అనసూయామాత వారికి ఎదురేగి, అర్ఘ్య, పాద్యాలిచ్చి సత్కరించింది. అప్పుడు ఆ అతిధులు తాము ఆకలితోనున్నామని, భిక్ష నీయవలసిందిగా ఆమెను కోరిరి. అంత ఆమె భోజనము వడ్డించుటకు ఏర్పాట్లు చేయుచుండగా, అతిధి రూపాలలోవున్న త్రిమూర్తులు ఆమెతో నీవు వివస్త్రగా అన్నం వడ్డిస్తేనే భుజిస్తామని షరతు విధించారు. దీనితో వారు సామాన్యులు కారని ఆమె గ్రహించి, అత్రిమహామునిని స్మరించింది. అంతలోనే అ ముగ్గురు అతిధులు పసిపిల్లలుగా మారిపోయి, బోసినవ్వులు నవ్వసాగారు. ఆ పసిపిల్లలను చూడగానే, ఆమె యొక్క తపఃశ్శక్తి వల్ల ఆమెకు స్తన్యం వచ్చింది. వెంటనే ఆమె వివస్త్రగా ఆ పిల్లలకు పాలిచ్చి, ఉయ్యాలలో పరుండబెట్టి, బట్టలు ధరించింది. ఇంతలో అత్రిమహర్షి వచ్చి, ఆమె నుండి సర్వమూ తెలుసుకొని, ఆ ముగ్గురు పసిపాపలను ఒక దరిచేర్చగా, వారు ముగ్గురు ఆరు చేతులు, మూడు ముఖములు గల ఒక బాలునిగా రూపుదిద్దుకొనెను. అప్పుడు ఆ దంపతులు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను స్తుతించగా వారు సాక్షాత్కరించి, ఆ ముగ్గురు పిల్లల రూపంలో త్రిమూర్తులమైన మేము మీకు దత్తం చేసుకున్నామని, కావున ఈ బాలుడు దత్తుడుగా సుప్రసిద్ధుడౌతాడని తెలిపారు. ఆత్రేయసగోత్రమునకు చెందిన ఆ బాలుడు ఆత్రేయుడుగావున అతనికి దత్తాత్రేయునిగా నామకరణము చేసిరి. కొంతకాలము తరువాత తమ గర్భవాసమున పుత్రులను పొందాలని, ఆ దంపతులకు సంకల్పం కలిగి తిరిగి త్రిమూర్తులకై తపమాచరించి, వరము పొంది, ఆ వరప్రభావము వలన అత్రి మహాముని నేత్రములనుండి వచ్చిన తేజస్సు అనసూయామాత గర్భంలో ప్రవేశించి, ఆ తేజస్సుతో చంద్రుడు, అనసూయామాత గర్భం ద్వారా దుర్వాసుడు అను ఇద్దరు కుమారులకు జన్మనిచ్చారు. చంద్రుడు తమోగుణానికి, దుర్వాసుడు రజోగుణానికి మారుపేర్లుగా చెప్పవచ్చు. వారు సత్త్వగుణములు కలిగిన తమ సోదరుడైన దత్తునియందు తమ అంశలైన తమో, రజోగుణాలను నెలకొల్పి, తపోభూమికి వెళ్లారు. దత్తుడు బాల్యము నుండి ఎన్నో ఆధ్యాత్మిక లీలా విలాసాలను ఆశ్రమవాసులకు చూపిస్తూ పెరిగి పెద్దవాడయినాడు. తల్లిదండ్రుల అనుమతి పొంది, లోకకళ్యాణార్ధమై దత్తుడు సహ్యా పర్వతము చేరి, అచట గల మాతాపురమందు అమలాక్యాశ్రమమను పేరుతో ఆశ్రమం నిర్మించుకొని ధ్యానంలో ఉండేవారు. తమను చేరిన భక్తులను రక్షిస్తూ, బోధగురువుగా, ఆదిగురువుగా వినుతి కెక్కారు.

దత్తుని లీలా విశేషములన్నీ మైత్రేయమహర్షి విదురుల వారికి తెలియజేసారు. అలాగే వేదధర్ముడు తన శిష్యుడైన దీపకునికి కూడ తెలియచేసాడు. దత్తుని ముఖ్య భక్తులలో కార్తవీర్యార్జునుడు ఒకడు. ఈతడు కృతవీర్యుని పుత్రుడు. అతడు అవిటిచేతులతో పుట్టెను. అవిటిచేతులతో రాజ్యభారము వహించలేనని తెలిపి, తండ్రి అనంతరము రాజగుటకు నిరాకరించెను. చేతుల అవటితనము, సహ్యాద్రిపైనున్న దత్తాత్రేయుని ఆశ్రయించినచో మాయమగునని మంత్రులు తెలుపగా, కార్తవీర్యార్జునుడు సహ్యాద్రి చేరి, దత్తుని పరీక్షలకు తట్టుకుని, వారిని ఆశ్రయించి, అత్యంత భక్తితో కొలిచెను. దత్తుని దయతో సహస్ర బాహుత్వము (వెయ్యి చేతులు), సప్తద్వీపాధిపత్యము, కామగమవిమానము, తనను స్మరించినంతనే నష్టద్రవ్యలాభము, సుప్రసిద్ధునిచేతిలో మరణము, అష్టసిద్ధులు, తప్పుచేసిన వెంటనే సరిదిద్దుకొనుటకు పెద్దలచే మందలింపు మున్నగు వరములను పొందెను. దాన, తపో, యోగ, విజయాదులయందు కార్తవీర్యునికి సాటి ఎవరూలేరని, స్తుతింపబడుచూ, ప్రజలను కన్నబిడ్డలవలె పాలించుచుండెను. విజయగర్వంతో, మధాంధుడై కార్తవీర్యుడు ఒకసారి పరశురాముని తండ్రియైన జమదగ్ని ఆశ్రమమున గల కామధేనువును బలాత్కారముగా రాజ్యానికి తరలించగా, పరశురాముడు భీకర యుద్ధముచేసి కార్తవీర్యుని సంహరించెను. కార్తవీర్యునికి దత్తస్వామి ఎన్నో జ్ఞానోపదేశములు చేసి, యోగవిద్యను గూడ అతనికి నేర్పి, అతనిని మహాజ్ఞానిగా తీర్చిదిద్దినా, కార్తవీర్యుని అహంకారమువల్ల అతడు మరణించెను.

అతడు ప్రతి సంవత్సరము దత్తదేవుని మహోత్సవము జరిపించెడివాడు మహాయోగి, తత్త్వజ్ఞుడు అయిన కార్తవీర్యుడు 85 వేల సం॥లు ఏకచ్ఛత్రాధిపత్యముగా భువిని ఏలినాడు. విష్ణుమూర్తి యొక్క సుదర్శనచక్రమే శాపవశమున కార్తవీర్యునిగా జన్మించి, విష్ణు రూపమైన పరశురాముని చేతిలో మరణించెను. కార్తవీర్యుని కుమారులు తండ్రి మరణముపై ఆగ్రహించి, పరశురాముడు ఆశ్రమమందు లేని సమయమున అతని తండ్రియగు జమదగ్నిని సంహరించినారు. దానికి ప్రతీకారముగా పరశురాముడు వారిని చంపుటయేగాక, 21 సార్లు దేశాటనచేసి, రాజులందర్ని సంహరించి, సహ్యాద్రికి చేరి దత్తుని పర్యవేక్షణలో తల్లి, దండ్రులకు అంత్యక్రియలు జరిపి క్షత్రియసంహారమువల్ల అంటిన పాపపంకిలమును యజ్ఞములు నిర్వహించి, పోగొట్టుకుని, తపోభూమికి వెళ్లినాడు.

దత్తుని ఆశ్రయించి ముక్తిపొందిన వారిలో మరో ముఖ్యుడు అలర్కుడు. శత్రుజిత్తు అనురాజునకు ఋతుధ్వజుడను కుమారుడు గలడు. అతనికి నాగకుమారులు అత్యంత మిత్రులు. వారితో విడదీయరాని స్నేహము కలిగి ఋతుధ్వజుడు వారితో ఆట, పాటలాడుతుండెడివాడు. గాలవుడను ఋషి తన యాగ సంరక్షణార్థమై ఋతుధ్వజుని పంపమని అతని తండ్రి శత్రుజిత్తును అడిగెను. అతడట్లేనని ఋతుధ్వజుని పంపెను. గాలవుడు అతనికి మహిమగల ఒక అశ్వమునిచ్చెను. ఆ గుర్రమునెక్కి ఋతుధ్వజుడు యాగరక్షణ చేయుచుండగా, రాక్షసుడొకడు పందిరూపమున వచ్చెను. రాక్షసుని వెంబడించి అతనిని సంహరించి, అతని చెరలోనున్న మదాలస అను రాజకుమార్తెను విడిపించి, ఆమెను వివాహము చేసికొనెను. రాజ్యమునకు నూతన వధువును తీసికొనివచ్చి, సుఖముగానుండెను. ఆ రాక్షసుని సోదరుడు ఋతుధ్వజునిపై ఆగ్రహించి, రాజకుమారుడు రాజ్యములో లేని సమయమున ఆతని భార్యను కలసి రాకుమారుడు మరణించాడని ఒక అసత్యవార్తను చెప్పి, ఆమెను నమ్మించెను. ఆ వార్తవిని తట్టుకోలేక మదాలస మరణించెను. రాజకుమారుడు వచ్చి నిజము తెలుసుకొని, చింతించి, భార్యకు అంత్యక్రియలు చేసి, వియోగముతో విరాగియయ్యెను. మిత్రుని విచారమును పోగొట్టవలెనని, నాగకుమారులు, వారి తండ్రియైన నాగరాజు, అశ్వతరునికి తెలిపి, సహాయమర్థించిరి, నాగరాజు ఈశ్వరునికై ప్రార్థించి, మదాలసను కన్యరూపంలో తన కుమార్తెగా పొంది, ఋతుధ్వజునికిచ్చి వివాహము చేసెను. వారికి విక్రాంతుడని, సుబాహువని, శత్రుమర్ధనుడను ముగ్గురు కుమారులు గల్గిరి. తల్లి పసిప్రాయమున వారికి జోలపాటల రూపమున చేసిన తత్త్వబోధనలవల్ల వారు రాజ్యము స్వీకరించుటకు నిరాకరించి, ఆత్మనిష్ఠులై అనాశక్తితో తపమొనరించుటకు అడవులకు బోయిరి. ఆఖరి కుమారుడైన అలర్కుడు మాత్రము రాజ్యభారము వహించెను. కాశీరాజు అతనిపై దండెత్తగా, రాజ్యము కోల్పోయి దుఃఖితుడయ్యెను. సహ్యాద్రికి చేరి దత్తునాశ్రయించి తన దుఃఖమును రూపుబాపమని కోరగా, దత్తుడు అతనికి ఆత్మజ్ఞానము పెంపొందించుటకై యోగమను జ్ఞానబోధ చేసెను. అంతతో అతడు రాజ్యమును విరాగియై త్యజించెను. అతని సోదరుడు సుబాహువు తత్త్వమార్గము వదలి, తన సోదరుడైన అలర్కుడు భోగాలవాసి అయినందుకు విచారించి అలర్కునిలో మార్పు ఆశించి, కాశీరాజును ప్రోత్సహించి, ఈ నాటకమాడి, తమ్మునిలో మార్పు తెచ్చెను. ఈ విషయం తమ్మునికి తెలిపి అతని రాజ్యము తిరిగి అతనికి ఇప్పించినా, అలర్కుడు నిరాకరించి తన కుమారునికి పట్టాభిషేకం చేసి, తపోభూమి కరిగెను. దీనిలో దత్తుడు అలర్కునికి చేసిన జ్ఞానబోధ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుని, విశ్వవిఖ్యాతమైనది.

దత్తభక్తుడైన విష్ణుదత్తుడను బ్రాహ్మణుడు దత్తుని దర్శనముకోరి, అతనియింటి వెలుపల రావి చెట్టుపై నివాసముంటున్న బ్రహ్మరాక్షసుని ఆశ్రయించెను. నిత్యము విష్ణుదత్తుడు పెట్టిన బలి అన్నము తింటూ, విశ్వాసపాత్రుడైన ఆ బ్రహ్మరాక్షసుడు, మూడుసార్లు దత్తుని చూపింతునని, గుర్తించి వారిని చేరి ప్రార్థింపమనెను. రెండు పర్యాయములు బ్రహ్మరాక్షసుడు దత్తుని విష్ణుదత్తునికి చూపించిననూ, దత్తుడు మారువేషములో, అనాచారిగా, మాంసభక్షకునిగా, కసాయివానిగా కన్పించినందువల్ల సంకోచముతో వారిని ఆ బ్రాహ్మణుడు ప్రసన్నము చేసికొనలేకపోయెను. మూడవసారి దత్తుని గుర్తించి, వారి పాదములు పట్టుకొని విడువక వారి దయకు పాత్రుడయ్యెను. ఆ మరునాడు జరుగబోవు తన తండ్రి ఆబ్దీకమునకు భోక్తగా రమ్మని దత్తునికోరెను. ఆబ్దీకతిధి రోజున దత్తుని ఒక భోక్తగా, వారికి తోడుగా సూర్యుని, అగ్నిని కూడ భోక్తలుగా ఆహ్వానించి విష్ణుదత్తుడు ఆబ్ధికము నిర్వహించి, దత్తుని ప్రశంసలతోబాటు వారి ఆశీర్వాదములు గూడ పొందెను. దత్తుని దయతో అనేక శక్తులు సంపాదించి, లోకకళ్యాణమునకు వాటిని ఉపయోగిస్తూ, లోక ప్రసిద్ధుడైనాడు.

జంభాసురుడను రాక్షసుడు స్వర్గమునాక్రమించి, ఇంద్రుని పదవీభ్రష్టుని చేసినాడు. ఇంద్రుడు దత్తుని ఆశ్రయింపగా, ఉపాయముతో దత్తుడు అతనిని కాపాడెను. జంభాసురుని యుద్ధమిషతో కవ్వించి, దత్తాశ్రమ ప్రాంతానికి తీసికునిరాగా, అతడు యుద్ధము మాట మరచి, దత్తుని ఒడిలోనున్న అనఘాలక్ష్మిని నెత్తిన ఎత్తుకునిపోవుచుండగా, లక్ష్మిని నెత్తిన ఎత్తుకున్న వానికి మరణము తథ్యమని దత్తుడు తెలుపగా, అదే అదనుగా ఇంద్రుడు రాక్షసుని సంహరించెను. తిరిగి ఇంద్ర పదవి పొందెను.

లోకతత్వాన్ని ప్రత్యక్షంగా తెలుసుకుందామనే కోరికతో ప్రహ్లాదుడు భూగోళమంతా సందర్శిస్తూ, సహ్యాపర్వత ప్రాంతం చేరి, నేలమీద పొర్లుతున్న ఒక మహర్షిని చూచాడు. ఆ రూపంలో దత్తాత్రేయుడు ప్రహ్లాదునికి జ్ఞానబోధ చేసాడు. లోకారాధ్యుడైన సూర్యభగవానునికి కుష్టురోగము నుండి విముక్తి ప్రసాదించాడు. శ్రీకృష్ణుని వంశానికి మూలపురుషుడైన యదురాజుకు దిగంబరుని రూపంలో తాను ప్రకృతిలోనున్న 24 గురువుల నుండి నేర్చుకున్న సారమంతా తెలిపి జ్ఞానబోధ చేసాడు. వేదజ్ఞానం మరచిన బ్రహ్మదేవునికి తిరిగి వేదాలన్నింటిని స్ఫురణకు తెప్పించారు.

ఒకానొక సమయములో పరమశివునకు, బ్రహ్మహత్యాపాతకము కలిగెను. బ్రహ్మకపాలము (భిక్షపాత్ర) తన చేతియందుంచుకుని శివుడు భిక్ష కొరకై ముల్లోకములు తిరిగెను. కాని ఎక్కడా భిక్ష లభించలేదు. కేవలం శ్రీమహాలక్ష్మి మాత్రమే కొల్హాపురినందు శివునికి భిక్ష నొసగెను. అంతట శివుని బ్రహ్మహత్యపాతక దోషము మహాలక్ష్మి చైతన్యమునకు ప్రవేశించుటచే, ఆమెయందు కాలుష్యము నిండుకొనెను. ఆ కాలుష్యమును వదిలించుకొనుట ఎట్లో ఆమెకు తెలియరాకుండెను. కొంతకాలమునకు ఈ కాలుష్యము హరించగలశక్తి కేవలము దత్తప్రభువులకే సాధ్యమని మహాలక్ష్మి గ్రహించి వారిని ఆశ్రయించెను. మహాలక్ష్మి కోర్కెను అంగీకరించి, శ్రీదత్తప్రభువు ప్రతినిత్యము కొల్హాపురిలోనున్న మహాలక్ష్మి నుండి భిక్ష స్వీకరించేవారు. ఆ విధముగా కొంతకాలము ప్రతీనిత్యము మహాలక్ష్మి వద్దనుండి కరవీరపురంలో (కొల్హాపురి) భిక్ష స్వీకరిస్తూ, మెల్లమెల్లగా మహాలక్ష్మి యొక్క కాలుష్యమును హరించివేసిరి. ఇది వారి ప్రత్యేక యోగలీల. ఆ లీలలో భాగంగానే దత్తుడు ప్రతీరోజు కాశీలో స్నానమాచరించి కొల్హాపురిలో భిక్ష స్వీకరించి, సహ్యాద్రిపై విశ్రమించేవారు.

దత్తాత్రేయుని స్వభావంలో మూడు ముఖ్య లక్షణాలు గోచరిస్తాయి. మొదటిది వారు స్మరణతోనే సంతుష్టులౌతారు. స్మరించగానే కదలివస్తారు. ఇదే దలాదిమహామునికి అనుభవమయ్యింది. అందుకేవారిని స్మర్తృగామిగా కీర్తిస్తారు. రెండవది వారు భక్తి-ముక్తి ప్రదాత. అంటే భక్తులకు ఇహ, పరసౌఖ్యాలను మెండుగా ఇస్తూ, యోగశక్తిని ప్రసాదించి, జీవన్ముక్తులుగా చేస్తారు. మూడవలక్షణం భక్తులకు దత్తమౌతాడు. అంటే ఆయన తన భక్తుల వెన్నంటి ఉంటూ, వారి మంచి చెడ్డలు చూస్తూ వారికి దత్తమౌతాడు. అందుకే వారిని దైవ, గురు స్వరూపంగా కొలవాలి.

దత్తమంత్రాలకు ఋషి పరమేశ్వరుడు. దత్తమంత్రానికి బీజాక్షరం 'ద్రాం' అని చెప్పబడింది. 'ఓం ద్రాం దత్తాత్రేయాయ నమః' అన్నది వారి మూల మంత్రం. విశ్వశక్తి యావత్తూ ఈ మంత్రంలోనే ఉన్నది. ఈ నామ స్మరణ చేస్తే దత్తుని పరిపూర్ణ అనుగ్రహం చాలా తొందరగా లభిస్తుంది.

ఈ విధంగా సహ్యాద్రి పైనుండి భక్త రక్షణ గావించి, దుర్మార్గులలో పరివర్తన తెచ్చిన దత్తుడు ఎంతోమందికి తరిగిపోతున్న ధర్మాన్ని పునరుద్ధరించే దిశగా ఎన్నో జ్ఞానబోధనలు చేసి, ప్రసిద్ధులైనారు.

సూత, శౌనక, ధ్యానయోగములోని దత్తదేవ విశ్వరూపాసాక్షాత్కారము, ప్రహ్లాదాజగర సంవాదము, అవధూత యదురాజుల సంవాదము, అలర్క చరిత్రము, కార్తవీర్యార్జునుని చరిత్ర, పితాపుత్ర సంవాదములు, విష్ణుదత్తుని కథాఘట్టములన్నియూ అద్వైత వేదాంతతత్వము పర్యవసితములు. తత్త్వజ్ఞానము, యోగమూలకము మరియు గురువు హస్త, మస్తక సంయోగముచే దీక్షనిచ్చి, శిష్యునికి మంత్రసిద్ధిని, పిదప అపరోక్షానుభూతిని కలుగజేసెడి దత్తుని యోగ సాంప్రదాయము ఎంతో మహోన్నతమైనది.

దత్తాత్రేయస్వామి పరస్పర విరుద్ధ రూపాలలో తిరుగుతుంటారు. భక్తులను చాల కఠినంగా పరీక్షిస్తూవుంటారు. ఒక్కోసారి జటామండలధారిగా, మరోక్షణంలో ముండితశిరస్కుడిగా, యోగిగా, భోగిగా, దిగంబరుడుగా, శ్వేతాంబరుడుగా, పీతాంబరుడుగా కన్పిస్తారు. ఒక్కోసారి మహావిద్వాంసునిలా కనిపిస్తే మరోసారి ఉన్మత్తుడిగా, మదోన్మత్తుడిగా కనిపిస్తారు.

వారి నిజరూపం తెలుసుకొనుట చాల కష్టమైనది. అంతుపట్టని రహస్యం. హర, హరి, హిరణ్యగర్భులుగా కనిపిస్తూ ఒకసారి త్రిమూర్తి స్వరూపునిగా దర్శనమిస్తారు. వీరు సర్వదేవతాస్వరూపం. వీరిని పూజిస్తే దేవతలందర్నీ పూజించిన ఫలం దక్కుతుంది.

దత్తాత్రేయస్వామి అవతారము భూమండలమున్నంత వరకూ ధర్మాన్ని ప్రతిష్ఠించేందుకు ఏదో రూపంలో అవతరిస్తూనే ఉంటుంది. దత్తాత్రేయుడు, అటు పిమ్మట అరుదెంచిన శ్రీపాద శ్రీవల్లభులు కూడ పూర్ణదత్తులే. వీరుకాక ఇంకా చాలామంది గురువులు ఒకరి తరువాత ఒకరు ఈ భూమండలముపై దత్తుని అంశతో జన్మించారు. వారే సిద్ధగురువులైన దత్తగురువులు. శ్రీనృసింహసరస్వతి, అక్కల్‌కోట మహారాజ్, మాణిక్య ప్రభువు, శిరిడీసాయిబాబా, గజానన్ మహారాజ్, వాసుదేవానంద సరస్వతి, హజరత్ తాజుద్దీన్ బాబా, సంత్ సిద్దేశ్వర్ గులాబ్ బాబా మరియు ధునివాలే బాబా మొ॥ వారు.

దత్తభక్తిలో పరిపూర్ణత సిద్ధించినపుడు ఏ యుగమందైనా శ్రీపాద శ్రీవల్లభులు భౌతిక రూపమున దర్శన, స్పర్శన, సంభాషణా భాగ్యము కలుగజేస్తారు. దాని కారణమేమనగా శ్రీ దత్తాత్రేయస్వామియే శ్రీపాద శ్రీవల్లభులుగా అవతరించారు. ఇది పరిపూర్ణ దత్తావతారం. నిజానికి దత్తావతారాలన్నీ నరుని ఆకారంలోనున్న నిరాకారాలే. అవి సగుణములుగా తోచు నిర్గుణాలు, అవి సకలదేవతా స్వరూపాలు. సకల గురుస్వరూపాలు. దత్తావతారాలుగా జన్మించిన సిద్ధగురువులందరి అవతార లక్ష్యం ప్రజలకు చేరువుగా ఉంటూ, వారి సమస్యలకు పరిష్కారం తెలుపుతూ, వారిని సన్మార్గంలో నడిపించుటే. ఇదే వారి వృత్తి, ప్రవృతి గూడాను. ప్రతీ అవతారంలోనూ సారూప్య స్వభావాలు ఇంచుమించు ఒకేవిధంగా ఉండడం విశేషం. వారి జీవన విధానం, లీలలు, బోధనా పద్ధతులు వారి విధానాల సారత్రికత, వారు చేసిన అద్భుతాలు పరంపరగా కొనసాగాయి. కొనసాగుతున్నాయి కూడ. విధానాలు ఒకటేగాని అవతారాలు వేర్వేరు. గురుపరంపరలో దత్తాత్రేయుడు ఒక అవతారం పరిసమాప్తి కాగానే మరొక నామధేయంతో వేరొక అవతారం దాల్చి జనులను ఉద్ధరించారు. ఒక్కోసారి రెండేసి అవతారాలు అంతకుమించి గూడ వారి అంశతో ఈ భువిపై ఒకే కాలంలో దర్శనమిచ్చాయి.

ఇప్పటి నేపాల్‌దేశంలోని, చిత్రకూటం వద్ద గల 'అనసూయపహడ్' అనుచోట దత్తుడు మొదట అత్రిపుత్రునిగా అవతరించారు. అందుకు గుర్తుగా ఇప్పటికీ అక్కడ ఒక దత్తమందిరమున్నది.

శ్రీదత్తాత్రేయస్వామి వారు మూడు శిరములతో, ఆరు భుజములతో, నాలుగు కుక్కలతో, ఆవుతో ఉన్నట్లుగా పురాణేతిహాసాలలో చెప్పబడింది. వీరి మూడు శిరస్సులు త్రిమూర్తులకు ప్రతీకగా సృష్టి, స్థితి, లయ స్వరూపములు, వారి కాళ్లచెంతనున్న నాలుగు కుక్కలు ఆ రూపములోనున్న వేదములు. ఆ కుక్కలు నిరంతరము వారి పాదములను నాకుతుంటాయి. మనస్సు మాయ వంటిది. ఆ మాయను కామధేనువుగా మార్చి తన వద్దనే ఆవు రూపముగా స్వామి ఉంచుకున్నారు. స్వామి చేతిలో ధరించిన మాల సర్వవ్యవహారములకు మూలమైనటువంటి అక్షరమాల. ఆచారము, వ్యవహారము, ధర్మ, అర్థకామముల త్రిపుటిని వారు శూలముగా ధరించిరి. వారిచేతులలోనున్న శంఖము-నాదము, ఢమరు-సర్వవేదముల ప్రావిర్భవము, కమండలము-పాపపుణ్యముల ఫలదాయకము, చక్రము-అవిద్యానాశనమునకు సంకేతము.

ప్రతీరోజూ దత్తస్వామి ఆ సేతు హిమాచలం సంచరిస్తుంటారు. దత్తాత్రేయుడు సహ్యాద్రిపై నివాసముంటాడు. రాత్రి సమయములో మాహూర్‌గడ్ (మాతాపురం)లో శయనిస్తాడు. ఉదయం కాశీలోని గంగానదిలో స్నానం చేస్తాడు. గాణుగాపురంలో ధ్యానం చేసి, కురుక్షేత్రంలో ఆచమనం చేసి, తిరిగి గాణుగాపురంలో మాధ్యాహ్నికం నెరపి, ధూతపాపేశ్వరంలో భస్మధారణగావించి, కర్నాటకలో సంధ్యావందనం చేసి, కొల్హాపురంలో భిక్ష చేసి, పండరీపురంలో తిలకధారణ చేసి, పాంచాలేశ్వర్‌లో గ్రహించిన భిక్షను భుజించి, తుంగభద్రలో జలపానం చేసి, బదరీనారాయణంలో శ్రవణం జరిపి, గిర్నార్‌లో విశ్రాంతి గైకొని, సాయంకాలం సంధ్యావందనం పశ్చిమ సముద్రతీరంలో చేస్తాడు. దీనిని బట్టి దత్తుడు ప్రతీదినం తన యోగ మార్గం ద్వారా భారతదేశంలో నలుమూలల్ని చుట్టివస్తాడని తెలుస్తుంది. నిజానికి కేవలం దత్తుని స్పర్శ వలన మాత్రమే భారతదేశ భూభాగం యోగ భూమిగా వన్నెకెక్కింది.

చతుర్విధపురుషార్థాల కోసం, మానవ జీవితంలో బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాలను నాలుగు ఆశ్రమాలు నెలకొలుపబడినవి. ఈ అన్ని ఆశ్రమములలోను మానవుడు పూజ, పునస్కారాది భక్తి మార్గాలతో జీవితాన్ని గడుపవలసి ఉంటుంది. అయితే దీనికి భిన్నంగా దత్తుడు 'అవధూతాశ్రమం' పేరుతో అయిదవ ఆశ్రమాన్ని నెలకొల్పారు. ఇక్కడ జప, తప, పూజా పునస్కారములతో పనిలేదు. నిర్విరామ దత్తనామస్మరణే ఈ ఆశ్రమంలో కైవల్యాన్ని పొందే సాధనం. అవధూత అనే పదంలో 'అ' అంటే ఆశాపాశముల నుండి విముక్తి పొందిన వాడని, 'వ' అంటే పూర్వకర్మవాసనల నుండి బయటపడినవాడని, 'ధూ' అంటే శరీరమంతా ధూళి (విభూది) కల్గినవాడని, 'త' అంటే తత్త్వ చింతన కలిగిన వాడని అర్థం. అవధూతాశ్రమంలోని వారందరూ ఈ గుణ, గణాలను కల్గి యుంటారు.

దత్తాత్రేయుడే అనఘుడు. అఘము అంటే పాపము లేనివాడని అర్థం. ఆయన యోగశక్తియే అనఘాదేవి. ఇదే వారి అర్ధనారీశ్వరస్వరూపం.

దత్తాత్రేయుల వారిది 'త్రిమూర్తుల శక్తి' కలసిన ఓంకార దివ్య స్వరూపము. ఇది యోగదేశావతారము. జ్ఞానగురు లీలావతారము. దత్త ప్రభువు భోగమోక్షప్రదులు. వారిని ఆరాధించుటకు వారి పాదుకలను ఆరాధించిననే చాలును. దత్తుడు అల్పసంతోషి. శ్రీ దత్తుని నామముతో అన్నదానము చేస్తే ప్రసన్నుడై, విశేష ఫలితాలను, లక్ష్మీకటాక్షాన్ని గూడ కలుగజేస్తాడు. దత్తాత్రేయుడు ఔదుంబర వృక్షమూలమున ఉంటాడు. దత్తునికి సగుణోపాసన అనగా విగ్రహారాధన యందు ఎంతో ప్రీతి, దత్తవిగ్రహాలకు షోఢశోపచార పూజలు చేసినచో దత్తుని కృపకు పాత్రులుకావచ్చు.

ఇలా దత్తాత్రేయస్వామి మన దేశంలో ఇన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయాల వారి చేత పరమగురువుగా, మూలపురుషుడుగా కీర్తింపబడినాడు. తన భక్తులను అగ్నిరూపంలో ఆహ్వానించినట్టి దత్తుడు ఆత్మవిద్యను, దాని ప్రయోజనము, గుణములు ఆమూలాగ్రము తెలిసినవాడు. అందువల్ల దత్త ప్రభువుకు సమానులెవరూ లేరు. దత్తాత్రేయుడు సహ్యపర్వతకృతావాసుడై తన ఆత్మశక్తిని అనఘురూపమున వెలయించి అష్టసిద్ధులను తన ఆత్మభవులను చేసుకున్నాడు.

మహాయోగీశ్వరుడైన శ్రీదత్తాత్రేయుడు జగదాచార్యుడు. యోగమార్గశిక్షణ, సన్యాసాశ్రమ ధర్మాచరణ, భక్తిమార్గపరిరక్షణ అనే మూడు అంశాలు దత్తాత్రేయఅవతార ప్రధాన ధ్యేయాలు. దుష్టదైత్యుల్ని సంహరించి, శిష్టుల్ని అనుగ్రహించి, యోగ మార్గాన్ని బోధిస్తూ, భక్తుల్ని రక్షించడమే దత్తాత్రేయఅవతార ధ్యేయమని మార్కండేయపురాణం తెలుపుతోంది. దత్తాత్రేయుడు మహా అవధూత, ముక్తిదాయకుడు, జ్ఞానప్రదాత. ప్రకృతిలోని భౌతిక లక్షణాలను దైవాసుర గుణాలతో స్వామి అద్భుతంగా సమన్వయపరచి, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని గురుదేవుడై ప్రభోదించాడు. ప్రకృతి పరిశీలన ద్వారా భూమి, మిడుత, చేప, యేనుగు, సాలెపురుగు వంటి ఇరవై నాలుగు చరచరాల నుండి దత్తుడు అవధూతగా వివేక జ్ఞానాన్ని గ్రహించాడు. వాటినే గురువులుగా భావించి, సృష్టిలోని మార్మికతను అర్థం చేసుకుని, లోకానికి వివరించాడు. ఈ విషయాన్ని భాగవతంలోని ఏకాదశస్కందం తెలుపుతోంది. ఈ జగత్తులోని ప్రతిజీవి జన్మకు ఒక సార్థకత ఉంది. ఆ జీవుల నుంచి ఎన్నో విషయాలను నేర్చుకుని జీవితాలకు అన్వయించుకోవాలన్నది దత్త సందేశం.

మానవ మనుగడకు అత్యవసరమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, సృష్టి రహస్యాన్ని అందరి నుంచి వివేకంతో గ్రహించాలి. అంతర్వీకరణతో వివేచనగా వ్యవహరించాలి. అందుకే తన ఆత్మ తనకు గురువైనదని దత్తాత్రేయుడు దివ్య ప్రభోదన చేసాడు. ఉత్తమ జన్మపొందిన మనిషి, సాటి జీవరాసుల నుండి నేర్చుకోవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. అలా అభ్యాసం చేసి వాటిని జీవనానికి సమన్వయం చేసినప్పుడే మనిషి అసలుసిసలైన మనిషి అవుతాడన్నది శ్రీ గురుదత్తుని భవ్య సందేశం. అందువల్లనే అతడు ఆదిగురువైనాడు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-4

# మహామహిమాన్వితక్షేత్రం-పీఠికాపురము (పిఠాపురం)

ఆంధ్రదేశములోని సర్కారుజిల్లాలు బంగారుబస్తాలు. ఈ జిల్లాలకే పట్టుకొమ్మగా వెలసిన తూర్పుగోదావరి జిల్లా ఆర్థిక, సామాజిక పరిపుష్ఠితోబాటు ఎంతో ఆధ్యాత్మికతను కూడ స్వంతం చేసుకుంది. దీనికి ప్రధానకారణం ఆ జిల్లాయందు వెలసిన పుణ్యక్షేత్రాల పరంపర. కాశీలోని విశ్వేశ్వరుడు కేవలం మోక్షాన్ని మాత్రమే ప్రసాదించగలిగితే, ద్రాక్షారామంలోని భీమేశ్వరుడు భోగభాగ్యాలతో బాటు మోక్షాన్ని గూడ ప్రసాదించగలడు. కోటిపల్లి క్షేత్రంలోని గోదావరి ఒడ్డున వెలసిన కోటి కోర్కెల ఫలాలనందించే కోటిఫలేశ్వరస్వామిని ఎంతోమంది శ్రేష్ఠులైన మునులు సేవించి తరించారు. సర్వకార్యసిద్ధికి మారుపేరు అన్నవరంలో వెలసిన సత్యన్నారాయణస్వామి. సర్వదోషాలను హరించే మందేశ్వరంలోని శనీశ్వరస్వామి. ర్యాలిలోని మోహిని సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే, అయినవిల్లి గణపతి సకల విఘ్ననివారకుడు. సామర్లకోటలోని కుమారరామలింగేశ్వరుడు పంచారామాలలోని శివుడు. ఇలా అనేక క్షేత్రాలతో విరాజిల్లే ఈ జిల్లాలోని పిఠాపురం యావత్ భారతదేశంలోని పుణ్యక్షేత్రాలకే మకుటాయమానం. దత్తాత్రేయుని ప్రథమ అవతారమయిన శ్రీపాద శ్రీవల్లభస్వామి పాదస్పర్శతో పునీతమయిన గ్రామరాజం. ఎన్నెన్నో శతాబ్దాల కిందటే మహిమాన్వితమైనప్పటికీ, వల్లభుల ఆజ్ఞ మేరకు ప్రకటితమవ్వని పుణ్యక్షేత్రం. ఈ మధ్యకాలంలోనే తన పూర్వప్రతిష్టను తిరిగి సంతరించుకుంటోంది.

కర్మభూమియైన భారతదేశంలో చనిపోయిన వారిని పితరులు అంటారు. వీరికి దైవత్వము. మనుష్యత్వము అనే రెండు ధర్మాలుంటాయి. దైవత్వం వల్ల సంక్రమించే శక్తులతో, తమ మనుష్యత్వము వల్ల గల ప్రేమాభిమానాల వలన పితరులు తమ వంశీయులను కాపాడుకుంటూ ఉంటారు. అందువల్లే అన్ని శుభకార్యాలలోను పెద్దలను స్మరిస్తారు. మనుష్యత్వం వల్ల వీరికి ఆకలి ఉంటుంది. కొడుకులుగాని, బంధువులుగాని శ్రాద్ధవిధితో అందించే ఆహారం వీరి ఆకలి తీర్చగలదు. అదృశ్యరూపంలో దీనిని స్వీకరించుటకు వారు ఎదురుచూస్తూ ఉంటారు. కావున శ్రాద్ధకర్మ జీవితకాలం అన్ని వర్గాల వారు విధిగా చేయాలి. లేకపోతే ఆకలితో అలమటించే పితరుల ఆత్మఘోష, ఎదురుచూపులు వారి వారి వారసులను పితృదోషాల రూపంలో వెంటాడి, కష్టనష్టాలకు గురిచేస్తూ ఉంటాయి. అందువల్ల ప్రతీ వ్యక్తీ ఈ శ్రాద్ధకర్మను విస్మరించక, తన శక్తి మేరకు నిర్వహించాలి. పరిస్థితులు అనుకూలించనిచో, దేవాలయంలోని బ్రాహ్మణులకు స్వయంపాకం లేదా ధనరూపంలో దక్షిణ ఇచ్చి, పితృ దేవతలను ప్రతీ సంవత్సరం సంతృప్తి పరచి వారి ఋణం తీర్చుకోవాలి. కాశీ, గయ, బ్రహ్మకపాలంలో ప్రత్యేక శ్రాద్ధకర్మలు పితరుల బ్రహ్మలోక ప్రాప్తికై చేసినప్పటికీ, ఆ తర్వాత గూడా ప్రతీ సంవత్సరం మానకుండా ఈ శ్రాద్ధకర్మలు తప్పనిసరిగా చేయాలి.

పిఠాపురమందున్న పాదగయాక్షేత్రం ఎంతో సుప్రసిద్ధమైన సనాతన పుణ్యక్షేత్రం. ఈ పాదగయాక్షేత్రంలో పెట్టే పితృకర్మలన్నీ గయ, ప్రయాగ, కాశీ మొదలయిన పుణ్యక్షేత్రాలలో చేసిన పితృకర్మలకు సమానం. అదే ఫలితాన్ని ప్రసా దించే మహామహిమాన్విత క్షేత్రం. గయలోగాని బ్రహ్మకపాలంలోగాని గతించిన తల్లిదండ్రులకు శాశ్వత బ్రహ్మలోకప్రాప్తికై పితృకర్మలను చేయలేని వారెవరయినా ఈ పీఠికాపురంలోని పాదగయాక్షేత్రమందు ఆ కర్మలాచరించి తల్లిదండ్రులకు పుణ్యగతులు ప్రాప్తింపచేయవచ్చును. పితృదోషాల వలన మానవులు ఎన్నో ఆర్థిక, సామాజిక, సాంసారిక ఇబ్బందులతో సతమతమవుతుంటారు. పితృదోషాలు అంటే ఏకారణంగానైనా జన్మనిచ్చిన తల్లిదండ్రులతో వారు బ్రతికి ఉన్నకాలంలో అనుచితంగా ప్రవర్తించినా లేక చనిపోయిన పిమ్మట శ్రాద్ధకర్మల నిర్వహణలో శ్రద్ధాశక్తులు లోపించినా, అసలు శ్రాద్ధకర్మలే నిర్వహించకపోయిన వారికి పితృదోషాలు తగులుతాయని శాస్త్రములు నొక్కివక్కాణిస్తున్నాయి. ఈ పితృదోషముల వలన అవసాన దశలో కుమారులు, జీవితంలో వారి సంతతి ముఖ్యంగా ఇబ్బందులకు గురిఅయ్యే అవకాశాలు కూడ ఉన్నాయని పెద్దలంటారు. ఇటువంటి పితృదోషాలు పోవుటకు కాశీలో ప్రతీవారు కనీసము 9 రాత్రులు నిద్రచేయుటతో బాటు గంగాస్నానము, అన్నపూర్ణా విశాలాక్షి సమేతుడైన విశ్వేశ్వరుని విధిగా దర్శించాలి. విధిలేని పరిస్థితులలో కనీసం 9

గంటలైనా కాశీలో గడపాలని శాస్త్రప్రమాణం. ఇదేకాకుండా, మానవుడు తన తల్లి గర్భంలో ఉన్న తొమ్మిది నెలల తొమ్మిది రోజులలో కొన్ని యాతనలుపడతాడు. గర్భవాసనరక విముక్తి కోసం కూడ కనీసం 9 రాత్రిళ్లు కాశీలో ఉండాలని పురాణాలు తెలుపుతున్నాయి. అసలు కాశీవాసం 9 నెలల 9 రోజులు చేయాలి. కాని నేటికాలంలో వచ్చిన అనేక మార్పుల వల్ల చాలా మందికి ఇది అసాధ్యంగా పరిణమించింది. దానికి ప్రత్యామ్నాయంగా తొమ్మిది రాత్రుల కాశీవాసం కనీసంగా మహాత్ములు నిర్ణయించారు. కాశీయాత్ర సాధ్యపడని వారలపట్ల కల్పవృక్షము ఈ పీఠికాపురము. ఈ పీఠికాపురంలో పితృకర్మలు నిర్వహించి తొమ్మిది రాత్రులు నిద్రచేసి, పాదగయా క్షేత్ర దేవతలతో బాటు, శ్రీపాద శ్రీవల్లభుల దర్శనం చేసిన వారికి అదే ఫలితము సంప్రాప్తిస్తుందని ఎందరో మహానుభావులతో బాటు, స్వయంగా శ్రీపాద శ్రీవల్లభులే తెలిపారు. నిజానికి బ్రహ్మజ్ఞాని ఏ ప్రదేశములోనైనా కొద్దికాలముంటే అది తీర్థక్షేత్రమవుతుంది. అక్కడ చేసిన జపము, పూజ ఎన్నోరెట్ల ఫలమిస్తుందని శాస్త్రం తెలిపింది. ఈ క్షేత్రంలో బ్రహ్మజ్ఞానులైన స్వయంభూదత్తునిగా, శ్రీపాద శ్రీవల్లభునిగా, దత్తాత్రేయుడు స్థిరనివాసముండిన కారణంగా ఈ క్షేత్రం ఎంతో మహిమాన్విత క్షేత్రంగా విఖ్యాతినొందినది. ఈ పాదగయా క్షేత్రమందలి ఆలయప్రాంగణములో స్వయం భూదత్తుని ఆలయము, పురుహూతికాదేవి ఆలయములు కలవు.

త్రిగయాక్షేత్రములలో పాదగయా క్షేత్రము అతి ప్రాచీనమైన గొప్ప శైవక్షేత్రము. ఇక్కడ శివుడు కుక్కుటలింగమూర్తిగా వెలసిన స్వయంభూలింగమూర్తి. పూర్వము కృతయుగమందు పరమభాగవతోత్తముడైన గయాసురుడనే రాక్షస రాజుండేవాడు. అతడు విష్ణుమూర్తికై ఘోరతపస్సు చేసి తన దేహము అన్ని పుణ్యక్షేత్రములకన్నా కూడ ఎంతో పరమపవిత్రమైనదిగా అగునట్లు వరముపొందెను. ఆ వరప్రభావము వలన అతనిని దర్శించిన వారికందరికీ ఎంతో సులభముగా తమపాపకర్మలు తొలగిపోవుచుండెను. గయాసురుడు తన దేశమునందున్న ప్రజలను కన్నబిడ్డలవలే పరిపాలించుచూ, సుభిక్షముగా రాజ్యముచేయుచూ, అనేక అశ్వమేధయాగములతో బాటు, దేవతలను మెప్పించే క్రతువులెన్నో చేసెను. శతక్రతువులు ఆచరించిన గయాసురునికి త్రిలోకాధిపత్యమైన ఇంద్రపదవి లభించెను. ఫలితముగా ఇంద్రుడు పదవీభ్రష్టుడయ్యెను. తిరిగి తన పదవి సంపాదించుకొనే కోరికతో, ఇంద్రుడు భూమిపై బ్రహ్మ, విష్ణు మహేశ్వరులకొరకై కఠినమైన తపస్సును ఎన్నో సంవత్సరములు చేసి, ఆ త్రిమూర్తులను మెప్పించెను. గయాసురుని సంహరించి తన త్రిలోకాధిపత్యమైన ఇంద్రపదవిని తనకు తిరిగి ఇప్పించమని వరము కోరుకొనెను. దీనికి అంగీకరించిన త్రిమూర్తులు ఏదైనా ఉపాయము ద్వారా గయాసురుని మట్టుబెట్టవలెనని ఆలోచించి, బ్రాహ్మణవేషములు ధరించి, గయాసురునికడకేగి, తాము ప్రజాహితము కోరి చేయుచున్న యజ్ఞనిమిత్తము, అన్ని యజ్ఞసంభారములు సమకూర్చుకున్ననూ, యజ్ఞ నిర్వహణకు తగిన అతి పవిత్రమైన స్థలము లభించలేదనియు, కావున ఎంతో పవిత్రమైన గయాసురుని దేహముపై ఏడురోజులు యజ్ఞము నిర్వహించుకొనుటకు అనుమతినివ్వవలసినదిగా కోరిరి. ప్రజాశ్రేయస్సే పరమావధిగా భావించే గయాసురుడు ఏడుదినములు అతని దేహముపై యజ్ఞము నిర్వహించుకొనుటకు అనుమతినిస్తూ, ఆ ఏడు దినములు తన దేహమును కదల్చకుండా, యజ్ఞభంగము కాకుండా కాపాడెదనని బ్రాహ్మణవేషధారులైన త్రిమూర్తులకు వాగ్దానము చేసెను. వాగ్దానభంగము చేసి, యజ్ఞమునకు అవరోధము కల్పించినచో అతనిని సంహరింతుమని త్రిమూర్తులు షరతు విధించిరి. వారి షరతుకు అంగీకరించి, గయాసురుడు, తన యోగమహిమచే బీహారు రాష్ట్రమునందు గల గయ అను ప్రదేశము వరకూ శిరస్సూ, నాభి భాగము ఒరిస్సా రాష్ట్రమునందలి జాజిపూర్ వరకూ, పాదములు ఆంధ్రరాష్ట్రములోని తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురములో ఉండునట్లుగా అతని శరీరమును విస్తారముచేసి త్రిమూర్తులు తమ యజ్ఞము ప్రారంభించుటకు వీలు కల్పించెను.

అంత, విష్ణుమూర్తి తలభాగమందు, బ్రహ్మ నాభిప్రాంతమందు ఈశ్వరుడు కాళ్ల భాగమందు కూర్చుండి, యజ్ఞము ప్రారంభించిన దినమునుండి మరుసటి రోజు తెల్లవారు ఝామున కోడికూసే సమయానికి (బ్రహ్మీమూహూర్త సమయం) ఒక దినమగునట్లుగా నిర్ణయించి, ఆరు దినములు త్రిమూర్తులు నిరాటంకముగా యజ్ఞము చేసిరి. గయాసురుడు తన యోగశక్తితో తన దేహమును కదల్చకుండా నిశ్చలముగా నిలిపి, దినములు లెక్కించుకొనుచుండెను. ఈ ఆరు దినములలో ఆ రాక్షసరాజును సంహరించుటకు త్రిమూర్తులకు అవకాశం లభించలేదు. ఆ మరుసటిరోజు శివరాత్రి. యజ్ఞమునకు ఆఖరి దినమయినందువలన ఏదో విధముగా లింగోద్భవకాలానికే (అర్ధరాత్రికే) అతనిని అంతం చేసి తీరాలని త్రిమూర్తులు నిర్ణయించుకొనిరి. దీని ప్రకారము ఏడవరోజు అర్ధరాత్రికి ముందు శివుడు కోడి వేషము ధరించి, కోడి లాగ "కొక్కొరొక్కో"

అని ఎంతో బిగ్గరగా గయాసురునికి వినిపించునట్లుగా కూతవేసెను. ఏడవరోజు యజ్ఞము కూడ కోడికూతతో నిరాటంకముగా పూర్తి అయినదని భ్రమించి, గయాసురుడు తన దేహము కదిల్చి, లేచిపోయెను. ఫలితముగా, యజ్ఞభంగమయ్యెనని త్రిమూర్తులు అతనిపై నెపము వేసి, అతనిని సంహరించుటకు సంసిద్ధులైరి. తన అనాలోచితతప్పిదము వలన, గయాసురుడు యజ్ఞభంగమయ్యెనని చింతించుచూ, తాను అంగీకరించిన షరతునకు కట్టుబడి మరణించుటకు సిద్ధపడెను. అతడు చేసిన అనేక పుణ్యకార్యాలను పరిగణలోనికి తీసుకుని త్రిమూర్తులు అతనిని ఆఖరిగా ఏదైనా వరము కోరుకొమ్మని తెలిపిరి. అంత గయాసురుడు వారిని త్రిమూర్తులుగా గుర్తించి, వారి పన్నాగము గ్రహించిననూ, నిస్సహాయుడయ్యెను. మరణించిన పిదప కూడ సర్వజనులకు దుర్లభమైన మహోపకారము చేయాలని గయాసురుడు సంకల్పించి, త్రిమూర్తులతో తాను యజ్ఞము కొరకై విస్తరించిన శరీరభాగములైన శిరస్సు, నాభి, పాదములు ఏఏ ప్రదేశములందు ఆనుకున్నవో ఆయా ప్రదేశములు తనపేరున త్రిగయాక్షేత్రములుగా ప్రసిద్ధినొందవలెనని, ఆయా క్షేత్రములలో త్రిమూర్తులలో ఎవరో ఒకరు నివసించాలని, ఆ మూడు ప్రదేశములలో శక్తి పీఠములు వెలయవలెననియూ, ముఖ్యముగా మానవులు చనిపోయిన తమ పితరులను ఉద్దేశించి చేయు కర్మకాండ, పిండప్రదానములు, తర్పణములు, ఈ మూడు క్షేత్రములలో చేయు వారి పితరులకు పునరావృత్తి రహితమైన (మరో జన్మలేకుండా) శాశ్వత బ్రహ్మపదము కలుగవలెననియు, ఈ మూడు గయలలో ఎక్కడైనా పిత్రు కార్యము చేయలేనివారు, తమ గృహములలో పిత్రుకార్యములు చేసినప్పటికీ, గయ అనునామము ఉచ్చరించి ఆయా శ్రాద్ధకార్యక్రమములు గయలో జరుగుతున్నట్లుగా భావించినట్లయితే, గయా శ్రాద్ధ ఫలితము వారి పితరులకు కలుగవలెనని వరము కోరెను. అతని కోర్కెను మన్నించి, త్రిమూర్తులు గయాసురుని సంహరించి, అతనికి ముక్తిని ప్రసాదించిరి.

గయాసురునికి త్రిమూర్తులిచ్చిన వరముల ప్రకారము, అనతికాలములో త్రిగయా క్షేత్రములు ఏర్పడినవి. వాటినే ఈనాడు శిరోగయ, నాభిగయ మరియు పాదగయలను పేర్లతో పిలుచుచున్నారు.

**1. శిరోగయ:** ఇది బీహారు రాష్ట్రమందలి గయ అను ప్రదేశములో గలదు. గయాసురుని శిరస్సు ఆనిన ఈ క్షేత్రము ఫల్గుణీ నదీతీరమందు గలదు. ఇచ్చట విష్ణుపాదముల రూపముతో శ్రీమహావిష్ణువు కొలువైయున్నాడు. ఈ క్షేత్రములో మంగళగౌరీదేవి అమ్మవారి శక్తి పీఠమున్నది.

**2. నాభిగయ:** ఇది ఒరిస్సా రాష్ట్రములోని కటక్ పట్టణమునకు దగ్గరలో గల జాజిపూర్ అను ప్రదేశములో గలదు. ఇచ్చట యజ్ఞవేదికా రూపముతో బ్రహ్మదేవుడు కొలువైయున్నాడు. ఈ క్షేత్రములో గిరిజాదేవి అమ్మవారి శక్తి పీఠమున్నది.

**3. పాదగయ:** ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం అను ప్రదేశమున ఉన్నది. ఇక్కడ కుక్కుటేశ్వరస్వామి రూపమున స్వయంభువుగా ఈశ్వరుడు కొలువైయున్నాడు. ఇచ్చట పురూహూతికాదేవి అమ్మవారి శక్తి పీఠమున్నది.

ఈ పై మూడింటితో బాటు పితరులకు ముక్తినొసగే మరిరెండు క్షేత్రములు కూడ ఉన్నవి. అవి గుజరాత్‌లోని సిద్ధపూర్ నందు గల మాతృగయ మరియు ఉత్తరాంచల్ రాష్ట్రములోని ప్రసిద్ధ బదరీనాథ్ క్షేత్రమందు గల బ్రహ్మకపాలము.

గతించిన పిత్రు దేవతలు తమకు గయా శ్రాద్ధం జరగాలని నిత్యం ఎదురుచూస్తారట. కాబట్టి ఏదైనా గయ యందు శ్రార్ధకర్మ చేయడం తమ విధిగా వారి వారసులు గుర్తెరగాలి.

పీఠికాపురక్షేత్రమును కృతయుగమున బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, త్రేతాయుగమున శ్రీరాముడు ద్వాపర యుగమున వ్యాసుడు, కుంతీదేవితో బాటు పాండవులు కూడ దర్శించినారని శాసనములు తెలియజేయుచున్నవి. స్కాందపురాణమునందు గల భీమఖండములోని మూడవ అధ్యాయమందు వ్యాసమహర్షి పీఠికాపురమును ముప్పది ఆరు శ్లోకములతో ఆవిష్కరించినారు. అందులో ఉత్తరదేశమునందలి కేదారినాథ్‌తో సరిసమానమైన క్షేత్రముగా పిఠాపురమును అభివర్ణించారు. శ్రీనాథ కవిసార్వభౌముడు కూడ తాను తెలుగులో వ్రాసిన భీమేశ్వర పురాణమందు గూడ పీఠికాపుర విశిష్టతను తెలిపెను.

ఈ క్షేత్రమందుగల పూరూహూతికాదేవి శక్తి పీఠము ఎంతో మహిమగలిగినది. పూర్వము దక్షప్రజాపతి యజ్ఞమును నిర్వహింప సంకల్పించి, దేవతలనందర్ని ఆ క్రతువునకు ఆహ్వానించి, తన అల్లుడైన శివుని మరియు శివునిభార్య, దక్షుని

కుమార్తెయయిన సతీదేవిని పరాభవింపదలచి బుద్ధి పూర్వకముగా యజ్ఞమునకు ఆహ్వానింపక విస్మరించెను. పిలవని పేరంటమునకు పోవలదని శివుడు వారించిననూ, పుట్టింటిపై గల మమకారముతో సతీదేవి యజ్ఞమునకు పోయి, తన తండ్రిచే యజ్ఞవాటికయందు, దేవతలందరి ఎదుట అవమానింపబడెను. పరాభవమునకు తాళలేని సతీదేవి యజ్ఞవాటికయందే తన దేహాన్ని అగ్నికి ఆహుతి చేసెను. శంకరుడు ప్రళయకాలరుద్రుడై భద్రకాళీ సమేతముగా వీరభద్రుని సృష్టించి, యజ్ఞ వినాసనమునకు ఆజ్ఞాపించెను. శివగణములు యజ్ఞమును నాశనము గావించి, దక్షుని తలను నరికి హోమగుండములో పారవేసిరి. అటుపై శంఖరుడు మహాపతివ్రతయైన దక్షుని భార్య కోరిక మేరకు దక్షుని మొండెమును మేక తలకు అతికించి అతనిని బ్రతికించెను. దక్షుడు తన తప్పిదములకు శివుని క్షమాపణలు కోరి, యజ్ఞమును పూర్తికావించెను. దుఃఖితుడైన శంకరుడు, సతీదేవి మృత కళేబరమును నెత్తిన ఎత్తుకుని, విరాగియై లోకములందు సంచరించసాగెను. శివునికి సతీదేవి వియోగము నివారించి, అతనిని కార్యోన్ముఖుని చేయుటకై, విష్ణుమూర్తి తన సుదర్శన చక్రముచే సతీదేవి మృత కళేబరమును ఖండించెను. ఆ మృత కళేబరము 108 భాగములుగా ఖండింపబడి ఒక్కొక్క భాగము ఒక్కొక్క ప్రదేశమున బడి ఆయా ప్రదేశములు అమ్మవారి శక్తిపీఠములుగా వెలసిల్లినవి. అందులో ముఖ్యాతిముఖ్యమైన దేహభాగములు 18 ప్రదేశములలో పడినట్లుగా గుర్తించి ఆయా ప్రదేశములందు అష్టాదశ శక్తి పీఠములు నెలకొల్పబడినవి. ఆయా పీఠములందు అమ్మవారికి విశేషపూజలు జరుగుచున్నవి. అమ్మవారి ప్రధాన పీఠభాగమైన పిరుదులు పడిన ప్రదేశమే పీఠికాపురముగాను అక్కడ అమ్మవారు తొలుత పీఠాంబికగా ప్రసిద్ధినొందారు. అటు పిమ్మట అమ్మవారు ఇంద్రునిచే శ్రీవిద్యోపాసన గావింపబడి అతనిని అనుగ్రహించినది. ఇంద్రునికి 'పురోహూతు' అను నామధేయము గలదు. పురోహూతునిచే పూజింపబడి, అతనిని అనుగ్రహించిన మాత 'పురుహూతికా దేవి' అను పేరుతో ప్రసిద్ధిగాంచినది. ఆనాటి నుండి పీఠికాపురమందు వెలసిన అమ్మవారు అనేకమందిచే పూజింపబడినది.

ఈ పాదగయాక్షేత్ర ఆలయ సముదాయములలో స్వయంభూదత్తుని ఆలయము గూడ గలదు. సాధారణముగా అన్ని దత్తక్షేత్రములలో దత్తుని పాదుకలే దర్శనిమిస్తాయి. కాని ఈ ఆలయంలో విగ్రహరూపంలో స్వయంభూదత్తుడు దర్శనమివ్వ దం చాలా విశేషం. ఈ ఆలయము ప్రక్కనే మహిమాన్వితమైన మూడు కొమ్మలు గల ఔదుంబర వృక్షము గలదు. ఏ చెట్టు అయిన పువ్వులు పూస్తుంది. ఆ పువ్వులే కాయలుగా మారతాయి. కాని ఈ ఔదుంబర వృక్షం పూలు లేకుండా కాయలు కాయడం ఎంతో ఆశ్చర్యకరము. దత్తుని పాదాలు ఔదుంబర వృక్షం కింద ప్రతిష్ఠింపబడినవి. శ్రీవల్లభులు పీఠికాపురము నందు చాలాసార్లు ఈ స్వయంభూదత్తుని ఆలయాన్ని సందర్శించారు. వృక్షము క్రింద వల్లభుల విగ్రహం కలదు.

ఇంద్రుడు తనను ఆవహించిన బ్రహ్మహత్యా దోషము పోవుటకై అయిదు ప్రసిద్ధ క్షేత్రములలో విష్ణుమూర్తిని ప్రతిష్ఠించాడు. వానిలో పిఠాపురమొకటి. ఇక్కడి స్వామిని కుంతీమాధవునిగా పిలుస్తారు. ఈ స్వామి కృతయుగమున ప్రతిష్ఠింపబడి, దేవేంద్రునిచే పూజలందుకుని, త్రేతాయుగమున శ్రీరామునిచే పూజింపబడి, ద్వాపర యుగమున పాండవమాతయైన కుంతీదేవిచే అర్చింపబడినాడు. కుంతీదేవి అర్చించిన మాధవుడు కుంతీమాధవునిగా ప్రసిద్ధిపొందినాడు. ఈ ఆలయం 1195వ సంవత్సరం నాటి ప్రాచీన దేవాలయమని శాసనాలు తెలుపుచున్నవి. ఈ దేవాలయాన్ని నేడు మాధవస్వామి దేవాలయంగా పిలుస్తారు. ఈ దేవాలయం పిఠాపురంలో వేణుగోపాలస్వామి ఆలయమునకు వెనుక వీధిలో, శ్రీవల్లభుల సంస్థానమునకు చేరువలో గలదు.

ఇక, పీఠికాపురమందు ప్రవహించుచున్న ఏలానదిని మరొక గంగానదిగా పేర్కొనవచ్చు. ఏలా మహర్షి ద్వారా ఏర్పడిన ఈనదికి ఏలానదిగా పేరువచ్చెను. పూర్వము ఏలామహర్షి అను గొప్ప ఋషీశ్వరుడు శివుని గూర్చి తపస్సుచేయగా, అతని తపస్సును అప్సరసలు భగ్నము చేసిరి. ఆ పాపము పోగొట్టుకొనుటకై మరొకసారి శివుని గూర్చి కఠోర తపస్సు చేసి, మెప్పించి, శివుని జటాజూటమందున్న గంగయందు స్నానమాచరించి తన పాపములను పోగొట్టుకొనెను. తన పేర గంగను భూలోకమందు ప్రవహింపచేసి, ఆ నదిని సాగరసంగమం చేయించాలనే సంకల్పంతో ఆ మహర్షి శివుని వర మర్థించెను. అందుకు అంగీకరించిన శివుడు తెల్లవారుఝామున కోడికూత వినబడునంత వరకూ, ఈ గంగ నీవెంటనే కిమ్మెరసీమ ద్వారా ప్రవహించునని, నీవెక్కడ ఆగిపోతే అక్కడే ఈ ప్రవాహము కూడ ఆగిపోవునని తెలిపెను. అంత మహర్షి గంగను తన వెంట తీసుకునివస్తూ, సాగరసంగమం చేయని ఏ నదీ గూడ భర్తలేని స్త్రీ వంటిదని,

పవిత్రకార్యములు చేసుకొనుటకు పనికిరాదని తలచి, ఏలా మహర్షి వడివడిగా నడుస్తూ, సాగరతీరం చేరాలనే ఆశతో ముందుకు సాగుచుండెను. కాని పిఠాపురము చేరేసరికి కోడికూత మహర్షికి వినబడెను. తెల్లవారినదని తలచి ఆ మహర్షి ఆ ప్రాంతమందే ఆగిపోయెను. అందువల్ల ఆ నది కూడ అక్కడే ఆగిపోయి పాదగయాక్షేత్ర తీర్థములో కలసిపోయినది.

సాగరసంగమం చేయని నది, పిండ ప్రదానములు మొదలయిన పిత్రుకార్యములకు, పవిత్ర స్నానములకు పనికిరాదని తలచి ఏలా మహర్షి విచారిస్తూ, కరుణించవలసినదిగా తిరిగి శివుని గూర్చి ప్రార్థించెను. అంత శివుడు ప్రత్యక్షమై, గయాసురుని పాదములతో, పాదగయగా విరాజిల్లుతున్న ఈ పవిత్ర క్షేత్రంలో ప్రవహించిన ఈ నది గయా తీర్థ సంగమం వలన, సాగర సంగమం లేకపోయిననూ పవిత్రత, సార్థకత, సంతరించుకున్నదని ఇక్కడ చేసిన ఏ పవిత్ర కార్యములైననూ మిగిలిన నదులవలే అంతే ఫలితమిచ్చునని ఈ నది ఇక ఏలానదిగా ప్రసిద్ధినొందునని తెలిపి, పరమేశ్వరుడు అంతర్ధానమయ్యెను. శ్రీ వల్లభులకాలం నుండీ గూడ ఈ నది గలదు. ఎంతో ప్రాచీనమైన ఈ నదీమతల్లి, తనయందు పవిత్రకార్యములొనరించిన భక్తులను ఎంతో పునీతులను గావించుచున్నది.

ఈ పీఠికాపురము దాదాపు 14వ శతాబ్దము నుండీ గూడ పురాణేతిహాసములందు ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న మహిమాన్విత క్షేత్రం. కొన్ని శాసనాలలో దీని నామధేయం పిఠాపురం అని, శ్రీపీఠం అని, పురుహూతికాపురమని నామాంతరములు చెందియున్నది. శ్రీనాధకవి సార్వభౌముడు దీనిని పీఠకాపురం, పిఠాపురమని, పీఠాపట్టణమని, మూడు పేర్లతో తన భీమేశ్వర పురాణమందు పేర్కొనినాడు. క్రీ॥శ 210 వ సంవత్సరంలో ఆంధ్రరాజులైన శాతవాహనులు తమ పాలనలో పిష్టపురంగా ఈ ప్రదేశాన్ని పిలిచేవారు. వ్యాసమహర్షి గూడ దీనిని పీఠాపట్టణంగా పేర్కొనేవారు. ఏది ఏమైనా, ఈనాడు ఇది పిఠాపురంగా నామాంతరం చెందింది. సర్వలోక శుభంకరుడైన శంకరుడు లోక కల్యాణార్థము కోడిరూపము దాల్చి, ఇక్కడే స్వయంభూమూర్తిగా లింగరూపుడై కొలువున్నాడు. దీనిని ద్వాదశ జ్యోతిర్లింగాల క్షేత్రాలతో బాటు గోకర్ణక్షేత్ర సమక్షేత్రంగా గూడ భావించవచ్చు.

శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయమందుగల నందీశ్వరుడు ఏకశిలతో మలచబడిన శిల్పం. ఒకసారి గగన మండలం నుంచి భీమ మండలం దర్శిస్తూ, ఆగస్త్యమహాముని ఈ కుక్కుటేశ్వరాలయాన్ని చూసాడు. పీఠికాపురంలోని కుక్కుటేశ్వర స్వామిని దర్శించాలని వారి భార్య అయిన లోపాముద్ర సహితుడై బయలుదేరాడు. మార్గములో వారు వ్యాసభగవానుని కలిసారు. అప్పుడు ఆ ముగ్గురు కలసి గగన మండలం చేరి, అక్కడ నుండి పీఠికాపురాన్ని దర్శించుకున్నారని భీమేశ్వర పురాణంలో శ్రీనాధుడు తెలిపాడు.

కొన్ని దశాబ్దాల క్రితం ఎంతో కాలము హిమాలయాల్లో తపమాచరించిన ఒక వృద్ధస్వాములవారు, అనేక పుణ్యక్షేత్రములు దర్శించి, మార్గమధ్యమున పీఠికాపురాన్ని కూడా దర్శించారు. ఆ స్థల మహిమవల్ల ఆయన వేరొక క్షేత్రం దర్శించుటకు ఇష్టపడక, అక్కడే 12 సంవత్సరాలు తపమాచరించి, సమాధి అయ్యారు. తేజోవంతమైన ఈ కుక్కుటేశ్వరలింగమెంతో మహిమాన్వితమైనదని, శిరోభాగంలో ఈ లింగానికి బిల్వం కలిగియున్నదని, అది ఎంతో అరుదైన విషయమని, అందువలననే ఆ లింగము ఎంతో ప్రాశస్త్యము గల్గియున్నదని, ఆ వృద్ధస్వాములవారు తన భక్తులకు తెలిపెడివారు. దీనినిబట్టి పీఠికాపురమెంత గొప్పక్షేత్రమో గ్రహించవచ్చు.

అలా, ద్వాదశ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా నిలచిన ఈ పిఠాపురం, ఎంతో చరిత్ర ప్రసిద్ధమైన పురాణేతిహాస విఖ్యాతి నొందిన క్షేత్ర రాజం. త్రిగయల్లో పాదగయ, శైవక్షేత్రాలలో కుక్కుటేశ్వరం, పంచమాధవములలో కుంతీ మాధవము, అష్టాదశ శక్తి పీఠాల్లో ప్రధానమైన పురుహూతికా పీఠం, గంగానదితో సమానమైన ఏలానది గల మహా మహిమాన్విత పుణ్యక్షేత్రం. అన్నింటికంటే శ్రీపాద శ్రీవల్లభుల పాదస్పర్శతో 16 సంవత్సరాలు పునీతమైన పావన పవిత్రక్షేత్రము.

స్వారోభిషమన్వంతరమందు త్రేతాయుగములో భరద్వాజమహాముని ఆధ్వర్యంలో సవితృకాఠకచయనమనెడి మహాయజ్ఞమును సప్తఋషులు ఈ పీఠికాపురమునందే నిర్వహించిరి. ఆనాటి హోమభస్మము మహాపర్వతము వలే పేరుకొని పోయినది. ఆ భస్మమును హనుమంతుడు స్వర్గ, మర్త్య పాతాళములకు తీసుకొనివెళ్లెను. హనుమంతుడు ఆ భస్మమును హిమాలయములకు తరలించు సమయమున కొంతభాగము గంధర్వపురము (గాణుగాపురము) నందుపడి భీమ అమరజా అను సంగమము అచ్చట మేర్పడినది. ఈ సవితృకాఠకచయనమహాహోమ ప్రభావము వల్లే శ్రీవల్లభులు

పీఠికాపురమందు జన్మించిరి. వారు తదుపరి నృసింహసరస్వతి అవతారములో హోమభస్మముపడిన గంధర్వపురంలో సంగమప్రాంతమందు నివసించిరి.

ఈనాడు పిఠాపురంలో రెండు మహిమాన్విత దత్తక్షేత్రాలున్నాయి. మొదటిది స్వయంభూదత్తుడు వెలసిన పాదగయాక్షేత్రం. పాదగయా క్షేత్రం వద్ద కుక్కుటేశ్వరస్వామి ఆలయప్రాంగణంలో గల ఆలయ సముదాయాలలో స్వయంభూదత్తుని ఆలయమొకటి. రెండవది శ్రీపాద శ్రీవల్లభులు మాతామహుల గృహం. దత్తావతారులైన తెంబేస్వామి అని పిలువబడే వాసుదేవానందసరస్వతిస్వామి తమ ఆంధ్రదేశ పర్యటనలో పిఠాపురంలోనే శ్రీపాదశ్రీవల్లభులు జన్మించారని ధృవీకరించారు. వారు తెలియజేసేవరకూ ఈ విషయం ఆ ప్రాంతవాసులెవరికీ తెలియకపోవుట ఆశ్చర్యం. శ్రీపాద శ్రీవల్లభులు జన్మించినట్లుగా చెప్పబడుతున్న వారి మాతామహుని గృహమందు శ్రీపాదులవారి పాదుకలు శ్రీ సజ్జనగడ రామస్వామిగారు ప్రతిష్టించి, అక్కడ శ్రీవల్లభుల, దత్తాత్రేయుల, నృసింహసరస్వతుల విగ్రహ ప్రతిష్ఠాపన చేసి ఆలయము నిర్మించిరి. అది ఈనాడు శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానముగా రూపుదిద్దుకొని అశేష జనవాహినిని ఆకర్షించుచున్నది. అందువల్ల స్వయంభూదత్తుని ఆలయం వేరు, వల్లభుని ఆలయం వేరని సందర్శకులు గుర్తించాలి.

శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానముపట్ల తొలిరాజుల్లో కొంత సంశయాత్మకత చోటుచేసుకున్నది. ఇది స్వయంభూదత్త దేవాలయ ప్రాంగణమేనని ఒక వర్గము, కాదని మరో వర్గము తరచు వాగ్వివాదమునకు దిగుచుండిరి. శంకరభట్టు రచించిన శ్రీవల్లభుల చరిత్ర తెలుగు అనువాద ప్రతి వెలుగులోకి వచ్చిన పిదప ఈ సంశయమునకు తెరపడినది. ఈ రెండూ వేర్వేరు ప్రదేశములుగా గుర్తించిరి. శ్రీవాసుదేవానంద సరస్వతి వారు కూడ శ్రీవల్లభుల జన్మస్థలమును గుర్తించి, ఆ గ్రామస్థులకు చూపించారు. ఇంతియేకాకుండా శ్రీపాదులవారు తమ మాతామహుని ఇంట పిఠాపురములోనే జన్మించినారని శ్రీవేదవ్యాసమహర్షి విరచిత దత్తచరిత్ర వ్రాతప్రతి నుండి తెలియుచున్నది. ఆ వ్రాతప్రతి ప్రకారం దత్తుడే స్వయంగా కుక్కుటేశ్వర ఆలయమందు స్వయం భూదత్తునిగా కొలువైయున్నారని, అందు స్వయంభూదత్తుడు అమృతకలశ ధారిగా నాలుగు చేతులతో, మూడు ముఖములతో ఉన్నాడని, ఆ ఆలయప్రదేశమందే దత్త జననమునకై సవితృకాఠకచయనమను మహాయజ్ఞము సప్తఋషులచే నిర్వహింపబడినదని తెలిపెను. వారి మాతామహులు గూడ కుక్కుటేశ్వరఆలయమునకు ఆనుకునియుండు ప్రదేశములో దత్తజననమునకై అనేక యజ్ఞములు చేసిరనియూ, దాని ఫలితముగానే దత్తుడు వారి మాతామహుల ఇంట అందరి భ్రమలు తొలగించి, వారి తల్లి ఒడిలో ప్రత్యక్షమైనాడని కూడ దత్తుడు స్వయంగా తెలిపినట్లుగా ఆ వ్రాతప్రతి ధృవీకరించుచున్నది. ఏది ఏమైనా, ఈనాడు మనకు రెండు వేర్వేరు క్షేత్రములు పిఠాపురమునందే కొలువైయుండుట వలన, వ్రాతప్రతిలో విషయములు సత్యములుగా ధృవీకరించుకోవచ్చును. కావున భక్తులు తప్పనిసరిగా మీమాంసలు విడచిపెట్టి ఒకటి స్వయంభూదత్తుని ఆలయంగా, రెండవది శ్రీపాదవల్లభుని జన్మస్థలంగా భావించి వారిరువుని దర్శించి తరింపగలరు.

శ్రీపాదులవారి దర్శనార్థము ఎక్కువ మంది భక్తులు మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్ గుజరాత్ రాష్ట్రముల నుండి వస్తారు. ఆంధ్రప్రదేశ్ నందలి భక్తులకు ఈక్షేత్రమిప్పుడిప్పుడే ప్రస్ఫుటమగుచున్నది. అందువల్ల ఆంధ్రప్రదేశ్ నుండి భక్తుల తాకిడి ఈ క్షేత్రానికి అంతగా లేదు.

ముఖ్యంగా ఈ క్షేత్రంలో స్వయంభూదత్తుని రూపంలో దత్తాత్రేయుడు కొలువై యుండుటయేగాక శ్రీవల్లభుల రూపంలో దత్తాత్రేయుడే తిరిగి అవతరించి ఈ ప్రాంతాన్ని మహామహిమాన్విత పుణ్యక్షేత్రంగా మలచాడు.

**శ్రీపాదరాజం శరణంప్రపద్యే**

అధ్యాయం-5

# శంకరభట్టు

శ్రీపాద శ్రీవల్లభులవారి సంపూర్ణ చరిత్రను తొలుత సంస్కృతములో 13వ శతాబ్దంలో వ్రాసిన శంకరభట్టు కన్నడ బ్రాహ్మణుడు. ఇతడు 1336వ సంవత్సరములో ఉడుపి క్షేత్రమున శ్రీకృష్ణుని దర్శించి, అచ్చట నుండి కన్యాకుమారికి చేరుకుని శ్రీ కన్యకాపరమేశ్వరీదేవిని దర్శించెను. ఒక రోజు ఆలయములో దేవి పూజ జరుగుతుండగా తదేక దీక్షతో దేవిని ధ్యానిస్తున్న శంకరభట్టుకు, అతని జీవనసాఫల్యం కొరకై కురువపురములోనున్న శ్రీపాదవల్లభుని దర్శించవలసినదిగా దేవి ఆదేశించెను. దేవి ఆదేశం ప్రకారము శంకరభట్టు కురువపురమునకు బయలుదేరెను.

శంకరభట్టు దారిలో 'మరుత్వమలై' అను గ్రామమును సందర్శించెను. హనుమంతుడు లక్ష్మణుని మూర్ఛ సందర్భంగా తెచ్చిన సంజీవినీ పర్వతమును తిరిగి హిమాలయములకు చేర్చునపుడు, ఒకముక్క పర్వతము నుండి జారిపడెను. ఆ ప్రాంతము మరుత్వమలై అను తపోభూమిగా ప్రసిద్ధినొందినది. అక్కడ శంకరభట్టు ఒక దట్టమైన గుహ లోనికి పోగా అతనికి ఒక పెద్దపులి దర్శనమిచ్చెను. ఆ పెద్దపులిని చూచి భయభ్రాంతుడైన శంకరభట్టు శ్రీపాద శ్రీవల్లభుల నామధేయమును స్మరించుచుండెను. ఆపెద్దపులి సాధు జంతువువలె నిశ్చలముగా నుండెను. ఇంతలో ఆ గుహలోనుండి ఒక వృద్ధుడైన మహాముని బయటకు రాగా, శంకరభట్టు వారికి నమస్కరించెను. ఆ వృద్ధముని శంకరభట్టును ఆశీర్వదించి, వల్లభుల దర్శనభాగ్యం కలుగునని దీవించెను. శంకరభట్టుతో ఆ మహాముని గుహ బయటనున్న పులి మహాజ్ఞాని అని, వారికి కూడా నమస్కరింపమని తెలిపెను. శంకరభట్టు ఆ పెద్దపులికి నమస్కరించగానే, ఆ పెద్దపులి వింతగా "శ్రీపాద రాజం శరణం ప్రపద్యే" అంటూ గాండ్రించినది. ఇంతలో ఆశ్చర్యకరంగా ఆ పెద్దపులి ఒక దివ్యపురుషునిగా మారి, ఆ మహామునికి నమస్కరించి ఆకాశమార్గమునకు ఎగిరి ఎటో వెడలిపోయెను. అప్పుడు శంకరభట్టు ఆ మహామునిని, జ్ఞాని అని తెలిపిన ఆ పెద్దపులి ఎవరని అడిగెను. అంతట ఆ మహాముని, ఆంధ్రదేశమునందు తూర్పుగోదావరి జిల్లాలో గల ఆత్రేయపురమునకు చెందిన వ్యాఘ్రేశ్వరశర్మ అను బ్రాహ్మణుడు విద్యావిహీనుడై సంచరించుచూ, శ్రీపాద శ్రీవల్లభులు స్వప్న దర్శనంలో ఇచ్చిన ఆదేశం మేరకు, సిద్ధపురుషుల దర్శనము కోరి బదరీనాథ్ చేరెనని, అతడు అచట ఒక మహాత్ముని ఆనతి ప్రకారం తపస్సు చేసెనని. తన పేరు వ్యాఘ్రేశ్వరుడు గావున తన ఆత్మ వ్యాఘ్రము (పెద్దపులి) కావలెనని కోరుతూ తపస్సు చేయుట వలన అతడు వ్యాఘ్రరూపమును పొందెనని. ఆ రూపముతోనే తమ ఎదుట గుహ ముందు నిలిచి, అటుపై ఆకాశమార్గమున అతడు శ్రీపాద శ్రీవల్లభుల దర్శనార్థము కురువపురము పోయెనని ఆ మహాముని తెలిపెను. ఇంకా, ఆ మహాముని తన దివ్యదృష్టితో చూచి, ఆ జ్ఞాని తిరిగి వ్యాఘ్రరూపము ధరించి కురువపురం చేరెనని, ఆ వ్యాఘ్రమును శ్రీవల్లభులు ఆశీర్వదించి, ఆ వ్యాఘ్రమును అధిరోహించిరని, వ్యాఘ్రముపై వచ్చుచున్న శ్రీపాద వల్లభులు అయ్యప్పస్వామిగా కొందరికి, వ్యాఘ్రమును అధిరోహించిన జగన్మాతగా కొందరికి గోచరించినారని, తదుపరి ఆ వ్యాఘ్రము నుండి శ్రీపాదుడు కిందికి దిగగానే ఆ వ్యాఘ్రము మరణించి, మోక్షమును పొందెనని తెలిపెను. చివరి నిమిషంలో వ్యాఘ్రేశ్వరుడు శ్రీవల్లభులను తనివితీరా దర్శించి తన మరణానంతరం తన వ్యాఘ్ర చర్మమును ఆసనంగా ఉపయోగించి అనుష్ఠానం చేసుకోనవలెనని శ్రీవల్లభులను కోరెనని, ఆతని కోర్కెను శ్రీవల్లభులు మన్నించిరని, సిద్ధపురుషుని నుండి శంకరభట్టు తెలుసుకొనెను. పిమ్మట వారి వద్ద శలవుగైకొని, దారిలో అనేక పుణ్యక్షేత్రములు దర్శించుచూ, అయాచితముగా వల్లభుల దయతో సమకూడుతున్న భిక్ష స్వీకరిస్తూ, పాండ్య దేశమునందు గల కదంబవనం చేరి శ్రీసిద్ధేంద్రయోగి అను మహాత్ముని దర్శించెను. అచ్చట వారి ఆదేశానుసారము మధురానగరమందు విలసిల్లిన శ్రీమీనాక్షి సుందరేశ్వరుల ఆలయమును దర్శించెను. ఆ ఆలయమందలి శివలింగము, తపస్సు చేయుచున్న ఒక రాక్షసుని చంపిన పాపము పోవుటకై ఇంద్రుడు ప్రతిష్ఠించిన స్వయంభూలింగమని శ్రీసిద్ధేంద్రయోగి తెలిపెను. ఇంకా, దేవేంద్రునిచేత ప్రతిష్ఠింపబడిన సుందరేశ్వరుడనబడే

ఈ శివలింగము యొక్క ఉనికిని ధనుంజయుడను వ్యాపారి ద్వారా తెలుసుకున్న ఆ దేశపురాజు కులశేఖరపాండ్యుడు, అక్కడ ఒక నగరమును నిర్మించి దానికి మధురానగరమని పేరు పెట్టాడని, అతని కుమారుడైన మలయధ్వజపాండ్యుడు సంతానప్రాప్తికై పుత్రకామేష్టియాగము చేయగా, మీనాక్షీదేవి అయోనిజగా ఆ యాగము నుండి బయల్వెడలెనని, మీనాక్షి దేవికి, శ్రీ సుందరేశ్వరస్వామితో శ్రీ మహావిష్ణువు కల్యాణము జరిపించెనని ఆ యోగిపుంగవుడు శంకరభట్టునకు వివరించెను. మధురానగరమందు ప్రవహించుచున్న వేగవతీనది శివుని జటా జూటము నుండి వెలువడినట్లుగా కూడ తెలిపెను.

ఇంతటి మహాత్మ్యమునకు కారణభూతుడైన ధనుంజయుడను వ్యాపారి తదుపరి జన్మలో ఆంధ్రదేశమందు గల బృహత్ శిలానగరమునకు (పెనుగొండ) రాజుగా జన్మించి, కుసుమశ్రేష్ఠి అను పేరు కలిగియుండెను. జగన్మాత అయిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిని తన బిడ్డగా పొందెను. విరూపాక్షుడను పేరుతో నందీశ్వరుడు ఆమెకు సోదరునిగా జన్మించెను. శ్రీ వాసవీ దేవిగా పేరొందిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి శ్రీ పాదవల్లభులకు సోదరియన్నది దైవరహస్యము. ఇది ఎంతోమందికి తెలియని విషయము. ప్రతి శ్రావణ పూర్ణిమా దినమున వాసవీదేవి శ్రీపాద శ్రీవల్లభులకు రక్షాబంధనము గావించును. కావున ఆరోజు దత్త దర్శనము చేసిన వారు మంచి ఫలములు పొందెదరని శ్రీసిద్ధేంద్ర యోగి తెలిపెను. వారి వద్ద శెలవు తీసుకుని శంకరభట్టు కురువపురముపోవుటకు ముందుకుసాగెను.

అటుపిమ్మట, శంకరభట్టు మార్గమధ్యమున ఒక కొండజాతి వారుగల ఒక గూడెమును చేరెను. వారిచ్చిన పుట్టతేనె, పండ్లు తినబోవునంతలో ఎక్కడ నుండియో కాకుల సమూహము వచ్చి అతనిని పొడవనారంభించినవి. భయముతో పరిగెత్తి, ఆ కాకులను తప్పించుకొని, ధారలుగా రక్తము కారుతూ, వాసనకొడుతున్న శరీరముతోనే, శంకరభట్టు ఒక మేడి చెట్టు కింద చేరినాడు. చిత్రమేమోగాని, అక్కడ అతడు పాము కాటుకు గురియయ్యెను. పాము కాట్లవల్ల నురగలు క్రక్కుతూ విషపూరితమై మరణావస్థలో పడి ఉన్న అతనిని ఆ మార్గమున వెళుతున్న కొందరు రజకులు చూచి, ఒక గాడిదపై ఆయనను కూర్చుండబెట్టి సమీప గ్రామమునందున్న ఒక వైద్యుని దగ్గరకు తీసికొనివెళ్లిరి. ఆ వైద్యుని పేరు వల్లభదాసు, విష సంబధవైద్యము తెలిసిన ఒక చర్మకారుడు. అతడు కొన్ని పసరులను త్రాగించి, ఆకులు గాయములపై కట్టి శంకరభట్టుకు స్వస్థత చేకూర్చెను. వల్లభదాసు శ్రీ పాదవల్లభుని భక్తుడు. అతడు 'దత్త దిగంబరా–శ్రీపాద వల్లభ దిగంబరా' అను సంకీర్తనము నిర్విరామముగా చేయుచుండెను. అతడొక వేదాంతివలే శంకరభట్టుకు గోచరించెను. తనకు ఈ దురవస్థ కలుగుటకు కారణమేమని ప్రశ్నించిన శంకరభట్టుతో వల్లభదాసు, శ్రీపాదవల్లభుని యొక్క తత్త్వమును గ్రహించలేక వారిని నిందించి, విమర్శించిన పీఠికాపురవాసులైన మహాపండితులు, మరణానంతరము స్వర్గలోకమునకు పోయిరి. వారికి స్వర్గలోకమున అన్ని సౌఖ్యములు ఇంద్రాది దేవతలు సమకూర్చిరి గాని, వారికి ఆహారము మాత్రము ఇవ్వలేదు. ఆకలి దప్పులతో మాడుచున్న ఆ మహాపండితులతో భూలోకమునందున్నప్పుడు అన్నదానము చేయని కారణమున, వారికి స్వర్గలోకమున ఆహారమీయబడలేదని ఇంద్రుడు తెలిపెను. వేదోచ్చారణ కేవలము ఇతర సౌఖ్యములీయ గలదు గాని ఆహారమివ్వలేదని ఆతడు చెప్పెను. దీనితో బాటు పీఠికాపురమునందు గల పాదగయా క్షేత్రమునందు పితృదేవతలకు శ్రాద్ధకార్యములు నిర్లక్ష్యముగా, శ్రద్ధలేకుండా చేయుట కూడ ఈ దురవస్థకు మరొక కారణమని కూడ ఇంద్రుడు తెలిపెను. కావున వారు సద్గతి పొందవలెనన్న, శాప విమోచనము కావలెనన్న శ్రీపాదవల్లభుల భక్తుని యొక్క రక్తమును కాకిరూపమున త్రాగినచో విముక్తులగుదురని వారికి ఇంద్రుడు తెలిపెను. కావున వారు కాకి రూపమున నీ రక్తము పానము చేసినారని వల్లభదాసు శంకరభట్టుకు తెలిపెను. అంత శంకరభట్టు పాము రూపంలో తనను కరచినదెవరని ప్రశ్నించెను. మీ పితృదేవతలలో కొంతమంది, కొందరిని మంత్ర ప్రభావము చేత చంపిన కారణముగా వారు సర్పజన్మము ఎత్తినారు. వారు ఆ సర్పజన్మవిముక్తి కోసము వల్లభభక్తుడవైన నిన్ను కాటువేసినారని తెలిపెను. దీనితో బాటు నీవు చిన్నతనములో విష్ణుమూర్తి ధ్యానశ్లోకమయిన 'శుక్లాంబరధరం' అను శ్లోకానికి వ్యంగ్యార్థములు చెప్పిన పాపానికి గూడ ఈ శిక్ష వేయబడినది. కావున మానవుడు జాతి, కుల, ధనిక, పేద అనెడి బేధములను మరచి ధర్మమునకు తగినట్లుగా కర్మలను సలుపచుండవలెనని లేనిచో దురవస్థలకు లోనగునని వల్లభదాసు పలికెను. చర్మకారుడైననూ ధర్మశాస్త్రములు, దైవరహస్యములు తెలిసిన అతనికి శంకరభట్టు నమస్కరించి, అటుపిమ్మట అతని నుండి శలవుగైకొని కురువపురానికి ప్రయాణం కొనసాగించెను.

అక్కడ నుండి విచిత్రపురం చేరిన శంకరభట్టుకు అక్కడి పరిస్థితులు వింతగా కనబడెను. ఆ రాజ్యపురాజు సంతానము కొరకు యజ్ఞములు చేయగా ఒక మూగకుమారుడు జన్మించెను. యజ్ఞములు శాస్త్రప్రకారము జరిపించనందున తనకు మూగకుమారుడు కల్గినాడని, రాజు బ్రాహ్మణులపై కోపించి, తనరాజ్యములోని బ్రాహ్మణులపై వింత ప్రశ్నలు సంధించి, సరియయిన సమాధానములు చెప్పలేదనే నెపంతో ఆయా బ్రాహ్మణులను రకరకాలుగా బాధించుటయే గాక, తన రాజ్యములో ప్రతీవారు తమ తమ పొలములలో తోటకూరను మాత్రమే పండించి, తోటకూరను మాత్రమే ఆహారముగా స్వీకరించవలెనని శాసించెను. రాజు కూడా తోటకూరను విరివిగా దానము చేసెడివాడు. గత జన్మలో విరివిగా తోటకూరను బ్రాహ్మణులకు దానము చేయుటవలన ఈ జన్మలో రాజువయితివని, సకలభోగములు కలుగుచున్నవని ఒక జ్యోతిష్కుడు రాజుకు తెలిపెను. వచ్చే జన్మలో ఇంతకంటే భోగభాగ్యాలను ఆస్వాదిస్తూ మహారాజు కావాలని తలంపుతో విరివిగా రాజు తోటకూరను అందరికీ దానము చేయుచుండెడివాడు. జనులందరూ రాజుకు చెల్లించు పన్నులలో సగభాగము తోటకూర రూపంలో చెల్లించాలని శాసించెను. ఆ తోటకూరనే అతడు దానము చేసెడివాడు. ఆ రాజ్యములో సంచరించుచున్న బ్రాహ్మణుడైన శంకరభట్టుని గూడ రాజభటులు, పట్టుకొని రాజువద్దకు తీసికొనిపోయిరి. శ్రీపాదవల్లభుని స్మరిస్తూ, రాజుగారి వింతప్రశ్నలకు శంకరభట్టు అనాలోచితముగా సరిపడు సమాధానములు ఇచ్చి రాజుగారి మన్ననలను బడసెను. శ్రీ వల్లభుని దయవలన రాజకుమారునికి మూగతనము పోయి మాటలువచ్చెను. అంతట రాజు శంకరభట్టుతో బాటు అతనికి తన నగరములో ఆశ్రయమిచ్చిన మరో బ్రాహ్మణుని కూడ స్వర్ణముతో సత్కరించెను. ఆ రాజువద్ద గల బ్రాహ్మణులలో ఒకడైన మాధవనంబూద్రి అనునాతడు శ్రీవల్లభునిదర్శనము కోరి శంకరభట్టు వెంట కురువపురానికి పయనమయ్యెను.

అచ్చట నుండి వారు చిదంబరం వైపునకు ప్రయాణము చేసి అచ్చట పళనిస్వామి అను శ్రీవల్లభభక్తుడైన, 300 సంవత్సరములు వయస్సు గలిగిన ఒక మునిపుంగవుని కలిసినారు. స్వామి శ్రీవల్లభుల గుణగణములను వారికి వివరించిరి. మానవ శరీరముతో పీఠికాపురమున అవతరించుటకు ముందే అనగా 108 సంవత్సరాలకు పూర్వమే శ్రీవల్లభులు ఆ ప్రదేశములో వారికి దర్శనమిచ్చిరని పళనిస్వామి తెలిపెను. అటుపిమ్మట స్వామి వారితో తాము పదిరోజులు తపస్సు చేసికొనెదమని, తపస్సమాధి నుండి బయటకు వచ్చేవరకు ఇతరుల నుండి తమ తపస్సుకు భంగము వాటిల్లకుండా చూడవలసినదిగా ఆజ్ఞయిచ్చిరి. వారు తపస్సు ప్రారంభించిన తరువాత, వంట చేసుకొనుటకై, కట్టెలు సమకూర్చుకొనుటకు బయటకు వెళ్లిన నంబూద్రిని పాముకరవగా అతడు మరణించెను. స్వామి వారికి తపో భంగము కలుగకూడదని, నంబూద్రి శవమును దగ్గరలోనే శంకరభట్టు దుఃఖించుచూ సమాధి చేసెను. పదిరోజులు గడచిన పిమ్మట, స్వామి తపస్సమాధి నుండి బయటకు వచ్చి, జరిగినది తెలుసుకుని, శ్రీపాదవల్లభులను స్మరించి, నంబూద్రి శవమును బయటకు తీయించి తన తపఃశక్తితో అతనిని తిరిగి బ్రతికించెను. పునర్జీవితుడైన నంబ్రూది శంకరభట్టుకు, పళనీస్వామిలకు తాను సూక్ష్మ శరీరముతో ఈ పది రోజులు శ్రీపాదులవారి సన్నిధిలో కురువపురమున గడిపితినని తెలిపెను. అటుపిమ్మట వారిరువురూ కొంతకాలము పళనీస్వామి సేవలో అక్కడే ఉండిరి.

ఒక పర్యాయము పళనీస్వామి ఆదేశంతో, వారు ముగ్గురు ధ్యానము చేసి, ధ్యానములో తమకు కల్గిన అనుభవములు చర్చించ సంకల్పించి, శుక్రవారం అనగా 3-5-1336వ తేదీని ధ్యానస్థులైరి. ధ్యానము నుండి వారు కొంతకాలము తరువాత తేరుకుని ప్రకృతిలోనికి వచ్చినారు. ముందుగా పళనిస్వామి తమ అనుభవము ఈ క్రింది విధముగా తెలియచేసెను. తాను సూక్ష్మశరీరముతో (ఆత్మను శరీరముగా చేసికొని మనోవేగముతో ప్రయాణించుట) కురువపురములోని శ్రీపాదుని సన్నిధిని చేరుకుంటిననియూ, ఆ గ్రామమందు గల వారి మఠము నందు శ్రీవల్లభస్వామి భక్తుడైన శివశర్మ అను బ్రాహ్మణుడు తనకు మందబుద్ధి కల్గిన ఒకే ఒక కుమారుడున్నాడని, అతనిని ఉద్ధరించి, తనను రక్షించవలసినదిగా ఆ శివశర్మ శ్రీవల్లభుని వేడుకుంటున్నాడని తెలిపారు. అతని విన్నపము మిక్కిలి దయతో విన్న శ్రీపాదులవారు అతనితో నీ కుమారుడు పూర్వజన్మకర్మ విశేషమున మందబుద్ధి కలవాడయ్యెనని, నీ కోరిక ప్రకారము అతనిని యోగ్యుడైన పండితునిగా చేయవలెనన్న, నీవు నీ జీవితమును త్యాగము చేయవలసియున్నదని తెలిపెను. దానికి వృద్ధుడైన శివశర్మ తన జీవితమును త్యాగము చేయుటకు అంగీకరించి, తన కుమారుని యోగ్యునిగా చేయమని

శ్రీపాదులవారిని కోరెను. అంతట శ్రీపాదులవారు అనతికాలములో నీవు మరణింపగలవని, నీ మరణానంతరము నీవు ధీశిలానగరము నందు ఒక నింబవృక్షము క్రింద గల భూగ్రుహంలో కొంతకాలము సూక్ష్మ దేహముతో తపమాచరించి, అటుపిమ్మట మరాఠదేశమునందు జన్మించగలవని తెలిపినారు. (ఈనాటి 'షిరిడీ' నే ఆనాడు 'ధీశిలా' నగరముగా వ్యవహరించెడివారు.) ఈ విషయము నీ భార్యకుగాని మరి ఎవరకూ తెలియనీయరాదని, ఇది దైవరహస్యమని శ్రీవల్లభులు హెచ్చరించిరి.

అటుపిమ్మట శ్రీపాదులువారు వెంటనే తమమఠమునకు చేరుకొని యోగాగ్నిని ప్రజ్వలింపచేసిరి. యోగాగ్ని నుండి వారి సోదరియగు వాసవీమాత, శ్రీనగరేశ్వరుడు, వారి తల్లిదండ్రులు, సోదరులు ఆవిర్భవించి, స్వామితో ముచ్చటించిరి. వారితో స్వామి 30 సంవత్సరముల వయస్సు వచ్చు వరకూ శ్రీపాద వల్లభులుగా ఉండెదమని, ఆ తదుపరి నృసింహసరస్వతి అవతారము దాల్చి సన్యాసిగా 80 సంవత్సరములు ఉండెదమని, ఆ తరువాత 300 సంవత్సరములు కదళీవనములో తపోనిష్టలో ఉండి ప్రజ్ఞాపురమున స్వామి సమర్థనామధేయముతో అవతారము పరిసమాప్తి చేసుకొనెదమని తెల్పిరి. యోగాగ్ని యందు ఆవిర్భవించిన వారందరూ అంతర్ధానమైన పిమ్మట 'జాన్' అను జర్మనీ దేశస్థుడు స్వామి వారిని దర్శించెను. జాన్ జర్మనీ భాషలో ప్రశ్నిస్తున్నా, శ్రీపాదులవారు తెలుగులోనే జవాబులు చెప్పేవారు. అతనికి తెలుగు బాగా అర్థమగునట్లు స్వామి అతనిని ఆశీర్వదించినారు. రాబోయే శతాబ్దాలలో తమ చరిత్ర జర్మనీ భాషలో గూడ వెలువడగలదని తెలిపిరి. ఇది అంతయూగాంచిన తాను, శ్రీవల్లభులను దర్శించి, పిమ్మట స్థూలదేహము ద్వారా వెనుకకు మరలితినని తన ధ్యాన అనుభవములను పళనీస్వామి వారిరువురికి తెలియజేసిరి.

అటుపై శంకరభట్టు ధ్యానములో అతనికి గోచరించిన విషయములు ఈవిధముగా తెలిపెను. అతనికి రాబోవు శతాబ్దములలో జరుగు కొన్ని సంఘటనలు కనపడినవి. ఆ సంఘటనలన్నీ విపులీకరిస్తే అది శ్రీ షిరిడీ సాయిబాబా ఆవిర్భావముగా గోచరించును. 13వ శతాబ్దములో గోచరించిన ఆ సంఘటనలు దాదాపు 1854వ సంవత్సరమునకు చెందినవిగా చెప్పుకోవచ్చు. తనకు 16 సంవత్సరముల వయసుగల్గిన ఒక యవనసన్యాసి 'అల్లాహ్‌మాలిక్' అనుకుంటూ వేపచెట్టు క్రింద కూర్చున్నట్లుగాను, అతడు కొంతమందితో తాను ముస్లిమననియు, మరికొందరితో బ్రాహ్మణుడననియు చెప్పుచున్నట్లుగా కనపడెను. అతడు ఇంకా ఆవేపచెట్టు తన గురుస్థానమనియు, గురు, శుక్రవారములలో అచట అర్చనచేసిన వారందరికి ఎంతో మేలు జరుగుననియు తెలుపుచుండెను. ఆ వేపచెట్టు క్రింద ఎవ్వరో త్రవ్వుచుండగా చిన్న గుహ కన్పించెను. అందులో నాలుగు వైపులా నాలుగు దీపములు వెలుగుచున్నట్లు, అది తన గురుస్థానమని, త్రవ్విన ఆ గుహను మూసివేయవలసిందిగా ఆ సన్యాసి తెలుపుచున్నట్లు గోచరించెనని తెలిపెను. షిరిడీసాయి 1854వ సంవత్సరంలో షిరిడీకి ఉత్తరంగా ఉన్న ఒక వేపచెట్టుక్రింద ఉండేవారని ఒక వృద్ధురాలు తెల్పింది. ఒకసారి ఆ చెట్టుక్రింద త్రవ్వితే ఒక గుహలో 4 దీపాలు పూజాద్రవ్యాలు కనిపించాయి. తాను ఇక్కడ 12 సంవత్సరాలు తపస్సు చేసానని, అది తన గురుస్థానమని బాలునిగా ఉన్న వయస్సులో సాయి చెప్పారు. వెంటనే ఆ గుహ మూయించారు. సాయి తన జన్మ రహస్యం, వంశపారంపర్యం ఏనాడు ఎవరికీ తెలుపలేదు.

శంకరభట్టుకు గోచరించిన విషయమును తన ధ్యానదృష్టితో విశ్లేషించి పళనిస్వామి ఇట్లు తెలిపెను. ఆ గుహ లోపల నీవు దర్శించిన నాలుగు నందా దీపముల మధ్య శ్రీవల్లభులు 12 సంవత్సరములు కఠోరతపమాచరించెననియు, వల్లభులు తపము ప్రారంభించినపుడు వారివద్ద 4 సంవత్సరాల వయస్సుగల ఒక యవన బాల సన్యాసి శిష్యునిగా చేరి, అతనికి 16 సంవత్సరాలు వచ్చువరకూ, గురువును సేవించెననియూ, బ్రహ్మములోని సర్వస్వమును 4 భాగములుగా విభజించి, వానిని నాలుగు దీపములుగా చేసి వాటి మధ్య శ్రీవల్లభులు తపమాచరించినారని, 12 సంవత్సరాల పిదప శ్రీవల్లభులు తమ తపము యొక్క ఫలమును ఆ యవనబాలసన్యాసికి ధారపోసినారని, కలలో చూచిన ఆ బాలసన్యాసి, వృద్ధరూపముననే భవిష్యత్తులో ప్రకటితమగునని తెలిపిరి. బ్రాహ్మణవంశమందు భరద్వాజస గోత్రములో జన్మించిన ఆ సన్యాసి, ఒక ముస్లింఫకీరు వల్ల ముస్లిం ధర్మములను, ఒక హిందూ మహాత్ముని ద్వారా హిందూ మత ధర్మములను తెలుసుకొని, వారణాసి చేరి క్రియాయోగము నేర్చుకొని దత్త చైతన్యములోనికి ప్రవేశించి ధీశిలానగరము చేరునని తెల్పెను. ఆ ముస్లిం సన్యాసిలో శ్రీవల్లభుల శక్తి ప్రవహించునని తెలిపెను. కొన్ని శతాబ్దాల అనంతరం ఇది జరుగగలదని తెలిపెను.

అటుపిమ్మట మాధవనంబూద్రి తనకు ధ్యానములో గోచరించిన విషయము తెలిపెను. ఇది గూడ శ్రీ షిరిడీసాయిబాబా జీవితమునందలి ఒక మహత్తర ఘట్టం. ఒక బ్రాహ్మణసన్యాసి, వేరొక ఆవేదపండితుడు వేదపండితునితో వారిచే తనకొసంగబడిన కొబ్బరికాయను ధీశిలా నగరంలోని ముస్లిం ఫకీరునకు పంపదలచినానని తెలిపెను. దానికి ఆ కొబ్బరికాయ ఆ ముస్లిం ఫకీరుకు కొన్ని కారణములవల్ల చేరదనియూ, అది వారిని చేరుటకు శ్రీ వల్లభుల ఆదేశము లేదని తెలిపెను. 13వ శతాబ్దములో ధ్యానము ద్వారా తెలుపబడిన ఈ సంఘటనలు 18వ శతాబ్దములో జరుగుట ఎంతో ఆశ్చర్యకరము. నిజానికి రాజమండ్రిలో తనను దర్శించిన దాసగణు అను షిరిడీసాయిబాబా భక్తునికి శ్రీ వాసుదేవానందసరస్వతి అను అవధూత ఒక కొబ్బరికాయ ఇచ్చి, దీనిని సాయికి అందజేసి, తన తమ్ముడిచ్చాడని చెప్పమన్నారు. మార్గమధ్యంలో దాసగణు మిత్రులతో కలసి ఆకాయను పరాకుగా భుజిస్తాడు. శ్రీ సాయిని కలువగానే, సాయి దాసుగణుని పిలచి నాతమ్ముడిచ్చిన కొబ్బరికాయ ఏమయ్యింది అని ప్రశ్నిస్తారు. దాసగుణ తాను చేసిన తప్పుకు బాబాను క్షమాపణ కోరుతాడు. ఆ విధంగా ఆ కొబ్బరికాయ బాబాగారికి చేరలేదు. మాధవుడు ఇంకా వంగదేశము నందు శ్రీరామకృష్ణ పరమహంస (వీరిని గదాధరుడనెడివారు) కాళికామాతను ఉపాసించెడివారని, వారొకనాడు మాతతో తనకు మోక్షమీయవలసిందిగా కోరినారని, అతని కోరికను మన్నించి కాళికామాత భూలోకమందు ధీశిలానగరమందున్న ముస్లింఫకీరును తనవద్దకు మూడు దినముల కొరకు రావలసిందిగా ఆదేశించి, ఆ ముస్లిం ఫకీరుకు రామకృష్ణుని గతంలో ఆశ్రయించిన వారి పాపపుణ్యముల భారమప్పగించి, తిరిగి భూలోకమునకు పంపెనని తెలిపెను.

ఈ కారణముగానే శ్రీ షిరిడీసాయిబాబా వారు మూడు దినములు విగతజీవుడయిరి. తన శరీరమును మహల్సాపతికి అప్పగించి, శ్రీ షిరిడీసాయి మూడు దినములు తాను అల్లాను దర్శించి వస్తానని చెప్పెను. సాయి మరణించినారని ఎంతమంది చెప్పిననూ, మూడు దినములలో తిరిగివస్తానని తనతో చెప్పినారని, కాబట్టి మూడు దినములు ఆ శరీరమును కాపాడవలసియున్నదని మహల్సాపతి తెలిపెను. ఎంతమంది వారించిననూ, వినకుండా మహల్సాపతి బాబా మృతదేహమును మూడు దినములు కాపాడెను మూడు దినముల పిదప శ్రీ షిరిడీసాయిబాబా తిరిగి తన శరీరములో ప్రవేశించి, సశరీరుడై లేచెను. ఆనాడు బాబాకు వాసవీమాత కాళికామాత రూపమున దర్శనమిచ్చి తన అంశను అతనియందు నిక్షిప్తము చేసెనని దానికి తోడు శ్రీవల్లభులు కూడ తమ అంశను బాబాయందు నిక్షిప్తం చేసిరి. ఈ రెండు అంశల కలయికవల్ల బాబా విశేషమయిన శక్తిమంతుడయ్యెను. బాబా అమ్మవారి రూపముగా మశీదును భావించి మాతృభావముతో సేవించెను. భక్తులనుద్ధరించెను. అందుకే ఆ మసీదుకు 'ద్వారకామాయిగా' నామకరణము చేసెను. 'మాయి' అంటే 'మాత' అని అర్థము.

అంతట శ్రీ పళనీస్వామి ఆదేశం మేరకు మాధవుడు వెనుకకు మరలి విచిత్రపురమునకు బోయెను. పళనిస్వామి వారి నుండి శెలవుగైకొని శంకరభట్టు కురువపురమునకు పోవుచూ, మార్గమధ్యమున మహాపుణ్యక్షేత్రమైన తిరుపతికివచ్చెను.

అచ్చట నుండి తిరుమలకు చేరిన అతడు ముందుగా శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించి, అటుపిమ్మట ధ్యానములో కూర్చుండెను. శంకరభట్టుకు ధ్యానములో శ్రీ వేంకటేశ్వరస్వామి తొలుత బాలా త్రిపుర సుందరిగా, ఆ తరువాత ఈశ్వరునిగా కొద్దిసేపటికి మహవిష్ణు రూపముగా గోచరించెను. మరికొద్దిసేపటికి శ్రీపాద శ్రీవల్లభరూపముతో బాలయతిగా దర్శనమిచ్చెను. ఇంతలో అక్కడకు నల్లని ఆకారము గల శనీశ్వరుడు వచ్చి శ్రీవల్లభులతో శంకరభట్టు జాతకములో ఏలినాటిశనిదశ ఆనాటినుండి ప్రారంభమైనదనియు, సాధారణ జనుల జాతకము నందు సామాన్యముగా ప్రవేశించే తాను శ్రీ వల్లభుల భక్తుడైన శంకరభట్టు జాతకము నందు ప్రవేశించుటకు ముందుగా మీ అనుమతి కొరకై వచ్చియున్నానని వల్లభులతో పలికెను. అంత వల్లభులు కర్మకారకుడవైన నీవు నీ ధర్మము నెరవేర్చుకొనుము. ఆశ్రితభక్తజనరక్షణకు కంకణము కట్టుకున్న నేను నా భక్తులను రక్షించుకొనెదనని అనిరి. అది విన్న శంకరభట్టుకు ధ్యానము చెదరి ప్రకృతిలోనికి వచ్చి, ఇకపై తనకెన్ని కష్టములు రానున్నవో అని వాపోతూ, శ్రీవల్లభులపై తనను కాపాడే భారం వేస్తూ తిరుమల కొండదిగి తిరుపతి పట్టణములోనికి వచ్చెను.

తిరుపతి పట్టణమునకు చేరిన శంకరభట్టును కొందరు క్షురకులు చుట్టుముట్టి, అతనిని చిన్నతనములో తప్పిపోయిన మంగలి సుబ్బయ్య కుమారునిగా అనుకొని, అతడు ఎంత వారించిననూ వినకుండా మంగలి సుబ్బయ్య గృహమునకు

ఈడ్చుకొనిపోయిరి. అచ్చము తమ కుమారునివలే కనపడుచున్న శంకరభట్టును చూచి, మంగలి సుబ్బయ్య దంపతులు అతనిని కౌగిలించుకొని, ఇరువది సంవత్సరములుగా తప్పిపోయిన నీ కొరకై వెదికి, వెదికి విసిగి వేసారితిమి, కావున ఇకనైనా మాతో ఉండి, బుద్ధిగా నీ భార్యతో కాపురము చేసుకొమ్మనిరి. అంతట శంకరభట్టు రోదించుచూ, తాను క్షురకుడను (మంగలి) గానని, బ్రాహ్మణుడనని తెలిపి, తనను విడచిపెట్టవలసినదిగా ప్రాధేయపడెను. తమ కుమారుడు, తిరిగి పారిపోవాలని ప్రయత్నిస్తున్నాడని, దెయ్యము, గాలి సోకినదని, భూతవైద్యునిచే కూడ వైద్యము చేయించి, గృహమునందు ఆ దంపతులు అతనిని బంధించిరి. పరిస్థితులు తనకు అనుకూలముగాలేవని, ఇది కేవలము ఏలినాటి శని ప్రభావముగా ఎంచి, తనను వారి నుండి కాపాడి, తన కురువపుర ప్రయాణమునకు మార్గము సుగమము చేయమని శంకరభట్టు దీనముగా శ్రీ వల్లభులను ప్రార్థించుచుండెను. శంకరభట్టును తన భర్తగా భావించి, తనను స్వీకరించమని క్షురకుని కోడలు కోరుతున్నప్పటికీ, క్షురకుని కోడలుతో గాని, క్షురక దంపతులతో గాని మాట్లాడకుండా ఒకమూల కూర్చుని శంకరభట్టు ధ్యానస్థుడయ్యేడివాడు.

ఒకనాడు ఆ గ్రామమునకు వచ్చిన ఒక నాడీ జ్యోతిష్కుడు ఆ మంగలి సుబ్బయ్య ఇంటికివచ్చి, నాడీ గ్రంథములోని శంకరభట్టుకు చెందిన తాళపత్రము పరిశీలించి, అతడు క్షురకుని కుమారుడు గాదని, బ్రాహ్మణుడని తెలియచేసెను. ఇంకా, గతజన్మలో శంకరభట్టు, తప్పిపోయిన క్షురకుని కుమారునికి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడని, వీరిద్దరూ గతజన్మలో కందుకూరు సమీపమున గల మొగలిచర్ల గ్రామమునకు చెందినవారనియు, ఒకరోజు దత్తుని దేవాలయములో, దత్తునిపై ప్రమాణము చేసి దత్తుని సాక్షిగా జూదము ఆడిరనియూ, ఆటలో ధనమును శంకరభట్టు, భార్యను క్షురకుని కుమారుడు పందెము గాచిరనియు, ఆ పందెములో క్షురకుని కుమారుడు ఓడిపోయి, పందెము అమలు చేయకుండా ఆ జన్మలో అతడు పారిపోయినట్లుగా తెలిపెను. ప్రస్తుత జన్మములో ఒకే పోలికతో జన్మించిన వీరుయిద్దరూ గత జన్మలో దత్తుని ఎదుట చేసిన ప్రమాణమును అమలు చేయని కారణముగా, సాక్షీభూతుడైన దత్తుడు వారి గత జన్మ ప్రమాణమును అమలు చేయ నిర్ణయించి, నీ కుమారుని వివాహానంతరము ఈ జన్మలో పిచ్చివాడై పారిపోవునట్లుగాను, అతని స్థానమున శంకరభట్టు ఈనాడు నీ ఇంటియందు ఉండునట్లుగాను చేసిరనియు, త్వరలో నీకుమారుడు రాగలడనియు ఒకే పోలికతో ఇద్దరూ ఒకేలాగ ఉండుటవల్ల మీ కుమారునిగా భ్రమించినారని తెలిపెను. తమ తప్పిదము గ్రహించి, $7^1/_2$ రోజుల తరువాత తన కుమారుడు రాగానే శంకరభట్టును క్షురకుడు విడుదలచేసెను. సాధారణంగా ఏలినాటి శని అందరికీ $7^1/_2$ సంత్సరములు ఉండునని, కాని శ్రీ వల్లభులు తనకు ఆ ఏలినాటి శని పీడ కేవలం ఏదో రకంగా $7^1/_2$ రోజులలో వదిలించివేసారని అనుకుంటూ, వారి నుండి విడుదల చేసి, కురువపురము పోవుటకు సహకరించినందుకు, వేనోళ్ల శ్రీ వల్లభులకు తన మనమున శంకరభట్టు కృతజ్ఞతలు తెలుపుకొనుచూ, తన ప్రయాణములో ముందుకుసాగెను.

దీనిని బట్టి మానవులు భగవంతుని సాక్షిగా గైకొని, అసత్య ప్రమాణములను, అధర్మ ప్రమాణములను చేయువారు దత్తప్రభువు చేత కఠినముగా శిక్షింపబడుదురని తెలియును. ప్రస్తుతజన్మలో అనుభవముగాకుండా, మిగిలిపోయిన పాపకర్మలు మరొక జన్మకు బదిలీ చేయబడుననియూ, దానిని మానవులు అనుభవించి తీరవలయుననియూ, మానవులు గుర్తుంచుకోవాలి. ఈ సత్యమును గ్రహించి జీవులు సత్కర్మలను మాత్రమే చేయుచూ, దుష్కర్మల జోలికి పోకుండా యుండవలయును. ప్రస్తుత జన్మలో నిత్యనియమనిష్ఠాగరిష్ఠుడైన శంకరభట్టు వంటి ఉత్తమ జన్మను పొందిన బ్రాహ్మణుడనే, గతజన్మలోని పాపకర్మలు విడువకుండా, వెంట వస్తుండుటవల్ల, ప్రతీ సాధారణ మానవుడు కూడ సత్ప్రవర్తనను అలవాటు చేసుకొని, అటువంటి జాడ్యములందు బడక జాగ్రత్త వహించాలని తెల్సుకోవాలి.

తిరుపతిలో క్షురకుల బారి నుండి తప్పించుకున్న శంకరభట్టు అక్కడినుండి చిత్తూరు జిల్లాలోని స్వయంభూవరసిద్ధివినాయకుడు కొలువైయున్న కాణిపాక మహాక్షేత్రమునకు పోయెను. ఆలయములోకి పోయి శ్రీ వినాయకస్వామిని దర్శించి, బయటకురాగానే అతనిని నాలుగుకుక్కలు చుట్టుముట్టెను. ఆ ఆలయపూజారి, ఆ కుక్కలు తిరుమలదాసు అను రజకునివని, అతని శక్తిని, భక్తిని గూర్చి తెలిపి, శంకరభట్టును దాసు ఇంటికి పోవలసిందిగా చెప్పెను. ఆ పూజారి సలహాననుసరించి, శంకరభట్టు తిరుమలదాసు అనెడి 70 సంవత్సరముల రజకుని ఇంటికి చేరి, తననుతాను పరిచయం చేసుకుని సేదతీర్చుకొనెను. తిరుమలదాసు శ్రీపాద శ్రీవల్లభుల వారికి అత్యంత ప్రియభక్తుడు. చాలాకాలము

పీఠికాపురమందు నివసించెను అప్పట్లో శ్రీపాదుల మాతామహులైన శ్రీ బాపనార్యులవారితో, బాలుడైన శ్రీ వల్లభులతో ఎంతో సాన్నిహిత్యంగా మెలుగుతూ, వారి బట్టలు ఉతుకుచూ, వారి సేవలో తరించి, శ్రీ వల్లభుల దయకు పాత్రుడై, వారిచే వరములు కూడ పొందెను. అతడు మహాజ్ఞాని. రజకుడైనప్పటికీ పురాణ, వేద సారములను తెలిసినవ్యక్తి. శ్రీ వల్లభుల ఆశీర్వచన ప్రభావము వల్ల గత జన్మలతో బాటు, భవిష్యత్తునందు జరుగు విషయములను తెలుపు వాక్శుద్ధి గలవాడు. జీవుడు మరణసమయంలో స్మరించిన దానినే మరుజన్మలో తిరిగి పొందుతాడన్నది శాస్త్రం. గత జన్మలో తాను మహాపండితుడనైనప్పటికీ, పాతగుడ్డల గూర్చి మరణసమయమున ఆలోచించినందువల్ల ఈ జన్మలో రజకునిగా జన్మించితినని తిరుమలదాసు శంకరభట్టుకు తెల్పెను. గతజన్మ పాండిత్యమింకా వల్లభుల దయవల్ల తనయందు గలదని తెలిపెను. తిరుమలదాసు శంకరభట్టుకు, అతిథి సత్కారములన్నియు జేయుచూ కొన్ని దినములు అతనిని తన ఇంటివద్దనే ఉంచుకొనెను. శ్రీ వల్లభుల దర్శనమునకు పోవుచున్న శంకరభట్టును అభినందిస్తూ, అతడు త్వరలో శ్రీపాదశ్రీవల్లభుల యొక్క చరిత్రను, వల్లభుల వారికృపతో లిఖించగలడని తెలిపెను. తన మనసునందున్న అభిలాషను చెప్పగలిగిన తిరుమలదాసుకు శంకరభట్టు నమస్కరించి, శ్రీ వల్లభుల చరిత్ర లిఖించుటకు ఆధారభూతమైన, విలువైన సమాచారము ఇవ్వవలసినదిగా తిరుమలదాసును, శంకరభట్టు కోరెను. అటుపై శంకరభట్టుకు తిరుమలదాసు శ్రీపాద వల్లభుల అవతార విశేషాలను వివరముగా ఈ క్రింది విధముగా తెలియజేసెను.

మాది 'గర్తపురి' (గుంటూరు) దగ్గరలో గల మాల్యాదిపురమను గ్రామము. దానిని 'మల్లాది' అని కూడ పిలుచుచుందురు. ఆ గ్రామమునందు 'మల్లాది' అని ఇంటిపేరు గల్గిన రెండు బ్రాహ్మణ కుటుంబములుండెడివి. వారు మల్లాది బాపన్నావధానులుగారు మరియు మల్లాది శ్రీధర అవధాన్లుగారు. వీరు ఇరువురు గూడ వేద శాస్త్రములను, వైదిక సంప్రదాయములను పుణికి పుచ్చుకున్న మహాపండితులు. వీరు పూజలు గాని, యజ్ఞములు గాని చేసినచో యజ్ఞఫలము వెంటనే దక్కునని, చాలా సందర్భములలో భగవంతుని యొక్క సాక్షాత్కారము గూడ జరిగినట్లుగా పేరు ప్రఖ్యాతులు పొందిరి. వీరు వేర్వేరు గోత్రముల వారైనందున ఒకే ఇంటిపేరు గల్గియున్ననూ, శ్రీధర అవధాన్లుగారి సోదరియయిన రాజమాంబను శ్రీ బాపనార్యులగార్కి ఇచ్చి వివాహము చేసిరి. అనతి కాలములో వారికి వెంకావధానులు అను కుమారుడు సుమతి అను కుమార్తె గలిగిరి.

ఒకసారి మహాయజ్ఞ నిర్వాహకులుగా పేరొందిన బావ, బావమరుదులిద్దరూ గోదావరి తీరమందు అమలాపురమను పట్టణమునకు చేరువలో గల 'అయినవిల్లి' అను గ్రామములో స్వర్ణగణపతి హోమమును ఎంతో వేదోక్తముగా, శాస్త్రయుక్తముగా, మహా వైభవముతో నిర్వహించిరి. యజ్ఞానాంతరము స్వర్ణగణపతి, ప్రత్యక్షమై, తన తొండముతో నైవేద్యము స్వీకరించి, యజ్ఞమునకు వచ్చిన భక్తులను గణపతిస్వామి ఆశీర్వదించి, తాను త్వరలో ఒకానొక వినాయక చవితి (గణేశచతుర్థి) రోజున, సర్వ కళలతో శ్రీపాదవల్లభునిగా జన్మింతునని పలికి, ఆహుతులందరికీ ఆశ్చర్యము కలుగజేసెను. ఇంతలో ఆ యజ్ఞమును వీక్షించుచున్న ముగ్గురు నాస్తికులు గణపతిని అవహేళన చేయుచూ, ఆ స్వరూపము గణపతిస్వామిది కాదని అపహాస్యము చేసినారు. వెంటనే స్వర్ణగణపతి ఆగ్రహించి, ఎదురుగానున్న సత్యమును గ్రహించలేకపోయిన వారు ముగ్గురు చెమిటి, మూగ, గ్రుడ్డివారై అన్నదమ్ములుగా జన్మింతురని శపించి, తన స్వయంభూమూర్తిని దర్శించిన పిదప వారికి శాప విమోచనము కాగలదని తెలిపి అంతర్ధానమైరి. అటుపై మరుజన్మమున వారు కాణీపురమను గ్రామమున అంగవైకల్యములతో జన్మించి, వారికి గల ఒక 'కాణి' భూమిని ఆ గ్రామమునందే సాగుచేసుకొనుచుండిరి. ఒకనాడు వారి పొలమందుగల దిగుడు బావిలో నీరు తగ్గగా, మరింత లోతుకు ఆ బావిని త్రవ్వుటకు పలుగు, పారలతో ప్రయత్నించుచుండిరి. ఒక రాతిపొర పగిలి, నీటికి బదులుగా, రక్తము పైకి చిమ్మినది. వెంటనే అందుండి స్వయంభూగణపతి రాతి విగ్రహము బయటకు వచ్చినది. ఒకేసారి అన్నదమ్ములకు చెమిటి, మూగ, గ్రుడ్డితనము పోయి శాప విమోచనమయినది. గ్రామస్థులు ఆ వరసిద్ధివినాయక విగ్రహమును ఆ దిగుడు బావియందే ప్రతిష్ఠింపగోరి, మహాపండితులైన శ్రీబాపనార్యులను, శ్రీధరఅవధాన్లగారిని ఆహ్వానించిరి. అంగరంగ వైభవముగా, సశాస్త్రీయముగా, వేదమహిమాన్విత మంత్రములతో కాణిపాకమందు దిగుడు బావిలో శ్రీ గణపతి ప్రతిష్ఠ జరిగెను.

శ్రీ గణపతి ప్రతిష్ఠ జరిగిన అనంతరము, అందుండి మహాగణపతి ప్రత్యక్షమై ఆ ఇద్దరు పండితులను శ్రీశైలము వెళ్లి, సూర్యమండలాంతర్గతమైన తేజస్సును మల్లికార్జునలింగములోనికి శక్తిపాతము చేయమని, ఆజ్ఞాపించిరి. అదే సమయమున కాశీ, బదరీ, కేదారమునందు కూడ ఏక కాలములో తమ అనుగ్రహము వలన శక్తి పాతము, త్వరలో శ్రీపాద శ్రీవల్లభుల వారి అవతరణము జరుగుననియూ, పండితులలో ఒకరైన శ్రీధరఅవధానుల గారితో ఇకపై నీయింటి పేరు మల్లాదికి బదులుగా శ్రీపాద కాగలదని ఆశీర్వదించి అంతర్ధానమయిరి.

ఒకసారి పీఠికాపుర వాస్తవ్యులు, వైశ్యశ్రేష్ఠుడైన వెంకటప్పయ్య శ్రేష్ఠి, అనునాతని ఆహ్వానం మేరకు శ్రీ బాపనార్యులవారు ఒక యజ్ఞం నిర్వహించుటకు మల్లాది గ్రామము నుండి పీఠికాపురం వచ్చిరి. వారి పాండిత్యము, వేదపరిజ్ఞానము, జ్యోతిష విజ్ఞానము గ్రహించిన ఆ గ్రామ వైశ్యకుల నాయకుడైన వెంకటప్పయ్య శ్రేష్ఠి, క్షత్రియ కులనాయకుడైన శ్రీవత్సవాయి నరసింహవర్మలు బాపనార్యుల వారిని పీఠికాపురమునందు నివాసమేర్పరుచుకొమ్మని ఎంతగానో బలవంతము చేసి, బాపనార్యుల వారికి మూడుపుట్ల భూమి, గృహవసతి కల్పింతుమని తెలిపిరి. దానికి అంగీకరించి, బాపనార్యులవారు భార్యా, బిడ్డలతో పీఠికాపురమునకు వలసవచ్చి, స్థిర నివాసము ఏర్పరచుకొనిరి. వారి పాండిత్య, ప్రతిభా పాటవముల వల్ల అనతికాలములోనే ఆ గ్రామబ్రాహ్మణ పరిషత్తుకు అధ్యక్షునిగా నియమింపబడిరి. బాపనార్యులవారు దత్తునితో జన్మజన్మల బంధము కలిగిన మహామహులువారు ఒక జన్మమున వైశ్య కులగురువైన భాస్కరాచార్యులుగా జన్మించి తిరిగి దత్తుని సేవించెను. దత్తుని ఆశీర్వచనముతో కలియుగమున తిరిగి బాపనార్యులుగా జన్మించెను. వారి గృహనామమైన 'మల్లాది' వంశము కలియుగాంతము వరకు నిలచునని దత్తులు వారికి వరమిచ్చిరి.

కొంతకాలమునకు అయినవిల్లి గ్రామము నుండి ఘండికోట అప్పల లక్ష్మీనరసింహరాజుశర్మ అనువైదిక బ్రాహ్మణ బాలకుడు పీఠికాపురమునకు వచ్చెను. అతడు బాపనార్యుల వద్ద వేదవిద్య అభ్యసించుటకు శిష్యునిగా చేరెను. కుక్కుటేశ్వరలింగము నుండి వెలువడిన అశరీరవాణి ఆదేశముననుసరించి బాపనార్యులు తమ కుమార్తెయగు సుమతిని, అప్పలరాజుశర్మకిచ్చి పీఠికాపురమందు వివాహము జరిపించెను. ఎంతో ఆనందముతో శ్రేష్ఠిగారు, వర్మగారు, గ్రామస్థులతో కలసి, ఆదంపతులు నివసించుటకు ఒక గృహమును, ఇతర సౌకర్యములను ఏర్పాటు చేసిరి.

కొంతకాలమునకు ఒక అవధూత వరప్రసాదముగా శ్రీపాదులవారు గణేశచతుర్థీ దినమున సింహలగ్నమందు చిత్తానక్షత్రమున తులారాశిలో శ్రీరాజుశర్మ, సుమతీ దంపతులకు కుమారునిగా జన్మించిరి. దినదిన ప్రవర్ధమానులై ఎదుగుచూ శ్రీవల్లభులు, చిన్నతనము నుండియూ ఎందరికో అమితాశ్చర్యములు గొలుపు వింతలను చేయుచుండిరని, శ్రీపాదులవారికి నిత్యము పాలు గ్రోలుటకు వెంకటప్పయ్య శ్రేష్ఠి ఒక గోవును శ్రీరాజు శర్మగారింట ఉంచెననియు మరిన్ని విషేషములు, శ్రీవల్లభుల వారి గూర్చి తిరుమలదాసు శంకరభట్టుకు తెలిపెను.

తనకు రవిదాసు అను నామధేయము గలిగిన కుమారుడు గలడనియూ, అతడు కురవపురమున శ్రీవల్లభుల సేవచేసుకొనుచున్నాడని తెలిపి, తనను పీఠికాపురమును వదలి కాణిపాక గ్రామమందు నివసించమని వల్లభులు ఆదేశించిన కారణంగా కాణిపాకమందు నివసించుచున్నానని తిరుమలదాసు తెలిపెను. ఆ సమాచారమంతయు కడుశ్రద్ధతో గ్రహించిన శంకరభట్టు, తిరుమలదాసు వద్ద శలవు తీసికొని కురవపురమునకు ప్రయాణమయ్యెను.

అచ్చట నుండి బయలుదేరిన శంకరభట్టుకు మార్గమధ్యములో సుబ్బయ్యశెట్టి అను వైశ్యుడు కలిసెను. అతనితో తన కురవపుర ప్రయాణము గూర్చి శంకరభట్టు తెలుపగా, తానుకూడ శ్రీవల్లభుల భక్తుడనేనని, తనకు వల్లభులతో ప్రత్యేక అనుబంధమున్నదని, వల్లభులతో తన సాంగత్యము గూర్చి ఈ విధముగా తెలియజేసెను.

నేను పీఠికాపురములో ఎంతో ఆర్థికస్తోమత గల వైశ్యకుటుంబమున జన్మించి, కాంచీపురమున గుర్రముల వ్యాపారము చేసుకొనుచుండెడివాడను. ఆ సమయములో బిల్వమంగళుడను తోటి వ్యాపారి నాతో సఖ్యతగా ఉండేవాడు.

నేను చింతామణి అను వేశ్యస్త్రీ మోజులోపడి, ఆమెపై అధిక ధనము వెచ్చించసాగితిని. నాతోటి వ్యాపారియైన బిల్వమంగళుడు గూడ, ఆమెతో సఖ్యము చేసి, ఆమెను నాకు కాకుండా చేసినాడు. సొమ్ములు నావద్ద తీసుకొన్ననూ, చింతామణి బిల్వమంగళునిపై మక్కువ కల్గియుండెడిది. ఈ క్రమములో, వ్యాపారములో నష్టములు వచ్చి, నావద్దనున్న ధనమంతయు హరించిపోయినది. నా భార్య, కుమారుడు అకాలమరణము చెందిరి. చింతామణి, బిల్వమంగళునితో కలిసి

నా సొమ్ముతో సహా ఎటో పారిపోయినది. అప్పుడు చేయునది లేక నేను తిరిగి నా స్వగ్రామమైన పీఠికాపురమునకు పోయితిని.

అటుపిమ్మట నేను పీఠికాపురములో నివసిస్తూ, కిరాణావ్యాపారము చేసుకునేవాడిని. ఆ గ్రామములో అందరిలాగానే, వల్లభుల తండ్రియగు రాజుశర్మగారు నా వద్ద కిరాణా సరుకులు తీసుకుంటూ, కాలక్రమములో వారు నాకు కొంత సొమ్మును ఆర్థిక ఇబ్బందుల వలన బాకీపడ్డారు. బాకీని తీర్చవలసిందిగా అప్పలరాజు శర్మగారిపై వత్తిడి తెచ్చి వేధించిననూ ప్రయోజనం లేకపోయేసరికి, నా బాకీ తీర్చేందుకు బదులుగా వల్లభుల వారిని నా దుకాణములో బలవంతముగా నౌకరుగా నియమించుకున్నాను. నిజానికి నేను అసలు అప్పుకు, కొన్ని దొంగలెక్కలు జోడించి, రాజుశర్మగారు పదివరహాలు అప్పు ఉన్నట్లుగా చూపితిని. ఆ అప్పు తీరేవరకూ వల్లభులవారు నా దుకాణములో ఉండాలని వెంకటప్పయ్య శ్రేష్ఠికి, రాజుశర్మ దంపతులకు తెలిపి, వల్లభులను నా దుకాణమునకు తోడ్కొనివచ్చాను.

నాయందు ఆగ్రహముతోనున్న శ్రీవల్లభుల వద్దకు, నా సమక్షములో ఒకరాగి పాత్ర కొనుటకై దుకాణమునకు ఒక జటాధారియైన సన్యాసి వచ్చెను. ఆ సన్యాసికి నేను నావద్ద అనేక రాగి పాత్రలున్ననూ దాచివేసి, నా దగ్గర ఒకే ఒక రాగి పాత్ర ఉన్నదని అబద్ధం చెప్పి, దాని వెల అధికముగా పదివరహాలుగా నిర్ణయించితిని. ఆ పాత్ర కొనుటకు అంగీకరించిన సన్యాసి, దానిని తనకు శ్రీపాదవల్లభుల వారి చేతుల మీదుగా ఇప్పించవలసినదిగా కోరెను. దానికి అంగీకరించి, పది వరహాలు తీసుకుని, నేనట్లే చేసితిని. సన్యాసి వెళ్లిన తరువాత దక్కిన లాభానికి ఆనందిస్తూ, శ్రీపాదులవారి తల్లిదండ్రులను అవమానించాలనే మిషతో వల్లభులను పనిలో నియమించుకున్న నేను, ఈ విక్రయంలో పది వరహాలు దక్కగానే నాకు రావలసిన సొమ్ముతోబాటు, శ్రీపాదులవారి తల్లిదండ్రులను అవమానించవలెనని కోరిక కూడ తీరిందని సంతోషిస్తూ అక్కడవున్న వెంకటప్పయ్య శ్రేష్ఠితో నా బాకీ తీరిపోయినదిగావున వల్లభులను నౌకరీ వృత్తి నుండి బంధ విముక్తుడను చేయుచున్నానని తెలిపితిని. ఇంతలో నా దగ్గర దాచి వేసిన మిగిలిన అన్ని పాత్రలు ఆశ్చర్యముగా మాయమై, ఒకే ఒక పాత్ర మిగిలినది. నేను సన్యాసితో నా దగ్గర ఒకే ఒక పాత్ర గలదని చెప్పిన మాట నిజమై, నా దగ్గర ఒకే ఒక పాత్ర మిగిలి ఉన్నది. నాకు ఆ సన్యాసి ద్వారా అధికంగా పది వరహాలు ముట్టినవి గావున, వల్లభుల బాకీ తీరిపోయినదని అవగతమైనది.

గత జన్మలో సుబ్బయ్య శ్రేష్ఠి దత్తాత్రేయస్వామి ఆలయపూజారి. ఆతడు స్త్రీవాంఛ మరిగి, దేవాలయంలో దత్తుని విగ్రహం ఒక కంసాలికి అమ్మివేసి, ఆ విగ్రహము దొంగిలించబడినదని గ్రామస్థులను నమ్మించినాడు. ఆలయంలో దత్తుని విగ్రహమునకు కొంతకాలము పూజలు చేసిన ఫలితముగా మరుజన్మలో సుబ్బయ్య శ్రేష్ఠి సంపన్న వైశ్యకులమున జన్మించగా, దత్తుని విగ్రహముకొని, దాన్ని కరగించివేసి, ఆ లోహముతో పాత్రలు చేసి విక్రయించిన కంసాలి గర్భదరిద్రునిగా, జటాధారియైన సన్యాసిగా జన్మించెను. ప్రస్థుత జన్మలో ఆ సన్యాసి, వల్లభులవారిని అత్యంత భక్తితో కొలుస్తూ, దారిద్ర్యమును తొలగించమని ప్రార్థించగా, శ్రీపాదులవారు స్వప్నములో కనిపించి, పదివరహాలు తెచ్చి, సుబ్బయ్య శ్రేష్ఠికిచ్చి, తనకు బంధ విముక్తి చేయవలసినదని, తద్వారా ఆతని దారిద్ర్యము అనతికాలములో తీరగలదని ఆ సన్యాసిని అనుగ్రహించినారు. బంధవిముక్తులైన వల్లభులు ఈ పై విషయములన్నీ నాకు తెలిపి, అవధూతల నుండి గాని, సిద్ధ పురుషుల నుండి గాని రాగిపాత్రలను గ్రహించిన ఫలితముగా దాన గ్రహీతకు విశేషలాభము గలుగునని, కావున నా ధనమంతయు అనతికాలములో వల్లభుల భక్తుడైన ఆ సన్యాసికి పోగలదని, నేను బికారిగా మారి దుస్థితితో జంగిడీ చేతబట్టుకుని తినుబండారములు అమ్ముకొను రోజులు రాగలవని, నా జీవితగాథ హాస్యాస్పదమై నలుగురు నవ్వుకొనునట్లు కథలరూపంలో రాగలదని వల్లభులు శపించి దుకాణము నుండి వెడలిపోయిరి.

అటుపిమ్మట ఒక రోజు పీఠికాపురములో నరసింహవర్మగారి పొలములలోనికి విహారమునకై వల్లభులు, వర్మగారుపోయిరి. నేను కూడ వారిని వెంబడించితిని. అక్కడ చెంచుస్త్రీ, పురుషుల గుంపు చెంచులక్ష్మి, నరసింహస్వామి అవతారము బోలిన ఇద్దరు చెంచులతో గూడి వల్లభులవారిని చూచి, వారి చుట్టూ నాట్యము చేయుచుండిరి. ఆ చెంచులందరూ ఒకరి తరువాత మరియొకరు వల్లభుల శరీరములో ఐక్యమైపోయిరి. అక్కడ మిగిలిన ఒక స్త్రీ, పురుషులను చూచి వారిని చింతామణి, బిల్వమంగళునిగా గుర్తుపట్టితిమి. వారు తమ పాపకర్మములు నశింపచేసుకొనుటకై శ్రీవల్లభుల దర్శనార్థమై పీఠికాపురమునకు వచ్చుచున్నట్లుగా తెలిపిరి. అంత వల్లభులు వారిని కరుణించి, వారి శరీరమునందు గల

పాపకూపములైన నల్లటి ఆకారములను అక్కడ మండుచున్న చితుకులమంటపై దగ్ధము చేసి, బిల్వమంగళుని మహర్షిగాను, చింతామణిని యోగినిగా మారి తమ శేషజీవితము గడుపమని ఆశీర్వదించిరి. నాకు అన్నోదకములకు లోటు లేకుండా ప్రతి రోజు మధ్యాహ్నము, నావద్దనున్న మిగిలిన ఆ రాగి పాత్ర ద్వారా నాకు ఆహారము వారిని స్మరించినచో లభించునట్లుగా వరమొసంగిరి. నేను నా శేషజీవితము వల్లభుల సేవలో గడుపుచుంటినని శెట్టి శంకరభట్టుకు వివరించెను.

ఇన్ని చిత్రములు జరిగిన ఆ ప్రదేశములో 'చిత్రవాడ లేక చిత్రాడ' అను పేరుతో ఒక గ్రామమేర్పడగలదని వల్లభులు శెలవిచ్చిరి. ఈ గ్రామము నేటికి గూడ పీఠికాపురసమీపమున తూర్పుగోదావరి జిల్లాలో గలదు.

శంకరభట్టు సుబ్బయ్య శ్రేష్ఠి నుండి అనుమతి పొంది, కురవపురము పోవుచూ, దారిలో ఆ రాత్రికి ఆనందశర్మ అనువారియింట ఆతిధ్యము స్వీకరించినాడు. వారు గాయత్రీ మంత్రమును అనుష్ఠించుచుందురు. వారు తాము గూడ శ్రీవల్లభుల భక్తులమేనని, గతంలో పీఠికాపురమును దర్శించితినని తెలిపిరి తన తండ్రి తనకు ఉపనయనము చేయు సందర్భమున ఒక అవధూత వచ్చి, గాయత్రీ మంత్ర విశేషములన్నియు ఉపదేశించి, నన్ను పెంచలకోనలోని నృసింహదేవుని దర్శించమని తెలిపిరి. పెంచలకోన వెళ్లి నృసింహదేవుని దర్శనానంతరము తలవని తలంపుగా ఒక దట్టమైన గుహలో అనేకమంది ఋషుల సపర్యల మధ్య కొన్ని సంవత్సరముల నుండి తపమాచరించుచున్న కణ్వ మహర్షిని దర్శించితిని. వారు నన్ను శ్రీవల్లభుల దర్శనమునకు పీఠికాపురమునకు పోవలసినదిగా ఆజ్ఞాపించిరి. అటుపిమ్మట నేను పీఠికాపురమునకు బోయి కడు భక్తితో వల్లభులను దర్శించితిని. నన్ను ఆశీర్వదించి వల్లభులు నీపై నా అనుగ్రహమున్నదని పలికి, కడపటి జన్మమున నీవు వెంకయ్య నామముతో అవధూతవై, నిరతాగ్నిహోత్రివై అకాలము సంభవించినపుడు వర్షములు కురిపించి ప్రజలను ఆదుకొని, వారి ఈతిబాధలను గూడ తీర్చెదవని ఆశీర్వదించిరని తెలిపెను.

అంతటవారు నాతో శ్రీపాదుల శ్రీచరణాశ్రితులకు ఇహపరలాభములు రెండును సిద్ధించుననియూ, తక్కిన దేవతారాధనలకునూ, శ్రీదత్తారాధనకునూ గల ముఖ్య వ్యత్యాసమిదియేనని తెల్పిరి. ఇంకా, గాయత్రీమంత్రమందలి 24 అక్షరములకు మన శరీరమందు వివిధ స్థానాలలో గల 24 గ్రంథులకు, ఆగ్రంథులందు నిక్షిప్తమైయున్న 24 రకములైన శక్తులకు సన్నిహిత సంబంధమున్నదని తెలిపిరి. జప, తపములు ఆచరించునపుడు తదనుగుణముగా ఈ శక్తులన్నీ స్పందించుననియూ, గాయత్రీ శక్తి విశ్వవ్యాప్త శక్తియని, దాని అనుష్టానము వలన మానవుడు భౌతిక, మానసిక సంపదలన్నియు పొందగలడని వివరించిరి.

ఆనందశర్మ గారి సద్గోష్ఠి వల్ల, జ్ఞానసముపార్జన చేసుకొని, శంకరభట్టు వారి వద్ద శెలవు తీసుకుని, కురువపురమునకు పయనమయ్యెను.

అచ్చట నుండి శంకరభట్టు ముంతకల్లు అను గ్రామం చేరినాడు. ఆ గ్రామ నడిబొడ్డున అతనిని పేరుతో పిలుచుచూ ఒక కల్లునమ్ముకొనుచున్న ఒక వ్యక్తి అతని దగ్గరగా వచ్చెను. అతడు కల్లు త్రాగి, వాసన కొట్టుచూ, తూలుచూ శంకరభట్టును గూడ కల్లు త్రాగమని విశేషముగా బలవంతము చేసెను. తిరస్కరించిన శంకరభట్టుపై తన కులస్థుల ఎదుట పంచాయితీ నిర్వహించి, ఎట్టకేలకు, అతిబలవంతముగా అతనిచే కల్లు త్రాగించి, ఎటో వెళ్లిపోయెను. జరిగిన దానికి చింతించుచూ, తన ఆచారము మంటగలసినదని బాధపడుచూ, దారిలో దత్తానందస్వామి వారి ఆశ్రమమునకు బోయి వారితో తాను కల్లు త్రాగి పతనమయ్యానని శంకరభట్టు వాపోయెను. అంత స్వామి, నవ్వుతూ శ్రీపాదవల్లభులే ఆ రూపము దాల్చి, నీ చేత అమృతమును కల్లు రూపమున త్రాగించినారని, తద్వారా నీ జాతకమునందున్న ఎన్నో జాడ్యములను నీకు తెలియకుండకనే పరిహారము గావించినారని తెలిపిరి. వారి మాటలకు శంకరభట్టు ఎంతగానో ఆనందించెను.

దత్తానందుల వారి నుండి శలవు తీసికొని పోవుచుండగా, ఒక అడవి మధ్యలో గల దిగుడు బావిలో ఒకవ్యక్తి, తలక్రిందులుగా పడి యుండెను. అతడు శంకరభట్టును చూడగానే ఆనందముతో అతని పేరును ఆ అపరచిత వ్యక్తి ఉచ్చరించగానే అతని తలక్రిందుల బంధము తెగిపోయి, మామూలు మనిషిగా మారి, బావి నుండి పైకి వచ్చి, శంకరభట్టును చూచి నమస్కరించినాడు. ఆ వ్యక్తి తనపేరు బంగారప్పగా తెలిపి, క్షుద్రవిద్యలను ప్రయోగించుట వల్ల, వల్లభుల శాపముతో తలక్రిందులుగా చాలా కాలం నుండి ఆ బావియందు పడివున్నానని, శంకరభట్టు దర్శనము వల్ల తనకు శాప విమోచనమయినదని తెలిపెను. అటుపై అతడు వల్లభుల ఔన్నత్యముతో బాటు తన క్షుద్రవిద్యలను వల్లభులు

నిరసించినారని తెలిపినాడు. శ్రీ పాద వల్లభులు సమస్యలను సృష్టించుటలో బహునేర్పరియని, ఆ సమస్యలను తీర్చుటలో వారు బహుచతురులని తెలిపెను. అటుపై బంగారప్ప వీడ్కోలుతో కురుంగడ్డకు శంకరభట్టు పయనమయ్యెను.

శ్రీపాదుల వారి నామస్మరణతో కురువపురమునకు సాగుతున్న శంకరభట్టుకు దారిలో శ్రీమన్నారాయణ అను రైతు తారసపడెను. ఆ యువకుడు తాను శ్రీవల్లభుల భక్తుడనని తెలిపెను. వల్లభుల తాతగారైన బాపనార్యులవారిది, తమది మాల్యాదిపురమను ఒకే గ్రామమని, బాపనార్యులు పీఠికాపురమునకు వలసపోయిన ఎనిమిది సంవత్సరముల తరువాత ఆర్థిక పరిస్థితులు తలక్రిందులైన కారణముగా, వారిని ఆశ్రయించి బ్రతుకు తెరువు చూచుకొనుటకై తాము కూడ పీఠికాపురమునకు పోయినామని తెలిపినాడు. అచ్చట వల్లభులవారు మాపై దయదలచి మాకు గుప్పెడు మినుములు ఇచ్చి, పశ్చిమ దిక్కుగా పోయి, అభీష్టము సిద్ధించిన స్థలములోనే తామిచ్చిన మినుములను పారవేయవలసినదిగా ఆజ్ఞాపించిరి. మేము అట్లే చేసి, చివరకు స్థితిపరుల ఆస్తులకు వల్లభుల దయవలన వారసులమై సుఖించుచున్నామని తెలిపెను. శ్రీమన్నారాయణ ఆధ్యాత్మిక సంబంధిత విషయములు నాతో చర్చించుచూ, సమస్త కర్మములకు వేదమే మూలమని, యజ్ఞమనునది కర్మ నుంచి వచ్చినదని, యాగముల చేత జనులు దేవతలనారాధించినచో, దేవతలు జనులకు శ్రేయస్సునిత్తురని తెలిపెను. గోమాత నెయ్యి, పాలు, పెరుగు ప్రసాదిస్తూ, మానవులకు ఇహలోక సుఖములతో బాటు, ఆ ద్రవ్యముల ద్వారా చేయు యజ్ఞముల వల్ల పరలోక సుఖములను గూడ అందించుచున్నదని అనెను. మాకు సర్వకాల సర్వావస్థలయందు శ్రీపాద వల్లభులే దిక్కు. వారి నామస్మరణ మాకష్టములను బాపినది. జీవుల యొక్క రోదనలను శ్రీ పాదులవారు తప్పక స్వీకరింతురు. వారి వారి కర్మానుసారముగా ఫలితములనిచ్చుటతో బాటు పాపకర్మల తీవ్రతను తగ్గింతురు. రక్షణయు, శిక్షణయు రెండూ వల్లభులే చేతురు. నిశ్చల భక్తితో వారినారాధించు వారియెడ వారు సదాప్రసన్నులై ఉంటారు. ఆస్తికులను ఇబ్బందులకు గురిచేయువారిని శిక్షింతురు. వారి దివ్య నామస్మరణము చేయునపుడు, వారు సూక్ష్మరూపములో అచ్చటనే సంచరించుచూ భక్తులను రక్షించెదరని మాకెన్నోమార్లు అనుభవమయ్యెనని తెలిపెను. ధర్మనిష్ఠులకు కొంగు బంగారమై ధర్మభ్రష్టులను కఠినముగా యమధర్మరాజువలే శిక్షింతురు. కావున శ్రీవల్లభుల వారిని సదామనమున నిలుపుకొని కురుంగడ్డకు పోవలసినదిగా శంకరభట్టునకు చెప్పి నిష్క్రమించెను.

అటుపై కురుంగడ్డకు శ్రీవల్లభుల దర్శనార్థము పోవుచున్న శంకరభట్టునకు, మార్గమధ్యములో, తనను దుర్మార్గుల బారి నుండి రక్షించమని ఒక స్త్రీ ఆర్తనాదము చేయుచూ అతని కాళ్లపై బడినది. ఆమెను ఇద్దరు ఆగంతకులు వెంబడించుచుండిరి. ఆమెను లేవదీసి, రక్షించెదనని శంకరభట్టు అభయమునొసంగెను. ఇంతలో ఆ ఆగంతకులు శంకరభట్టు వద్దకు వచ్చి ఆ స్త్రీని వదలివేయమని లేనిచో చంపివేయుదుమని హెచ్చరించిరి. శ్రీ వల్లభులను తన మనమున స్మరిస్తూ, ఆ ఆగంతుకులకు వారి దుర్భర గతజీవితము గుర్తుచేస్తూ, ఈ పనిచేసిన యెడల వారు కుష్ఠురోగులు కాగలరని వారిని శంకరభట్టు బెదిరించెను. వారి గత జీవితము పొల్లుపోకుండా తెల్పిన ఆతని శాపము నిజమగునని ఆ ఆగంతకులు భయపడి, శంకరభట్టును శరణుజొచ్చిరి. వారు తాము గతములో ఎన్నో పాపములు చేసితిమనియు, తాము దానితో బాటు కల్లుసేవించి ఈ స్త్రీని గూడ బలత్కారము చేయుటకై వెంబడించుచున్నామని తెలిపిరి. బ్రాహ్మణులమైననూ గోమాంస భక్షణము చేసితిమని, తాము చేసిన తప్పులు తెలుసుకొంటిమని కాబట్టి, తమ తీవ్రమయిన దోషములకు పరిహారములను తెలియజేయవలసిందిగా అతనిని కోరిరి. తాను కురుంగడ్డకు శ్రీ వల్లభుల దర్శనార్థము పోవుచున్నానని వారు పశ్చాత్తాపము పడుచున్నారు గావున వల్లభులను దర్శించి ఎంతటి పాపములనైనా పరిహారము చేసుకొనవచ్చునని వారికి శంకరభట్టు తెలిపెను. వారు అతనితో కురుంగడ్డ పోయి శ్రీ వల్లభుల దర్శనము చేసికొనగలమని తెలిపిరి.

అప్పుడు శంకరభట్టు తాను రక్షించిన ఆ స్త్రీని ఆమె వివరములు తెలుపమని కోరెను. ఆమె తనపేరు సుశీలయని, వివాహమైన బ్రాహ్మణస్త్రీనని తెలిపెను. నపుంసకుడైన భర్త, అత్తమామలు పెట్టు చిత్రహింసలు అధికముగా నుండిన కారణమున జీవితముపై విరక్తి చెందితినని, వారు ఇంటి నుండి తనను వెళ్లగొట్టిరని, అడవిలో ఒంటరిగా తిరుగుతున్న తనను బలత్కరించబోయిన ఒక బ్రాహ్మణమాంత్రికుని హతమార్చితినని, అటునుండి పోయి, ఒక ఔదుంబర వృక్షఛాయలో సేదదీరుతూ, దత్తనామస్మరణమును ఒక గుట్టపై ధ్యానము చేసుకొనుచుండగా, ఈ ఆగంతుల బారిన పడితినని ఆమె తెలిపెను. ఆమె వృత్తాంతము వినిన శంకరభట్టు, ఆమెతో దత్తనామస్మరణమే నిన్ను రక్షించినదని, ఇప్పుడు దత్తుడు శ్రీ

వల్లభుల రూపమున కురుంగడ్డలో ఉన్నారని, తనతో వారిదర్శనార్థము రమ్మని తెలిపెను. అంత వారు నల్గురు కలసి మార్గమధ్యమున నామానందుడను మహాత్ముని కుటీరములోనికి ఆ రాత్రి బసచేయుటకు వెళ్లిరి.

సుశీల దీనగాథ వినిన నామానందులవారు ఆమెకు అనఘావ్రతము చేసి, అనఘాదేవి సమేత శ్రీ దత్తాత్రేయుల వారిని ప్రసన్నము చేసుకొనమని, శ్రీపాద శ్రీవల్లభుల నామస్మరణము చేయుచూ వారు ఉపదేశించిన సిద్ధ మంగళస్తోత్రమును పఠించినా కష్టములు తీరగలవని తెలిపెను.

ఆమె ఆ రాత్రియంతయు సిద్ధమంగళస్తోత్రమును పఠించుచూ, శ్రీ పాదులవారి నామస్మరణముతో గడపి, ఉదయమే వల్లభస్వామికి మంగళహారతి ఇచ్చినది. ఆశ్చర్యముగా కొద్దిసేపటికే, ఆమె అత్తమామలు, భర్త, ఆమె కొరకై వచ్చుచున్నారని, ఒక బండివాని ద్వారా ఆశ్రమమునకు వర్తమానము చేరినది. కొద్దిసేపట్లో వారందరూ ఆశ్రమము చేరిరి. శ్రీపాదుల వారి దయవల్ల ఆమె భర్తకు నపుంసకత్వము పోయి, అత్తమామలు సత్ప్రవర్తనకలిగి ఆమెను ఆదరించి, ఆశ్రమము వద్ద అందరి శలవుగైకొని తమ ఇంటికి ఆ వనితను తోడ్కొనిపోయిరి. అయితే బండివాని రూపమున శ్రీవల్లభులే వచ్చి సుశీలను అనుగ్రహించారని అందరూ అటుపిమ్మట గుర్తించారు.

అటుపై కురుంగడ్డ చేరిన శంకరభట్టునకు శ్రీపాదవల్లభుల వారి దర్శనమయ్యెను. వారి దివ్యమంగళ స్వరూపమును, ఎన్నో కష్టనష్టములకోర్చి, కురుంగడ్డచేరి, చూచిన శంకరభట్టు తన్మయుడయ్యెను. శ్రీవల్లభులు అతనిని ఆశీర్వదించి, అతనిపై వారి అమృతదృష్టిని కురిపించారు.

శంకరభట్టుతో వచ్చిన ఇద్దరు అగంతకులు శ్రీవల్లభుల సమీపమునకు బోవ సాహసింపలేకపోయిరి. మార్గములో తనను కలసిన ఇద్దరు బ్రాహ్మణులు తమ దుష్టప్రవర్తనమును నశింపచేసుకొనుటకు మీపాదములపై బడి క్షమాభిక్ష కోరుకునుటకు అభిలషించుచున్నారని శంకరభట్టు శ్రీవల్లభుల వారికి తెలిపెను. వారిని చూచిన వల్లభులు శంకరభట్టుతో వీరు బ్రాహ్మణులు గారు ముస్లిములు అని అనగా, వారిద్దరు తాము బ్రాహ్మణులము కామని ముస్లిములమని వల్లభులను క్షమించమని కోరిరి. సత్ప్రవర్తన కలిగి మెలగెదమని తమను అనుగ్రహించమని వేడుకొనిరి. వారి మన్ననలను నమస్కారములను స్వామి స్వీకరింప నిరాకరించి, వారిని అచ్చట నుండి వెంటనే వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించారు. శ్రీవల్లభులు వారితో మీరు చేసిన తప్పులకు, పాపములకు రాబోయే జన్మలలో కర్మ అనుభవించక తప్పదని, తెలిపిరి. అయిననూ వారిరువురూ శ్రీవల్లభులను తమను క్షమించి, రక్షించమని అదేపనిగా పదే పదే వేడుకొనుట వలన శ్రీ వల్లభులు వారిపై కరుణచూపారు. తమ దర్శనభాగ్యము పొందిన కారణమున అనేక శతాబ్దముల తరువాత, మరాఠా దేశమందు శిలధీ అను గ్రామము (నేటి శిరిడీ) ఒక సిద్ధక్షేత్రమగునని, ఆ గ్రామము నందు బడేబాబా, అబ్దుల్‌బాబా అను పేర్లతో జన్మించి, సుప్రసిద్ధులై, తాము సంపూర్ణ సద్గురు అవతారమైన సాయిబాబాగా అవతరించినప్పుడు సేవించి తరించి, తమచే ఉద్ధరింప బడుదురని తెలిపి, వెంటనే వారిని ఆ ప్రదేశము విడిచి వెళ్లిపొమ్మనిరి. వారు వెనువెంటనే అచ్చటనుండి నిష్క్రమించిరి.

శ్రీవల్లభులు శంకరభట్టును మఠమునందుండమని ఆజ్ఞాపించిరి, మఠము నందు శంకరభట్టు మహా నైవేద్యము పాత్రలు శుభ్రపరచుట, నిత్య అన్నసంతర్పణ వగైరా పనులతో బాటు, స్వామిని కనిపెట్టుకొని, వారికనుసన్నలలో మెలిగేవాడు. ఆ మఠమునందు రవిదాసు అను రజకుడు శంకరభట్టుకు పరిచయమయ్యెను, అతని తండ్రి పేరు తిరుమలదాసని అతడు తెలిపెను. వెంటనే గతంలో తాను కాణికాపురమందు దర్శించిన మహాజ్ఞాని, శ్రీవల్లభుల భక్తుడు, తనకు శ్రీవల్లభుల గూర్చి ఎంతో విలువైన సమాచారమిచ్చిన రజకుడైన తిరుమలదాసు అతని తండ్రి అని తెలియగానే శంకరభట్టు ఎంతో ఆనందపడెను. కురువపురములో వల్లభుల సేవలో తమ కుమారుదున్నాడని తిరుమలదాసు తనతో అన్నమాటలు గుర్తుకువచ్చెను. కురుంగడ్డలో కృష్ణానదికి ఆవలిగట్టు నుండి ఈవలి గట్టుకు పడవనడుపుతూ, భక్తులను వల్లభుల దర్శనానికి నది దాటించే వల్లభభక్తుడే రవిదాసు. ఒకానొక సందర్భంలో ఒక పండితుని గర్వమణచి, అతని తపఃఫలమునంతయూ శ్రీవల్లభులు రవిదాసుకు ధారపోసిరి. రవిదాసు శ్రీపాదులవారి దుస్తులను ఉతుకుట, మఠప్రాంగణమును శుభ్రము చేసి, ముగ్గులు వేయుట మొదలయిన సేవలను చేసి తరించేవాడు. శ్రీ పాదులవారు నదీ స్నానానికి వచ్చినప్పుడల్లా, వారికి సాష్టాంగ నమస్కారము చేసుకునేవాడు, అతని నమస్కారములను చిరునవ్వుతో వల్లభులు స్వీకరించేవారు. శ్రీపాదులవారు సర్వాంతర్యామి అని, వారిని సేవించుకుని తరించవలసినదిగా తన తండ్రి తిరుమలదాసు చెప్పిన మాటలు అతడు జ్ఞప్తిలో

ఉంచుకుంటూ, వాటిని యధాతధంగా అమలుపరచుకొని, వల్లభుల దయకు పాత్రుడు కాగలిగాడు. ఒకరోజు ఒక మహారాజు తన యువతీజనము, పరివారముతో నదియందు స్నానమాడుచుండగా చూచి రాజుగా జీవించవలెనన్న తన కోర్కెను వల్లభులతో విన్నవించుకొనెను. శంకరభట్టు సమక్షములోనే శ్రీవల్లభులు అతనికోర్కెను మన్నించి, అనతికాలములోనే నెరవేరగలదని అనిరి. అతనిపై స్వామివారికి గల ప్రేమను చూచి శంకరభట్టు సంభ్రమాశ్చర్యములకు లోనయ్యెను.

ఈవిధముగా శంకరభట్టు వల్లభుల వారి మఠమునందు ముఖ్యపాత్ర పోషించుచూ, స్వామివారి ఆనతి మేరకు అనేక కార్యక్రమములు నిర్వహించెడివాడు. మఠమునకు శ్రీవల్లభుల దర్శనార్థమై వచ్చు భక్తులతో సంభాషించుచూ, తాను వల్లభుల చరిత్ర వ్రాయుటకు ఉపకరించే ఎంతో ముఖ్యమైన సమాచారాన్ని వల్లభుల భక్తుల నుండి, సన్నిహితుల నుండి సేకరించేవాడు. అదే విధముగా వల్లభుల దర్శనము చేసుకున్న పండితుల, మహామహుల అనుభవములన్నీ, వల్లభుల వారి సన్నిధిలో నుండి ప్రత్యక్షముగా పరికించేవాడు. స్వామి వారి ఆనతితో మాంచాల గ్రామము వెళ్లి అక్కడ కొలువైయున్న మంచాలమ్మ గ్రామ దేవతను దర్శించి, ప్రత్యక్షంగా ఆమెతో సంభాషించి, ఆమాత ఆశీస్సులను అందుకొనెను. వల్లభులకు అత్యంత సన్నిహిత భక్తులైన ధర్మగుప్తులతో కలసి ప్రతినిత్యము శ్రీవల్లభుల వారి సమక్షములో, స్వామి నుండి ఎన్నో ఉపదేశములను పొందేవాడు. ఒకసారి ధర్మగుప్తులు శివతత్వము, రుద్రాక్ష మహత్యముల గూర్చి ఈ క్రింది విధముగా శంకరభట్టుకు తెలిపిరి.

శివభక్తులకు రుద్రాక్షధారణ తప్పనిసరి. రుద్రాక్షలలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతులను నాల్గు రకముల రుద్రాక్షలు గలవు. తెల్లరంగు రుద్రాక్షలు బ్రాహ్మణ జాతివి, ఎర్రని తేనె రంగు రుద్రాక్షలు క్షత్రియజాతివి, చింతరంగు రుద్రాక్షలు వైశ్యజాతికి చెందినవి. నల్లటి రుద్రాక్షలు శూద్రజాతికి చెందినవి. బరువులేని రుద్రాక్షలు, లేత రుద్రాక్షలు ధరించరాదు.

రుద్రాక్షలలో ఏకముఖి రుద్రాక్ష శివ స్వరూపం, ద్విముఖ రుద్రాక్ష అర్ధనారీశ్వర స్వరూపం, త్రిముఖ రుద్రాక్ష అగ్ని స్వరూపం, చతుర్ముఖి రుద్రాక్ష సుబ్రహ్మణ్యస్వామి స్వరూపం, సప్తముఖి రుద్రాక్ష మన్మధుని రూపం, అష్టముఖి రుద్రాక్ష రుద్ర భైరవ రూపం, నవముఖి రుద్రాక్ష కపిలముని స్వరూపం, నవముఖి రుద్రాక్ష ధర్మదేవతా స్వరూపం, దశముఖి రుద్రాక్ష విష్ణుస్వరూపం ఏకాదశ ముఖి రుద్రాక్ష సాక్షాత్తూ రుద్రాంశరూపం, ద్వాదశ ముఖి రుద్రాక్ష ద్వాదశాదిత్యరూపం. ఈవిధంగా ఒక్కొక్క రుద్రాక్షలో ఒక్కొక్క దేవతా స్వరూపం ఉంటుంది. రుద్రాక్షలకు, వివిధ దేవతా స్వరూపములకు దగ్గర సంబంధంగలదని ధర్మగుప్తులు శంకరభట్టుకు వివరించిరి.

ఒకరోజు శంకరభట్టును పిలచి ధర్మగుప్తుల వారిని వెంట తీసికొని పంచదేవపహడ్ అను గ్రామమునందు వారు సభనిర్వహించుటకు గడ్డితో గృహ నిర్మాణము చేయమని వల్లభులు ఆజ్ఞాపించిరి. పంచదేవపహడ్ పోయి గృహనిర్మాణ విషయమై ఒక పంటకాపుని సంప్రదించగా, అతడు వారిపై ఆగ్రహించి, వారిని బంధించెను. జరిగినది తెల్సుకొనునంతలోనే, వల్లభుల అనుగ్రహముతో అచ్చట శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి సోదరుడైన, పంటకాపు మారురూపంలో ఉన్న, విరూపాక్షుని ఆధ్వర్యములో దర్బారు చేయుటకు ఒక్కరోజులో గృహ నిర్మాణము చేయబడెను. శ్రీపాదుల మహేంద్రజాలముతో అక్కడ సర్వహంగులతో నిర్మింపబడిన గృహములో వారి సోదరియగు వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినవేడుకలతోబాటు నగరేశ్వరస్వామితో వాసవీమాత వివాహమునకు నిశ్చయతాంబూలములను ఇచ్చి పుచ్చుకొను కార్యక్రమము ఎంతో వైభవముగా జరిగెను. ఈ దృశ్యమంతయూ శ్రీ వల్లభుల చరిత్రలో పొందుపరచుటకు శంకరభట్టుకు ప్రత్యక్షంగా వీక్షించు అవకాశము వల్లభులు కల్గించిరి.

ఒక పర్యాయము శంకరభట్టు కోరికననుసరించి వల్లభులు శ్రీదేవీతత్వము గూర్చి తెలిపారు. దశమహా విద్యారూపముగా శ్రీదేవీతత్వము ఉపాసింపబడునని, దశమహావిద్యలలో కాళి, తార, ఛిన్నమస్త, షోడశీమహేశ్వరి, భువనేశ్వరీదేవి, త్రిపురభైరవి, ధూమ్రావతి, భగళాముఖి, మాతంగి మరియు కమలాలయ అను అమ్మవారి స్వరూపములను సాధకులు వివిధ పద్ధతులలో అనుష్ఠానము చేసి, సంబంధిత శక్తులు పొందెదరని తెలిపిరి. అనఘాదేవినే దశమహా విద్యాస్వరూపిణి అందురని తెలిపారు. దశమహావిద్యలు ఎవరి ద్వారా బోధింపబడవలెనో వారి ద్వారానే నీకు తెలియజేయుదునని వల్లభులు శంకరభట్టుతోననిరి.

మరియొక పర్యాయము శంకరభట్టు వల్లభుల వారిని తనకు నవనాధుల గూర్చి తెలుసుకొనవలెనన్న కుతూహలము గలదని, వారిని గూర్చి తెలుపవలసిందిగా కోరెను. అంత వల్లభులు, వారందరూ అవధూతస్థితిలో నుండు సిద్ధపురుషులనియు, వారినే నవనాధులని అందురనియు, వారిని స్మరించువారిపై, దత్త ప్రభువులకు అనుగ్రహము కల్గునని, వారందరు దత్తుని అంశ గలవారని తెలియజేసిరి.

ఒకరోజు శ్రీ వల్లభులు శంకరభట్టును పిలచి ధర్మగుప్తుల వారితో కలసి పీఠికాపురమునకు పోవలసినదిగా ఆజ్ఞాపించిరి. వారి ఆశీర్వాదములతో శంకర్‌భట్టు, ధర్మగుప్తులు బయలుదేరిరి. మార్గమధ్యమున అన్ని దశమహావిద్యలపై పూర్తి అవగాహన వచ్చునట్లుగా వల్లభులు వారిద్దరికీ ఎన్నో సమస్యలు సృష్టించి ఆ సమస్యలను వారే పరిష్కరించి, వారిని కృతార్థులను చేయుటయే గాక, గతంలో వారు వక్కాణించినట్లు దశమహావిద్యలను వారికి అనుభవపూర్వకముగా బోధించే ఏర్పాటు చేసిరి. వారికి తమ అనుభవములో దశమహావిద్యలలో ఏదేవిని ఉపాసకులు ఏవిధంగా కొలచి, యేయే శక్తులను కైవసం చేసుకుంటారో కూడ తెల్పినది. సాధకులు వక్రమార్గము ద్వారా ప్రలోభాలకు లొంగి స్వార్థానికి ఈ విద్యలను తప్పుదారి పట్టించి, భక్తులను ఇబ్బందులకు గురి చేసినప్పుడు, వల్లభులు ఏదో రూపములో స్వయముగా భక్తులను, ఆ సాధకులు సృష్టించిన బాధల నుండి రక్షించేవారు. సాధకులను శిక్షించేవారు. దీనినిబట్టి దశమహావిద్యాస్వరూపిణి అంటే అనఘాదేవియని, వారే వల్లభులని శంకరభట్టుకు అవగతమైనది.

అలా పిఠాపురము పోవుచూ, మార్గమధ్యమున వారు శ్రీవల్లభభక్తులైన నాగేంద్రశాస్త్రి, భాస్కర శాస్త్రి, బంగారయ్య దంపతులు మొదలగు అనేక మంది విజ్ఞులను కలయుచూ, వారి అనుభవములందు కూడ తగిన పాత్ర వల్లభుల దయ మేరకు పోషించుచూ, ముందుకుసాగి వారిరువురూ పీఠికాపురము చేరినారు. పీఠికాపురమందు శ్రీవల్లభుల తల్లిదండ్రులను, ఇతర కుటుంబ సభ్యులను కలసి, వారితో ఎన్నో విషయములను ముచ్చటించినారు. శ్రీవల్లభుల దర్శనార్థము వారందరూ కురువపురము పోవలయునని గుర్రపు బండ్లను కుదుర్చుకొనిరి. వారితో వీరిరువురూ గూడ తిరిగి కురవపురము చేరినారు. ఎంతో వ్యయ ప్రయాసలతో పీఠికాపురము నుండి కురువపురము చేరవలసిన వారందర్నీ గుర్రపు బండ్లతో సహా అతి తక్కువ సమయములో సుఖముగా శ్రీవల్లభులు తమ మహేంద్ర జాలముతో కురువపురమునకు చేర్చిరి. పంచదేవపహాడ్ నందు దర్బారు చేయుచున్న శ్రీవల్లభులను వారి కుటుంబ సభ్యులతో బాటు శంకరభట్టు గూడ దర్శించెను. వారి కుటుంబ సభ్యులు తిరిగి పీఠికాపురమునకు వెళ్లిన పిదప, శంకరభట్టు మఠములో స్వామివారి సేవ చేయుచూ, వారి ఆదేశము ప్రకారము నిత్య కార్యక్రమములు చేసుకొనుచుండెను.

ఒకరోజు ఒక బ్రాహ్మణుడు తాను చాలాకాలము నుండి కడుపునొప్పితో బాధపడుచున్నానని, తగ్గించవలసిందిగా వల్లభులను వేడుకొనెను. అతనిని జూచి, వల్లభులు పూర్వజన్మలో నీవు ఎందరినో దుర్భాషలతో, సూటిపోటి మాటలను వాగ్బాణములతో బాధపెట్టినావు. దాని ఫలితముగానే, నేడు ఈ కడుపునొప్పి వచ్చినది. మానవుల వాగ్దోషములు పోవుటకు ఈ కలియుగములో భగవంతుని నామస్మరణ ఒక్కటే శరణ్యమని మూడు రాత్రింపగళ్లు శ్రీపాద వల్లభనామము నిర్విరామముగా స్మరించవలసినదిగా, భగవంతుని నామస్మరణము వల్ల వాయుమండలము శుద్ధికాగలదని తెలిపిరి. అట్లు చేసిన ఆ బ్రాహ్మణునకు కడుపునొప్పి నివారింపబడినది.

ఈ సందర్భంగా, వల్లభులు శంకరభట్టుతో నాయనా! మానవుడు ఎదుటి వారిని దుర్భాషలాడకుండా, సహనముతో ఉండాలని, అనుష్ఠానము ద్వారా కోప, తాపములు తగ్గించుకొని సన్మార్గములో నడువవలయునని ఎవరయినా మన సహాయము కోరినచో, వీలు కలిగినచో సహాయము చేయవలెను. లేదా సహాయము పొందగలిగే వేరొక ప్రదేశము గాని వ్యక్తిని గాని చూపవలయును. అదికూడ వీలుకానిచో శాంతివచనమునతో నావల్ల ఆ కార్యము కానేరదని తెల్పుము. అంతేకాని మాటలలో గాని చేతలలో గాని నిర్దయ, నిర్దాక్షిణ్యము చూపకూడదనిరి.

మరొక పర్యాయము ఒక క్షయవ్యాధి పీడితుడు కురువపురము వచ్చి, స్వామితో తన క్షయవ్యాధి తగ్గించవలసిందిగా కోరాడు. శ్రీ వల్లభులు అతనితో గతజన్మలో నీవు గజదొంగవని, ఎంతోమంది అమాయకుల సొమ్మును అపహరించి వారిని ఇక్కట్లు పాల్చేసినావు. వివాహము కావలసిన ఇంట్లో నీవు దొంగిలించిన సొత్తు వలన ఆ పెళ్లి ఆగిపోయి ఆ పెళ్లి కుమార్తె ఆత్మహత్య చేసుకున్నది. కావున ఇది నీ పాపకర్మ ఫలితము. అనుభవింపక తప్పదని అనిరి. అంత ఆ రోగి స్వామివారిని

పదే పదే ప్రాధేయపడగా, స్వామి కరుణ చెంది, తమ దర్బారైన పంచదేవపహాడ్ నందు కొంతకాలము గోశాలలో మంచినీళ్లను కూడ త్రాగకుండా, మిక్కుటమైన దోమల బాధ అనుభవించుచూ పరుండాలని తెలిపారు. అతడు అట్లు చేయుచుండగా, కొంతమంది రాక్షసులు అతని కంఠము నొక్కి చంపుతున్నట్లు, అతని గుండెలపై పెద్ద బండరాయిని ఉంచినట్లుగా కలగాంచి, ఎంతో బాధకు, వ్యధకు గురియైనాడు, అటుపై అతని రోగము తగ్గినది. ఆ విధముగా మానసికముగా అతని కర్మఫలమును అనుభవింపజేసి వల్లభులు అతనిని కర్మవిముక్తుని చేసినారు.

ఈ విధముగా భక్తుల రోగములను శంకరభట్టు సమక్షంలో కుదుర్చుచూ, శంకరభట్టుకు ఆధ్యాత్మిక విషయాలతో బాటు ఎన్నో దేవరహస్యాలను గూడ శ్రీవల్లభులు బోధిస్తూ ఉండేవారు. రోజులు గడచిపోతున్నవి. శంకరభట్టు సంస్కృతమున తనకు కన్యాకుమారి నుండి బయలుదేరి కురువపురము చేరుకొను ప్రయాణములో కలిగిన అనుభవములతో, వల్లభుల వారి బోధనలతో, వల్లభుల వారి అత్యంత ఆప్తులు, భక్తాగ్రేసరులు ఇచ్చిన సమాచారముతో బాటు తాను వల్లభులకు సాన్నిహిత్యంగా మెలగుతూ చూచిన విచిత్రములు, వారు భక్తులకొనరించిన సేవలతో బాటు వారి మహత్యాలు, బాల్యము, పీఠికాపుర, కురవపుర విషేషాలతో బాటు, వారి దర్బారు నందలి విషయాలను గూడ యేర్చి, కూర్చి, ఎంతో వివరముగా శ్రీ వల్లభుల వారి చరిత్రను లిఖించెను. శ్రీ వల్లభుల వారి చరిత్రను ఒక శుభ ముహూర్తములో ప్రత్యక్షంగా శ్రీ వల్లభుల వారికి తాను లిఖించిన చరిత్రను పూర్తిగా వినిపించెను.

ఆ గ్రంథము విన్న వల్లభులు ఎంతో అపరిమిత ఆనందము చెంది, శంకరభట్టుకు మంగళాశాసనములు చేసిరి. అతనితో నాయనా! నీవు రచించిన ఈ శ్రీపాద శ్రీవల్లభ చరిత్ర మహాగ్రంథమై, మహాయోగులు, మహాపురుషుల చేత అధ్యయనము చేయబడును. శ్రీపాద శ్రీవల్లభునిగా అవతరించిన ఈ దత్తాత్రేయుడు సర్వదేవతా స్వరూపుడు, చతుర్యుగ అవతారము, అవతార పరిసమాప్తి లేకుండా భక్తులను ఉద్ధరించుటకు అవతార పరంపరతో ఉద్భవించును. మనోమయ ప్రపంచమును సరిచేయుటకు ఈ గ్రంథపఠనమెంతగానో తోడ్పడగలదు. ఈ గ్రంథము పారాయణ చేయువారికి తమ తమ ఇబ్బందులు తొలగి సర్వసౌఖ్యములు సమకూరును. ఇందలి వాక్యములన్నియూ సత్యమని, నేను ధృవీకరించుచూ, భక్తులకు సందేహ నివృత్తి చేయుచున్నాను. దీనియందలి ప్రతి అక్షరమునందూ యోగశక్తి అంతర్లీనముగాగలదు. భక్తి శ్రద్ధలతో పఠించిన వారికి బీజాక్షర శక్తి పఠనా ఫలితము కల్గును. ఈ సంస్కృతప్రతికి అన్ని భాషలలోనూ అనువాద గ్రంథములు వచ్చును. ఈ పవిత్ర గ్రంథమును ఏ భాషలో భక్తి శ్రద్ధలు కలిగి యుండి, చదివిననూ వల్లభులపై విశ్వాసము కల్గిన వారికి ఒకే రకమైన శుభఫలితములు కలుగును. ఈ ప్రతి తెలుగు భాషలో గూడ తగిన సమయములో అనువదింపబడి సర్వ తెలుగు జనుల అభీష్టములను నెరవేర్చును. పీఠికాపురమందు నా మహా సంస్థానమేర్పడి నా పాదుకలు ప్రతిష్ఠింపబడి, వాటి దర్శనమునకై భక్తులు చీమల బారుల వలే తరలి వచ్చెదరు. భవిష్యత్తులో కోకనదము అని పిలువబడే వాయసపుర అగ్రహారము (కాకినాడ). శ్యామలాంబాపురము (సామర్లకోట) శ్రీ పీఠికాపురముతో కలిసిపోయి మహాపట్టణమగును. జాతి, కుల, మత, వయో బేధములు లేకుండా దేశమందలి నలుమూలల నుండీ భక్తులు పీఠికాపురమును సందర్శించెదరు. నా సచ్చరిత్ర అధ్యయనము చేయు వారికి ఒక క్రమమైన పద్ధతిలో వికాసము కలుగుచుండును. నన్ను ఆశ్రయించిన వారందరూ నావారే. వారి మంచి చెడ్డలు చూసుకునే బాధ్యతనాదే.

నాయొక్క ఈ శాసనము శిలాశాసనము సృష్టిలోని ఏ ప్రాణికినీ అది అనుల్లంఘనీయమైన శాసనముగా గుర్తింపుము.

నా చరిత్రను రచించిన నీకు ఎన్నో శుభఫలితములు కల్గును. ఆచంద్రతారార్కము నీ ఖ్యాతి వెలుగొందును. దత్తునకు నీయందు అవ్యాజకరుణ, ప్రేమాభిమానములు గలవు. సర్వకాల, సర్వావస్థలయందు దత్తుడు, నిన్ను, వెన్నంటి కాపాడును. నీకిదే నా అభయమని శంకరభట్టు శిరముపై తమ హస్తములతో శ్రీ వల్లభులు ఆశీర్వచనము చేసి, కౌగిలించుకొనిరి.

అంత శంకరభట్టు వారి ముందు సాష్టాంగ ప్రణామం చేస్తూ త్రిమూర్తి స్వరూపా ! త్రివర్ణాంచితా ! వేదవేద్యా ! విశ్వవంద్యా ! విశ్వరూపా ! ఒకప్పుడు పులితోలు ధరిస్తావు. మరొకప్పుడు పీతాంబరం ధరిస్తావు. ఇంకొకప్పుడు శ్వేతవస్త్రం ధరిస్తావు. గంగలో స్నానం చేస్తావు. కొల్హాపురంలో శ్రీలక్ష్మీదేవివద్ద భిక్ష తీసుకుని సహ్యాద్రిపై సంచరిస్తావు. ఒక్కొక్కప్పుడు

బాలునిగా, మరొకసారి వృద్ధునిగా, ఒక్కొక్కసారి జటాధారిగా, మరొకసారి ముండిత శిరస్కునిగా, ఒక్కొక్క ముహూర్తాన దివ్యమాలికాదివ్యభరణ, దివ్యవస్త్రములను ధరించి, దివ్యసుందర విగ్రహుడవై కనిపిస్తావు. అనంతనామా ! దత్తప్రభూ ! శ్రీ వల్లభా ! నీకివే నా మనోవాక్యములు, సాష్టాంగ ప్రణామములు. శాంతి, క్షాంతి, దయ, ధృతి, స్మృతి, మతీ అన్నీ నీవే. భూత భవిష్యత్ వర్తమానములు నీవే. సర్వవ్యాకరణ స్వరూపుడవు నీవే. ఈ సృష్టిలో నీవు లేనిదేదియూ లేదు. నువ్వు కానిదేదియూ కూడలేదు. సర్వాత్మకా! సర్వాంతర్యామివి. నీకివే నానమస్సులు. నన్ను కరుణించి, అనుగ్రహించు" అంటూ ఈ గ్రంథము నీవు వ్రాయించినదేగాని, అంతటిశక్తి నాకు లేదని తెలిపి వినయపూర్వకముగా సాష్టాంగ ప్రణామముచేసెను. అతని స్తోత్రమును వల్లభులు చిరుమందహాసంతో ఆలకించి ప్రసన్నులైనారు.

అటుపై ప్రతినిత్యము ఆభక్తశిఖామణి శ్రీవల్లభుల సేవలో నిమగ్నమై వారి మఠమునందే, వారి కనుసన్నలలో ఆనందంగా జీవిస్తూ ఉండేవాడు.

శంకరభట్టు సంస్కృతంలో వ్రాసిన శ్రీపాదుల వారి దివ్య చరిత్రను తెలుగు అనువాదం శ్రీవల్లభుల వారి వంశంలో 33వ తరము వాడైన కీ॥శే॥ శ్రీమల్లాది గోవింద దీక్షితులు గారి ద్వారా 2001వ సంవత్సరంలో శ్రీపాదుల వారి అభీష్టము మేరకు వెల్లడికాబడింది. శ్రీదీక్షితులు గారి దగ్గర శ్రీవల్లభుల దివ్య చరిత్ర గల్గిన పురాతన తెలుగు వ్రాతపతి శిథిలావస్థలో ఉండేది. కాని శ్రీవల్లభుల ఆదేశం రానందున అది మరుగున పడింది. అయితే వల్లభుల ఆదేశం కోసం ఎదురుచూస్తున్న శ్రీదీక్షితులు గారిని ఒకనాడు భీమవరంలో ఒక యాచకుడు భోజనంకోసం సొమ్ము అర్థించగా, శ్రీదీక్షితులు అతనికి పదకొండు రూపాయలు దక్షిణగా ఇచ్చిరి. ఆశ్చర్యముగా నాల్గురోజులలో ఆ సొమ్ము గాణుగాపురంలో శ్రీనృసింహసరస్వతి వారి ఆలయానికి అందినట్లుగా, భీమవరంలో దానం చేసిన తేదీని ఉదహరిస్తూ గాణుగాపురంలోని నృసింహసరస్వతుల ఆలయంనుండి రశీదు శ్రీదీక్షితులుగారికి పోస్టులో ప్రసాదంతోబాటు వచ్చింది. అంటే వల్లభులే యాచకుని రూపంలో వచ్చి, పరోక్షంగా తన దివ్య చరిత్రను వెల్లడి చేయుటకు సమయం ఆసన్నమైనదని, దానికి యోగ్యుడైన వ్యక్తిగా తన 33వ తరమునకు చెందిన దీక్షితులుగారికి అనుమతి మంజూరు చేసినట్లుగా తలచి, శ్రీదీక్షితులు 2001వ సంవత్సరంలో శ్రీవల్లభుల వారి దివ్య చరిత్రను ప్రజాబాహుళ్యానికి తెలియజేయ సంకల్పించారు. ఫలితంగా శ్రీవల్లభుల వారి చరిత్ర వెలుగులోకి వచ్చింది. అంటే 13వ శతాబ్దపు నాటి సంఘటనలు 20వ శతాబ్దంలో కానీ ప్రజలకు తెలియరాలేదు.

శంకరభట్టు సంస్కృతంలో వ్రాసిన శ్రీవల్లభుల జీవిత చరిత్రలో కొన్ని భాగాలను గంధర్వులు వారివారి లోకాలకు తీసికొని వెళ్లిపోయారు. ఆ కారణంగా వారు రాసిన పూర్తి చరిత్ర ఎవరికీ లభ్యం కాలేదు. అందుబాటులోనున్న కొన్ని భాగాలు మాత్రమే వారి వంశంలో 33వ తరము వారి ద్వారా వెలుగులోకి వచ్చాయి.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-6

# శ్రీపాద శ్రీవల్లభుడు

శ్రీదత్తాత్రేయస్వామి వారి అంశతో సిద్ధగురువులరూపంలో వారి అవతారాలెన్నో ప్రజాబాహుళ్యంలోకి వచ్చాయి. అలా వచ్చిన వారిలో శ్రీపాద శ్రీవల్లభుడు, నృసింహ సరస్వతి, మాణిక్య ప్రభు, స్వామి సమర్థ అక్కలకోట మహారాజ్, శిరిడీ సాయిబాబా, వాసుదేవానంద సరస్వతి, గజనన్ మహారాజ్, ధునివాలీ బాబా, సంత్‌గులాబ్ బాబా, తాజుద్దీన్ బాబా మొదలగు సిద్ధ పురుషులు ఎంతో ప్రాముఖ్యత వహించి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. వారందరూ ఏదో ఒక సందర్భంలో భక్తుల మనోభావాలకు అనుగుణంగా, కోరిన వారికి, దత్తాత్రేయస్వామివారి రూపంలో దర్శనమిచ్చారు. అయితే వీరందరికీ భిన్నంగా శ్రీపాద శ్రీవల్లభుడు తానే దత్తుడని ప్రకటించారు. కావున ఈ పైన తెలిపిన మిగిలిన వారందరూ సిద్ధగురువులైతే, శ్రీపాద శ్రీవల్లభులు మాత్రం సంపూర్ణ దత్తాత్రేయస్వామి వారి ప్రత్యక్ష ప్రప్రథమ అవతారంగా గ్రహించాలి.

శ్రీదత్తాత్రేయస్వామి ఆశ్రమం గల సహ్యపర్వత ప్రాంతంలోని మాతాపురం అను గ్రామంలో విష్ణుదత్తుడను దత్తభక్తుడు నివసించేవాడు. విష్ణుదత్తుని కోరిక మేరకు వారింటిలో జరిగే ఆబ్ధికానికి దత్తుడు భోక్తగా కూడా వెళ్ళి, వారిని ఆశీర్వదించాడు. అతనికి ఎన్నో మహత్తులు ధారాదత్తం చేశాడు. ఆ మహిమలతో విష్ణుదత్తుడు లోకోపకారమైన పనులెన్నో చేసి, ప్రజల మన్ననలను బడసాడు. కాని దత్తుడడిగినాకూడ అతడు మరేమి వరములు కోరలేదు. ఆ విధంగా అతని ఆ జన్మము ముగిసింది. తదుపరి జన్మలో విష్ణుదత్తుడు శీలుడనే బ్రాహ్మణునిగా వారణాసి క్షేత్రమున జన్మించి, దత్తుని విశేషంగా పూజించేవాడు. ఒకసారి వారింట ఆబ్ధికము జరుపుటకై తిథి వచ్చింది. ఆ రోజు ఆ బ్రాహ్మణుని ఇంట ఆబ్ధికము జరుగుచుండగా, ఒక బిచ్చగాడు, ఒక నల్లని కుక్కతో వారింటికి వచ్చి, భిక్ష అడిగాడు. ఆ బిచ్చగానిని ఎంతో వివేకము గలవాడని యెంచి, ఆ బ్రాహ్మణుడు ఆ బిచ్చగానిపై కొన్ని ప్రశ్నలు సంధించాడు. ఆ బ్రాహ్మణుని ప్రశ్నలకు ఆ బిచ్చగాడు ఎంతో నేర్పుతో ఇచ్చిన సమాధానాలకు, ఆ బ్రాహ్మణుడు సంతుష్టతరంగుడై అతనిని, దైవస్వరూపముగా తలచి తన ఇంట్లోకి ఆహ్వానించి, అర్ఘ్యపాద్యములిచ్చి, పుష్పాలతో అతనికి షోడశోపచార పూజచేసి, అతనికి ఆబ్ధీకం కోసం వండిన పదార్థాలలోని కొంత భాగాన్ని నైవేద్యంగా ఇచ్చాడు.

ఆ బ్రాహ్మణుని ప్రవర్తనను చూచి, వారింట ఆబ్ధీకము జరుపుతున్న బ్రాహ్మణులు, దీనిని అనాచారంగా తలంచి, కోపోద్రేకులై, మధ్యలోనే ఆ ఆబ్ధీకము ఆపి, ఆ బ్రాహ్మణుని దుర్భాషలాడుతూ, వెళ్లిపోయిరి. అంతవారు గ్రామములోనికి పోయి తోటి బ్రాహ్మణులందర్నీ పిలిచి, శీలుడు బ్రాహ్మణ మర్యాదను, ఆచార, వ్యవహారాలను మంటగలుపుతూ, ఒక బిచ్చగానిని, ఆబ్ధీకము జరుగుచున్న వేళ, గృహమునకు ఆహ్వానించి, ఆబ్ధీకవిధానాన్ని అవహేళన చేసినాడని, తద్వారా తాము కూడ అవమానింపబడినామని తెలిపారు. దీనితో ఆ బ్రాహ్మణులందరూ, ఆగ్రహంతో కట్టుగాకలసి, గుంపులుగా శీలుని ఇంటికి పోయిరి. ఆ బ్రాహ్మణులందరూ, శీలునితో వాగ్వివాదము చేస్తూ, అతనిపై దాడిచేసి, అతనిని అవమానించి, వేదవిధానముల గూర్చి అతనితో వాదమునకు దిగిరి. అక్కడేవున్న ఆ బిచ్చగాడు వారితో వేదవిధి గూర్చి తనకు వివరింపమని కోరగా, బ్రాహ్మణులు మరింత ఆగ్రహము చెంది, బిచ్చగానికి వేదములు వినుటకు గాని, వాటిని గూర్చి మాట్లాడుటకుగాని అర్హత లేదంటూ ఎంతో పరుషముగా మాట్లాడిరి. అంత ఆ బిచ్చగాడు, తనకు వేదపరిజ్ఞానమేమియూ లేదని, కాని తన కుక్కకు అన్నీ తెలుసునని పలికి, తనతో తీసుకుని వచ్చిన ఆ కుక్క వంక చూచెను. ఆశ్చర్యమగునట్లు, ఆ నల్లకుక్క ఆ బ్రాహ్మణులకు వేదములు, షట్శాస్త్రములు మొ॥నవి వినిపించెను. ఆ చిత్రము చూచి, సిగ్గుతో తలవంచుకుని, ఆ బ్రాహ్మణులు వెడలిపోయిరి. ఆ అద్భుతదృశ్యము గాంచిన, శీలుడు, అతని భార్య ఆ బిచ్చగానికి నమస్కరించి, అయ్యా! మీరు సామాన్యులుగారు. మీరు మేము అత్యంతభక్తితో నిత్యం కొలిచే దత్తాత్రేయస్వామివారే. మీ నిజరూపము మా కెరింగించవలసిందని ఆ దంపతులు అతని పాదములపై సాష్టాంగపడిరి. వారి అత్యంతభక్తి ప్రపత్తులకు ప్రసన్నుడై, శంఖ,

చక్ర, గదా, ఢమరుకధారియై, మాయాముక్తావధూత రూపమున శ్రీదత్తాత్రేయస్వామి వారికి దర్శనమిచ్చెను. అంత ఆ బ్రాహ్మణదంపతులు, నిశ్చేష్టులై, భక్తి శ్రద్ధలతో, చలించిపోయి, తమ అదృష్టమునకు ఎంతగానో సంబరపడుతూ స్వామి పాదములపై బడి ఆనంద భాష్పాలు కార్చసాగారు. అంత స్వామి వారితో బ్రాహ్మణ దంపతులారా! మీరు గత జన్మలో గూడ నాయందు ఎంతో భక్తి గల్గిన విష్ణుదత్తుడు మరియు సోమిదేవమ్మ అని పిలువబడే సుశీల అను బ్రాహ్మణ దంపతులు. మీరు సహ్యాద్రి వద్ద నా ఆశ్రమ సమీపమున నున్న మాతాపురంలో నివసించేవారు. ఆ జన్మలో మీ ఇంట ఆబ్దీకమునకు భోక్తగా అరుదెంచి, అనుగ్రహించినా కూడా మీరు నన్నేదియు మీ కోసం కోరలేదు. అయిననూ మీ పితృదేవతలకందరికీ శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తి కలుగజేసితిని. ఆనాడే మీరు పుణ్యదంపతులని, నాకు సన్నిహితులని గ్రహించాను. ఈ జన్మలో కూడ మీరు నన్నే భజిస్తూ, నన్నే సేవిస్తూ, నా అనుగ్రహానికి పాత్రులైనారు. కావున మీవంటి పుణ్యదంపతుల గర్భవాసమున వచ్చే జన్మమున కుమారునిగా జన్మించాలని నిశ్చయించుకున్నాను. మీరు అప్పలరాజు శర్మ, సుమతీ అను పేర్లతో రాబోవు జన్మమున మరలా బ్రాహ్మణవంశమందు జన్మించెదరు. మీకు నేను శ్రీపాద శ్రీవల్లభుడను నామధేయముతో కుమారునిగా జన్మించి, మిమ్ములను తరింపజేయగలను. ఆ జన్మలో గూడ కాలాగ్నిశమనదత్తుని రూపంలో మీయింట పూజలందుకొందును అని తెలిపిరి. ఆ పుణ్యదంపతుల ఆనందానికి అవధులులేక జన్మ, జన్మలయందు తమకు స్వామిని ప్రత్యక్షంగా దర్శించేందుకు కలుగుతున్న పూర్వపుణ్యమునకు ఎంతగానో సంతోషించి, దత్తాత్రేయస్వామిని స్తుతించి, వారి పాదపద్మములకు నమస్కరించారు. స్వామి వారికి మంగళాశీర్వాదములు తెలిపి అంతర్థానమైరి.

శ్రీపాద శ్రీవల్లభులు సాక్షాత్తూ శ్రీదత్తప్రభువులు. త్రేతాయుగము నందు భరద్వాజుడను మహర్షి, సప్తఋషులతో గూడి సవితృకాఠకచయనమను గొప్ప యజ్ఞము పీఠికాపురమందు శ్రీదత్తాత్రేయుని నుద్దేశించి నిర్వహించెను. ఆ యజ్ఞమునకు పార్వతీపరమేశ్వరులను కూడా ఆహ్వానించెను. యజ్ఞము పూర్తికాగానే దత్తాత్రేయస్వామి ప్రత్యక్షమై తాను ఆ యజ్ఞకర్తల కోర్కెననుసరించి, కలియుగమున సవితృకాఠకచయనమను యజ్ఞము నిర్వహింపబడిన పీఠికాపురమందు శ్రీవల్లభులుగా జన్మింతునని తెలిపెను. పైంగ్య బ్రాహ్మణము అను గ్రంథమున సవితృకాఠకచయనమను మహాయజ్ఞము పీఠికాపురమందు నిర్వహింపబడినదని, భారద్వాజమహర్షి నిర్వహించిన ఈ యజ్ఞఫలితముగా, దత్తుని ఆశీస్సులతో, వారి గోత్రమయిన భారద్వాజస గోత్రములో ఎంతోమంది మహాత్ములు, సిద్ధపురుషులు, జ్ఞానులు, యోగులు అవతరించిరని తెలుపబడినది. వారిలో శ్రీపాద శ్రీవల్లభులు శ్రేష్ఠులు.

ఈ విధముగా దత్తాత్రేయస్వామి శ్రీపాద శ్రీవల్లభులుగా జన్మించుటకు తమ తల్లిదండ్రులను, వారు జన్మించబోవు స్థలమును కూడా ఎంపిక చేసుకొనిరి.

మల్లాది బాపన్నావధానులవారను వేదవేదాంగ విదుడు, ఆగమశాస్త్ర పండితుడు, జ్యోతిష్య శాస్త్రవేత్త గుంటూరు సమీపమున మాల్యాద్రి పురమందుండెడివారు. వారి భార్యపేరు రాజమాంబ. కాలాంతరమున పీఠికాపుర గ్రామపెద్దలైన వెంకటప్పయ్య శ్రేష్ఠి, నృసింహవర్మల ఆహ్వానం మేరకు బాపనార్యులవారు కుటుంబసమేతముగా పీఠికాపురమునకు వలస వచ్చిరి. వారికి వెంకటప్పయ్య శ్రేష్ఠి, నృసింహవర్మలు పీఠికాపురమున గృహవసతితోబాటు, సకల సదుపాయములు ఏర్పాటుచేసిరి. బాపనార్యులు వారు పీఠికాపురమునందున్న బ్రాహ్మణ పరిషత్తుకు అధ్యక్షులై, ఆ గ్రామములో శాస్త్ర విషయములందు అందరికీ తలలో నాలుకవలే ఉండెడివారు. దీనితో వారిపై సాటి బ్రాహ్మణ కులస్థులకు అసూయ, ద్వేషములు కూడా లేకపోలేదు. శ్రీ బాపనార్యుల వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె గలరు. కుమారుని పేరు వెంకావధానులు. కుమార్తె పేరు సుమతి. పూర్వ జన్మలో దత్తాత్రేయస్వామి భక్తుడైన విష్ణుదత్తుని భార్య అయిన సుశీలగా పిలువబడే సోమిదేవమ్మ. ఈ జన్మమున శ్రీదత్తాత్రేయస్వామి వారి ఆశీర్వాదబలముచే 'సుమతి' అను పేరుతో నిష్ఠాగరిష్ఠ బ్రాహ్మణ వంశమైన శ్రీ మల్లాది బాపనార్యుల వారి ఇంట వారి కుమార్తెగా జన్మించినది. పెరిగి పెద్దదై యుక్తవయస్కురాలైనది. సుమతి జాతకమందు సర్వశుభ లక్షణములు ఉండి, ఆమె నడక, వయ్యారములు చూచి తల్లిదండ్రులామెను సుమతీ మహారాణి అని పిలిచెడివారు.

తూర్పుగోదావరి జిల్లా కోనసీమ ప్రాంతంలో గల అయినవిల్లి అను గ్రామమునందు, ఘండికోట గృహనామమును గల్గిన అప్పల లక్ష్మీనరసింహరాజు శర్మ అను వెలనాటి వైదిక శాఖకు చెందిన బ్రాహ్మణయువకుడు గలడు. అతడు

భారద్వాజస గోత్రీకుడు. అతడు కాలాగ్నిశమనదత్తుని భక్తుడు. వారి ఇంట కాలాగ్నిశమనదత్తుని విగ్రహము కలదు. ఆ విగ్రహముతో రాజుశర్మ పూజాసమయములందు. ఏకాంతములో ప్రతినిత్యము ప్రత్యక్షముగా సంభాషించుచుండును. రాజుశర్మకు చిన్నతనముననే తల్లిదండ్రులు మరణించెను. వేదవిద్య యందు అయినవిల్లి గ్రామంలో ప్రాథమికదశ పూర్తిచేసుకున్న అతనికి, ఒకరోజు పూజాసమయమునందు కాలాగ్నిశమనదత్తులవారు సాక్షాత్కరించి, రాజుశర్మను పీఠికాపురము వెళ్లి శ్రీమల్లాది బాపనార్యుల గారి వద్ద ఉన్నత విద్యను అభ్యసించవలసినదిగా ఆదేశించిరి. ఈ రాజుశర్మయే పూర్వజన్మములోని దత్తభక్తుడగు విష్ణుదత్తుడు. అటుపై జన్మలో శీలుడను బ్రాహ్మణుడు.

కాలాగ్నిశమనదత్తుని ఆజ్ఞననుసరించి రాజుశర్మ పీఠికాపురము చేరి, శ్రీబాపనార్యులవారిని కలసి, వారితో తనకు వేదవేదాంగముల యందు ఉన్నత విద్యను బోధించవలసిందిగా కోరెను. అతని కోర్కెను శ్రీబాపనార్యులవారు మన్నించి, అతనిని ఎవరి ఇండ్లలోను యాయవారములు చేసుకొనవద్దని చెప్పి, వారి ఇంటనే భోజన, వసతి సదుపాయములను ఏర్పాటుచేసిరి. ఆ రోజు నుండి రాజుశర్మ వారి ఇంటనే ఉండి, బాపనార్యుల వారి వద్ద విద్యనభ్యసించేవాడు. బాపనార్యుల వారి కుటుంబంతో సఖ్యతగా మెలుగుతూ వారికి చేదోడు వాదోడుగా ఉండేవాడు.

బాపనార్యులవారు ప్రతి శనివారం సాయంత్రం శనిప్రదోష సమయంలో పీఠికాపురంలోని కుక్కుటేశ్వర ఆలయంలో శివారాధన చేసేవారు. ఒకసారి శనిప్రదోష సమయమున కుక్కుటేశ్వరాలయంలో అనేకమంది బంధు, స్నేహిత, పురజనుల మధ్య శివునికి అభిషేకము జరుగుచుండగా కుక్కుటేశ్వర శివలింగము నుండి పెద్ద మెరుపు మెరిసినది. ఆ శివలింగములో నుండి ఒక అశరీరవాణి బాపనార్యులతో నాయనా! నీ కుమార్తెయగు సుమతీరాణిని, అప్పలరాజుశర్మకిచ్చి వివాహము గావింపుము. దీనివలన లోకకల్యాణము జరుగును. ఇది దత్తప్రభువుఆజ్ఞ అని గంభీరముగా పలికెను. ఈ అద్భుతవాణి విని అందరూ ఆశ్చర్యచకితులైరి. మంచి సుముహూర్తము చూచి, తమ గారాలపట్టియయిన సుమతీమహారాణిని, అప్పలరాజుశర్మ కిచ్చి బాపనార్యులవారు గ్రామస్థులు సహకారంతో, వేంకటప్పయ్య శ్రేష్ఠి, నరసింహవర్మల ఆధ్వర్యంలో పండితుల, వేదఘోషల నడుమ, మంగళ వాయిద్యములతో వైభవంగా వివాహం జరిపించిరి. వేంకటప్పయ్య శ్రేష్ఠి నూతన దంపతులకు నామమాత్రపు వెలకు గృహవసతి కల్పించెను. ఆ దంపతులు గ్రామస్థుల మన్నలను బడయుచూ కాలము గడుపుచుండిరి.

కొంతకాలమునకు సుమతీ మహారాణి గర్భము దాల్చినది. తల్లిదండ్రులు, భర్త బంధువులు ఎంతో సంతోషించి సంబంధిత కార్యక్రమములన్నియూ జరిపించిరి. నెలలునిండినవి. ఆమె ఒక మగబిడ్డను ప్రసవించింది. కాని విధి వక్రీకరించి, ఆ పిల్లవాడు గ్రుడ్డివానిగా జన్మించెను. అతనికి శ్రీధరరాజశర్మ అని నామకరణము చేసిరి. మరికొన్ని సంవత్సరముల పిదప సుమతి మరొకసారి గర్భము దాల్చినది. రెండవసారి గూడ విధి వారిపట్ల మరల నిర్దయ వహించి, వారికి రెండవ సంతానముగా ఒక అంగవైకల్యము గల కుంటివానిని కుమారునిగా ప్రసాదించినది. అతనికి వారు శ్రీరామరాజశర్మ అని నామకరణము చేసిరి. తమ ఇద్దరు బిడ్డలు ఈరకముగా అంగవైకల్యము కల్గినవారైనందువల్ల ఆ దంపతులు ఎంతో విచారగ్రస్థులైరి. విధి బలీయమని చింతించుచూ దత్తుని ప్రార్థించుచుండిరి.

శ్రీపాద శ్రీవల్లభ అవతారము అజ్ఞానమనెడి అంధకారమును రూపుమాపుటకు రానున్నది. ఆధ్యాత్మిక భౌతిక ప్రగతిలో జీవులకు ఏర్పడిన కుంటితనమును పారద్రోలుటకు అరుదెంచనున్నది. అందువలన శ్రీదత్తప్రభువులు కాలదేవతను, కర్మదేవతను శాసించిరి. వారి శాసనము ప్రకారం అజ్ఞానాంధకారమునకు ప్రతిగా గ్రుడ్డిబాలుడును, పాకృతిక, అప్రాకృతిక ప్రగతికి సంబంధించిన కుంటితనమునకు ప్రతిగా కుంటిబాలుడు రాజుశర్మకు సంతానమైరి. ఈ విషమపరిస్థితులకు పరమార్థము వేరుగా ఉండును. అది శ్రీవల్లభుల వారికిగాని వేరెవ్వరికీ అంతుబట్టదు. తమ జననమునకు ముందుగా ఈ పుణ్యదంపతులకు కుంటి, గ్రుడ్డి కుమారులను అనుగ్రహించుటలో శ్రీవల్లభుల అంతర్యమెవరికీ తెలియదు.

కొంతకాలమునకు, ఒకనాడు, అయినవిల్లి సుప్రసిద్ధ గణపతి ఆలయము నుండి శ్రీబాపనార్యులవారి బంధువులు ప్రసాదము తీసికొనివచ్చి, రాజుశర్మ, సుమతీ దంపతులకిచ్చిరి. ఆ ప్రసాదము స్వీకరించిన నాటి నుండీ గూడ సుమతికి మంచి స్వప్నములు రాసాగెను. ఐరావతము, శంఖము, చక్రము, గద, కమలము మొ॥ ఆయుధములు, ఋషులు, సిద్ధులు,

యోగులు ఆమెకు స్వప్నమందు దర్శనమీయసాగెను. సుప్రసిద్ధ జ్యోతిష్యులైన శ్రీబాపనార్యులవారు ఇవన్నియు శుభ శకునములని, మన ఇంట ఒక మహాపురుషుని జననమును సూచించుచున్నదని తెలిపిరి. ఆమె భర్త రాజుశర్మ ఆనందముతో ఆతృతకలిగినవాడై, పూజాసమయంలో ఒకనాడు, కాలాగ్నిశమనదత్తుని స్మరించి, పూజించి ఈ శుభలక్షణములకు అర్థము యెరిగింపుమని దత్తుని కోరెను. దత్తుడు సాక్షాత్కరించి, రాజుశర్మ ప్రక్కన కూర్చుని అతని రెండు కనుబొమ్మల మధ్య ప్రదేశమైన భ్రూమధ్యమును తన బొటనవ్రేలుతో తాకెను. వెంటనే రాజుశర్మకు తన పూర్వజన్మము స్ఫురణకు వచ్చెను. ఆ జన్మలో తాను విష్ణుదత్తుడనియు తన భార్య సుశీలయను సోమిదేవమ్మయని, తామిరువురూ విశేష దత్త భక్తులని తెలియవచ్చెను. అంత దత్తస్వామి అతనితో నేను శ్రీపాద శ్రీవల్లభునిగా అవతారము ధరించి నీ ఇంట జన్మింతునని మరియు త్రేతాయుగములో భరద్వాజమహర్షి పీఠికాపురములో సవితృకాఠకచయనమను యజ్ఞము నన్ను ఉద్దేశించి చేసినాడని, ఆనాటి హోమభస్మము మహాపర్వతమువలె పేరుకుపోయినదని తెలిపెను. ఆ భస్మపర్వత ఖండములను ఆంజనేయస్వామి స్వర్గ, మర్త్య, పాతాళములకు కొంపోయెను. మర్త్యలోకమునందు, హిమాలయ ప్రాంతమైన ద్రోణ గిరినందు, మరికొన్ని ప్రాంతములందు ఈ భస్మమంతయూ వెదజల్లబడెను. ఆంజనేయస్వామి ఈ భస్మ ఖండములను తీసుకొనిపోవు సమయములో ఒక చిన్నఖండము గంధర్వపుర (గాణగాపురము) మందు గల భీమ అమరజా పవిత్ర సంగమ ప్రదేశమునందు పడినది. కావున ముందుగా శ్రీపాదశ్రీవల్లభునిగా పీఠికాపురమందు అవతరింతునని, శ్రీపాదశ్రీవల్లభుల అవతారము పరిసమాప్తమయిన పిదప నృసింహసరస్వతిగా జన్మించి, గంధర్వపురమందు నివసిస్తూ అనేక లీలలను ప్రదర్శిస్తూ భక్తులను గాచెదనని కాలాగ్నిశమన దత్తుడు రాజుశర్మకు వివరించి అదృశ్యమయ్యెను. పట్టరాని సంతోషము కల్గి ఈ విషయము పూజానంతరము తన భార్య అయిన సుమతీరాణికి, మామగారైన శ్రీ బాపనార్యులవారికి రాజుశర్మ వివరించెను. అంత ఆ పుణ్యదంపతులతో బాపనార్యులవారు ఇట్లనిరి. పూర్వయుగములోని జన్మయందు విష్ణుదత్తుడు సుశీలయను దంపతులుగా జన్మించి, శ్రీదత్త ప్రభువుకు, సూర్యునికి, అగ్నికి కూడా శ్రాద్ధ భోజనము పెట్టిన పుణ్యాత్ములు మీరు, కావున ఈ జన్మమునందు గూడ దత్తస్వామి ఏదో రూపము ధరించి మీయింటికి భిక్షకై వచ్చును. అందువల్ల మీరిద్దరూ వారి రాకకై వేచిచూస్తూ అప్రమత్తముగా ఉండవలయును. దత్తస్వామి భిక్షకై వచ్చిననాడు ఇంటియందు ఏ కార్యక్రమము జరుగుతున్నా లేక శ్రాద్ధకర్మలు జరుగుతున్నా సరే, సంకోచింపక భోక్తల భోజనములతో నిమిత్తము కూడా లేకుండా నిరభ్యంతరముగా ఆస్వామికి ముందుగా భిక్షనీయవలయును. ఇది శాస్త్రసమ్మతమేనని గుర్తుంచుకోవలసిందిగా ఆ దంపతులను హెచ్చరించిరి. ఆనాటి నుండి ఆ దంపతులు దత్తస్వామి ఆగమనమునకై వేయికన్నులతో ఎదురుచూడసాగిరి. స్థానికంగా కుక్కుటేశ్వరాలయమునందున్న స్వయంభూదత్తుడైన దత్తస్వామి పీఠికాపురమందు అదృశ్యరూపమున ప్రతిరోజూ మధ్యాహ్నసమయంలో భిక్ష చేస్తాడని ఆనాటి భక్తులకు పరిపూర్ణవిశ్వాసం గలదు. ఆ సుదినము రానేవచ్చినది. ఒక మహాలయఅమావాస్యనాడు రాజుశర్మ పితృశ్రాద్ధమునకు సంబంధించిన ఏర్పాట్లుచూచుచుండెను. ఇంతలో 'భవతీ! భిక్షాందేహి' అన్న పిలుపు సుమతీరాణికి వినవచ్చెను. ఇంటిముంగిట ఆజానుబాహుడు, దివ్యసుందరాకారుడు అయిన ఒక అవధూత భిక్షకై నిలుచున్నట్లుగా సుమతీరాణి గాంచెను. వెంటనే సుమతీమహారాణి ఎంతో ఆనందముతో ఆ యతిరాజునకు భిక్షను ఇచ్చెను. అంత ఆ అవధూత ఆనందంతో ఆమెను ఆశీర్వదిస్తూ ఏదైనా వరం కోరుకొమ్మని అడిగెను. అంత ఆసాధ్వి అయ్యా! తమరు అవధూతలు. సర్వమూ తెలిసినవారు. మీవాక్కులు సిద్ధపురుషుని వాక్కులు. శ్రీపాద శ్రీవల్లభులు వంద సంవత్సరముల నుండి ఈ భూమిపై సంచరించుచున్నారని, వారు ఈ భూమిపై జన్మింతురని వినియుంటిని. కావున వారిదర్శనము చేయవలయునని కోరిక మిక్కుటముగా నాయందు ఉన్నది. వారి దర్శన భాగ్యము కల్గించమని కోరినది.

ఆమె మాటలకు ప్రసన్నుడైన ఆ అవధూత భూమి కంపించునంతగా వికటాట్టహాసము చేసిరి. సుమతీమహారాణికి తనచుట్టుప్రక్కలనున్న సమస్తవిశ్వమును క్షణములో అదృశ్యమైనట్లు తోచినది. ఆ ప్రాంతమంతా మాయ కమ్మివేసినది. సుమతీమహారాణి ఎదురుగా 16 సం॥ల వయస్సు గల సుందరబాలుడు యతి రూపమున ప్రత్యక్షమై అమ్మా! నేనే శ్రీపాద శ్రీవల్లభుడను. నేనే దత్తుడను. నీవు కోరినట్లుగా వల్లభరూపముతో దర్శనమిచ్చితిని, నీ ఆతిథ్యముతో ప్రసన్నుడనైతిని. ఎన్నో

పుణ్యకార్యములు చేసిన, మీ దంపతులు విశేషమైన అకర్మను చేసిరి. అందువలన మీకు లోకహితార్థమైన ఫలితము నిచ్చెదను. ఏదైనా వరము కోరుకో ప్రసాదించెదనని తెలిపిరి. ఆ దివ్యమంగళవిగ్రహము చూచి చలించిపోయి, నిశ్చేష్టురాలైన సుమతీమహారాణి ఒక్కసారిగా ఆ మహానుభావుని పాదములపై బడి ప్రణమిల్లి ఆనందభాష్పాలు కార్చసాగింది. అంత వల్లభులు ఆమెను తమ రెండుచేతులతో లేవనెత్తి, అమ్మా! పెద్దదానివైన నీవు నాకు తల్లివంటి దానవు నీవే నీ బిడ్డ కాళ్లపైబడుట తగదు. అది బిడ్డకు ఆయుక్షీణము కూడాను అనిరి. అంతట సుమతి వారితో శ్రీపాద శ్రీవల్లభ ప్రభో! నీవు నన్ను అమ్మా అని పిలిచితివి. కావున నీవే నన్ను తల్లిగాను, నిన్ను బిడ్డగాను అంగీకరించితివి. నీది సిద్ధవాక్కు. ఆ మాటనే నిజము చేసి, మాకు పుత్రునిగా జన్మించవలసినదని కోరెను. అంత శ్రీవల్లభులు తథాస్తు! ఇప్పుడు నీవు దర్శించిన ఈ శ్రీపాద శ్రీవల్లభ రూపముననే నేను నీకు జన్మించెదను. తల్లి, బిడ్డపాదములపై బడుట, బిడ్డకు ఆయుఃక్షీణము. నేను ధర్మ, కర్మ సూత్రములకు వ్యతిరేకముగా నడువను గనుక 16 సంవత్సరములు వచ్చు వరకూ మాత్రమే మీ బిడ్డగా జీవించెదను అనిరి. వెంటనే ఆ మాత అయ్యో! ఎంతటి అపచారము కలిగినది. 16 సంవత్సరముల వరకేనా నీ ఆయువు! అని విలపించసాగెను. అందుకు శ్రీవల్లభులు చిరునవ్వు చిందిస్తూ అమ్మా! 16 సంవత్సరముల వరకూ మీరు చెప్పినట్లే నడచుకొందును. "వర్షే షోడశే ప్రాప్తే పుత్రం మిత్రవ దాచరేత్" అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అంటే 16 సంవత్సరములు వయస్సు వచ్చిన పుత్రుని మిత్రునివలే భావించవలయునుగాని అతనిపై ఆంక్షలు విధించరాదు. నన్ను వివాహము చేసుకొనమని నిర్బంధించరాదు. నేను యతినై యథేచ్ఛగా విహరించుటకు అనుమతినీయవలయును. నా సంకల్పమునకు వ్యతిరేకముగా మీరు ప్రవర్తించిన యెడల నేను మీ ఇంటివద్ద ఉండనని షరతులు విధిస్తూ ఆమె జవాబుకొరకై ఎదురుచూడకుండా వెనువెంటనే వడివడిగా ముందుకు పయనమై వెడలిపోయి అదృశ్యమైరి. వారు అదృశ్యమైన వెంటనే ఆ ప్రాంతమంతా వెలుగులుచిమ్మి, మాయగూడ అంతర్ధానమైనది. సుమతీమహారాణి, నోటమాట రాక కొంతసేపు అట్లేయుండెను. మరికొంతసేపటికి స్పృహవచ్చి తేరుకుని, పరుగుపరుగున లోనికిపోయి, జరిగిన వృత్తాంతమంతయూ ఆమె భర్తకు ఎరింగించెను. శ్రీవల్లభులు కుమారునిగా జన్మించి కేవలం వారు 16 సం॥ల వరకే తమవద్ద ఉంటారని తెలుపుతూ దుఃఖించుచుండెను. ఆవార్త విని ఆనందపారవశ్యుడైన రాజుశర్మ ఆమెను ఓదార్చుచూ, మీతండ్రిగారు ఊహించి, చెప్పినట్లుగానే దత్తస్వామి అరుదెంచినారు. శ్రీపాద వల్లభ జననమైన పిదప మిగిలినవిషయములు ఆయాసమయములకు అనుగుణంగా ఆలోచించుకొనవచ్చును. అందువల్ల ఈ సంతోషసమయమందు దుఃఖము తగదని ఆమెకు నచ్చచెప్పెను. ఈ వార్త దావానలములా ఆనోట, ఈనోట ప్రాకి పూరంతా మార్మోగెను. కొందరు అసూయపడిరి. మరికొందరు సంతోషించిరి. ఇంకొందరు కల్పనగా కొట్టిపారేశారు. శ్రాద్ధకర్మదినమున భోక్తలు భుజించకుండా, అవధూతకు భిక్షనిడుట దోషముగాదని, సంశయించవలసిన అవసరంలేదని బాపనార్యులవారు తమ కుమార్తె అయిన సుమతికి తెలిపిరి. దత్తుని దయవలన ఆరోజు పితృకార్యము నిరాటంకముగా రాజుశర్మ ఇంట పూర్తిగావింపబడెను. ఇట్లు కొంతకాలము గడిచినది. సుమతీమహారాణి గర్భము దాల్చినది.

విశ్వానికంతటికీ ఎంతో పుణ్యదినమైన గణేశచతుర్థశినాడు ఉషఃకాలములో సింహలగ్నమునందు చిత్తా నక్షత్రమందున శ్రీపాద శ్రీవల్లభులు తమ మాతృగర్భమునుండి జ్యోతిస్వరూపముగా జన్మించిరి. సుమతీమాత శనిప్రదోష సమయమున అనసూయాతత్త్వమునందలి పరమశివుని ఆరాధించెడివారు. అందువలన శ్రీదత్త ప్రభువులోని శివతత్త్వము, అనసూయాతత్త్వమునందు, ప్రతిబింబించి, అనసూయామాతతో సమానమైన స్థితినందున్న, సుమతీమాత యొక్క గర్భమునందు శ్రీపాద శ్రీవల్లభరూపమున అవతరించినది. ఇది ఒకానొక అద్భుతయోగ ప్రక్రియ. వారు మాతాపితృ సంయోగము వలన కాక, యోగనిష్ఠులైయున్న అప్పలరాజుశర్మ సుమతీమాతల నేత్రములనుండి యోగజ్యోతులు ప్రభవించి, అవి సంయోగము చెంది, సుమతీమాత గర్భమునందు నిలచి, నవమాసములు నిండిన తదుపరి కేవలము జ్యోతిస్వరూపముగా మాత్రమే వెలువడినది. శ్రీపాదులు వస్తుతః జ్యోతిస్వరూపులు. వారు పుట్టినవెంటనే సుమతీమహారాణి సొమ్మసిల్లి పడిపోయినది. పురిటి గదినుండి మంగళవాయిద్యములు వినబడుచుండెను. కొంతసేపటికి ఒక అదృశ్యవాణి పురిటిగదిలోనున్న వారందర్నీ పురిటిగది నుండి బయటకు వెళ్లమని పిలుపునిచ్చింది. ఎవరి ప్రమేయము లేకుండగానే

పురిటిగది తలుపులు మూతబడినవి. శ్రీపాదుల వారి సన్నిధికి నాల్గు వేదములు, 18 పురాణములు, మహాపురుషులు జ్యోతిస్వరూపులై ఏతెంచిరి. వారందరూ వేదపఠనము, మంగళాశాసనములు వల్లభుల ఎదుట గావించుచుండిరి. ఆ పవిత్ర వేదమంత్రములు ఆ గది నుండి బయటకు వినబడుచుండెను. శ్రీపాద వల్లభులు జన్మించినపుడు మూడుతలల నాగుబాము 18 రోజులపాటు వారినిఎక్కడ పరుండబెట్టిననూ వారిపై పడగపట్టి నీడలా ఆడుచుండెడిది. శ్రీపాదవల్లభులు తమ దివ్య పాదుకలతోబాటుగా అవతరించారు. అందుకే వారిని శ్రీపాదులవారు అని అంటారు. ఆకారణంగానే గురుపాదుకలు అంతగా ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. గురువును సందర్శించగానే తొలుత వారి పాదాలను దర్శించడం వాడుకలోనికి వచ్చింది. ఆనాటి నుండి ప్రతీ గురువు సన్నిధిలోనూ వారి పాదాలను ప్రతిష్ఠించి, ఆపాదాలకు పూజలు నిర్వహించుట ఆచారంగా వస్తోంది. అందువల్లనే దత్తప్రభువులైన వల్లభులు ఆదిగురువులు. ఈ అద్భుత సంఘటనలన్నియూ, ఆ ఇంటినందున్న బాపనార్యులు రాజుశర్మ మొ॥లగు వారి ఊహకందనట్లు అగమ్యగోచరముగా నుండెను. అటుపిమ్మట, అశుతోషుడనునాడీ గ్రంథకారుడు, నాడీగ్రంథమందుగల సాంద్రసింధువేదమునందు శ్రీపాదులు గణేశచతుర్థినాడు జన్మించెదరని, వారు శ్రీదత్తావతారులనియూ, వారి చరణములందు సర్వశుభలక్షణములు కలిగియుండుటచే వారికి శ్రీపాద శ్రీవల్లభ నామము సార్ధకనామధేయముగా నుండునని, వీరి జన్మకుండలిని ఎవ్వరికీ ఈయరాదనియు, అది కాలవశమున త్రిపురదేశమందలి అక్షయకుమారుడు అను జైనమతస్థుని వంశీకులనుండి శ్రీపీఠికాపురము చేరుననియూ, అదిఅంతయూ దైవలీలప్రకారము జరుగుననియూ తెలిపెను. ఆనాటి నుండి ఆబాలుని శ్రీపాద శ్రీవల్లభులనే నామధేయముతో పిలుచు చుండిరి. శ్రీపాద శ్రీవల్లభులు అత్యంత పసిప్రాయమునుండి కూడా సంస్కృత భాషలో శాస్త్ర ప్రసంగములు చేయుటతో బాటు, వయస్సుకు తగని ఎన్నో అసాధారణ ప్రజ్ఞాపాఠవములు, ప్రణవము ఉచ్ఛరించుట, ఉయ్యాలలో పసిబాలునిగా ఉన్నప్పుడు కూడా ప్రదర్శించెడివారు. ఇట్లు వారికి ఒక సంవత్సరము వయస్సు వచ్చినది. వారు నెలల బాలుడుగా ఉన్నప్పుడు కూడా స్వేచ్ఛగా నడచుట, వేదపఠనము చేయుట మొదలైన చిత్ర విచిత్రములైన లీలలను చూపెడివారు. నవ నాథులలో ఒకడైన గోరక్షునిని, గోరక్షానాథుడంటారు. అతనికి దత్తావధూత అవతారముగా దత్తుడు దర్శనమిచ్చాడు. గోరక్షకుని అనుయాయులే నేపాల్ దేశమందున్నారు. శ్రీపాద వల్లభుల జాతకప్రతి వారివద్దనున్న శుక్రనాడీ గ్రంథమందున్నది.

ఒకసారి శ్రీబాపనార్యులవారు శ్రీవల్లభులతో నీవు దత్తుడవా లేక దత్త ఉపాసకుడవా అని ప్రశ్నించిరి. దానికి జవాబుగా వల్లభులు నేను దత్తుడనని చెప్పునపుడు దత్తుడనే, దత్తుని యొక్క ఉపాసకుని అని చెప్పునపుడు దత్తుని యొక్క ఉపాసకుడనే. నేను ఏది సంకల్పిస్తే అది జరుగుతుందని, ఇదే నాయొక్క తత్త్వమని తెలుపుతూ, వారి తాతగారి యొక్క కనుబొమ్మలమధ్య బొటనవ్రేలుతో తాకి, సత్యము గ్రహించమనిరి. శ్రీబాపనార్యులవారు తమ మనోనేత్రములతో కొన్ని అద్భుత దృశ్యములుగాంచిరి. అందులో కొద్దిక్షణములపాటు హిమాలయములలో నిశ్చల తపోసమాధిలోనున్న ఒక బాబాజీని చూచెను. కొంతసేపటికి ఆ బాబాజీ ప్రయాగలోని త్రివేణీ సంగమమందు స్నానమాచరించుటగాంచెను. మరికొంతసేపటికి ఆ బాబాజీ శ్రీపాదశ్రీవల్లభులవారి రూపముగా మారిపోయెను. ఆ వల్లభ స్వరూపము కుక్కుటేశ్వరాలయమందుగల స్వయంభూదత్తుని విగ్రహంలో అంతర్లీనమైపోయెను. ఆ విగ్రహం నుండి ఒక అవధూత స్వరూపము బయటకు వచ్చి, భిక్ష స్వీకరించుటకు సుమతీ మహారాణి ఇంటికి వచ్చెను. సుమతీ మహారాణి ఆ ఆవధూతకు భిక్షనిచ్చుటయూగూడ గాంచెను. ఆ అవధూత స్వరూపమే శ్రీపాదశ్రీవల్లభుల రూపముతోగల పసిబిడ్డగా సుమతీ మహారాణి ఒడిలో నుండుటకూడ గమనించెను. అటుపై ఆ పసిబాలుడు 16 సంవత్సరముల యువకునిగా, ఆ యువకుడు సన్యాసిగా మారుటకూడ వారికి గోచరించెను. ఈ విధంగా వల్లభులవారి తాతగారికి చూపిన లీలలనుబట్టి స్వయంభూదత్తుడే అవధూతగా మారి, ఆ తరువాత శ్రీవల్లభులుగా పీఠికాపురమునందు అవతరించారని తెలియుచున్నది. దీనినిబట్టి ఆ బాబాజీవారే శ్రీదత్తాత్రేయస్వామి అని అవగతమవుతున్నది. ఆ బాబాజీవారే గతంలో ఛండాలరూపం ధరించి శ్రీశంకరాచార్యులవారి దారికి అడ్డంగా నిలువగా దారికి అడ్డుతొలగమని అడిగిన శంకరునికి దేహమందున్న పరమాత్మను గుర్తించమని జ్ఞానబోధ చేసెను. ఒకసారి కొంతమంది మహాయోగులు కైవల్యశృంగమను స్థలమున చేరి, దత్తునికై ఘోరతపమాచరించిరి. అప్పుడు దత్తస్వామి వారికి బాబాజీ అను వృద్ధరూపములో దర్శనమిచ్చిరి. వారిని ఆ మునిపుంగవులు శ్రీ విశ్వేశ్వరమహాప్రభు నామముతో పిలిచిరి. అప్పుడు శ్రీమహాప్రభువువారితో 2498 సంవత్సరముల

పిదప తాము పీఠికాపురమున శ్రీపాదశ్రీవల్లభునిగా అవతరించెదమని, అంతేకాకుండా భువిపై పన్నెండుసార్లు తమ అంశతో అవతారములు కూడ కాలానుగుణ్యంగా వచ్చునని తెలిపారు. ఈ కారణంగానే శ్రీవల్లభులు "దో చౌపాతీ దేవ్ లక్ష్మీ" అని పలికెడి వాక్యమును 2498 గా వ్యవహరించెవారు. ఇది వారి అవతరణ కాలమును నర్మగర్భంగా సూచించును. తమ అంశావతారుడైన శ్రీవాసుదేవానందసరస్వతి పీఠికాపురమునందు తాను జన్మించిన తమ తాతగారి స్వగృహము దర్శించుననియు, కానీ తన జన్మభూమిలో తమ పాదుకలు ప్రతిష్ఠించు యోగము వారికి కలుగదనియు కూడ తెలిపిరి. శ్రీపాదుల వారి ఆజ్ఞ లేనిదే ఏ కార్యమూ కూడ సఫలీకృతంగాదు. గతంలో వారి అభీష్టానికి వ్యతిరేకంగా ఒక అవధూత వారి వెండిపాదుకలను వారి మాతామహులు గృహంలో ప్రతిష్ఠించాలని విశ్వప్రయత్నం చేసెను. కాని, ఆతని కోరిక నెరవేరకపోగా అతడు భంగపాటుకు గురై, గ్రామస్తులచే అవమానింపబడి, పీఠికాపురమునుండి నిష్క్రమించెను. ఇది 13వ శతాబ్ధములో జరిగిన సంఘటన. ఈ వివరములు పరిశీలించినచో ఆ అవధూత శ్రీ వాసుదేవానంద సరస్వతిగా తోచును. 18వ శతాబ్ధములో వీరు పిఠాపురం దర్శించి, వల్లభుల వారి మాతామహుల గృహమును వెతికి పట్టుకుని, ఆ గృహమునందే శ్రీ వల్లభులు జన్మించారని ఆ గ్రామస్తులకు తెలిపెను. అంతవరకూ పీఠికాపురవాసులకు శ్రీపాదుల జననము గూర్చిగాని, వారి జన్మస్థలము గూర్చిగాని తెలియదు. వాసుదేవానంద సరస్వతిగా జన్మించిన ఆనాటి అవధూత తన పూర్వజన్మస్మృతులవల్లే ఆ ప్రాంతాన్నీ, ఆ గృహాన్ని తానంతగా తాను కనుగొనగలిగెనని విశదమగుచున్నది.

శ్రీపాదులవారు, వారి తండ్రిగారైన అప్పలరాజుగారు, తాతగారైన బాపనార్యులవారు తమ గృహమందు తెలుగుతోబాటు సంస్కృతములోకూడ మాట్లాడుకునేవారు. దీనితోబాటు ఋషుల భాషయైన 'సంధ్యాభాష' లో కూడ అప్పుడప్పుడు మాట్లాడుకునేవారు. వీరికి బహుభాషాపరిజ్ఞానము కలదు.

పీఠికాపురమందుగల ఒక బ్రాహ్మణ వర్గమునకు అధిపతిగా నరసావధానులు అను పండితుడుండేవాడు. అతడు పిడివాదము చేయుటలో బహునేర్పరి. అతనికి భగళాముఖీ దేవతావుపాసన గలదు. అశుతోషుడను నాడీగ్రంథకారుడు వల్లభులవారిని కలసి, భగళాముఖీ ఆరాధకులైన నరసావధానులవారి వద్దనున్న భగళాముఖి అమ్మవారి దర్శనము చేసుకొనదలచినప్పటికీ, వీలుపడలేదని చింతించుచుండెను. అంత వల్లభులు అశుతోషునితో అతనిలోనున్న అంబిక స్వరూపమైన భగాళాముఖీదేవి అతనిని విడచి నన్ను ఆశ్రయించి, నాలో లీనమయినది. అందువల్ల నేనే సర్వదేవతాస్వరూపుడను. అంబికదర్శన భాగ్యముపొందమనుచూ, శ్రీవల్లభులు ఆనాడీగ్రంథకారునకు భగళాముఖీ మాతగా దర్శనమిచ్చిరి. ఆ దివ్యమంగళస్వరూపమును దర్శించి, వల్లభుల ఆశీర్వాదములు పొంది అశుతోషుడు తపోవనమునకు పోయెను. వల్లభులయెడ అసూయ ద్వేషములు పెంచుకొనిన కారణంగా, నరసావధానులగారి అంతరాత్మలో అంతర్లీనముగానున్న పుణ్య శరీరభాగము, ఒకనాడు వారితో దత్తులపై ద్వేషం బూనిన కారణంగా ఆతనిని వదిలివెళ్లుచున్నానని, ఇకపై అతనికి కష్టములు ప్రారంభంకాగలవని అంతర్మధనంలో తెలిపి, ఆతనిని విడచి ఆ పుణ్య భాగము శ్రీవల్లభులలో లీనమయ్యెను. ఆనాటి నుండి తనయందు పాపశరీరభాగమును మాత్రమే కలిగిన నరసావధానుల వారికి కష్టములు ఒకదానికొకటి తోడై, వారి ఆరోగ్యము క్షీణించుటయేగాక, ఆర్థిక పరిస్థితికూడ కుప్పకూలి, మంచానపడి మరణించిరి. నరసావధానులవారి కుటుంబసభ్యుల కోరికమేరకు వల్లభులు కరుణాసముద్రులై, తమ దివ్యహస్తముతో నరసావధానుల వారిని బ్రతికించెను. శ్రీపాదులవారి స్పర్శ మహిమతో అతనికి జ్ఞానోదయమయ్యెను. నరసావధానుల వారి జ్ఞానదృష్ఠికి కొన్ని భూత, భవిష్యత్ సంఘటనలు గోచరమయ్యెను. మరణావస్థలో వారింటనున్న గొడ్డు ఆవు వల్లభులకు ప్రదక్షణముచేయుచూ దాని క్షీరమును గ్రోలమని వల్లభులవారిని మూగభాషలో కోరినట్లుగాను, మరుజన్మలో ఆ కోరికను మన్నించగలనని వల్లభులు ఆ గోవుకు అభయమిచ్చినట్లుగాను, ఆ గోవు మరణించినట్లుగాను అతనికి గోచరమయ్యెను. ఇంకా తనపై నేరంమోపిన తాంత్రికుడు అనతి కాలములో మరణించి, బ్రహ్మరాక్షసుని రూపంలో మరుజన్మనొందునట్లుగాను, శ్రీవల్లభులు ఒక సన్యాసి రూపములో అతనికి మోక్షమిచ్చినట్లుగాను, రాబోయే జన్మలో దారిద్ర్య బ్రాహ్మణునిగా జీవితము వెళ్లబుచ్చుచున్న తన ఇంటికి, సన్యాసి వేషధారిగా వల్లభులు వచ్చి, తన ఇంటినందు ఉన్న ఒక పాదును పీకివేసి, దానిక్రింద బంగారునాణెములతో ఉన్న లంకెల బిందెలను తనకు ప్రసాదించి, తన దారిద్ర్యమును

రూపుమాపినట్లుగాను అతనికి భవిష్యత్తు గోచరించెను. అటుపిమ్మట స్పష్టుడై వల్లభుల దివ్యత్వము గ్రహించి, వారికి శరణాగతి చేసిన నరసావధానులకు శ్రీవల్లభులు వారు హితోపదేశం చేసిరి.

శ్రీపాద శ్రీవల్లభులు ఆజన్మద్విజులు. ఆజన్మ బ్రహ్మజ్ఞాన సంపన్నులు. పూర్వము వామనావతార సమయమున విష్ణువుకు సమకాలికుడుగా వామదేవమహర్షి అనే ఋషి ఉండేవారు. వారు జన్మించునపుడు మాతృగర్భము నుండి తల ఒక పర్యాయము బయటకు వచ్చి లోకమును పరికించి, తిరిగి వెనుతిరిగి గర్భములోనికి వెళ్లిపోయెను. అపుడు దేవతలు, ఋషులు ప్రార్థింపగా వారు మరల జన్మించిరి. ఇట్టి వారినే ఆజన్మ బ్రహ్మజ్ఞానులందురు. శ్రీవల్లభుల వారి జననము గూడ అదేవిధముగా జరిగినది. ఈ ప్రకారముగా రెండుసార్లు జన్మించుటవలన వారు ఆజన్మద్విజులు. ఆజన్మబ్రహ్మజ్ఞానులు. వారు సంపూర్ణమైన అఖండ, అనంత, అద్వైత సచ్చిదానందముతో అవతరించిరి. కనుక ఈ అవతారమున వారికి గురువను వ్యక్తి లేదు. వారే సిద్ధ గురువు, సద్గురువు కూడా.

శ్రీపాదులవారు గణేశచతుర్థినాడు చిత్తా నక్షత్రమునందు తులారాశిలో సింహలగ్నమునందు జన్మించిరి. వాస్తవమునకు వారు త్రిమూర్తులయొక్క సంయుక్త రూపముగాక, వారికి అతీతముగా నున్న ఒకానొక ప్రత్యేక తత్త్వము వారియందు గలదు. అందువలన వారు త్రిమూర్తులకతీతమైన నాల్గవతత్త్వమని సూచించుటకు చతుర్థీతిథి నాడు జన్మించిరి. సృష్టి యందలి ప్రవృత్తి గణములు, నివృత్తి గణములు రెండింటికీ అధిపతి అయిన గణేశతత్త్వమని సూచించుటకు గణేశ చతుర్థీ దినమున జన్మించిరి. చిత్తానక్షత్రమునకు అధిపతి అంగారకుడు. అంగారకుని మంగళగ్రహమని కూడ అందురు. ఆ గ్రహము పాపస్థానములో నుండినచో అనేక కష్టములు గల్గును. భక్తులకు అమంగళములు కలుగకుండా ఉండేందుకు సర్వశుభములు కలుగజేసేందుకు శ్రీవల్లభులు చిత్తా నక్షత్రమునందు జన్మించిరి. చిత్తా నక్షత్రము రోజున శ్రీవల్లభులను అర్చించినచో విశేషఫలితములు కల్గుటయే గాక అంగారక గ్రహదోషములు తొలగిపోవును. శ్రీపాదులవారు సాక్షాత్తూ ధర్మశాస్త గనుక, హరిహరాత్మజుడైన అయ్యప్పస్వామినని తెలియజేయుటకు తులారాశిలో జన్మించిరి. గ్రహములకు రాజైన సూర్యుని యొక్క సింహలగ్నములో జన్మించి, వారు విశ్వ ప్రభువుననియూ, దర్బారు చేయుటకు వచ్చిన చక్రవర్తిననియూ తెలియజేయుచున్నారు. శ్రీపాదుల వారికి తెలియని ధర్మసూక్ష్మములు లేవు. ధర్మసంకటము లేర్పడినపుడు వారిని ప్రార్థించినా సరియయిన ధర్మపథము తెలియును. శ్రీదత్త ప్రభువునుండి త్రిమూర్తులు, వారినుండి ముక్కోటి దేవతలు, వారినుండి 33 కోట్ల దేవతలు వచ్చినారు. కావున దత్తవల్లభుని నామస్మరణ చేసినచో సమస్త దేవతాస్మరణము చేసిన ఫలములు గలుగును.

దైవము యొక్క లీలలు ఎంతో విచిత్రమైనవి. అన్ని వర్గములు ఎప్పుడూ దైవముచెంతనే యుండును. ఎంతటి ధనవంతునికైననూ, భోగభాగ్యములతో తులతూగు మహారాజునకైననూ, కష్టములు కలిగించు శక్తి దైవమునకు గలదు. అదేవిధముగా కష్టములను బాపుశక్తి కూడ దైవమునకు గలదు. శ్రీపాద శ్రీవల్లభులు కరుణాసముద్రులు. శ్రీపాదులువారు ప్రతీక్షణమునందు కోట్ల కొలది ప్రార్థనలను స్వీకరించెదరు. ధర్మబద్ధమైన ప్రతీ ప్రార్థనకు వారు ఉత్తరమిచ్చెదరు. బాధానివారణముచేసెదెరు. ధర్మబద్ధమైన ప్రతికోరికను సఫలము చేసెదరు. సత్యజ్ఞానానందస్వరూపులైన శ్రీపాదులు అనేక దివ్యసత్యములను సృష్టిలో ప్రతిష్ఠించ సంకల్పముతో వచ్చిన దివ్యభవ్యఅవతారము. ఆశ్రితజనుల పట్ల కొంగుబంగారము. వారిని నమ్మి, ఆశ్రయించిన వారికెందరికో మేలుకూర్చే వరములను ప్రసాదించి, వారి రాబోయే జన్మములలో వారికి ధన్యత చేకూర్చినారు.

శ్రీపాదుల వారి పెద్ద అన్నగారైన శ్రీ శ్రీధర రాజశర్మ గారి గ్రుడ్డితనము పోగొట్టి, శ్రీవల్లభులు వారికి దృష్టి ప్రసాదించుటయేగాక వారిని మహాపండితుడయ్యే విధంగా ఆశీర్వదించి, అనుగ్రహించిరి. శ్రీధరరాజశర్మ వచ్చే జన్మములో మరాఠాదేశమున సజ్జనఘడ్ యందు సమర్థరామదాసు అను పేరుతో జన్మించి, ఛత్రపతి శివాజీ మహారాజుకు రాజగురువుగా నియమింపబడి విఖ్యాతినొందగలడని వరము ప్రసాదించిరి. వారే ఆ తదుపరి జన్మమున గజానన్ మహారాజ్ అను పేరున జన్మించి అవధూతయై జనులను ఉద్ధరించగలడని తెలిపిరి. శ్రీపాదులవారు తమ ద్వితీయ సోదరుడైన రామరాజశర్మకు కుంటితనమునుండి విముక్తి ప్రసాదించిరి. అతనిని కూడ మహాపండితుడగునట్లు అనుగ్రహించిరి. వచ్చే జన్మములో శ్రీధర నామముతో అవధూతకాగలడనియూ, ఆయన కాలమందే పీఠికాపురమందు తన

మాతామహుల గృహంలో తమ పాదుకలు ప్రతిష్ఠితము కాగలవనియూ తెలిపిరి. దేశాటనకు బయలుదేరుచున్న సందర్భంలో శ్రీవల్లభులు తమ సోదరుల అంగవైకల్యములు బాగుచేసి ఈ విధముగా తమ, తల్లి, దండ్రులకెంతో ఆనందము చేకూర్చి, కుమారునిగా వారి ఋణము తీర్చుకొని, ఎంతో కాలమునుండి ఆ ఇద్దరి పుత్రులపట్ల చింతాక్రాంతులైయున్న ఆ పుణ్యదంపతులకు మోదము చేకూర్చిరి.

శ్రీపాదులవారి కుటుంబమునకు ఎంతో మేలుచేసి, వారిని అనుక్షణము ఆదరించుటయేగాక, వారి కుటుంబంలో ఒక సభ్యునిగా మెలగుతూ ఉండే శ్రీనరసింహవర్మ రాబోయే జన్మలో హిందూమహాసామ్రాజ్యస్థాపనకు నడుంకట్టే ఛత్రపతి శివాజీ మహారాజుగా మరాఠాదేశమున జన్మించునని, శ్రీపాదులవారి అవతరణముతో సన్నిహిత సంబంధము కలిగిన శ్రీశైల క్షేత్రమును దర్శించి, శ్రీవల్లభుల రూపమైన మల్లిఖార్జునుని అనుగ్రహము పొందగలడని, సమర్ధరామునికి ప్రియశిష్యుడై పేరుప్రఖ్యాతులు గాంచునని వరమొసంగిరి. శ్రీవల్లభులకు ఎంతో సన్నిహితముగా మెలగి, వారిపై ఎంతో ఆదరణ కురిపించి, వారిని అనుక్షణము కనిపెట్టుకుని, ఎత్తుకుని, ముద్దాడుతూ ఎంతో ఆనందం అనుభవించిన వెంకటప్పయ్యశ్రేష్ఠి, రాబోయే జన్మములో మరాఠాదేశమున సంపన్నమైన వైశ్య కుటుంబంలో జన్మించి, నృసింహ సరస్వతిగా తాము అవతరించినపుడు, తమను సేవించి, తరించగలడని వరమిచ్చిరి. ఇంతేకాకుండా వారు తమ ఎంతోమంది సన్నిహిత భక్తులకు, అవధూతలకు గూడ రాబోయే జన్మములందు దివ్యత్వము అనుగ్రహించి, వారందరికీ ఆనందము చేకూర్చినారు.

ఒకానొకసారి పీఠికాపురమందు గల శ్రీ కుక్కుటేశ్వరాలయమునందు వేంచేసియున్న స్వయంభూదత్తుని విగ్రహము అదృశ్యమైనది. విగ్రహం కొరకు ఎంత అన్వేషించినా ఫలితం దక్కలేదు. గతంలో శ్రీ బాపనార్యులువారు శ్రీశైలము నందు సూర్యమండలము నుండి శక్తిపాతముచేసి, ఆ శక్తిని మల్లిఖార్జున శివలింగములోనికి ఆకర్షింపచేసిరి. అదేసమయమున ఆ శక్తియే గోకర్ణములోని మహాబలేశ్వర లింగములోనికిని, పీఠికాపురములోని పాదగయా క్షేత్రములోని స్వయంభూదత్తుని విగ్రహములోనికి కూడ ఆకర్షింపబడినది. శక్తిపాతం జరిగిన పిదప ఆ ప్రక్రియ శాంతి కొరకై విశేషముగా అన్నదానములు చేయవలయునని, బాపనార్యులవారు ఎంతగా ప్రయత్నించినా, ఆ గ్రామస్థులు, పండితులు వారిమాటను పెడచెవినిపెట్టిరి. ఫలితముగా ఏదోసాకుగా అమంగళము జరిగి, స్వయంభూదత్తుని విగ్రహము మాయమయినది. పీఠికాపురమును అనతికాలములో దర్శించిన మాధవాచార్యుడను ఒక అవధూత, తణుకు వాస్తవ్యుడు, తన దివ్యదృష్టితో పరిశీలించి, స్వయంభూదత్తుని విగ్రహం అనేక పుణ్యనదులలో స్నానమొనరించి, ప్రస్తుతము పీఠికాపురమునందున్న ఏలా నదిలో జలకాలాడుతున్నదని తెలిపెను. వెంటనే గ్రామస్థులు స్థానిక ఏలానదిలో గాలించి, స్వయంభూదత్తుని విగ్రహం కనుగొన్నారు. ఆ విగ్రహం తెచ్చి, బాపనార్యుల వారి ఆధ్వర్యంలో సుమతీ, అప్పలరాజ దంపతులచే పునఃప్రతిష్ఠ గావించి, విశేష అన్నదానములు చేసిరి. ఆ సందర్భంగా శ్రీవల్లభులను మాధవాచార్యుడను అవధూత దర్శించెను. తన జ్ఞానదృష్టితో వారు దత్తాత్రేయస్వామిగా గ్రహించి, శ్రీవల్లభుల వారిని తన స్తోత్రములతో విశేషముగా స్తుతించెను. శ్రీవల్లభులు ఆ అవధూతను అనుగ్రహించి, 16 సం॥ల తరువాత బుక్కరాయలు హిందూసామ్రాజ్యమును స్థాపించుననియూ, వారికి గురువుగా, శృంగేరీ పీఠమందు విద్యారణ్యస్వామి నామధేయమున వెలయుదువనియూ, అంతియేగాకుండా, కొన్ని శతాబ్దముల తరువాత రాబోయే జన్మలో తంజావూరుకు మహామంత్రివై వర్ధిల్లగలవని ఆశీర్వదించిరి. ఆ అవధూతపట్ల కరుణాంతరంగులై శ్రీవల్లభులు అతనికి మరొక గొప్పవరము ప్రసాదించిరి. తాము నరహరిగా వచ్చే జన్మములో అవతరించినపుడు, కాశీలో కృష్ణ సరస్వతి నామమున గురువుగా జన్మించి, తాము కాశీని సందర్శించినపుడు, తమకు సన్యాసి దీక్షనిచ్చెదవని, సన్యాసి దీక్షనొందిన పిదప తాము నృసింహసరస్వతి నామధేయంతో వ్యవహరిస్తూ, నీ యొక్క అవధూత నామమును గూడ కల్గియుందుమని వరమిచ్చిరి.

శ్రీవల్లభుల వారినెంతో భక్తిశ్రద్ధలతో కొలుస్తూ, వారి సాంగత్యంలో ఎంతో జ్ఞానం పొంది, వారి బట్టలను ఉతికే రజకుడైన తిరుమలదాసు శ్రీవల్లభుల వారిని తననెప్పుడూ కనిపెట్టుకుని ఉండి, రక్షించమని వేడుకునేవాడు. అతని కోర్కె మన్నించి, భవిష్యత్తులో అతడు మరాఠీ దేశమున గాడ్గే మహారాజ్ అను పేరుతో రజక కులమున జన్మించి, దీన, దళిత దుఃఖితులను ఉద్ధరించెదడని తెలిపారు. దీనితోబాటు ధీశిలానగరము (శిరిడీ)లో రానున్న తమ సమర్థ సద్గురు అవతారము యొక్క అనుగ్రహము పొందెదడనియూ తెలిపారు. అదేరకంగా, శ్రీ కణ్వమహర్షి యొక్క ఆదేశముతో శ్రీపాదుల వారిని

దర్శించిన, ఆనందశర్మ అను భక్తుని, శ్రీపాదులవారు నీ కడపటి జన్మమున వెంకయ్య నామధేయముతో అవధూతవై, నిరతాగ్ని హోత్రివై, అకాలము సంభవించినపుడు వర్షములు కురిపించి, సంసారుల బాధలను తొలగించి, ప్రజలచే పూజింపబడుదువని తెలిపిరి.

కృతయుగమునందు లాభాదుడను ఆర్యవైశ్య మహర్షి యుండేవారు. వారు దత్త ప్రభువుల విశేష అనుగ్రహమునకు పాత్రులైరి. శ్రీదత్తుని బాల్యరూపమున చూచి, పెంచి పెద్దచేయవలయునని కోరికగా ఉన్నదని దత్తుని కోరిరి. ఆ కోరికననుసరించి కృష్ణావతారమున అతడు నందునిగా జన్మించెను. అతనికి నందునిగా ఉన్నపుడు విశేష పుణ్యఫలము దక్కినది. ఆతడే శ్రీపాద శ్రీవల్లభావతారమున, శ్రీవల్లభుల వారి మాతామహుడైన బాపనార్యులుగా జన్మించిరి. బాపనార్యుల వంశమైన 'మల్లాది' వంశము కలియుగాంతము వరకూ నిలచివుండగలదని వల్లభులు వరమిచ్చిరి.

శ్రీపాదులవారికి ఇద్దరు అన్నలతోబాటు ముగ్గురు చెల్లెళ్లు గూడ గలరు. వారు శ్రీవిద్యాధరి, రాధ, సురేఖ అనువారు. శ్రీవిద్యాధరిని చంద్రశేఖరునితో, రాధను విజయవాడ వాస్తవ్యులైన మురళీకృష్ణావధాన్లు గారితో, మూడవ సోదరియగు సురేఖను మంగళగిరి వాస్తవ్యులైన దత్తాత్రేయ అవధాన్లగారితో వివాహము జరిపించిరి.

శ్రీపాదులవారు తమకు ఎంతో ఇష్టమైన ఔదుంబర వృక్షమూలమున తమ ఇంట్లో కూర్చునేవారు. వారికి హల్వా అంటే ఎంతో ఇష్టం. అందువల్ల వారితల్లి సుమతి మహావాత్సల్యముతో వెండిగిన్నెలో హల్వా నింపి, ఆ వల్లభులవారికి తినిపించేవారు. శ్రీ వల్లభులవారు బీరకాయపప్పు మరియు తోటకూరను కూరగా చేసినచో ఎంతో ఇష్టపడేవారు. నరసావధానుల వారి ఇంట్లో తోటకూరను తీసుకొని కూరగా వండించుకొని తినాలని, తద్వారా నరసావధానుల కర్మను నశింపజేయాలని, వల్లభులు సంకల్పించినప్పటికీ, నరసావధానులు ఆ అవకాశమును తన అహంకారము వల్ల సద్వినియోగం చేసుకొనలేకపోయెను. అతని వివేకరాహిత్యం వల్ల వల్లభులు వారి సంకల్పమును కూడా విరమించుకొనిరి.

శ్రీపాదులవారి అమ్మమ్మగారయిన శ్రీబాపనార్యులవారి సతీమణి శ్రీమతి రాజమాంబగార్కి వల్లభులవారనినా వల్లమాలిన అనురాగం, ప్రేమగలవు. ఒకసారి పంచదేవపహాడ్‌లో ఆమె వల్లభులవారికి ఇష్టమని హల్వాను వెండిగిన్నెలో పెట్టి వారికి, గోరుముద్దలు తినిపించెను. ఆ హల్వాను శ్రీవల్లభులు తమ అన్నలకు, చెల్లెళ్లకు, చెల్లెళ్ల భర్తలకు స్వయముగా తినిపించిరి. శ్రీవల్లభుల వారికి చిరుప్రాయమునుండి వారి అమ్మమ్మగారైన రాజమాంబ ఎన్నో ఉపచారములు చేసి, వారి బాల్యలీలలెన్నో ప్రత్యక్షంగా గాంచి తరించింది.

శ్రీపాద స్వామి ఇలా ఎన్నో లీలా విశేషాలు చేస్తూ, శుక్లపక్ష చంద్రునిలాగా అందరికీ ఆహ్లాదాన్ని అందిస్తూ, ఆనందం చిందిస్తూ ముద్దులు మూటగడుతూ పెరిగి ఎనిమిదేండ్ల వాడయ్యారు. వారి అందచందాలు తల్లిదండ్రులే గాక, ఆవూరిలోని వారందరూ తనివితీరా అనుభవించేవారు. పసితనమునుండే దుష్టపరివర్తన – శిష్టరక్షణ గూడ జరుపుతూ ఉండేవారు. వారి పాదస్పర్శతో ఆవూరు – అతని జననము, బాల్య జీవితం వల్ల ఆ పవిత్ర గోదావరీ ప్రాంతమూ యెంత ధన్యత పొందినవో వర్ణింప ఆ బ్రహ్మకైనా తరంగాదు. వారికి సప్త వర్షములు నిండి, ఎనిమిదవ సంవత్సరం రాగానే, వారి తల్లిదండ్రులు ఒక శుభముహూర్తంలో వారికి ఉపనయనం చేశారు. సామాన్యంగా అటుతర్వాత వటువుకు తగిన గురువువద్ద అధ్యయనం చేయిస్తే గాని వేదంరాదు. కాని పసితనమునందే ఓంకారముచ్చరించిన, ఆ మహానుభావునికి గురువు అవసరంలేదు. వారే సర్వసద్గురు స్వరూపము. శ్రీపాదస్వామి ఉపనయనమయిన మరునాటి నుండే సద్గురు అవతారము ధరించారు. శిష్యులకు వేదపాఠాలు బోధించారు. బోధగురువు అయిన దత్తాత్రేయుని రూపమైన శ్రీవల్లభులు వేదవేదాంగాలు, కర్మయోగ సిద్ధాంతాలు, భగవంతుని సాక్షాత్కారము, ఆత్మ సాక్షాత్కారముల గూర్చి ఇచ్చే వివరణలు, బ్రాహ్మణ పరిషత్తులో వారి తర్కములు ఎంతోమంది ఉద్దండపండితులను గూడ విస్మయానికి గురిచేశాయి. చిరుత ప్రాయమునందు ఇవన్నీ సాధ్యమా అన్న మీమాంస గలిగిన వారందరికీ భగవంతుడైన వారికి ఇవి సుసాధ్యమే అని వారి గురువులు తెలిపేవారు. ఇలా, వల్లభులు తమ మహిమలెన్నో చూపుతూ, వారే దత్త ప్రభువులని ఇంట, బయటా అందరి ఆదరణ చూరగొన్నారు. ఈ విధంగా కొన్ని సంవత్సరములు ఆనంద మధురములుగా గడచిపోయాయి. శ్రీవల్లభుల వారికి పదహారేండ్ల వయస్సు వచ్చింది.

ఇంతలో వారి తల్లిదండ్రులు తమ కుమారుడైన శ్రీవల్లభులవారికి వివాహం చేయాలని, తగిన కన్యకోసం అన్వేషణ ప్రారంభించారు. అంత శ్రీవల్లభులు తల్లిదండ్రులతో నాకు వివాహము చేయుటకు ఏ కన్యకోసం వెదుకనవసరంలేదు. సర్వశుభలక్షణాలు కలిగిన యోగశ్రీ అనుకన్య నావద్దనే యున్నది. ఆమెను వివాహమాడి నేను సన్యసించెదను. దేశాటన చేసి, వేరే ప్రదేశంలో ఆశ్రమవాసినై ఉందునని తెలిపిరి. దత్తాత్రేయుల వారి ప్రతిరూపమయిన శ్రీవల్లభులు ఆజన్మ బ్రహ్మచారులు. అనఘాలక్ష్మి సమేత అనఘుడంటే దత్తాత్రేయుడే. దత్తాత్రేయుడే శ్రీవల్లభులు. అనఘాలక్ష్మి వారి యోగస్వరూపము. ఆ స్వరూపము వారి వెన్నంటే ఉంటుంది. దత్తుడూ ఆజన్మ బ్రహ్మచారియే. వారు తండ్రితో నేను వల్లభుడను గనుక నాకు సంతానములేకపోయినా నిత్యముక్తుడనే అని నిశ్చయంగా తెలిపారు. వారి మాటలు తల్లిదండ్రులకు మనస్తాపాన్ని కల్గించాయి. కన్నులనీరు కార్చుతూ, పెల్లుబుకుతున్న పుత్రవ్యామోహంతో చిట్టితండ్రీ! నీవు సన్యసించి, వెళ్లిపోతే మేముండగలమా! మా పుణ్యంవలన మాకు కుమారునిగా జన్మించావు. ధర్మగోప్తవూ, ధర్మరక్షకుడవు అయిన నీవే పుత్రధర్మం విస్మరించతగునా అని అన్నారు. అంత వల్లభులు వారి తల్లిదండ్రులకు గతంలో అవధూతరూపంలో వచ్చి దర్శనమిచ్చిన తమ యధార్థరూపాన్ని, ఆనాడు వారు సుమతీమాతతో అన్నమాటలు జ్ఞప్తికి తెచ్చారు. ఆమె కళ్లకు ఆ దివ్య, మనోహర మంగళ సుకుమార సుందరమూర్తి, కోటి సూర్యుల వర్చస్సుతో చూచేవారి దేహాలలోని ప్రతి అణువునూ అమృతంతో ముంచివేసేలా దర్శనమైంది. వారికి జ్ఞానోదయమయ్యింది. ఈ ప్రపంచమంతా తన సంతానమే అని భావించే భగవంతుని తమ పుత్రుడని భ్రమించుట తగదని తెల్సింది. అంత సుమతీ మాత నీవు సర్వలోకాలను పాలించే జగన్మాతకే ప్రభువన్న సంగతి, పుత్రవ్యామోహంలో మరచాను. అనంతకోటి బ్రహ్మాండాలు నీయందే ఇమిడివున్నాయి. నా భ్రాంతి తొలగిపోయిందని వల్లభులవారికి తెలిపింది. అపుడు వల్లభులు వారి నిజస్వరూపమునకు వచ్చి, సన్యసించి, దేశాటనకు పోవుటకు అనుమతినీయవలసిందిగా తల్లిదండ్రులను కోరిరి. ఎంతో ఆపుకోలేని దుఃఖముతో ఆ తల్లిదర్రండులు శ్రీపాదులవారికి ఆశీర్వచనాలు ఇచ్చి, వారి ధ్యేయానికి అనుమతి నొసంగిరి. వల్లభులవారు తల్లితో అమ్మా! నీవిపుడు దర్శించిన రూపాన్నే ప్రతినిత్యమూ ధ్యానిస్తూ ఉండు. త్వరలో, నీవు ఈ అజ్ఞానాంధకారాన్ని దాటి, నా సాయుజ్యం పొందగలవు. నీ ఈ కొడుకులిద్దరూ నూరేండ్లు జీవించి, మిమ్ములను సేవిస్తారు. వారికి అన్ని వసతులు పుష్కలంగా సమకూరుతాయి. లోకప్రసిద్ధి పొందుతారని తల్లికి చెప్పి, సోదరులతో మీరు తల్లి దండ్రులను ప్రత్యక్ష దైవాలుగా భావించి, సేవించి, తరించండి అని తెలిపి, తల్లిదండ్రులకు మూడుసార్లు ప్రదక్షిణం చేసి, వారి పాదాలకు నమస్కరించి ముందుకుసాగారు.

ఆ తరువాత స్వామి సన్యసించి, పాదచారియై ద్వారక, కాశీ, బృందావనం మొదలైన క్షేత్రాలు దర్శించిరి. వారు తమ చివరి మజిలీగా కురుంగడ్డ అను కృష్ణా నదీ తీరమందు గల గ్రామమందు నివసించిరి. అచ్చట నిత్య అనుష్టానపరులై మహా యోగిగా వెలసి తమ భక్తులను బ్రోచారు. కురుంగడ్డ, పంచదేవపహడ్ అను రెండు గ్రామాలు వారి పాదస్పర్శతో పునీతమయ్యాయి. ఆ ప్రాంతంలో విశ్వయోగిగా వారెన్నో మహిమలు చూపారు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-7

# బాలయతిగా శ్రీవల్లభుల లీలలు

శ్రీపాదశ్రీవల్లభులు జన్మించిన నాటి నుండి మొదటి 16 సంవత్సరాలు మాత్రమే తల్లిదండ్రుల వద్దయుండి, అటుపిమ్మట దేశాటన చేయుదురని వారి తల్లి సుమతీ రాణికి దత్తావధూత వరప్రదాన సమయములోనే తెలిపియుండెను. అందువల్లేనేమో శ్రీ వల్లభుల బాల్యదశ నుండీ కూడా ఆయన ప్రతిభాపాటవములు, లీలలు వెల్లడి చేసిరి. వారి వేషభాషలు ఒక బాలయతివలే ఉండి, ఆ గ్రామస్థులకు ఆశ్చర్యం గొలిపేవి.

శ్రీవల్లభులు మొదటిసంవత్సరము నిండిన నాటి నుండి కూడా తమలీలలను ప్రదర్శించేవారు, తమ తాతగారైన శ్రీబాపనార్యులవారితో పీఠికాపురమునందుగల బ్రాహ్మణపరిషత్తు సమావేశములకు వెళ్లినపుడు, వేదవేదాంగములను వల్లెవేసి, ఎన్నో శాస్త్ర విషయములపై ఎందరికో సందేహనివృత్తి చేసి, పరిషత్తునందలి పండితులను సంభ్రమాశ్చర్యములలో ముంచెడివారు. అదేవిధముగా, భక్తులను బ్రోచుటలో వివిధ అవతారములు దాల్చి, వారి ముందు ప్రత్యక్షమై వారి వారి కోర్కెలను తీర్చేవారు. వారు పదహారు సంవత్సరముల వయస్సు వచ్చువరకు, వయస్సుతో నిమిత్తం లేకుండా ఎన్నోలీలలను చూపెడివారు. వారి దివ్యలీలలెన్నో ఆకాశంలో నక్షత్రాలవలె, సముద్రతీరాన ఇసుకరేణువుల చందంబున, మనస్సులోని ఆలోచనావిధానంబుల తీరున, భక్తులకు క్షణక్షణమూ అనుభవమవుతూ, వారి హృదయాలను పులకింపజేస్తుండేవి. అవి ఆయన కావాలని ప్రయత్నంతో ప్రదర్శించినవిగాక, పువ్వులకు పరిమళంలాగ, ఆకాశంలోని సంధ్యారాగంలా ఎంతో సహజంగాను, సందర్భోచితంగానూ ఉండేవి. వజ్రాల హారంలోని బంగారు తీగలా, పూలమాలలోని దారంలా, ఈ లీలలన్నిటియందు శ్రీవల్లభుల సర్వజ్ఞత్వం అడుగడుగునా అనుభవమయ్యేది. భక్తరక్షణే ధ్యేయంగా వారి లీలలు సాగేవి. దీనిలో భాగంగానే గర్వాంధులకు గర్వభంగము, మూఢ నమ్మకాలను పారద్రోలుట, వరప్రదానములు, ఆశ్రితులను రక్షించుట, దుర్మార్గులను శిక్షించుట, వేదశాస్త్రములపై అవగాహన కలుగజేయుటలాంటి ఎన్నో లీలలు వారి బాల్యమందు పీఠికా పురములో చోటు చేసుకున్నాయి.

ఒకసారి పీఠికాపురమందలి తమ వీధిలో శ్రీబాపనార్యులవారు శ్రీవల్లభులను ఎత్తుకొని త్రిప్పుచుండిరి. అదే దారిలో వెళుతున్న శ్రీనరసావధానులు గార్ని చూచి శ్రీవల్లభులు మందహాసము చేసిరి. అప్పట్లో వల్లభుడు దత్తుడుకాడని నరసావధానులు ప్రచారము చేయుచుండెడివారు. అటునుండి నరసావధానులుగారు వెంకటప్పయ్య శ్రేష్ఠిగారి కిరాణాదుకాణమునకు వెళ్లిరి. అక్కడ శ్రీవల్లభులను శ్రేష్ఠిగారు ఒడిలో కూర్చుండబెట్టుకొని వారితో ఆడుకొనుచుండిరి. అటుపై నరసావధానులుగారు మరోవీధి గుండా పోవుచుండగా నరసింహవర్మగారు వల్లభులవారిని తమ భుజములపై ఎత్తుకొని ముద్దాడుచుండిరి. ఒకేసమయంలో శ్రీవల్లభులు మాతామహులయింటను, వర్మగారి వద్ద, శ్రేష్ఠిగారింటనూ ఉండుట గమనించిన శ్రీనరసావధానులుగారు ఇది కలయా? వైష్ణవ మాయయా? అని ఆశ్చర్యచకితుడైనను. బాల్యము నందే ఈ లీలలు సాధ్యమా ? అను మీమాంశకు గురి అయ్యెను.

ఇటువంటి లీలలు దత్తాత్రేయ అవతారములన్నిటియందు దత్తగురువులందరూ చూపించినారు. శ్రీ నృసింహసరస్వతిగా వల్లభులు అవతారము దాల్చినపుడు గూడ ఇటువంటిలీలనే ప్రదర్శించారు. వారు గంధర్వపురమందున్నప్పుడు వేర్వేరు గ్రామములకు చెందిన ఐదుగురు సన్నిహిత గురుభక్తులు ఒక దీపావళిపండుగ రోజున ప్రతి వారింటికి విడివిడిగా ప్రత్యేకించి రమ్మని శ్రీనృసింహసరస్వతుల వారిని ఆహ్వానించిరి. గంధర్వపురంలోని భక్తులు ఆ రోజు మఠమునందే ఉండవలసినదిగా వారిని కోరిరి. అందరికోరికను మన్నించి, ఒకే సమయములలో వేర్వేరు ప్రదేశములలో అయిదుగురు భక్తులయిండ్లతోబాటు మఠమునందు గూడ భక్తులకు దర్శనమిచ్చుటతోబాటు శ్రీనృసింహసరస్వతివారు భిక్షను గూడ స్వీకరించినారు.

అదే విధంగా శ్రీ శిరిడీసాయిబాబా, తాము శిరిడీలోనే ఉండి అదే సమయాలలో వేర్వేరు రూపాలతో భక్తులకు దర్శనమిచ్చి, దక్షిణ స్వీకరించేవారు. శిరిడీ హారతులలో కాశీలో స్నానజపాలు, మాహూరపురంలో నిద్ర, కోల్హాపురంలో భిక్ష ప్రతిదినము దత్తుడు చేస్తాడని స్తుతిస్తారు. ఇవన్నీ దైవాలకే సాధ్యం.

సర్వజ్ఞులైన వల్లభులు దివ్యలీలను ప్రదర్శించినప్పటికీ, అవి ఆర్తులను రక్షించేవిగాను, అర్థార్థులను పోషించేవిగాను, నిర్దుష్టమైన ఆధ్యాత్మికభావనను భక్తులకు ప్రసాదించి, వారిని మోక్షోన్ముఖులుగా చేసేవిగాను మాత్రమే ఉండేవి. కేవలం తమశక్తి సామర్థ్యాలతో లోకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచి తమకు కీర్తిని చేకూర్చే సాధనాలైన చవకబారు చమత్కారాలను ప్రదర్శించేవిగా ఉండేవికావు. వారి బాల్య లీలావిశేషాలు అధ్యయనం చేస్తే వారి యొక్క ఔన్నత్యం, మానవాళికి వారు చేసినమేలు భక్తజనులకు అవగతమవుతాయి. వారి లీలలలో దుష్టశిక్షణకు బదులుగా దుష్టపరివర్తన ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. అదే గురువుల బోధనాలక్ష్యం.

## 1. కులశేఖరునికి గర్వభంగము

ఒకసారి కులశేఖరుడను మల్లయుద్ధవీరుడు గ్రామగ్రామములందు తిరుగుచూ, ఆ వేర్వేరు గ్రామములందున్న మల్లయుద్ధ వీరులను ఓడిస్తూ, ఆయా గ్రామపెద్దలచే ఇతనొక గొప్ప మల్లయుద్ధవీరుడని, తమ గ్రామములో ఇతనిని ఎవరూ ఎదిరించలేకపోయారని ఒక జయధ్రువపత్రము పొంది విర్రవీగేవాడు. తన జైత్రయాత్రలో అతడు పీఠికాపురాన్ని సందర్శించి, అక్కడ కూడా జయకేతనం ఎగురవేయాలని, పీఠికాపురమందున్న మల్లయుద్ధవీరుల్ని తనతో మల్లయుద్ధానికి ఆహ్వానించాడు. అతని దిగ్విజయయాత్ర గూర్చి విన్న పీఠికాపుర మల్లయుద్ధయోధులు, అతనిని జయించుట కష్టమని తెల్సుకుని, శ్రీపాదులవారిని శరణుజొచ్చిరి. అంత శ్రీపాదులవారు అతనితో యుద్ధముచేయుటకు, వారిని ప్రతిదినము తన శరీరములోని వెన్ను వద్ద గల గూనితనము బాగుచేయమని కోరే భీముడను ఒక సామాన్యుని ఎంపికచేసినారు. శ్రీపాదుల వారు చేసిన ఈ ఎంపిక పీఠికాపురవాసులను ఆశ్చర్యపరచినది. కుక్కుటేశ్వరాలయ సమీపములో జరిగిన మల్లయుద్ధ పోరులో భీముడు, ప్రత్యర్థి బలమంతయూ శ్రీవల్లభులమహాత్యంతో ఆకర్షించుకుంటూ, మహాబలశాలిగామారి కులశేఖరుని ఓడించి, అతనికి గర్వభంగము గావించెను, ఆ మల్లయుద్ధపోరు మహిమవల్ల భీమునికి శాశ్వతముగా గూనితనము పోయినది. కులశేఖరుడు శ్రీపాదులవారే తన కులదైవమగు శ్రీవెంకటేశ్వరస్వామిగా ఎంచి వారికి పాదాక్రాంతుడయ్యెను.

ఇదే విధంగా, శ్రీవల్లభులు శ్రీనృసింహసరస్వతిస్వామిగా అవతరించినపుడు జయపత్రం కోరిన ఇద్దరు పండితుల గర్వాన్ని ఒక పామరునిచేత వేదాల్ని వల్లెవేయించి అణచివేసారు. ఒకసారి గంధర్వపురం చేరిన ఇద్దరు పండితులు, ఆ దేశ యవనరాజు ప్రోద్బలంతో ఆ రాజ్యంలో పండితుల కడకేగి తమతో వేదచర్చచేయమని లేదా ఓడినట్లు అంగీకరించి జయ పత్రమీయమని, అట్లు సమర్పించిన పత్రాలెన్నో స్వీకరిస్తూ తమ విజయగర్వాన్ని చాటుకునేవారు. అలా వారు త్రివిక్రమ భారతి అనే గురుభక్తుని ద్వారా, శ్రీనృసింహసరస్వతి స్వామి వారిని చేరి వారితో గూడ వేదచర్చ జరగాలని వాదనకు దిగారు. వేదాలు అంతులేని శాస్త్రాలని, వ్యాసమహర్షి లాంటివారే వేదాలను పూర్తిగా అధ్యయనం చేయలేకపోయారని, ఇటువంటి చెడుప్రవర్తన మానుకొమ్మని స్వామి ఎంతగానో వారించినా, వారు వినక స్వామిని వేదచర్చకు రావాల్సిందిగా పట్టుబట్టారు. వారి గర్వమణచదలచిన స్వామి ఆ దారిన పోతున్న ఏడు జన్మల క్రిందట వేదవిదుడైన ఒక ఛండాలుని పిలచి, తమమంత్ర మహిమతో, అతనికి గతంలో వేదజ్ఞానుడిగా ఉన్న పూర్వస్మృతి తెప్పించి అతనిచే వేద చర్చ జరిపించి, పండితులను ఓడింపచేసి వారి గర్వమణచి వేసారు. గర్వము సర్వానికి చేటన్న ఆర్యోక్తిని మరోసారి చాటి చెప్పారు.

## 2. జ్యోతిష్యుని గర్వభంగము

ఒకసారి ఓఢ్రదేశమునందు జ్యోతిష్య మభ్యసించిన ఒక జ్యోతిష్యపండితుడు పీఠికాపురము చేరి ఎందరికో తమతమ మరణశాసనములను లెక్కలుగట్టి చెప్పుచుండెను. అవియన్నియు ఎంతో ఖచ్చితముగా జరుగుచుండెను. అతడొకనాడు శ్రీ వల్లభులకు ఆత్మీయుడైన శ్రీ వెంకటప్పయ్య శ్రేష్ఠి గారికి వారు ఎప్పుడు మరణించెదరో తెలిపే వారి మరణశాసనమును ఎంతో ఖచ్చితముగా లెక్కలు కట్టి సమయము తెలుపుతూ వివరించెను. అది విన్న శ్రేష్ఠిగారెంతో నిరుత్సాహపడిరి. అయితే శ్రీపాదులవారు శ్రేష్ఠిగార్కి అభయమిచ్చి, మరణసమయమురాగానే ఆ మరణశాసనమును వారింట్లో ఉన్న ఒక ఆబోతుకు

బదలాయించిరి. వెంటనే అది శ్రేష్ఠికి బదులుగా గిలగిలాతన్నుకుంటూ మరణించింది. శ్రీవల్లభులు ఆ జ్యోతిష్యునితో అపమృత్యువాత పడనున్న శ్రేష్ఠి యొక్క కర్మఫలమును ఆబోతునకు బదలాయించితినని, ఆ ఆబోతే గతజన్మలో ఆ జ్యోతిష్యుని యొక్క తండ్రియని తెలిపి, అతనిచే ఆ ఆబోతుకు దహన సంస్కారములు జరిపించి, అటుపిమ్మట అందరికీ అన్నదానము చేయించిరి. రాబోవు జన్మలలోగల ఆయుష్షును తగ్గించి, ఆ ఆయుష్షును ఈ జన్మకు కలిపి మృత్యువును కూడ శాసించి ఆయుర్దాయమును పెంచగల సమర్థులు, శ్రీవల్లభులు.

ఇదే విధంగా శ్రీవల్లభులు శ్రీ నృసింహసరస్వతి స్వామిగా అవతరించినపుడు మరణించిన తమ భక్తురాలైన సావిత్రి భర్తను, అదేవిధంగా మరొక భక్తురాలైన శాంతాదేవి అను ఆమె కుమారుని గూడ తిరిగి బ్రతికించారు. వారికి రాబోవు జన్మలలోగల ఆయుష్షును ఈ జన్మకు బదలాయించినట్లుగా స్వామివారు తెలిపారు.

శ్రీ శిరిడి సాయిబాబా గూడ జాతకాలకు, జ్యోతిష్యులకు విలువనిచ్చేవారు కారు. జాతకము ఒక విధంగా ఉంటే శ్రీ సాయిబాబా దాని గతి మార్చేసేవారు. టెండూల్కర్ అనే భక్తుని కుమారునికి జాతకంలో గ్రహాలు, దశ, బాగాలేవని, కనుక అతడు పరీక్షలో కృతార్థుడు కాలేడని ఎందరో జ్యోతిష్యులు తెలిపారు. అంతటితో ఆ యువకుడు పరీక్ష వ్రాయనని భీష్మించి కూర్చున్నాడు. అతని తల్లి బాబాగారితో ఈ విషయం చెప్పగా జాతకాలు, జ్యోతిష్యాలు నిజం కాజాలవని, తమపై విశ్వాసముంచి, బాగా చదువుకుని పరీక్ష వ్రాయమని తెలిపారు. అతను బాబాపై విశ్వాసముంచి పరీక్ష వ్రాసి కృతార్థుడైనాడు. అలాగే దామోదర్‌రాస్నే అను భక్తునికి సంతానము కలుగదని జాతకాలు, జ్యోతిష్యులు చెప్పినా సాయి అతనికి సంతానాన్ని అనుగ్రహించారు. కాబట్టి దేనినయినా తిరిగి రాయగలశక్తి గురువులకు గలదు.

## 3. నీరు నెయ్యిగా మరియు నెయ్యి నీరుగా మారుట

ఒకసారి పీఠికాపురమున శ్రీబాపనార్యుల వారి ఆధ్వర్యములో జరుగు యజ్ఞమునకు నెయ్యి సేకరించి, దానిని ఒక వృద్ధ బ్రాహ్మణుని ఆధీనములో ఉంచిరి. దురాశాపరుడైన ఆ బ్రాహ్మణుడు ఆ నెయ్యిలో కొంతభాగమును యజ్ఞమునకు పంపి, మిగిలినది తన ఇంటిలో దాచుకొనెను. యజ్ఞము ప్రారంభమైన కొద్దిసేపటికి నెయ్యి (ఘృతము) సరిపోదని, యాజ్ఞికులు తెలిపిరి. ఆ నెయ్యిలో కొంతభాగము వృద్ధ బ్రాహ్మణుడు కాజేసినాడన్న విషయము గ్రహించిన శ్రీవల్లభులు. అతనిని పిలచి పాదగయాతీర్థమునకు పోయి ఒక పాత్రలో ఆ తీర్థములోని నీరు తీసుకొని, అంతే నీటిని తిరిగి పాదగయా తీర్థమునకు సమర్పించగలమని, గంగామాతకు తెలిపి ఆ నీటిని తీసుకుని రమ్మన్ని ఆజ్ఞాపించిరి. వేదమంత్రములతో తెచ్చిన ఆ నీరు శ్రీ వల్లభులమహిమవల్ల నెయ్యిగా మారెను. ఆ నెయ్యితో యజ్ఞము పూర్తి చేసిరి. పాదగయాతీర్థము నుండి పాత్రలో తీసికొని వచ్చిన నీరు ఎంత ఉంటే, అంత నెయ్యిని శ్రీపాదుల వారి ఆజ్ఞ ప్రకారము, యజ్ఞము ముగిసిన పిదప వెంకటప్పయ్య శ్రేష్ఠి అను భక్తుడు పాదగయాతీర్థమాతకు సమర్పించినాడు. ఆశ్చర్యముగా, ఆ నెయ్యి పాదగయాతీర్థములో పోయుచున్నప్పుడు నీరుగా మారి తీర్థ జలములో కలసిపోయెను. నెయ్యి అపహరించిన బ్రాహ్మణుని ఇల్లు అగ్నిలో దగ్ధమయ్యెను. దగ్ధమయిన ఇంటి భస్మమును నత్తితో, విచిత్ర వ్యాధితో, బాధపడుచున్న ఒక వ్యక్తికి నీటిలో కలిపియిచ్చి అతని వ్యాధులను శ్రీపాదుల వారు నయము గావించిరి. పిమ్మట అతనిపై వల్లభులు శక్తిపాతము చేయగానే అతడు పండితుడయ్యెను. అతనిని 'దత్తానందుడను' పేరుతో సుప్రసిద్ధుడవై, లోకులకు ధర్మబోధ చేసెదవని వల్లభులు ఆశీర్వదించిరి. తన తప్పు తెలుసుకుని, పశ్చాత్తాపము చెందిన వృద్ధ బ్రాహ్మణునకు మరొక ఇల్లు ఏర్పాటు చేసిరి. ఇది వల్లభులు ఆరు సంవత్సరముల వయస్సులో నెరపిన అద్భుతలీల.

శిరిడీ సాయిబాబా గూడ ప్రతిరోజు స్థానిక వర్తకులను యాచించి వారి నుండి నూనె సేకరించి, మసీదులో సాయంకాలం దీపాలు వెలిగించేవారు. ఒకరోజు వారందరూ నూనె ఇచ్చుటకు నిరాకరించడంతో, బాబా తన డబ్బాలో ఉన్న నీటిని నూనెగా మార్చి, ఆ నూనెతో దీపాలు వెలిగించి, భక్తులను వ్యాపారులను ఆశ్చర్యచకితులను చేసారు. ఆవిధంగా బాబా తప్పుడువిధానాలను నిరసించి, వ్యాపారులకు బుద్ధిచెప్పారు. ఈ ప్రక్రియలో బాబా నీటిని నూనెగామార్చి, దీపాలు వెలిగించారు. అదే గురువుల అద్వితీయ శక్తి.

## 4. పంచమజాతివారిని ఉద్ధరించిన శ్రీవల్లభులు

శ్రీపాదుల వారికి ఏడవయేట ఉపనయనము వేదోక్తముగా, వైభవముగా జరిగినది. శ్రీపాదులవారు వారి దివ్య చరితమును ఎవరు ఎక్కడ ఎప్పుడు పారాయణము చేయుచున్ననూ, అచ్చటనే వారు సూక్ష్మరూపములో సంచరించెదరు. వైభవముగా జరుగుతున్న వారి ఉపనయనము చూడవలెనని కోరికవున్నా, దత్తదాసు అను పంచమజాతికి చెందిన దత్త భక్తునికి ఆ అవకాశము కలుగలేదు. అయిననూ, ఆ శుభసందర్భమును పురస్కరించుకొని, వల్లభభక్తుడైన దత్తదాసు తన జాతి వారినందరినీ తన ఇంటికి పిలచి, వారందరికీ దత్తచరిత్రను వినిపించుచుండెను. పాండిత్యము లేని, కథావస్తువు తెలియని, విషయ పరిజ్ఞానం లేని దత్తదాసు తనకు వచ్చిన కథనే, అనేకసార్లు పదేపదే వినిపించుచుండెను. ఉపనయనము ముగియగానే, వల్లభులు లేచి తాను పంచమజాతివారి ఇంటికి వెళ్లుచున్నానని ప్రకటించిరి. అక్కడివారు దానికి అభ్యంతరము తెలుపగా, తనకు జాతి, కుల, బేధములు లేవని, ధర్మబద్ధులై జీవిస్తూ దత్తభక్తిని కల్గిన వారినెవరినయినా తప్పక ఆదరించి, అక్కున చేర్చుకుందునని తెలిపి, దత్తదాసుని ఇంట తమ దివ్యమంగళ స్వరూపముతో దర్శనమిచ్చి, వారిచ్చిన పండ్లను, పాలను స్వీకరించారు. తెలిసిన మేరకు దత్తచరిత్రను పఠించిన అతనికి సకల సౌఖ్యములు, మోక్షము ప్రసాదించారు. కావున దత్తప్రసాదమును ఏ కులస్థుడు ఇచ్చినా స్వీకరించాలి. ఎందుకంటే శ్రీవల్లభులకు కుల, మత బేధములు లేవు.

## 5. క్షుద్ర విద్యలను నిర్వీర్యము చేయుట

స్వర్ణకారకుటుంబమునకు చెందిన బంగారప్ప అనునాతడు, మంత్ర, తంత్రములతో, భూత, ప్రేత పిశాచములను లోబర్చుకుని, క్షుద్రవిద్యలతో అనేక గ్రామములను సందర్శించేవాడు. అతడు ఎవరినయిన చంపదలచినచో, అతని పేరును తలుస్తూ, పొట్టపట్టనంత పరిమాణములో అంటే పొట్టపగిలేటంత స్థాయిలో చాలానీరు త్రాగుతుండేవాడు. ఆ నీరు అతడు చంపదలచుకున్న వ్యక్తి యొక్క పొట్టలోనికి ఆతని పొట్టపట్టనంత పరిమాణములో అదృశ్యముగా పంపి, క్షుద్రవిద్యతో ఆ వ్యక్తి పొట్టపగలి చచ్చేటట్లు చేసేవాడు. ఈ విధంగా అతడు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ధనము గుంజేవాడు.

ఇదే క్రమములో అతడు పీఠికాపురమునకు వచ్చెను. అతడు బాపనార్యుల వారి, పేరు, ప్రతిష్టలు శ్రీపాదవల్లభుల మహిమలు తెల్సుకుని, అసూయతో వారిని ఏవిధముగానయినా సంహరింపవలెనని పన్నాగము పన్నెను. ముందుగా బాపనార్యుల వారిపై తన క్షుద్రమంత్రశక్తి ప్రయోగింపదలచి, వారిపేరున నిరాటంకముగా నీరు త్రాగుచూ, ఆ నీటిని తన క్షుద్రమంత్రశక్తి ద్వారా వారి పొట్టలోనికి పంపుచుండెను. ఇది గ్రహించిన వల్లభులు, బాపనార్యుల వారి పొట్టను తమ అమృతహస్తముతో నిమురుచూ, ఆ పొట్టలోనికి చేరిన నీటికి ఆవిరిగా మార్చి, బయటకు పంపుచుండిరి. నీటిని త్రాగి, త్రాగి అలసిపోయిన బంగారప్ప, శ్రీపాదుల వారి మహిమ వల్ల తన ప్రయత్నము విఫలమయ్యెనని గ్రహించి, ఆ ప్రయత్నమును విరమించుకొనెను. తన శక్తి విఫలమయ్యెనన్న కోపముతో, సర్పమంత్రమును ఉపయోగించి బాపనార్యులను సంహరింపదలచెను. అతను సర్ప మంత్రము ప్రయోగించినచో, అతను చంపదలచుకున్న వ్యక్తిని, అనేక సర్పములు వెంటాడి, కాటువేసి చంపివేయును. అతను బాపనార్యులపై ఈ సర్పమంత్రమును ప్రయోగించెను. సర్పములు బాపనార్యుల వారియింటికి వచ్చికూడ, ఏమీచేయలేక వెనుతిరిగి పోయినవి. రెండుసార్లు తన మంత్రములు విఫలమయిన కారణంగా, బంగారప్పలో రాక్షసప్రవృత్తి పేట్రేగిపోయెను. తన మంత్రములను విఫలము చేయుచున్న ఎనిమిది సంవత్సరముల వయసుగల బాలుడైన శ్రీ వల్లభులనే సంహరింపవలెనని పథకము రచించెను. అతని క్షుద్రవిద్య ప్రకారము, శ్మశానములోనికిపోయి చంపవలసిన వ్యక్తి పేరున ఒక పిండి బొమ్మను చేసి, దానికి సూదులు గుచ్చి, ఆ సూదుల ద్వారా అవతలి వ్యక్తి శరీరములోనికి మంత్రాల ద్వారా విషపూరితమయిన మరణబాధలు పంపించి చంపివేయుట. ఈ విద్యనే బాణామతిగా పేర్కొంటారు. ఈ విద్యను అతడు శ్రీవల్లభులపై ప్రయోగించెను. కాని శ్రీవల్లభుల మహిమవల్ల ఈ మంత్రము కూడా నిర్వీర్యమై, వెనుతిరిగి ఆ విషపూరిత మరణ బాధలు బంగారప్ప శరీరములోనికి చొచ్చుకొనిపోయి అతనిని నరకయాతన అనుభవించునట్లు చేయుచుండెను. బాధలతో తల్లడిల్లి తనకు మరణము తప్పదని గ్రహించిన బంగారప్ప శ్రీపాదుల వారిని శరణుజొచ్చెను. తన తప్పులను క్షమించమని ప్రార్థించెను. చేసిన పాపములకు శిక్ష అనుభవింపక తప్పదని, అడవిలోని ఒక దిగుడు బావిలో తలక్రిందులుగా పడియుండెదవని శపించిరి. శంకరభట్టు అను

కన్నడబ్రాహ్మణుని దర్శనముతో శాపవిమోచనము కాగలదని తెలిపిరి. శ్రీ శిరిడిసాయిబాబా గూడ క్షుద్ర విద్యలనెంతో నిరసించేవారు. ఆ విద్యలు గలవారిపట్ల నిరాదరణ కనపరచేవారు. కుశభావు అను ఒక ఉపాధ్యాయుడు ఒక సాధువును సేవించి ఒక మంత్రం నేర్చాడు. దాని వలన అతడు కోరగానే పండ్లు, మిఠాయిలు వంటి వస్తువులు, అతని చేతిలోనికి ఆశ్చర్యంగా వచ్చేవి. ఆశతో జనం అతని చుట్టూ చేరేవారు. కుశాభావు బాబాకు భక్తునిగా మారి, ఆయన దర్శనంకోరితే, ఆ మంత్రాలన్నీ వదిలేస్తేగాని తన దగ్గరకు రావద్దని తెలిపారు. ఇటువంటి శక్తులు అందర్నీ అపవిత్రం చేస్తాయని బాబా అనేవారు. అతడు ఆ శక్తులన్నీ విడిచిపెట్టేక, బాబా అతనిని అనుగ్రహించి అతనిచే శ్రీసమర్ధరామదాసు రచించిన 'దాసబోధ' అనే గ్రంథాన్ని చదివించి, సన్మార్గాన్ని బోధించారు. అటుపై అతడు బాబాను భక్తితో కొలిచేవాడు.

## 6. మహారాజుకు గర్వభంగము

ఒకసారి పీఠికాపురసంస్థానమునేలే మహారాజు శ్రీపాదులవారి దర్శనము చేయసంకల్పించి, వల్లభుల వారిని, వారి తల్లిదండ్రులతో తన సంస్థానమునకు రమ్మని తాఖీదు పంపినాడు. దీనికి వల్లభులు నిరాకరించి, రాజు కావాలంటే తమ ఇంటికి వచ్చి దర్శనము చేసుకొని, తగిన గురుదక్షిణ కూడ ఇవ్వవలెనని ప్రత్యుత్తరము పంపిరి. దీనికి ఆగ్రహించిన రాజు క్రోధముతో ఊగిపోవుచుండగా, అర్ధాంతరముగా అతనిలోని శక్తి అంతరించిపోయి, నిర్వీర్యుడై, శోషతో క్రిందపడి పోయినాడు. అతనిని లేవనెత్తి పరిచారకులు సేవలు చేయుచుండిరి. రాజపురోహితుడైన రామశర్మ అనునాతడు స్థానిక కుక్కుటేశ్వరాలయములోని స్వయంభూదత్తునికి పూజలు చేయించి, రాజుకు ప్రసాదమిచ్చి, అనేకమంది బ్రాహ్మణులతో ప్రతి దినము దత్త పురాణము పారాయణము చేయించుచుండెను. అయిననూ ఫలితము కనిపించకపోగా, రాజ్యమునందు దొంగల భయము అధికమయ్యెను. రాజునకు పీడకలలతోబాటు, రాజకుమార్తెను భూతప్రేతములు బాధించుచుండెను. ఇలా రాజు పరిస్థితి దయనీయముగా మారెను. రాజ పురోహితుడైన రామశర్మ ఇంటి యందు గూడ పరిస్థితులు అస్తవ్యస్థమై, అతని కుటుంబ సభ్యులు అతనిపై తిరుగుబాటు చేయుటతోబాటు, ఇంటియందు భూతప్రేతముల గోల అధికమయ్యెను. దత్తపురాణము పారాయణము చేయు బ్రాహ్మణులు గూడ ఇబ్బందులకు గురికాబడుచుండిరి. చివరకు, ఇది అంతయు శ్రీవల్లభులను అవమానపరచినందులకే జరిగినదని గ్రహించి, మహారాజు, రామశర్మతోబాటు అందరూ వల్లభుల శరణుజొచ్చి, క్షమాపణలు కోరిరి. తామే కుక్కుటేశ్వరాలయములోనున్న స్వయంభూదత్తుని ప్రతిరూపమని, తమను అవమానించి, స్వయంభూదత్తునికి పూజలు చేసి, దత్తపురాణము చదివినా ఫలితము శూన్యమని తెలుసుకోవాలని, తమను శరణుజొచ్చినవారిని తప్పక కాపాడెదమని తెలిపి వారిని క్షమించి వల్లభులు వదిలివేసిరి. సంపదగలదని గర్వము పడ రాదని, మనవద్దనున్న సొమ్ముకు ద్రవ్యశుద్ధి ఉండాలని లేనిచో దుఃఖము కల్గునని శ్రీవల్లభులు వారికి హితవు పలికినారు.

## 7. భక్తుని గాచిన వల్లభుడు

ఒకప్పుడు గొప్పగా బ్రతికిన శ్రీమన్నారాయణుడను రైతు బాపనార్యుల స్వగ్రామమైన మాల్యాద్రిపురమునకు చెందినవాడు. ఆర్థికముగా చితికిపోయి పీఠికాపురమునకు వలస వెళ్లి శ్రీబాపనార్యుల సహాయమర్థించెను. శ్రీపాదులవారు ఆ రైతుకు గుప్పెడు మినుములుయిచ్చి, వాటిని మూటగా కట్టుకుని, పశ్చిమదిక్కుగా పోయినచో మంచి జరిగి, అన్నోదకములు దొరకునని, ఆశీర్వదించిరి. అచ్చటనుంచి పశ్చిమంగా బయలుదేరి కర్నాటక రాష్ట్రమునకు చేరికొనిన ఆ రైతు కుటుంబమునకు స్థితిమంతులైన వృద్ధ దంపతులు తారసపడిరి. ఆ వృద్ధ దంపతుల మంచిచెడ్డలు చూచే దిక్కులేని కారణంగా, వారి దాయాదులు వారి ఆస్థికాజేయాలని పన్నాగాలు పన్నుతూ వారిని బాధలకు గురిచేసేవారు. ఆ వృద్ధదంపతుల కోరిక మేరకు ఆ రైతు కుటుంబము కొద్ది కాలము వారికి సహాయసహకారములు చేస్తూ అక్కడనే ఉండిపోయిరి. ఈలోగా శ్రీవల్లభులు ఇచ్చిన మినుములు పాడయిపోయి దుర్వాసనరాగా, వారు ఆ మినుములను అవతల పారమేయుచూ, బహుశా తాము ఇక్కడే స్థిరపడవలెనని వల్లభుల ఆజ్ఞగా తలచిరి. ఆ వృద్ధ దంపతులు కూడా వారిని శాశ్వతముగా అక్కడే ఉండమని పదేపదే కోరుచుండిరి. కొంత కాలమునకు ఆ వృద్ధ దంపతులు, ఆ రైతును దత్తత చేసికొని, తమ ఆస్తిపాస్తులు ఆ రైతుకు ఇవ్వవలెనని తలపోసిరి. దీనికి వారి దాయాదులు ఎన్నో అవరోధములు కల్పించుచుండిరి. ఎట్టకేలకు ఆ రైతును వృద్ధ దంపతులు తమ వారసునిగా ప్రకటించిరి. ఆ రైతు కుటుంబమును

తరిమివేయాలని గ్రామపెద్దల, మంత్ర, తాంత్రికుల సహాయము తీసికొనినప్పటికీ, శ్రీవల్లభుల శక్తి ముందు వారి ప్రయత్నములన్నియూ పటాపంచలైనవి. ఆ వృద్ధ దంపతుల ఇంట ప్రతినిత్యము జరుగు శ్రీవల్లభుల నామ స్మరణము వారిని ఆపదలనుండి భల్లూకము, నాగుపాములు కాపాడి, దాయాదుల పీడ వదిలించినవి. ఈవిధంగా ఆశ్రయించిన భక్తులను శ్రీవల్లభులు రక్షించి, వారికి అన్నోదకములకు లోటు లేకుండా చేసారు.

## 8. దండిస్వామి గర్వభంగము

దండిస్వామి అను వేదవిదుడు, శ్రీపాదులవారి గూర్చి విని వారిని అవమానించవలెనని ద్వేష భావముతో, తన శిష్య బృందముతో కలిసి పీఠికాపురము వచ్చెను. స్థానికముగా ఉండే కొంతమందితో వల్లభులు కేవలం మానవమాత్రులని తెలిపి, వారిని తనవైపుకు త్రిప్పుకుని, కుక్కుటేశ్వరాలయమందు గల స్వయంభూదత్తునికి పూజలు చేయుచుండెను. వల్లభులు స్వయంభూదత్తుని అవతారముగాదని ప్రచారం చేయుచూ, అందరికీ విభూది, కుంకుమ సృష్టించి ఇచ్చుచుండెను. శ్రీపాదులు వారు తమ కుటుంబసహితముగా తన వద్దకు వచ్చి, తాను దత్తావతారముగాదని తెల్పి, సాష్టాంగపడి, తనకు క్షమాపణలు చెప్పాలని వూరంతయూ చాటింపు వేయించెను. ఇతని గర్వమణచి, బుద్ధి చెప్పాలని ఒకరోజు శ్రీవల్లభులు తమ ఇంట పెరుగుతో కలిపిన అన్నము తినుచుండిరి. వారు తినుచున్న పెరుగన్నము ముద్దలు కుక్కుటేశ్వరాలయము నందున్న స్వయంభూదత్తుని ముఖముపై పేరుకొనిపోవుచుండెను. అవి తుడిచివేసిన వెంటనే తిరిగి వచ్చుచుండెను. దీనిని చూచి దండిస్వామి మండిపడి, తన శిష్యులతో కలసి వేదఘోష చేయుచూ, వల్లభులపైకి దాడికి బయలుదేరెను. అతను ఎంతనడచిననూ, కాళ్లు కదులుచున్నవిగాని, ముందుకుపోలేకపోవుచుండెను. అక్కడికక్కడే కదలలేకవుండి పోయెను. ఇంతలో అతని కమండలము రెండు ముక్కలై, నడుము విరిగి తన శిష్యులతో అక్కడే కూలబడిపోయెను. దిక్కుతోచని ఆతడు శ్రీవల్లభుల శరణుకోరెను. శ్రీవల్లభులు అతనితో హద్దులుమరచి, గర్వముతో విర్రవీగి, భగవంతుని నిందించి శాపాలకు గురికావద్దని హితవు పలికి, అతనిని ఒంటరిగా హిమాలయములకు పోయి తపస్సుచేసుకొనమనిరి. గర్వమణగిన దండిస్వామి వల్లభులను క్షమాపణ కోరి వెడలిపోయెను.

## 9. సాయినాచార్యులకు గురువును చూపుట

సాయనాచార్యులను, శ్రీవైష్ణవుడు, తీవ్రవైరాగ్యముతో ఉత్తర, దక్షిణదేశములందు తీర్థయాత్రలు చేయుచూ, సద్గురువు కొరకై అన్వేషించుచూ, మార్గమధ్యమున పీఠికాపురమునకు వచ్చెను. శివారాధనము సమ్మతముగాని ఈతడు, దేవాలయము నందు మాధవదర్శనము చేసుకొని, బయటకు రాగా, మార్గములో అతనిపైకి ఒక చంఢాలుడు దూసుకుని వచ్చెను. సాయనాచార్యులను చూచి తనకు గురుదక్షిణయిమ్మని, తానే అతని గురువునని గద్దించి పలుకుచుండెను. భయపడిన సాయనాచార్యులు ఆ చంఢాలునితో నీవెవ్వరివో నాకు తెలియదు. త్రాగి, తందనాలాడుచూ ఈ విధముగా ప్రవర్తించుట తగదని అతనిని వారించెను. దానికి ఛండాలుడు నీ దగ్గర ఉన్న సొమ్మంతా గురుదక్షిణగాయిమ్మని, తనని గురువుగా అంగీకరించమని లేనిచో తన కత్తితో అతనిని ఖండాలుగా చేసెదనని సాయనాచార్యునితో గుమిగూడిన ప్రజలందరి ఎదుట తగవుపెట్టుచుండెను. గురువుకోసం వాడవాడలా తిరిగే నీకు నేనే గురువును. ఈనాటి నుండి నీకు నామానందుడనే క్రొత్త నామధేయమును ఇచ్చి, నా శిష్యునిగా చేసుకొనుచున్నానని బిగ్గరగా అరచుచుండెను. గత్యంతరములేక, అతని బారినుండి తప్పించుకొనదలచి, సాయనాచార్యులు తన దగ్గరనున్న సొమ్మును అతనికి సమర్పించి, తనను వదిలివేయమని సాష్టాంగ ప్రణామమాచరించెను. ఆశ్చర్యముగా, ఆ చంఢాలుని స్థానములో దివ్యమంగళమూర్తి కనపడినారు. వారి దివ్య నేత్రముల నుంచి అవ్యాజ మైన కరుణ వెలువడెను. అతనితో ఆ స్వామి సాయనాచార్యా ! నేను శ్రీపాదశ్రీవల్లభుడను, దత్తుడను, నేనే నీ గురువును. నేటి నుంచి నీవు నామానందుడను పేరుతో ప్రసిద్ధినొంది, ధర్మప్రచారము చేయుదువని తెలిపి అంతర్ధానమైరి. అంతసా యనాచార్యుడు పీఠికాపురములో ఎంతగా తిరిగిననూ అతనికి భిక్ష లభించలేదు. ఎంతో ఆకలితోనున్న సాయనాచార్యులు తిరిగి తిరిగి భిక్షకై అప్రయత్నముగా శ్రీ అప్పలారాజశర్మగారింటికి వెళ్లెను. భవతీ ! భిక్షాందేహి అని పిలువగానే శ్రీవల్లభులు, తలుపు తెరచుకుని వచ్చి, అతనిని అరుగుపై కూర్చుండబెట్టి తమ దివ్య హస్తములతో అన్నము వడ్డించుటయేగాక, తినిపించిరి కూడ. అతని మూతిని తుడిచి, ఎల్లవేళల అతనిని వెన్నంటి కాపాడెదనని అభయమిచ్చి సాగనంపిరి.

## 10. ముళ్ల చెట్టుకు సద్గతినిచ్చుట

గురుచరణుడు దత్తభక్తుడు. కటిక దారిద్ర్యముతో బాధపడుచున్నాడు. స్వామి యందు ఎంతో విశ్వాసముంచి తనకు మంచి రోజులు రాగలవని, దారిద్ర్యము తీరిపోగలదని నమ్మి దత్తుని సదా కొలిచి ప్రార్థించేవాడు. ఒకనాడతనికి కలలో ఒక కసాయివాడు కత్తితో విన్యాసములు చేయుచూ, నేను దత్తుడను, నిన్ను చంపివేయుదునంటూ కలలో అతనిని ఎంతో భయపెట్టెను. పీడ కలతో, భయభ్రాంతుడైన గురుచరణుడు నిద్ర నుంచి లేచి వెర్రికేకలు వేయుచూ, తన వారికి ఆ పీడకలయొక్క వృత్తాంతము తెలియజేసెను. తెల్లవారగనే వారి ఇంటి ముందు హరినామము గానము చేయుచూ, కృష్ణదాసనెడి ఒక హరిదాసు ప్రత్యక్షమయ్యెను. ఆ హరిదాసు తలపై భిక్షవేయు పాత్రలో ఒక చిన్న ఔదుంబర వృక్షం మొక్క (చిన్నమేడి చెట్టు) గలదు. గురుచరణుడతనికి భిక్షయిచ్చునపుడు, హరిదాసు అతనితో ఒక కసాయివాడు గురుచరణుడను వానిని హత్య చేసినాడని, అతడు దత్తభక్తుడు గావున అతని ప్రాణములను దత్తుడు ఈ ఔదుంబర మొక్క నందు పదిలపరచి రక్షించినాడని చెప్పుతూ, ఈ మొక్క పీఠికాపురమందున్న శ్రీవల్లభుల ఇంటి నందున ఔదుంబర వృక్ష సంతతియని, దాన్ని ఇంటనాటుకుని సర్వశుభములు పొందుమని, ఆ మొక్కను గురుచరణునికి ఇచ్చెను. అంతట గురుచరణుడు తానే గురుచరణుడనని, తన స్వప్నవృత్తాంతమును ఆ హరిదాసునకు తెలిపెను. జాతకులకు మారకదశ సంప్రాప్తమైనప్పుడు సద్గురువు తన శిష్యులను ఈ విధముగానే రక్షించునని హరిదాసు తెలిపెను. మహాపుణ్య క్షేత్రమైన పీఠికాపురమునందు వెలసిన, శ్రీవల్లభులను దర్శించమని చెప్పి హరిదాసు వెడలిపోయెను. ఆ మరునాటినుండి, ఆ ఔదుంబరమొక్కను తన ఇంట నాటి, పూజించి, ప్రదక్షణలు చేయుచూ, తన కష్టనష్టములను దత్తప్రభువునకు గురుచరణుడు విన్నవించుకునేవాడు. అనతికాలములోనే పిల్లలు లేని, అతని దూరపు బంధువు అతనిని కలసి కొంత ధనమిచ్చి, అతను చేయుచున్న పట్టుబట్టల వ్యాపారాన్ని కొనసాగించమని, అతనికి కొన్ని పట్టువస్త్రములను కూడా ఇచ్చెను. ఆనాటి నుంచి అతని దారిద్ర్యము తీరినది. ఒకనాడతడు పీఠికాపురమునకుపోయి, వల్లభుల వారిని దర్శించెను. అప్పుడు వల్లభులవారు వారి ఇంటనున్న ఒక ముళ్ల మొక్కకు నీరుపోయుచుండిరి. వల్లభులు గురుచరణుడిని చూచి పునర్జన్మనెత్తి నావద్దకు వచ్చితివా అని ఆశీర్వదించి, అతనికి తమయింటనున్న ముళ్లమొక్క చూపించి, విస్సావధానులను ఈతడు మమ్ములను మావారిని దుర్బుద్ధితో విమర్శించిన కారణంగా, అతని సంతతి, అతనికి శ్రాద్ధకర్మలు సరిగాచేయనందువలననూ ఈ జన్మమున ముళ్లమొక్కగా జన్మించినాడని తెలిపెను. ఇంకా, పూర్వజన్మలో నీవే ఈతని పుత్రుడవని, నీవు శ్రద్ధగా ఈతనికి శ్రాద్ధకర్మ చేసినచో, ప్రేతాత్మగా ఉన్న ఈ ముళ్ల మొక్కకు సద్గతి కల్గించెదనని వల్లభులు గురుచరణునితో తెల్పెను. దానికి గురుచరణుడు సమ్మతించి, ఆ ముళ్ల మొక్కను పీకి, దగ్ధము గావించి, అతని పేర శ్రాద్ధకర్మ చేయగా, శ్రీవల్లభులు ముళ్ల మొక్కగానున్న విస్సావధానులకు సద్గతినిచ్చిరి. ఈ విధంగా శ్రీవల్లభులు దుర్మార్గులకు గూడ సద్గతి కల్గించినారు.

## 11. రాహు గ్రహ దోషమునకు పరిహారము చేయుట

ఒకసారి పీఠికాపురంలో నరసింహవర్మయను భక్తుని పొలములో శ్రీపాదులవారు వర్మగారితోబాటు విశ్రాంతి తీసికొనుచుండగా అక్కడకు ఎన్నో త్రాచుపాములు వచ్చినవి. శ్రీపాదులవారు ప్రతీ త్రాచుపామును పట్టుకొని దాని మొండెము నుండి తలను వేరుచేసి ప్రక్కనే ఒక గుట్టగా వేసిరి. అక్కడకు పెద్ద గండు చీమల దండు రాగా వాటిని గూడ చంపివేసిరి. ఇది చూచి వర్మగారు ప్రశ్నించగా, ఈ చీమలకు రాజైన ఒక తెల్ల చీమ రాగలదని, దానికి గల సంజీవిని శక్తితో ఈ చచ్చిన చీమలను బ్రతికించి తీసికొని వెళ్లునని తెలిపెను. వెంటనే అట్లే జరిగెను. వల్లభులు చచ్చిన త్రాచుపాముల మొండెములను ఆ గుట్టలోని వేర్వేరు త్రాచుపాముల తలలకు తగిలించి వాటిని గూడ బ్రతికించెను. అవి వల్లభులకు ప్రదక్షణము చేసి వెళ్లిపోయినవి. వర్మగారితో వల్లభులు సృష్టి యొక్క లీలలు విచిత్రములని, రాహుగ్రహ బలం చాలనపుడు జీవులకు అన్ని పనులలోనూ ఆటంకములు గలుగునని, దీనినే కొంతమంది కాలసర్పయోగమందురని, తెలిపినారు. రాహుగ్రహ దోషము తన భక్తులకంటకుండా ఉండేందుకే ఈ విధముగా చేసినానని వర్మగారికి తెలిపిరి.

## 12. జాతి, కుల భేదములు విస్మరించి అందరికీ దత్తదీక్ష నిచ్చిన వల్లభులు

ఒకసారి పీఠికాపురమునకు దత్తభక్తుడైన ఒక సన్యాసి వచ్చెను. అతడు కుక్కుటేశ్వరాలయమునందు బసయేర్పాటు చేసుకుని, భక్తులందరికీ దత్తదీక్షలిచ్చుచూ, భారీగా సంభావనలు గుంజుతూ, అందులో కొంత భాగము ఆలయఅర్చకులకు

కూడ ఇస్తూ, గ్రామమంతటా అలజడి చేయుచుండెను. సంభావనలు ఇవ్వగలిగేవారు మాత్రమే, దత్తదీక్ష తీసికునేవారు, లేని వారు వూరుకుండేవారు. సంభావనలు ఇవ్వలేనివారు దత్తదీక్ష తీసికొనవలెనని దృఢ సంకల్పమున్ననూ, ధనము లేక బాధతో మిన్నకుండెడివారు. ఇది గాంచిన శ్రీపాదులవారు, ఒక పంటకాపు ఇంటి యందు విడిది ఏర్పాటు చేసుకుని, పేదలకు, దళితులకు, జాతి, కుల, భేదములు లేకుండా అష్టాదశవర్ణముల వారితోబాటు దీక్ష తీసుకొనవలెనని కోరిక ఉన్నవారందరికీ, యధాశాస్త్రీయముగా దత్తదీక్షను ఉచితముగా ఇచ్చిరి. శ్రీపాదులవారు బాహాటముగా తామే దత్తులమని, తమను స్మరించినంతనే ప్రసన్నులమై కోరిన కోర్కెలు తీర్చగలమని ఆ జనులందరికీ అభయమిచ్చెను. ఈ విషయము తెలుసుకొన్న సన్యాసి, తాను సాక్షాత్తు దత్తులవారితోనే వైరమునకు దిగితినని భయపడి ఖంగుతినెను. ఇంతలో కుక్కుటేశ్వరాలయమునకు ఒక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చి, తనకు దత్తదీక్షనిచ్చినచో సంభావనగా తనవద్దనున్న వజ్రములిత్తునని సన్యాసికి తెలిపెను. వజ్రములపై ఆశతో సన్యాసి దీక్షనిచ్చుటకు అంగీకరించెను. సన్యాసి దీక్షనిచ్చుచూ, ఆ వృద్ధ బ్రాహ్మణుని చేతిలో నీరుపోయుచున్నప్పుడు, ఒక తేలు సన్యాసి చేతి నుండి వృద్ధ బ్రాహ్మణుని చేతిలోనికి వచ్చి జారి కిందపడి, అక్కడే కూర్చున్న వేరొక బ్రాహ్మణుని కుట్టెను. ఆ బ్రాహ్మణుడు నురగలు కక్కుచూ, క్రిందపడిపోయెను. కొన్ని ఉపచర్యలు చేసిన పిదప అతడు తేరుకొని, లేచి, పిచ్చిగంతులు వేయుచుండెను. అంతలో పంటకాపులు తమకు దత్తదీక్ష ఇచ్చిన సమయములో, శ్రీవల్లభులు ఇచ్చిన అక్షింతలు, ఆ బ్రాహ్మణునికి ఇచ్చి, అతని శిరముపై జల్లుకొనమని తెలిపిరి. ఆ అక్షింతలు జల్లుకోగానే బ్రాహ్మణుడు స్వస్థుడయ్యెను. వెంటనే సన్యాసి సంభావనగా తీసికొన్న వజ్రములు నల్లబొగ్గులుగా మారిపోయెను. వృద్ధబ్రాహ్మణుడు అదృశ్యమయ్యెను. అక్కడ చేరిన గ్రామప్రజలు తమకు దత్తదీక్ష నిచ్చిన ఆ సన్యాసిని తన్నుచూ, తాము దీక్ష కొరకై ఇది వరకిచ్చిన సంభావనలు గుంజుకొని, అతనిని గ్రామము నుండి తరిమివేసిరి. ఆ ద్రవ్యముతో గ్రామములోనందరికీ భోజనసంతర్పణ చేసిరి. సంతర్పణ అనంతరం గ్రామప్రజలందరూ బిగ్గరగా "దిగంబరా దత్త దిగంబరా ! శ్రీపాద వల్లభ దిగంబరా" అంటూ భజన చేసిరి.

## 13. మత్స్యావతార ప్రక్రియ రహస్యాన్ని వివరించిన వల్లభులు

ఒక పర్యాయము ఒక సన్యాసి పీఠికాపురమునకు వచ్చి కుక్కుటేశ్వరాలయమునందు ధ్యానము చేసుకొనసాగెను. దేవాలయమునకు వచ్చిన వల్లభులు, తన వారితో అతని వద్ద చేపల కంపు కొడుతున్నదని అన్నారు. వెంటనే ఆ సన్యాసి కళ్లు తెరచి, చూడగా తన వద్ద చేపల కంపు కొడుతున్నట్లుగా గ్రహించెను. సన్యాసితో శ్రీవల్లభులు అతని కమండలములో చేపలున్నవని, చూడమని అనిరి. సన్యాసి కళ్లు మూసుకుని యోగదృష్టితో పరికించెను. అతని శరీరములోని రక్త నాళములలోగల కణములన్నియూ, దేహములో గల ద్రవములందు చేపలవలెనున్నట్లు సన్యాసి గ్రహించెను. ఆ భిన్న కణములే తన శరీరమందు అనేక అనుభూతులు కలిగించుచున్నవని తెలుసుకొనెను శరీరమునందలి అనుభూతులనుబట్టి భౌతిక మార్పులు కలుగుననియూ గ్రహించెను. ఇదియే మత్స్యావతార ప్రక్రియ అని, మూలాధారమువద్దనున్న వాసనలు పసిగట్టగలిగే చిన్న చిన్న కణముల గూర్చి గూడ జ్ఞానమున్న వారే, ప్రపంచములోని సర్వవాసనలను నియంత్రించగలరని తెలుసుకొనెను. వెంటనే సన్యాసి వల్లభుల పాదములపైబడి, వారిని అనుగ్రహించవలసినదిగా కోరెను. శ్రీవల్లభులు దయతో అతని శరీరము నందు చేపలకంపుపోయి సువాసనలు వెదజల్లసాగెను. వల్లభులు సన్యాసితో కూర్మావతారమును దృష్టియందుంచుకుని, ఆవిధముగా నీవు అంతర్ముఖుడిగా ధ్యానములోనున్నప్పుడే జీవించి యుండగలవని హెచ్చరించిరి. ఆ రకంగా ఎప్పుడూ ధ్యానస్థుడవై యుండమని యోగాభ్యాసంచేస్తూ, కర్మబంధాలను త్యజించమని ఆ సన్యాసకి వల్లభులు తెలిపారు.

## 14. దశమహావిద్యలు

దశమహావిద్యలతో అమ్మవారిని వివిధ రూపములలో సాధకులు కొలుస్తారు. ఒక్కొక్క రూపానికి ఒక్కొక్క అద్భుతశక్తి ఉంటుంది. వీరిని అర్చించుటకు నిర్ణీతమైన పూజా విధానములు, సాధకప్రక్రియలు ఉంటాయి. దశమహావిద్యలతో సాధకులకు విశేషమైన కార్యసిద్ధి నెరవేర్చే అమ్మవార్లను కాళి, తార, చిన్నమస్త, షోడశీమహేశ్వరి, భువనేశ్వరీదేవి, త్రిపురభైరవి, ధూమ్రావతి, భగళాముఖి, మాతంగి మరియు కమలాలయ పేర్లతో పిలుస్తారు. ఈ దశమహావిద్య స్వరూపిణియే అనఘాదేవి. ఆ స్వరూపమే శ్రీవల్లభులు. శ్రీవల్లభులను అర్చించినచో, దశమహావిద్యలతో వివిధదేవీ

రూపాలను పూజించిన ఫలితము కలుగును. నీలవర్ణము కలిగినది కాళిక. సమస్త విద్యలు ప్రసాదించును. తారాదేవి మోక్షప్రదాయిని. భక్తులను విపత్తుల నుండి రక్షించును. చిన్నమస్తను శత్రు విజయానికై అర్ధరాత్రి ఆరాధిస్తారు. రక్తపానము చేసే ఈమెను చిన్నమస్త అందురు. షోడశీ మహేశ్వరి జ్ఞానమును ప్రసాదించును. మంత్రతంత్రాలకు ఈమే మూల స్వరూపిణి భువనేశ్వరీదేవిని సప్తకోటి మంత్రములు సర్వదా ఆరాధిస్తూ ఉంటాయి. త్రిపురభైరవి నృసింహభగవానుని అభిన్నశక్తి. ధూమ్రావతి అనుగ్రహముతో సంకటములు హరిస్తాయి. భగళాముఖి శత్రు విజయాన్ని ప్రసాదిస్తుంది. మాతంగి గృహస్త జీవితాన్ని కలుగజేస్తుంది. కమలాలయ వస్తు సమృద్ధికి ప్రతీక. ఈమె తిరుమలలో వేంకటేశ్వరస్వామి వారి దేవేరి అయిన పద్మావతి స్వరూపము.

## *15. గొల్ల వనితను గాచిన వల్లభుడు*

దశ మహావిద్యలలో బగళాముఖీ ఆరాధన ఒకటి. ఈమెను వైష్ణవీదేవిగా కూడ కొలిచెదరు. ఈ మాత శత్రు సంహారము, వాక్సుద్ధి మొ॥గా గల కోరికలను తీర్చును. అసలు ప్రప్రథమముగా బ్రహ్మదేవుడు బగళామహావిద్యోపాసన చేసేవాడు. తిరుమలలో బ్రహ్మదేవుడు 'బాలా'రూపము గల ఈమెను గాంచి, అర్చించెను. అందువల్లనే వేంకటేశ్వరస్వామిని 'బాలాజీ'గా పిలుస్తారు. అటు పిమ్మట ఈ మాతనే శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామిగా అర్చించి, శ్రీవారికి బ్రహ్మోత్సవములు జరిపించినాడు. అవియే నేటికి గూడ తిరుమలలో వైభవముగా జరుగుచున్నవి. ఈ బగళాముఖీ ఆరాధనను బ్రహ్మదేవుడు సనకాది మహర్షులకు, విష్ణువుకు, పరశురామునికి గూడ ఉపదేశించెను. బగళాముఖీ ఆరాధకుడైన ఒకానొక బైరాగి అనేక పుణ్యక్షేత్రములను దర్శించుచూ, పీఠికాపురమునకు వచ్చి, కుక్కుటేశ్వర ఆలయమందు వేంచేసియున్న స్వయంభూదత్తుని, విగ్రహము దగ్గర ఒక సువర్ణకాంతులిడుచున్న సజీవుడైన బాలుని చూచి దత్తునిగా తెలుసుకొని వారితో సంభాషించెను. ఆ బైరాగి కోర్కెననుసరించి, బాలుని రూపంలోవున్న శ్రీవల్లభులు అతనికి బగళాముఖిగా దర్శనమిచ్చిరి. ఆ దర్శన అనుభూతిలో పొందిన ఆనందముతో ఆ బైరాగి సమాధిస్థితిలోనికి జారుకొనెను.

సమాధి స్థితిలోనున్న బైరాగి, క్షుద్రమాంత్రికుడని, తమ మహిమవల్లే అతనిని సమాధి స్థితిలో ఉంచితిమని, లేని యెడల గ్రామమునకు అరిష్టములు గల్గునని, ఆ దేవాలయ అర్చకులు ప్రచారము చేసుకుంటూ, దత్తునికి దేవాలయములో పూజలు చేయాలని, సంభావనల రూపములో ప్రజల నుండి ధనమును గుంజెడివారు. పూజారులు భక్తులనుండి, గుంజి, ఇంట్లో దాచుకున్న ధనము, తెల్లవారేసరికి మాయమగుట చూచి వారెంతగానో చింతించుచుండిరి. సమాధిస్థితి నుండి బైరాగి ఎన్ని రోజులయినా బయటకు రానందువల్ల అతనిని దహనము చేయవలెనని భావించి, ఈ విషయము బాపనార్యుల వారికి తెలిపిరి. బాపనార్యులు ఆ బైరాగిని పరీక్షించి, అతడు మరణించలేదని, ఒక రకమైన సమాధి స్థితిలో ఉన్నాడని తెలిపిరి. ఎనిమిది రోజుల పిదప వల్లభులు ఆ బైరాగి వద్దకు పోయి, అతనిని చేతితో తాకగానే అతడు సమాధి స్థితి నుండి బయటపడి, వల్లభులకు నమస్కరించెను. అతనికి లక్ష్మి అను గొల్లవనిత ఇంట బస, భోజనము ఏర్పాటుచేసిరి. విధవరాలైన లక్ష్మికి శ్రీవల్లభులను ఆరాధించినచో సకలభోగములు, శ్రేయస్సు కలుగునని బైరాగి చెప్పెను. ఆనాటి నుండి శ్రీవల్లభులనెంతో భక్తితో లక్ష్మి ఆరాధించెడిది. వేంకటప్పయ్య శ్రేష్ఠిగార్కి ప్రతిరోజూ పాలు అమ్ముచున్న లక్ష్మి, వల్లభుల వారి నిమిత్తము ఉచితముగా మరికొన్ని పాలను అధికముగా వారికి భక్తిపూర్వకంగా సమర్పించెడిది.

పీఠికాపురగ్రామములో పండితుడొక్కడు పురాణము చెప్పుచుండెను. అతనికి యోగ విద్య, ఆత్మల పరిభ్రమణము గూర్చి విశేషమైన పాండిత్యము గలదు. ఒకనాడు ఆ పండితుడు తాను ఒకే ఆత్మతో మూడురూపాలుగా ఈ పీఠికాపురమునందు జన్మించినట్లు గ్రహించెను. తన ఆత్మ చైతన్యము తనలోను, ఆ గ్రామజమీందారుగారి నాలుగునెలల పసిబిడ్డలోను, మరణించిన లక్ష్మి భర్తలోను గూడ గలదని అతడు తెలుసుకొనెను. ఈ జన్మలో గొల్లవనితగా జన్మించి, పాలు అమ్ముకొనుచున్న లక్ష్మి, వచ్చే జన్మలో బ్రాహ్మణస్త్రీగా జన్మించి, పెరిగి పెద్దవాడైన ఆ జమీందారు కుమారుని వివాహమాడునని తన యోగశక్తితో గ్రహించెను. అంటే మరొక రూపంలో తాను లక్ష్మికి భర్తగా ఆమెకు వచ్చే జన్మలో యుందునని అతడు తెలుసుకొనెను. ముఖ్యముగా కర్మ, ఋణానుబంధములు తెగతెంపులు చేసుకొని, ఈ జీవితానికి స్వస్తిపలికి, పరమేశ్వరునిలో ఐక్యమవ్వాలన్న తలంపుతోనే అతడు పీఠికాపురమునకు వచ్చెను. ఈ పరిస్థితులను అవగాహన చేసుకున్న తరువాత గూడ ఈ లంపటములపై మనసుపోక, తన ఆత్మతోబాటు, ఇతర రూపములోనున్న తన ఆత్మకు గూడ

ముగింపుపల్కి, కర్మబంధముల నుండి తెగత్రెంపులు చేసుకొనవలెనని నిర్ణయించుకొనెను. లక్ష్మి భర్త మరణించిన పిదప అతని ఆత్మ తిరిగి దాని మూలాధారమైన పండితుని ఆత్మలో కలిసిపోయినది. ఇక జీవించియున్నది తనతోబాటు ఆ పసిబాలుడేయని తెల్సుకొనెను. పండితుడు తన పురాణప్రవచనములు పూర్తిచేసికొని, బాపనార్యుల వారి ఇంటికి వచ్చి భోజన, సత్కారములుగైకొని, శ్రీపాదులవారిని గాంచి, దత్తునిగా గ్రహించి నమస్కరించి భక్తితో శెలవుకోరెను. తన జీవితానికి ముగింపు పలకాలన్న పండితుని తలంపు గ్రహించిన శ్రీవల్లభులు, పండితునితో నీ ఆత్మను నీవు ముగించినచో, అదే ఆత్మతో వేరొక రూపమునందున్న పసిబాలుడు మరణించుననియూ, తదుపరి బ్రాహ్మణ స్త్రీగా జన్మఎత్తి, ఆ బాలునికి భార్య కావలసిన లక్ష్మి భర్తలేక బ్రహ్మచారిణిగా కాలము గడపవలసిన పరిస్థితి ఏర్పడుననియూ, గతంలో లక్ష్మి భర్త రూపంలో నున్న నీ ఆత్మ, ఆమెతో ఎన్నో కష్టనష్టములతోబాటు, సౌఖ్యములు అనుభవించినది గావున, అదే ఆత్మ లక్ష్మిభర్త మరణానంతరము తిరిగి నీలో చేరిన కారణంగా, ఆమెపై విశ్వాసముంచి, ఆమెకు వచ్చే జన్మలో ఇబ్బందులు లేకుండా చూచే బాధ్యత నీపై గలదని పండితునితో చెప్పిరి. కాబట్టి, అవతార పరిసమాప్తి అన్న ఆలోచనమాని, పసిబాలుని ఆత్మలో ఉన్న నీవు పెరిగి పెద్దవాడవై, వచ్చే జన్మలో బ్రాహ్మణిగా పుట్టే లక్ష్మిని వివాహమాడి ఆదర్శదంపతులుగా జీవించవలసినదిగా పండితుని ఆజ్ఞాపించిరి. మా భక్తులైన మిమ్ములను ఎల్లవేళలా కాపాడుతూ, అండగా ఉండెదమని, ఆశీర్వదించి, ఆ పండితునితో అతని ప్రయత్నము విరమింపజేసిరి. అనతికాలంలోనే లక్ష్మి మరణించి, తిరిగి బ్రాహ్మణ వనితగా జన్మించి, పెరిగి పెద్దవాడైన జమీందారు యొక్క కుమారుని వివాహమాడి సుఖించెను. లక్ష్మి భక్తి శ్రద్ధలతో శ్రీవల్లభులను కొలిచిన కారణంగా, వారు ఆమెకు సుఖమయ జీవితము ప్రసాదించిరి.

## 16. నరసావధానులను పునర్జీవితుని చేసిన శ్రీవల్లభులు

నరసావధానులనెడి వేదశాస్త్ర బ్రాహ్మణ పండితుడు పీఠికాపురమందుండెను. అతడు బగళాముఖీ ఆరాధకుడు. ఏదేని సభయందు, ఎదుటి వ్యక్తి యొక్క పాండిత్యమును తన క్షుద్ర విద్య వలన గ్రహించి, అవతలి వ్యక్తిని నిర్వీర్యుని చేసి, అతనిపై తనదే పైచేయిగా చేసుకుని సాటివారందరి మన్ననలను పొందేవాడు. నరసావధాన్ల వారికి బ్రాహ్మణ పరిషత్తు అధ్యక్షుడైన బాపనార్యుల వారంటే అసలు గిట్టేదిగాదు. బ్రాహ్మణ పరిషత్తు సమావేశాలలో బాపనార్యుల వారిని అవమానించాలని సర్వదా ప్రయత్నించి, విఫలుడయ్యేవారు. శ్రీవల్లభులంటే చాల అసూయ ద్వేషాలతో ఉండేవాడు. గ్రామస్థులు శ్రీవల్లభులు దత్తావతారమని, వారికి మహిమలు గలవని వారితో ప్రస్తావించితే, అది కేవలం వారి భ్రమలని కొట్టిపారేసేవాడు. ఒకసారి పరిషత్తుసమావేశాలలో బాపనార్యులతోబాటు, వల్లభులవారుండుట చూచి, పరిషత్తు సమావేశాలలో బాలురు పాల్గొనరాదని, వల్లభులను సమావేశము నుండి నరసావధానులు పంపివేసెను. అప్పుడు వల్లభులు కోపించి, బగళాముఖీ ఆరాధన వల్ల, అతడు సముపార్జించిన విద్యలన్నీ తమ దైవశక్తి ద్వారా హరించివేసిరి. దానితో సమావేశమునందు ప్రసంగించబోయిన నరసావధాన్ల వారికి మాటలు రాక తడబడి, అవమానము పాలైరి. అప్పటి నుంచి వల్లభులపై మరింత కక్ష పెంచుకొని, వారిని పరాభవించాలని సకల ప్రయత్నములు చేసిననూ, కృతకృత్యుడు కాలేక, తనశక్తి సన్నగిల్లినందుకు ఎంతో చింతించేవాడు. ఈవిధముగా వల్లభులవారు నరసావధాన్లులోని శక్తులన్నిటినీ హరించివేసి, అతనిని ఒక సామాన్యునిలా చేసిరి. దీనివల్ల నరసావధాన్లువారు గ్రామంలో జీవనోపాధికోల్పోయి, గ్రామస్థులచే చులకనగా చూడబడెడివారు. క్రమక్రమంగా నరసావధాన్లవారి జీవనపరిస్థితులు తారుమారై వారికి ఆర్థికయిబ్బందులు కూడ మొదలయ్యెను.

ఒకసారి కుక్కుటేశ్వరాలయములోని స్వయంభూదత్తుని విగ్రహము మాయమయ్యెను. నరసావధాన్లపై ద్వేషంగల ఒక తాంత్రికుడు దానిని మాయం చేసి, దానికి నరసావధాన్లవారే కారకులని ఆ తాంత్రికుడు ఆరోపించెను గ్రామస్థులు నరసావధాన్ల వారి ఇల్లు సోదా చేసి, త్రవ్వకములు జరుపగా వారికి అస్థిపంజరములు, ఎముకలు దొరికెను. దానితో నరసావధాన్లు వారిపై క్షుద్ర విద్యలమాంత్రికునిగా ముద్రపడెను. దానికి తోడు విగ్రహం మాయమగుటలో వీరి హస్తముందున్న అపవాదు వారినెంతో కృంగదీసినది. ఈ అవమానముల వల్ల అతని ఆరోగ్యము క్షీణించి అస్వస్థుడయ్యెను. ఒకసారి వారింటనున్న గొడ్డుగోవు వారియింటి యందు పితృకార్యదినమున, మతిలేనిదై నానా విధ్వంసము సృష్టించినది. దానిని ఎవరూ అదుపు చేయలేకపోయిరి. అది అక్కడకు వచ్చిన వల్లభుల వార్కి మూడు ప్రదక్షణములు చేసి, వారి పాదములపైబడి మరణించెను. అటుపిమ్మట, నరసావధాన్లువారి ఆరోగ్యము క్షీణించి వారు కూడ మరణించిరి. అతనిని

బ్రతికించవలసినదిగా, ఆయన భార్య, కుటుంబ సభ్యులు కంటికిధారగా ఏడ్చుచూ శ్రీవల్లభుల పాదములపైబడి వేడుకొనిరి. కరుణాసముద్రులైన వల్లభులు చితిపై ఉంచి, దహనమునకు సిద్ధము చేయుచున్న నరసావధాన్ల శవము దగ్గరగాపోయి అతడి నుదుటిమధ్యన, తమ బొటనవ్రేలితో తాకి అతనికి ప్రాణముపోసి బ్రతికించిరి.

అటుపై వల్లభులపై కృతజ్ఞతాభావము కల్గి మెలగుతున్ననూ, వారు దత్తుని అంశ అనెడి విషయమున తన సందేహము నివృత్తి చేసికొనవలెనని నరసావధాన్లు అనుకొనెను. అంత ఒకదినమున అతని భార్యతో, అతడు పూజామందిరము లోనుండగా, అందు శ్రీవల్లభులు దర్శనమిచ్చి అతనికి హితబోధచేసి, అతనికి గల వేదశాస్త్రమునందలి సందేహములు తీర్చుచూ, భూత, భవిష్యత్, వర్తమానములు, సృష్టిస్థితి, లయములు, విస్తీర్ణముతో సహా లోకాలోకములన్నింటిని వర్ణించి, ఖగోళశాస్త్రమును క్షుణ్ణంగా వివరించి, సృష్టి ఆది నుండి సమస్తము ఎరింగించి, ద్వీపములు, ద్వీపాధిపతులు, ద్వీపాదిదేవతలెవరో తెలిపి, లోకనివాసులు, లోకాధిపతులు, ఖండముల గూర్చి కూడా కళ్ళకు కట్టినట్లు విశదీకరించినారు.

ఈ విషయములన్నియు ఒక్క భగవంతునికి మాత్రమే అవగతమగునుగాని, మానవమాత్రులెవరికీ సాధ్యంకాదని, వల్లభుల పాదములపైబడి నరసావధాన్లు తన అజ్ఞానాన్ని మన్నించవలసిందిగా కోరి, తనను బ్రోవమని తన ఆతిధ్యము స్వీకరింపమని వల్లభుల వారిని ప్రాధేయపడెను. అంత నరసావధాన్లతో తాతా! దత్తతత్వము నీకు అనుభవములోకి రావలెనన్న కొన్ని లక్షల జన్మములు కావలసియుండును. కోటాను కోట్ల బ్రహ్మాండములంతటా వ్యాపించి యుండి, దానిని అతిక్రమించియున్న ఏకైక తేజోరాశియే దత్తుడని, అతడే నీ ఎదుటవున్న శ్రీపాదవల్లభులని వారికి సాక్షాత్కారించిరి. అతని ఇంటి యందున్న గొడ్డు ఆవు, ముసలి ఎద్దు అతని తల్లిదండ్రులని, గత జన్మలో వారి తల్లిదండ్రులను వారు నిర్లక్ష్యంగా చూచిన కారణంగా, వారు ఈ జన్మలో నీ ఇంటనే పశువులుగా జన్మించిరని, వారిపట్ల ప్రేమాభిమానములు చూపమని, రాబోయే జన్మయందు నిన్ను కటాక్షించి, నీ ఆతిధ్యము స్వీకరించెదను గాని, ఇప్పుడది సాధ్యంగాదని తెలిపి, అతని పూర్వవైభవము, ఆయుష్షు, సంపదలను తిరిగి ప్రసాదించి, అంతర్ధానమైరి. మాయమైన స్వయంభూదత్తుని విగ్రహము ఏలా నదిలో లభ్యమై తిరిగి ప్రతిష్టింపబడినది. తద్వారా నరసావధాన్లపై అపవాదు కూడ తొలగినది. కరుణాసముద్రులైన వల్లభులు నరసావధాన్లలో పరివర్తనము తెచ్చి, అతనిని బ్రోచిరి.

## 17. ఒకే ఆత్మ ఒకే సమయములో వేర్వేరు శరీరములలో ఉండునని తెల్పిన వల్లభులు

దశమహావిద్యలలో మరొకటి మాతంగీదేవి ఆరాధన. ఈమెకు రాజమాతంగి, కర్ణ మాతంగి అను పేర్లు గూడ గలవు. దంపతులకు దాంపత్యసుఖము అందించే దేవతగా ఈమెను కొలుస్తారు. మాతంగీ దేవతను కొలుస్తున్న వేర్వేరు కులములకు చెందిన బంగారయ్య, బంగారమ్మ అనువారలపై శ్రీవల్లభులు అనుగ్రహము ప్రసాదించారు. ఉత్తర జన్మమందు వారి దాంపత్యం పదిలపరిచారు.

ఒకసారి పీఠికాపురమందున్న బ్రాహ్మణ పరిషత్తునందు ఒక వేదాంత సభ జరిగినది. సభలో ఏదో విధముగా వల్లభులను, వారి తాతగారైన బాపనార్యుల వారిని అవమానించి, బ్రాహ్మణ పరిషత్తు అధ్యక్షపదవి నుండి శ్రీబాపనార్యుల వారిని తొలగించుటయేగాక, వీలువెంబడి వారిని కులంనుండి కూడ వెలివేయాలని ఒక వర్గం పన్నాగం పన్నెను. అధ్యక్ష పదవియందు ఆశగల్గిన వేదాంతశర్మ ఈ వర్గాన్ని ప్రోత్సహించుచుండేవారు. మహాసభలో కొందరు పండితులు ఒక విషయముపై చర్చించుచూ, ఆత్మ అన్నది ఒకే సమయమున ఒక వ్యక్తి యొక్క శరీరము నుండి, అతడు మరణించగానే మరియొక శరీరములోనికి ప్రవేశించి అందుండునని వక్కాణించిరి. ఆ సభలో పదునాల్గేండ్ల ప్రాయములో పాల్గొన్న శ్రీవల్లభులు ఒకే ఆత్మ, ఒకే సమయములో వేర్వేరు అనగా మూడు, నాల్గు శరీరములలో కూడ ఉండే అవకాశము గలదని పేర్కొన్నారు. దీనిని ఖండించి, పండితులు నిరూపించవలసిందిగా వల్లభులపై సవాలు విసిరారు.

దీనికి వల్లభులు పతివ్రతలైన ద్రౌపదీదేవి, మండోదరిల చరిత్రలను ఉదహరించారు. మానవుల ధర్మాలువేరని, దేవతా ధర్మములువేరని, జంతు ధర్మములువేరని, వీటికి ఒకదానితో మరొకదానికి పొంతన కుదరదని తెలిపారు. దేవేంద్రుడు శాపవశమున పంచపాండవులుగా జన్మించినప్పుడు, ఆయన భార్య శచీదేవి ద్రౌపదిగా జన్మించినది. పాండవులు అయిదుగురుగావున, ఆమె తన ఒకే ఆత్మను అయిదు రూపాలుగా విభజించుకున్నది. ఒకే కాలములో వేర్వేరు భర్తల సమక్షములో వివిధ రూపాలతో ఉంటూ, ఒకే ఆత్మతో వ్యవహరించెడిది.

అదేవిధంగా, మండోదరి గూడ ఒకే ఆత్మతో ముగ్గురు భర్తలకు ఏకకాలంలో భార్యగా ఉండేదని, వారే వాలి, రావణుడు మరియు విభీషణుడు. వాలికి తమోగుణముతోను, రావణునికి రజోగుణముతోను, విభీషణునికి సత్త్వ గుణ ప్రధానముగా భార్యగా వ్యవహరించెడిది. పశు, పక్ష్యాదులు, వృక్షములు, క్రిమికీటకములు కర్మధ్వంసమైన పిదప మానవ జన్మఎత్తినపుడు, గత జన్మ స్వభావములు మరువక, వాటికి అనుగుణంగా వ్యవహరించి నూతన బాంధవ్యములు ఏర్పాటు చేసికొన్నప్పుడు, వాడుకలో లేని వేర్వేరు జాతులేర్పడునని తెలిపిరి. కావున మానవులు ధర్మబద్ధమైన జీవితము గడుపుతూ, కులగోత్రాలను, వర్ణాశ్రమ ధర్మాలను గౌరవించి, విధిగా పాటించి, అనర్థముల బారినపడ రాదని శ్రీవల్లభులు హితవుపలికిరి. దీనినిబట్టి బహు భర్తృత్వము గూడ వల్లభుల మాటలను బట్టి అంగీకార యోగ్యము కాగలదని ఆ బ్రాహ్మణ పరిషత్తు నందున్న వేదాంతశర్మ అనునాతడు వల్లభుల భాష్యానికి వ్యంగ్యభాషణము చేయగా, వల్లభులు కోపించి సభికులకు వేదాంత శర్మ అసలు జీవనరహస్యాన్ని తెలిపారు.

ఆ సభలో దేవతాధర్మాలను హేళన చేస్తూ, వితండవాదన చేయుచున్న వేదాంతశర్మ అనునాతడు పీఠికాపురమునకు చెందిన బ్రాహ్మణుడు. ఆతడు ఒకేసమయమున ఒకే ఆత్మతో రెండు రూపములుగా జన్మించెను. మొదటి రూపములో ఆతడు వేదాంతశర్మ అను బ్రాహ్మణుడు. రెండవ రూపములో బంగారయ్య అను చర్మకారుడు. బ్రాహ్మణ రూపములోనున్న వేదాంతశర్మకు వివాహమాడిన పిదప ముగ్గురు భార్యలు మరణించిరి. తిరిగి వివాహము చేసుకొనక, పీఠికాపురములో బ్రాహ్మణ పరిషత్తునందు సభ్యుడిగా ఉండెను. పీఠికాపురములో అప్పుడప్పుడు బ్రాహ్మణరూపములోనున్న వేదాంతశర్మతో తాతా! నీకు మరియొక మామ్మను చూపింతును లే అంటూ, ఆమెతో నీవు సహజీవనం మాత్రమే చేయాలి గాని, వివాహము చేసికొనగూడదు. శారీరక సంబంధము కూడ ఆమెతో నీకు పనికిరాదని నవ్వుతూ వల్లభులు హాస్యచలోక్తులు విసిరేవారు. దీని అంతరార్థము వేదాంశర్మకు గోచరించేదికాదు.

వేరొకచోట చర్మకారరూపములోనున్న బంగారయ్య అనునాతడు, బంగారమ్మ అనుచర్మకార స్త్రీని వివాహమాడి, ఆమెతో కాపురము చేస్తూ, శ్రీపాదశ్రీవల్లభులను ఆ దంపతులు అత్యంత భక్తితో కొలిచేవారు. వారి భక్తికి మెచ్చి, వల్లభులు వారికి ప్రత్యక్షము కాగా, వారిని చూచి ఆనందపారవశ్యములో బంగారమ్మ, శ్రీవల్లభులతో వారి కరుణకు కృతజ్ఞతగా వారి అభీష్టమునకు అనుగుణముగా, తన చర్మముతో చెప్పులు కుట్టించి ఇత్తునని ఆనాలోచితముగా తెలిపెను. కొద్దికాలమునకు వారియింటిలోనున్న గోవు ఆకస్మికముగా మరణించగా, ఆచర్మముతో ఆదంపతులు చెప్పులు కుట్టి, వల్లభుల వారికి సమర్పించిరి.

వేదాంతశర్మ యొక్క రెండురూపముల ఆవిర్భావములో సప్తఋషులకు గూడ అర్థముగాని సృష్టిరహస్యమున్నదని వల్లభులు సభికులకు తెలిపి, ఆ సృష్టి రహస్యమును విడమరచి తెలియజేసిరి. కొన్ని దివ్యాత్మలు పురుష రూపమున జన్మించినప్పటికీ ఆయా ఆత్మలలో పురుషరూపమున ఆ ఆత్మ, స్త్రీ రూపమున ఆ ఆత్మయొక్కశక్తి యుండును. అవి పరబ్రహ్మ, పరాశక్తిల యొక్క సాయుజ్యస్థితి స్వరూపములు. వేదాంతశర్మలోని దివ్యాత్మ యొక్క స్త్రీ శక్తి అతని ముగ్గురు భార్యలగాను, ఆకస్మికముగా మరణించిన గోవుగాను, బంగారమ్మగాను ఏకకాలములో మూడురకాలుగా జన్మించినది చైతన్యము ఎక్కడ నుంచి వచ్చిననూ మూల చైతన్యములోనికి పోయి కలసి తీరవలయును. కావున మరణించిన ముగ్గురు భార్యలలోను మరియు మరణించిన గోవులో గల చైతన్యములు బ్రతికియున్న బంగారమ్మలో గల మూల చైతన్యములో కలిసిపోయినవి. అందువల్లే మరణించిన గోవు చర్మముతో తయారు చేసి, శ్రీపాదులకు సమర్పించిన తోలుచెప్పులు, గోవులోని చైతన్యము బంగారమ్మదేగావున, ఆచర్మము బంగారమ్మకే చెందినదిగానే భావించి వల్లభులు ఆమె మాటను నిజంచేయుటకు ఆ చెప్పులు స్వీకరించారు. దీనినిబట్టి వేదాంతశర్మకు రెండు రూపములు గలవని తెలియవచ్చెను. ఈ విషయములు తెలుపగానే వేదాంతశర్మ నిర్ఘాంతపోయెను. వల్లభులు తనతో హాస్యముగా గతములో పలికిన మాటలు గుర్తుకువచ్చెను. నిశ్చేష్ఠుడయ్యెను.

తమవారిపై నిందారోపణలు చేయచూచిన సభికులనుచూచి, ఆగ్రహముతో శ్రీవల్లభులు మీ పన్నాగములు నాకు తెలియనివిగావు అంటూ వేదాంతశర్మ వైపు తిరిగి చర్మకారస్త్రీతో ఉన్న నీ రెండవ రూపము నీయందు కలిపి వేయుచున్నానని, బిగ్గరగా అరచిరి. వెనువెంటనే చర్మకారుడైన బంగారయ్య యొక్క రెండవరూపము జ్యోతివలె ప్రకాశించుచూ వచ్చి సభలోనున్న వేదాంతశర్మలోనికి ప్రవేశించినది. దీనివల్ల బంగారయ్య అను రెండవ రూపము పోయి, వేదాంతశర్మ అను ఒకే రూపము మిగిలినది. అప్పుడు వల్లభులు, సభికులను ఉద్దేశించి ఇప్పుడు ఈతడు బ్రాహ్మణుడా లేక

చర్మకారుడా అన్నది నిర్ణయించవలసినదిగా కోరెను. సభికులు నివ్వెరపోయిరి. ఎటూ చెప్పలేకపోయిరి. తమను అవమానించాలని తలపోసిన వేదాంతశర్మతో ఇప్పుడు నీవు బ్రాహ్మణుడవు కావు. అందువల్ల నిన్ను కులబహిష్కృతుని చేయుచున్నానని, ఇక నిన్ను జనులు బంగారయ్యగా వ్యవహరింతురని తెలిపి, సభికులపై ఆగ్రహించి, సభ నుండి నిష్క్రమించిరి. అటుపిమ్మట వేదాంత శర్మ చేసేది ఏమియూలేక బంగారమ్మను చేరి, ఆ గ్రామమును విడచి వేరొక గ్రామమునకుపోయి బంగారయ్య అను నామధేయముతో వ్యవహరించుచుండెను. గతంలో వల్లభులు చెప్పినట్లుగా ఆమెతో కేవలం సహజీవనము మాత్రమే చేసేవాడు. మాతంగి దేవితోబాటు వల్లభులను, తాము నిర్మించుకున్న ఆశ్రమమునందు ఆరాధన చేసేవారు. ఒకసారి వారి ఆశ్రమమునకు వల్లభులు వారు వచ్చి ఆశీర్వదించి, వచ్చే జన్మలో తిరిగి బంగారయ్య బ్రాహ్మణునిగా జన్మించెదడని, శూద్రస్త్రీగా జన్మించి కూడ బంగారమ్మ అతనికి ధర్మపత్ని కాగలదని, ఇంకా బంగారయ్య, బంగారమ్మల వివాహము బంగారు తాళితో తామే ఉత్తర జన్మలో జరిపించెదమని వారికి సంతానము కూడా కల్గునని దీవించిరి. వారు తమ భక్తులై తరించెదరని తెల్పిరి. రాబోయే శతాబ్దములలో మాతంగీ విగ్రహము వల్లభ సంస్థానములో గల ఔదుంబర వృక్షము క్రిందభూమిలో ప్రతిష్ఠ కాగలదని ఆశీర్వదించి, వారిచ్చిన పాలను స్వీకరించి అంతర్ధానమయ్యిరి. మాతంగి ఆరాధన వారిని ఉత్తరజన్మలో దంపతులుగా చేసి, దాంపత్యసుఖము ప్రసాదించినది.

## *18. భవిష్యత్తులో జరుగబోయే వివాహము ముందే నిర్ణయించిన శ్రీవల్లభులు*

ఒకసారి వైశ్య ప్రముఖుడైన ధనగుప్తుడను వ్యాపారి, పీఠికాపురము వెళ్లి శ్రీవల్లభులను దర్శించిరి. ఆతనితో వల్లభులు భవిష్యత్తులో ఒక బీద బ్రాహ్మణుడు నీకు అప్రయత్నముగా మంత్రాక్షతలిచ్చునని అతనితోనున్న మరొక వైశ్య ప్రముఖుని కుమారునితో, నీ కుమార్తె వివాహము జరుగునని, ఆ మంత్రాక్షతలు ఇచ్చిన బ్రాహ్మణునికి పదకొండు వరహాలు దక్షిణగా ఇవ్వవలసిందిగా తెలిపిరి. తదుపరి చాలాకాలము పిదప పీఠికాపురమునకు పోవుచున్న శంకరభట్టు, ధర్మగుప్తులు మార్గమధ్యమున ఒక పెళ్లివారి బండినిచూచి, అలసిన కారణంగా వారి బండిని ఎక్కిరి. ఆ బండిలో కొండవీడుకు ప్రయాణము చేయుచున్న పెళ్లి కుమారుని తండ్రియైన ధనగుప్తుడను వైశ్య ప్రముఖునికి శంకరభట్టు తన దగ్గరవున్న శ్రీవల్లభుల వారి మంత్రాక్షతలు ఇచ్చి, వివాహములో దంపతులపై జల్లమని తెలిపెను. గతంలో పీఠికాపురములో తనతో వల్లభులు పలికిన మాటలు గుర్తు తెచ్చుకున్న ధనగుప్తుడు వెంటనే శంకరభట్టుకు పదకొండు వరహాలిచ్చి నమస్కరించెను. తనతో ప్రయాణించుచున్న ధర్మగుప్తుడను మరొక వైశ్య ప్రముఖుని పరిచయం చేసి, అతని కుమారునికి, మీ కుమార్తెతో వివాహము జరిపించమని శంకరభట్టు ధనగుప్తునికి తెలిపెను. ఇది అంతయు వల్లభుల వారి ఆశీర్వాదముగా తలచి, తన కుమారుని వివాహము పూర్తియయిన పిదప, శంకరభట్టు యొక్క సలహా ప్రకారము, శ్రీవల్లభుల ఆజ్ఞ మేరకు తన కుమార్తెను, ధర్మగుప్తుల వారి కుమారునికిచ్చి, వైభవముగా నిశ్చయ తాంబూలములు వేడుక ధనగుప్తులవారు జరిపించినారు. శ్రీవల్లభుల కరుణాకటాక్షముల వల్ల వారి భక్తులందరూ ఈ విధముగా లాభపడిరి.

## *19. తారాదేవి ఉపాసకుని కర్మశేషము తొలగించిన శ్రీవల్లభులు*

దశమహావిద్యలలో తారాదేవి ఉపాసన మరొకటి. సర్వదామోక్షమును ప్రసాదించునది, తరింపజేయునది అగుటవల్ల ఈమెను తారాదేవి పేరుతో కొలిచెదరు. భయంకరమైన ఆపదల నుండి భక్తులను రక్షించుటయేగాక వాక్శక్తిని గూడ ప్రసాదించునది గావున ఈ తల్లిని నీలసరస్వతిగా కూడ పూజించెదరు. ఈ దేవీవుపాసన వల్ల సామాన్యులు గూడ బృహస్పతియంతటి వారెయ్యదరని ప్రతీతి. ఈ దేవీ ఉపాసన గల సిద్ధుని యొక్క కర్మశేషము తొలగించి శ్రీవల్లభులు సంస్కరించారు.

ఉగ్ర తారాదేవిని ఉపాసించు సిద్ధుడొకడు మిధిల దేశమందున్న మహిషి అను గ్రామమున ఉగ్రతారాదేవి సిద్ధ పీఠమును సందర్శించెను. అచ్చట అందమైన ఒక బాలికా రూపమును దర్శించెను. చూచుచుండగానే ఆ బాలిక బాలుని రూపముదాల్చి, తన కాలి అందెలను సిద్ధునకిచ్చి అంతర్ధానమయ్యెను. అటుపిమ్మట, ఆ సిద్ధుడు దక్షిణదేశమున గల పుణ్యక్షేత్రములు సందర్శించుచూ, పీఠికాపురమునందు గల పాదగయాక్షేత్రమందు స్వయంభూదత్తుని దర్శించెను. అప్రయత్నముగా పీఠికాపురమందలి శ్రీవల్లభభక్తులైన నరసింహవర్మగారింటి సమీపమునకు రాగానే, ఆ సిద్ధునికి ఒక

బాలుని దర్శనమయ్యెను. ఆ బాలుడు అతడు సిద్ధపీఠము వద్ద దర్శించిన బాలుని వలె ఉండెను. ఆ బాలుడు ఒక గుర్రపు బండి యందు తనతో బాటుగా వర్మగారి నౌకరును కూడ కూర్చుండబెట్టుకొని, సిద్ధుని పిలచి, గుర్రమునకు బదులుగా అతనిని బండి లాగుతూ వారింటికి తీసికొని వెళ్లమని అదిలించుచుండెను. ముందు ప్రతిఘటించిననూ, చేసేదిలేక బండిని లాగుటకు అంగీకరించి, వారు కూర్చున్న బండిని సిద్ధుడు లాగుచుండెను. బాలుడుగా ఉన్న శ్రీవల్లభులు సిద్ధుని కర్రతో కొట్టుచూ, బండిని సరిగాలాగనప్పుడు అదిలించుచుండెడివారు. కష్టతరములైన ఆ దెబ్బలు తట్టుకొనుచూ, అలవిగాని భారముగా మారిన బండిని లాగుచూ, సిద్ధుడు వల్లభుల ఇంటికి చేరెను. దెబ్బల వల్ల సిద్ధుని శరీరమెంతో బాధించుచుండెను.

ఇది చూచిన బాపనార్యులవారు వల్లభులతో సిద్ధుని బాధించుటకు గల కారణము తెలుపమని అడుగగా, వల్లభులు సిద్ధుడు అతని తల్లిదండ్రులనెంతో బాధించినాడని, తల్లిదండ్రులకు కనీస బాధ్యతగా పిండప్రదానము కూడ చేయలేదనియు, గురుముఖంగా సన్యాసిదీక్షను స్వీకరించలేదని తెలిపెను. అమ్మవారిని ఆరాధించేవారు ఇటువంటి తప్పుడు పనులు చేసినచో, వారికి సిద్ధి కలుగదని, కావున అట్టి వారిని సంస్కరింప అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అకృత్యముల వల్ల సిద్ధుడు శిక్షార్హుడని, ఈతడు పాదగయా క్షేత్రమును దర్శించిన కారణమున ఈతని కర్మశేషము ఈవిధముగా తొలగించినానని తెలిపిరి. ఈతడు బండిలో మోసుకొని వచ్చిన నౌకరు, అతని భార్య ఇతనికి పూర్వ జన్మములో తల్లిదండ్రులని తెలిపి, వారిపేర ఈతడు పాదగయా క్షేత్రమందు 9 రోజులు మాతాపితరులకు సేవ చేసినచో, ఆతడు తన పాపముల నుండి బయటపడగలడని, కాశీతో సమానమైన పుణ్యక్షేత్రము పాదగయా క్షేత్రమని తెలిపిరి. తల్లిదండ్రులను ఇబ్బందులకు తెలిసిగాని తెలియకగాని గురిచేసిన వారెవరయినా, అట్టి దోషములు పరిహరించుకొనుటకై కాశీలో 9 రోజులు ఉండాలని, అలా వీలుకాని పక్షంలో పాదగయా క్షేత్రమందు 9 రోజులు ఉండి, అదే ఫలితాన్ని పొందవచ్చునని, కాశీతో సమానమైనది పాదగయాక్షేత్రమని శ్రీ వల్లభులు వివరించారు. ఆ విధంగా సిద్ధుని కర్మశేషమును తొలగించి అతనికి ఉగ్ర తారాదేవి సిద్ధిని సంపూర్ణముగా కలుగునట్లు శ్రీవల్లభులు చేసెను.

ఈ విధముగా శ్రీవల్లభులు తమ బాల్యములో ఎన్నోలీలలు చేసిరి. తమను సేవించిన వారిపై వరాల జల్లు కురిపించి, వారి పట్ల ఎంతో ప్రేమ, అనురాగము చూపించారు. అందుకే వల్లభుల నీడలో పీఠికాపురగ్రామమెంతో ఆనందముగా, వారి రక్షణలో నిర్భయముగా యుండెడిది.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-8

# శ్రీపాద శ్రీవల్లభుల దేశాటన

శ్రీపాద శ్రీవల్లభులు తల్లిదండ్రుల అనుమతి పొంది, బాధాతప్త హృదయాలతో వారిచ్చిన వీడ్కోలును స్వీకరించి, దేశాటనకు బయలుదేరారు. ముందుగా సన్యాసిత్వం స్వీకరించారు. సన్యాసాశ్రమ ధర్మాలను పాటించుట ప్రారంభించారు. సన్యాసికి జపము, భిక్షాటనము, ధ్యానము, శౌచము మరియు అర్చన అతని నిత్య ధర్మాలు. అతడు స్త్రీలను తాకరాదు. స్త్రీల కథలను వినరాదు. వాహనము లెక్కరాదు. మంచముపై నిద్రించరాదు. పగటినిద్ర నిషేధము. నిరంతరము ఆత్మద్రష్టయై ఉండాలి. వెదురు, సొరకాయ, చెక్క, మట్టి వీటితో చేసిన పాత్రలు మాత్రమే ఉపయోగిస్తూ దండధారియై, పగలు మాత్రమే ఒక్కసారి భిక్షచేసి భుజించాలి. సంవత్సరమంతా తీర్థాటనం చేస్తూ, మూడు పగళ్లు మించి యే గ్రామంలోనూ నివసింపక, స్థిరచిత్తుడై ఉండాలి. అలా శరీరంలో శక్తి లేకపోతే, సదా దైవాన్ని ధ్యానిస్తూ, ఒక మహాక్షేత్రంలో నివసించాలి. సన్యాసాశ్రమంలో భాగంగా శ్రీవల్లభులు దేశాటనకు బయలుదేరారు. శ్రీపాదస్వామి 13వ శతాబ్దమునకు చెందినవారు. ఆ రోజుల్లో దేశాటన అంతా కాలినడకనే సాగేది. కొంతమంది మహా యోగులు, దైవీ శక్తి గల వారు మోగ మార్గములో అనగా ఒక చోట అదృశ్యమై వేరొక చోట ప్రత్యక్షమై అచట నుండి వేరేచోటుకు అదే రీతిలో పయనిస్తూ దేశాటన చేసేవారు. ఆ కాలంలో సన్యాస ధర్మాలు ఎంతో తీవ్రమైన సనాతన విధానాలను కల్గియుండెడివి. ఆనాటి సనాతన విధానాలలో కొంత వెసలుబాటును ఈ రోజుల్లో సన్యాసాశ్రమము స్వీకరించినవారు కాలానుగుణ్యంగా మార్పు చేసి అవలంబిస్తున్నారు.

ఈ భూమిపై కొన్ని ప్రదేశాలు, భగవంతుని పాదస్పర్శ వల్ల పునీతమై, నదీమతల్లులతో విరాజిల్లుతూ, ప్రత్యేకమయిన ఆధ్యాత్మిక శక్తిని సంతరించుకుని పుణ్యక్షేత్రాలుగా ఉద్భవిస్తాయి. అదేవిధంగా ఈ భూమిపై నున్న మానవాళి అంతా ఆయా పుణ్యక్షేత్రాలను దర్శించి, అందున్న నదీజలములలో స్నానమాడి పవిత్రులౌతారు. అసంఖ్యాకులైన మానవులను ఆధ్యాత్మికంగా పరిశుద్ధులనుచేసి, వారికి పవిత్రతను చేకూర్చి, వారిని పరిశుద్ధంచేసే క్రమంలో పుణ్యక్షేత్రాలు గూడ కాలగతిలో మలినమవుతాయి. ఆ క్షేత్రాల మహత్తు, శక్తి, కూడ తిరోగమనమవుతూ ఉంటుంది. అప్పుడు సిద్ధపురుషులు, ఆయా క్షేత్రాలను దర్శించి, అక్కడ నిత్య స్నానము, తపమాచరించి, ఆయా పుణ్యక్షేత్రాల శక్తిని పునరుజ్జీవనం చేసి, ఆయా క్షేత్రాలకు పూర్వ వైభవం తెస్తారు.

ఈ క్రమంలో శ్రీపాద శ్రీవల్లభులు చిన్నచిన్న మజిలీలు చేస్తూ, తొలుత కాశీ క్షేత్రానికి చేరుకున్నారు. గంగానదీ తీరానికి వెళ్లి గంగామాతను ప్రార్థన చేశారు. గంగలోనికి స్నానానికి దిగుచుండగా, గంగామాత వారి ఎదుట సాక్షాత్కరించి, చేతులు జోడించి వారికి నమస్కరించి ఓ తండ్రీ! తమను దర్శించుటకొరకై ఎదురుచూచుచుంటిని. ఎందరో పాపాత్ములు నా జలములో మునిగి వారివారి పాపాలను ప్రక్షాళన చేసుకుందురు. వారు పునీతులు కాగానే వారి పాపములు నాయందు నిక్షిప్తమై నేను అపవిత్రురాలనై పోతున్నానని తెలిపింది. ఈనాడు మీరు నా గంగానదీ జలములో స్నానమాచరించుట వలన తిరిగి పూర్వపు పవిత్రతను సంతరించుకున్నానని, కావున ప్రతినిత్యము గంగలో స్నానం చేసి తన పవిత్రతను నిత్యనూతనముగా చేయవలసిందని కోరుతూ కృతజ్ఞతాపూర్వక నమస్కారములు చేసినది. గంగామాతను శ్రీవల్లభులు ఆశీర్వదించి నిత్యము గంగలో స్నానమాచరిస్తానని మాట ఇచ్చి, తమ స్నాన అనుష్ఠానములు పూర్తిచేసుకున్నారు. ఆ తరువాత వారు ఒక సామాన్య సాధకునివలే కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించి, ఆ పుణ్యక్షేత్రమందు మూడురోజులున్నారు. ఆ మూడు రోజులు వారు కాశీ అన్నపూర్ణమాతనుండి ప్రత్యక్షముగా భిక్ష గైకొనిడినారు. అన్నపూర్ణాదేవి మహదానందముతో ఆ మహానుభావునకు భిక్షనిచ్చెడిది. కాశీక్షేత్రంలో శ్రీవల్లభులు సత్సంగం చేసెడివారు. అచ్చట నివసించే యోగులు, తాపసులు స్వామిని దర్శించి, స్తుతించి వారి జ్ఞానబోధనలెన్నో శ్రవణం చేసారు. సాధకులకు యోగసాధనలోని

రహస్యములు తెలియజేసి, వారి అవరోధములు తొలగించి అనుగ్రహించారు. కాశీ క్షేత్రంలో నివసించే యోగులలో శ్రీ సచ్చిదానంద సరస్వతి అను యోగీశ్వరుడు, శ్రీపాదులు కాశీలో ఉన్న రోజులలో వారిని సేవించి తరించాడు.

శ్రీపాదులవారు జలతత్త్వమును శుద్ధి చేయుటకు గంగామాత కోరిక ప్రకారము ప్రతినిత్యము తమ యోగమార్గము ద్వారా కాశీకి వచ్చి, గంగానదిలో స్నానం చేసి జల యజ్ఞము చేసెడివారు. ఈనాటికి గూడ వారు ఈ కార్యమును నిరంతరం అదృశ్య రూపంలో కొనసాగిస్తూ, గంగామాత పవిత్రతను సుస్థిరం చేయుచున్నారు.

కాశీ నుండి మరొక పుణ్యక్షేత్రమునకు పోవుటకు సమయమాసన్నమైనదని, అక్కడి యోగిపుంగవులకు తెలుపగా, వారు శ్రీవల్లభులను కాశీలోనే ఉండవలసిందిగా కోరిరి. దానికి వల్లభులు అంగీకరింపక, కాశీలో ఎన్నో సిద్ధ సంఘాలున్నాయని, తాము రాబోయే జన్మలో నృసింహసరస్వతిగా అవతరించి, కాశీలో సన్యాస దీక్ష తీసుకుంటామని, ఆ క్రమంలో తిరిగి కాశీని దర్శించగలనని, కాశీ అనునామము త్రిమూర్త్యాత్మకమని మరియు త్రిగుణాత్మకమని కాబట్టి కాశీ నామ జపం కూడ మోక్షదాయకమేనని తెలిపి వారందరివద్ద వీడ్కోలు తీసుకుని, తమ దేశాటన కొనసాగించారు.

కాశీ క్షేత్రము నుండి శ్రీవల్లభులు హరిద్వార్ మరియు హృషీకేశ్ పుణ్యక్షేత్రములను దర్శించారు. సాధారణ యోగివలే గంగా స్నానమాచరించి, భిక్ష స్వీకరించారు. ఆ పుణ్యక్షేత్రములలో అదృశ్య రూపములో నున్న యోగులు, మహాత్ములు శ్రీవల్లభుల స్వామికి చేతులు జోడించి, నమస్కరించి వారి ఆశీర్వాదములు పొందారు. వారందరికీ శ్రీ వల్లభులు సత్సంగములు నిర్వహించి, బోధనలు చేశారు.

అచ్చటనుండి శ్రీవల్లభులు బదరీపుణ్యక్షేత్రానికి తమ యోగశక్తి ద్వారా చేరుకున్నారు. బదరీక్షేత్రము భరతఖండపు సర్వశ్రేష్ఠమైన పుణ్యక్షేత్రము. అచట నరనారాయణులు కొలువైయున్నారు. 'అలకానంద' యను పేరుతో ఒక పవిత్ర నదీమతల్లి ఆ ప్రాంతమును పవిత్రము చేయుచున్నది. ఇచ్చట శ్రీమన్నారాయణునికి చతుర్భుజములు కలిగి, ఊర్ధ్వహస్తములనందు శంఖు, చక్రములుండును. అధోహస్తములు రెండు తొడలపై చిన్ముద్రతో ఉండును. ఆయన పద్మాసనమందు ధ్యాననిష్ఠలో ఉండును. ఆయన చుట్టూ నారదుడు, ఉద్ధవుడు, కుబేరుడు, లక్ష్మి, గణపతి దర్శనమిచ్చెదరు. శ్రీవల్లభులు బదరీ క్షేత్రములో యోగ, అనుష్ఠానములు పూర్తిచేసుకుని బదరీనారాయణుని దర్శించుకొనిరి. అచ్చట కూడ యోగులు, తాపసులు, సాధువులు శ్రీవల్లభులను దర్శించి తరించిరి. అక్కడ శ్రీవల్లభులు సత్సంగము జరిపి, పురుషార్థములు, మానవ ధర్మములు, ఆశ్రమవిధులపై ఎంతో కదురమ్యంగా ప్రసంగించి, సాధకులను ఉత్తేజపరిచారు. అచ్చట సదానంద బ్రహ్మచారి అనునాతని ఆధ్వర్యములో స్వామి వారి పాదాలకు విశేష పూజ జరిగినది. ఆ తరువాత వారందరికీ మంగళ శాసనములు పలికి, స్వామి యోగమాయతో అంతర్ధానమైరి.

బదరీనాథ్ నుండి శ్రీవల్లభులు కేదారనాథ్ అను మరో మహిమాన్విత, హిమాలయ పర్వత ప్రాంతమందు గల పుణ్యక్షేత్రమునకు చేరుకున్నారు. అక్కడ కేదారేశ్వరుని దర్శించారు. వారి ముఖవర్చస్సు, వేషధారణ చూచి యోగిపుంగవులు, అఘోరీలు, సాధువులు చుట్టుముట్టి నమస్కరించారు. వారికి ఆశీర్వాదములు పలికి, అక్కడ కూడ సత్సంగము నిర్వహించారు. కేదారనాథ్ నుండి శ్రీపాద వల్లభులు ద్రోణగిరి అని పిలువబడు సంజీవిని పర్వతమువద్దకు వెళ్ళిరి. కొంతకాలము అక్కడనున్న ఋషి సంఘములతో ఆనందముగా గడిపిరి. అక్కడినుండి కల్కి ప్రభువు జన్మించు శంబల గ్రామమునకు పోయిరి. ఆ ప్రదేశము మహాయోగులకు కూడ దర్శించవీలుకాని ప్రదేశము. హిమాలయములందు వేలకొలది సంవత్సరముల తరబడి తపస్సుచేయు మహాపురుషులు అచ్చట ఉందురు. శంబల గ్రామమందు శ్రీవల్లభులవారు స్ఫటికపర్వతము నందలి శుద్ధ జలమును త్రాగిరి. ఆ జలము త్రాగిన వారికి వయస్సు నిలచిపోవును. అందుచేత అప్పటినుండి వారి శరీరములో ఎట్టి మార్పునూలేక 16 సంవత్సరముల బాలునివలే చక్కని ముఖవర్చస్సు గలిగి ఉండిరి. అచ్చటనుండి వారు మానససరోవరమునకు పయనమైరి.

మానససరోవరము చేరుకోగానే, శ్రీవల్లభులను మానసాదేవి సాదరముగా ఆహ్వానించినది. ప్రమధగణములైన నందీశ్వరుడు, బృంగీశ్వరుడు మొదలైనవారు శ్రీ వల్లభులవారికి జయజయధ్వానములు చేయుచూ కైలాస పర్వత సభా ప్రాంగణములోనికి స్వాగతము పలికిరి. వారి రాకతో కైలాస పర్వతమున సద్గోష్ఠి నిర్వహించిరి. కైలాసవాసాధీశుడైన

శంఖరుడు మహా సింహాసనముపై కూర్చుండగా, త్రిలోకమాత వారి ప్రక్కనే ఆశీనురాలై యున్నది. ఆ ఆదిదంపతులు శ్రీవల్లభులను చూచి దత్తునికి స్వాగతం అంటూ ఉచితాసనమిచ్చారు. ఇంకా, ఆ దివ్య సభయందు గణేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడు తమ స్థానములలో ప్రకాశించుచుండగా, సనకాదిఋషులు, సప్త ఋషిమండలి, సకల ప్రజాపతులు, దేవేంద్రాది అష్టదిక్పాలకులు, నాగులు, యక్ష, కిన్నెర, కింపురుషులు, నారద, తుంబురులు ఇలా సమస్త దేవగణములు తమ తమ స్థానములలో ఆసీనులైనారు. అంత ఆ సభలోని వారందరూ ఒకరి తరువాత మరియొకరు వల్లభుల ఖ్యాతిని, దత్తాత్రేయులుగా వారి జ్ఞానస్వరూపాన్ని, వారి ఆశ్రితజనరక్షణ విధానాన్ని ఎంతగానో కొనియాడారు. కలికాలములో మానవులు చేయు పాపకర్మలపై ఆవేదన వ్యక్తం చేశారు. అంత వల్లభులు వారితో జీవులు సుఖశాంతులతో ఉండాలన్నదే దైవీభావనని, ఈ భావనను భూలోకవాసులకు అందించుటతోబాటు, మానవులయందు గల చెడుబుద్ధిని జ్ఞానోపదేశము ద్వారా పరివర్తన గావించి, వారిలో నిద్రాణమైయున్న మంచి బుద్ధిని మేల్కొలిపి, వారిని సన్మార్గములో బోధగురువు రూపంలో నడిపించుటే ఈ వల్లభావతార లక్ష్యమని తెలిపారు. ఇప్పుడు భూలోకములో నామస్మరణతో పాపాలను హరియించే విధానమును సాధకులకు అనుగ్రహించినట్లు తెలిపారు.

అంతట కశ్యపప్రజాపతి లేచి శ్రీవల్లభుల వార్కి నమస్కరించి, స్వామీ! తమ తీర్థాటనము పూర్తియయిన పిదప భరతఖండమందు, శ్రీశైలమునకు దగ్గరలో కృష్ణానదీపరీవాహక ప్రాంతమైన 'కురుంగడ్డ' అను దీవియందు తపస్సాధన గావించినచో బహుళ శ్రేష్ఠముగా ఉండునని తోచుచున్నది. ఎందువలన అనగా పూర్వకాలంలో మేము అచ్చట తపమాచరించి, శ్రీమన్నారాయణుని ప్రత్యక్షదర్శన భాగ్యము పొంది, వారి మూడు అవతారములలో తల్లిదండ్రులమైతిమి. ఇప్పటికీకూడ ఎంతోమంది మహామునులు అక్కడ తపమాచరించుచున్నారు. మరెందరో అదృశ్యరూపములో శిల, వృక్ష రూపాలతో నిత్య అనుష్ఠానము చేసుకొనుచున్నారని, కావున ఆ స్థలమునందు మీ నివాసము లోకకల్యాణ కారకమై, జనులకు ఆధ్యాత్మికత పెంపొందింపజేయునని అనిపించినందువల్ల, మీకు వినయపూర్వకముగా ఈ సూచనను మాత్రమే చేయుచున్నానని తెలిపెను, అంతటితో సద్గోష్ఠి ముగిసినది. అటుపిమ్మట, మానససరోవరమునందు స్నాన, అనుష్ఠానములు పూర్తిగావించుకొని శ్రీవల్లభులు కైలాసశిఖరమును దర్శించుకొనగా, శంకరుడు వారికి కమండలము, జపమాల, నారద, తుంబురులు రుద్రాక్షమాలలు, ఆంజనేయస్వామి దానంతట అదే ప్రకటితమై, అదృశ్యమయ్యే ఆసనముగా వారికి పులిచర్మము మొ॥నవి వారు తపమాచరించుకొనుటకు, వారి, వారి జ్ఞాపికల రూపంలో ఇచ్చి సత్కరించి, స్వామివారికి వీడ్కోలు పలికిరి. అచ్చట నుండి శ్రీవల్లభులు తమ యోగశక్తి ద్వారా మరొక క్షేత్రమునకు పయనమైరి.

ఆ తరువాత మజిలీగా శ్రీపాద శ్రీవల్లభులు గోకర్ణ క్షేత్రం సందర్శించారు. శ్రీవల్లభుల తాతగారైన శ్రీ బాపనార్యులవారు సూర్యమండలము నుండి గోకర్ణ క్షేత్రము నందు కొలువైయున్న శ్రీమహాబలేశ్వరునిలోనికి శక్తిపాతము చేసి, మహాబలేశ్వరుని ఎంతో శక్తివంతునిగా చేసిరి. కర్నాటక రాష్ట్రంలోని గోకర్ణ క్షేత్రమంతటి పవిత్రమైన క్షేత్రం మరొకటి లేదు. గోకర్ణ క్షేత్రం మానవుల పాపకర్మలను హరించే దివ్యక్షేత్రం. ఆ క్షేత్ర దర్శనము, స్మరణము వలన గూడ సర్వపాపాలు నశిస్తాయి. అక్కడ ఇంద్రాది దేవతలందరూ తపస్సు చేసి, శివానుగ్రహం వలన తమ అభిష్టాలను పొందారు. అక్కడ కొలువైయున్న మహాబలేశ్వరునికి బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, విశ్వదేవతలు, మరుద్గణాలు, సూర్యచంద్రులు, అష్టవసువులు తూర్పు ద్వారంలోనూ, యమధర్మరాజు, చిత్రగుప్తుడు, అగ్నిదేవుడు, ఏకాదశ రుద్రులు, పితృదేవతలు దక్షిణ ద్వారంలోనూ, వరుణుడు మొ॥ దేవతలు పడమటి ద్వారంలోనూ, కుబేరుడు, భద్రకాళి, వాయుదేవుడు, సప్తమాతృకలు ఉత్తర ద్వారంలోనూ, విశ్వావసువు, చిత్రరధుడు మొ॥ గంధర్వులు నిత్యము శ్రీమహాబలేశ్వరుని ఉపాసిస్తుంటారు. కశ్యపుడు, అత్రి, వశిష్ఠుడు, కణ్వుడు మొ॥న మునీశ్వరులు, కృతయుగంలో విశ్వామిత్రుడు, జాబాలి, భరద్వాజుడు మొ॥న మహర్షులు, సనక సనందనాది బ్రహ్మమానస పుత్రులు, నారదాది దేవఋషులు, సిద్ధులు, సాధ్యులు, మునీశ్వరులు, యతులు, నిత్యము గోకర్ణేశ్వరుడైన మహాబలేశ్వరుని ఉపాసిస్తారు. ఈ క్షేత్రంలో తపస్సు, ఆధ్యాత్మిక సాధనలు, భక్తులకు లక్షరెట్ల ఫలితాలనిస్తాయి. అందుకే శ్రీవల్లభులు ఈ క్షేత్రంలో మూడు సంవత్సరములపాటు ఉన్నారు.

మహాబలేశ్వరుడు ఆవుచెవిని పోలివుండే ఈ గోకర్ణ క్షేత్ర స్థల పురాణం ప్రకారం, పూర్వము లంకాధీశుడైన రావణుడు, అతని తల్లి కోర్కెమేరకు శివుని మెప్పించి, భూమ్యాకర్షణ శక్తితో, శాశ్వతంగా ప్రతిష్ఠితమయ్యే, శివుని ఆత్మలింగాన్ని సాధించి, దాన్ని తన లంకా నగరంలో ప్రతిష్ఠించడానికి కైలాసం నుండి తీసుకుని వెడుతుంటాడు. గమ్యం చేరేవరకూ దీనిని భూమిపై ఉంచరాదని రావణుని శివుడు హెచ్చరిస్తాడు. ఆత్మలింగంలో సాక్షాత్తూ శివుడే ప్రత్యక్షంగా నివాసముంటాడు. అంత మహిమాన్విత శివుని ఆత్మలింగం లంకకు చేరకూడదని విష్ణువు, నారదుడు ఆలోచించి, రావణుని ఏదోరకంగా ఉపాయంతో అటకాయించి, దారిలోనే ఆ శివలింగ ప్రతిష్ఠ జరుపమని వినాయకునిని ప్రేరేపిస్తారు. బాలుని రూపంలో మార్గమధ్యంలో తారసపడ్డ వినాయకుని చేతికి, రావణుడు ఆ శివలింగమిచ్చి, సాయంకాలసమయంలో సముద్రతీరంలో సంధ్యవార్చుకుని వెంటనే వస్తానని తెలిపాడు. అయితే, పిలువగానే రావాలని లేదా ఆ లింగాన్ని అక్కడే వదలివెళ్లిపోతానని ఆ బాలుని రూపంలో ఉన్న వినాయకుడు షరతు విధించాడు. దానికి అంగీకరించి, రావణుడు సంధ్యవార్చుకొనుటకై సముద్రమధ్యమునకు వెళ్లగానే, అదనుచూచి వినాయకుడు రావణుని పదేపదే రమ్మని పిలుస్తాడు, రావణుడు పిలువగానే రాలేదనే నెపంతో ఆ శివుని ఆత్మలింగాన్ని, ఆ సముద్రతీరాన్నే వదలి వినాయకుడు వెళ్లిపోతాడు. భూమ్యాకర్షణ శక్తి గల ఆ ఆత్మలింగము అక్కడే శాశ్వతంగా భూమిలోనికి చొచ్చుకొనిపోయి స్థిరంగా ప్రతిష్ఠితమవుతుంది. రావణుడు ఎంత ప్రయత్నించినా, ఆ శివుని ఆత్మలింగాన్ని పెకలించలేక విఫలుడౌతాడు. అతని ప్రయత్నంలో, అతని బలిష్టమైన శరీర రాపిడికి, ఆ శివలింగం ఆవు చెవి (గోకర్ణం) ఆకారంలోకి మారిపోతుంది. రావణుని వ్యథ, బాధ చూచి, శివుడు ప్రత్యక్షమై, ఆ శివలింగం శాశ్వతంగా ప్రతిష్ఠితమైనదని, దానిని పెకలించుట ఎవరి తరము గాదని, అక్కడ తాను మహాబలేశ్వర రూపంలో కొలువుంటానని, ఆ ప్రాంతం గోకర్ణ క్షేత్రమను పేరుతో మహాపుణ్యక్షేత్రమై భూభాగంలో మరో కైలాసంలా విరాజిల్లుతుందని, రావణుని ఆశీర్వదించి, రావణుని పేరు చిరస్థాయిగా నిలచిపోతుందని వరమిచ్చి, శివుడు అంతర్ధానమవుతాడు.

గోకర్ణ క్షేత్రంలో శ్రీవల్లభులు నిత్యం అనుష్టానం చేసుకుంటూ, మహాబలేశ్వరుని దర్శించుకుంటూ, భిక్ష చేసుకుంటూ ఉండేవారు. సత్సంగం చేస్తూ జ్ఞానబోధనలు చేసేవారు. ఒకనాడు శ్రీవల్లభులు గోవిందభట్టు అను బ్రాహ్మణుని ఇంటి ముందు నిల్చుని భిక్షను అర్థించారు. చిరుతప్రాయంలోనున్న, సుకుమారుడైన ఆ బాలయతిని చూచి, గోవిందభట్టు, ఆతడు కారణజన్ముడని తలచి, ఆతని ముఖవర్చస్సును పరిశీలించగా, వల్లభుల ఫాలభాగమున బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు దర్శనమిచ్చారు. ఆ ఆదివ్య దర్శనంతో ఒడలు పులకరించిన గోవిందభట్టు వల్లభులవారికి పాదాభివందనము చేసి, ఇంటి లోనికి ఆహ్వానించి, ఆర్ఘ్య, పాద్య, ఆసనములు ఇచ్చాడు. తన ఆతిథ్యము స్వీకరింపమని కోరాడు. సకల మర్యాదలు చేసి, ప్రతీ రోజు తన ఇంటనే భిక్ష స్వీకరించి, తన ఇంటివద్దనే శయనింపవలసిందిగా కోరాడు. దానికి అంగీకరించి వల్లభులు అతనితోనే ఉండేవారు. గోవిందభట్టు వల్లభులపై ప్రగాఢ, భక్తి విశ్వాసములు కలిగి, వారిని రాత్రింబవళ్లు అలుపెరగక సేవించేవాడు. ఒక యోగ్యుడైన, ఉత్తముడైన సన్యాసికి ఒక్కపూట భిక్షనిచ్చినచో, వేయిమంది బ్రాహ్మణులకు సమారాధన చేసిన ఫలితం దక్కుతుందని శాస్త్రం తెలిపింది. ఆ కారణంగా వల్లభులకు ఎంతో సేవచేస్తూ, గోవిందభట్టు మురిసిపోయేవాడు. స్వామివారి బోధనలతో, సత్సంగాలతో ఎంతో జ్ఞానాన్ని ఆర్జించాడు. స్వామికి ప్రియ శిష్యుడైనాడు.

ఈ విధముగా రెండున్నర సంవత్సరములు గడిచెను. ఒకనాడు ఉదయమే వల్లభులు అనుష్టానమునకు బయటకు వెళ్లి, మధ్యాహ్న సమయమయినప్పటికీ భిక్ష గ్రహించుటకు రాలేదు. దానితో గోవిందభట్టు వ్యాకులతచెంది, వల్లభుల గూర్చి క్షేత్రమంతా గాలించిననూ, అతనికి వారిజాడ కానరాలేదు. శ్రీపాదస్వామి గోకర్ణ క్షేత్రంలో తాము నిర్వహించవలసిన తపోనుష్టానములు పూర్తి అయినందువల్ల, ఆ క్షేత్ర నాయకుడైన మహాబలేశ్వరుని వద్ద శలవు గైకొని ఎవరికీ తెలుపకుండా ఆ క్షేత్రం విడచివెళ్ళివుంటారని అనుకున్నాడు. స్వామి వియోగము భరించలేక గోవిందభట్టు బాధపడుచూ, రోజూ ఆలయానికి వెళ్లి, వల్లభుల దర్శనభాగ్యము తనకు మరలా కలిగించమంటూ శ్రీమహాబలేశ్వరస్వామిని కోరుకునేవాడు. వారిజాడ తెలుసుకొనుటకై రకరకాల ప్రయత్నములు చేసేవాడు. మొత్తంమీద శ్రీపాదులు గోకర్ణక్షేత్రము వీడి, శ్రీశైలము చేరారని గోవిందభట్టుకు తెలియవచ్చినది. ఈలోగా ఆళంది క్షేత్ర నివాసియయిన చిదంబర శాస్త్రి అను పండితుడు గూడ

శ్రీవల్లభుల వారి దర్శనార్థమై, తన మిత్రుడైన గోవిందభట్టు ఇంటికి వచ్చెను. వారిరువురూ, మరికొంతమంది మిత్రులతో గూడి వల్లభులను కలుసుకునేందుకు శ్రీశైలము పోవలయునని నిశ్చయించుకొని ప్రయాణమైరి.

శ్రీపాద శ్రీవల్లభులు తమ యోగగమనంతో గోకర్ణక్షేత్రం నుండి శ్రీశైలం చేరారు. శ్రీశైలం శ్రీభ్రమరాంబాసమేతుడైన శ్రీమల్లికార్జునస్వామి నెలకొని యున్న అతి పవిత్ర పుణ్యక్షేత్రము. ఇచ్చట స్వామి జ్యోతిర్లింగ స్వరూపుడు, భ్రమరాంబికా మాత అష్టాదశ శక్తి పీఠముగా కొలువైయున్నది. ఎంతో మంది ఋషులు, యోగులు, మునులు, సిద్ధులు అదృశ్యముగా వారి తపోసాధనలు నిరంతరంగా కొనసాగిస్తూ, వారి తపోధనమంతా ఆ క్షేత్రానికి ధారపోస్తూ ఉంటారు. అక్కడ కృష్ణానది పాతాళగంగ యను పేరుతో ప్రవహిస్తూ ఉంటుంది.

రెండు రోజుల వరకూ శ్రీవల్లభస్వామి గూర్చి ఎవరికీ అంతగా తెలియలేదు. శ్రీపాదులు ప్రతినిత్యము పాతాళగంగలో స్నానం చేసి తమ అనుష్టానమును ఒక వటవృక్ష ఛాయలో కొనసాగించేవారు. శ్రీశైలమందు కొలువైయున్న సాక్షిగణపతి వారు శ్రీవల్లభుల ఉనికిని, సిద్ధులకు తెలపాలని సంకల్పించి, కొంతమంది సిద్ధులకు స్వప్న దర్శనమిచ్చి, వల్లభుల యొక్క గుణ, గణములతో బాటు, వారా ప్రాంతంలో ఉన్నారని, దర్శించి తరించమని తెలిపారు. అప్పుడు ఆ సాధకులు, యోగులు శ్రీశైలమందలి అటవీ ప్రాంతమంతా గాలించగా, ఒక వటవృక్షము క్రింద శ్రీవల్లభుల వారి దర్శనమైనది. వారందర్నీ చూచి వల్లభులు కన్నులు తెరువగానే, ఆ యోగిపుంగవులందరూ వారికి నమస్కరించిరి. ఆనాటి నుండి చాలమంది యోగులు శ్రీవల్లభుల దర్శనము చేయుచూ వారి బోధనలు వినుచూ, సత్సంగములలో పాల్గొనేవారు.

శ్రీవల్లభులను దర్శించిన వారిలో నిర్మలానంద బ్రహ్మచారియను నాతడు, స్వామిని ఎంతగానో సేవించి, ప్రియ శిష్యుడైనాడు. స్వామివారిని ప్రార్థించి తన మఠమునకు తీసుకుని వెళ్లి కందమూలాలను భిక్షగా నొసగి, వారికి విశ్రాంతి యేర్పాటుచేసి, సేవించాడు.

శ్రీశైలక్షేత్రము పట్ల శ్రీవల్లభులకు ప్రత్యేక శ్రద్ధ, భక్తి గలవు. ఎందుకంటే వారి మాతామహులైన శ్రీ బాపనార్యులవారు శ్రీశైలమునందే గతములో మహాయజ్ఞమొక దానిని చేసి, సూర్య మండలము నుండి, మల్లికార్జున లింగములోనికి శక్తిపాతము చేయుటచేతనే శ్రీపాద శ్రీవల్లభుల అవతారము ఈ భూమండలముపైకి వచ్చినది. శ్రీశైలములో కొద్దికాలమున్న పిదప శ్రీవల్లభులు ఎవరికీ తెలుపకుండా శ్రీశైలము నుండి అదృశ్యమైరి. వారిని దర్శించిన నిర్మలానంద బ్రహ్మచారి మొ॥ యోగులందరూ వారిని గూర్చి వెదికి, వెదికి, వారి జాడ తెలియక చింతించిరి. శ్రీవల్లభులను ధ్యానిస్తూ కాలంగడిపేవారు.

శ్రీవల్లభులు శ్రీశైలము నుండి తమ యోగమార్గమున సశీరముతో మహాగ్నిగోళ సదృశులై సూర్యమండలమునకు చేరుకున్నారు. అచ్చటనుండి ధ్రువ నక్షత్రములోనికిని, అచ్చట నుండి సప్తర్షి మండలములోనికిని, అచ్చట నుండి ఆర్ద్రా నక్షత్రమునకు వెళ్లిరి. అచ్చటనుండి ఆ నక్షత్రములో వశించు మహర్షుల కోరిక మేరకు దివ్యజ్ఞాన యోగమొక దానిని, అత్యంత నూతన యోగము నొకదానిని శ్రీశైలములోని సిద్ధపురుషులకు బోధించుటకు తిరిగి శ్రీశైలము వచ్చిరి. శ్రీశైలము రాగానే శ్రీవల్లభులు సిద్ధపురుషులందర్నీ సమావేశపరచి, ఆర్ద్రా నక్షత్రములోని మహర్షుల కోరిక ప్రకారము వారికి దివ్యజ్ఞాన యోగమును, నూతన యోగమును ప్రబోధించిరి. ఆ సిద్ధపురుషులందరిని తమ యోగశక్తి ద్వారా ఆర్ద్రానక్షత్రములోనికి పంపి, శ్రీవల్లభులు శ్రీశైలమందే ఉండిపోయిరి. శ్రీశైలమందు తిరిగి వారి జాడ తెలియగానే వారి శిష్యుడైన నిర్మలానంద బ్రహ్మచారి, మిగిలిన యోగులు, సాధకులు వారిని దర్శించి పరవశించిరి. ఈ క్షేత్రంలో సిద్ధులతో బాటు గిరిజనులు కూడా ఉండేవారు. వారందరూ శ్రీవల్లభులను భక్తితో సేవించేవారు. శ్రీపాదులవారు నిత్యము సత్సంగము జరిపి, భిన్నాభిప్రాయములు గల సాధకులనందర్నీ సమన్వయపరచి, ఒకే త్రాటిపై తీసుకొనివచ్చిరి. శ్రీపాదులవారి పవిత్ర జ్ఞాన బోధకు, సాధకులందరూ ముగ్ధులై వారి సన్నిధానమునే కోరుకునేవారు.

శ్రీపాదుల వారిని నిత్యము దర్శించు గిరిజనులలో సింగన్నదొర అనే భిల్లుడుండేవాడు. స్వామి వారికి కందమూలాలు, పుట్టతేనె సమర్పించి వారిని సేవిస్తూ ఉండేవాడు. సింగన్నదొరకు ఆరుగురు పిల్లలు, వారిలో ఒక కుమారుడు గ్రుడ్డి, ఒక ఆడపిల్ల మూగతనముతో ఉండేవారు. వారిని చూచి సింగన్నదొర దంపతులెంతో బాధపడేవారు.

ఒకసారి సింగన్నదొర తన కష్టమును స్వామివారికి తెలియజేసుకొని, తన గుడిసెకువచ్చి, తన భార్య, పిల్లలకు ఆశీర్వాదములు ఇచ్చి, తన ఆతిథ్యము స్వీకరించమని స్వామివారిని కోరెను. ఆతని కోర్కెను మన్నించి శ్రీవల్లభులు, తమ శిష్యుడైన నిర్మలానందతో కలిసి సింగన్న గుడిసెకు వెళ్లిరి. స్వామి వారి కాళ్లుకడిగి, పీటవేసి, పుష్పములతో వారి పాదాలను ఆ సింగన్నదొర దంపతులు పూజించిరి. కొన్ని పండ్లు, దుంపలు స్వామికి నైవేద్యంగా ఇచ్చిరి. వారి ఆతిథ్యము చూచి, కరుణాహృదయులైన శ్రీవల్లభులు సింగన్నదొర కుమారునికి దృష్టి, కుమార్తెకు మాట ప్రసాదించారు. దానితో ఆ దంపతుల ఆనందానికి హద్దులు లేకుండా పోయెను. వారు స్వామి పాదాలపైబడి కృతజ్ఞతాపూర్వకంగా మ్రొక్కిరి. నిర్మలానందతో స్వామి ఈ విషయములు ఎవరికీ తెలుపకుండా గోప్యముగా నుంచమని తెలిపారు. సింగన్న దొరతో శ్రీవల్లభులు నీవు నీ మొదటిజన్మలో కాశీలో వేదపండితుడవని, అహంకారం వల్ల పుణ్యం నశించి, ఆరు జన్మలు ఎత్తావని, గత జన్మలలో ఎన్నో పాపాలు చేసినప్పటికీ, గత ఆరు జన్మలలో కాశీ, శ్రీశైలం లాంటి మొ॥ పుణ్యక్షేత్రాలలో జీవిస్తూ, కొన్ని పుణ్యాలు కూడా చేసావని, అందువల్లనే నీకు సద్గురుదర్శనం లభించినదని, ఈ పుణ్యఫలం వల్ల నీకు మరి రెండు జన్మలలో గూడ మరొక సద్గురువు రూపంలో నా దర్శనం లభిస్తుందని దీవించారు. ఈ భిల్లుడే గంధర్వపురంలో శ్రీనృసింహసరస్వతీ స్వామి వారిని దర్శించాడు. ఆనాడు గంధర్వపురంలో శ్రీనృసింహసరస్వతి వారిని తనకు బ్రాహ్మణునిగా జన్మించాలని కోరినందువల్ల, ఆ తదుపరి జన్మలో ఇతడు బ్రాహ్మణ వంశంలో నానాచందోర్కర్‌గా జన్మించి శిరిడీ సాయిబాబాను సేవించాడు. అందుకే శిరిడీ సాయిబాబావారు నానాచందోర్కర్‌తో నానా! మనయిద్దరిదీ మూడు జన్మల బంధం అని తరచూ అనేవారు. కాని దాని అంతరార్థం నానాకు గోచరించేదిగాదు. శ్రీపాదులవారి లీలలు అమోఘం, అపారం.

ఒకసారి శ్రీవల్లభులు, నిర్మలానంద మరియు సింగన్నదొరలతో శ్రీశైలంలోని అడవిలో పోతుండగా, వారియిద్దరినీ ఒకచోట నిలిపి, శ్రీవల్లభులు ఒంటరిగా అడవి మధ్యగా పోగా, అక్కడికి రెండు పెద్దపులులు వచ్చి వారికి నమస్కరించి వారితో సంభాషించి వెడలిపోయినవి. ఆ భయంకర దృశ్యమును కళ్లారా చూచిన సింగన్న దొర ఆశ్చర్యముతో ఆ విషయము గూర్చి స్వామిని ప్రశ్నించెను. అంతట స్వామి తమ దర్శనమునకై, ఆ అడవిలో తపమాచరించుచున్న ఇద్దరు మహర్షులు పులి రూపములో వచ్చినారని తెలిపిరి.

ఒక్కొక్కసారి స్వామివారు ఒక్కరే అటవీ ప్రాంతంలోనికి వెళ్లేవారు. ఒక కార్తీకమాసంలో శ్రీవల్లభులు దగ్గరలో నున్న త్రిపురాంతకం, ఉమామహేశ్వరం మొదలగు పుణ్యక్షేత్రాలను దర్శించారు. ఒకసారి వారు కదళీవనం వెళ్లారు. మార్గమధ్యంలో తపోదీక్షలో నున్న మహాభారత మహామహుడైన కృపాచార్యుని చూచారు. కృపాచార్యుడు వారిని చూచి నమస్కరించగా స్వామివారు కృపాచార్యులకు లోకకల్యాణార్థమై హితోక్తులు ఉపదేశించారు.

ఒకరోజు శ్రీశైలంలో ఉన్న విభూది మఠంలో శ్రీవల్లభులు సత్సంగం చేయుచుండగా, వారికి అదృశ్యరూపంలో ఒక మహాత్ముడు వారి దర్శనమునకు వచ్చుచున్నట్లుగా గోచరించినది. వారు సమావేశమునుండి బయటకురాగా, ఒక మూలన వారి ముందు ఒక కాంతిపుంజము ప్రత్యక్షమై అందుండి మహాభారత మహావీరుడైన ద్రోణుని కుమారుడైన అశ్వత్థామ బయల్వెడలెను. అశ్వత్థామ శ్రీవల్లభులకు నమస్కరించి, వారి ఆశీర్వాదములు, ఉపదేశము పొంది అదృశ్యమయ్యెను. అచ్చట వారందరూ ఆ వచ్చిన వ్యక్తి గూర్చి వివరము అడుగగా స్వామి ఆతడు ద్రోణపుత్రుడైన, అశ్వత్థామయని తెలిపారు. వారితో శ్రీశైలక్షేత్రమందు బహు జాగ్రత్తగా సంచరించవలయునని, వేలాది సంవత్సరములు ఇచ్చటనే తపస్సు ఆచరిస్తున్న మహాయోగులందరూ మీ ప్రవర్తనలను కనిపెట్టుచుందురని, కనిపించే చెట్టూ, పుట్ట రూపములలో మహామునులుండు పవిత్రప్రదేశమే ఈ శ్రీశైలమని తెలిపారు. ఈవిధంగా స్వామి ప్రతిరోజూ సత్సంగం నిర్వహిస్తూ, హితబోధలు చేసేవారు. స్వామివారి అమృతవాక్కుల నుండి వెలువడుతున్న నూతన విషయాలను శ్రవణం చేస్తూ, మననం చేస్తూ, సాధకులు కాలం గడిపేవారు.

శ్రీపాద శ్రీవల్లభులు ఆషాడ మాసము నుండి కార్తీక మాసము వరకూ, నాల్గు నెలలపాటు శ్రీశైలంలో నిత్యము స్నాన అనుష్టానములు, దైవ దర్శనములతోబాటు, సకల సాధు సత్పురుషులతో సత్సంగములు నెరపి అక్కడి వారందరికీ అద్భుతమైన జ్ఞానామృతము బోధించినారు. శ్రీపాదులవారు చాతుర్మాసముల చివరి రోజు అనగా కార్తీక పౌర్ణమి రోజు భిక్ష

స్వీకరించిన తదుపరి శ్రీమల్లిఖార్జునస్వామిని, భ్రమరాంబాదేవిలకు ప్రణామములు, ధన్యవాదములు తెలిపినారు. అంతకాలము తమతో కలసి సత్సంగము చేసిన సాధువులందరినీ, సాధన చక్కగా చేసుకుంటూ గమ్యం చేరమని దీవనలిచ్చారు. అందరూ వెళ్లిపోగానే, తమ ప్రియతమ శిష్యుడైన నిర్మలానంద బ్రహ్మచారితో తమ శ్రీశైలయాత్ర ముగిసినదని, తాము శ్రీశైలము నుండి తమ ఆఖరి మజిలీగా కృష్ణా తీరమందున్న కురుంగడ్డకు పోవుచున్నామని తెలిపినారు. వారి నిర్ణయం పట్ల వికలిత మనస్కుడై నిర్మలానంద వారిని శ్రీశైలమందే ఉండిపొమ్మని బ్రతిమాలినా స్వామి వినకుండా, అతనికి మంగళ ఆశీర్వాదములు తెలిపి, ఒక్కసారిగా శ్రీశైలమందు అదృశ్యమైనారు. నిర్మలానంద బిక్కమొగముతో దు:ఖించుచూ ఆశ్రమదారి పట్టెను.

గోవిందభట్టు, అతని మిత్రులు గోకర్ణం నుండి శ్రీపాదులవారి దర్శనార్థమై బయలుదేరి, అనేక మజిలీలు మార్గమధ్యంలో చేసుకుంటూ, శ్రీశైలం చేరి, పాతాళగంగలో స్నానమాచరించి, అక్కడ శ్రీవల్లభుల కొరకై సమాచారము సేకరించు ప్రయత్నములో నిమగ్నమైరి. భ్రమరాంబా, మల్లిఖార్జునస్వామివార్లను దర్శించిరి. అటుపై నిర్మలానందను కలసి, శ్రీవల్లభుల గూర్చి విచారించగా, కృష్ణాతీరంలో గల కురుంగడ్డకు శ్రీవల్లభులు వెళ్లిపోయారని నిర్మలానంద, గోవిందభట్టుకు అతని మిత్రులకు తెలిపెను. వారు తమ ప్రయత్నము విఫలమయ్యెనని చింతించుచూ, ఏది ఏమయినా శ్రీవల్లభులను దర్శించి తీరాలనే పట్టుదలతో కురుంగడ్డకు పోవాలని నిర్ణయించుకున్నారు.

అటుపై వారందరూ శ్రీశైలంలో బయలుదేరి కృష్ణానది ఒడ్డును దారిగా చేసుకుని, కురుంగడ్డ వైపుకు ప్రయాణం సాగించిరి. మార్గమధ్యంలో పుణ్యక్షేత్రాలైన ఉమామహేశ్వరం, అలంపురం దర్శించి, పరమపావనమైన తుంగభద్రానదిలో స్నానమాచరించి, అనుష్టానములు పూర్తిచేసుకుని మెల్లగా పంచదేవపహడ్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ గ్రామస్థులతో శ్రీవల్లభుల గూర్చి విచారించి, కురుంగడ్డకు దారి చూపమని అడుగగా, ఆ గ్రామస్థులు కృష్ణానది దాటి కురుంగడ్డకు పోవలసిన అవసరం లేదని, ఆ స్వామి ప్రతి ఉదయం కురుంగడ్డలో కృష్ణానది దాటి ఈవలి ఒడ్డుకు వచ్చి, సూర్యనమస్కారములు, అనుష్టానములు చేసుకుంటారని తెలిపారు. ఆ రాత్రి వారికి గ్రామస్థులు బస, భోజన ఏర్పాట్లు చేసారు. ఆ రాత్రికి అక్కడే నిద్రించి, గోవిందభట్టు వారి మిత్రులు తెల్లవారుఝామునే లేచి, కృష్ణానదిలో స్నాన, అనుష్టానములు పూర్తి చేసుకుని, కృష్ణానది ఒడ్డుకు చేరుకుని, వల్లభుల రాకకై నిరీక్షించసాగారు.

అంతలోనే ఆజానుబాహుడు, దివ్యసుందరమూర్తి, రుద్రాక్షలు, కమండలము ధరించిన జటాధారి, పదహారు సంవత్సరముల బాలయతియైన శ్రీవల్లభులు కృష్ణానదిపై ఉద్భవించిన కమలాలపై నడుచుకుంటూ, కురుంగడ్డ నుండి బయలుదేరి కృష్ణానది ఇవతలి ఒడ్డునకు చేరుకున్నారు. వారిని చూచి గోవిందభట్టు బృందం జయజయ ధ్వానములు చేయుచూ 'శ్రీపాద వల్లభా దిగంబరా' అంటూ కీర్తించసాగిరి. స్వామి రాగానే వారి పాదములపై బడి నమస్కరించి, తమకష్టమునకు తగిన ఫలము లభించినదని, ఆనందభాష్పాలు కార్చారు. స్వామి వారిని ఆదరించి, మంగళ ఆశీర్వాదములిచ్చిరి.

ఈ విధముగా శ్రీవల్లభులు తమ దేశాటన ముగించుకుని, తమ ధ్యాన, అనుష్టానములకు అనువుగా ఉండే పవిత్ర కృష్ణా నది తీరమందున్న కురుంగడ్డలో నివాసంమేర్పరుచుకుని, భక్త పాలన చేసేవారు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-9

# శ్రీవల్లభుల విద్యా గీతా ప్రవచనం

శ్రీపాద శ్రీవల్లభులు శ్రీశైలక్షేత్రంలో మహాయోగులకు, సాధకులకు, తమ సత్సంగంలో ఒకరోజు విద్యాగీతా ప్రవచనం చేశారు. తత్త్వ జ్ఞానము పూర్తిగా అలవడుటకు పరమేశ్వరి, పరమేశ్వరుడు కలసి విద్యాస్వరూపిణియైన జగన్మాతతో విద్యాగీత చెప్పించారని, విద్యాగీత త్రిపురసుందరీమాత ప్రబోధమని, అతిరహస్యమని శ్రీవల్లభులు ఆనాడు సత్సంగములో తెలిపారు. వారు విద్యాగీతపై ఇంకా ఇలా ప్రబోధించారు.

ఒకానొక పర్యాయము శ్రీదత్తాత్రేయస్వామివారు పరశురామునికి అత్యంతనిగూఢసత్యములైన ఈ క్రింది విషయాలను తెలియజేశారు.

బ్రహ్మలోకమునందు అప్పుడప్పుడు జ్ఞాన, తత్త్వ విచారము చేయుటకు సభలు నిర్వహిస్తూ ఉంటారు. ఒకనాడు లోకకల్యాణమునకై జ్ఞానమార్జించుట కొరకు అనేక సులభ సాధనా మార్గములను ప్రతిపాదించుటకై సభ జరిగింది. ఆ సభకు వశిష్ట, పులస్త్య, పులహా, క్రతు, భృగు, అత్రి, అంగీరస, విశ్వామిత్ర, నారదుడు మొ॥లగు ఎంతో మంది మహామహిమాన్వితులైన మహర్షులందరిని ఆహ్వానించారు. బ్రహ్మదేవుడు సభకు అధ్యక్షత వహించగా, వారిచెంతన వీణానాదముతో సరస్వతీదేవి ఉచితాసనమును అలంకరించినది. ఆ సభయందు జ్ఞానసాధన విషయములపై తత్త్వవిచారణ ప్రారంభమయ్యెను. ఆనాటి సభలో మానవులు జ్ఞానమును పొందుటకై గల మార్గములు, జ్ఞానప్రాప్తికి సాధనములు, సాధనచేత పొందవలసిన జ్ఞానస్వరూపము, అటువంటి జ్ఞానం సిద్ధింపచేసుకున్న వారిలో ఎవరు ఉత్తములు, వారు అనుసరించిన పద్ధతులపై చర్చ మొదలయినది. ఎవరికి వారు పరస్పర భిన్నాభిప్రాయములు వ్యక్తంచేసినందువలన, వారి మధ్య ఆలోచనలలో సమన్వయం కుదరక, వారు ఎటూ తేల్చుకోలేక సతమతమగుచుండగా, కొంతమంది మహర్షులు సభాధ్యక్షుడైన బ్రహ్మదేవునితో ఈ సమస్యకు పరిష్కారము కనుగొనవలసినదిగా కోరిరి. కష్టతరమైన ఈ సమస్యకు పరిష్కారం తనవద్ద లేదని, కావున మహేశ్వరునికడకేగి, సందేహనివృత్తి చేసుకొనుట ఉత్తమమని బ్రహ్మదేవుడు పలికెను. బ్రహ్మదేవుని ఆలోచనతో అందరూ ఏకీభవించగా, సభికులందరూ కైలాసమునకేగి పరమేశ్వరుని దర్శించి, స్తుతించి వారికి ఈ సమస్యను బ్రహ్మదేవుడు నివేదించెను. భిన్నాభిప్రాయములకు బహుశా స్వీయ అహంకారములే కారణం కావచ్చునని పరమేశ్వరుడు తలచి, వారితో విద్యాస్వరూపిణియైన పరాశక్తియే తగిన సత్యమును వెలువరించగల శక్తి గలదని తెలిపెను, అంతట అందరూ పరాశక్తిని ధ్యానించారు. అంత మిరుమిట్లు గొలుపు కాంతులతో వారికి పరాశక్తి దర్శనమిచ్చింది. వారందరూ పరాశక్తిని స్తుతించి, నమస్కరించారు. అక్కడ ఉన్న ఋషివర్యులు అమ్మవారితో ఓ దేవీ! శబ్ద బ్రహ్మమయి! విద్యా స్వరూపిణివైన నీవు తప్ప మాకు సత్యమును బోధించువారెవ్వరు కనబడుటలేదు. నీయొక్క పరరూపము, అపర రూపము, ఈశ్వరతత్త్వము, జ్ఞానము, దాని ఫలము, దానిని సాధించు ముఖ్యసాధనము, సాధకుడు, సిద్ధిస్వరూపము, సిద్ధియొక్క పరాకాష్ఠ, ఉత్తమ జ్ఞాని యొక్క ప్రవర్తన అను విషయాలను సభలో చర్చించిన మాకు భిన్నాభిప్రాయాలు కలిగి, ఏకపక్షఅంగీకారము కుదరలేదు. ఇందు సత్యనిర్ణయము చేసి, మా సందేహములు తీర్చి, ధన్యులను చేయమని వారు పరాశక్తిని ప్రార్థించిరి. అంత జగన్మాత చిరునవ్వుతో వారి సందేహాలను ఈ క్రింది విధంగా నివృత్తి చేసింది.

## 1. పరరూపము

దేనియందు ఈ జగత్తు సృష్టింపబడి, పోషింపబడి, లయమగుచున్నదో, ఏది అజ్ఞానులకు జగత్తుగా, వృద్ధి, క్షయములు కలిగినదిగా కంటికి కనిపించుచున్నదో అదియే నా పరరూపము. అనగా ఇంద్రియములకు గోచరమయ్యేదంతా నా పరరూపమే.

ఇదియే యోగుల అంతఃకరణములందు నిస్తరంగ, గంభీర, చైతన్య సముద్రములవలే నిశ్చలంగా గోచరించుచున్నది. వారు నా పరరూపమును ఆ విధముగానే దర్శించెదరు. కొందరు దానినే తమ స్వరూపంగా తెలుసుకుందురు. అయిననూ వారి స్వభావములను బట్టి, ఇష్టతలను బట్టి, భక్తి భావ ప్రేరితులై బేధము కల్పించుకొని, నన్ను స్త్రీ మూర్తిగా ఆరాధించుచున్నారు. అంతఃకరణ, ఇంద్రియాలు, కాయము అను ఈ మూడింటిని ముడివేయు సూత్రమే ప్రాణము. ఆ ప్రాణముగా భావించునది నా పరరూపమే. ప్రాణము, దేహము, వేరైనప్పుడు, లోకము ప్రకాశింపదు. అదికూడ నా పరరూపమే.

## 2. అపర రూపము

అనేక బ్రహ్మాండములకు వెలుపల ఊర్ధ్వముగా సుధాసముద్రమునందు గల మణి ద్వీపములో కదంబవన మధ్యమున చింతామణి రత్న నిర్మిత ఆరామములో పంచబ్రహ్మమయమైన మంచయు అనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, రుద్రులు నాలుగు కోళ్లగాను, సదాశివుడే మంచము యొక్క పలకగాను ఏర్పడియున్నది. దానిపైన కామేశ్వరీ, కామేశ్వరులను స్త్రీ, పురుషరూపములుగా ఆనాది మిధునముగా ప్రకాశించునదియే నా అపరరూపము.

జాగ్రత, స్వప్న, సుషుప్తియను మూడు అవస్థలయందు సకలజీవులలో ప్రకాశించునట్టి గూడ నా అపరరూపమే. దీనినే నా త్రిపురసుందరీ రూపమని తెలుసుకోవలయును. ఇంకా, సదాశివుడు, ఈశానుడు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, గణేశాది దేవతలు, దిక్పాలకులు సకల దేవగణములయిన వారందరూ మానవ దేహమందు నాతో కూడ ఉన్నారు. వారంతా బాహ్యంగా నాయొక్క అపరరూపాలుగా ఆరాధింపబడుచున్నారు. ఏ రూపమును ఆరాధించిననూ, ఆయా రూపములతో ఆ పూజను నేనే స్వీకరించి వారికి తగిన ఫలమునొసగుచున్నాను. ఇది తెలియని వారు అజ్ఞానముతో ఆయా దేవతలకు ఇచ్చే ఫలముగా భావిస్తారు. ఈ విషయము తెలుసుకొని నన్ను ఆరాధించు వారు జ్ఞానులు. ఆరాధన యొక్క ఫలమే జ్ఞానముగా గ్రహించవలయునని విద్యాదేవి తెలిపెను.

ఋషులారా! కేవలం చైతన్యరూపిణిగా ఏకరూపమున నున్న నేను ఇతర ద్రవ్యమేమియు లేకయే జగత్తు యొక్క రూపమున భాసించుచున్నాను. ఇట్లు అనేకముగా గోచరించుచున్ననూ, రెండవవస్తువు లేదనే విషయము కేవలము జ్ఞానులకే తెలియును. నాకు దుర్ఘటనమన్నదే లేదు. అంతయు సుసంఘటితమే. ఇదియే నా ఈశ్వరత్త్వము. నేనే సర్వమునకు ఆధారము. అంతటనూ వ్యాపించి దేనితోను సంబంధము లేక కేవలముగా ఉన్నాను. నా మాయచేతనే నా స్వరూపము నావరించి, సంసారము కలదానినై శిష్యత్వము పొంది, గురువు నాశ్రయించి, ఆత్మతత్త్వమును తెలిసి ముక్తిని బడయుచున్నాను. ఒక నటుడు ఎన్ని వేషములు ధరించిననూ, నటన తర్వాత తానుగా నుండునట్లు ఈ సంసారమందు ఎన్ని రూపములు ధరించిననూ, 'నేను' నేనుగానే ఉంటున్నాను. ఈ నా ఐశ్వర్యము (ఈశ్వరత్త్వము) లెక్కింప ఎవరితరము గాదు. ఇది తెలియుటయే జ్ఞానము.

ఇటువంటి జ్ఞానము కూడ పరము (ద్వైతము), అపరము (అద్వైతము) అను బేధములతో బహువిధములుగా నున్నది. ద్వైతము నందు ధ్యానించువాడు తన స్వరూపముకన్నా భిన్నముగా, ఇష్టదేవతా రూపముగానో లేక మంత్రమునో ధ్యానించును. అందువలన ద్వైతజ్ఞానము బహువిధములుగా ప్రకాశించుచున్నది. ఇట్టి ధ్యానము స్వప్నములో రాజగుటవంటిదే. అయిననూ విషయమునుండి మనసుమరలి దైవమును ధ్యానించుట చేత చిత్తశుద్ధియను ఫలము నిచ్చుచున్నది. ఇటువంటి ధ్యానములో నాయొక్క అపరరూపముగా చెప్పబడిన త్రిపురసుందరిరూపమును ధ్యానించుట జ్ఞానసిద్ధికి సాధనము. ఈ విధంగా విద్యారూపిణియైన నన్ను ఆరాధింపక ఎవ్వరునూ అద్వైత జ్ఞానము పొందలేరు.

అద్వైతజ్ఞానమనగా కనిపించే రెండవ పదార్థమేదియూ లేక కేవలంగా ప్రకాశించు పరమ చైతన్యమేనని అనుభవమును పొందుట. ఆ స్థితిలో ద్వైతమునకు తావులేదు. వ్యాఘ్రములు, సర్పములు యొక్క బొమ్మలు చూచి ఎట్లు భయముకలుగదో అట్లే ఈ అద్వైతసిద్ధిని పొందిన జ్ఞానికి ఏ క్రూరజీవిని చూచిననూ భయము కలుగదు. నిర్వికల్పసమాధిని

పొంది, యే యోగి శుద్ధచిదాత్మగా భాసిల్లుచున్నాడో, అటువంటి సమాధి నుండి లేచిన తదుపరి గూడ అట్లే అనుభవమును పొందును. ఈ గుర్తింపునే ప్రత్యభిజ్ఞానమని అందురు.

పరజ్ఞానమనగా సమాధి యందువలెనే, తక్కిన సమయములందు గూడ స్వరూపజ్ఞానముతో నుండుట అని చెప్పబడినది. ఇటువంటి జ్ఞానము వలన తరువాత ఎటువంటి వ్యవహారమందును, ఏ పదార్థమందునూ సత్యత్వసిద్ధి కలుగును. ఆత్మ అన్నింటికీ ఆధారమనే నిశ్చయజ్ఞానము కలిగినచో, సంశయములన్నీ పటాపంచలై పోవును. కొందరు శ్రవణం చేత గాని, తర్కము చేత గాని, దేహేంద్రియముల తత్త్వ విచారణ చేసి, వీనికి అతీతమైన కేవలం చిదాత్మ యొక్క స్వరూపమును బుద్ధిచేత నిశ్చితముగా గ్రహించుట అపరజ్ఞానమనబడును. దీనినే పరోక్షజ్ఞానమని కూడా అందురు. దీనిని పొందినవాడు దేహాత్మభావము అనగా దేహమే నేనను భావము నుండి విడివడును.

పరజ్ఞానమును పొందినంతనే సకల దుఃఖములు నశించునని, ఎచ్చటనూ, దేనివలననూ భయము కలుగకుండా ఉండటయే మోక్షమని త్రిపురసుందరీమాత తెలిపెను. ఆత్మ జ్ఞానమునకు భిన్నమైన జ్ఞానములన్నియూ భయకారణములే. అభయమే మోక్షము. మోక్షమే సకల సాధనములకు ఫలము. తెలుసుకొనువాడు, తెలుసుకొనుట, తెలుసుకొనబడు విషయము, దానివలన కలుగు ఫలము అను నాలుగు విషయములు ఎప్పుడు ఒకటిగా తోచునో అప్పుడు మోక్షము కలిగినట్లు చెప్పబడినది. బేధభావము నశించు వరకూ సంసారము నశింపదు. ఇటువంటి అపర జ్ఞానమును పొందాలంటే దృఢసంకల్పం ఉండాలి. ఈ సంకల్పం గలవాడు మెల్లగా కొద్దికాలములో ముక్తుడగును. సాధనము చేయువానికి, పురుషార్థములు పొందడానికి అడ్డంకిగా కొన్ని దోషములు నిలుస్తాయి. ఈ దోషములు మూడు విధములు. 1. అనాశ్వాసము, 2. కామవాసన, 3. జడత్వము. వీటిని తరచి చూస్తే అనాశ్వాసమునందు రెండు భాగములున్నవి. అవి సంశయము మరియు విపర్యయము. సంశయమనగా మోక్షమన్నది ఉన్నదా ? లేదా ? అనే సందేహము. విపర్యయమనగా ఉన్నదానిని లేదనుకొని దానిని సాధించేప్రయత్నం విరమించుట అని అర్థము. ఈ దోషముల బారిన పడకుండా ఉండాలంటే గురువులసాంగత్యం సాధకులకెంతో అవసరం. సాధన యందు అచంచల విశ్వాసం కలిగి, శ్రద్ధ వహించుటవల్ల ఈ దోషాలను నివారించుకొనవచ్చు. రెండవదియయిన కామవాసన మనస్సునకు సంబంధించినది, మనసునందు వివేకము, వైరాగ్యములు స్థిరముగా నున్నచో, శ్రవణం, మననం చేసిన విషయాలు బుద్ధియందు నిక్షిప్తమగును. కావున ఈ దోషమును సాధకుడు దరిచేరనీయరాదు.

ఇక మూడవ దోషమయిన జడత్వము బుద్ధికి సంబంధించినది. అమ్మవారి స్వరూపము గురుస్వరూపంగా సేవిస్తే ఈ దోషముండదు. సేవాతత్పరతతో ఈదోషములను సాధకుడు జయింపవచ్చును.

ఇక సిద్ధి విషయానికొస్తే, సాధకునియందు ఆత్మజ్ఞానము సిద్ధించుటయే అసలు సిద్ధి. ఇది కలిగిన తరువాత అతనికి కావలసినదంటూ ఈ సృష్టిలో ఏదీ ఉండదు. సాధన సమయములో కలుగు అణిమాది సిద్ధులను వదిలేస్తేగాని ఆత్మజ్ఞాన సిద్ధి లభించదు. అట్టి ఆత్మజ్ఞానికి దుఃఖ, భయ, శోకాదులు లేశమయినా ఉండవు. అతడు బ్రహ్మానందము పొందును. అతనికి సిద్ధులన్నియూ కైవసమగును. ఇంకా, సిద్ధియొక్క పరాకాష్ఠను గూర్చి విద్యారూపిణియైన పరమేశ్వరి ఇట్లు వచించెను. సిద్ధులు మూడు విధాలు. అవి ఉత్తమజ్ఞాన సిద్ధి, మధ్యమజ్ఞాన సిద్ధి, అధమజ్ఞాన సిద్ధి అనునవి. అన్ని వ్యవహారములు చేసుకుంటూ, ఏ వ్యవహారమూకూడ తన మనస్సునందు నిమగ్నము చేసుకోకుండా, సమాధిస్థితిలో నుండుట ఉత్తమజ్ఞాన సిద్ధి. కొంతమంది సకల వ్యవహారములు చేయుచూ, మధ్యలో సమాధిస్థితిని పొందెదరు. ఇది మధ్యమజ్ఞాన సిద్ధి. కొందరు సకలవ్యవహారములు వదలి నిరంతరం సమాధిస్థితి యందే యుందురు. దీనినే అధమజ్ఞానసిద్ధి అందురు. సకల వ్యవహారములయందునూ ప్రవర్తించుచూ, తన మనస్సునందు ఏ వ్యవహారము ఉంచుకొనక శుద్ధచిన్మాత్రముగా నుండువానికి వాసనలయొక్క ప్రకోపము కలుగదు. అందుచేత అతనికి సంకల్పములుండవు. తనకై ఏ సంకల్పంలేకున్ననూ, లోక సంగ్రహదృష్టితో శాస్త్రము ననుసరించియే ప్రవర్తించును. ఇది జ్ఞానసిద్ధుని పరిస్థితి. ఎవడు సకల వ్యవహారములను చూచుచుండియూ, దేనినీ ఆత్మకన్న భిన్నంగా తలంపడో అట్టి వాని జ్ఞానసిద్ధి పూర్ణము. ఇటువంటి జ్ఞానసిద్ధిని పొందినవాడు మాత్రమే సిద్ధులలో ఉత్తముడు.

అట్టి ఉత్తమజ్ఞాని తనయొక్క అనుభవముచేత అనేకవిధములుగా ఉండు జ్ఞానుల యొక్క స్థితి బేధములను గ్రహించుచుండును. ఇతనికి కోరికలుగాని, సంశయములుగానిలేవు. వ్యవహారములందు ఇతడు నిర్భయుడై సుఖమును, దుఃఖమును స్వప్నవస్తువులవలే తనయందే చూచుచుండును. బంధము అసత్యమని తెలియుట వలన దానిని దృష్టియందు నిలుపడు. దానికి బద్ధుడుకాడు. కావున ఉత్తమజ్ఞాని ఒకనిని బద్ధుడని, మరియొకనిని ముక్తుడనే బేధముతో చూడడు. ఎవనికి మోక్షము కావలయునని తలంపడు. మోక్షము ఒకరిచ్చునదికాదని, ఎవరికి వారు సాధన ద్వారా పొందాలని తలంచి సర్వత్రా సమదర్శనుడై యుండును. అటువంటి ఉత్తమజ్ఞాని నాయందే జీవించును. నేనాతని యందు విలసిల్లెదను. మా ఇరువురికీ బేధమేలేదని త్రిపురసుందరీదేవి విద్యాగీతను ఆ ఋషీశ్వరులందరికీ వివరించి, వారి సందేహనివృత్తి చేసెను. అంత ఋషీశ్వరులకందరికీ ఈ వివరణలతో ఆత్మసంతృప్తి కలిగి, తమ నిర్ణయమునందు ఏకాభిప్రాయము కుదిరినది. విద్యాగీతను వినిపించిన జగజ్జనని వేనోళ్ల కీర్తించి నమస్కరించిరి.

ఇంతటి గహనాతిగహనమైన, నిగూఢమైన విద్యాగీతలోని రహస్యములను త్రేతాయుగమున మన సాంప్రదాయమూలపురుషుడైన దత్తాత్రేయస్వామివారిచేత భార్గవునికి ప్రభోదించబడినదని, కలియుగమునందు ప్రథమ దత్తావతారులైన శ్రీపాద శ్రీవల్లభులు శ్రీశైలక్షేత్రమున సాధుపుంగవులకు ప్రవచించిరి. వారందరూ ఇంతటి అత్యద్భుత విషయములు తెలిపిన శ్రీవల్లభులను వేనోళ్ల శ్లాఘించారు.

కురువపురమునందు శ్రీ వల్లభుల దర్బారులో ప్రతి శుక్రవారము విద్యాగీతపై ప్రవచనము జరిగెడిది.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**



అధ్యాయం-10

# శ్రీవల్లభుల వాణి

శ్రీదత్తాత్రేయస్వామి లోకమును పావనము చేయుటకై శ్రీపాదశ్రీవల్లభరూపమున ఈ భూమిపై అవతరించి ఉన్నారు. భక్తులు ఈ కలికాలంలో శ్రీపాద శ్రీవల్లభుల నామస్మరణ చేసుకున్న యెడల కర్మశేషము తొలగి వారి అనుగ్రహం సత్వరమే పొందగలరు. వారికి భక్తులపట్ల, ఆశ్రితులపట్ల, అవ్యాజమైన కరుణ ప్రేమ స్వభావములు పొంగిపొర్లుతూ ఉంటాయి. వారిలో క్షమాగుణం మెండు. అందుకేవారు భక్త సులభులు. వారి నీడలో అన్ని కష్టనష్టములు తొలగి భక్తులు ఇహపరసుఖములు పొందగలరన్నది సత్యము. ఒకానొక సందర్భంలో శ్రీవల్లభులు తమ భక్తులతో రాతి క్రిందనున్న కప్పకు సహితము ఆహారము సమకూర్చు నేను నా భక్తులను పోషించుకోలేనాయని, వారు ఎచ్చటయున్ననూ, వారి వెన్నంటే ఉందునని, అదృశ్యముగా జంటనై సంచరించెదనని, కంటికి రెప్పవలె కాపాడెదని అన్నారు. ఇది వారి భక్త సులభత్వమునకు ఒక మంచి నిరూపణము. వారిని భజించిన ప్రతివారిపై అదృశ్యముగా వారి దివ్య అభయహస్తము ఎల్లవేళలా ఉండి కాపాడగలదన్నది ఎంతో మందికి అనుభవమయిన సత్యము.

ముఖ్యంగా దత్తుడు ఆది గురువు. బోధ గురువు. సర్వదేవతా స్వరూపమైన సనాతనుడైనప్పటికీ, తరిగిపోతున్న ధర్మాన్ని తిరిగి పునరుద్ధరించాలనే వారి తపనవల్ల ఆయన బోధ గురువుగా ఎంతో మందికి జ్ఞానాన్ని బోధించారు. వారిలో కార్తవీర్యార్జునుడు, అలర్కుడు, యదురాజు మరియు ప్రహ్లాదుడు ముఖ్యులు. శ్రీపాద శ్రీవల్లభునిగా అవతరించిన శ్రీదత్తాత్రేయుడు, తన యొక్క మూలతత్త్వమునననుసరించి, ఎన్నో బోధనలు తమ నాశ్రయించిన వారందరికీ చేసారు. వారి వాణి మానవాళికి ఎంతో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సమకూర్చడంతోబాటు విజ్ఞానాన్ని, వివేకాన్ని కూడ పెంపొందింపజేస్తుంది.

**అ) షోడశాది త్రిదక్షిణ:** మానవులు యజ్ఞయాగాది కర్మలందు 16, 116, 1116 రూపాయలను దక్షిణగా ఋషులకు, పురోహితులకు, పండితులకు ఇస్తారు. ఇది ఒక సనాతన సాంప్రదాయం. దీనిలో 1 అను పూర్ణాంకము రుద్రునకు, 11 అను రెండు పూర్ణాంకములు విష్ణువుకు, 111 అను మూడు పూర్ణాంకములు బ్రహ్మకు ప్రతీతి. ఈ 16, 116, 1116 సంఖ్యలకు సమానమగు ద్రవ్యదానమునే 'షోడశాది త్రిదక్షిణ' అంటారు. ఈ త్రిదక్షిణము దానము చేయు వారికి బ్రహ్మజ్ఞానము కలుగునని చెప్పబడినది. త్రిదక్షిణములను దానము చేయుట వలన శరీరము, ధనము, మనస్సు అను మూడింటిని దానము చేసిన వాడగును. ఈ సంఖ్యలకు సమానమైన ధనము దానము చేస్తే గత జగత్తును దానము చేసిన ఫలము లభిస్తుంది. మానవ శరీరము జగతీ ఛంధస్సుల రూపమును ప్రతీదినము మూడు వేళలలోనూ కల్గియుంటుంది. వేదములు తెలిపిన ఈ జగతీ చంధస్సులలో మొత్తం 116 వర్ణములు గలవు. కావున ద్రవ్యానికి ప్రత్యామ్నాయముగా పిండాండదానము (శరీర దానము) వలన కూడ పైన తెలిపిన ఫలమే లభిస్తుంది.

**ఆ) సంఖ్యల స్వరూపము:** శ్రీపాదుల వారు తమకిష్టమైన వారి గృహము నుండి రెండు చపాతీలను స్వీకరించెడివారు. వారు 'దో చపాతీ దేవ్ లక్ష్మీ' (అంటే గృహిణిని రెండు చపాతీలిమ్మని పిలచుట) అని పిలుచుటకు బదులు 'దో చౌపాతీ దేవ్ లక్ష్మీ' అని పిలిచెడివారు. దీనికి సంఖ్యాపరంగా ఎంతో అర్థమున్నది 'దో' అనునది రెండు సంఖ్యను 'చౌ' అనునది నాలుగు సంఖ్యను, 'పతిదేవ్' అనునది జగత్ప్రభువైన పరమేశ్వరునికి, బ్రహ్మతత్వానికి సంకేతమయిన తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. లక్ష్మీ అను శబ్దము మాయా స్వరూపమయిన ఎనిమిది సంఖ్యను సూచిస్తుంది. ఈ పిలుపును సంఖ్యా పరంగా '2498' అని తెల్సుకోవచ్చు. ఇది ఒక వింత సంఖ్య. తానే గాయత్రీ స్వరూపమనియూ, పరమాత్మ, పరాశక్తి కూడ తానేయనియు సూచించుటకు, నర్మగర్భముగా ఈ సంఖ్యలను వల్లభులు పలికేవారు. తొమ్మిది సంఖ్యను ఏ సంఖ్యతో గుణించిననూ, దాని మూల స్వరూపము మారదు అంటే $9\times2=18 \rightarrow 1+8=9$ గా అర్థం. అందువల్ల మార్పులేని తొమ్మిది

సంఖ్య బ్రహ్మతత్వమును సూచించును. ఎనిమిది అను సంఖ్య మాయా స్వరూపము. ఇదియే అనఘాతత్త్వము. ఎనిమిది సంఖ్యను వేరే సంఖ్యతో గుణించి, వచ్చిన రెండు సంఖ్యలను కలిపితే, ఆ రెండు సంఖ్యల మొత్తం ఎనిమిది కంటే ఒకటి తక్కువగా ఉంటుంది. అంటే $8\times2=16 \rightarrow 1+6=7$గా అర్థం. అంటే ఇది ఎనిమిది సంఖ్య కన్నా ఒకటి తక్కువ సమస్త సృష్టిలోని జీవరాశులలోని శక్తులను హరింపజేయు తత్త్వము జగన్మాత యందు గలదు. గొప్పవానిని గూడ చిన్నవానిగా చూపగల శక్తి మాయాస్వరూపమునకున్నది. అందువల్ల ఎనిమిది సంఖ్యను వల్లభుల వారు మాయా సంఖ్యగా పిలుచుచుండిరి. శ్రీ దత్తాత్రేయస్వామి అవతరించిన 2,498 సంవత్సరాల తరువాత శ్రీవల్లభులు ఈ భువిపై అవతరించారు. ఈ సంఖ్యను వారుపదేపదే ఉచ్చరించుటలో వారి అవతార ప్రారంభ సంవత్సరమును వారు సూచించుచున్నట్లుగా కూడా గోచరిస్తుంది.

**ఇ) గాయత్రీ మంత్రము:** గాయత్రీ మంత్రము కల్పవృక్షము వంటిది. గాయత్రీ శక్తి విశ్వవ్యాప్త శక్తి. ఆ శక్తితో సూక్ష్మ ప్రకృతి స్వాధీనమగును దాని వలన భౌతిక, మానసిక, ఆత్మకు సంబంధించిన ఆనందములన్నియు పొందవచ్చును. మానవ శరీరమందు గల వివిధ గ్రంథులయందు, వివిధ శక్తులుండును. గాయత్రీ మంత్రోచ్ఛారణము వలన ఆ శక్తులన్నియూ జాగృతమై సాధకునికి ఎంతో శక్తి, సామర్థ్యములు అన్ని రంగాలలో ప్రసాదించును. 'ఓం భూః భువః స్వః తత్ సవితుః వరేణ్యం భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచూదయాత్' అనునది గాయత్రీ మంత్ర స్వరూపం. దీనిలో 24 అక్షరాలు ఉంటాయి. అవి మన శరీరమునందలి వివిధగ్రంథులకు ప్రతీకలు. దీనిలోని గూఢార్థాన్ని గ్రహిస్తే 'ఓంకారము ఉచ్చరించుట వలన భగవంతుడున్నాడనెడి జ్ఞానమును, పరమేశ్వరునియందు నిష్ఠ కలుగును. 'భూః' అనునది ఆత్మజ్ఞానమును, 'భువః' అనునది కర్మయోగమును, స్వః అనునది సమాధి స్థితి పొందుటకు సహకరించును. 'తత్' అనునది శరీరధారికి జీవన విజ్ఞానము కలిగించుటకు, 'సవితుః' వల్ల శక్తి సముపార్జనము, 'వరేణ్యం' అనునది మానవుడు జంతు ధర్మములను వదలి దివ్యుడుగా మారుటకు ఉపకరించును. 'భర్గో' అనునది నిర్మలత్వమును, 'దేవస్య' అనునది దివ్యదృష్టిని, 'ధీమహి' అనునది సద్గుణములను పెంపొందించును. 'ధియో' అనునది వివేకమును, యోనః అనునది సంయమమును, 'ప్రచోదయాత్' అనునది సేవాభావమును పెంపొందించుటకు తోడ్పడును. ఈ కారణంగానే మునులు, ఋషులు అందరూ గంటల తరబడి గాయత్రీ అనుష్టానం చేసుకుని స్వయంసమృద్ధి సాధించారు. ఈనాటికీ గూడ ఎంతో మంది గృహస్థులు ఈ అనుష్టానం చేస్తూ గాయత్రీమాత అనుగ్రహంతో ఇహపరములతోబాటు సర్వసంపదలు పొందుచున్నారు.

**ఈ) లోకాలు, ద్వీపాల వర్ణన:** ఒకానొక సందర్భములో శ్రీవల్లభులు మానవాళికి కానరాని మహాద్భుతములైన సర్వలోకాలను, ద్వీపాలను వాటి స్థితిగతులను వివరించి ఇలా చెప్పారు. స్వర్గమునందు 88 వేల మంది గృహస్థమునులు గలరు. వారు పునారావృత్తి అంటే తిరిగి జన్మించే ధర్మము గలవారు. వారు ధర్మమును ప్రచారము చేయు నిమిత్తమై యున్నారు. పరమాత్మతేజమువలన జలము ఏర్పడి అందు అనేక కోట్ల అండము లేర్పడినవి. ఆ అండములలో మనము నివసించు బ్రహ్మాండము కూడ ఒకటి. అండము యొక్క లోపలి భాగము చీకటితో నిండియుండుటవల్ల అందున్న పరమేశ్వరుని తేజస్సు, మూర్తిత్వము నొంది వారు అనిరుద్ధుడను నామము పొందెను. చీకటిగా నున్న ఆ అండమును ప్రకాశింపజేసినందున అతడే సూర్యుడనబడెను. సత్యలోకమున నిరామయస్థానమున్నది. పాతాళములోని మూడుభాగములు గల త్రిఖండసోపానములో వసు, రుద్ర, ఆదిత్యలని పిలువబడు పిత్రుదేవతలుందురు. వారే ఈ నిరామయస్థాన సంరక్షకులు. చతుర్ముఖబ్రహ్మ కారణ బ్రహ్మలోకమున నివసించును. అది విద్యాస్థానమనియు, మూల ప్రకృతిస్థానమనియూ పేరుగాంచిన శ్రీనగరము, ఆపైన నున్నది. దానికి పై భాగమున మహా కైలాసమును, ఆపైన కారణ వైకుంఠము గలవు. పురాణపురమన్నది విద్యాధరస్థానము. తపోలోకములో అంజనావతీపురమందు సాధ్యులుందురు. జనలోకములో అంబావతీపురము నందు సనకసనందనాది ఋషులుందురు. మహార్లోకంలో జ్యోతిష్మతీపురమునందు సిద్ధాదులుందురు. సువర్లోకమని పిలువబడే స్వర్గలోకములోని అమరావతీపురమందు దేవేంద్రాది దేవతలుందురు. ఖగోళమునకు సంబంధించిన గ్రహ నక్షత్రాదులు గల భువర్లోకములోని రధంతరపురమందు విశ్వకర్మ అను దేవశిల్పి ఉండును. భూలోకమునందు రెండు భాగములు కలవు. మానవులు నివసించుదానిని భూగోళమందురు. ఇదిగాక మహా

భూమి అనుమరొకటి గలదు. మర్త్యలోకమనగా మహాభూమితో కలిసిన భూలోక, భువర్లోకములు. పాతళమనగా అతల, వితల, సుతల, రసాతల, తలాతల, మహాతల, పాతాళములనునవి కలసి పాతాళమనబడును. స్థూలముగా వీనిని స్వర్గ, మర్త్య, పాతాళములందురు. మనము నివసించుచున్న భూగోళము క్రింద మహాభూమి ఉన్నది. ఈ మహాభూమి నుండియే సూర్య, చంద్రులు ప్రకాశింతురు. ఆ మహాభూమిపై నిరంతరము వెలుగుండును. కాలనిర్ణయము లేదు. ఆ మహాభూమిపైనే సప్తసముద్రములున్నవి. రెండు జంబూద్వీపములున్నవి. ఒకటి మహా భూమిపై గలదు. మరొకటి భూగోళముపై గలదు. మహాభూమిపై గల జంబూద్వీపమందు నవఖండములున్నవి. దైవ ఖండమునందు దేవతలు, గభస్య ఖండమునందు భూతములు, పురుష ఖండమునందు కిన్నెరులు, శరభఖండము నందు సిద్ధులు, గంధర్వ ఖండము నందు గంధర్వులు, తామ్రఖండమందు రాక్షసులు, శేరుఖండము నందు యక్షులు, ఇందుఖండ మందు పన్నగులు, భరతపురమున వైవస్వతమనువు ఉండును. ఇంకా ఆ మహాభూమి యందు ప్లక్ష ద్వీపము, లవణ సముద్రము, ఇక్షుర సముద్రము, కుశద్వీపము, శౌకద్వీపము, క్రౌంచద్వీపము, శాల్మవీ ద్వీపము, పుష్కర ద్వీపము, శుద్ధ జల సముద్రము, చలాచల పర్వతము, చక్రవాక పర్వతము, తమోభూమి ఉంటాయి. ఇంతవరకే పగలు, రాత్రి అను బేధము లేకుండా సూర్యరశ్మి ఉంటుంది. అటు తర్వాత గల లోకాలోక పర్వతము దాటి సూర్యరశ్మి ప్రసరించదు. అదే అండభిత్తి అను సరిహద్దు. ఈ ద్వీపములన్నింటికీ స్వాయంభువమనువు కుమారులు అధిపతులై పాలింతురు. ఈ ద్వీపములందు చాతుర్వర్ణముల వారుందురు. మన భూగోళమందు గల భారతవర్షము, కింపురుష వర్షము, హరివర్షము, కేతుమాలా వర్షము, ఇలా వృతవర్షము. భద్రాశ్వ వర్షము, రుమ్యక వర్షము, హిరణ్యవర్షము, కురువర్షము అనునవి గలవు. భరతవర్షమునందు భారతీయులుందురు. భూగోళము నిమ్మపండువలె నుండును. మహాభూమి నివాసము పుణ్యఫలమువల్ల లభించును. స్థూలశరీరముతో పొందలేనిది. భూగోళము పుణ్యము సంపాదించుకొనుటకు అనువైన కర్మభూమి. మహాభూమిని ధాత్రి, విధాత్రి అందురు. భూగోళమును మహీ, ఉర్వి, పృథ్వి అను పేర్లతో పిలుతురు. పాతాళలోకములైన అతలమునందు పిశాచగణములు, వితలమునందు గుహ్యకులు, సుతలమునందు రాక్షసులు, రసాతలమునందు భూతములు, తలాతలమునందు యక్షులు, మహాతలమునందు పితృ దేవతలు, పాతాళమునందు పన్నగులు ఉందురు.

మహా భూమికి దిగువన ఏడు అధోలోకములు గలవు. వీనినే సప్త పాతాళములని అందురు. వానిలో వితలము నందున్న కుబేరుడు నవనిధులకు అధిపతి, కోశాధిపతి. వితలమునందలి అలకాపురములో ఇతడు నివసించును. అదే వితలమునందు మేరువుకు పశ్చిమదిశలో యోగినీపురమందు మయుడు నివసించును. ఇతడు రాక్షసులకు శిల్పి. సుతలములో బలి చక్రవర్తి మరియు వైవస్వత పురమునందు యమధర్మరాజు కొలువైయుండును. యముడు దక్షిణ దిక్కునకధిపతి. వీరి పట్టణమునకు ప్రవేశింపవలెనన్న అగ్నిహోత్రపునది దాటి వెళ్లవలయును. దానినే వైతరణీనది అంటారు. ఈ నదిని పుణ్యాత్ములు సులభముగాను, పాపాత్ములు అనేక కష్టములనుభవిస్తూ వైతరణీనది దాటగలరు. నిరుతి అను దైత్యుడు రసాతలము నందుండును. ఇతడు నైరుతి దిక్కునకు అధిపతి. తలాతలము నందలి ధనిష్టాన పురమున పిశాచగణములు గూడి భేతాళుడుండును. మహాతలములోని కైలాసనగరములో సర్వభూత గణములతో పార్వతీపతియయిన ఈశ్వరుడండును. ఈతడు ఈశాన్య దిక్కునకు అధిపతి. మహతలము పితృదేవతలకు నివాసము. పాతాళమునందు వైకుంఠ నగరము గలదు. అందులో శ్రీమన్నారాయణుడు పాతాళాసురులతోను, వాసుకి మొదలైన సర్వశ్రేష్ఠులతోనూ, శేషశాయిపై పవళించి యుండును. దీనినే శ్వేతదీప గతమైన కార్య వైకుంఠము అందురు.

ఆఖరిదైన పాతాళమునందు మూడు ఖండములతో త్రిఖండ సోపానము గలదు. ప్రధమ ఖండమందు అనంగ జీవులు, ద్వితీయ గణమందు ప్రేతగణములు, తృతీయ ఖండమునందు మరణానంతరము యాతనా శరీరముపొందిన జీవులు దుఃఖముతో నుందురు. భూలోక, భువర్లోక, సువర్లోకములు ప్రళయకాలమందు నశించును. సువర్లోకమునకు పైన మహర్లోకము కొంత నశించి కొంత నిలచియుండును. ఆపైన నుండు జనలోక, తపోలోక, సత్యలోకములు బ్రహ్మ జీవితాంతమున గాని నశింపవు. స్వర్గమనగా సువర్లోక, మహర్లోక, జనలోక, సత్యలోకములు మరియు అంధభిత్తి. ఈ విధంగా వల్లభులు మానవుల దృష్టికిగాని ఆలోచనలకు గాని అందని లోక, ద్వీప, వాటి అధిపతుల, నివాసితుల గూర్చి తెలిపారు.

**ఉ) కర్మఫలము:** శ్రీకృష్ణుడు గీతయందు కర్మఫలితములను అనుభవింపవలెనని చెప్పెనుగాని, జాగ్రదావస్థలోనే దానిని అనుభవింపమని తెలుపలేదు. ఆ కర్మలను స్వప్నావస్థలలో గూడ అనుభవింపవచ్చును. భౌతికముగా శరీరముతో అనుభవించవలసిన కొన్ని సంవత్సరముల కర్మఫలమును మానసికక్షోభవలనో, స్వప్నములలోని మానసికబాధలవలననో, కొద్ది ఘడియలలో అనుభవించి రాహిత్యమును పొందవచ్చును. సత్పురుషులకు, యోగులకు, దానధర్మములు, సేవలు చేయుటవలనను, దేవతా కైంకర్యములు చేయుటవలననూ గూడ పాపకర్మ క్షయమగును. దేవతామూర్తులు పుణ్య స్వరూపములు. వాటికి కైంకర్యములు చేయుటవలన మన పాపము వాటికి ఆపాదింపబడి, వాటి పుణ్యము మనకువచ్చును. పుణ్యమూర్తులకు దాన ధర్మములు, సేవలుచేయుట వలన కూడ ఇదే విధముగా బదలాయింపు జరుగును. సమర్థసద్గురుని ధ్యానము చేయుట వలన ధ్యానశక్తి మధ్యమమున బదలాయింపు జరుగును. సద్గురువు తన శిష్యుని నుండి సేవలనుగైకొని, ఆ సేవా మధ్యమమున శిష్యుని పాపకర్మలను తాను స్వీకరించి, తన తపఃఫలమును శిష్యునికి సంక్రమింపచేయును. పాపఫలము ఎవరో ఒకరు అనుభవింపక తప్పదు. అయితే దేవతామూర్తులు, అవతారపురుషులు మహాతేజోమూర్తులు, వారు అగ్ని స్వరూపులు కనుక, తాము స్వీకరించిన పాపకర్మములను వారు దగ్ధము కావించగలుగుదురు. వారికి మనము పత్ర, ఫల, పుష్పాదులు సమర్పించినా కూడ మన పాపకర్మములు, వారి పుణ్యరాశి పరస్పరము బదలాయింపు జరుగుచుండును. మన ఆర్తి, భక్తి, శరణాగతి ఎంత తీవ్రముగానుండిన, ఈ బదలాయింపు అంత శీఘ్రముగా జరుగుచుండును. ఒక్కొక్క పర్యాయము శ్రీపాదులు తన ఆశ్రితుల పాపకర్మములను నిర్జీవ పదార్థములైన రాళ్లు, రప్పలకు బదలాయించి, వారికి విముక్తి కలిగించేవారు.

**ఊ) పంచకన్యల గూర్చి వివరణ:** ధర్మము వేరు ధర్మ సూక్ష్మము వేరు అని పంచకన్యల వృత్తాంతము ద్వారా శ్రీవల్లభుల తెలిపిరి. అహల్య, ద్రౌపది, సీత, తార, మండోదరిలను పంచకన్యలుగా పిలుస్తారు. వారి నామస్మరణమువల్ల మహాపాపములు గూడపోవును. అహల్యను దేవేంద్రుడు మోహించెను. ఆమెను పొందవలెనని కోడిరూపము దాల్చి అర్ధరాత్రి కొక్కొరొక్కో అని కోడివలె కూసెను. అహల్య భర్త గౌతముడు వేకువఝాము అయ్యెనని భ్రమించి, అనుష్టానము కొరకై నదీ తీరమునకు పోయెను. గౌతమముని వేషమున దేవేంద్రుడు ఆశ్రమమునందు ప్రవేశించెను. కాని మహాపతివ్రత అయిన అహల్యను తాకలేకపోయెను. ఇంతలో దేవేంద్రునిలో గల దేవతాశక్తులు అతని వ్యామోహముతో కలసి, అహల్యను పోలిన స్త్రీ రూపమై అతని ముందుకు వచ్చెను. దేవేంద్రుడు ఆ మాయాఅహల్యతోనే రమించెను. తెల్లవారలేదని తెలుసుకుని ఆశ్రమానికి వెనుదిరిగి, వారిద్దరిని చూచి ఆగ్రహించి గౌతముడు శపించెను. నిజానికి మాయాఅహల్య రూపము దాల్చిన ఆమె శరీరములో జీవాణువులన్నియూ దేవేంద్రుని తీవ్రమనశ్శక్తి వలన మాత్రమే ఏర్పడెను. ఈ విషయము గ్రహించలేక శాపమిచ్చిన గౌతమునిపై అహల్య కోపించి గౌతముని తిరిగి శపించెను. ఆ శాపప్రభావమువల్ల గౌతమముని 12 సంIIలు మనసుచలించి, పిచ్చివాడై తిరుగుచూ, శివార్చన వల్ల స్వస్థుడయ్యెను. అహల్య గౌతముని కంటే కూడా ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితి గలది. అహల్య మనశ్శక్తి, శరీరము గూడ జడత్వము చెంది రాయిగా మారెను. శ్రీరాముని పాదధూళి వల్ల శాపవిమోచనము కలిగెను. అందుకే ఆమె పతివ్రత.

శాపగ్రస్తుడైన దేవేంద్రుడు అయిదురూపములతో పంచపాండవులుగా జన్మించెను. అతనికి అయిదురూపములతో పాటు అయిదు మనస్సులున్ననూ, వాటికి ఆధార భూతమైన ఆత్మ ఒక్కటే. దేవేంద్రుని భార్య అయిన శచీదేవి అయోనిజగా ద్రౌపది నామధేయముతో యజ్ఞకుండమున ఆవిర్భవించెను. అయిదు రూపములుగా యున్ననూ, దేవేంద్రుని మూల స్వరూపమొక్కటే గావున ద్రౌపది పతివ్రత. ద్రౌపది పంచభర్తృక అయిననూ శయనసుఖము పొందినది కేవలము అర్జునునితో మాత్రమే. మత్స్యయంత్రమును కొట్టి తనను గెలిచిన అర్జునుని మాత్రమే ద్రౌపది వరించింది. ధర్మరాజు పాండవులలో పెద్దవాడు. రాజనీతికి సంబంధించిన విషయములలో మంత్రివలె ద్రౌపది ధర్మరాజుకు సలహాలిచ్చెడిది. భోజన ప్రియుడైన భీముడు బద్ధకస్తుడు, ద్రౌపది భీమునితో దాసివలె ప్రవర్తించెడిది. నకులుడు కత్తియుద్ధములో నేర్పరి అతని యుద్ధ విన్యాసమునకు అనుగుణమైన భోజనపదార్థములు తయారుచేసి తల్లివలె అతనితో వ్యవహరించెడిది. సహదేవునికి భవిష్యత్తు తెలియుటవల్ల, చాల విసుగుదలను ప్రదర్శించేవాడు. అతనిపట్ల చాల సహనము వహించేది.

అర్జునునికి రంభవలె శయ్యా సుఖము నందించెడిది. అందువల్ల పంచభర్తృక అయిననూ ధర్మభంగము కాకుండా ప్రవర్తించినందువల్ల ఆమె మహా పతివ్రత.

అసలయిన సీతను అగ్నిదేవుడు తన గర్భమున దాచెను. మాయా సీతను రావణుడు లంకకు తీసుకొనిపోయెను. రావణసంహారము జరిగిన పిదప, సీత అగ్ని ప్రవేశము చేసినపుడు ఇద్దరు సీతలు బయటకు వచ్చిరి. అసలు సీత రాముని చేరెను. మాయాసీత అగ్నిలోనికి తిరిగి వెళ్లెను. కావున సీతాదేవి కూడ మహా పతివ్రత.

వృద్ధుడైన బృహస్పతి ధర్మవిరుద్ధంగా యవ్వనవతియైన తారాదేవిని వివాహమాడెను. సృష్టి నియమం ప్రకారం 27 నక్షత్రములను చుట్టి వచ్చుట చంద్రుని ధర్మము, అది గురుగ్రహ ధర్మము కాదు, ఆ విధంగా చంద్రునికి బదులు గురువు సంచరించుట ధర్మ విరుద్ధము. గురువు విధానం ధర్మ విరుద్ధము కావున, మరొక స్వరూపంలో తారాదేవి మనస్సు చంద్రునిపై నుండెను. ఆమె మనస్సులోని కోరికకు అనుగుణంగా ఆమె శరీరము నందలి జీవాణువులు స్పందించి అనేక మార్పులు చెందెను. ఈవిధముగా పరిణామస్థితి నొందిన వేరే శరీరముతో ఆమె చంద్రునితో కలసినది. అందువల్ల బృహస్పతి భార్య అయిన తారాదేవి, చంద్రుని భార్యయయిన తారాదేవి ఒకటిగాదు, కావున తారాచంద్రుల కలయిక ధర్మవిరుద్ధము కాదు. 27 నక్షత్రములను చుట్టి వచ్చే చంద్రునికి, ఆ నక్షత్రముల అభిమాన దేవతయయిన తారాదేవి చెందుట ధర్మము. ఈ ధర్మ సూక్ష్మమువల్ల ఆమె పతివ్రత.

జీవి పరిణామ దశలో అనేక జన్మములు ఎత్తు చుండును. కొన్ని జన్మలలో స్త్రీగాను, మరికొన్ని జన్మలలో పురుషుడుగాను జన్మించవచ్చును. మండోదరి ఒకానొక జన్మలో పురుషుడుగా జన్మించెను. ఆ జన్మయందు పురుషుడైన ఆమెకు ముగ్గురు భార్యలు గలరు. చంచల స్వభావముగల ఒక భార్య, దుష్ట ప్రవృత్తి గల మరొక భార్య, సజ్జన లక్షణములతో మూడో భార్య ఉండేవారు. మరు జన్మమున ఈ ముగ్గురు భార్యలు ముగ్గురు పురుషులుగా జన్మించిరి. చంచలస్వభావము గల్గిన భార్య వానరుడైన వాలిగాను, దుష్టస్వభావములు గల్గిన భార్య రావణునిగాను, మంచి లక్షణములు గల్గిన భార్య విభీషణునిగాను జన్మించిరి. పూర్మజన్మమున వీరి ముగ్గురికీ భర్తయయిన మండోదరి ఈ జన్మమున వేర్వేరు జీవాణువులతో, ఒకే ఆత్మ గలిగి వాలికి, రావణునికి, విభీషణునికి గూడ భార్యగా జన్మించింది. దీనిలో ధర్మసూక్ష్మమేమనగా వాలి భార్య తారగా ఆమె జీవాణువులు, రావణుని భార్య మండోదరిగా ఆమె జీవాణువులు, విభీషణుని పట్టపు రాణిగా ఆమె జీవాణువులు వేర్వేరుగా ఉన్నవి. కనుక ఆమె కూడ పతివ్రతయే. అందువల్ల వీరి అయిదుగురిని పతివ్రతలుగా పురాణాలు పేర్కొన్నాయి. ఈ వస్తు, ద్రవ్య, గుణ, రూప, నామ, సహితమయిన ప్రపంచంలో జీవాణువులు మారినట్లయితే స్థూలరూపం అదేవున్నా పవిత్రత లోపించిందని ఈ గాథలు తెలుపుచున్నవి.

**ఋ) శివార్చనఫలము:** శనివారము నాటి సాయంకాలమందు ప్రదోష సమయములో చేసే శివార్చన విశేషఫలములను గలుగజేయును. శనైశ్చరుడు కర్మకారుడు. గ్రహములయందు ఛాయాగ్రహములైన రాహుకేతువులలో రాహువు శనైశ్చరుని వలెనే ఫలితములనిచ్చును. కేతువు అంగారకునివలెనే ఫలితములనిచ్చును. కర్మకారకుడైన శనైశ్చరుడు కర్మసాక్షి అయిన సూర్యుని కుమారుడు. అందువలన శనివారము నాటి సాయంత్రం ఎంతో శక్తివంతమైనది. చతుర్దశీ, త్రయోదశి తిథులు రాహుగ్రహమునకు బలమైన తిథులు, శనిత్రయోదశి నాడు సాయంత్రం శివారాధన వల్ల పూర్వజన్మ కృతపాపములు సమూలముగా నశించిపోవును. శనికి అధి దేవత శివుడు కావున ఆరోజు నువ్వులనూనెతో శివునికి అభిషేకముచేసి, ఆ తరువాత నల్లని నువ్వులను బ్రాహ్మణునికి దానము నిచ్చినచో, శనిబాధ నుండి విముక్తులు కావచ్చును. శ్రీవల్లభులు అంగారకుని నక్షత్రమైన చిత్తానక్షత్రమందు జన్మించుట చేత, ఆ నక్షత్రంవున్న రోజున వల్లభుల అర్చన సర్వగ్రహ దోషములు నివారించును.

**ౠ) మానవుల ఆయువు:** మానవులు తమ ఆయువు యొక్క ప్రమాణము వంద సంవత్సరములుగా భావిస్తారు. ఇది సత్యము గాదు. బ్రహ్మదేవుడు ప్రతి జీవికి ఆయుర్దాయాన్ని శ్వాస, ప్రశ్వాసలకు అనుగుణంగా నిర్ణయిస్తాడు. అంతేగాని వయస్సు ఇన్ని సంవత్సరాలుగా నిర్ణయించడు. ఒక వ్యక్తికి బ్రహ్మదేవుడు పదికోట్ల శ్వాస, ప్రశ్వాసలు నిర్ణయిస్తే. ఆ పది కోట్ల శ్వాస, ప్రశ్వాసలు పూర్తికాగానే అతని జీవితము ముగుస్తుంది. ఆ పదికోట్ల శ్వాసలు ముగిసే నాటికి అతని

వయస్సు 40 సం॥లు కావచ్చు, లేదా 70 సం॥లు కావచ్చు లేదా 90-100 సం॥లు కావచ్చు. సాధారణంగా ప్రజలు సగటున బ్రతికే వయస్సుకి వారి శ్వాస, ప్రశ్వాసలు పూర్తి అయినట్లుగా అర్థం చేసికోవాలి. మనోచాంచల్యము గలవారు, కోపము గలవారు, వడివడిగా పరిగెత్తువారు, నిత్యము దిగులుతో జీవించువారు, దుష్టలక్షణములు గలవారు తమ యొక్క శ్వాసలను తక్కువ కాలములో ఖర్చు చేసుకొందురు. ధనములాగే శ్వాసలను ఖర్చు చేసుకోకుండా నియంత్రించుకుంటే ఎక్కువ కాలము ఆయుర్దాయము కలుగును. దీనికి యోగా ప్రక్రియలో ప్రాణయామ క్రియ ఎంతగానో తోడ్పడును. యోగులు గాలిని కుంభించి, శ్వాస శరీర అంతర్భాగములందే నియంత్రించి, ఎన్నో శ్వాసలు మిగిల్చి వారు ఎక్కువ కాలము జీవించెదరు. ఎక్కువ శ్వాసలు తీసుకునే కోతి తొందరగా మరణిస్తే, తక్కువ శ్వాసలు తీసుకునే తాబేలు దీర్ఘాయువు కల్గియుంటుంది.

**ఎ) మానవజన్మ చైతన్య పరిణామము:** సృష్టి అంతటా భగవంతుని యొక్క చైతన్యము అంతర్లీనముగానున్నది. దీనికి చైతన్య పరిణామక్రమమే ఆధారము. చైతన్య పరిణామ క్రమములో 'శిల' ప్రథమ స్థానములోనిది. దానిలోని ఆత్మ నిర్జీవ స్థితిలో నుండును. శిలలలో కూడ అనేక జాతులున్నవి. ఒకానొక శిలలోని ఆత్మ, ఆ శిలలో కొన్ని సంస్కారములను పొందుచున్నది. ఆ అనుభవముల తర్వాత ఆ ఆత్మ మరియొక జాతి శిలలో ప్రవేశించును. ఖాళీగానున్న ప్రథమశిలలో మరియొక ఆత్మ ప్రవేశించును. ఏ ఆత్మ ఏ శిలలో ఎంతకాలము ఉన్నదో తెలుసుకొనుట కేవలము యోగదృష్టి కలవారికి మాత్రమే వీలగును. ఒకానొక శిలలో ఒక ఆత్మవుండగా, ఆ శిల రెండుగా ఖండించబడినచో, ఖండించబడిన శిలలో ఒక ఆత్మవుండగా, మరియొక ఖండములో మరియొక ఆత్మవుండి కొన్ని అనుభవములను పొందును. అవియేరకమయిన అనుభవములు పొందుచున్నవో అవి వాటికే తెలియదు. అయితే శిలాస్థితిలో ఉన్నపుడు, ఆ ఆత్మ అపరిమితమైన బాధను అనుభవించును వాటికి జీవములేదు గాని బాధ, అనుభవముండును. జీవాత్మ, పరమాత్మను కలిస్తే మహానందము, జీవాత్మ, శిలలో ఉన్నప్పుడు మహాదుఃఖము కలుగును. అనగా ప్రాణములేనప్పుడు అనుభవించునది మహాదుఃఖము. ఇలా అనేక శిలలలో ఈ ఆత్మ పరిభ్రమించుచూ, లోహములోనికి ప్రవేశించును. శిలాస్థితిలోనూ, లోహస్థితిలోను నిర్జీవముగానున్న ప్రాణము చైతన్యవంతమై వృక్ష జాతులలో ప్రవేశించి, సగము జీవసహితముగా, సగము జీవరహితమైన స్థితిలో ఉండి, దాని నుండి క్రిమికీటకాదులుగా పరిణమించును. అప్పుడు చలనము కోరి ఆత్మ మత్స్య రూపము దాల్చును. ఆ తరువాత పక్షిగా, అటుపై జంతురూపముతో, పవిత్రమైన గోవుగా జన్మము పొందును. మానవులకు తల్లివలె పాలను, వృషభ రూపంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలోనూ సహకరించి పుణ్యఫలము సాధించి, ఆ తరువాత మానవజన్మనెత్తును. ఇది అంతయూ మానవ జన్మచేరువరకూ జరిగే చైతన్య పరిణామక్రమము.

**ఏ) మానసిక కాశీయాత్ర:** నేను కాశీ యాత్రకు పోవుచున్నాను. సదా కాశీలోనే నివసించెదనను భావము ఎవని యందు మనసా, వాచా, కర్మణా గలదో, ఎవడు కాశీలో ఉండవలెనని, చిత్తశుద్ధితో మానసికముగా తాపత్రయ పడుచున్నాడో వానికి కాశీవాసఫలము దక్కును. అతడు భౌతికముగా ఏదేశమందున్నా, అతని మానసిక దేశము కాశీయే అగుచున్నది. మాతృగర్భమునందు 9 నెలలు శిశువు ఉండును. కాశీ క్షేత్రమందు 9 నెలలుగాని, 9 రోజులుగాని, 9 ఘడియలు గాని ఉండిన పితృశాపములు, మాతృ గర్భదోషము తొలగిపోవును.

**ఐ) నాడీశుద్ధి:** మానవుల యొక్క శరీరములోని చైతన్య స్థాయిలనుబట్టి వారి యొక్క పరిణామ వేగముఆధారపడి యుండును. జీవుడు దివ్యాత్మగా మారి తీరవలెననెడిది విశ్వమానసము యొక్క తిరుగులేని శాసనము. ఆయా స్థాయిలను బట్టి, మానవులాచరించు యోగపద్ధతులు, మంత్రజపములు, యజ్ఞయాగాది క్రతువులు, ధర్మకార్యములు మున్నగునవి వారి శరీరములోని ఆత్మజ్యోతి యొక్క ప్రకాశము మీద ఆధారపడి యుండును. ఆప్రకాశమునకు అనుగుణముగానే నాడీశుద్ధి జరుగుచుండును. నాడీశుద్ధి స్థాయిలను బట్టి మానవులకు అనేక రకములైన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు కలుగును. ఆయా శక్తులు వికాసము జరుగునపుడు వారు చేయు ధర్మకర్మలనుబట్టి దైవానుగ్రహముండును.

**ఒ) కలుషిత వాక్కు:** మానవుడు ఏదైనా ఒక కలుషిత వాక్కును పరుషముగా ఉచ్ఛరించునపుడు, ప్రకృతిలోని సత్వ, రజ, స్తమో గుణములలో ఏదో ఒక గుణమునుగాని, రెండు గుణములనుగాని, మూడు గుణములనుగాని రెచ్చగొట్టుచున్నాడు. ఆ రెచ్చగొట్టబడిన గుణములు మంచికి దోహదము చేయని కారణమున పృధ్వి, వ్యాప, స్తేజో, వాయువు, ఆకాశముల మీద దుష్ప్రభావమును చూపుచున్నవి. ఈ పంచభూతములు దూషితములగుట వలన మొత్తము అంతయును, దూషితమై, మనిషి, మనస్సు, శరీరము, అంతరాత్మ కూడా దూషితములగుచున్నవి. తద్వారా మానవుడు పాపకర్ముడగుచున్నాడు. దాని ద్వారా దరిద్రుడగుచున్నాడు. దరిద్రమువలన తిరిగి పాపమును చేయుచున్నాడు. పాపకర్ముడగుట వలన మనస్సు, దూషితమై, దానాది పుణ్య కార్యములను చేయలేకపోవుచున్నాడు. దాని వలన తిరిగి దరిద్రుడగుచున్నాడు. దీనినుండి బయట పడాలంటేమానవుడు పరుషమైన, కలుషితమైన వాక్కులను ఉచ్ఛరించరాదు.

**ఓ) త్రికరణ శుద్ధి:** మానవుడు దరిద్రబాధల నుండి విముక్తుడు కావలెనన్ననూ లేదా ఇతరములైన పాపకర్మముల నుండి విముక్తుడు కావలెనన్ననూ మనోవాక్కాయములందు శుద్ధి కలిగి యుండవలయును. దీనినే త్రికరణ శుద్ధి అందురు. మనస్సు నందు తలచినదే వాక్కునందు రావలయును. వాక్కు నందు వచ్చినదే కర్మలోనుండవలయును. త్రికరణ శుద్ధిపొందిన మానవుడు మహానీయుడగుచున్నాడు.

మనస్సునందు తలంచునది ఒకటి, వాక్కు ద్వారా బహిర్గతమగునది మరియొకటి ఈ రెండింటికి పొంతన లేకుండా చేయునది మూడవది. దీనినే త్రికరణ శుద్ధిలేకపోవుట అందురు. అందువలన అతడు దురాత్ముడగుచున్నాడు. ఈ కలియుగములో సులభముగా తరించుటకు అనేక మార్గములున్నవి. అందులో నామస్మరణము ఎంతో సులభమైనది. భగవంతుని యొక్క నామమును నాలుకయందు పదేపదే స్మరిస్తూ ఉంటే పవిత్రమైన వాక్కులు పలుకుట అలవడును. నామమును చేయునపుడు మనస్సు దైవము మీద లగ్నమయితే, అంతకంటే అదృష్టము మరియొకటి యుండదు. దానితో మనస్సు గూడ ఎంతో పవిత్రమగును. తద్వారా పవిత్రమైన కర్మలను చేయుటకు ప్రేరణ కలుగును.

సత్కర్మ వలన సుఖము, దుష్కర్మ వలన దుఃఖము అనివార్యమగును. పూర్వజన్మ బంధనములు మనలను వెంటాడి వేధించుచున్ననూ, సద్గురుని కరుణవలన యోగకాలమేర్పడును. ఆ కాలము వచ్చినపుడు సద్గ్రంధ పఠనము చేయవలెనని తలంపు, గురువాణి వినవలెనని ఆర్ద్రత కలిగి, తద్వారా ఏ ప్రదేశములో ఎప్పుడూ ఆ కర్మతీరిపోవలెనో, ఆయోగ దేశము నందు ఆకర్మ తీరిపోవును అందువల్లనే నీవు సశరీరుడైన దత్తుని యందు విశ్వాసముంచిన యెడల, 'నీ సంస్కారముల న్నింటినీ నాశరీరముపైకి ఆకర్షించి నీకు కర్మక్షయము చేయగలనని' శ్రీవల్లభులు జనావళికి అభయం ఇచ్చారు.

**ఔ) అరుంధతి వశిష్ఠుల సంబంధము:** వశిష్ఠ గోత్రమునకు చెందిన నరసింహవర్మకు అరుంధతీ వశిష్ఠుల వృత్తాంతము ఈ క్రిందివిధంగా శ్రీవల్లభులు వివరించెను. పూర్వము వశిష్ఠుడు వేయి సంవత్సరములు తపమాచరించెను. ఆ సమయమున అక్షమాల అను ఛంఢాల కన్యక వశిష్ఠునకు ఎన్నో ఉపచారములను చేసెను. ఆ మహర్షి ఆమె చేసిన సపర్యలకు సంతుష్ఠుడై ఏదైనా వరము కోరుకొమ్మనెను. ఆమె తనకు వశిష్ఠులవారినే భర్తగా పొందవలెనన్న కోరికగలదని తెలిపెను. నేను బ్రాహ్మణుడను, నీవు ఛంఢాల జాతికి చెందిన స్త్రీవి, మన మధ్య వివాహ మెట్లు కుదురునని వశిష్ఠులు ఆ స్త్రీని ప్రశ్నించిరి. అందులకా స్త్రీ వరము కోరుకోమ్మని అడుగగా కోరుకుంటిని, మాటపై నిలచుట మీ ధర్మమని లేదా మీ ఇష్టమని అనెను. ఇచ్చిన మాటను తప్పితే వాగ్దోష భంగము కల్గి, పాపము తగులునని ఆ మహర్షి భయపడి, నీ దేహమును నా ఇష్టానుసారము చేసుకొనుట నీకు సమ్మతమేనా? అని అడిగెను. దానికి ఆమె అంగీకరించెను. వశిష్ఠుడు ఆమెను భస్మము చేసి తిరిగి బ్రతికించెను. ఈ విధముగా ఏడుసార్లు చేయగా, ఆమె యొక్క గత జాతి దోషమంతయూపోయి, పరిశుద్ధురాల య్యెను. అంత ఆమెను వశిష్ఠుడు వివాహమాడెను. తన భర్తచేయుచున్న కర్మలో ఇసుమంత పనిని కూడా వద్దని అడ్డుపెట్టని కారణంగా ఆమె అరుంధతి అను పేరుతో ప్రసిద్ధినొందెను. అందులకే ఆమె మహాపతివ్రతగా పరిగణించబడినది.

శూద్రస్త్రీని వివాహమాడిన బ్రాహ్మణునివలన పుట్టిన కుమారునికి ఏడవ జన్మమున ఉపనయనము చేసి బ్రాహ్మణ జాతిలో కలుపుకొనవచ్చును. ఏదిఏమైన చాతుర్వర్ణములవారు వారివారి గుణకర్మ విభాగములననుసరించి, నడచుకొనుట శ్రేయస్కరమని వల్లభులు తెలిపిరి.

**అం) లోపాముద్ర అగస్త్యుల చరిత్ర:** ఒకసారి వల్లభులు తమ శిష్యులకు దశమహావిద్యల గూర్చి వివరించుచూ, శ్రీ విద్యోపాసనము అత్యంత శ్రేష్ఠమైనదని తెలిపారు. పూర్వకాలమున హయగ్రీవుని కృపవలన అగస్త్యుడు శ్రీవిద్యను గ్రహించెను. అతడు ఆ శ్రీవిద్యను తన సహధర్మచారిణియైన లోపాముద్రాదేవికి తెలిపియుండెను. అయితే లోపాముద్రాదేవి ఆ శ్రీవిద్యలో నిగూఢమైన అంతరార్థములను గ్రహించి, తిరిగి వాటిని అగస్త్యునకు వివరించెను. అందువలన ఈ భార్యాభర్తలు కడువిచిత్రముగా ఒకరికి ఒకరు గురువులైరి.

విదర్భరాజుకు సంతానము లేదు. అతడు అగస్త్యమహామునిని దర్శించి అతనికి సంతానము అనుగ్రహించమని కోరెను. అగస్త్యుడు తనతపఃశక్తిచే, విదర్భరాజుకు సంతానము అనుగ్రహించగా, ఆ రాజుకు ఒక కుమార్తె కలిగెను. వారు ఆమెకు లోపాముద్ర అని పేరు పెట్టిరి. ఆమె పెరిగి, పెద్దదై యుక్తవయస్సురాలయ్యెను. ఆమెను చూసి అగస్త్యుడు మోహించి, విధర్భరాజుతో ఆమెతో తన వివాహము జరిపించమని కోరెను. అంత విదర్భరాజు వృద్ధుడైన అగస్త్యునితో యవ్వన యువతియైన తన కుమార్తె నిచ్చి, వివాహము చేయుటకు ఇష్టంలేక, మునిమాట కాదన్నచో శాపమునకు గురికావలయునని బాధపడుచూ, సంకటస్థితిలో పడెను. తండ్రి విచారమును అర్థం చేసుకున్న లోపాముద్ర, తాను అగస్త్యుని కొరకే జన్మించానని, అతనినే వివాహమాడెదనని తెలుపగా, రాజు వారికి వివాహము జరిపించెను. వివాహమైన పిదప లోపాముద్ర, రాజకన్యక దుస్తులను విసర్జించి, నార చీరలు ధరించి భర్తతో తపోభూమికి వెళ్లెను. అప్పుడు ఆమెకు అగస్త్యుడు శ్రీవిద్యను బోధించెను. కొంతకాలమునకు ఆమె పొందుతో సంసారము చేయవలెనని కోరిక గలదని అగస్త్యుడు తన భార్యకు తెలిపెను. అంత ఆమె తాను శ్రీవిద్యగ్రహించి, తద్వారా లలితా రూపమును ఉపాసించుచూ, తాను లలితా స్వరూపిణిగావున్నానని, కావున యవ్వనవంతుడైన శివునిగా మార్పు చెందినచో తన పొందు లభించునని తెలిపెను. అగస్త్యుడు ఘోర తపమాచరించి, శివ స్వరూపమును ధరించి, యవ్వనవంతుడై, తన భార్య దగ్గరకు వచ్చి, తిరిగి ఆమె పొందుకోరెను. అప్పుడు ఆమె తన భర్తతో రాచరికము, ధన సంపద, భోగభాగ్యాలతో తూలతూగుతూ జన్మించిన తన పొందుకోరాలంటే, తన భర్త కూడా అంతే స్థాయిలో పట్టు వస్త్రములు, భోగభాగ్యములు, కలిగియుండాలని, అవి సంపాదించుకునివస్తే తనకెట్టి అభ్యంతరము లేదని తెలిపెను.

అప్పుడు అగస్త్యుడు విశేషధన సంపదగల్గిన ఇల్వలుడు అను రాక్షసుని కడకేగి ధన సంపద కోరెను. తన ఆతిథ్యము స్వీకరించిన పిదప, కావలసిన ధనరాసులను ఇత్తునని ఆ రాక్షసుడు తెలిపెను. ఇల్వలునికి, వాతాపి అను సోదరుడుగలడు. వీరిద్దరూ మాయోపాయముతో అతిధులను వధించి, ఆ నరమాంసమును భుజించుచుండిరి. అగస్త్యునిని గూడా అట్లే భుజించవలయునని పధకముపన్నిరి. ఆ పధకం ప్రకారం, వాతాపి ముందుగా మేక రూపము దాల్చును. అతని సోదరుడు ఆ మేకను చంపి, ఆ మాంసముతో ఆహారము తయారుచేయును. ఆ మేక మాంసముతో వండిన ఆహారము అతిధి ఆరగించగానే, వాతాపీ బయటకు రా అని ఇల్వలుడు పిలుచును. తన రాక్షసమాయచే అతిథి పొట్టచీల్చుకుని, వాతాపి బయటకువచ్చును. అతిథి మరణించును. అంత మరణించిన అతిధిని వారిరువురూ భుజించెడివారు. ఆ విధముగానే అగస్త్యునికి మేక మాంసమును ఇల్వలుడు వడ్డించెను. ఆ మేక మాంసమును, అగస్త్యుడు భుజించి, వెంటనే తనతపఃశక్తిచే, "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" అంటూ తన పొట్టను నిమురుకోగానే, వారి కడుపులోనున్న వాతాపి, జీర్ణమైపోయి, తన రాక్షసశక్తిని కోల్పోయి మరణించెను. ఇల్వలుడు వాతాపిని బయటకు రమ్మని ఎన్నిసార్లు పిలిచినా, అతడు రాలేదు. అతడు మరణించినాడని తెలుసుకుని, ఇల్వలుడు అగస్త్యుని తనను కాపాడమని శరణుజొచ్చెను. తన ధనరాశులన్నీ అగస్త్యునికిచ్చెను. ఆ ధనరాశులను లోపాముద్రాదేవికిచ్చి ఆమె కోరిక తీర్చి, భోగభాగ్యాలను చేజిక్కించుకొని, ఆమెతో కాపురం చేసి, యోగ్యమయిన సంతానమును అగస్త్యుడు పొందెను.

అగస్త్యుడు ఎంతో గొప్పవాడు. ఒకసారి సప్తసముద్రములలోని నీటినంతటినీ తన కమండలములోనికి ఆకర్షించి త్రాగివేసెను. మరొకసారి వింధ్య పర్వతములయొక్క గర్వమణచెను. అతడే 'తమిళ' భాషను కనుగొనెను. తాము కల్కి అవతారము దాల్చునపుడు, అగస్త్యుడు ఒక గురువు రూపము దాల్చునని తమ శిష్యులకు వల్లభులు తెలిపిరి.

**అః) నవనాధులు:** ఒకసారి శంకరభట్టు శ్రీవల్లభులవారిని నవనాధులను సిద్ధయోగుల గూర్చి వివరింపమని కోరెను. నవనాధుల పేరు వినగానే శ్రీవల్లభుల రెండుకళ్లనుండి అమృతవృష్టి ప్రవాహ రూపముగా బయల్వెడలినది. వారి

యెడ శ్రీవల్లభులవారికి ఎంతో ప్రేమ చైతన్యము గలదు. వారి గూర్చి వల్లభులు ఈ విధముగా తెలిపిరి. ఋషభ చక్రవర్తికి నూర్గురు కుమారులు గలరు. వారిలో నారాయణాంశసంభూతులైన తొమ్మిదిమందిని నవనారాయణులందురు. ఈ నవనారాయణులనే నవకృష్ణులని కూడా అందురు. వారు 1. కవి, 2. హరి, 3. అంతరిక్షుడు, 4. ప్రబుద్ధుడు, 5. పిప్పలాయనుడు, 6. అవిర్హోత్రుడు, 7. ద్రుమీళుడు, 8. చమసుడు, 9. కరభాజనుడు. వీరందరూ అవధూత స్థితిలోనుండు సిద్ధ పురుషులు. వల్లభులవారి ఆజ్ఞననుసరించి, కృష్ణావతారములో చేసిన వాగ్దానము ప్రకారము, ధర్మ సంస్థాపన కార్యమును నిర్వహించుటకు నవనాథులుగా వారు ఈ భూమి మీద అవతరించిరి. కవియనువాడు మత్స్యేంద్రునిగా, హరియనువాడు గోరక్షకుడుగా, అంతరిక్షుడు అనువాడు జాలంధరునిగా, ప్రభుద్ధుడయనువాడు కానీఫాగా, పిప్పలాయనుడు అనువాడు చర్పటునాథునిగా, అదిర్హోత్రుడుయనువాడు నాగేశనాథునిగా, ద్రుమీళుడు అనువాడు భర్తీరీనాథుడుగా, చమసుడు అనువాడు రేవణనాథుడుగా మరియు కరభాజనుడనువాడు గహనీనాథుడను పేర్లతో జన్మించిరి. వీరు జన్మించిన విధానం ఎంతో ఆశ్చర్యంగా, వింతగా ఉంటుంది. మత్స్య గర్భం నుండి మత్స్యేంద్రుడు, ఆవుపేడ కుప్ప నుండి గోరక్షనాథుడు, భిక్షా పాత్ర నుండి భర్తరీనాథుడు, ఆడ ఏనుగు చెవి నుండి కానీఫానాథుడు, నర్మదానది నుండి రేవణనాథుడు, గంగానది నుండి చర్పటునాథుడు, నాగసర్పం నుండి నాగనాథుడు, యజ్ఞ కుండము నందుండి జాలంధరుడు, సంజీవినీ మంత్రప్రభావముచే బొమ్మ నుండి గహనీనాథుడు జన్మించిరి. శ్రీకృష్ణుని ఆదేశానుసారము ఈ నవకృష్ణులు మందర పర్వతమున తమస్థూలశరీరములను సమాధి చేసి, తమతమ అంశల చేత భూలోకమున నవనాథులుగా అవతరించి ధర్మ సంస్థాపనా కార్యక్రమములో పాలు పంచుకొనిరి. వీరందరూ దత్తాంశతో జన్మించిన గురువులే.

వీరందరిలోను గోరక్షుడను వాడు గోరక్షనాథునిగా, సుప్రసిద్ధుడైనాడు. ఈ గోరక్షనాథునికి దత్తాత్రేయుడు దత్తావధూతగా దర్శనమిచ్చారని, ఆయిద్దరికీ మహాద్భుతమైన సంవాదం జరిగిందనీ, నాథ సాంప్రదాయానికి చెందిన ముఖ్య గ్రంథాలలో ఒకటైన 'గోరక్షవాణి' తెలుపుతున్నది. అంతేగాక శ్రీదత్తాత్రేయుడే 'అవధూతగీత' మరియు 'శ్రీగురుగీత' స్వయంగా గోరక్షనాథునికి బోధించారు. అందుకే ఈ నాథ సంప్రదాయానికి శ్రీదత్తాత్రేయుడు పరమగురువు. గోరక్షనాథుని అనుయాయులే నేపాల్ దేశమందు ఉన్నారు. శ్రీపాదవల్లభుల జాతక ప్రతి శుక్రనాడీ గ్రంథమున్నది. అది నేపాల్ దేశము నుండి కాలాంతరమున పీఠికాపురము చేరును. ప్రతిరోజూ వీరి నామములు స్మరించినచో, పాపకర్మలు తొలగి శుభములు చేకూరును.

క్రీస్తుశకము 15వ శతాబ్దానికి చెందిన గౌరనామాత్యుడు 'నవనాథ చరిత్ర' అను గ్రంథం వ్రాసి, శ్రీశైల మల్లిఖార్జునునికి అంకితం ఇచ్చాడు. నాథ సంప్రదాయం తెలుగు వారికి అంతగా పరిచయంలేని శైవమతశాఖ. ఇది ఇతర మతాలకు కూడా ప్రాకిన ఒక తాంత్రిక శాఖ. ఈ సంప్రదాయంలో రసవాదం, కాయసిద్ధి, వయస్తంభన మొదలగు విషయాలుంటాయి. శ్రీచక్రంలోని నవవరణలకు నవనాథులే గురువులు. వీరు రుద్రాక్షలు, విభూతి, త్రిశూలం ధరించి, తత్త్వానికంటే సాధనకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, యోగమార్గంలో సంచరిస్తారు. నవనాథులలో గోరక్షకనాథుడు, సిద్ధ నాగార్జునుడు అను ఇరువురికి మాత్రమే ఆంధ్రదేశముతో అనుబంధం ఉంది. వారు ఆంధ్రరాష్ట్రమంతా పర్యటించి శివభక్తిని ప్రజలలో ప్రచారం చేశారు. మత్స్యేంద్ర నాథుడు నాథ సంప్రదాయానికి ఆద్యుడు.

నేపాల్‌లో వీరిని విశేషంగా అర్చిస్తారు. నేపాల్ ప్రభుత్వం వీరిపై భక్తికి సూచనగా నేపాల్ రాజు కిరీటంపై గోరఖ్‌నాథుని పాదుకలు, రాజముద్రపై ఆయన పేరు కూడ కలదు.

వీరు తాము దత్తాత్రేయుని శిష్యులుగా తెలుపుచున్ననూ, శ్రీదత్తాత్రేయునికి 16 అవతారాలతోపాటుగా మరో తొమ్మిది అవతారాలుగలవని, వారే నవనాథులని దత్తభక్తుల విశ్వాసం.

**క) కృష్ణ నిర్యాణం:** ఒకసారి వల్లభుల భక్తుడైన తిరుమలదాసు, శంకరభట్టుకు శ్రీవల్లభుల లీలలను వివరిస్తూ ఉండగా నైవేద్యముగా ఉంచబడిన శనగలు ఇనుపలోహపు ఖండములుగా మారిపోయినవి. ఆ లోహపు ఖండములన్నీయూ, ఆశ్చర్యముగొల్పునట్లుగా 'శ్రీపాదరాజంశరణం ప్రపద్యే' అను తెలుగు వాక్యముగా రూపుదిద్దుకున్నవి. ఆ లోహపు ఖండముపై తెల్లని పత్రము కానవచ్చినది. ఆ పత్రముపై ఈ రకంగా లిఖింపబడియున్నది.

"శ్రీ కృష్ణ నిర్యాణము క్రీస్తు పూర్వము 3102వ సంవత్సరంలో ఆంగ్ల మాసమైన ఫిబ్రవరి నెల, 18వ తేదీ రాత్రి సమయం 7 గంటల, 27 నిమిషాల, 30 సెకండ్లకు ప్రమాది నామసంవత్సరం చైత్రశుద్ధ పాడ్యమి శుక్రవారం నాడు, అశ్వనీ నక్షత్రమునందు జరిగెనని లిఖించబడియున్నది." శ్రీకృష్ణ నిర్యాణాంతరము కలి ప్రవేశించినది. ఇది శ్రీవల్లభుల వారి అదృశ్యవాణిగా వారు గ్రహించిరి. భవిష్యత్తులో అటువంటి తెల్లని పత్రము (కాగితము)లపై వల్లభ చరిత్ర జనులకు చేరునని తెలుపుటకు తెల్లని పత్రము సాక్షాత్కరించినది. ఈ అద్భుత సంఘటన శ్రీవల్లభుల వారి లీలగా వారిరువురూ తలపోసిరి.

అంత వారిరువురూ శ్రీపాదులవారిని ప్రార్థింపగా ఆ లోహపు ఖండములన్నియూ తిరిగి శనగలుగా మారిపోయినవి. దీనికి అసలు కారణము శంకరభట్టుకు వల్లభులు దత్తులు అవునా? కాదా? అనే అనుమానము కలదు. దానిని నిరూపణము మరియు సందేహ నివృత్తి చేసుకొనుటకు కృష్ణ నిర్యాణము గూర్చి శంకరభట్టు మనమున వల్లభుని ప్రశ్నించెను. అందుకే శ్రీకృష్ణ నిర్యాణమును వల్లభులు అతనికి ఎరుకపరచిరి. అనసూయామాత లోహపు గుళ్లను శనగలు చేసినది. ఆ క్రమంలోనే వల్లభులు శనగలను లోహపు గుళ్లుగామార్చి, శంకరభట్టుకు గల గురుగ్రహ దోషము పోగొట్టిరి. తద్వారా వారు దత్తునిగా నిరూపించుకొనిరి.

**ఖ) బ్రహ్మకమలాలు:** దివ్యలోకంలోని బ్రహ్మ కమలాలకు ప్రతిగా, హిమాలయాలలో 12 వేల అడుగుల ఎత్తున బ్రహ్మ కమలాలుంటాయి. సంవత్సరానికి ఒకసారి మాత్రమే అర్థరాత్రి సమయంలో ఇవి వికసిస్తాయి. ఇవి వికసించేటప్పుడు సుగంధ సువాసనలతో ఆ ప్రాంతమంతా ఎంతో పరిమళమై నిండిపోతుంది. బ్రహ్మకమలం యొక్క దర్శనం వల్ల సమస్త పాపాలు నశించి, యోగ విఘ్నాలు, పాపములు అంతరించిపోయి, తాపసులు యోగ మార్గంలో ఎంతో ఉన్నతిని పొందుతారు. శరత్కాలం నుండి వసంతకాలం వరకూ ఈ కమలాలన్నీ మంచులో కూరుకుని పోయివుంటాయి. గ్రీష్మకాలమంతా వికాస ప్రక్రియ జరుగుతుంది. బ్రహ్మకమలాలు అమరనాథ్ హిమలింగ దర్శనం జరిగే శ్రావణ శుద్ధ పూర్ణిమ ప్రాంతంలో అర్థరాత్రి సమయంలో పూర్ణవికాశం చెందుతాయి. శ్రీమహావిష్ణువు సదాశివుని ఈ బ్రహ్మ కమలాలతోనే పూజిస్తాడు. శ్రీమహా విష్ణువు నాభి కమలం గూడా ఈ బ్రహ్మకమలమే. ఈ కమలములతో శ్రీదత్తుని అర్చించిన ఐహికాముష్మిక ఐశ్వర్యము సిద్ధించును. ఇది ఒక అద్భుత ప్రక్రియ. దీనిని యోగులు, మహాత్ములు హిమాలయములలో ఎంతోకాలంగా తపమాచరించువారు దర్శించి తరింతురు.

**గ) కలియుగాంతము:** నదీనదములు పొంగి, అపార నష్టము కలిగి, భూమి నిరంతరము ప్రళయ, సదృశ భూకంపములతో గడగడలాడిపోతూ, సూర్యచంద్రులు గతులు తప్పువేళ, పట్టపగలే కారు చీకట్లు క్రమ్మి, సూర్యుడు కనబడకుండాపోయి, ఆకాశమునందు భయంకర తోక చుక్కలు కనిపించుటతో ఈ కలియుంగాతపు లక్షణములు మొదలగునని ఆ సంవత్సరంలో వచ్చే అయ్యప్ప కూడ ఆ సంవత్సరం శబరిమలకు రాదు అని శ్రీవల్లభులు పేర్కొన్నారు.

ఈ విధంగా శ్రీవల్లభులు తమ అద్భుత వాణి ద్వారా ఎన్నో ఆశక్తికరమగు విషయములను భక్తులకు, ఆశ్రితులకు యెరింగించేవారు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-11

# శ్రీవల్లభుల ఆధ్యాత్మిక బోధనా తీరం-కురవపురం

శ్రీపాద శ్రీవల్లభులు తమ దేశాటనలో భాగంగా నాలుగు నెలలు శ్రీశైలంలో ఉన్న పిదప వారి ప్రవాస దినములు ఆ క్షేత్రమునందు పూర్తయినవని, వారి మనోఫలకములో సంకేతములు రాగా, వారు ఆ క్షేత్రమును విడచి, మరొక క్షేత్రమునకు వెళ్లవలయునని నిశ్చయించుకొనిరి. అచ్చట వారి ప్రియతమ శిష్యుడైన నిర్మలానంద బ్రహ్మచారిని పిలచి, అతనితో కురవపురము అతిపురాతనమైన తపోభూమి. అచ్చట నా దివ్యసంకల్పమునకు సమయం ఆసన్నమైనది. ముందుగా భీమా-కృష్ణా నదుల సంగమమునకు చేరి, శ్రీ భీమేశ్వరుని దర్శించి, తదుపరి కురువపురమందు నా తపోరాధనను కొనసాగించుచూ, అచ్చటనే ఎల్లకాలము మరొక మజిలీ లేకుండా స్థిరముగా నుందునని శ్రీవల్లభులు తెలిపారు. శ్రీ స్వామివారి నిర్ణయముపట్ల విస్మయము చెందిన బ్రహ్మచారి, వారి వియోగము తట్టుకోలేనని, శ్రీశైలముగూడ ఆధ్యాత్మికంగా ఎంతో పవిత్రమైన గొప్ప పుణ్యక్షేత్రమని, కావున శ్రీశైలమందే ఉండమని పదేపదే ప్రార్థించిననూ, స్వామి దానికి అంగీకరించక బ్రహ్మచారికి మంగళ ఆశీర్వాదములు పలికి శ్రీశైల క్షేత్రము నుండి తమ యోగమాయచే అంతర్ధానమైరి.

శ్రీవల్లభులు శ్రీశైలం నుండి భీమా-కృష్ణా నదుల సంగమమునకు చేరుకొనిరి. ఆ సంగమానికి నివృత్తి సంగమమని శ్రీవల్లభులు నామకరణం చేశారు. అచ్చటనే సాయం సంధ్యవేళ స్నానాదికములు పూర్తిచేసుకుని శ్రీ భీమేశ్వరలింగమును ప్రదోష సమయములో దర్శించిరి. ఈ నివృత్తి సంగమస్థాన ప్రాంతమంతయు పంచదేవపహాడ్ అను గ్రామమునకు కొద్ది దూరములో ఉన్నది. భీమేశ్వరలింగము దర్శనానంతరము, వారు నివృత్తి సంగమములో ఒకరాతిపై అనుష్టానము చేసుకొనుటకు సంకల్పించగానే, ఆ రాతిపై ఒక పులిచర్మము వారు ఆశీనులగుటకు అప్రయత్నముగా వచ్చి చేరినది. వారు ఆ పులిచర్మము (వ్యాఘ్రజినము)పై కూర్చుండగానే, ఆ పవిత్ర సంగమ నదీతీరాన గల శిలల, వృక్షముల రూపంలో తపమాచరించుచున్న అనేకమంది ఋషులు, యోగులు, తమ ఋషి రూపములు ధరించి శ్రీపాద శ్రీవల్లభ ప్రభో! జయము జయము అంటూ హర్షధ్వానాలు చేయుచూ వారికి నమస్కరించిరి. వారందరికీ శ్రీవల్లభులు తమ అభినందనలు తెలుపుతూ, కలి ప్రభావము తగ్గించి, మానవులను సన్మార్గములో పెట్టగలశక్తి, ఒక్క సద్గురువులకే గలదని, కావున మానవులలో తమ అదృశ్యశక్తితో గురు భక్తికి ప్రేరణ కల్పించి, వారిని తరింపజేయమని తెలిపారు. అంత వారందరూ వల్లభుల వార్కి నమస్కరించి తమ నిజరూపములు ధరించి, అంతర్ధానమై తపోనిష్ఠలో నిమగ్నమైనారు. స్వామివారు కూడ అనుష్టానములోనికి వెళ్లారు.

ఆ రాత్రికి సంగమమందే గడిపి, మర్నాడు బ్రహ్మీముహూర్తంలో శ్రీవల్లభులు తమ స్నాన, అనుష్టానములు ముగించుకొని, ఆ సమీపమునందున్న 'కృష్ణ' అను పేరుగల గ్రామమునకు వెళ్లారు. కృష్ణానదీ తీరమందు గల ఈ గ్రామమునందు అనుష్టానపరులైన బ్రాహ్మణులు అనేకులు నివాసమేర్పరచుకొన్నారు. ఆ గ్రామమందు భిక్షకై ఒక బ్రాహ్మణుని ఇంటికి వెళ్లి, 'హరహర మహాదేవ శంభో శంకర' అనుచూ శ్రీవల్లభులు శివనామమును ఉచ్చరించారు. ఆ ఇంటి బ్రాహ్మణుడు బాలయతిలోనున్న దివ్యదైవత్వతేజస్సు గ్రహించి, ఇంటిలోనికి ఆహ్వానించి, అర్ఘ్య, పాద్య ఆసనములొసంగి, వారిని ఆనాడు తన ఆతిధ్యము స్వీకరింపవలసినదిగా కోరెను. ఆనాటి సాయంత్రం తోటి బ్రాహ్మణులను ఆహ్వానించి, శ్రీవల్లభుల అనుమతితో, వారియింట సత్సంగము ఏర్పాటుచేసెను. ఆ సత్సంగమందు శ్రీవల్లభులు ప్రసంగిస్తూ ధర్మార్ధ కామ్య మోక్షాలను నాలుగింటిని ప్రతీ మానవుడు తప్పనిసరిగా సాధించాలని, తల్లి గర్భమందున్నప్పుడు శిశువు శ్రీమన్నారాయణుని యొక్క పది అవతారాల ప్రతిభను, ఒక్కొక్క నెలలో ఒక్కొక్క అవతార అనుభవాన్ని, రుచి చూస్తూ, పరమాత్ముని నుండి జ్ఞానం పొందుతూ, సన్మార్గం వైపు నడవాలని తలపోస్తూ, తనకు ఈ మరో జన్మ కలుగుతున్నందుకు చింతిస్తూ ఉంటాడని, కాని కలి ప్రభావం వల్ల భూమిపై పడగానే తల్లి గర్భంలో ఉండగా పరమాత్మ ప్రసాదించిన జ్ఞానం

అంతా శూన్యమై, భూమ్యాకర్షణ శక్తికి లోనై లౌకిక వాదమనే మాయలో పడతాడని తెలిపారు. అందువల్ల పుట్టిన ప్రతి శిశువుకూ జాతకర్మ చేయించి, నామకరణం చేసి, ఎలా శుద్ధిచేసి పవిత్రుని చేయుచున్నారో, అదేవిధంగా మరణించిన వారికి గూడ అపరకర్మలు విధిగా చేయించి, ఆయా జీవులకు సద్గతులను కలిగించాలని, బ్రాహ్మణ శ్రేష్ఠులకు ఉద్బోధించారు. ఆయా కర్మల యొక్క అర్థాన్ని కూలంకషంగా తెలుసుకుంటే ఆ వివేకముతో వైరాగ్యము గూర్చి తెలియునని, అదియే జ్ఞానమార్గమని కూడ తెలిపారు. ఇంత చిన్నబాలుడు సత్సంగమందు చెప్పిన జ్ఞానమార్గాన్ని ఆ పండితులందరూ అభినందిస్తూ, వారివద్ద ఆశీర్వచనములు పొంది, ఇండ్లకరిగారు.

ఆ మరునాటి ఉదయమే స్వామి స్నాన, తప, అనుష్టానములు ముగించుకొని నివృత్తి సంగమం నుండి కృష్ణానది ఆవలి ఒడ్డున గల కురువపురం చేరారు. వారు నీటిపై నడుస్తూ కృష్ణానదిని దాటుతున్న సమయంలో, కృష్ణమ్మ తల్లి తన అన్నగారి పాదములకు కమలసేవగా ప్రతీ అడుగు క్రింద ఒక్కొక్క కమలమును ఉద్భవింపచేసింది. అలా కమలములపై అడుగులు వేస్తూ శ్రీవల్లభులు కురువపురం చేరారు. అందుకే వల్లభులకు కమలములతో అర్చన అంటే ఎంతో ప్రీతి. ఆ కారణంగా వారిని కమలార్చన ప్రియుడుగా పేర్కొంటారు.

మహోన్నత ఆధ్యాత్మిక, తపోభూమియైన కురువపురమందు ఎంతోమంది మహా, మహా మహిమాన్వితులు వృక్ష, శిలా రూపాలతోబాటు, ఋషులుగా కూడ తపోనిష్టలో ఎన్నో సంవత్సరాలుగా ఉన్నారు. వారందరూ తమ తపోశక్తితో, ఆ ప్రాంతానికి, శ్రీవల్లభులు అరుదెంచుచున్నారని తెలుసుకుని ఎంతో ఆనందముతో వారి నిజరూపములు ధరించి, వారి దివ్యమంగళ స్వరూపమును వీక్షించవలెనన్న, ఆతృతతో, కృష్ణానదీ తీరమందు నిలచి వారి రాకకై ఎదురు చూడసాగారు. స్వామివారు రాగానే విశ్రమించుటకు ఒక వృక్షము క్రింద ఒక పెద్ద రాతిఫలకము ఏర్పాటుచేసినారు. ఇంతలో అందరికీ ఆశ్చర్యము గొలుపునట్లు, ఆ రాతి శిలాఫలకముపై ఒక పులిచర్మము ప్రత్యక్షమై ఆ ఫలకముపై పరచబడినది.ఆ దివ్య సంకేతము, వారి రాకను తెలియజేయుచున్నదని గ్రహించిన ఆ మహర్షులందరూ, జై గురుదత్తా! జై శ్రీవల్లభా అంటూ జయ జయ ధ్వానములు చేయసాగిరి. అంతలోనే స్వామి, ఆ పులిచర్మముపై ప్రత్యక్షమై ఆశీనులైరి. ఆ ఋషిపుంగవులందరూ వారి పాదాలను కృష్ణాజలాలతో కడిగి, పుష్పాలను వారి పాదములపై వేస్తూ, స్వామికి నమస్కరించి, వారిని స్తుతిస్తూ ఆహ్వానం పలికారు. వారందరికీ మంగళ ఆశీర్వాదాలు చేస్తూ, స్వామి వారితో మీ నిరంతర తపోశక్తివల్ల ఈ ప్రాంతమంతా ఎంతో పవిత్రతను సంతరించుకున్నదని, అదృశ్యరూపములోనున్న మీరు, ఇచ్చటకు అరుదెంచు మానవుల మనోభావములను శుద్ధిచేసి వారి యందు సద్భావనను ప్రేరణ కల్గించమని, వారిలో జ్ఞానము కూడ కల్గించి, లోకకల్యాణానికి పాటుపడవలసిందిగా బోధించిరి. అంత ఆ మహాత్ములు వల్లభులకు మరోసారి నమస్కరించి అంతర్ధానమై వారి వారి స్థానములకు వెళ్లిపోయారు.

ఈ కురువపురాన్నే పూర్వము కురుంగడ్డ అనే పేరుతో పిలిచెడివారు. కౌరవపాండవుల వంశానికి మూల పురుషుడైన 'కురు' మహారాజుకు జ్ఞానోపదేశమయిన ప్రదేశమే, ఆ రాజు పేరుతో కురుంగడ్డగా ప్రసిద్ధిచెందినది.

మరునాడు ఉదయం స్వామి కురువపురం నుండి నివృత్తి సంగమానికి కృష్ణానదిలో ఉద్భవిస్తున్న కమలాలపై నడుచుకుంటూ చేరుకున్నారు. శ్రీవల్లభులు కృష్ణానది ఎప్పుడు దాటినా సరే, వారికి కృతజ్ఞతా పూర్వకముగా కృష్ణమ్మ ప్రతిసారి వారి పాదములకు కమల సేవ చేయుచుండెడిది. ఆ ఆవలి తీరమందు శ్రీ మహాగణపతి వారి రాకకై ఎదురుచూస్తూ వారు రాగానే ఆలింగనము చేసుకొనెను. ఆ నివృత్తి సంగమమెంతో అద్భుతమైన సిద్ధకేంద్రమని, ఎంతోమంది అక్కడ దివ్యత్వం పొందారని, వల్లభుల రాకవల్ల ఆ క్షేత్ర శక్తి ఎంతగానో వృద్ధిచెందునని శ్రీ మహాగణపతి తెలిపెను. అంత వల్లభులు మానవులను ధర్మమువైపు నడిపించు సంకల్పముతో ఈ తీరము చేరానని, తన సంకల్పమునకు అండదండలు కలుగజేయమని గణపతితో అనగా, గణపతి తప్పక సంకల్ప సిద్ధి జరుగునని తెలిపి అదృశ్యమయ్యెను. ప్రతీరోజూ శ్రీవల్లభులు అక్కడే సూర్యనమస్కారములు చేసేవారు. గణపతితో వారు సంభాషించిన ఆ ప్రాంతములో సహజ గణపతి వెలిసాడు. అక్కడకు దగ్గరలో నదీతీరమందు నిత్య అనుష్టానము చేసుకునేందుకు ఒక రావిచెట్టు క్రింద గల రాయిని శ్రీవల్లభులు ఎన్నుకొనిరి. వెంటనే వారి పులిచర్మము ఆ బండరాయిపై వచ్చిచేరగా, శ్రీవల్లభులు దానిపై ఆసీనులైరి. కొన్ని క్రూరమృగములు, విషనాగులు వారిని చేరి, నమస్కరించగా వారు తమ దర్శనమునకు గుప్తముగా రావలసిందిగా

వాటికి తెలిపి లేనిచో భక్తులు భయభ్రాంతులవుతారని తెలిపారు. వారందరూ వెళ్లిన పిదప, శ్రీవల్లభులు పంచదేవ పహడ్ గ్రామమందు భిక్షను స్వీకరించి, మరల నదీతీరమునకు వచ్చి, కొంతసేపు ఆ రావిచెట్టు నీడలో విశ్రమించి, ఆ తరువాత సాయంత్రానికి ఆవలి ఒడ్డున కురువపురానికి కృష్ణానదిపై విరిసిన కమలాలపై నడుచుకుంటూ వెళ్లిపోయారు.

ఇలా వల్లభులవారు తమ నిత్యకృత్యములను చేయుచుండెడివారు. ఇట్లుండగా కురువపురంలో అంబిక, శివశర్మ అను బ్రాహ్మణ దంపతులుండేవారు. శివశర్మ మహాపండితుడు. సద్బ్రాహ్మణుడు. వేదవిద్యతో సంసారమును పోషించుకునేవాడు. అతని భార్య అంబిక కూడ ఎంతో సుగుణాలరాశి. భర్త అడుగు జాడలలో నడుస్తూ, వారికెంతో చేదోడు వాదోడుగా నుండెడిది. వారికి చాలామంది పిల్లలు పుట్టి కూడ మరణించారు. వారు సంతానంకోసం అలంపురం, శ్రీశైలం మొ॥గా గల పుణ్యక్షేత్రాలను దర్శించారు. భగవంతుని అనుగ్రహముతో అనతికాలంలో అంబిక గర్భందాల్చి ఒక పుత్రునికి జన్మనిచ్చింది. ఆ బాలునికి ఆ దంపతులు ఆంజనేయశర్మ అని నామకరణం చేసి, ముద్దుగా 'అంజి' అని పిలుచుకునేవారు. ఆ కుమారుడు మందబుద్ధితో శుంఠవలే ఉండెడివాడు. తండ్రి ఎంత ప్రయత్నించిననూ అతనికి సరస్వతీ కటాక్షములేక వేదవిద్య అబ్బలేదు. మంత్రోచ్ఛారణకు నోరుతిరిగేదిగాదు. ఉపనయనాది సంస్కారములు జరిపించిననూ ప్రయోజనము కనిపించలేదు. శివశర్మ దండిస్తూ ఎంతగా ప్రయత్నించినా ఆ బాలునిలో మార్పురాలేదు. లేకలేక కలిగిన కుమారుని దండిస్తూ ఉంటే శివశర్మ భార్య అడ్డుతగిలి, భర్తను వారించేది. శివశర్మ వల్లభుల భక్తుడు. తన కుమారుని విషయంలో అతడు వల్లభులను ఎంతగా అర్థించిననూ అతనికి వారి సహాయమందలేదు. దానికి గల దైవరహస్యాన్ని ఎప్పుడో వల్లభులతనికి తెలిపారు. ఏదిఏమైనా ఆ బెంగతో శివశర్మ మంచానపడి మరణించాడు. భర్త మరణంతో ఉన్న ఆస్తులు కరిగిపోయి, జీవనాధారం లేక, అంబిక తన కుమారుని తీసుకుని కురువపురం విడచి కృష్ణానది ఆవలి ఒడ్డునవున్న పంచదేవపహడ్ అను గ్రామం చేరుకుంది. ఆ సమీప గ్రామాల్లో గల బ్రాహ్మణుల ఇండ్లలో పనిపాటలు చేసుకుంటూ, మందబుద్ధి అయిన కుమారుని పోషించుకుంటూ కాలం గడిపేది.

ఒకసారి గోవిందభట్టు అను శ్రీవల్లభులవారి అత్యంత ప్రియభక్తుడు, మిత్రబృందంతో కలసి పంచదేవపహడ్‌కి గుంపుగా వస్తుంటే ఆ గుంపులో ఆంజనేయశర్మ కలసిపోయి వారితో "దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా' అని నగర సంకీర్తన చేస్తూ వైకుంఠ ఏకాదశీ పర్వదినాన, వారితో కలసి కృష్ణానదిలో స్నానంచేసి, శ్రీవల్లభుల వారిని దర్శించాడు. 'దిగంబరా దిగంబరా' అనే వల్లభులవారిపై గల సంకీర్తనను వల్లభభక్తుడైన గోవిందభట్టు రచించి, బాణీకట్టి, స్వామిని స్తుతించేవాడు. శ్రీవల్లభుల దర్శనంతో ఆంజనేయశర్మలో కొంతమార్పు వచ్చినప్పటికీ, ఆ గ్రామస్థుల ఎగతాళి, హేళనలతో అదికాస్తా పోయి తిరిగి అతనిలోని నిరుత్సాహం రెట్టింపయ్యింది. అందరినుండీ తిరస్కారములకు గురిఅగుతున్న తనకు కృష్ణలో దూకి ఆత్మహత్య చేసుకొనుటయే శరణ్యమని నిర్ణయించుకొని అంజనేయశర్మ తల్లి ఎంతగా వారిస్తున్నా వినకుండా కృష్ణకు పయనమయ్యాడు. అతని వెంట రోదిస్తూ, ఆతని తల్లి గూడ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని అతనిని వెంబడించింది. వారిరువురూ వల్లభులు వారు అనుష్టానము చేసుకుంటున్న రావిచెట్టు దాటి, కృష్ణానదీ తీరంలోనికి వేగంగా, నిరాశతో ఒకరివెంట ఒకరు యేడుస్తూ పరుగులు తీయుచున్నారు. అనుష్టానంలో ఉన్న శ్రీవల్లభుల దృష్టికి ఈ విషయం గోచరమయ్యింది. వెంటనే తన సేవచేసుకుంటున్న రవిదాసు అనే రజకుని పిలచి, ఆ తల్లీకుమారులను తన దగ్గరకు తీసికొని రమ్మని పంపారు. వారు వల్లభులను చేరగానే ఆత్మహత్య మహాపాపమని, ఆ ప్రయత్నం విరమించుకొమ్మని అంబికకు వల్లభులు తెలుపగా, ఆమె తన జీవిత గాథను వల్లభులకు ఏడుస్తూ విన్నవించుకుంది. కరుణా సముద్రులైన వల్లభులు శివశర్మతో వారికి గల అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకొని, ఆమెతో నీవు పూర్వజన్మలో చేసిన పాపములవల్ల, ఈనాడు కష్టముల బారినపడ్డావని తెలిపి, ఆమె కుమారుని పిలచి, అతని శిరముపై చేయి ఉంచి, అతనిని ఆశీర్వదించారు. శ్రీవల్లభుల స్పర్శ తగలగానే, ఆ బాలునిలోకి దివ్యశక్తి ప్రసరించి, ఆ మూర్ఖ బాలునికి సకల శాస్త్ర పరిజ్ఞానములు స్ఫురణకు వచ్చి పండితుడయ్యెను. వెంటనే ఆ బాలుడు వల్లభుని వేనోళ్ల స్తుతిస్తూ, వారి చరణములపై బడి నమస్కరించెను. అతని తల్లి అంబికతో స్వామి ప్రశాంతచిత్తముతో నిత్యము ప్రదోషకాలంలో శివపూజ చేసుకొమ్మని, ఆ విధంగా చేస్తే, వచ్చే జన్మములో తమవంటి ఉత్తమ పుత్రునికి జన్మనీయగలవని తెలిపిరి. వెంటనే అంబిక స్వామివారి వంటి పుత్రుని వచ్చే జన్మలో ప్రసాదించమని వల్లభుల వారిని కోరింది. అంత, వల్లభులు నా

అంతటివాడు జన్మించుట దుర్లభము గావున నేనే నీకు పుత్రునిగా జన్మిస్తానని వరము ప్రసాదించారు. అప్పుడు అంబిక స్వామి వారితో శివపూజ ఎక్కడ చేయాలో తెలుపవలసిందిగా కోరింది. స్వామి కృష్ణాతీరంలో ఒక బండను అటూ, ఇటూ త్రిప్పగా ఆ బండ శివలింగంగా మారింది. ఆ శివలింగమునే పూజించుకొమ్మని వల్లభులు తెలిపారు. అటుపై ఆంజనేయశర్మ తల్లితో ఆ శివ లింగానికే అభిషేకం, పూజ ప్రతీ నిత్యం యధాశాస్త్రోక్తంగా చేయించేవాడు. కృష్ణాతీరంలోనే, తన తండ్రికి ఆబ్దీకాలు కూడా నిర్వహించేవాడు. వల్లభుల కృపతో మందబుద్ధి పండితుడైనందుకు జనులెంతగానో ఆశ్చర్యపడేవారు. శ్రీపాదుల వారి అనుగ్రహంతో వారి దారిద్ర్యం తీరిపోయినది. గ్రామస్థులు వారిని ఆదరించి గృహవసతి, సకల సదుపాయములు కలుగజేసిరి. 'దిగంబరా-దిగంబరా' శ్రీపాద వల్లభ దిగంబరా' అంటూ వారు తమ నిత్యజీవితం ఆనందంగా గడుపసాగారు. అటుపై అంబిక తన శేష జీవితమంతా శివపూజలో గడిపి, వార్ధక్యంతో మరణించింది.

గతంలో కురువపురానికి పయనమయిన శంకరభట్టు మార్గమధ్యంలో శ్రీపళనిస్వామివారిని కలిసాడు. ఒకనాడు శ్రీ పళనిస్వామి ధ్యానస్థులై తమ సూక్ష్మశరీరంతో కురువపురం చేరుకుని, వల్లభులవారిని మఠంలో దర్శించగా, ఆ సమయంలో శివశర్మ అను బ్రాహ్మణుడు తన మందబుద్ధియయిన కుమారుని తీర్చిదిద్దాలని స్వామిని అర్థించసాగాడు. దానికి వల్లభులు శివశర్మ ప్రాణత్యాగం అనంతరమే, ఇది సాధ్యమగునని తెలిపారు. శ్రీ పళనీస్వామి సూక్ష్మశరీరము వదిలిన పిదప ఈ విషయాన్ని వివరంగా శంకరభట్టుకు తెలియజేసారు. దీనినిబట్టి శివశర్మ మరణము దైవరహస్యమని, శివశర్మ మరణానికి, అతని కుమారునికి పాండిత్యం అబ్బడానికి మధ్య గల సంబంధాన్ని ఏనాడో వల్లభులు శివశర్మకు తెలియజేసారని, ఆ కారణంగానే శివశర్మ కోర్కెను వల్లభులు మన్నించలేదని తెలియుచున్నది.

ఈ సంఘటనతో శ్రీవల్లభుల ఖ్యాతి ఆనోట, ఈనోట ప్రాకి, ప్రతినిత్యము భక్తులు పంచదేవపహాడ్ గ్రామమునందు గల కృష్ణాతీరమునకు చేరుకుని, రావిచెట్టు క్రింద స్వామిని దర్శించేవారు. శ్రీపాద స్వామి అక్కడే ఉన్న రాతిపై కూర్చుని ప్రతిరోజూ దర్బారు నిర్వహించేవారు. శ్రీపాద స్వామి ఎంతోమందికి విద్యాదానము, సంతానప్రాప్తి కలిగించుటయే గాక, ఉత్తమ వ్రత విధానములు తెల్పి తద్వారా జన్మాంతర కర్మలను తొలగించుకొను మార్గములనెన్నో తెలిపిరి. ఆనాటి ఆ రావిచెట్టు గల ప్రదేశమే ఈనాడు శ్రీవల్లభాపురముగా రూపుదిద్దుకున్నది. ఆనాడు వల్లభులు తమ చేతితో సృజించిన శివలింగం, సహజ గణపతి విగ్రహాలు భాస్కరబండ అను ప్రదేశములో శ్రీవల్లభాపురానికి చేరువలో ఉన్నాయి.

మహారాష్ట్రలో పూర్వజన్మలో సిద్ధోపంత్ మరియు రుక్మాబాయి అను బ్రాహ్మణ దంపతులుండేవారు. ఆ దంపతుల కుమారుడే జ్ఞానేశ్వరుడు. జ్ఞానేశ్వరుడు దైవాంశ సంభూతుడు. 'జ్ఞానేశ్వరి' అనే భాగవతాన్ని రచించిన మహనీయుడు. శ్రీ శిరిడీ సాయిబాబా వార్కి ఈ గ్రంథమంటే ఎంతో ఇష్టం. ఆ గ్రామంలో ఉండే 'విశోబా' అనునాతడు ఆ బ్రాహ్మణ కుటుంబాన్ని ఎంతగానో ఎగతాళి, హేళన చేస్తూ ఎన్నో అవమానాల పాల్జేస్తూ, చివరకు జ్ఞానేశ్వరులవారి ఆగ్రహానికి గురియయ్యాడు. ఉత్తరజన్మలో మందబుద్ధివై ప్రజలచేత అవమానాలు పొంది, ఆ తరువాత సద్గురువు దర్శనం ద్వారా మాత్రమే విద్యాలాభం కలుగునని జ్ఞానేశ్వరులు ఇచ్చిన శాపంవల్ల ఆ 'విశోబా' ఈ జన్మలో ఆంజనేయశర్మగా జన్మించాడు. అతడు చాలాకాలం మందబుద్ధిగా ఉన్నాడు. వల్లభులను దర్శించి శాపవిముక్తి పొందాడు.

అంబిక గత జన్మలో వజ్రబాహుడనే రాజుకు ఇందుమతి అనే పేరుతో రెండో భార్యగా ఉంటూ, రాజుగారి మొదటి భార్యను, ఆమె కుమారుని అష్టకష్టాలకు గురిచేసింది. చేసిన తన తప్పులు మన్నించమని పశ్చాత్తాపంతో కొంతకాలానికి ఋషభయోగి వారిని ఆశ్రయించగా, వారు చేసిన పాపాలు అనుభవింపక తప్పదని, వచ్చే జన్మలో భర్తను కోల్పోయి, బ్రాహ్మణ స్త్రీగా అనేక కష్టములు అనుభవింతువని, ఈ పశ్చాత్తాప ఫలితముగా, ఒక సద్గురువు దర్శనమయ్యి కష్టాలు తీరి, ఆపై జన్మలో ఆ సద్గురువుకే తల్లికాగలవని తెలిపారు. ఆమె కడుపున వల్లభులు, నృసింహసరస్వతిగా జన్మించిరి. ఇదే ఆతల్లీతనయుల పూర్వ జన్మవృత్తాంతం.

గతంలో శ్రీపాదుల వారిని బదరీనాథ్ పుణ్యక్షేత్రంలో దర్శించిన సదానంద బ్రహ్మచారి అనునాతడు తన శిష్యబృందంతో దక్షిణదేశ యాత్రలు చేయుచూ, వల్లభుల దర్శనార్థము కురువపురం వచ్చాడు. శ్రీపాదులవారు అతనిని చిరునవ్వుతో పలకరించి, ఆశీర్వదించారు. అతడు వల్లభులను ఎంతగానో తదేక పారవశ్యముతో స్తుతించాడు. సదానందుని

స్తోత్రానికి ప్రసన్నులైన శ్రీవల్లభులు ఆతనితో మానవుడై పుట్టిన ప్రతీవాడు, తాను తరిస్తూ, తోటివారిని తరింపజేయాలని, ఆ క్రమంలో నీవార్జించిన జ్ఞానాన్ని అందరికీ పంచమని హితోపదేశం చేసారు. కురువపురం తపస్సు చేసుకొనుటకు వీలుగా ప్రశాంత వాతావరణము గల్గిన ప్రదేశమని, అచ్చట సిద్ధి శీఘ్రముగా లభించునని, కశ్యపాది మహర్షులెందరో అచట తపమాచరించి, సద్యఃఫలితాన్ని పొందారని, అచ్చట ప్రవహించుచున్న కృష్ణానది శ్రీదత్తాత్రేయస్వామి వారి పాద పీఠిక అయిన సహ్యాద్రి పర్వత శ్రేణిపై నుండి జాలువారి, ఎన్నో ప్రదేశములను, జీవులను పునీతులను చేయుచూ ప్రవహించి ఈ కురువపురము చేరుకున్నదనియూ, అక్కడనుండి కృష్ణమ్మ పాతాళగంగ పేరుతో శ్రీశైలంలోని భ్రమరాంబామల్లిఖార్జున స్వాములను స్పృశించి, అక్కడ భక్తుల పాపములను ప్రక్షాళనముచేసి, అచ్చట నుండి విజయవాటిక యందు దుర్గామల్లేశ్వరులను గూడ దర్శించి, హంసలదీవి వద్ద సముద్రములో కలయుచున్నదని, సముద్రములో కలియగానే తన నామ, రూప, గుణములను కోల్పోవుచున్నదని దీనినే లయతత్వమందురని తెలిపారు. అందువల్ల ప్రతీ సాధకుడు ఇదేవిధంగా పరమాత్మతత్త్వంలో పూర్తిగా లయము కావాలని, అదియే లయ యోగ మనబడునని అన్నారు. దత్త సంప్రదాయ శిష్యులకు అదే సంప్రదాయ గురువులు ఎవ్వరైనా గత జన్మలలో ఆగిపోయిన సాధనను గుర్తుచేసి, దానిని కొనసాగించుకొనుటకు సహాయం చేస్తారని, అదే దత్త సంప్రదాయ విశిష్టత అని తెలిపారు. శిష్యుని అర్హతలను బట్టి దత్త గురువులు భ్రమరకీటక న్యాయము ద్వారా శిష్యులను ఉద్ధరింతురని తెలిపారు. వంశాన్ని అభివృద్ధి చేయడంలో భ్రమరానిది అన్ని కీటకముల వలే గాక ఒక విలక్షణ పద్ధతి అని వల్లభులు తెలియజేసారు. ఏ కీటకాన్నయినా తన గూటిలో పట్టి బంధించి, దానికి తన లక్షణములన్నియూ నేర్పి, ఆ గూటి చుట్టూ నిర్విరామముగా ఝుంకారము చేయుచు భ్రమరము తిరుగుచుండును. కొన్ని దినములకు ఆ కీటకమే భ్రమరము యొక్క ఝుంకారము ధ్వనిని అనుకరిస్తూ, దాని లక్షణములు పుణికిపుచ్చుకుని, తన సహజరూపము కోల్పోయి భ్రమరముగా మారునని తెలిపారు. అంతేగాని సంపర్కము ద్వారా భ్రమరము దాని వంశము వృద్ధి చేసుకొలేదని తెలిపారు. ఇదేవిధంగా గురువులు అవివాహితులుగా ఉండి వారసులు లేకపోయినప్పటికీ తమ విధానములతో తమను ఆశ్రయించినవారిని శిష్యులుగా తీర్చిదిద్ది, తమంత వారిగా తయారుచేయుదురని తెలిపిరి. అంత సదానందుడు వల్లభుల వద్ద మరెన్నో వేదవిషయములపై బోధనలు గ్రహించి, వారివద్ద శలవుగైకొని, తన తీర్థయాత్రలను కొనసాగించుటకు ముందుకుసాగాడు. మహూర్ఘడ్‌లోని సహ్యాద్రి ప్రాంతంలో గల యోగానంద బ్రహ్మచారి శ్రీదత్తులకు అత్యంత భక్తుడు. అతడు దత్తుని దర్శనమునకై పరితపించగా, దత్తుడు కలలో కనిపించి, కురువపురం వెళ్ళి వల్లభులను దర్శించమన్నారు. తానే వల్లభుడని తెలిపారు. ఆనాటి నుండి అతడు వల్లభులనెంతో భక్తితో సేవించాడు.

ఒకసారి రాయచూరు నుండి శ్రీపాదస్వామి దర్శనానికి ఒక భక్తుడు కురువపురం వచ్చాడు. స్వామి ధ్యానంలో ఉండుట దూరం నుంచి చూచాడు. కాని స్వామికి ఇరుప్రక్కలా రెండు పెద్దపులులు కూర్చుని ఉన్నాయి. ధ్యానంలో ఉన్న స్వామికి ఆ భక్తుని రాక గోచరమయ్యింది. అతడు భయపడుతూ, దగ్గరకు రాలేకపోతున్నాడని తలచి, స్వామి ఆ రెండు పులులను వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించారు. ఆ పులులు వెళ్లిపోగానే ఆ భక్తుడు స్వామిని దర్శించాడు. అతనిని చూడగానే స్వామి, అతనిని గతంలో తెల్సినట్లుగా లక్ష్మీనరసయ్యా! అని పేరుతో పిలచి, అతనికి గల కష్టం గూర్చి అడిగారు. లక్ష్మీనరసయ్య తనకు సంతానప్రాప్తి కల్గించమని స్వామిని కోరుకున్నాడు. అంత స్వామి అతనిని ఆశీర్వదించి, ఉదయం ఇంటికి వెళ్లేటప్పుడు ఒక ముంతతో కృష్ణానది జలము తీసుకుని వెళ్ళి, అతని భార్యచే త్రాగించమని, సంతానం కలుగుతుందని తెలిపారు. అతడు స్వామివారి ఆజ్ఞ ప్రకారము కృష్ణానదిలో నీటిని తీసుకునివెళ్ళి, అతని భార్యచేత త్రాగించెను. ఒక సంవత్సరానికి వారికి కవలపిల్లలు కలిగారు. స్వామిని దర్శించి, ఆ పిల్లలకు నామకరణము చేయాలని తలచి, ఆ దంపతులు, ఆ పిల్లలిద్దర్నీ స్వామివారికడకు తీసుకునివచ్చారు. స్వామి ఆ పిల్లలిద్దర్నీ ఆశీర్వదించి వారికి పెద్దపులిరాజు, చిన్నపులిరాజు అని నామకరణం చేసారు. ఆపేర్లు నచ్చక, ఆ దంపతులు ఎటూ చెప్పలేక స్వామివారి వంక అదోరకంగా చూస్తూ ఉండిపోయారు. అంత స్వామి లక్ష్మీనరసయ్యతో మొదట్లో నీవువచ్చినపుడు, నాప్రక్కన రెండు పులులను చూసావు గదా! ఆ పులులు నన్ను ఆ జంతు జన్మం నుండి విడుదల చేసి, మానవజన్మమిప్పించవలసిందిగా కోరాయి. అందువల్ల ఆ పులులను నీభార్య గర్భంలో ప్రవేశింపచేసాను. కానీ నీ పిల్లలు పులిలా క్రూరంగా ఉండక ఉత్తములుగానే ఉంటారు. ఆ

పులులకు నా దర్శనం కాగానే ఆనాడే వాటిల్లో సహజంగా ఉండే క్రూరత్వం నశించింది అన్నారు. ఆ దంపతుల కోర్కెకు అనుగుణంగా ఆ పిల్లలకు తిరిగి నరహరి మరియు నరసింహ అని నామకరణం చేసారు. ఆ దంపతులు ఆనందంతో స్వామికి కృతజ్ఞతాపూర్వక నమస్కారములు చేసి వెడలిపోయారు.

శ్రీవల్లభులు వారు దర్బారు నిర్వహించేటప్పుడు రవిదాసు అను రజకుడు వల్లభుల వారి దగ్గరే ఉంటూ వారికి అనేక పరిచర్యలు చేసేవాడు. అతడు నల్గొండ సమీపంలో గల చిట్యాల గ్రామానికి చెందినవాడు. అతనిలోని భక్తి ప్రపత్తులు శ్రీస్వామి వారి దయవలన ఎంతో అభివృద్ధి చెందాయి. అన్ని ఉత్సవాల ఏర్పాట్లలో పాల్గొంటూ, మఠం, దర్బారుకు సంబంధించిన పనులన్నీ ఎంతో శ్రద్ధగా నిర్వహించేవాడు. స్వామి వారి దర్బారు, మఠం శుభ్రం చేయుట, స్వామివారి బట్టలు ఉతుకుట చేయుచూ, అడుగడుగునా వల్లభుల చెంతనే ఉండేవాడు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు సూచనలిస్తూ, వారికి సౌకర్యాలు కలుగజేస్తూ, స్వామివారికి ధ్యాన భంగం కాకుండా చూచుకుంటూ, వారిని కంటికి రెప్పలా భక్తితో సేవించేవాడు. శ్రీవల్లభులు ప్రతీరోజు దర్బారు నిర్వహించి, భక్తుల సమస్యలను తీరుస్తూ, వరప్రదానములు, వ్యాధుల నిర్మూలన చేసేవారు. స్వామి అతనిని మంచిభక్తి గల సేవాపరాయణునిగా గుర్తించారు. అప్పుడప్పుడు వల్లభులు రవిదాసుతో నీకు రాజు కాగల లక్షణాలు గోచరిస్తున్నాయి అనేవారు. దానికి రజకుడు నవ్వి తనకంతటి అదృష్టం లేదని అంటూ ఉండేవాడు.

అయితే గత జన్మలో కూడ రజకుడైన రవిదాసు రామాయణ కాలమున లంకలో ఉన్న సీతను రాముడు ఏలుకున్నాడని, శ్రీరామునిపై నిందమోపి, సీతాదేవి అడవుల పాలగుటకు కారణభూతుడు. కొన్నాళ్లకు సత్యం గ్రహించి మొదట్లో సీతాదేవిపై మోపిన అపవాదుకు పశ్చాత్తాపంతో కృంగిపోయిన ఆనాటి రజకుడు. శ్రీరామునితో తన తప్పిదమును క్షమించవలసిందిగా కోరాడు. అప్పుడు రాముడు ఆతనితో చాలా జన్మలలో చేసిన పాపాలకు కష్టాలు అనుభవింపక తప్పదని, సన్మార్గంలో నడుస్తూ ఉంటే ఏదో ఒక జన్మలో ఒక సద్గురువు దర్శనం దొరకగలదని ఆ సద్గురువు సేవచేస్తే, వారి కటాక్షం గలిగి రాజ్యభోగాలనుభవింపగలవని, కావున సద్గురువులను సేవించి, తరించమని అతనికి శ్రీరాముడు హితబోధ చేసాడు. ఆనాటి రజకుడే ఈనాటి రవిదాసుగా పేర్కొంటారు.

ఒకరోజు ఉత్తర కర్ణాటకా ప్రాంతం నుండి, ఒక తండ్రి తన కుమార్తెకు భూత, ప్రేత, పిశాచ, బాధల నుండి విముక్తిని ప్రసాదింపచేయుటకై, అతని అన్ని ప్రయత్నములు విఫలమైన పిమ్మట శ్రీ వల్లభుల దర్బారుకు చేరెను. ఆశ్చర్యముగా కురువపుర ప్రాంతంలో ఆ బాలిక అడుగుపెట్టగానే ఆమెకు స్వస్తత చేకూరినది. ఆ ప్రాంతంలో శ్రీవల్లభులు సంచరిస్తున్న కారణంగా ఆ స్థలానికి అంత మహాత్యం సంతరించుకున్నదని అతడు గ్రహించాడు. ఆ సమయంలోనే దక్షిణ కర్ణాటక బ్రాహ్మణుడు, శ్రీపాదుల వారి దర్శనార్థము ఎన్నో కష్టనష్టములు భరించి కన్యాకుమారి నుండి సుదూరము ప్రయాణించి కురువపురానికి చేరుకున్న శంకరభట్టు కూడ శ్రీవల్లభుల దర్శనమునకై దర్బారునందు వేచియున్నాడు. ఇంతలో ఆజానుబాహుడు, సుందరాకారుడు, కాషాయ వల్కలధారి, రుద్రాక్షలు ధరించిన జటాధారి, నవయవ్వనుడైన శ్రీవల్లభులు అచ్చట ప్రత్యక్షమయ్యారు. శ్రీవల్లభులు వటవృక్ష ఛాయలోనున్న రాతిఫలకముపై సుఖాసీనులయ్యారు. ముందుగా ఉత్తర కర్ణాటకా రాష్ట్రం నుండి తన కుమార్తెను వల్లభుల దర్శనార్థము తీసుకొని వచ్చిన తండ్రి, శ్రీవల్లభుల పాదములకు నమస్కరించి, వారికి తన కుమార్తె ఆరోగ్య పరిస్థితిని గూర్చి వివరించాడు. అంత వల్లభులు ఆతని కుమార్తెను ఒక బ్రహ్మరాక్షసుడు ఆవహించియున్నాడని, తెలిపి వెంటనే ఆ కుమార్తె వైపు చూచి, చేయి ఎత్తి ఆ బ్రహ్మరాక్షసుని అదిలించి, ఆ అమ్మాయిని వదిలి వెళ్లవలసిందిగా ఆజ్ఞాపించారు. ఆ మరుక్షణమే ఆ అమ్మాయి దేహమును విడచి బ్రహ్మరాక్షసుడు బైటకు వచ్చెను. ఆ బ్రహ్మరాక్షసుడు శ్రీవల్లభులతో గత జన్మలో విష్ణుదత్తుని ఇంటి సమీపమున గల రావిచెట్టుపై ఇద్దరు బ్రహ్మరాక్షసులుండేవారమని అందులో తనతోటి వానికి విష్ణుదత్తుని ఇంట దత్తుని దర్శనమై, విముక్తి లభించిందని, తనకు ఆ అదృష్టము కలుగలేదని, అందువలన విష్ణుదత్తుని తనకు గూడ బ్రహ్మరాక్షసత్వము నుండి విముక్తి కలుగజేయమని కోరగా, కాలాంతరమున దత్తుడు వల్లభునిగా జన్మించునని, వారిని దర్శించి విముక్తి పొందగలవని తెలిపెను. ఆనాటి నుండి మీ దర్శనార్థమై ఎన్నో ప్రయత్నములు చేయుచూ, తొలుత పీఠికాపురము చేరినాను, తమ

దర్శనభాగ్యము కలుగలేదు. మరొక మార్గముగా, ఈ బాలికను ఆవహించిన నాకు ఇన్నాళ్లకు తమ దర్శనమైనదని పలికి, తనకు విముక్తి కలిగించమని వల్లభుల చరణములపై బడెను. అంత వల్లభులు ఆ బ్రహ్మరాక్షసునితో ఆ అమ్మాయిని అకారణంగా బాధించిన నీకు వెంటనే విముక్తి దొరకదని, శాకాహారివై జీవిస్తూ, ఇతరులను హింసింపక, కొన్ని సంవత్సరములు గంధర్వపురమందు నిరీక్షించవలయునని, నీ కర్మపరిపక్వమైన పిదప, నీకు నృసింహసరస్వతిగా దర్శనమిచ్చి విముక్తి ప్రసాదించగలనని తెలిపారు. అంత ఆ బ్రహ్మరాక్షసుడు స్వామికి నమస్కరించి, మాయమయ్యెను.

ఆ తరువాత శ్రీవల్లభుల దృష్టి దక్షిణ కర్ణాటక బ్రాహ్మణునిపై బడింది. అతనిని చూచి ఏమయ్యా! శంకరభట్టు! ప్రయాణం సుఖంగా సాగిందా! తిన్నగా కురువపురం చేరుకున్నావా! అన్నారు. అచ్చటవున్న వారందరూ ఆశ్చర్యముగా శంకరభట్టు వంక తదేకంగా చూడసాగారు. ఎంతోకాలంగా ఆ దివ్యమంగళస్వరూపాన్ని కనులారా వీక్షించాలని, ఎదురుచూస్తున్న శంకరభట్టు దేహము శ్రీవల్లభుల వారి పలకరింపుతో పులకించిపోయింది. కన్నులవెంట ఆనందభాష్పాలు రాలసాగాయి. మాటలు రాక నోరు పెగలలేదు. స్వామి చరణాలపై పడి కొంతసేపు ఆనంద పారవశ్యము అనుభవించాడు. మెల్లగా లేచి దేవాదిదేవా! అనాథనాథా! సద్గురు మౌళీ! మీ లీలలు అనంతములు. త్రిమూర్త్యాత్మకుడవైన నీకు అసాధ్యమేమున్నది. నీకు సర్వము తెలియును. నీ కృపాకటాక్షములే నన్ను ఇక్కడికి నడిపించినవి. స్వామీ! ఎన్నెన్నో జన్మలలో చేసుకున్న పాపాలన్నీ, దారిపోడవునా, అనేకానేకమైన కర్మానుభవముల ద్వారా తొలగించుచూ, మధ్య, మధ్యన నీయొక్క అద్భుత లీలలను ఎంతోమంది వల్లభభక్తుల ద్వారా నాకు ఎరింగించితివి. తొలుత గురువాయూరులోను, అటు తరువాత కన్యాకుమారిలోను నీ దర్శనమునకై నన్ను తరలిరావలసిందిగా కరుణతో అనుజ్ఞనొసగితివి. ఎక్కడి కన్యాకుమారి క్షేత్రము, ఎక్కడి కురువపురము శ్రీపాదా! నీ పాదాలే శరణమని నమ్మి నడిచే నాకు ముందు, వెనుకగూడ నీవే ఉండి, సహాయము చేసి, ముందుకు నడిపించి, చివరకు నీ పాద సన్నిధికి చేర్చావు ప్రభూ! ఇంకా నాకు పాపపంకిలం, కర్మశేషం మిగిలివుంటే ఓ సద్గురుమూర్తి! ఆ శిక్షలన్నీ నీ సమక్షంలోనే విధించు, నీ వియోగము నేను భరించలేను అంటూ ఉద్వేగ పూరితంగా శంకరభట్టు పలికి వారిపాదాలపై ప్రణమిల్లాడు. అంత శ్రీపాదులు శాంతించుము! బ్రాహ్మణోత్తమా! ఈ కురువపురము ఒక దివ్యక్షేత్రము. ఇచ్చట కాలుపెట్టిన వారి పాపాలు భస్మంకాగలవు. ఇచ్చట చేసిన పుణ్యములు కోటిరెట్ల ఫలమునిచ్చును. అట్లే చేసిన పాపములకు శిక్షగూడ అంతే మోతాదులో ఉండును. ఈ క్షేత్రము అత్యంత మహాత్ముల పుణ్యభూమి. మహాత్ములు చేసిన తపఃఫలమువల్ల పాపాత్ములకు ఈ క్షేత్రములో పరిహారము కల్గునని తెలిపారు. ఇక్కడ చేసిన పాపములను ఆ మహాత్ములు అదృశ్యరూపములో ఉండి పరికించెదరు. అందుచేత ఇక్కడ నివసించదలచిన వారు తగు జాగ్రత్తగా జీవితము గడుపవలెనని తెలిపిరి. తదుపరి శంకరభట్టును మఠములో ఉండవలసిందిగా ఆజ్ఞాపించారు.

ఒకసారి ఆంజనేయశర్మ, తన మిత్రులతో గూడి శ్రీవల్లభుల వార్కి దర్బారునందు దత్తజయంతినాడు గురుపూజ చేయాలని సంకల్పించాడు. సకల ఏర్పాట్లు శంకరభట్టు, రవిదాసు మొ॥వారు ఇతర భక్తులతోబాటు చేసారు. ఆహ్వానాలు పంపి ఎంతమందినో ఆ కార్యక్రమానికి పిలిచినారు. పంచదేవపహడ్ నందు గల వాసుదేవరావు జోషి అను వేదపండితుడు, వల్లభులవారి పట్ల అసహనము, ద్వేషముతో వారిని విమర్శించేవాడు. ఆతడు ఏనాడు వల్లభులను దర్శించలేదు. వారు ఎలా ఉంటారో కూడ అతనికి తెలియదు. వాసుదేవరావు ప్రతినిత్యం తన పూజలో ఒక యోగిపుంగవుని గురువుగా తలచి అనుష్టానము చేయుచూ, వారి దివ్యశక్తితో ముహూర్త నిర్ణయములు, జ్యోతిష్యములు చెప్పి ఎంతో పేరుగాంచినాడు. దత్తజయంతినాడు ఒక మిత్రుని బలవంతముతో, ఇష్టంలేకున్ననూ పంచదేవపహడ్ వద్ద గల దర్బారులో జరుగుతున్న దత్తజయంతి ఉత్సవాలకు హాజరయ్యాడు. శ్రీవల్లభులవారు సభలో ఆశీనులుకాగానే, పరుగు పరుగున పోయి వాసుదేవరావు వారి పాదాలపైబడి, తన తప్పును క్షమించమని కోరాడు. తాను నిత్యము కొలిచే యోగిపుంగవుడే శ్రీవల్లభులని తెలియక వారిపై ద్వేషం వహించినందుకు సిగ్గుతో తలవంచుకున్నాడు.

దత్తజయంతి కార్యక్రమాలను ఆంజనేయశర్మ ఎంతో వైభవంగా నిర్వహించి, శ్రీవల్లభుల వారిని అత్యంతభక్తితో పూజించి, షడ్రోపేతముగా ఆహుతులందరికీ, భక్తులకు, గ్రామస్థులకు అన్నదానము చేసాడు. ఆ సభలో వల్లభులు అనుగ్రహభాషణం చేసారు. ఆ ప్రసంగంలో ప్రతీ మానవునికి అన్ని విషయాలు తెలుసుకోవాలనే అభిలాష ఉంటుందని,

అది ఆతని బుద్ధిలో ఒక భాగం మాత్రమేనని, మానవుని బుద్ధి సప్తవిధములుగా ఉంటుందని అనగా మానవుని బుద్ధిని శాస్త్రాలు ఏడు భాగాలుగా విభజించాయని తెలిపారు. ప్రతీ విషయంలోనూ కొన్ని భాగాలే స్పందించునని, కొన్ని భాగాలు స్పందించవని, కొన్ని భాగాల స్పందనలు కొంతమందిలో ఒక విధంగాను, మరికొన్ని భాగాల స్పందనలు మరికొంత మందిలో వేరొక విధంగా ఉంటాయని, కావున అందరి ఆలోచనలు ఒకేవిధంగా ఉండవని, అందువల్లనే పెద్దలు 'పుర్రెకోబుద్ధి – జిహ్వకొకరుచి' అన్నారని, ఈ నానావిధ బుద్ధుల వల్లనే మానవులలో చాలా విషయాలలో ఏకాభిప్రాయం కుదరక అభిప్రాయ బేధాలు చోటుచేసుకుంటాయని తెలిపారు. కావున మానవుడు తన శక్తితో ఈ బుద్ధులన్నింటినీ సమన్వయం చేసుకుని, వాటిని ఏకత్రాటిపై నిలిపి, సన్మార్గంలో నడుస్తూ, శక్తిమంతుడు కావాలని తెలిపారు.

ఈ కార్యక్రమానికి పీఠికాపురం నుండి కొందరు పండితులు అప్రయత్నంగా వారి దేశాటనలో భాగంగా హాజరయ్యారు. వల్లభులు వారిని ఆదరించి, కుశల ప్రశ్నలు వేసి, పీఠికాపుర విశేషాలతోబాటు, తన వారి క్షేమసమాచారాలను అడిగి తెలుసుకున్నారు. వల్లభులు వారినందర్ని పంచదేవపహాడ్ నుండి కురువపురం తీసుకునివెళ్లి, అక్కడ వారికి ఎన్నో జ్ఞానబోధనలు చేసారు. వారందరూ ఆ మరునాడు తిరిగి పయనమై పీఠికాపురానికి వెళ్లిపోయారు.

శ్రీవల్లభుల దర్శనానికి రాత్రి సమయాలలో దేవతలు, యక్షులు మొ॥వారు కురువపురం అదృశ్యరూపాలలో చేరుకుని వారిని దర్శించి పూజించేవారు. అందువల్ల కురువపుర మందు రాత్రివేళల్లో వారు ఏకాంతముగా ఉండేవారు. రాత్రి సమయాలలో భక్తులందర్నీ పంచదేవపహాడ్‌లో నున్న దర్బారునందే ఉండమనేవారు. పగటి సమయాలలో వారు సూర్యనమస్కారములు, అనుష్టానము, భక్తులకు ఇచ్చే దర్శనములన్నియు గూడ పంచదేవపహాడ్ నందు గల కృష్ణానదీ తీరము నందే చేసెడివారు. అత్యవసర పరిస్థితులలో వారి సేవకై కురువపురంలో ఒకరిద్దరు భక్తులుండేవారు. రాత్రికి మాత్రము వల్లభులు కురువపురం చేరుకునేవారు. శ్రీపాదవల్లభుల దర్బారునందు సర్వము లభించెడిది. భక్తుల కోర్కెలను తీర్చి, వారికి మృష్టాన్న భోజనము గూడ ప్రసాదముగా ఇచ్చేవారు. విశేషముగా అన్నరాశులు అక్షయముగా దర్బారునందు ఉండెడివి. భక్తులు తినగా మిగిలిన భోజన పదార్థములను కృష్ణానదిలోని జలచరముల కొరకై విడిచేవారు. శ్రీపాదుల వారి దర్బారునందు ప్రవేశించినవారికి 'లేదు' అను శబ్దములేదు. వచ్చిన వారందరూ ఆనందముతో వెళ్లేవారు.

పంచదేవపహాడ్‌లో గల ఆ దర్బారు నందు భవిష్యత్తులో భవనము లేర్పడునని, విశేష అన్నదానము జరుగునని, గోశాల కూడ ఉండునని, ఆ ప్రాంతము ఒక గొప్పదత్త పుణ్యక్షేత్రముగా వెలుగొందునని, అధిక సంఖ్యలో భక్తులు ఆ క్షేత్రము దర్శించి తరింతురని, ఆ ప్రదేశమును దర్శించిన భక్తుల సకల అభీష్టములు నెరవేరునని శ్రీవల్లభులు తెలిపారు.

శ్రీపాదుల వారి దర్బారునందు ప్రతి నిత్యము సత్సంగములు, బోధనలు, శాస్త్ర వివరణములు, యోగ, ధ్యాన రహస్యముల ప్రబోధములు జరుగుచుండెడివి. వారి అమృతవాక్కులను వినుటకు, ఎంతో మంది భక్తులు హాజరయ్యేవారు. దర్బారు అనంతరము, వారు ప్రతీ భక్తునితో ముచ్చటించి, వారి వెతలను, వ్యాధులను నివారించేవారు. కొంత మందికి స్వయంగా భోజనం తినిపించేవారు. వారు ఆదివారం యోగవిద్య, సోమవారం పురాణాలు, మంగళవారం ఉపనిషత్తులు, బుధవారం వేదములు, వేదార్థములు గురువారం గురుతత్వములను, శుక్రవారం మాత్రం శ్రీ విద్య గురించి బోధించి, అందరికీ పసుపుకొమ్ములను పంచేవారు. శనివారం శివారాధనా మహాత్యము గూర్చి తెలిపేవారు. స్త్రీలను తల్లీ అని అమ్మా అని ఇలా భక్తులందర్నీ పేర్లతో పిలువక ఆత్మీయనామములతో పలుకరించి, వారి బాధలకు, ఉపశమనం కలుగచేసేవారు. ఏదైనా అనివార్య సందర్భాలలో పంచదేవపహాడ్‌నందు దర్బారు నిర్వహించుటకు వీలుపడని పక్షంలో మాత్రమే కురుంగడ్డలో నిర్వహించెడివారు.

వారి పాదస్పర్శతో పునీతమయిన కురువపురము, పంచదేవపహాడ్ అను ఈ రెండు ప్రదేశాలు ఎంతో పవిత్రమైన మహా మహిమాన్వితమైన పుణ్యక్షేత్రాలుగా వెలుగొందాయి. ఈ క్షేత్రములో ఈశ్వరుడు ఏదో రూపములో సంచరించునని ప్రతీతిగలదు. ఇంకా ఈ క్షేత్రములలో దేవతలు, మహర్షులు, మహాపురుషులు మారు వేషములలోగాని, అదృశ్య రూపములోగాని జనుల కంటపడకుండా సంచరిస్తారని భక్తుల విశ్వాసం. ఇంతేకాకుండా, ప్రధానంగా ఈ క్షేత్రాలలో శ్రీ వల్లభులు నిత్యం గుప్తరూపంలో సందర్శిస్తూ, భక్తుల బాగోగులను పర్యవేక్షిస్తూ ఉంటారని ఎన్నో నిరూపణలు జరిగాయి.

ఒకనాడు స్వామి ఏకాంతముగా దర్బారులో ఉండగా, రెండు నాగుపాములు వారికడకు వచ్చి, ఏదో మాట్లాడి వెళ్లాయి. దూరంనుండి ఈ దృశ్యాన్ని గాంచిన భక్తులు దాని గురించి స్వామిని వివరం అడుగగా, అందరికీ బాధలుంటాయి. వాటి బాధలు అవి చెప్పుకున్నాయి అన్నారు. ఒకసారి స్వామివారి చుట్టూ పక్షులు చేరి కిలకిలారవములు చేయుచున్నవి. వెంటనే స్వామి రవిదాసును పిలచి, ఆ పక్షులు నివసించే వృక్షాన్ని ఎవరో నరుకబోతున్నారని, ఆ పక్షులు బాధపడుచున్నవని, ఆ వ్యక్తులను పిలిపించి, వారిని ఆ ప్రయత్నము మానుకొమ్మని తెలుపవలసిందిగా ఆజ్ఞాపించిరి. ఆ వ్యక్తులు వారి దగ్గరకురాగానే వారితో మర్రి, మేడి, జువ్వి, రావి, వేప, జమ్మి, మామిడి, మారేడు, నేరేడు వృక్షాలు దేవతా వృక్షాలని, వాటిని ఎట్టి పరిస్థితులలోనూ నరుకరాదని తెలిపిరి. ఎండిపోయిన కొమ్మలను మాత్రమే ఏ పనికయినా ఉపయోగించుకోవాలిగాని, పచ్చని ఆ చెట్లను నరికితే వంశనాశనం జరుగుతుందని, అలాగే పక్షులు నివసించే ఏ వృక్షాన్నయినా నరికి వాటిగూడు పాడుచేస్తే పాపం కలుగుతుందని కూడ తెలిపారు. ఆ వివరణతోవారు చెట్లు నరికే ఆలోచనను మానుకున్నారు.

ఒకనాడు దర్బారునందు జరిగిన ప్రముఖుల సత్సంగంలో శ్రీవల్లభులు ప్రసంగిస్తూ, ప్రతీవ్యక్తి తన సంపాదనను అయిదు భాగములుగా చేసి తల్లి దండ్రులకు, సంసారమునకు, ఆశ్రితుల సంక్షేమమునకు, సమాజమునకు, గురు దైవ కార్యాలకు వినియోగించాలని వివరించారు. ఇలాచేస్తే సంపద, వంశము, కీర్తి ప్రతిష్ఠలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

శ్రీ వల్లభుల అవతార పరిసమాప్తి అయిన పిదప ఈ కురువపురాన్ని దత్తుని అంశతో జన్మించిన శ్రీవాసుదేవానంద సరస్వతివారు దర్శించారు. వీరినే తెంబే స్వామి అనికూడ అంటారు. వారు తమ 21వ చాతుర్మాస వ్రత మిక్కడ ఆచరించారు. వారు కురువపురంలో ప్రతీనిత్యం కృష్ణానదిలో స్నానం చేస్తూ, శ్రీవల్లభులు కూర్చున్న రాతిశిలను ప్రతిష్టించి, నిర్మించిన మందిరంలో ప్రతీరోజు శ్రీవల్లభులను దర్శించేవారు.

ఒకరోజు ఏకాదశినాడు తెంబేస్వామి కృష్ణలో స్నానం ఆచరించుచున్న సమయంలో కృష్ణవేణి మాత వారికి దర్శనమిచ్చి, తనకు పప్పులు పెట్టమని అడిగింది. కృష్ణవేణీమాత ఆకలితోనున్నదని గ్రహించి, తెంబేస్వామి గురుపూర్ణమి రోజున మహోత్సవం జరిపించి, విరివిగా అన్నదానంచేసి, వడపప్పు కృష్ణానదీమాతకు నివేదించి, కొంతమంది స్త్రీలకు కృష్ణామాత పేరున వస్త్రదానం కూడ చేసి, ఆ మాతను తృప్తిపరచారు. వారు తాము అనుష్టానము చేయుటకు కురువపురంలో ఒక గుహను ఎన్నుకున్నారు. ఆ గుహలో వారికి ఒక మహానాగసర్పమున్నట్లుగా తోచింది. వెంటనే ఆ సర్పరాజును ప్రార్థించి, తన అనుష్టానమునకు సహకరించేందుకై ఆ ప్రదేశము విడచివెళ్లమని ప్రార్థించిరి. అంత ఆ మహాసర్పము వారికళ్ల ఎదుటనే ఆ గుహను ఖాళీచేసి, దగ్గరలోనున్న ఒక వృక్షము క్రింద నున్న పుట్టలోనికి వెళ్లింది. అప్పుడప్పుడు దూరం నుంచి తపస్సులోనున్న శ్రీ తెంబేస్వామిని దర్శించి వెళ్లేది. శ్రీ తెంబేస్వామి నిత్యము బ్రాహ్మణాగ్రహారములో భిక్ష స్వీకరించి, తపస్సు చేసుకునేవారు.

శ్రీపాదులువారు తాము అవతారము చాలించినప్పటికీ ఆ ప్రాంతమందే సంచరించెదనని భక్తులకు అభయమిచ్చారు. అది ఈనాటికి సత్యం అన్నట్లుగా ఎంతోమందికి నిదర్శనములైనవి. గతంలో వారి భక్తుడైన వల్లభేశుడు దొంగలచే సంహరింపబడగా, స్వామి ప్రత్యక్షమై ఆ దొంగలను చంపి, వల్లభేశుని పునర్జీవితునిగా చేసారు. ఆ ప్రాంతము ఈ నాటికి నిదర్శనముగా 'మంధెనఘడ్' అను పేరుతో ఉన్నది.

ఒకసారి తెంబేస్వామి వారు కురువపురంలో ఒక మర్రిచెట్టు క్రింద సమాధిస్థితిలో నుండగా, వారిపైన ఆ మర్రిచెట్టుపై నుండి చనిపోయిన పిట్ట, దాని గ్రుడ్డు, రెట్ట పడింది. తెంబేస్వామి చికాకుపడి కన్నులు తెరచి, ఆ రెట్టను తొలగించుకుని, పిట్ట మృతదేహమును గ్రుడ్డును చీదరించుకుని ప్రక్కన పారవైచి, కృష్ణానదిలో స్నానమాచరించుచుండగా, శ్రీవల్లభులు వారికి సాక్షాత్కరించి, ఒక్కసారి రెట్టపడితే ఇంతగా చీదరించుకుంటున్నావు, నాపైన నిత్యము పడుతున్న ఇటువంటి మలిన పదార్థాల మాటేమిటి? అని ప్రశ్నించారు. నీవు నాబాధ అర్థం చేసుకునేందుకే ఇలా చేసానని తెలిపి అంతర్ధానమయ్యారు. మరునాడు ఉదయమే తెంబేస్వామి గర్భగుడిలోనికి వెళ్లి చూడగా, అక్కడ చచ్చిపడిన పక్షి కళేబరములు, పగిలిన గోడల మధ్య క్రిమి, కీటకముల, గబ్బిలముల నివాసము, చిన్న చిన్న మొక్కలతో, ఆ గర్భగుడి అంతా

చాల అశుభ్రముగా ఉండి, దుర్వాసనతో నిండియున్నది. వెంటనే తెంబేస్వామి వారు ఆ దేవాలయమంతా శుభ్రం చేయించి, తన శిష్యుడైన గాండాబువా అనునాతని సహకారంతో గ్రామస్థులందర్నీ కలసి, వారిని అర్థించి, ధనం సేకరించి, గర్భగుడిలో పగిలిన గోడలకు మరామత్తులు చేయించి, గర్భగుడిని పరిశుభ్రముగా తీర్చిదిద్ది, చక్కని గోపుర నిర్మాణం చేయించారు. గతంలో నాటుపడవలపై కృష్ణానదిపై ప్రయాణిస్తూ కురువపురం చేరుకునే భక్తులు, నది ఆటు పోట్ల వల్ల ప్రమాదాలలో చిక్కుకుంటే, శ్రీవల్లభులు ఏదోరూపంలో వారిని రక్షించి కురువపురం చేర్చేవారు.

తెంబేస్వామివారు శ్రీవల్లభుల జన్మస్థలమైన పీఠికాపురాన్ని కూడ దర్శించారు. వారే గ్రామస్థులకు వల్లభుల మాతామహుల ఇల్లు చూపి, వల్లభుల జన్మస్థలాన్ని ధృవీకరించారు. అప్పటివరకూ ఆ గ్రామస్థులకు ఆ విషయాలపై అవగాహన లేదు. తెంబేస్వామి పిఠాపురములో శ్రీ వల్లభుల మాతామహుల గృహంలో శ్రీ వల్లభుల పాదుకలను ప్రతిష్టించాలని విశ్వప్రయత్నం చేసిననూ, శ్రీ వల్లభులు వారికి ఆ అవకాశము కలుగజేయలేదు. దీనినిబట్టి వాసుదేవుల పాత్రను శ్రీ వల్లభులు కురువపురానికే పరిమితం చేసినట్లుగా తెలుస్తోంది.

కొంతకాలమునకు తెంబేస్వామికి కురువపురంలో అర్చకులు, గ్రామస్థులలో కొంతమంది నచ్చక, అసంతృప్తితో అక్కడనుండి వెళ్లిపోవాలని తలపోసిరి. అంతలో శ్రీవల్లభులు బ్రహ్మచారి రూపంతో వచ్చి, వారితో తనకు ఆ ప్రాంతమందున్న భూమినంతయూ ఒక రజకుడు దానం చేసాడని, ఆ భూమిపై వచ్చు ఆదాయముతోనే ధూప, దీప, నైవేద్యములు చేయుచున్నారని, తద్వారా ఆ ఆదాయము చాలా పవిత్రమైనదని, ఆ ఆదాయం సరిపోని కారణంగా తాను నిత్యము భిక్ష చేయుచున్నానని, అందువల్ల నీవు కూడ భిక్షచేస్తూ, మరికొంతకాలముండి వెళ్లమని తెలిపి అదృశ్యమయ్యారు. శ్రీవల్లభుల ఆజ్ఞ ప్రకారం తెంబేస్వామి మరికొద్దికాలము కురువపురంలో ఉండి, అటుపై మరొక మజిలీకి వెళ్లిపోయారు.

శ్రీపాదులవారి అన్నగారు మరియు దత్తావధూత అయిన శ్రీధర స్వామివారు గూడ కురువపురం దర్శించి, తెంబేస్వామి ఉంటున్న గుహలోనే ఉంటూ, తపస్సు చేసుకునేవారు. ఆ గుట్టపై పూజా, పునస్కారములు లేని ఒక శివలింగమును చూచి, ప్రతీరోజూ కృష్ణానదిలోని నీరుతెచ్చి, శివునికి అభిషేకించి, యధాశాస్త్రీయముగా ఆ శివలింగానికి పూజ జరిపేవారు. ఒకనాడు వారికి ఆ గుట్టపై ప్రత్యక్షంగా సదాశివుని దర్శనభాగ్యం కలిగింది. ఒకసారి శ్రీధరస్వామి వారు కృష్ణానదిలో స్నానమాచరించుచుండగా, గట్టునవున్న వారి పాదుకలు మాయమయినవి. మరికొద్దిసేపటికి పశుపు, కుంకుమ, గంధ, పుష్పాదులతో గూడి ఆ పాదుకలు పెట్టినచోటనే తిరిగి ఉంచబడ్డాయి. స్వామి తన దివ్యదృష్టితో చూడగా, ఆ ప్రాంతమందు అదృశ్యంగా నివసించే దేవతలు, ఆ పాదుకలు తీసుకునివెళ్లి పూజించి, తిరిగి యధాస్థానంలో ఉంచినట్లుగా గోచరించెను. అలా కొంతకాలం వారు కురువపురంలో ఉండి వెళ్లారు. కురువపురంలో ఎంతోమంది ఋషులు, దేవతలు స్థానికంగా అదృశ్య రూపంలో ఉంటారని తెలుపుటకిది నిదర్శనం.

శ్రీవల్లభులు ఈ ప్రాంతమందు పదునాలుగు సంవత్సరములున్నారు. కురువపురంలో వారు రాత్రివేళలు తపస్సమాధిలో ఉంటూ, దేవతలకందరికీ దర్శనభాగ్యం కలుగజేసేవారు. ఉదయం నివృత్తి సంగమములో అనుష్టానము ముగించుకునేవారు. అటుపిమ్మట శ్రీవల్లభాపురంలోని కృష్ణాతీరంలో దర్బారు నిర్వహించి, భక్తులకు దర్శనమిచ్చేవారు. రాత్రికి తిరిగి కృష్ణానదిపై విరిసే కమలాలపై నడుచుకుంటూ ఆవలి ఒడ్డునగల కురువపురం చేరుకునేవారు. వారు అవతారం చాలించే వరకు దీనినే నిత్య దినచర్యగా అనుసరించేవారు.

కురువపురమునందు అర్ధనారీశ్వరరూపమునందున్న అరుణాచలేశ్వరుడే శ్రీపాద శ్రీవల్లభుడు. అరుణాచలము నందున్న మహాసిద్ధుడు గూడా యతీశ్వర వేషధారి. అరుణాచలమునందున్న కొండ సాక్షాత్తూ శివరూపమయినట్లే, ఈ కురుంగడ్డ సాక్షాత్తూ శ్రీవల్లభులవారి రూపమే. అరుణాచలశివలింగమందు శివశక్తులున్నట్లు, శ్రీపాద శ్రీవల్లభ రూపమునందు గూడా శివశక్తులున్నవి. అరుణాచలమునందలి మహాసిద్ధుని రూపమునందున్న పరమేశ్వరుని దర్శనము అత్యంత దుర్లభము. అయితే శ్రీపాద శ్రీవల్లభరూపమునవున్న ఈ మహాసిద్ధ రూపము సాధకులకు అత్యంత సులభముగా దర్శనమగునని శ్రీవల్లభులే స్వయముగా తెలిపిరి. కావున కురుంగడ్డ దర్శిస్తే అరుణాచలమును దర్శించినట్లే.

పీఠికాపురంలో జన్మించి వారి లీలావినోదాలను పదహారు సంవత్సరాలపాటు ఆ ప్రాంత భక్తులందరికీ ప్రదర్శించి, అటుపై సన్యసించి, దేశాటన చేసిన వల్లభులు తమ చివరి మజిలీగా కురువపురాన్ని ఎన్నుకున్నారు. పీఠికాపురంలో వారు దైవత్వాన్ని ప్రదర్శిస్తే, కురువపురంలో గురుత్వాన్ని చూపించారు. ఎన్నో ఆధ్యాత్మిక బోధనలు చేసి, జనుల బాధలను నివృత్తి చేయుటయేగాక, వారిని సన్మార్గంలో నడిపించి, వారి దృష్టిని ఆధ్యాత్మికతవైపు, ధర్మవిచారణవైపు నడిపిస్తూ, బోధ గురువుగా మారి సమాజం పట్ల గురువులకున్న బాధ్యతను గూడ నిర్వర్తించారు.

తదుపరి జన్మలో శ్రీనృసింహసరస్వతిగా అవతరించిన శ్రీవల్లభులు కురువపురం వచ్చి శ్రీవల్లభుల మందిరాన్ని దర్శించి, ఆ స్థలాన్ని తమ పాదస్పర్శతో గూడ పావనం చేసారు. అంటే మరొక అవతారంలో కూడ గతస్మృతుల కోసం వారు పరితపించారని గోచరిస్తుంది.

ఎంతో మహిమగల కురువపురమను ఈ తపోభూమిని మరింత శక్తిమంతము చేయుటకు, ఇక్కడే తమ అవతారము పరిసమాప్తి చేసి, వారి తీపి జ్ఞాపకాలను భక్తులకు వదలి, ఈనాటికీ గూడ అదృశ్యరూపంలో ఈ ప్రాంతమందు సంచరిస్తూ, భక్తుల అభీష్టములు తీర్చుతూ వారిని శ్రీవల్లభులు రక్షించుచున్నారు. అందుకే కురువపురములోని కృష్ణానదీ తీర ప్రాంతమంతా వల్లభుల ఆధ్యాత్మిక బోధనలతో మార్మోగి, ఒక బోధనాతీరంగా యోగులకు, సాధకులకు ప్రశాంత వాతావరణంతో ఈనాటికి గూడ సాక్షాత్కరిస్తోంది.

దత్త, వల్లభ భక్తులందరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల మహబూబ్‌నగర్‌కు 75 కి.మీ. దూరంలో ఉన్న మక్తల్ అను గ్రామ సమీపంలో కృష్ణా నదీ తీరమున గల పంచదేవపహడ్, శ్రీవల్లభాపురం మరియు కురువపురాలను దర్శించి, తరించాలి.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

## అధ్యాయం-12

# యోగపతిగా శ్రీవల్లభుల మహిమలు

శ్రీవల్లభులు 16 సంవత్సరములు పిఠాపురంలో గడిపి, సన్యాసం స్వీకరించి, దేశాటన చేసి, తమ ఆధ్యాత్మిక తీరమైన కురుంగడ్డ చేరుకున్నారు. కురుంగడ్డలో స్వామి యోగీశ్వరునిగా, యోగనాధునిగా వినుతికెక్కారు. యోగులకు యోగ విద్యారహస్యాలను ఆయన ప్రభోదించారు. అందుకే ఆయన గురువులకు గురువుగా, జగద్గురువుగా ప్రఖ్యాతినొందారు. శ్రీవల్లభులవారిని తెలుసుకోవాలంటే జ్ఞానమార్గమే ఉత్తమమైనది. జ్ఞానానికి సోపానం యోగము. ఆ యోగానికే పతి శ్రీవల్లభుడు.

వారు కురుంగడ్డలో రాత్రివేళల్లో దేవతలకు దర్శనమిచ్చేవారు. బ్రహ్మీముహూర్తంలోనే కృష్ణానది దాటి స్నాన, అనుష్టాన, సూర్యనమస్కారములన్నీ ప్రతీ నిత్యం పూర్తి చేసుకుని, కృష్ణా తీరమందు దర్బారు నిర్వహించేవారు. బాల్యదశలో వారి విధానాలు ఒక విధంగా ఉంటే వారు ఆ బాల్యదశ దాటి కౌమారదశలోకి రాగానే వారు కురుంగడ్డ చేరుకుని, వారినాశ్రయించిన వారందరికీ కొంగు బంగారమై అభీష్టాలు సిద్ధింపజేసారు. కురుంగడ్డలో శ్రీవల్లభుల దర్శనం చేసుకోవాలని ఎంతో ఆతృతగా కన్యాకుమారి నుండి బయలుదేరిన శంకరభట్టుకు మార్గమధ్యంలో శ్రీవల్లభులు ఎన్నో మహిమలు చూపారు. శంకరభట్టుకు, ధర్మగుప్తులవారికి దశమహావిద్యల అనుభవం కలుగజేసారు. వల్లభేశునికి భవిష్యత్తులో జరుగబోవు విపత్తును కళ్లకుకట్టినట్లు చూపారు. అంబికకు తామే ఆమెకు పుత్రునిగా జన్మిస్తానని వరమిచ్చి, ఆమె కుమారుని పండితునిగా తీర్చిదిద్దారు. ఎంతో మందికి యోగ రహస్యాలను, దైవరహస్యాలను తెలిపి, జ్ఞానులుగా తీర్చిదిద్దారు. భక్తుల కడగండ్లు బాపి, వారి నొసట చిరునవ్వులు ప్రసాదించారు.

బాల యతిగా వారు చేసిన లీలలు కేవలం దుష్టులను సంస్కరించి, వారిలో పరివర్తన తేవాలనే ధ్యేయంతో చేసినవి. ఆ ప్రక్రియలో భాగంగా ముందుగా గర్వభంగంచేసి, అహంకారం అణిగిన పిదప, అనుగ్రహం చూపి వారిని బ్రోచేవారు. వారిలో నరసావధానులు, కులశేఖరుడు, వేదాంతశర్మ ఇలా ఎంతోమందిని వల్లభులు సంస్కరించారు. అలా 16 సంవత్సరాలపాటు పీఠికాపురంలో తమ లీలలను ప్రదర్శించారు. యోగానికి మూలపురుషుడై యోగశ్రీకి పతిగా, అనఘాలక్ష్మీ సమేతుడైన దత్తుడు, శ్రీవల్లభుల రూపంలో కురుంగడ్డలో కేవలం బోధగురువుగానే భక్తులను సంస్కరించారు. ఆ క్రమంలోనే వారెన్నో మహిమలు చేసారు. ఆ మహిమలు కొన్ని అధ్యయనం చేస్తే దత్త తత్త్వములోని అంతరార్థం గ్రహించవచ్చు. కురుంగడ్డలో భక్తులకు శిరోధార్యాలైన ఎన్నో బోధలు, నీతులు, ధర్మాలు, ఆచార వ్యవహారాలు, కాలజ్ఞానాలు, శ్రీవల్లభులు విశదీకరించారు. ఎంతోమందికి వారి దర్శన, స్పర్శన, సంభాషణ, సహవాస భాగ్య చతుష్టయములను ప్రసాదించారు.

శ్రీవల్లభులు తమ బాల్యంలో పీఠికాపురంలోను, సన్యాసాశ్రమం స్వీకరించిన పిదప కురువపురంలోనూ కూడ తమతరువాతి అవతారమైన శ్రీనృసింహసరస్వతి వారి జననములో కలుసుకొనగోరు ప్రముఖులకు, మరుజన్మములో వారు సంచరించవలసిన ప్రదేశాలతోబాటు వ్యక్తిత్వ రూపాలను గూడ నిర్దేశించారు. పిఠాపురంలోని నరసావధానులతో నృసింహసరస్వతిగా అవతరించినపుడు, బీద బ్రాహ్మణునిగా జన్మిస్తావని, అపుడు ఆతని ఆతిధ్యము స్వీకరిస్తానని తెలిపినారు. వెంకటప్పయ్య శ్రేష్ఠికి గూడ నృసింహసరస్వతిగా దర్శనభాగ్యం కలుగజేస్తానని తెలిపారు. మాధవాచార్యుడను అవధూతతో 'నరహరి' నామధేయముతో జన్మించి నేను వచ్చే జన్మలో నీవద్ద సన్యాస దీక్ష తీసుకుని, నృసింహసరస్వతిగా విఖ్యాతుడనౌతానని తెలిపారు. ఇలా పీఠికాపురంలోనే వారు తమ నృసింహసరస్వతి అవతారానికి పునాదులు వేసుకున్నారు. అలాగే గంధర్వపురంలో తాము నృసింహసరస్వతిగా అవతరించినపుడు ఆంజనేయశర్మ నందిశర్మగా, వాసుదేవరావు నరకేసరిగా, నిర్మలానంద త్రివిక్రమభారతిగా అంబిక తన తల్లిగా జన్మిస్తారని తెలిపారు. సవితృకాఠకచయన యజ్ఞ

భస్మముపడిన గంధర్వపురములో శ్రీనృసింహసరస్వతిగా నివసిస్తానని స్థల నిర్ణయం కూడ శ్రీవల్లభులు చేసుకున్నారు. నిజానికి శ్రీదత్తాత్రేయస్వామి కూడ తాము శీలుడు, సుశీల దంపతులకు మరుజన్మలో వారికి కుమారుడుగా వల్లభనామధేయంతో సవితృకాఠకచమనయజ్ఞం జరిపిన పీఠికాపురంలో జన్మిస్తానని వారి పూర్వజన్మములోనే తెలిపారు.

ఇంతమందికి తమ సాంగత్యమును వచ్చే జన్మలోకూడ కొనసాగించిన శ్రీవల్లభులు, తమ అత్యంత ప్రియతమభక్తుడైన శంకరభట్టుకు ఏ వరమూ ఇవ్వలేదు. శంకరభట్టు కోరనూలేదు. దీని అర్థం శంకరభట్టు యొక్క అనంగభక్తికి వారెంతో ప్రసన్నులై అతనికి మరుజన్మ లేకుండా అంటే జన్మరాహిత్యం ప్రసాదించి, కైవల్యం అనుగ్రహించారని అర్థం చేసుకోవాలి.

దీనిని బట్టి దత్తాత్రేయుని తత్త్వము చాల విచిత్రమైనదని, విలక్షణమైనదని తెలియుచున్నది. "ఏమీకానిది, ఏమీలేనిది, ఏకమై అంతటా తానున్నది" అన్నట్లుగా వారి తత్త్వము ఈ జగత్తులో అణువణువునందూ నిండియున్నది. దత్త నామస్మరణమే సమస్తపాపహరణము.

## 1. పండితుని రజకునికి సేవకునిగా మార్చుట

వేదశాస్త్రములను అభ్యసించిన పండితుడొక్కడు, శ్రీపాదుల వారి దర్శనార్థమై కురుంగడ్డకుపోవుచూ, నదిని దాటుటకై ఒక పడవ ఎక్కెను. అతడు పడవను నడుపు రవిదాసుతో తాము పండితులముగావున, వేరెవరిని పడవ ఎక్కనీయవద్దని గట్టిగా చెప్పెను. అంతట రవిదాసు అతనితో కిరాయిగా అధిక మొత్తమీయవలసియుండునని పండితునితో అనెను. అంత పండితుడు తమ పాండిత్యము చూచి వల్లభులు తమకు మంచి సంభావన ఇచ్చెదరని, దానితో అతనికి కూడా ఎక్కువ మొత్తమిచ్చెదనని తెలిపెను. వారిరువురూ శ్రీవల్లభుల వారి దర్శనమునకు వెళ్ళిరి. పండితుని చూచి, శ్రీవల్లభులు ఉగ్రులై కోపముతో ఓరీ! పండితుడనన్న గర్వముతో విర్రవీగుతూ, కట్టుకున్న ఇల్లాలును ఇబ్బందులకు గురిచేస్తూ, ఒక రజక స్త్రీని భర్త నుంచి వేరు చేసి నీ ఉంపుడుగత్తెగా ఉంచుకుంటివి. నీ భార్య యొక్క ప్రార్థనలు విన్న నేను, ఈనాడు నిన్ను ఇక్కడకు రప్పించితిని. నీ జాతకము ప్రకారము నీకు ఈరోజే మరణము లిఖింపబడియున్నది. మునిగిపోవలసిన పడవ నుండి నిన్ను కాపాడినాను. దానితో నేను నీకు ఆయుర్దాయము మరో మూడు సంవత్సరములు పెంచినాను. నీవు ఇంటికి పోయి నీ ప్రవర్తన మార్చుకుని, మంచివానిగా మెలగవలయును. నీ జాతకము ప్రకారము వచ్చే జన్మలో ఈ రజకవనిత నీకు భార్యకావలసియుండగా, నీవు ఆమెను తన భర్త నుంచి వేరు చేసి ఈ జన్మలోనే చెరపట్టితివి. నియమాలను ఉల్లఘించిన నీవు వచ్చే జన్మలో నపుంశకుడవై ఆ రజకదంపతులకు సేవకునిగా జన్మించెదవుగాక. ఈ మూడు సంవత్సరములు సత్ప్రవర్తనతో మెలగినచో వచ్చే జన్మలో రజకవనితకు సేవచేస్తూ, అన్నోదకములు లోటు లేకుండా పొందెదవని హెచ్చరించిరి. నీవింతవరకూ ఆర్జించిన పుణ్యమునంతయు ఆ పడవవానికి ఇచ్చివేయుచున్నానని తెలిపి, ఆ పండితుని వెడలగొట్టిరి.

## 2. వల్లభేశుని పునర్జీవితునిగా చేసిన శ్రీవల్లభులు

ఒకనాడు పీఠికాపురము నుంచి వల్లభేశ్వరశర్మ అనునాతడు శ్రీవల్లభుల దర్శనార్థమై కురుంగడ్డకు వచ్చెను. స్వామి అతనిని ఆదరించి, పీఠికాపురవాసుల యోగ క్షేమ సమాచారములు అడిగి తెలుసుకున్నారు. ఇంతలో అక్కడనున్న సుబ్బన్న శాస్త్రి అనునాతడు తన కుమార్తె వివాహమునకై ఒక మంచి సంబంధము చూడమని స్వామిని అర్థించెను. ఆమెకు వల్లభేశ్వరశర్మను వరునిగా స్వామి నిర్ణయించగా, కన్యాదాత గృహమున వారికి వివాహము జరిగెను. స్వామివారి ఆశీస్సులను ఆ దంపతులు పొందిరి. అటుపై వల్లేభేశ్వరశర్మ (వల్లభేశుడు) వేరేగ్రామంలో పసుపు వ్యాపారము చేయుచూ, వల్లభుల అనుగ్రహమున తనకు లాభము వచ్చినచో కురుంగడ్డకుపోయి వేయిమంది బ్రాహ్మణులకు అన్నదానము చేయుదునని మ్రొక్కుకొనెను. వల్లభుల దయవలన వ్యాపారమందు విశేషలాభము పొంది, ధనముతో తన మ్రొక్కు తీర్చుకొనుటకు కురుంగడ్డకు ప్రయాణమయ్యెను. తమ అవతార పరిసమాప్తి అయిన తరువాత గూడ కురుంగడ్డలో అదృశ్యరూపముతో శ్రీవల్లభులు సంచరించేవారు. దారిలో నలుగురు దొంగలు యాత్రికుల వేషము ధరించి, వల్లభేసుని కలుసుకొని వారు కూడా కురుంగడ్డకు పోవుచున్నట్లు నటించి, వల్లభేసునితో సఖ్యము చేసిరి. వారు కొంతదూరము

పోగానే, ముగ్గురు దొంగలు, వల్లభేశునిపై విజృంభించి, ధనము అపహరించి, అతనిని చంపవలెనని ప్రయత్నము చేయుచుండిరి. వల్లభేశుడు శ్రీపాద వల్లభుల నామము స్మరిస్తూ వారిని ప్రతిఘటించుచుండెను. కాని బలశాలులైన ఆ దొంగలు, వల్లభేశుని పైబడి అతని తలను నరికివేసి, మొండెమును ప్రక్కన పారవేసిరి. అటుపై అతని దేహము దగ్ధము చేసి ఆనవాళ్లు లేకుండా చేయాలని ఏర్పాట్లు చేయుచుండిరి. అంతలో, భక్తరక్షకుడైన శ్రీవల్లభుడు జడలు, భస్మము, త్రిశూలము ధరించి యతిరూపంలో అక్కడ ప్రత్యక్షమై వారిలో ముగ్గురు దొంగలను తన త్రిశూలముతో చంపివేసెను. నాల్గవవాడు తాను దొంగను కాదని, వారిని కేవలం మార్గమధ్యంలో కలసినానని, తనను రక్షించమని వేడుకుంటూ వారి పాదములపైబడెను. దయాంతరంగులైన గురువల్లభులు అతనికి కొంత విభూదినిచ్చి, వల్లభేశుని తలను, మొండెమును దగ్గరగా నుంచి వాటిపై విభూదిజల్లి అతికించమని ఆజ్ఞాపించిరి. అతడు అట్లు చేయగానే వల్లభేశుడు బ్రతికెను. ఇంతలో స్వామి అదృశ్యమయ్యెను. పునర్జీవితుడైన వల్లభేశునితో, ఆ నాల్గవవాడు జరిగిన వృత్తాంతమంతయు వివరముగా తెలిపెను. వల్లభుల దర్శనమైనందుకు ఆ దొంగ ఆనందపడగా, తనకు ఆ భాగ్యము కలుగలేదని వల్లభేశుడు వాపోయెను. వేయిమంది బ్రాహ్మణులకు సంతర్పణ చేయుశక్తి తనకు చాలా కాలం క్రిందటే కల్గిననూ, కాలయాపన చేసి, ఇక్కట్లు తెచ్చుకున్నానని బాధపడెను. కురుంగడ్డచేరి, నాల్గువేల మంది బ్రాహ్మణులకు కురుంగడ్డలో అన్న సంతర్పణ చేసి తన మ్రొక్కు తీర్చుకొనెను.

ఒకసారి వల్లభేసుడు తనపై జరిగిన హత్యా ప్రయత్నంపై సింహావలోకనం చేయగా, గతంలో ఒక పర్యాయము కురువపురంలో తన భార్యతో శ్రీవల్లభుల దర్శనమునకు పోయినప్పుడు, భవిష్యత్తులో ఈపైన తెలిపిన సంఘటన తప్పక జరుగునని వల్లభులు అతనిని హెచ్చరించినట్లుగా గుర్తుకుతెచ్చుకొనెను. ఆనాడు వారు తనను రక్షించెదనని ఇచ్చినమాట ప్రకారము, వారు తనను రక్షించి వారి మాటను నిలుపుకున్నందుకు మనస్సులో స్వామివారికి కృతజ్ఞతలు తెలుపుకొనెను. ఆస్థి తగాదాలతో మరణించిన తన దాయాదులు, బ్రతికివున్న రోజుల్లో తన ఆస్థి అపహరించి, బికారిని చేయడమే కాకుండా, మరుజన్మలో వైరభావముతో దొంగలుగా జన్మించి భవిష్యత్తులో తనను చంపివేస్తారని వల్లభులు ఎంతో ముందు గానే తెలిపిన విషయాన్ని కూడ అతడు స్ఫురణకు తెచ్చుకొనెను. తనపై స్వామి చూపిన కరుణామృతమునకు ఎంతగానో మురిసిపోయి. మనస్సునందు స్వామికి కృతజ్ఞతాంజలి ఘటించెను. కాని తాను అన్నదానము చేయునాటికే శ్రీవల్లభులు అవతారం చాలించినారన్న విషయం తెల్సుకుని ఎంతో బాధపడెను. భౌతికముగా వారాప్రాంతమునందు లేనప్పటికీ, అదృశ్యరూపములో ఆ ప్రాంతమందు సంచరించుచున్నారనుటకు ఈ సంఘటన ప్రత్యక్ష నిదర్శనముగా నిలిచినది.

## 3. వల్లభులు మంత్రాలయము ఆవిర్భావము గూర్చి వివరించుట

ఒకసారి కురువపురంలో గురుచరణుడు, శంకరభట్టులను శ్రీవల్లభులు కృష్ణానది ఆవలి ఒడ్డున గల మాంచాల గ్రామముపోయి, అచ్చటి గ్రామదేవత దర్శనము చేసుకొని రమ్మని ఆజ్ఞాపించిరి. భవిష్యత్తులో మాంచాల గ్రామము విశ్వవిఖ్యాతమగునని, అచ్చట ఒక మహాపురుషుడు జీవసమాధి నొందునని, ఆయన లీలలు చిత్రవిచిత్రములు కాగలవని తెలిపిరి. వారిరువురు మాంచాల గ్రామము చేరి, ఆ గ్రామ దేవతకు పూజలు చేసిరి. ఆ గ్రామదేవత వారికి దివ్యదర్శనమిచ్చి, పూర్వము ప్రహ్లాదునకు గురుబోధ చేసిన, దత్తాత్రేయులవారే నేడు భూలోకమున శ్రీపాదశ్రీవల్లభరూపములోనున్నారని, రాబోయే శతాబ్దములలో ప్రహ్లాదుడే గురుసార్వభౌముడైన శ్రీరాఘవేంద్రస్వామియను పేరున ఇచ్చట అవతరించుననియు, ఈ ప్రదేశము మంత్రాలయమను పేరుతో సుప్రసిద్ధి కాగలదనియూ, విశదీకరించెను ఈ విషయములన్నియు తనకు శ్రీవల్లభులే వివరించారని, వారి లీలలు అనూహ్యములని తెలుపుచూ, వారికి స్వహస్తములతో ప్రసాదమిచ్చి ఆ గ్రామ దేవత అంతర్ధానమయ్యెను.

## 4. అనఘాష్టమి

అఘము అంటే పాపము. పాపములేనివాడు దత్తాత్రేయస్వామి. అనఘాదేవికి ప్రభువు అనఘుడు. ప్రతి మాసమునందు వచ్చు బహుళాష్టమిని 'అనఘాష్టమి' అని అంటారు. బహుళాష్టమి దినమున అనఘాష్టమీ వ్రతము చేసుకొని, పదకొండుమంది బ్రాహ్మణులకు భోజన, దక్షిణతాంబూలాలు ఇచ్చినచో ఎన్నో శుభఫలితములతోబాటు,

కోరినకోర్కెలు సిద్ధించును. వీలు, శక్తిలేని భక్తులు తమకు తోచిన ధనమును అనఘాష్టమీ వ్రత అనంతరము బ్రాహ్మణ భోజన, దక్షిణ తాంబూలాలకు బదులుగా ఏ దత్తాత్రేయస్వామి దేవాలయమునందుగాని, శిరిడీ సాయిబాబా దేవాలయమునందుగాని సమర్పించుకొని దత్తుని దయకు పాత్రులు కావచ్చును. దత్తుడు 'స్మర్తృగామి' అను పేరుతో ప్రసిద్ధినొందిన భగవతాస్వరూపము. స్మర్తృగామి అనగా పిలిచిన వెంటనే పలికెడి తత్త్వము గలవాడు. తన భక్తుల కష్టనష్టములను రూపుమాపి, ఇహపరసుఖములను ప్రసాదించగల సర్వసమర్థుడు.

## 5. రమణి వివాహము జరిపించిన వల్లభుడు

దశమహావిద్యలలో కాళీమాత ఆరాధన ఒకటి. కాళీమాత ప్రేమ, శాంతి, దయ మున్నగు శుభలక్షణములను ప్రసాదించును. సాధకునిలోనున్న రాక్షసశక్తులను, కామక్రోధాధులను ఆమె హర్షింపదు. బలిదానములు కోరదు. సాధకుడు మాంత్రికుల రూపమెత్తి ప్రజలను మోసగించినచో, కాళీమాత సాధకులపై విజృంభించి, వారిని నాశనము చేయును. మాంత్రికుల వల్ల ఇబ్బందులు పడుతున్న భక్తులను వల్లభులు ఆదుకుని రక్షించేవారు.

పంచదేవ్‌పహడ్ అను గ్రామమునందు నరసింహరాయుడను వల్లభుల భక్తుడుండేవాడు. తల్లిదండ్రులు లేని యాతడు మేనమామ ఇంట పెరిగెను. మేనమామ భార్య, అతని చేత ఇంట, బయట చాకిరీ చేయించటమేగాక, అతనిని దుర్భాషలాడుచూ, అతనికి పాచిపోయిన అన్నము పెట్టుచూ, నానా ఇబ్బందులకు గురిచేసేది. మేనమామ కుమార్తె అయిన రమణి శ్రీకృష్ణుని భక్తురాలు. ఆమె బావపై జాలితో తల్లి చూడకుండా అతనికి మంచి భోజనము ఇచ్చెడిది. ఇది చూచి తల్లి కోపముతో కుమార్తెను గూడ తిట్టెడిది. అయితే బావపై మరులు గొన్న, రమణి అతనిని వివాహము చేసుకొనవలెనని కోరికతో యుండెడిది. ఆస్థిపాస్థులులేని, శరీర దౌర్బల్యము కల్గిన అతనికి తన కుమార్తెను ఇచ్చి వివాహము చేయుటకు ఆమె తల్లికి ఎంత మాత్రము ఇష్టము లేకుండెను. ఆ ఊరులో గల మంత్రతంత్రములు తెలిసిన ఒక దొంగ సాధువు వారి ఇంటికి వచ్చి, మాయమాటలు చెప్పి, కాళీమాత పూజలు చేసినచో, వారికి నిధి నిక్షేపములు దొరకగలవని ఆశజూపి, ప్రతిరోజు మేనమామ ఇంట పూజలు చేయుచుండెను. జంతు బలులను ఇచ్చుచుండెను. ప్రతిరోజు ఆ గృహము రక్తశిక్తమగు చుండెను. ఆ దొంగ సాధువు కన్ను రమణిపైబడి వశీకరణతంత్రము ద్వారా ఆమెను పాడుచేయాలని పన్నాగము పన్నెను. క్షుద్రశక్తుల వల్ల రమణి ఆరోగ్యం కూడ క్షీణించి, వింతగా, భూత, ప్రేతములవలె ప్రవర్తించుచుండెను. ఒకనాటి రాత్రి దొంగ సాధువు రమణిని సమీపించి, బలాత్కరింపబోవగా, ఆమె అతనిని ఇనుపకడ్డీతో కొట్టగా అతడు పారిపోయెను. రమణి మరియు నరసింహరాయుడు తమను ఈ కష్టముల నుంచి రక్షించమని వల్లభులను ప్రార్థించుచుండిరి.

ఒకనాడు ఒక బడుగుబ్రాహ్మణుడు వారి ఇంటికి భిక్షకోరుతూ వచ్చెను. ఆయనకు భిక్షలేదని అతని అత్త వెళ్లగొట్టుచుండగా, నరసింహరాయుడు ఎప్పటి నుండియో తన వద్దనున్న వెండి తాయెత్తునొకదానిని భిక్షగా వేసెను. వెంటనే ఆ బ్రాహ్మణుని దేహము నుండి కాంతి పుంజములు వెలువడి, దొంగసాధువులోనికి ప్రవేశింపగా అతడు రక్తము కక్కుచూ పడిపోయెను. నరసింహరాయుడి అత్తకు పక్షవాతము వచ్చి మూలపడెను. రమణి ఆరోగ్యము కుదుటబడెను. అంతలోనే ఆ బడుగు బ్రాహ్మణుడు అదృశ్యమయ్యెను. ఆర్తత్రాణపరాయణుడైన, సర్వదేవతా స్వరూపులైన పండ్రెడు సం॥ల బాలకునిగా శ్రీవల్లభులు దర్శనమిచ్చి, రమణి, నరసింహరాయుల వివాహము తమ స్వహస్తములతో జరిపించి, ఆశీర్వదించి అతని అత్తను పక్షవాతము నుండి కాపాడిరి.

## 6. స్వర్ణపీఠికాపురము మహాయోగుల కొరకు ప్రతిష్ఠించుట

స్వర్ణపీఠికాపురమన్నది భౌతికముగా లేదు. ఇది కేవలము శ్రీవల్లభులు, యోగులు, మహాపురుషుల కొరకై చైతన్యముతో నిర్మించిరి. సాధకునిలో ఆ చైతన్యమునకు సంబంధించిన జ్ఞానయోగములు ప్రతిష్ఠితమైనపుడు అతడు స్వర్ణ పీఠికాపురవాస్తవ్యుడగును. ఇందు అనేక సౌధములుండును. దీనినెవరూ తమ కన్నులతో చూడలేరు. కేవలం జ్ఞానచక్షువులతోను, యోగచక్షువులతోను మహాసాధకులు మాత్రమే ఈ స్వర్ణపీఠికాపురమును వీక్షించగలరు. దీనిలో నివసించుటకు శ్రీవల్లభులను మనో, వాక్కాయ, కర్మలందు సదా నిలుపుకోవలయును. శ్రీపాదులవారి అనుగ్రహముతో

సాధకులు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములను పిలువబడు పంచకోశములతో తమ యొక్క యాత్రను తమ చైతన్యముతో చేయగలిగిన సాధకులకు స్వర్ణపీఠికాపుర దర్శనమగును. అన్నంతో ఉత్పన్నమైన శరీరాన్ని అన్నమయకోశమని అంటారు. ప్రాణమయకోశమంటే కర్మేంద్రియాలతో కూడిన ప్రాణమే. మనోమయకోశమంటే జ్ఞానేంద్రియాలతో మనస్సు కలసినది. జ్ఞానేంద్రియాలతోను, వృత్తులతోను కూడిన బుద్ధిని విజ్ఞానమయకోశమంటారు. ఆనంద స్వరూపముతో ఆత్మ స్పందించి ఆనందించుటయే ఆనందమయకోశమనబడును. ఈ అయిదు కోశాలలో పరబ్రహ్మ నివాసమంటాడు. అన్నమయకోశమందలి జీవులు భౌతిక ప్రపంచంతోను, ప్రాణామయకోశమందలి జీవులు సూక్ష్మశరీర చైతన్యముతోను, విజ్ఞానమయకోశమందలి జీవులు విజ్ఞాన ప్రపంచంతోను, ఆనందమయకోశమందలిజీవులు ఆనందానుభవము తోను ఉందురు. దత్తారాధన వల్ల వారు ప్రాణమయశక్తిని ఒకానొక యోగ ప్రక్రియగా ఇతర జీవుల ప్రాణమయశక్తితో అనుసంధానించెదరు. తద్వారా ఈ తాదాత్మ్యభావము కలిగి ఇది సాధ్యపడును.

సాధకులకు అన్నమయకోశమునకు సంబంధించిన భౌతిక పీఠికాపురమున్నది. ప్రాణామయకోశమునకు సంబంధించిన భౌతికప్రాణమయ పీఠికాపురమున్నది. మనోమయకోశమునకు సంబంధించి మనోమయ పీఠికాపురమున్నది. విజ్ఞానమయకోశమునకు సంబంధించిన విజ్ఞానమయ పీఠికాపురమున్నది. అదేవిధంగా ఆనందమయ కోశమునకు సంబంధించిన ఆనందమయ పీఠికాపురమున్నది. వీనినే వల్లభులు స్వర్ణపీఠికాపురమని పిలిచేవారు. ఇది సాధకుల ఆధ్యాత్మిక అనుభవమునుబట్టి మనోనేత్రమునకు దర్శనమగును.

ఇదేవిధంగా ఎంతోమంది సాధకులు తమ పంచకోశముల యాత్రతో, తమలోని మానసిక చైతన్యము ద్వారా, కాశీవిశ్వేశ్వరుని సదా తమ మనసునందు నిలుపుకొని, పైన తెలిపిన వివిధ పీఠికాపురములను తమ మనోనేత్రములతో దర్శించినట్లే స్వర్ణ కాశీమహా పుణ్యక్షేత్రమును గూడ తమ మనో నేత్రములతో దర్శించేవారు. ఈ పై విషయములన్నీ అనుష్ఠానపరులకు మాత్రమే అవగతమగును గాని సామాన్యులకు ఎంతమాత్రము అర్థముగావు.

## 7. చిన్నమస్తాదేవి

దశమహావిద్యలలో మరొకటి చిన్నమస్తాదేవి ఆరాధన. అర్ధరాత్రి మాత్రమే చేయు ఈ ఆరాధన శత్రువిజయము, రాజ్యప్రాప్తికి, మోక్షము పొందుటకు చేయుదురు. వల్లభుల దయ వలన స్త్రీగా మారిన వల్లభభక్తుడైన శంకరభట్టు తిరిగి పురుషునిగా మారెను.

అరణ్య ప్రాంతమునుండి పీఠికాపురము పోవుచున్న శంకరభట్టు, ధర్మగుప్తులకు కొందరు యోగినులు కన్పించిరి. తాము చిన్నమస్తాదేవి ఉపాసకులమని, ఆ ప్రాంతములో పురుషులు సంచరించరాదని తెలిపి, ముందుకుపోరాదని వారిని అడ్డగించిరి. అంతలో ఒక యోగినీమాత వచ్చి వారిని బంధించి, వారి చేత స్త్రీ దుస్తులైన కోక, రవిక ధరింపజేసినది. ఆమె మాయా ప్రభావము వల్ల వారిలోని పురుష లక్షణములుపోయి, పాలిండ్లతో సహా స్త్రీ లక్షణములన్నియూ క్షణములో వారికి వచ్చి, వారి స్వభావములు స్త్రీ స్వభావములుగా మారి, ఇతర యోగినిలతో స్త్రీలవలె సంచరించసాగిరి. ఇంతలో అర్ధరాత్రి కాగానే ఆ యోగినీమణులు మేళ, తాళములతో పెద్ద జాతర చేయుచుండిరి. ఆ జాతరలో కనీసము ఇద్దరు స్త్రీలను వారు అమ్మవారికి బలియిచ్చెదరని, క్రొత్తగా స్త్రీలుగా మారిన వారిద్దర్నీ బలియిచ్చుటకు ఆ యోగినీ మాత నిర్ణయించినదని వారికి తెలిసినది. ఇది విని వారెంతో భయభ్రాంతులైరి. యోగినీమణులు వారిద్దరికీ వేపాకులు మెడకు కట్టి, కుంకుమ, పసుపు మొదలైనవి వారి నుదుట పట్టించి, వారిని బలికి సిద్ధము చేసిరి. స్త్రీలుగా మారిన శంకరమ్మ అను శంకరభట్టు, ధర్మమ్మ పేరుతోనున్న ధర్మగుప్తులు వల్లభుల వారిని తదేక దీక్షతో రక్షించమని ప్రార్థించుచుంటిరి. ఇంతలో పెద్ద ఖడ్గము ధరించి, యోగినీమాత వచ్చి, వారి శిరస్సులను ఖండించినది. అందుడి పారుతున్న రక్తధారలను యోగినీమణులు పానము చేయుచుండిరి. శిరములు ఖండించబడిననూ, వల్లభుల కరుణవల్ల, వారు ప్రాణములతో ఉండి కాయము నుండి వేరైన తలతో జరుగుచున్నదంతా వీక్షించుచుండిరి. వారు సజీవులుగా ఉన్నట్లు తోచుచున్నప్పటికీ, తల, మొండెము వేరుగా పడియున్నందువల్ల, వారిపై తెలియని మత్తు ఆవహించినది. తెల్లవారుచుండగానే, ఆ యోగినీమణులు, గాలిలో

కలసిపోయి, అదృశ్యమైరి. విచిత్రముగా వేరుచేయబడిన వారి తల, మొండెములు తిరిగి అతికించబడి, వారు సజీవులైరి. వారి స్త్రీ దుస్తులు, లక్షణములు మాయమై, తిరిగి పురుష లక్షణములతోబాటు, నూతన దుస్తులు వారికి వచ్చినవి.

అంతలో వారిని కలసిన ఒక బాటసారి వారు అనుభవించిన స్థితి ఒక రహస్యమైన యోగ ప్రక్రియగా తెలిపి, దీని వలన అదృష్టవంతులకు మాత్రమే వారియందున్న స్త్రీ, పురుషతత్త్వములు పరిశుద్ధము చేయబడునని, తద్వారా ఆ వ్యక్తులలో యోగశక్తి, విశ్వచైతన్యము కలుగునని తెలిపెను. ఇది అంతయు వల్లభుల లీలగా తలచి, సజీవులైనందుకు వారెంతగానో వల్లభులకు కృతజ్ఞతలు తెల్పుకొనిరి.

## 8. 'విశ్వాసోఫలదాయకం' అన్న లోకోక్తిని నిరూపించిన వల్లభులు

'విశ్వాసోఫలదాయకం' అంటే పనిఏదైనా తప్పక ఫలిస్తుందన్న ధృఢమైన విశ్వాసముంటే అది తప్పకుండా సఫలీకృతమవుతుందని లోకోక్తి. ఒకసారి నవదంపతులు శ్రీపాదులవారి దర్శనార్థమై కురుంగడ్డకు వచ్చిరి. వారికి వల్లభులు ఆశీర్వచనములు ఇచ్చి వారిని తమ దర్బారైన పంచదేవపహాడ్ నందు కొంతకాలముండమని ఆదేశించారు. అందుకు గల కారణమెవ్వరికీ స్ఫురించలేదు. పంచదేవపహాడ్ నందు రెండు రోజులుండేసరికి, ఆ నవవధువు భర్త మరణించెను. దీనితో ఎంతో దుఃఖముతో శ్రీవల్లభులు మహాగురువులని, ఎన్నో చల్లని వరములిచ్చే దైవమని, సంపూర్ణ విశ్వాసముతో వచ్చితిమని కాని తన కర్మము ఇలా కాలినదని ఎంతగానో ఆ స్త్రీ యేడ్చుచుండెను. అతిచిన్న వయస్సులోనే, అదియునూ వివాహము కాగానే ఆ నవవధువుకు ప్రాప్తించిన వైధవ్యమునకు అచ్చటి ప్రజలతోబాటు, ఆ దుర్వార్తవిని వచ్చిన వారి బంధువులందరూ మిక్కిలి బాధతో విలపించుచుండిరి. శవదహనమునకు తగిన యేర్పాట్లు చేయవలెనని, వారి బంధువులు యోచించుచుండగా, దర్బారులోనున్న శవము శ్రీవల్లభులవారి అనుమతి లేనియెడల బయటకు తీసికొని వెళ్లరాదని దర్బారు నందలి శ్రీవల్లభుల శిష్యులు నిరోధించిరి.

ఇంతలో శ్రీవల్లభులు దర్బారుకు వచ్చి ఆశీనులైరి. శిష్యులు స్వామి కడకేగి జరిగినదని విన్నవించిరి. శోకదేవతవలే యేడ్చుచూ, నిట్టూర్చుచూ స్వామి చెంతకేగి, తనకు పతిభిక్ష పెట్టమని ఆ నవవధువు స్వామి పాదాలపై పడి పదే పదే విలపిస్తూ కోరుచున్నది. స్వామి ఆమెతో కర్మఫలితము అనివార్యమని, ఎట్టివారలకయిననూ తప్పించుకొనుటకు వీలులేనిదని, విధిలిఖితం విష్ణువును గూడ వదలదని, నీవెంత యేడ్చిననూ, మృతుని నొసటి వ్రాతమార్చలేవని, కాబట్టి దుఃఖాన్ని దిగమ్రింగి, జరుగబోవుకార్యాన్ని ఆలోచించాలని హితవు పలికిరి. సుదీర్ఘమైన ఆయువు గల దేవతలు గూడ మరణించి తీరవలసినదేనని, మానవుడైన నీ భర్త మృత్యువు నుండి బయటపడుట అసాధ్యమని అందుచే ఈ ప్రయత్నం చేయుట వల్ల ప్రయోజనం శూన్యమని కూడ తెలిపిరి. అయిననూ ఆ స్త్రీ పట్టువదలక స్వామి వారి పాదాలను విడువక విలపిస్తూ, స్వామీ ! మహాత్ములైన మీ ముందు జడపదార్థమైన కర్మకు స్థానమెక్కడిది. అంతశక్తి కర్మకే ఉంటే దేవాలయములందు కర్మనెందుకు కొలువుంచుట లేదు ? కర్మను తప్పించే వాడు భగవంతుడేగావున దేవాలయమునందు దైవమే కొలువైయున్నాడు. మీకు సాధ్యము కానిదేదియూ లేదు, మీ సమక్షములో నాకు ఈ శిక్ష తగదని విలపించుచుండెను. మీరే సర్వేశ్వరులు, శరణుకోరిన వారందరికీ పురుషార్థములను ప్రసాదించగలవారన్న మీ కీర్తి దశదిశలా విస్తరించింది. త్రిమూర్తిస్వరూపమైన మీవల్ల కానిదేమున్నది ? నా మీద కరుణ, జాలి చూపండి మీరు భక్తులపాలిట కల్పవృక్షమని ఎరిగి, మిమ్ములను అర్థించుచున్నానని కంటికిధారగా ఏడ్చుచుండెను.

అంత శ్రీవల్లభులు, కరుణాంతరంగులై 'విశ్వాసోఫలదాయకం' నీకు మా యందు అట్టి భక్తి, విశ్వాసములు కలిగియున్నయెడల నీ భర్త సజీవుడగుననిరి. నీ భర్త బ్రతకాలన్నా కర్మసిద్ధాంతమును వ్యతిరేకించకుండా, కర్మను నశింపజేయవలయును. అందువల్ల నీవు నీ మాంగల్యము అమ్మివేసి, ఆ సొమ్ముతో నీ భర్త బరువునకు సరితూగు బరువు గల కట్టెలను కొనితెమ్మనిరి. మృత్యురూప కర్మ స్పందనలను ఆ కట్టెలకు ఆకర్షింపజేసి కట్టెలను గాడి పొయ్యిలో వేసి నీ భర్త శరీరము పేరిట ఆ కట్టెలను కాల్చి దగ్ధము చేసి శ్రాద్ధన్నము వండుట వలన, మాంగల్యము అమ్ముట వలన నీ అమాంగల్యములన్నియూ శాంతినొంది ఆతని కర్మ నశించి నీ భర్త సజీవుడగునని తెలిపిరి. వెంటనే ఆ నవవధువు ఆ

విధముగా చేసి, తన భర్తను బ్రతికించుకొనెను. ఈ రకంగా వల్లభులు ఆశ్రితుల పాపకర్మలను కట్టెలకు ఆకర్షింపజేసి, కర్మఫలములను కట్టెల రూపమున కాల్చి, బూడెద చేసి, దానితో వండిన ప్రసాదములు అందరికీ పంచి, వారి వారి కర్మ ఫలములను నశింపజేసి, భక్తులకు సుఖ సంతోషములు చేకూర్చేవారు.

ఇదే విధముగా శ్రీవల్లభులవారు, తమ నృసింహసరస్వతి అవతారములో గంధర్వపురమున సావిత్రి అను నవవధువు, తన భర్తయైన దత్తుని మరణానంతరము, ఆతని శవముతో స్వామి వారి పీఠము చేరి తన భర్తను బ్రతికించమని విలపించినది. తొలుత స్వామి సన్యాసి రూపము దాల్చి, కర్మను ఎవరూ తప్పించలేరని, ఆమెకు ఎన్నో ధర్మపన్నాలు వివరించి, సహగమనమే మేలని హితవు పలికిరి. కాని సావిత్రి నృసింహసరస్వతిస్వామి వారితో పరిపరి విధముల పరితపించుచూ, దత్త భక్తుడైన తన భర్తను పునర్జీవితుని చేయమని పదేపదే ప్రాధేయపడినది. ఆమె శోకమునకు కరిగిపోయిన శ్రీనృసింహసరస్వతి ఆమె భర్తను బ్రతికించెను. రాబోవు జన్మమునందు అతనికి ఆయుర్దాయము తగ్గించి, ఆమేరకు అన్ని సంవత్సరముల, ఆయుష్షు ఈ జన్మకు బదలాయించి, అతనిని బ్రతికించి, భక్తురాలి కోర్కెను తీర్చిరి. కావున సద్గురువులకు సాధ్యాసాధ్యములన్నవి లేవు.

## 9. అనఘాలక్ష్మీ సమేత అనఘుడు

అనఘాలక్ష్మీ సమేత అనఘుడే మహాలక్ష్మి సమేతుడైన మహావిష్ణువు. అనఘాలక్ష్మిని కూడిన మహావిష్ణు స్వరూపమే దత్తాత్రేయుడు. అనసూయ మాతకు బ్రహ్మ చంద్రునిగాను, రుద్రుడు దుర్వాసునిగాను, మహావిష్ణువు దత్తునిగాను జన్మించిరి. చంద్రుడు, దుర్వాసుడు తమలోని చైతన్యము దత్తునిగా జన్మించిన విష్ణువునందు ప్రవేశింపచేసి, త్రిమూర్త్యాత్మక స్వరూపముగా దత్తాత్రేయుని చేసి వెడలిపోయిరి. ఆ మహావిష్ణువే త్రిమూర్త్యాత్మక స్వరూపముగా వెలసిన దత్తాత్రేయుడు. అతనినే అనఘునిగా వ్యవహరింతురు.

జగన్మాతకు నాల్గు స్వరూపములు గలవు. ఆ స్వరూపములే మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి, రాజరాజేశ్వరి (ఈమెనే మహాగౌరిగా కూడ వ్యవహరిస్తారు). ఈ జగన్మాత యొక్క నాలుగు స్వరూపములు విశ్వపరిపాలన కోసం ఆవిర్భవించినవి. రాజరాజేశ్వరి వివేకానికి ప్రతినిధి, మహాకాళి శక్తికి ప్రతినిధి, మహాలక్ష్మి సౌందర్య శోభకు మరియు పరిపూర్ణతలకు ప్రతినిధి. సౌందర్య శోభ, వివేకం, శక్తి, పరిపూర్ణత అను నాలుగు లక్షణాలు సమపాళ్లలో కలసినదే సామరస్యతలసౌందర్యం. ఈ సామరస్యతలసౌందర్యమనే ఏకత్వస్థితికి ప్రతిరూపమే మహాలక్ష్మి. మహాలక్ష్మిలో కల ఈ ఏకత్వస్థితితో దివ్య నైపుణ్యము, ఆత్మ చైతన్య రూపములకు ప్రతీక అయిన మహాసరస్వతి యొక్క స్వరూపమును కూడ కలుపుకొన్నదే అనఘాలక్ష్మి. ఈమె మానవవ్యక్తిత్వానికి, దివ్య ప్రకృతికి మధ్యవర్తిగా ఉంటుంది.

కలియుగములో శ్రీదత్త ప్రభువుల వారు శ్రీపాద శ్రీవల్లభ నామమున పీఠికాపురములో అవతరించారు. వారిదే సంపూర్ణ దత్తావతారము. వీరే అనఘాలక్ష్మి సమేత శ్రీ అనఘుని శక్తుల కలయికతో యేర్పడిన ఏకైక స్వరూపము. అనఘుని యొక్క సంకల్పము లేనిదే అనఘాలక్ష్మి ఒక చిన్న కార్యమైనా చేపట్టదు అనఘాలక్ష్మీ సమేత అనఘునిది అర్ధనారీశ్వర స్వరూపము.

సమస్త సృష్టిలోని ఏకత్వము నందలి అనేకత్వమును, అనేకత్వము నందలి ఏకత్వము తనయందే నిలుపుకొని వచ్చిన, అత్యంత, అద్భుతమైన ఎంతో విలక్షణమైన కలియుగావతారము శ్రీపాదశ్రీవల్లభావతారము. ఈ సృష్టికంతకూ ఆదిబిందువై అన్ని సిద్ధాంతములను, సంప్రదాయములను జాతి, మత, కుల రహితముగా తమయందు సమన్వయము చేసికొని వాటిని పరిసమాప్తి చేయగల అంత్యబిందువు కూడ శ్రీవల్లభులే.

వల్లభుల యోగశక్తి రూపమే అనఘాలక్ష్మి. ఆ యోగశక్తితోనే వారెన్నో మహిమలను భక్తులను చూపించారు. ఆధ్యాత్మిక బోధనలు చేసారు.

## 10. సిద్ధమంగళస్తోత్రము

1. శ్రీమదనంత శ్రీ విభూషిత అప్పల లక్ష్మీ నరసింహారాజా..... అను సిద్ధమంగళ స్తోత్రముతో శ్రీపాదశ్రీవల్లభుల వారిని భక్తితో పూజించి, భజించువారికి ఇహలోక సుఖము, పరలోక సుఖము కూడ కల్గును. పరమ పవిత్రమైన సిద్ధమంగళస్తోత్రమను దానిని శ్రీవల్లభులు తమ భక్తులకు ఉపదేశించారు. ఈ పరమపవిత్రమైన సిద్ధమంగళస్తోత్రమును ప్రతి నిత్యము పఠించిన మానవులకు అనఘాష్టమీ వ్రతము చేసి, వేయి మంది బ్రాహ్మణులకు భోజన సంతర్పణచేసిన ఫలము దక్కుటతోబాటు, ఏకభుక్తము చేయుచూ శ్రీవల్లభుల మండల దీక్ష చేసిన అత్యంత శుభఫలితము కూడ కలుగును. ఈ స్తోత్రము భక్తితో ప్రతినిత్యము పఠించువారికి, సిద్ధ పురుషుల దర్శనము, స్పర్శనములు కలుగును. ఈ స్తోత్రము పఠింపబడే ప్రదేశములందు సిద్ధ పురుషులు అదృశ్యరూపములో సంచరించెదరు. అనతికాలములోనే వారు వల్లభులకృపకు పాత్రులై ఇహ, పర, సుఖములను కుటుంబ సమేతముగా పొంది తరింతురు. ఆనారోగ్యముల బారినపడకుండా ఉండుటయేగాక, సర్వరోగములనుండి శ్రీవల్లభుల కృపతో విముక్తి కల్గును. సిద్ధమంగళసోత్రం పఠించిన వారికి శ్రీవల్లభులు తమ మహిమల ద్వారా ఎంతో మేలుచేకూర్చారు.

## 11. రజకుని రాజుగా చేసిన శ్రీవల్లభులు

శ్రీపాద వల్లభులు ప్రతినిత్యము కురువపురంలో మూడు కాలాలలోనూ కృష్ణా నదిలో స్నానము, అర్ఘ్యము మొ॥ విధులన్నీ నిర్వర్తించుకుని మఠానికి తిరిగి వచ్చేవారు. ఆ నదిలోనే బట్టలు ఉతికే రవిదాసు అనే రజకుడు, ప్రతినిత్యము స్వామి నదికి రాగానే వారికి సాష్టాంగ నమస్కారము చేసేవాడు. ఉదయాన్నే మఠప్రాంగణమంతా, శుభ్రము చేసి, నీళ్లు చల్లి ముగ్గులు వేసేవాడు. అతని భక్తిని శ్రీవల్లభులెంతో మెచ్చుకునేవారు.

అతడొకనాడు ఆ దేశపురాజు, సుందరమైన స్త్రీలతోగూడి, కృష్ణా నది యందు స్నానమాడుట, ఆ రాజు వెంట వచ్చిన పరివార జనము, వైభవముచూచి, రవిదాసు సమ్మోహితుడై రాజుగా జన్మించి ఉంటే జన్మ ధన్యమయ్యేదని అనుకుంటూ మైమరచిపోయి ఉండిపోయాడు. మధ్యాహ్న సమయములో నదీ స్నానానికి వచ్చిన వల్లభులు రజకుని చూచి, అతని మనోభీష్టము గ్రహించి, అతనిని ప్రశ్నించగా, ఆ రజకుడు తనకు రాజుగా జన్మించవలెనని కోరిక గలదని శ్రీవల్లభులతో విన్నవించుకున్నాడు. ఆతని కోర్కె మన్నించి వల్లభులు అతనిని త్వరలో నీవు మృధుర (ఈనాటి విదర్భ-బీజాపూర్) దేశంలో యవనరాజ వంశములో జన్మనొందగలవని, రాజ్యభోగాలను అనుభవించగలవని అన్నారు. రజకుడు సంతోషముతో ఆ జన్మలో గూడ తనకు స్వామి వారి దర్శనం కావాలని, మతవిద్వేషాలు లేకుండా సమర్థవంతంగా రాజ్యం చేసే వరం కూడా ఇవ్వమని కోరాడు. ఆ వరాన్ని గూడ వల్లభులు ఆ రజకునికి అనుగ్రహించారు. తాము నృసింహసరస్వతిగా అవతరించినపుడు నీకు మా దర్శనము కాగలదని, అప్పుడు మమ్ము చూచిన నీకు జ్ఞానోదయమగునని రజకునితో శ్రీవల్లభులు పలికారు.

అనతికాలములో రజకుడు మరణించి, తిరిగి మృధుర దేశమందు యవనరాజ వంశంలో జన్మించి, యుక్త వయస్సు రాగానే ఆ దేశానికి రాజుగా నియమింపబడి, రాజ్యభోగాలన్నీ తనివితీరా అనుభవించాడు. అటుపై గంధర్వపురంలో ఉన్న శ్రీ నృసింహసరస్వతి వారిని ఒక ఆరోగ్యసమస్యపై దర్శించి, జ్ఞానోదయమై వారే శ్రీవల్లభులుగా గ్రహించి, వారిని తన రాజ్యానికి ఆహ్వానించి వారికి పాదపూజ, అఖండ సత్కారము చేసాడు. తరువాత విరాగియై, రాజ్యాన్ని తన కుమారులకు అప్పగించి, స్వామి సేవకు పునరంకితమవ్వాలని నిశ్చయించుకున్నాడు. శ్రీగురుని దర్శనంవల్ల అతనికి పూర్వజన్మ జ్ఞానం కలిగింది. యవనరాజుకు పూర్వం తాను రవిదాసు అనెడి రజకుడనని, కురవపురం నివాసినని శ్రీవల్లభుల భక్తుడనని తెలుసుకుంటాడు. కొంతకాలం తాను అచ్చటవుండి, ఆ తరువాత శ్రీనృసింహసరస్వతులవారి ఆజ్ఞ ప్రకారం శ్రీశైలంలో వారిని కలిసి, వారి ఆశీర్వాదం పొందుతాడు. శ్రీనృసింహసరస్వతివారు అవతారం చాలించిన పిదప, తిరిగి కురువపురం చేరుకుని, శ్రీవల్లభులు తపమాచరించిన రాతిబండను అక్కడ గ్రామస్థులకు చూపి, ఆ ప్రదేశమెంతో పవిత్రమైనదని తెలిపి, అక్కడ ఒక శ్రీవల్లభమందిరం నిర్మించి, ఆ మందిరంలో ఆ రాతిబండను శ్రీవల్లభుల వారి ప్రతిరూపంగా ప్రతిష్ఠిస్తాడు. ఆ

మందిరంలో నిత్య, ధూప, దీపనైవేద్యముల చేయుటకు ఆదాయవనరులకై కొంత భూమిని కేటాయిస్తాడు. నిత్యపూజకై పూజారులను నియమించాడు. శేషజీవితాన్ని కురువపురంలోనే శ్రీవల్లభుల ధ్యానంలో గడిపి తనువు చాలించాడు. అతడే తన తదుపరి జన్మలో మహాల్సాపతిగా జన్మించి, శ్రీవల్లభుల అంశతో జన్మించిన శిరిడీ సాయి నాథుని సేవించాడు.

## 12. నాగదోష నివారణ విధానం ఉపదేశించిన వల్లభులు

నాగేంద్రశాస్త్రి యనునాతడు కాలనాగుల తలపై యుండు నాగమణిని సాధించి నాగదోషములు నివృత్తి చేయుటతోబాటు దానిని పూజార్థము, లోకకళ్యాణార్థము ఉపయోగించాలని తలపోసేవాడు. ఒకసారి అతడు శ్రీవల్లభులను దర్శించినపుడు, వల్లభులు అతనికి తమ దివ్యపాదుకలిచ్చి, వాటిని తన ఇంటినందుంచుకుని నాగపీఠము స్థాపించి పూజించి, అర్చించుకోమని తెలిపారు. ఆ పాదుకలను అర్చించిన తీర్థమెవరికయినా ఇచ్చినచో వారికి అన్ని వ్యాధుల నుండి విముక్తి కల్గుటయేగాక, నాగదోషము కలవారికి, ఆ నాగదోషము హరించి వేయబడునని తెల్పిరి. ఆ పాదుకలనే నిత్యము నాగమణి గల్గిన కాలనాగులు పూజించునని, కాబట్టి నాగమణిని సంపాదించవలెనన్న నీ కోరిక తీరునని తెలుపుచూ, నాగదోష నివారణకు ఈ క్రింది నియమమును తప్పనిసరిగా పాటించవలసిందిగా తెల్పిరి.

నాగదోషములకు శాంతిచేయు సందర్భమున, ఈయబడు దక్షిణలయందు తన భార్య యొక్కగాని, భర్త యొక్కగాని, పుట్టింటి వారి సొమ్ము కలిసి తీరవలెనని తెలిపారు. మగవారు తమ నాగదోషం నివృత్తి చేసుకునేటప్పుడు ఇచ్చే దక్షిణలో భార్య పుట్టింటినుండి కొంత సొమ్ము తీసికుని, దానిని తాను ఇవ్వబోయే దక్షిణకు కలిపి ఏక మొత్తంగా ఈయవలయును. స్త్రీలయితే తన భర్త పుట్టింటి నుండి కొంత సొమ్ము తీసికుని తాను ఇవ్వబోయే దక్షిణకు కలిపి ఏక మొత్తంగా ఇవ్వాలి. భార్యభర్తలు ఇద్దరూ కలసి ఈ నాగదోషం నివృత్తి చేసికుంటే ఇద్దరి పుట్టిళ్ల నుంచి ధనము తీసికుని, తమ ధనంతో కలుపుకోవాలి. కన్య అయితే తన తండ్రి ధనముతోబాటు, తల్లి పుట్టింటి నుంచి కొంత ధనము తీసికోవాలి. రెండూ కలిపి ఏక మొత్తంగా దక్షిణ సమర్పించాలని వల్లభులు చెప్పారు. దత్తుని ఆరాధించే వారికి ఏ దోషములు అంటకుండా దత్తుడు తప్పనిసరిగా కాపాడునని వల్లభులు నాగేంద్రశాస్త్రికి తెలిపారు.

## 13. హింసపై వల్లభుల హితవు

శ్రీ వల్లభులు ఏదేని కార్యము చెడ్డదైననూ, హింసతో కూడినదైననూ భగవంతుని ఆజ్ఞగా ఎంచి, అది పది మందికి ఉపయోగపడునని గ్రహించినచో, అటువంటి కార్యము చేపట్టిననూ, తద్వారా పాపపంకిలము అంటుకునే అవకాశము లేదనిరి. దీనిని గూర్చి శ్రీవల్లభులు ఈ క్రింది విధముగా వివరణ ఇచ్చిరి.

శ్రీకృష్ణుడు కౌరవులతో పాండవులు యుద్ధము చేయుటకు అనువైన స్థలము ఎంపిక చేయుటకు, సరియైన ధర్మక్షేత్రము కొరకు వెదుకుచుండెను. ఒకనాడు ఒక పొలమునకు రైతు నీరు పెట్టుచుండెను. ప్రవాహమునకు అడ్డుకట్టవైచి, ఆ నీటిని తన పొలము వైపుకు మళ్లించినచో, పైరు బాగుగా పండి, ధాన్యము వచ్చును. తద్వారా జనులకు ఆకలి తీర్చగలననే కృషిలో భాగంగా, అడ్డుకట్టగా వేయుటకు తగిన రాళ్ళు, కర్రలు, మొదలైన వస్తువుల గూర్చి ఎంతవెదికిననూ అతనికి దొరకలేదు. ఎంత ప్రయత్నించిననూ, అతని ప్రయత్నములన్నియూ విఫలములయ్యెను. నీరులేని పొలములోని పైరు ఎండిపోయి, పంటనాశనమై తద్వారా జనులకు ఆహారము లభింపక విలవిలలాడుదురని ఎంతో పరితాపము చెందుచుండెను. అంతలో అతని కుమారుడు, తన తండ్రికి ఆహారముతెచ్చెను. గత్యంతరము లేక ఆతడు తన కుమారుని శిరము ఖండించి అతని శిరము, శరీరము నదీ ప్రవాహమునకు అడ్డుకట్టగా వైచి నీటిని మళ్లించెను. పొలములోనికి నీరుపోయి, పంట సమృద్ధిగా పండి, ప్రజలకు ఆకలిదప్పులు లేకుండాపోయెను.

సమాజక్షేమమే ధ్యేయంగా, పంటను పండించుటే ఏకైక లక్ష్యంగా, ఫలాపేక్షరహితముగా, తన ధర్మము నిర్వహించిన రైతు, అతని కుమారుని చూచి శ్రీకృష్ణుడు, రైతు స్వధర్మమునకుమెచ్చి, అతను చేసినది పాపకార్యముగా నెంచక అతనికి సద్గతి కల్గించెను. ఆ ప్రదేశమునందే కౌరవ పాండవుల మధ్య సంగ్రామము జరుగవలెనని, దానినే

ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రంగా భావించి, శ్రీకృష్ణుడు కౌరవ పాండవులకు మధ్య యుద్ధము జరుగుటకు ఆ ప్రదేశమునే సరియైన యుద్ధ భూమిగా ఎంపిక చేసెను.

కావున పరమేశ్వరార్పణ దృష్టితో తపోబలము కల్గి, మంత్ర బలములతో సమాజక్షేమమే ధ్యేయంగా చేసే హింసాత్మక చర్యలకు పాపము అంటదని వల్లభులు శంకరభట్టునకు తెలిపిరి. ఆయా దేశ, కాలమాన, పరిస్థితులనుబట్టి ధర్మ కర్మములు మారుచుండునని, కావున పూర్వము యజ్ఞములో తమ తపోబలముతోను, మంత్రబలంతోనూ యజ్ఞపశువును మహా ఋషులు బలియిచ్చు ప్రక్రియ వాడుకలో ఉండేదని అన్నారు. జంతుబలులు ఆహార, వ్యవహారములలో కూడనివని, తద్వారా పాపపంకిలము హింస చేసిన వారిపై బడునని తెల్పిరి. గోమాంసము, మేక మాంసము మొ॥ జంతు మాంసముతో వండిన పదార్ధములను ఆహారముగా చేసికొనుట కొరకై చేసే జంతుబలులు సమర్ధనీయముగావని, ఆ జంతువులు తిరిగి చంపిన వారి సంతానముగా జన్మించి, వారిని నానా ఇబ్బందులకు గురిచేసి, మనశ్శాంతిని కరవు చేయునని తెలిపిరి. మరణించిన జంతువులకు మాత్రం ఉత్తమజన్మలు కల్గునని తెలిపిరి. జంతువులను చంపినవారు జన్మాంతరములో శిక్షలకు గురికాగలరని, కావున శాఖాహారము ఉత్తమమని తెల్పిరి. ఇలా జంతువులను చంపిన వారిని, జంతువులు ఏదో రూపములో మరియొక జన్మ ఎత్తి తిరిగి వారిని చంపునని. ఇది అంతములేని ప్రక్రియగా, ఆగక, జన్మజన్మలయందు ఒకిరిని ఒకరు వెంబడిస్తూ పుట్టుట, చంపుట వంటి ప్రక్రియలతో, చక్రంవలె తిరుగాడుచుండుననియూ, కావున హింసకు మానివేసినచో ఈ ప్రక్రియ పునరావృతము కాకుండా ఒక జన్మకే పరిమితమై ఎక్కడో ఒకచోట ఆగునని తెలిపిరి. కావున హింసను ఎవరో ఒకరు చేయుట ప్రేరేపించుటవల్ల పాపకర్మకలుగునని తెలిపెను. దీనినిబట్టి గూడ ధర్మము వేరు ధర్మ సూక్ష్మము వేరని గుర్తించాలి.

## 14. అలవిగాని ప్రయాణము స్వల్ప వ్యవధిలో పూర్తి చేసిన శ్రీవల్లభుల బంధువులు

కురుంగడ్డలో కొలువైన శ్రీవల్లభుల దర్శనార్ధము వారి తల్లిదండ్రులు, వారి మాతామహులు, బంధు, భక్తజన వర్గములు కలసి పదునెనిమిది (18) గుర్రపు బండ్లను కుదుర్చుకొని పీఠికాపురము నుండి ఒకనాటి ఉదయమున కురుంగడ్డకు పయనమయ్యిరి. పీఠికాపురము నుండి కురుంగడ్డకు మధ్య చాలా దూరము గలదు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకుంటే గాని కురుంగడ్డ చేరుట దుర్లభము. అయినా వల్లభులపై నుండే అత్యంత ప్రేమాభిమానములు గల, వారి తల్లిదండ్రులు, బంధుజనవర్గము, ఏ విధముగానయినా వల్లభులను దర్శింపవలెనని ఆకాంక్షతో పయనమయ్యిరి. కొంతదూరము వెళ్లేసరికి, గుర్రపుబండి త్రోలువారు, గుర్రములు ఎంతో అలసటనొంది, ప్రయాణము నత్తనడకగా మెల్లగా సాగుచుండెను. ఈ విధముగా ప్రయాణిస్తే కురుంగడ్డ చేరుటకు చాలా రోజుల సమయం పట్టునని, ఎంతో అలసట చెందిన శ్రీవల్లభుల వారి బంధువర్గము చింతించుచూ, శ్రీవల్లభులను తరుణోపాయము కొరకు ప్రార్ధించుచుండిరి.

ఇంతలో తెలియని మత్తు, గుర్రపు బండితోలు వారికి, బంధుజన వర్గమునకు ఆవహించినది. వారందరూ నిద్రలోనికి అప్రయత్నముగా జారుకొనిరి. గుర్రపు బండి తోలేవారికి మాత్రము నిద్రలో తమ గుర్రములు ఎంతో వేగముతో, ఆకాశ మార్గమున పోవుచున్నట్లుగా అనుభవమయ్యెను. ఆశ్చర్యము గొలుపునట్లుగా మధ్యాహ్న సమయమగునప్పటికి వారు కురుంగడ్డ సమీపమున గల పంచదేవపహడ్ అను గ్రామము చేరిరి. ఆరోజు గురువారము గావున శ్రీవల్లభులు పంచదేవ పహడ్ అను గ్రామమందు సభను నిర్వహించుచుండిరి. తల్లిదండ్రులను బంధుజన వర్గమును శ్రీవల్లభులు కలుసుకొని, కుశలప్రశ్నలు వేసిరి. దీనితో వల్లభులకు భక్తులపై అపారకరుణ గలదని తెలియును. అంత సులభముగా వారి ప్రయాణము జరిగినందుకు, వల్లభులను వారి తల్లిదండ్రులు ప్రశ్నించుచుండగా, శ్రీవల్లభులు ఆ గుర్రపు బండ్లను ఆకాశమార్గమున తామే లాగితిమని, అందువల్ల తమ చేతులకు గాయములైనవని, చేతులు చూపగా, అవి బొబ్బలుగా పొంగియున్నవి. వారి చేతులకు వెన్నరాసి శ్రీవల్లభుల తల్లిదండ్రులు, మాతామహులు ఉపశమనములు చేసిరి. ఇది అంతయూ వారి మహిమా వినోదమే.

## 15. శరభేశ్వర వృత్తాంతము

దశమహావిద్యలలో ధూమ్రావతీదేవి ఆరాధన ఒకటి. ఈమె ఉగ్రతార. ఈమె ప్రసన్నమైనచో రోగ, శోకములను తీర్చి, చేతబడులచే బాధపడు జనులను రక్షించి, సర్వసంపదలు ఇచ్చును. ఉగ్రురాలైనచో సాధకునికి దారిద్రముతోబాటు అనేక బాధలు కలుగజేయును. క్షుద్రవిద్యల వల్ల భక్తులు కష్టములు పడుచున్నప్పుడు, శ్రీవల్లభులు వారిని కాపాడి బ్రోచేవారు.

ఒకానొక గ్రామమునందు కటిక దరిద్రుడైన బ్రాహ్మణుడు, కుటుంబ పోషణకొరకై ఒక వ్యక్తి వద్ద విశేషముగా అప్పులు చేసి తీర్చలేకపోయెను. నిర్దయుడైన ఆ వ్యక్తి, ఆ బ్రాహ్మణ కుటుంబమును ఇంటినుండి వెడలగ్రొట్టుచూ, వారి సామాన్లు రహదారిపై పారవైచుచుండెను. అదే మార్గములో ప్రయాణిస్తున్న శంకర భట్టు ఆ దృశ్యము చూచి జాలితో, ఆ అప్పు ఇచ్చిన ఆసామీతో నాలుగు వారములు గడువు ఇచ్చినచో, శ్రీవల్లభుల దయవలన ఆ బ్రాహ్మణుడు అప్పు తీర్చగలడని, దానికి హామీగా తానుండగలనని అప్రయత్నముగా పలికెను. దానికి అంగీకరించి, ఆ వ్యక్తి నాలుగు వారములు తరువాత తన బాకీ తీర్చే బాధ్యత శంకరభట్టుదేనని పలుకుచూ, తన బాకీ తీరువరకూ గ్రామమును విడచి వెళ్లరాదని షరతు విధిస్తూ వెడలిపోయెను. దిక్కూ, మ్రొక్కులేని ఆ బ్రాహ్మణుని విషయంలో అనాలోచితముగా ఇచ్చిన హామీకి ఎంతో చింతించుచూ, ఆ బ్రాహ్మణుని ఇంట శ్రీవల్లభస్వామి వారి భజనను ఆ బ్రాహ్మణకుటుంబ సభ్యులతో కలిసి చేయుచూ, శ్రీపాదుల వారిపై అఖండ విశ్వాసముతో, తిండి దొరకని ఆ ఇంట ఆకలితో శంకరభట్టు కాలక్షేపము చేయుచుండెను. ఇంతలో ఏమీలేని బ్రాహ్మణునికి అభయమిచ్చిన శంకరభట్టు సామాన్యుడుగాడని, గొప్ప జ్యోతిష్కుడై యుండవచ్చునని, ఆ గ్రామమునందలి రైతులు వారి ఆకలి బాధ తీర్చుటకై కొంత వంట సామాగ్రిని ఆ బీద బ్రాహ్మణుని ఇంట ఇచ్చి ఆదుకొనిరి. ఆ రకముగా వల్లభుల దయవలన వారందరికీ భోజనము సమకూరినది.

ఆ గ్రామములో శరభేశ్వరశాస్త్రి అను జ్యోతిష్కుడు గలడు అతడు ప్రేతాత్మలతో మాట్లాడి గ్రామస్థుల ప్రశ్నలకు జవాబులు చెప్పేవాడు. అతడు ఈ బ్రాహ్మణుడు అప్పు తీర్చలేడని ఆ గ్రామ ప్రజలకు తెలుపుచుండెను. దీనితో శంకరభట్టు మరింత చింతాక్రాంతుడయ్యెను.

ఒకరోజు శరభేశ్వరశాస్త్రి తన సోదరితో వ్యాపార నిమిత్తము వేరే దేశముపోయిన ఆమె భర్త మరణించునని, తిరిగిరాడని ఒక ప్రశ్నకు సమాధానముగా చెప్పెను. ఎంతో భయపడిన ఆమె తన స్నేహితుల సలహాననుసరించి ఈ విషయముపై జ్యోతిష్కునిగా పేరొందిన శంకరభట్టుని సంప్రదించెను. శంకరభట్టు, ఆమెకు తనవద్దనున్న శ్రీవల్లభుల అక్షింతలు ఇచ్చి, వాటిని పూజామందిర మందుంచి, శ్రీవల్లభులను ఏకాగ్రతతో ప్రార్థించమని చెప్పెను. ఆమె వల్లభులను ప్రార్థించుట మొదలుపెట్టెను. ఇది తెలిసి తన సోదరి భర్త విషయంలో తన మాట నిలబడకపోయినచో, ఆ బ్రాహ్మణుని అప్పు తనేతీర్చి, శంకర భట్టును గురువుగా స్వీకరింతునని గ్రామ ప్రజలతో శరభేశ్వరుడు పందెము కాచెను.

వల్లభుల అనుగ్రహముతో మూడు రోజుల పిదప ఆమె భర్త క్షేమముగా తిరిగి వచ్చెను. ఆపదలోనున్న తనను ఒకరు రక్షించారని అతడు తెలిపెను. ఇచ్చిన మాట ప్రకారము శరభేశ్వరశాస్త్రి బ్రాహ్మణుని అప్పు తీర్చివేసెను. శరభేశ్వరుడు తాను దశమహావిద్యలలో ఒకటైన ధూమ్రావతీదేవి అను ఉగ్రతారను ఆరాధించి, తంత్రవిద్య ద్వారా, మాత అనుగ్రహం పొంది, చేతబడుల నుండి బాధపడువారిని గతంలో రక్షించేవాడినని తెలిపెను. ధనార్జనే లక్ష్యంగా చేసుకున్న తరువాత తనపై మాత కోపించి, అనుగ్రహము చూపుట మానివేసినదని, మాత అనుగ్రహము పోయినపిదప, ఒక ప్రేతాత్మను ఆశ్రయించి, క్షుద్రవిద్యల ద్వారా జీవించుచుంటిననియూ, మాత అనుగ్రహము పోయిననాటి నుండి తాను అనేక కష్టములను అనుభవించుచున్నాననియు శంకరభట్టునకు తెలిపెను. శరభేశ్వరశాస్త్రితో ఇకపై క్షుద్ర విద్యలుమాని, శ్రీవల్లభులను స్మరించి, తరించమని అతనికి సలహాయిచ్చి, శంకరభట్టు వెడలిపోయెను.

## 16. శివ సంభూతునిగా మరొక అవతారముదాల్చమని ఆంజనేయస్వామితో శ్రీవల్లభులు చెప్పట

వివిధ ప్రాంతములలో తపోదీక్షలోనున్న భక్తులను ఉద్ధరించుటకు ఒకసారి శ్రీవల్లభులు యోగమార్గము ద్వారా పుణ్యక్షేత్రములను సందర్శించుచూ నేపాల్ దేశమునకు వెళ్లిరి. అచ్చట అనంత భక్తి పారవశ్యముతో ఒక పర్వతముపై

శ్రీరామచంద్రుని నామమును తదేక దీక్షతో ధ్యానము చేయుచున్న శ్రీ ఆంజనేయస్వామి వారిని చూచి, స్వయముగా శ్రీ మహావిష్ణువైన శ్రీవల్లభులు వారికి సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్న సమేతులుగా దర్శనమిచ్చిరి. హనుమంతులవారు ఆ దివ్య మంగళ స్వరూపమును వీక్షించి ఆనందముతో శ్రీవల్లభుల వారికి నమస్కరించి వారితో "రాం" అనుబీజాక్షరము అగ్నిబీజాక్షరమైనందువల్ల మరియు ఆ నామ నిరంతర జపం వల్ల తనకు అగ్నిసిద్ధి కలుగుటయేగాక, అగ్నియోజనమున పరిపూర్ణుడనైతిని అంటూ, దేహబుద్ధి చేత మీ దాసుడనని, జీవ, ఆత్మబుద్ధి వల్ల మీ అంశతో మీతో సమానుడనై ఉన్నానని పలికిరి. అంత వల్లభులు నీవు రామభక్తుడవైనప్పటికీ, శివాంశ సంభూతుడవు గావున, మరొక అవతారము దాల్చి ఒక జాతి వర్గీయులను ఉద్ధరింపవలసిన అవసరమున్నదని అనిరి. దానికి హనుమంతులవారు అంగీకరించిరి.

ఇంతకాలము, శ్రీరామనామమును ఎంతోభక్తితో స్మరించిన నీవు, ఇకపై అరబ్బీ భాషలో శివశక్తుల సంయుక్త రూపమైన 'అల్లాహ్' అను నామమును మరొక అవతారముతో ఒక గురుప్రముఖుని రూపమున స్మరించవలసినదిగా తెలిపిరి. ఏ శక్తి ప్రభావములు నా యందు కలవో అవి అన్నియూ నీయందు నెలకొల్పుచున్నాను. నేను నృసింహసరస్వతి రూపమున శ్రీశైలములో 300 సం॥లు యోగ సమాధిలోనుండెదను. అటుపై ప్రజ్ఞాపురమున స్వామి సమర్థుడను పేరుతో వెలుగొందెదను. నేను ఆ శరీరము వదలే సమయము ఆసన్నమైనప్పుడు, నీలోనికి ప్రవేశించెదను అప్పుడు నీవు సర్వ సమర్ధ సద్గురు అవతారముగా ప్రఖ్యాతుడవగుదువనిరి. వారి ఆజ్ఞను శిరసావహించెదనని తెలుపుతూ హనుమంతులవారు తమలోని చైతన్యమును దత్త స్వరూపముగా మార్చి, తమకు దత్తసాయుజ్యము ప్రసాదించవలెనని, తమ ఆరాధ్యదైవమైన శ్రీవల్లభులను 'అల్లామాలిక్' గా పిలుచుకుంటూ సంచరించెదనని అనిరి. అంత శ్రీవల్లభులు కాలపురుషుని పిలచి హనుమంతులవారు కాలానుగుణ్యముగా, సాయినాథుని పేరుతో అవతారము ధరించెదరని, ఆ విధంగా కాలపట్టిక లిఖించవలసినదిగా ఆదేశించిరి.

అంతలో జానకీ సమేతుడైన శ్రీరామచంద్రుడు హనుమంతులవారి ఎదుట ప్రత్యక్షమయ్యెను. శ్రీరాములవారు హనుమంతునితో తన యందు లీనమై తిరిగి జన్మించే ఆలీషా అను ఒక మ్లేచ్ఛ గురువు యోగ రహస్యములను, శ్యామచరణుడనునాతడు క్రియాయోగములను, వెంకటేశ్వరస్వామి భక్తుడైన 'వెంకుసా' అనునాతడు సనాతన ధర్మములను నీకు గురువులుగా వ్యవహరిస్తూ బోధిస్తారని తెలిపిరి. అంత శ్రీవల్లభులు హనుమంతునితో గతంలో జానకీమాత నీకిచ్చిన రతనాల హారమందు రామనామము లేదని నీవు పారవైచిన హారము భద్రపరచబడినదనియూ, తమ ఆత్మజ్యోతి అందులో ప్రవేశించినదనియూ, ఆ హారమే అనతికాలములో మాణిక్య ప్రభువను పేరుతో గురు స్వరూపమై జన్మించి జనులను ఉద్ధరించగలడని తెలిపిరి. ఆ విధముగా శ్రీవల్లభులు కొన్ని శతాబ్దముల పిదప భవిష్యత్తులో జరిగే ముఖ్యాంశములను శ్రీహనుమంతుల వారితో కలసి నిర్ణయించారు.

## 17. విచిత్ర పద్ధతులతో భక్తుల కర్మలను నశింపచేసిన శ్రీవల్లభులు

మానవుల పాపకర్మలు సూక్ష్మరూపమును, కారణ రూపమును పోలి యుండి వారిని అనేక విధముల బాధించును. వారి నాశ్రయించిన భక్తుల పాపములు సూక్ష్మ, కారణ రూపములను పోలియున్నచో వల్లభులు వాటిని తమ యోగాగ్నితో దగ్ధము చేసెడివారు. వారు అగ్ని ద్వారానే కాకుండా విచిత్ర పద్ధతులలో భక్తులకర్మలను ధ్వంసంచేసి వారికి మేలు చేసేవారు.

ఒక్కోసారి భక్తుని కర్మదోషములు తొలగింపజేయుటకు వంకాయలనుగాని బెండకాయలనుగాని తెప్పించి, ఆ కూరగాయలకు భక్తుని పాపకర్మరూప స్పందనలను ఆకర్షింపచేసేవారు. ఆ కూరగాయలను పాపకర్మలను వంట ద్వారా ఉడికించి భస్మము చేసి, ఆ భక్తుని చేత తప్పనిసరిగా ఆ వంటకము తినిపించి, అతని పాపకర్మముల దోషములను రూపుమాపేవారు.

కుజ దోషమున్నదని, వివాహము కాకుండా ఉండిపోయిన స్త్రీల చేత కందులు తెప్పించి, ఆ దోషమును కందులకు ఆకర్షింపచేసి, ఆ కందులతో వంటకము చేయించి, ఆమెతోబాటు ఆమె వారందరి చేత కూడ ఆ వంటకము తినిపింప చేయగా, ఆమెకు ఆ దోషము పరిహారము కాబడి, వివాహమయ్యెను. ఇదే విధముగా వివాహము కాని కన్యలచే శుక్రవారము రాహుకాలమందు, అంబికకు పూజ చేయించి, రాహుదోషము పోగొట్టెడివారు. అటుపై ఆ కన్యలకు

వివాహమయ్యేడిది. ఆవు నెయ్యితో వంటకములు చేయించి, దర్బారులో ప్రసాదాలు పంచి, ఆవునేతితో దీపాలు వెలిగింపజేసి, భక్తుల అనారోగ్యాలను తగ్గించి ఆరోగ్యం చేకూర్చేవారు. దరిద్రుల ఇంట లక్ష్మీ అఖండ దీపము వెలిగింపజేసి, వారి దారిద్ర్యము పోగొట్టేవారు.

## 18. పేద బ్రాహ్మణుని దారిద్ర్యం వదిలించిన శ్రీవల్లభులు

ఒకసారి ఒక పేదబ్రాహ్మణుడు తన దారిద్ర్యబాధ ననుభవించలేక ఆత్మహత్య చేసుకొనుటకు నిర్ణయించుకొని, ముందుగా శ్రీవల్లభుల దర్శనము చేసుకొని, అటుపిమ్మట ఆత్మహత్యకు పాల్పడవలెనని తలపోసెను. అతడు కురుంగడ్డకు పోయి వల్లభుల సన్నిధిలో కన్నులు మూసుకుని ధ్యానము చేసుకొనుచుండెను. శ్రీవల్లభులు మండుచున్న ఒక కొరివిని తెచ్చి, బ్రాహ్మణునికి అంటించిరి. కళ్లు తెరచి మండుచున్న కొరివితో శరీరము మీద అంటించిన చోట చాలమంటగా ఉండి బ్రాహ్మణుడెంతో బాధపడుచుండెను. అంత శ్రీవల్లభులు బ్రాహ్మణుని చూచి, ఓయీ! బ్రాహ్మణుడా ! నేను ఉపేక్షించినచో, నీవు ఆత్మహత్యకు పాల్పడి ఉండేవాడివి. ఆత్మహత్యలకు సంబంధించిన పాపకర్మముల యొక్క స్పందనలను, ఈ మండుచున్న కొరివితో అంటించి దగ్ధము చేసితిని. ఇకపై నీకు దారిద్ర్యబాధ ఉండదు. అ చల్లారిపోయిన కొరివిని, నీ పంచయందు చుట్టుకుని కడు జాగ్రత్తగా ఇంటికి తీసికొని పొమ్ము, ఇంటికిపోయి కొరివిని చూస్తే అది నీ దారిద్ర్యబాధ తీర్చే సాధనమగుతుందని, ఆశీర్వదించి ఆ పేద బ్రాహ్మణుని పంపివేశారు. ఇంటికిపోయి, పంచయందు చుట్టుకున్న ఆ కొరవిని విప్పిచూడగా ఆ కొయ్య కొరవి బంగారు కొరవిగా మారిపోయినది. పేద బ్రాహ్మణుని దారిద్ర్య బాధ తీరిపోయినది.

ఉదరశూలరోగము వల్ల భోజనమును విషతుల్యంగా భావించి, అన్నాన్ని త్యజించి, ఆకలి బాధ భరించలేక ఆత్మహత్య చేసికొనబోతున్న ఒక పేద బ్రాహ్మణుని గంధర్వపురంలో నదీసంగమం వద్ద నిరోధించి, మృష్టాన్న భోజనముతో ఆతని రోగమును శ్రీనృసింహసరస్వతీస్వామి మాయం చేసారు. ఆత్మహత్యలు మహాపాపమని, గురువులు వానిని నిరసించి భక్తులకు వారి కోర్కెలు తీర్చి వారిని ఆత్మహత్యలకు పాల్పడకుండా నిరోధిస్తారు. ఇదే విధంగా ఒకని దారిద్ర్యబాధ తీర్చుటకై, శిరిడీసాయి ఒక పొట్లమిచ్చి ఆ పొట్లాన్ని ఇంటికి పోయి చూస్తే నీ దారిద్ర్యం తీరుతుందని అతనికి తెలిపారు. ఆతృతతో మార్గమధ్యమున ఆతడు ఆ పొట్లాన్ని విప్పిచూడగా, అందులో కేవలం విభూది ఉన్నది. కోపంతో ఆతడు ఆ విభూది పొట్లాన్ని ప్రక్కనే పారుతున్న కాలువలో పారవేశాడు. క్షణాలలో ఆ పొట్లంలోని విభూది బంగారు ముక్కలుగా మారిపోయింది. అదిచూచి, దానిని పట్టుకోవాలని ఆ వ్యక్తి, కాలువలో ఎంత వెదికినా అది దొరుకలేదు. అతనికి శ్రద్ధ, సహనం, విశ్వాసం లోపించుట వల్ల అందిన అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అందుచేత గురువుల లీలలు, వారి విధానాలు విచిత్రంగా ఉంటాయి.

ఈ విధంగా శ్రీవల్లభుల తమ యోగశక్తితో భక్తులకెన్నో మహిమలు జూపారు. ఈ మహిమలన్నీ కేవలం మానవుల కష్టాలు బాపి, వారిని ఆధ్యాత్మికతవైపు కార్యోన్ముఖులను చేయడమే. ఈ లక్ష్య సాధనలో శ్రీవల్లభులు సనాతన ధర్మ, సాంప్రదాయాలను, వాటి విలువలను, వానిని గుర్తించవలసిన అవసరాన్ని సమాజానికి చాటిచెప్పారు. ఆ విధానాలన్ని మానవులు సన్మార్గంలో నడుచుటకు ఎంతో దోహదపడతాయని యోగపతిగా ఉద్బోధించారు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

## అధ్యాయం-13

# ఆర్యవైశ్యుల పట్ల శ్రీవల్లభుల ఆదరణ

(శ్రీ వాసవీ శ్రీకన్యకా పరమేశ్వరి వృత్తాంతము)

శ్రీపాద శ్రీవల్లభుల వారి సేవయందు తొలుత నుండి కూడ ఎంతోమంది ఆర్యవైశ్య ప్రముఖులు ప్రత్యక్షంగా తమ భక్తిని చాటుకుని వారికి అభిమానపాత్రులయ్యారు. పీఠికాపురమునందు గల వైశ్య ప్రముఖుడైన వెంకటప్పయ్య శ్రేష్ఠిగారి కుటుంబము శ్రీవల్లభులను చిరుప్రాయము నుండి గూడ చేరదీసి ఆదరించినారు. శ్రీ శ్రేష్ఠిగారి భార్య వేంకట సుబ్బమాంబ కూడ శ్రీవల్లభులకు పాలు, పెరుగు, మీగడ, వెన్న, హల్వా లాంటి పదార్థాలను వెండిగిన్నెలో పెట్టి తినిపించేవారు. శ్రీవల్లభులవారిని ఆమె కన్నయ్యా! అంటూ ఎంతో ముద్దుగా పిలచేవారు. శ్రీవల్లభులుకూడ ఆమెను అమ్మమ్మా! అంటూ పిలిచేవారు. ఈ విధంగా శ్రీవల్లభుల వారికి శ్రేష్ఠిగారి కుటుంబంతో విడదీయరానిబంధము పెనవేసుకున్నది. శ్రీవల్లభుల మాతామహులైన బాపనార్యులువారు, శ్రీవల్లభుల తండ్రిగారైన అప్పలరాజుగారు కూడ పీఠికాపురములో స్థిరనివాసమేర్పరుచుకొనుటకు గృహవసతి, ఇతర సౌకర్యములను శ్రీ వేంకటప్పయ్య శ్రేష్ఠిగారు కల్పించారు. శ్రీవల్లభులవారి బాల్యమునందు వారికి పాలసమస్య ఎదురైనప్పుడు, శ్రీఅప్పలరాజుగారి ఇంట శ్రీవల్లభులకు పాలు సమృద్ధిగా లభించుటకై ఒక గోవును యేర్పాటుచేసారు. ఇంతేకాకుండా శ్రీవల్లభులవారిని, శ్రీ శ్రేష్ఠిగారు ఎప్పుడూ ఎత్తుకుని మోయుచూ, శ్రీవల్లభుల ఆలనా, పాలనా కూడ చూస్తూ, శ్రీవల్లభులవారి కుటుంబానికి ఎంతో సన్నిహితులుగా మెలిగేవారు. వెంకటప్పయ్య శ్రేష్ఠిగారిని శ్రీవల్లభులు ముద్దుగా వెంకయ్య శ్రేష్ఠితాత అని పిలిచేవారు. పైండావారికి తమతల్లి ఆడబడుచువంటిదని వల్లభులు అనేవారు. వెంకటప్పయ్య శ్రేష్ఠిగారి బావమరిది అయిన ధర్మగుప్తులువారు గూడ పీఠికాపురమునందు, కురువపురమునందు గూడ ఎంతో భక్తిప్రపత్తులతో శ్రీవల్లభులను సేవించారు. శ్రీవల్లభులువారు వారి కుటుంబముపట్ల వెంకటప్పయ్య శ్రేష్ఠిగారు చూపిన ఆదరణకు ప్రతిగా శ్రేష్ఠిగారు వచ్చే జన్మమున సంపన్న వైశ్యకుటుంబములో మరాఠాదేశమందు జన్మించి, తాము నృసింహసరస్వతిగా అవతరించినపుడు, తమను మరలా తిరిగిసేవించి, తరించగలరని వరము ప్రసాదించిరి.

మల్యాదిపురము నుండి వచ్చి, పీఠికాపురములో స్థిరనివాసమేర్పరుచుకొని బ్రాహ్మణపరిషత్తుకు అధ్యక్షుడగుటయే గాక, ఆ ప్రాంతమంతా ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందిన శ్రీ బాపనార్యులంటే, పీఠికాపురమునందుండు సాటి బ్రాహ్మణ కులస్థులలో చాలా మందికి అసూయా, ద్వేషములు యేర్పడినవి. వారందరికీ శ్రీ నరసావధానులు అను బ్రాహ్మణ పండితుడు నాయకత్వము వహిస్తూ, ఏదో విధంగా వల్లభుల తాతగారైన బాపనార్యులతో బాటు, వల్లభుల తండ్రిగారిని, శ్రీవల్లభులను కూడా పరాభవించాలని ఎన్నోసార్లు కుటిల ప్రయత్నములు చేసి విఫలుడయ్యాడు. అంతియేకాకుండా, సర్వమానవ సౌభ్రాతత్త్వము, కుల, వర్ణ, మత రహిత సమాజమునుద్ధరించే కార్యక్రమంలో భాగంగా శ్రీవల్లభులు అంత్యకులముల వారిని చేరదీయుట, ఆనాటి సనాతన ఆచార సరళితో జీవించే బ్రాహ్మణులకు అయిష్టముగా ఉండేది. శ్రీవల్లభులవారి ఆశ్రిత జనోద్ధరణ కార్యక్రమాలకు, అడుగడుగునా అడ్డుతగులుతూ, ఆ గ్రామ బ్రాహ్మణులు శ్రీవల్లభుల విధానాలన్నీ విమర్శనాత్మక ధోరణితో చూచేవారు. శ్రీవల్లభుల పట్ల, వారి విధానాలపట్ల విముఖత ప్రదర్శించేవారు. పైగా శ్రీవల్లభులకు దైవత్వమేలేదని, వారు సామాన్య బాలుడని విస్తృతంగా ప్రచారంచేసేవారు. ఈ కారణాలవల్ల శ్రీవల్లభులవారి కుటుంబమునకు ఆ గ్రామ బ్రాహ్మణ్యమునకు మధ్య అంతరములు పెరిగినవి. శ్రీవల్లభులు గూడా వారి విమర్శలను కఠిన సంభాషణాచాతుర్యముతో త్రిప్పికొట్టేవారు. దీనివల్ల చాలా బ్రాహ్మణ కుటుంబములు వల్లభుల కరుణకు, ప్రేమకు దూరమైనాయి. మొదటినుండి గూడా వల్లభులవారిని చేరదీసి, వారి కుటుంబమును ఆదరించిన శ్రీ వెంకటప్పయ్య శ్రేష్ఠి, అతని బంధు జనవర్గము వినయవిధేయతలతో, భక్తితో శ్రీవల్లభుల వారికెంతో చేరువగా మెలగుతూ, వారిని సేవించేవారు. ఆ విధంగా శ్రీవల్లభులకు ఆర్య వైశ్యులపై అభిమానము యేర్పడి, పరస్పరము ఒకరికొకరు దగ్గరైనారు.

శ్రీవల్లభుల కృష్ణావతార జనన సమయమున యోగమాయగా ఆవిర్భవించి, కంసుని అతని మరణముపై హెచ్చరించి, అతనికత్తికి అందకుండా, అంతరిక్షంలోకి ఎగిరిపోయిన యోగమాయ ఆర్యవైశ్యకులమందు వాసవీకన్యకగా అవతరించినది. ఆ విధంగా శ్రీవల్లభులకు సోదరియయిన వాసవీ కన్యక ఆర్యవైశ్యకులమున ఉద్భవించిన కారణంగా, ఆమె బంధుజన వర్గమంతా శ్రీవల్లభులకు సన్నిహితులైనారు. దత్తుడైన వల్లభునిది విష్ణు అంశ. విష్ణువే కృష్ణుడు. కృష్ణునికి సహజన్మురాలు యోగమాయ. ఆ యోగమాయయమే వాసవీకన్యక. ఆ విధంగా వారికి సోదరి. పూర్వము జగన్మాత భక్తుడైన సమాధిమహర్షి తపమాచరించి, జగన్మాతను తనకుమార్తెగా జన్మించమని వరముకోరెను. అతని కోరిక మరుజన్మమున తీరగలదని జగన్మాత తెలిపెను. ఆతడు తదుపరి జన్మమున వైశ్య కులములో 'పైండా' అను గృహనామముతో కుశుమ శ్రేష్ఠిగా జన్మించి పశ్చిమ మున గోస్తనీనది, దక్షిణమున అంతర్వేది, ఆ ప్రాంత తూర్పు, ఉత్తర దిశలందుగల రెండు గోదావరి నదులను, నాల్గు దిక్కు లందు సరిహద్దులుగా బృహత్ శిలానగరము(పెనుగొండ)ను రాజధానిగా చేసుకుని, విష్ణువర్ధనుడనే మహారాజు ఆధ్వర్యంలో నున్న సామ్రాజ్యములో 18 పట్టణములకు సామంతరాజుగా పాలన చేయుచుండెను. వైశ్య ప్రముఖులైన కుశుమశ్రేష్ఠి దంపతులకు జగన్మాత పుత్రకామేష్ఠి యాగఫలముగా 'వాసవి' అనే పేరుతో వైశాఖ శుద్ధ దశమీ శుక్రవారం పునర్వసు నక్షత్రంలో వారికి కుమార్తెగా జన్మించినది. కుశుమ శ్రేష్ఠి శ్రీకృష్ణుని సమకాలీకుడైన అగ్రసేన మహారాజు యొక్క వంశీకుడు.

స్కాందపురాణమందు గల సనత్సుజాత సంహితయందు శ్రీకన్యకాపురాణము గలదు. దాని ప్రకారం కుశుమశ్రేష్ఠి పాలించే రాజ్య భాగమందు 714 గోత్రములతో వైశ్య నగరస్వాములు నివసించేవారు. వీరిలో 102 గోత్రములవారికి మాత్రమే కఠిన, నియమనిష్ఠలతో ఆచార్య వ్యవహారములుండెడివి. ఆర్యావర్తము నుండి వలస వచ్చిన ఈ 102 గోత్రీయులను మాత్రమే ఆర్యవైశ్యులందురు. వీరందరూ పార్వతీదేవిని ఆర్యమహాదేవి రూపంలో ఆరాధించెడివారు. వారు తమ సంతానాన్ని పరమేశ్వర సేవకే అర్పించేవారు. వారినే గౌర బాలికలు, బాలనగరులని పిలచేవారు. కుశుమశ్రేష్ఠికి గురువులుగా శ్రీభాస్కరాచార్యులు వారుండేవారు. వారే ఈ జన్మమున శ్రీవల్లభుల మాతామహులైన శ్రీబాపనార్యులవారు. వీరే పూర్వ యుగములో వైశ్య కులప్రముఖుడైన లాబాధిమహర్షి. వారే శ్రీమహాగణపతి కుమారులు. శ్రీవల్లభుల వారిది గణేశతత్త్వము. ఈ కారణంగా శ్రీవల్లభులకెన్నోయుగముల నుండి ఆర్యవైశ్యులతో సంబంధబాంధవ్యములు ఉన్నట్లుగా గ్రహింపవచ్చును. కుశుమశ్రేష్ఠికి నందీశ్వరుని అంశతో ఒక కుమారుడు జన్మించెను. అతని పేరు విరుపాక్షుడు. ఈ విరూపాక్షుడే గత జన్మములో శిలాదుడను మహర్షి. ఆ మహర్షి శిలలను ఆహారముగా తీసుకునేవారు. ఒకసారి హిమాలయా పర్వత ప్రాంతమందు తపోదీక్షలోనున్న ఆ మహర్షికి హైమావతీరూపమున అమ్మవారి దర్శనమైనది. అమ్మవారికి సోదరునిగా జన్మించు భాగ్యము కలుగజేయవలసిందిగా అమ్మవారిని ఆ మహర్షి కోరెను. అందుకు అమ్మవారు అంగీకరించి రాబోయే జన్మలో పార్వతీపరమేశ్వరుల వాహనమైన నందిగా, అటుపై జన్మలో తాను కన్యకాపరమేశ్వరిగా అవతరించినపుడు, సోదరునిగా జన్మించగలవని వరము ప్రసాదించినది. ఆ వరప్రభావమున ఈ జన్మమున ఆ మహర్షి వాసవీ కన్యకామాతకు విరూపాక్షుడను నామధేయముతో సోదరునిగా జన్మించెను. ఈ శిలాదుడను మహర్షి హిమాలయములందు అంబిక, పరమేశ్వరుని గూర్చి తపస్సు చేసిన శిలను పెనుగొండ (అప్పట్లో దీనిని జేష్టశైలమని అనేవారు) చేర్చాడు. ఆ శిలను భూగర్భంలో పునాదిగావేసి కుశుమశ్రేష్ఠి పెనుగొండలో కోటను నిర్మించెను.

వాసవీమాత దినదినప్రవర్ధమానమై, ఎదుగుతూ యుక్తవయస్కురాలైనది. ఎంతో అంద చందాలతో విరాజిల్లుతోంది. ఆ రాజ్యాన్ని ఏలే మహారాజయిన విష్ణువర్ధనుని కన్ను ఆ అందాల రాశియైన వాసవిపై పడింది. విష్ణువర్ధన మహారాజు అందచందాలున్న స్త్రీలను వివాహం చేసుకుని, వారిని భార్యలుగా స్వీకరింపక ఉంపుడుగత్తెలుగా మార్చి, వారి జీవితాలను నాశనం చేసేవాడు. ఈ క్రమంలోనే ఆతడు వాసవీమాతను కావాలని కోరాడు. అతనికోర్కెను వాసవీమాత అంగీకరించలేదు. తన సౌశీల్యానికి ప్రమాదం ఏర్పడినపుడు, తనశీలాన్ని, తన వంశ, గోత్ర, గౌరవాలను నిలుపుకోవాలంటే అగ్నిలో తన శరీరమును దగ్ధము కావించాలని వాసవీమాత నిర్ణయించుకుని అగ్ని ప్రవేశం చేసింది. ఆమెతోబాటుగా ఆమెయందు సంపూర్ణ భక్తి విశ్వాసములు కల్గిన 102 గోత్రములకు చెందిన ఆర్యవైశ్యులందరూ కూడా అగ్ని ప్రవేశముచేసి, తమనుతాము దగ్ధము కావించుకొనిరి. తనతో సాహసించి, అగ్నిలో దగ్ధమయిన 102 ఆర్యవైశ్య గోత్రాలవారి వారసులకెవరికీ అన్నవస్త్రాలకు, భోగభాగ్యాలకు లోటు రాదని వాసవీమాత వారందరికీ అభయం ఇచ్చింది. వాసవీమాతను పోలిన రూపంలో మృత్యుదేవత విష్ణువర్ధనుని పై విజృంభించి అతని శిరస్సును వెయ్యిముక్కలుగా చేసింది.

ఒకసారి పంచదేవ పహడ్‌గ్రామంలో రెల్లుగడ్డితో గోశాల నిర్మించమని వల్లభులు ధర్మగుప్తులను, శంకరభట్టును ఆదేశించారు. వారు ఎంత ప్రయత్నించిననూ ఆ పనిచేయలేకపోయారు. మారువేషంలో విరూపాక్షుడు ఆ గోశాల నిర్మించెను. ఆ మరునాడే శుక్రవారం, ఆ రోజే శ్రీవాసవీకన్యకాదేవి యొక్క జన్మదినము. ఆనాడు శ్రీవల్లభులు కృష్ణానది దాటి గోశాలలో ధ్యానస్థులైనారు. వారి శరీరము కాంతిపుంజముగామారి, దివ్యతేజస్సుతో ప్రకాసిస్తున్న సూర్యునిలోకి వెళ్లింది. కొంతసేపటికి సూర్యబింబం నుండి ఒక దివ్య శిశువు భూమిపైకి వచ్చింది. ఇంతలో 16 సంవత్సరాల బాలుని రూపంలో వల్లభులు సాక్షాత్కరించి ఆ పసిపాపను ఎత్తుకున్నారు. అంతలోనే ఆ పసిపాప వాసవీకన్యకగా మారిపోయింది. శ్రీపాదుల వారి అద్భుతలీలా మహాత్యంవల్ల విరూపాక్షుడు పంచదేవపహడ్‌లో రెల్లుగడ్డితో నిర్మించిన గోశాలమాయమై దాని స్థానంలో కుసుమశ్రేష్ఠి రాజప్రాసాదం, యువరాజుగా విరూపాక్షుడు, అతని తండ్రియయిన కుశుమ శ్రేష్ఠితో ప్రత్యక్షమయ్యారు. శ్రీవల్లభుల దివ్యతేజోరూపము నుండి శ్రీపద్మావతీ, శ్రీ వెంకటేశ్వరస్వామి బయల్వెడలిరి. శ్రీవాసవీదేవి, శ్రీనగరేశ్వరుడు ఇద్దరూ వాసవీమాత రూపము నుండి సాక్షాత్కరించినారు. వీరుకాకుండా, ఇంకా 101 గోత్రాల అగ్ని ప్రవేశ దంపతులు, సుమతీ, అప్పలరాజశర్మ, వెంకటప్పయ్య శ్రేష్ఠి, వారిధర్మపత్ని వెంకటసుబ్బమాంబలతో బాటు ఎంతోమంది ప్రముఖ వైశ్యదంపతులు తమ సూక్ష్మ శరీరాలతో దివ్య విమానంలో అక్కడికి వచ్చారు. శ్రీవాసవీ, నగరేశ్వరులకు వివాహం చేయాలని నిర్ణయించి, ముందుగా నిశ్చయతాంబూలాల వేడుక జరపాలని నిర్ణయించారు. శ్రీవాసవీ, నగరేశ్వరులకు మంగళస్నానాలు చేయించారు. శ్రీవాసవికన్యక ఆర్యవైశ్యకులమందు జన్మించిన గౌర బాలిక. కాని స్వయంభూగా వెలసిన శ్రీనగరేశ్వరులకు కులగోత్రములులేవు. అప్పుడు వారందరూ శ్రీమహాగణపతిని ప్రార్ధింపగా, నగరేశ్వరుని గోత్రం గూర్చి అందరితోనూ చర్చించి, నగరేశ్వరులను ఆర్యవైశ్యులుగా పరిగణించి వారిది 102 గ్రోతములలో ఒకటైన లాభాధి గోత్రంగా గణపతిస్వామి నిర్ణయిస్తారు. అప్పుడు ఎంతో వైభవంగా శ్రీవల్లభులు ఆ నిశ్చయతాంబూలాల వేడుక జరిపించిరి. ఆ సందర్భంగా గణపతి శివారాధన చేయువారికి లక్ష్మీకటాక్షంకలుగునని తెలిపెను. అంత వాసవీమాత వైశ్యులందరూ లాభాధిమహార్షిని, నగరేశ్వరుని కలసి సేవించాలని తెలిపింది. తిరుమలలో ముందుగా బాలత్రిపుర సుందరిగా తనను, అటుపిమ్మట ఈశ్వరునిగా నగరేశ్వరస్వామిని ప్రస్తుతం మహావిష్ణువు రూపంలో గల దత్తుని, శ్రీవెంకటేశ్వరస్వామి పేరుతో కొలుస్తున్నారని కూడా వాసవీమాత తెలిపింది. వేంకటేశ్వరునికి 'బాల' అంటే అమ్మవారి పేరుతో బాలాజీ అను నామముగలదు. వెంకటేశ్వరుడు అంటే విష్ణువు మరియు ఈశ్వరుడు అని అర్థం. అపుడు శ్రీవల్లభులు మాయింటి ఆడపడుచుగా పీఠికాపురం రమ్మని, తమసోదరియయిన వాసవి రూపంలోనున్న అంబికనుకోరగా, వాసవీమాత శ్రీవల్లభులతో ముందుగా శ్రీవేంకటేశ్వరస్వామి రూపం ధరించి, బృహత్ శిలానగరంలో కన్యకాపరమేశ్వరి సంస్థానమునకు రమ్మని ఆహ్వానించింది. అంతటితో ఆ చర్చ ముగిసింది. ఇంతలో ఆశ్చర్యముగా ఆ వేడుక పూర్తికాగానే ఎక్కడివారు అక్కడికి అదృశ్యరూపములో మాయమై వెళ్లి పోయారు. ఆ వేడుక జరిగిన రాజప్రసాదం కూడా మాయమైపోయి, దాని స్థానంలో తిరిగి పూర్వపు గోశాల దర్శనమిచ్చింది. దీనినిబట్టి శ్రీపాదులవారు ఆర్యవైశ్యులపట్ల ప్రత్యేక శ్రద్ధ. అభిమానము కల్గినందువల్లనే స్వయముగా ఇటువంటి వేడుకలు ఆ కులస్థుల సమక్షంలో జరిపించారు.

ఒకానొక సందర్భంలో శ్రీవెంకటప్పయ్య శ్రేష్ఠిగారితో శ్రీవల్లభులు ఆర్యవైశ్యులతో నా అనుబంధము అత్యంత ప్రాచీనమైనది. ఈనాటి మా మాతామహులైన బాపనార్యులు, పూర్వయుగములో నాతో అనుబంధంకల్గిన వైశ్యకులస్థుడైన లాభాధిమహార్షి అనితెలిపారు. మీ వైశ్యులెవరయినా వల్లభులను ఆరాధించినచో వారిని దత్తశునకముల రూపంలో వేదములు, పురాణములు, ఉపనిషత్తులు మొదలగునవి అదృశ్యరూపములో సదా రక్షించును. మా మాతామహులైన బాపనార్యులవారి ఇల్లు అనేక చేతులు మారి మీ వైశ్యవంశస్థుల వశమై దత్తనిలయముగా పేరొందును. ఆనాటికి మీ వంశమందు, బాపనార్యుల వారి వంశమందుగూడా 33వ తరము జరుగుచుండును. ఆ తరమునందే మీ వంశస్థుల ఆధీనములోనున్న నా జన్మస్థలమైన బాపనార్యులవారి ఇంట నాపాదుకలు ప్రతిష్ఠింపబడును. ఇప్పుడు మనము మాట్లాడుకుంటున్న ఇంటికి ఎదురుగా నున్న స్థలములో గతంలో సుమతీ మాతకు అవధూత రూపంలో దర్శనమిచ్చితిని, ఆ స్థలములో నా సోదరుడైన శ్రీధరశర్మ, దత్తాంశతో జన్మించి మూడుసార్లు అనగా క్రీ.శ. 6-7-1963 శనివారం మరియు 4-8-1971 బుధవారం, 11-9-1970 శుక్రవారాలలో శునక రూపముతో దర్శించి భిక్షాన్నము స్వీకరించును. అటు పిమ్మట బాపనార్యుల వారి వంశములో 33వ తరము వ్యక్తి దత్త నిలయములో భోజనము చేయును అని తెలిపిరి.

దీనినిబట్టి శ్రీవల్లభుల పాదుకలు ప్రతిష్ఠించిన వారి మాతామహులగృహము ఆర్యవైశ్యుల ఆధీనములోనున్నది కావున ఆ స్థలంలో జరుగు వేడుకలను అనాటి నుండి ఆర్యవైశ్యలే జరిపించుచుండిరి.

మరియొక సందర్భంలో వెంకటప్పయ్య శ్రేష్ఠితో శ్రీవల్లభులు ఆర్యవైశ్యులపై నాకు అనుగ్రహముగలదు. మీ వంశ మూలపురుషుడైన మార్కండేయమహార్షి ప్రతి గురువారం మధ్యాహ్న సమయమున ఏదో ఒకరూపములో నాకు నైవేద్య మీయబడిన పదార్థములో ఎంతో కొంత భాగము స్వీకరించును. దాని వలన మార్కండేయ గోత్రీకులకు మేలుకలుగును. ఆర్యవైశ్యులకు రాజ్యాధికారయోగము కలుగునట్లు ఆశీర్వదించుచున్నాను. దీనికి ప్రతిగా ఆర్యవైశ్యుడొకరు భారతదేశానికి ప్రభువుకాగలరు. వారు పీఠికాపురమొచ్చి నా దర్శనము చేయగలరని తెలిపిరి. పీఠికాపురమందు నిర్మింపబడు వారి సంస్థానమునకు ఆర్యవైశ్యకులమునకు చెందిన వ్యక్తి నుండి ద్రవ్య సహాయము సమకూరునని శ్రీవల్లభులు తెలిపిరి. ఇంకా ఆర్య వైశ్యకులములో జన్మించుట మహా అదృష్టమని, ఆర్య వైశ్యులు పుణ్యకర్మలనాచరించవలయునుగాని పాపకర్మలనాచరించరాదని, ఒకవేళ వారు పాపకర్మలయందు తగులు కొన్నయెడల విశేషముగా పాప ఫలితములు అనుభవింపవలసివచ్చునని తెలిపిరి. కుశుమ శ్రేష్ఠి దంపతుల ఇంట మరియు భాస్కరాచార్యుల వారి ఇంటగల మంగళ హారతి ఇచ్చు హస్తములు, జేగంటలు కలవని, అవి అన్నియూ పీఠికాపురమునందు యేర్పడు వారి సంస్థానములోని ఔదుంబరవృక్షము క్రింద వచ్చిచేరుననియూ, అటు పిమ్మటే వారి చరిత్ర వెలుగులోకి వచ్చుననియూ శ్రీవల్లభులు తెలిపిరి.

దత్తునికి వాసవీమాత సోదరియగుటలో మరొక అంతరార్థమున్నది. ఆర్యమహాదేవిది ఆదిశక్తి స్వరూపము. నిజానికి దత్తుడు పురుష రూపములో దత్తునిగాను, వారియొక్క పరబ్రహ్మ స్వరూపమైన స్త్రీ రూపము ఆది పరాశక్తిగానూ విలసిల్లుచున్నది. అత్రి అనసూయల కుమారుడైన దత్తుని ఉయ్యాలలో వూపుతూ, దత్తుని రూపముగల కుమార్తెను పొందవలయునని, అనసూయ మాత ఒకసారి మనమున తలపోసినది. పతివ్రతల సంకల్పములు తీవ్రముగావుండి వెంటనే ఫలించును. ఆశ్చర్యముగా ఆ ఉయ్యాలలో వూగుతున్న దత్తుడు ఒకసారి మగపిల్లవానిగా మరొకసారి ఆడపిల్లగా అనసూయా మాతకు కనుబడుచుండెను. అప్పుడు అత్రి మహాముని, అది శ్రీమన్నారాయణుని స్త్రీ మరియు పురుష రూపములనియూ వారి స్త్రీ రూపము వారికి సోదరిగా కృష్ణావతారమునందు యోగమాయగా ఆవిర్భంచుననియూ ఆరూపమే తిరిగి కలియుగములో వారు వల్లభునిగా అవతరించినపుడు వారి సోదరిగా 'కన్యక' రూపమును దాల్చునని తెలిపెను. అప్పటినుండి అంబికామాత వాసవిరూపమున శ్రీవల్లభులవారికి రక్షాబంధనము కట్టుచుండును. రక్షాబంధనమునాడు శ్రీవల్లభులను అర్చించినచో విశేష ఫలము కాలుగును.

కావున ఆర్యవైశ్యులందరూ తమ కులదేవతయయిన వాసవీకన్యకామాతను ఆరాధించుటతోబాటు, ఆమె సోదరులైన శ్రీవల్లభులవారిని కూడా భక్తితో ఆరాధించవలయును. అట్టి ఆరాధనమును వాసవీమాత స్వీకరించి, భక్తుల అభీష్టములు నెరవేర్చును. ఎక్కడ వాసవీమాత నామస్మరణము జరుగునో, అచ్చట దత్తుడు గుప్త రూపములో సంచరించును.

శ్రీవల్లభులు ఆర్యవైశ్యులపై చూపించిన ప్రేమకు స్పందనగా నేటికి కూడా ఆర్యవైశ్యులు వల్లభుల దేవాస్థానములైన పీఠికాపురమునందు, కురువపురము నందు గూడా విశేషంగా సేవా కార్యక్రమములలో పాల్గొని తరిస్తారు. పిఠాపురమందు వైశ్యులే శ్రీవల్లభుల దేవస్థానాన్ని నిర్వహిస్తున్నారు. వైశ్య కులానికి తమ ఆరాధనలో పెద్ద పీటవేసి ఆదరించిన వల్లభులకు వైశ్యులు ఆచంద్రార్కాము కృతజ్ఞులుగా ఉంటారని విశ్వసించవచ్చు. ఆర్యవైశ్యులపట్ల, వాసవీమాతపట్ల విశేష ప్రేమానురాగాలను కురిపించిన శ్రీవల్లభుల విగ్రహమూర్తులను ఉపాలయములుగా శ్రీవాసవీకన్యకా మాత ప్రధాన ఆలయములలో ప్రతిష్టించుట సముచితముగాతోచును.

ఆర్యవైశ్యులతో బాటు దత్తభక్తులందరూ విధిగా బృహత్‌శిలానగరములోని కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణమందుగల (పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లు సమీపమునగల పెనుగొండ) కన్యకాపరమేశ్వరి మరియు నగరేశ్వరుని ఇతర దేవతలను దర్శించిన యెడల విశేష ఫలితము కలుగును.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-14

# శ్రీవల్లభులు తెలిపిన శివదేవుని విశేషములు

శ్రీపాదులవారికి పదకొండవ సంవత్సరము జరుగుచున్నప్పుడు క్షణక్షణ లీలావిహారియయిన శ్రీవల్లభులు శివపూజ యొక్క విశేషములను వెల్లడించిరి. ఒకనాడు శివయోగి అను నామధేయము గల యోగ్యుడు కరతలభిక్ష చేయువాడు పీఠికాపురమునకు వచ్చెను. అతడు శరీర స్పృహలేని అవధూత. పిచ్చివానివలె కనిపించెడివాడు. అతడు కుక్కుటేశ్వరాలయములోనికి శివునికి అభిషేకము నిమిత్తము ప్రవేశించగానే, అతనితోబాటు రెండు నాగుపాములు కూడ వచ్చినవి. ఆ త్రాచుపాములను చూడగానే అర్చకులు భయముతో ప్రక్కకు తొలగిరి. ఆలయములో సూర్యచంద్రశాస్త్రి అనునాతడు సుస్వరముతో నమక, చమకములను పారాయణ చేయుచూ కుక్కుటేశ్వర లింగమునకు అభిషేకము చేయుచుండెను. ఆ మంత్రప్రభావము వల్ల త్రాచుపాములు పడగెత్తి ఆ శివలింగమువద్ద ఆనందముతో ఆడుచుండెను. అంత శివయోగి భయభ్రాంతులగుచున్న అర్చకులను చూచి, కుక్కుటేశ్వరుని నాగాభరణములైన త్రాచుపాములు అక్కడ జరుగుచున్న విశేష పూజలకు ఆకర్షింపబడి, ఆనందముతో ఆడుచున్నవని, అందువల్ల భయపడవలదని వారికి తెలిపెను. ఆ త్రాచుపాములు శివుని దర్శించి, మెల్లగా బయటకు వెడలిపోయినవి. సూర్యచంద్రశాస్త్రి తన అర్చన ముగించుకున్న పిదప శివయోగిని వల్లభుల వారి దర్శనార్థము వారింటికి తీసికునివెళ్లెను. శ్రీపాదులవారు ఆ శివయోగికి శివశక్తి స్వరూపముతో దర్శనమిచ్చిరి. శ్రీవల్లభులు చైతన్య స్వరూపులు. బ్రహ్మసరస్వతుల, శివపార్వతుల, పద్మావతీవేంకటేశ్వరుల చైతన్య స్వరూపమును ఏకకాలములో ధరించియున్నందున వారి వామభాగమున శక్తి సంచారము, కుడి భాగమున శివ సంచారము గలదు. కావున వారిది ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతములకు అతీతమయిన శివశక్తి స్వరూపము. ఆ కాంతివంతమైన రూపముతోనే శ్రీవల్లభులు శివయోగికి దర్శనమిచ్చిరి. వెంటనే శివయోగి ఆ రూపము గాంచి సమాధి స్థితిలోనికి వెళ్లెను. మూడురోజుల పిదప శ్రీవల్లభులు తమ దివ్యహస్తములతో అతనిని తాకగానే శివయోగి స్పృహలోనికి వచ్చెను. అతనికి వల్లభులు తమ స్వహస్తములతో భోజనము తినిపించిరి. అటుపిమ్మట శ్రీవల్లభులు శివయోగికి ఎన్నో శివదేవుని విశేషములను ఈ క్రింది విధముగా తెలిపిరి.

నాయనా! ఎవరయినా సరే సనాతన ధర్మమందు చెప్పబడిన ధర్మకర్మలనాచరించి తరించవలసినదే. పురాణములందలి విషయములు కల్పనలుగాని, అసత్యములుగాని కానేకావు. వాటిలోని సామాన్య అర్థమువేరు. నిగూఢమయిన రహస్యార్థము వేరు. అనుష్ఠానము చేసెడి సాధకులకు మాత్రమే దానిలోని అంతరార్థములు, నిగూఢరహస్యములు, స్ఫురించును. ఋతుకారకులగు సూర్యచంద్రుల వల్ల సృష్టికార్యము జరుగుచుండును. శివారాధకుడవైన నీకు శివునిగూర్చి కొన్ని ముఖ్య విషయములు ఎరిగింతును అనిరి.

ఆంధ్రదేశమునందు పదకొండు ముఖ్య శైవక్షేత్రములున్నవి. అవి మానవాళికి మోక్షప్రదాతలు.

1. బృహత్ శిలానగరము (పెనుగొండ) నందలి కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణమందుగల నగరేశ్వరస్వామి,
2. శ్రీశైల మందలి మల్లిఖార్జునస్వామి,
3. ద్రాక్షారామమునందలి భీమేశ్వరస్వామి,
4. క్షీరారామము (పాలకొల్లు) నందలి రామలింగేశ్వర స్వామి,
5. అమరావతి యందలి అమరలింగేశ్వరుడు,
6. కోటిపల్లి నందలి కోటిఫలీశ్వరస్వామి,

7. పీఠికాపురము (పిఠాపురం) నందలి కుక్కుటేశ్వరస్వామి,

8. మహానంది క్షేత్రమునందలి మహానందీశ్వరుడు,

9. కాళేశ్వరము నందలి కాళేశ్వరస్వామి వారు,

10. శ్రీకాళహస్తి నందలి శ్రీకాళహస్తీశ్వరుడు,

11. త్రిపురాంతకము నందలి త్రిపురాంతకేశ్వరుడు.

శివునిది ఏకాదశ రుద్ర స్వరూపము. వాస్తవమునకు శివునికి మూర్తి లేదు. శివలింగము మానవుల ఆత్మలలో వెలిగే జ్యోతి స్వరూపముగాక మరేమియూ గాదు. సిద్ధి కలిగిన తదుపరి నిర్మల మనస్సు రూపములో నుండెడి నిర్మలత్వమే స్ఫటిక లింగము. మన శిరస్సులో గల మెదడులో జ్ఞానం కలిగించువాడే రుద్రుడు. ఇతడినే కపాలి అంటారు. అందుకే శిరోభాగమును కపాలమని అంటారు. మెదడు నుండి నరముల రూపములో మెడక్రింది వరకూ వ్యాపించి యుండు నాడులను రుద్ర జడలందురు. శివుడు భిక్షాటనము చేసి జీవుల పాపకర్మలను హరించును. ఈ సృష్టియందు రాగ, తాళ, బద్ధమయిన సృష్టి, స్థితి, లయములనెడి మహాస్పందనములకు అనుగుణముగా శివుడు ఆనందతాండవము చేయును. ఆ స్వరూపమునే నటరాజు అందురు. మోక్షసిద్ధిని శివుడు ప్రసాదించును. శివుడు కాలస్వరూపుడు.

శివపూజారహస్యములు నిరంతర అనుష్ఠానము చేతను, గురువు యొక్క కటాక్షము చేతను అనుభవమగును. విశాల విశ్వమంతా కూడ రుద్రుని యొక్క స్వరూపమే. అష్టదిక్కులు ఆ అష్టమూర్తి యొక్క చిదాకాశ స్వరూపమే. పంచభూతములు శివుని పంచముఖములు. పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు అనునవి మనస్సుతో కలసి ఏకాదశ రుద్రకళలు గల్గిన ఏకాదశ రుద్రులనబడుచున్నవి. మిధునరాశియే శివపార్వతుల స్వరూపము. ఆర్ద్రా నక్షత్రం ఆకాశంలో ఉన్నప్పుడు శివదర్శనం కలుగుతుంది. ఆ శివుని పేరు మృగవ్యాధి రుద్రుడు. అతడు ధనస్సును ధరించి, జింకను వేటాడే స్వరూపంతో ఆర్ద్రా నక్షత్రంలో దర్శనమిస్తాడు. జ్యోతి రూపంలో వెలుగుతూ, స్థూల రూపంలో ఉండేదే శివలింగమని వేదములు తెలుపుచున్నవి. వృషభరాశియే నందీశ్వరుడు. సత్వ, రజో, స్తమో గుణములకు ప్రతీక శివుని త్రిశూలము. మహాసిద్ధులను తన వశమందుంచుకొని లోక కల్యాణమునకు వినియోగించుట వలన మహాశివునికి ఈశ్వరుడని మరోనామము కలిగినది. శివుని త్రిశూలములోని మూడు కొనలు రజో, స్తమో, సత్వ గుణములను సూచించును. తల్లి, దండ్రులని పిలువబడే అర్ధనారీశ్వరులు, ఈ సృష్టి యొక్క సంచలనమునకు కారణభూతులు.

శనివారం సాయంత్రం చేసే శివారాధన ఎంతో ప్రశస్తం. శనివారం సాయంత్రం చేసే శివ పూజ వల్ల సమస్త దోషములు, పాపములు పరిహారమవుతాయి. శివుడు సమస్త దోషాలను, మహా పాపాలను హరింపచేసి మానవాళికి మేలుచేసే మహానుభావుడు. శివుడు పంచభూతాత్మకుడు. కావున పంచభూతాత్మక శివలింగ ఆరాధనము, దర్శనము, అర్చనము సర్వశుభములను చేకూర్చును. జలలింగము, వాయులింగము, అగ్నిలింగము, ఆకాశలింగము, పార్ధివలింగము అనునవి శివుని పృధ్వీతత్త్వము కలిగిన పంచభూతాత్మక లింగములు. శివుని పంచభూతాత్మక స్వరూపములోని భూతత్త్వమును చందనముతోను, జలతత్త్వమును కొబ్బరినీళ్లతోను, అగ్నితత్త్వమును దీపారాధనతోను, వాయుతత్త్వమును మంచి సువాసననిచ్చు సాంబ్రాణి ధూపముతోను, ఆకాశతత్త్వమును ఘంటానాదముతోను అర్చించవలయును. ధనస్సును ధరించిన శివుని రుద్రమూర్తిగా పిలుస్తారు. ఈ రుద్రుని మన్యుదేవతా రూపంగా వేదాలు వర్ణించాయి. అందుకే శివలింగాన్ని మన్యుసూక్త పారాయణతో అభిషేకిస్తారు. శివుని పంచాక్షరీ జపము ద్వారా అనుష్టానము చేయుట మొదటి పద్ధతి. మహాన్యాస పూర్వకముగా అభిషేకించి, అర్చించుట రెండో పద్ధతి. లఘున్యాస రుద్రాభిషేకముతోబాటు అర్చించుట మూడవ పద్ధతి. రుద్రాభిషేకము స్వయముగా చేయువారు అంగన్యాస, కరన్యాసములతో ముందుగా రుద్రత్వము పొంది, అటుపిమ్మట అభిషేకము చేయవలయును. శివానుగ్రహము పొందుటకు యంత్రము, మంత్రము, పంచతత్త్వ సాధన, యోగ సాధన, ఆత్మ సమర్పణ అనునవి ప్రధానాంశములుగా పేర్కొనబడినవి. శివుడు అభిషేక ప్రియుడని ప్రతి సాధకుడు గుర్తించవలయును. శ్రీమన్నారాయణుడు బ్రహ్మను సృష్టించి, అతనికి ప్రసాదించిన వేదము యొక్క సారమే రుద్ర మంత్రం. అది నాలుగు

పురుషార్థములు అనగా ధర్మము, అర్థము, కామము మరియు మోక్షములను ప్రసాదించగలదు. భక్తితో రుద్రమంత్రం జపించేవారి దగ్గరకు యమదూతలు రారు. వారు దీర్ఘాయువును పొందగలరు. అకాలమరణం సంభవింపదు. వయోభారము చేత అనాయాస మరణము పొంది శివసాయుద్యము పొందగలరు. ముప్పది మూడు కోట్ల రుద్రులు ఈ భూమ్యాకాశములతోబాటు, జల వాయు శరీరములతో మానవునియందు అంతర్లీనముగా ఉంటారని వేదాలు తెలుపుచున్నవి.

మంగళవారం వచ్చే మహాశివరాత్రి ఎంతో గొప్పది. శివరాత్రినాడు అర్ధరాత్రి పన్నెండు గంటలకు శివస్వరూపం సహస్రారంలో లింగోద్భవ కాలంలో కర్పూరకళిక వలె భగవత్ జ్యోతిగా వెలుగుతుంటుంది. ఆ సమయంలో శివనామస్మరణ, శివదర్శనం ఎంతో పుణ్యప్రదం. అధర్వణ వేదంలో సమస్త అస్త్రములు, శస్త్రములు, మంత్రములు సిద్ధించవలెనన్న ఈ అస్త్ర, శస్త్రాధిపతి అయిన ఈశానరుద్రుడనే పేరుగల శివుని అర్చించవలెనని తెలుపబడినది. అందువలననే మహాభారత సంగ్రామములో ఉపయోగపడే పాశుపతాస్త్రము సాధించుటకు శివుని గూర్చి తపమొనరించమని అర్జునునికి శ్రీకృష్ణుడు తెలుపుటవల్ల అర్జునుడు ఈశానరుద్రుని అనుగ్రహంకోసం తపమాచరిస్తాడు. వేటగాని రూపంలో అర్జునుని శస్త్ర, అస్త్ర, నైపుణ్యమును ఒక పందిని సంహరించే నెపంతో పరీక్షించి, శివుడు అతనికి పాశుపతాస్త్రం ప్రసాదిస్తాడు. రుద్రగణములు ముప్పదిమూడు కోట్లు. ఈ గణములే ఆకాశము, భూమి, అంతరిక్షము, జలము, వాయువు, శరీరము, ప్రాణము, మనస్సును ఆవరించియున్నవని వేదములు తెలిపినవి. ఈ రుద్రగణములకు అధిపతి గణపతి. గణపతి తత్త్వము కలిగిన వారు శ్రీవల్లభులు. కావున వల్లభులను ఆశ్రయించినచో ఈ రుద్రగణముల అనుగ్రహం పొందవచ్చును. శివునికి ఐదు ముఖాలుంటాయి. వాటిని తత్పురుష, అఘోర, సద్యోజాత, వామదేవ మరియు ఈశాన ముఖములంటారు. తత్పురుష మూర్తి ప్రళయాగ్ని వంటి విద్యుత్ వర్ణముతో, అఘోరమూర్తి మేఘపు నీలము అనగా నీలవర్ణము గలిగిన నల్లని తుమ్మెద రంగులోను, సద్యోజాతమూర్తి చంద్రకుంద ధవళవర్ణములోను, వామదేవమూర్తి గౌరవర్ణములోను, ఈశానమూర్తి తేజోమూర్తి గావున ఆకాశవర్ణములోను ఉండును. శివుని సద్యోజాత ముఖము నుండి గాయత్రి మొదలగు రెండుకోట్ల వైదిక మంత్రములు, వామదేవ ముఖమునుండి శైవాగమమునకు చెందిన కోటి దక్షిణామ్నాయ మంత్రములు, అఘోర ముఖమునుండి వైష్ణవ ఆగమోక్తములైన కోటి పశ్చిమామ్నాయ మంత్రములు, తత్పురుష ముఖము నుండి శాక్తేయములగు రెండు కోట్ల మహావిద్యాది మంత్రములు, ఈశాన ముఖము నుండి ఆత్మానంద ప్రదములైన కోటి ఊర్ధ్వామ్నాయ మంత్రములు, ఈ విధముగా సప్తకోటి మహామంత్రములు పరమేశ్వరుని పంచముఖముల నుండి ఉద్భవించినవి శివుని అయిదు ముఖములను స్తుతించే అయిదు మంత్రములున్నవి. వాటిని సద్యోజాతాది పంచబ్రహ్మ మహామంత్రములందురు. ఈ ఐదు మహామంత్రములను నిత్యము పఠించుటవల్ల సప్తకోటి మంత్రములను పఠించిన ఫలితము కలుగును. సోమవారంనాడు అర్చించే శివమూర్తిది ఉమామహేశ్వర రూపము. నిత్యప్రసన్న రూపము. అభీష్టములను సిద్ధింపజేయు శివ, శక్తులు కలసిన స్వరూపము. శివ పంచాక్షరీ మంత్రములోని అయిదు అక్షరములు పంచభూతములకు ప్రతీకలు. శివపంచాక్షరీ మంత్రము అయిదు కోణములు గల మంత్రముగా అభివర్ణింపబడినది. ఈ పంచాక్షరీ మంత్రము వలన మోక్షము, భోగభాగ్యములు కలుగును. శివ పంచాక్షరీ మంత్రములో వెండి, అరుణము, బంగారు, నీలము, ధవళము అను అయిదు రంగులు గల అయిదు తత్త్వములుండును. ఈ అయిదు రంగులు కలసి ధ్యానములోనున్న వారి నొసట ప్రకాశించును. ఆ జ్యోతినే సంధ్యోపాసనగా మునీశ్వరులు పేర్కొంటారు.

జీవుడు పశువు వలే మమకారాది బంధములలో తగిలియుండి పశువువలే ప్రవర్తించును. ఆ పశుబంధనము నుండి విముక్తి కలుగుజేయు శివునినే పశుపతి అందురు.

శివునికి బిల్వపత్రాలతో పూజంటే ఎంతో ప్రీతి. బిల్వపత్రాలు శివునికి సమర్పిస్తే సర్వశుభాలు చేకూరును. బిల్వవృక్షాన్ని దర్శించినా, స్మరించినా పాపాలు పంటాపంచలవుతాయి. శివపూజకు బిల్వపత్రాలు ఎంతో ముఖ్యం. ఒక మాటలో చెప్పాలంటే బిల్వవృక్షం సదాశివుని ప్రతిరూపంగా పేర్కొనవచ్చు. స్కాంధమహాపురాణంలో సనత్కుమార సంహితలో బిల్వవృక్ష మహాత్యం ఈ విధంగా చెప్పబడింది.

శ్రీమహావిష్ణువు-జగద్రక్షణ సామర్థ్యం కోసం పరమేశ్వరుని అనుగ్రహం పొందాలని తీవ్రమయిన తపస్సుచేయు చుండగా, వారి ప్రక్కనే వారి సతీమణియైన లక్ష్మీదేవి గూడ సాంబసదాశివుని కోసం తపస్సు చేయనారభించింది. అప్పుడు శివుని యొక్క సంకల్పం వలన లక్ష్మీదేవి కుడిచేతిలో బిల్వవృక్షం ఆవిర్భవించింది. లక్ష్మీదేవిని శ్రీదేవి అని గూడ పిలుస్తారు గావున ఈ వృక్షానికి శ్రీ వృక్షమని పేరు కూడ సార్థకమయ్యింది. ఆ బిల్వపత్రాలతోనే శ్రీమహావిష్ణువు పరమేశ్వరుని ఎంతో భక్తితో అర్చించాడు. బిల్వపత్ర పూజవల్ల కలిగిన ఆనందపారవశ్యంతో శివుడు సాక్షాత్కరించి జగద్రక్షణ సామర్థ్యాన్ని శ్రీహరికి వరంగా ఇచ్చాడు. ఆనాటి నుండి బిల్వవృక్షం సదా శివునికి ఎంతో అభిమానవృక్షంగా పేరొందింది. శివప్రియమైన ఈ బిల్వ వృక్షాన్ని శివకింకరులు తొలుత కైలాసంలో, అటుపై విష్ణుకింకరులు వైకుంఠంలో, దేవతలు స్వర్గంలోనాటారు. ఆ కారణంగా బిల్వవృక్షం పవిత్రమైన దేవతావృక్షంగా పరిగణింపబడి మహర్షులచే పవిత్ర పుణ్యక్షేత్రాలలో, దేవాలయాల్లో, నాటబడి, శివపూజలో ప్రథమస్థానం ఆక్రమించింది. ఈ శ్రీవృక్షమనిన శివునికి, నారాయణుని, లక్ష్మీదేవికి గూడ ఎంతో ప్రీతి. జ్ఞానప్రదమైన ఈ బిల్వవృక్షం దారిద్ర్యాన్ని దరికిరానీయక, శ్రీపదాన్ని అనుగ్రహిస్తుంది. అందువల్ల బిల్వపత్రపూజ హరి, హరులకు చేసినవారు ఇహపరాలను పొందగలరు. ఇది శివకేశవుల అభేదతత్త్వమును కూడ తెలియజేస్తుంది.

ఏకాదశీ తిథి రోజున జలముతో పదకొండు సార్లు ఏకాదశ రుద్రాభిషేకము చేయువారికి ఏకాదశి తిథి యొక్క పుణ్యఫలాన్ని ఏకాదశ రుద్ర స్వరూపుడైన పరమేశ్వరుడు అనుగ్రహించును. విష్ణ్వంశ సంభూతుడు, దత్తాత్రేయ స్వరూపుడైన శ్రీవల్లభుడు శివుని గూర్చి ఇన్ని అద్భుత విషయములు తెలియజేయుటలో వారి శివకేశవుల అభేదతత్త్వము ప్రస్ఫుటమగును. ఏకాదశ రుద్రులకు, వైష్ణవపరమైన ఏకాదశ తిథికిని సన్నిహిత సంబంధముండుటచే శివకేశవులు అభిన్న స్వరూపులని తెలియజేయుటకు వల్లభులు ఈ శివపూజ అంతరార్థమును తెలియజేసిరి. శ్రీకృష్ణుడు ఉపమన్యుఋషివద్ద శిష్యరికముజేసి, వారిద్వారా ఎంతో నిష్ఠతో శివోపాసన చేసి, శివుని అనుగ్రహముతో రుక్మిణీదేవి యందు ప్రద్యుమ్నుడనే కుమారుని పొందెను. కావున వారిరువురి మధ్య భేదము లేదు. శివుని అర్చించి విష్ణువును విడచినా, విష్ణువును సేవించి శివుని విస్మరించిన వారికి ఇహ, పరములలో ఏదో ఒకటి మాత్రమే లభించును. ఇరువురిని అర్చించినవారు రెండూ పొందగలరు. వల్లభుని అర్చించిన వారు అన్నీ పొందగలరు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

# అధ్యాయం-15

# శ్రీవల్లభుల వాక్సుధ

మొట్టమొదట ఆత్మసాక్షాత్కారం పొందిన ప్రథమాత్మయే మొదటి సద్గురువు. ఆ ప్రథమాత్మ యొక్క చైతన్యం పరమాత్మ యొక్క అనంత చైతన్యంలో లీనమవ్వడం చేత ఆ ప్రథమాత్మ ద్వారా పరమాత్మ భూమిపై అవతరిస్తాడు. అతనినే అవతారపురుషుడు అంటారు. ఈ అవతారపురుషుడు, సద్గురువు ఇద్దరూ ఒకటే. ఆ తరువాత అవతరించిన వారెవరయినా సద్గురు సహాయం పొందవలసినదే. ఆత్మసాక్షాత్కారం అంటే ఆంతరికమైన సమతూకం. భగవంతుని నీడయయిన ఈ సమస్త సృష్టితోనూ సమన్వయం కలిగియుండటం. మొదటి అవతారుడు, మొదటి సద్గురువు ఈ రెండింటిని పొందాడు. పరిపూర్ణతను అన్వేషించే లక్ష్యమిదే. కనుక తరువాత ఆత్మసాక్షాత్కారం పొందని ప్రతి ఆత్మకు ఈ రెండూ తప్పనిసరిగా ఉండి తీరాలి. ఒకటి సమష్ట్యానుభవం, రెండు సృష్టిలోని ప్రతీది తానే అని, ప్రతిదానియొక్క అనుభవం తనదే అని, అన్నింటిలోనూ తాను, తనలో అన్నీ ఉన్నాయనే అనుభవం పొందడమే ఆత్మసాక్షాత్కారం. ఈ ఆత్మసాక్షాత్కారం తోటే దైవసాక్షాత్కారం పొందవచ్చు. అదే తుది గమ్యం. ఏ ప్రథమాత్మ ఆ సనాతనాచైతన్యంలో లీనమై పోయిందో ఆ ఆత్మయే సద్గురు సార్వభౌముడు. ఆదిగురువు. అతడే దత్తాత్రేయుడు. కలియుగంలో వారే శ్రీపాద శ్రీవల్లభులు. వారు తమ అమృతవాక్కులతో భక్తులకెన్నో ధర్మ, జ్ఞాన బోధలు ప్రత్యక్షంగా మరియూ పరోక్షంగా చేసారు. వారి భక్తుల ద్వారా కొన్ని బోధనలు చేయించారు. నిజానికి వారి భక్తుల కంత శక్తి లేదు. రజకుడైన తిరుమలదాసు తన బోధనల ద్వారా బ్రాహ్మణుడైన శంకరభట్టుకు ఎన్నో ధర్మపన్నాలు తెలుపుట వారి లీలలలో భాగమే. లేనిచో రజకుడైన తిరుమలదాసు గాని చర్మకారుడైన వల్లభదాసుగాని వేద ధర్మాలను ఉటంకిస్తూ హితబోధ చేయుట వారికి అసాధ్యము. కావున ఈ ధర్మసారమంతా వల్లభులు అదృశ్యరూపంలో వారిచేత చెప్పించినదే గావున దీనిని వల్లభుల వాక్సుధగా తెలుసుకోవాలి.

1. లోకములో యజ్ఞయాగాది సత్కర్మలన్నియును తగ్గుముఖం పట్టినవి. పంచభూతముల వలన లబ్ధిపొందిన మానవుడు పంచభూతాత్మకమైన దైవమును విస్మరించుచున్నాడు. దేవతా ప్రీతికరముగా యజ్ఞములు సలుపవలయును. యజ్ఞముల వలన దేవతలు సంతుష్టిచెందెదరు. వారి అనుగ్రహము వలన ప్రకృతి అనుకూలించును. ప్రకృతిలోని యే శక్తి విజృంభించిననూ, మానవుడు మనజాలడు. ప్రకృతిశక్తులను శాంతింపజేయకున్నా అరిష్టములు సంభవించును. మానవుడు ధర్మమార్గమును విడనాడిన యెడల ప్రకృతిశక్తుల వలన ఉపద్రవములు కలుగుచుండును. అందువల్ల యజ్ఞయాగాదులు, పూజ, పునస్కారములు జనులు విస్మరించరాదు.
2. సృష్టినందలి ప్రతి వస్తువు నుండియూ ప్రకంపనలు కలుగుచుండును. ఎంతో వైవిధ్యమున్న, ఈ ప్రకంపనముల వలన, ఇతర వస్తువులలో ఆకర్షణ, వికర్షణలు కలుగుచుండును. స్థూల, సూక్ష్మకారణ శరీరములందు, పుణ్యకర్మల వలన పుణ్యరూపమైన ప్రకంపనలు, పాపకర్మముల వలన పాపరూపమయిన ప్రకంపనలు కలుగుచుండును. పుణ్య విశేషముల వలన పుణ్యపురుషులతో సమాగమము, పుణ్యస్థలముల దర్శనము, పుణ్యకర్మలయందు ఆసక్తి కలిగి పుణ్యము వృద్ధిచెందుచుండును. ఆ పుణ్యము వృద్ధినొంది, పాపము క్షీణించినగాని, శ్రీదత్త ప్రభువులవారి యందు మనకు నిశ్చలభక్తి కుదరదు. కాల, కర్మ కారణ వశమున రకరకములైన సంఘటనలు జరుగుచుండును. ఈ ఇబ్బందులన్నీ వల్లభుల వారిని పూజించి తొలగించుకొనవచ్చును.
3. ఎవరికయినా భోజనము కావలెనన్నా, వారు గత జన్మలలో ఇతరులకు, అతిథులకు భోజనం పెట్టివుండాలి. ఎవరైనా ఒక గింజను దానంచేస్తే, దేవతలు వానిని వెయ్యి గింజలుగా చేసి, దానము చేసిన వారికి ప్రతిఫలముగా ఇస్తారు. కావున దానాన్ని, అతిథి మర్యాదలను గౌరవించాలి. వేదాల నీతిసారం మన దానం, ధర్మమే.
4. భగవదనుగ్రహ ప్రాప్తికి జాతి, కుల, ధనిక, పేద యనెడి బేధమేమియు ఉండదు. మానవుడు తాను చేయు కర్మల వలన ఫలితము సక్రమముగా యుండవలయునన్న తాను యే కులమునందు జన్మించిననూ, తాను అనుసరించు

ధర్మమునకు తగినట్లుగా కర్మలను సలుపుచుండవలయును. కావున ప్రతి విషయమునందు ధర్మవిచక్షణ కలిగి సంచరించవలయును.

5. ఇండ్లలో పూజచేయు అర్చావతారములలో ప్రాణప్రతిష్ఠ జరిగినపుడు, ఆ విగ్రహమూర్తులు చైతన్యవంతముగానే యుండి భక్తుల మనోభీష్టములను తీర్చుటకు సమర్ధవంతమగుచుండును. కావున ప్రతినిత్యము ప్రతీవారు విధిగా అర్చనాది కార్యక్రమములు తమతమ గృహములలో చేయుచుండవలయును.

6. ఎంతటి వారికయినా పురాకృత కర్మ ఫలములు అనివార్యములు. సృష్టి అంతయునూ అనుల్లంఘనీయమైన శాసనమునకు లోబడి నడచుచున్నది. స్త్రీలకు పూజాఫలముగా భర్త లభించును. దాన ఫలముగా బిడ్డలు కలుగుదురు. ఎల్లప్పుడు సత్పాత్రా దానము చేయవలెను. యోగ్యులుకాని వారలకు దానము చేయుటవలన అనిష్టములు సంభవించును. సద్బుద్ధి కలవానికి అన్నము పెట్టినచో, వాడు చేయు పుణ్యకార్యముల వలన కలుగు పుణ్యములో కొంతభాగము అన్నదాతకు వచ్చును. దుర్బుద్ధి కలవానికి అన్నము పెట్టినచో వాడు చేయు పాపకార్యముల వలన కలుగు పాపములో కొంతభాగము అన్నదాతకు వచ్చును. దానము చేయునపుడు అహంకారరహితముగా చేయవలయును. అప్పుడు మాత్రమే అది సత్ఫలితములనిచ్చును. సత్పురుషులకు భోజనము పెట్టుటవలన సాధకునికి ఆయుర్ధాయము లభించును. అనగా సాధకునికి మరికొన్ని సంవత్సరములపాటు అన్నరాశులు అతనికి తెలియకుండగనే అతనికి లభ్యమగును. దానితోబాటు అన్నము భుజించిన సత్పురుషులు సంతృప్తి చెందగానే సాధకునికి శాంతి, పుష్టి, తుష్టి, ఐశ్వర్యము మొ॥ భోగ స్పందనలు గూడ అతనిలో ఉద్భవించును.

7. బ్రాహ్మణుడు సత్యాన్వేషిగా యుండవలయును. క్షత్రియుడు ధర్మమునకు బద్ధుడై యుండవలయును. వైశ్యుడు వ్యవసాయమును, గోవులను రక్షించుట, క్రయ, విక్రయాది కుశల వ్యవహారములను సలుపవలయును. కావున శాంతిస్వరూపుడై యుండవలయును. శూద్రుడు ప్రేమ స్వరూపుడై, సేవలు చేయుచుండవలెను. అయితే భగవదనుగ్రహ ప్రాప్తికి, జాతి, కుల, ధనిక, పేద అనెడి బేధముండదు. బ్రాహ్మణుడు క్షత్రియధర్మము పాటించి రాజు కావచ్చును. క్షత్రియుడు బ్రహ్మజ్ఞానము కావాలనుకుంటే బ్రాహ్మణధర్మమును అనుసరింపవచ్చును. వైశ్యులు గూడ క్షత్రియ ధర్మము నిర్వర్తించి రాజ్యపాలన చేయవచ్చును. అయితే శత్రువులను చంపుట అనునది బ్రాహ్మణధర్మము ప్రకారము దోషమైనది. కాని క్షత్రియునకు ఇది ధర్మసమ్మతమే. కావున మానవుడు చేయు కర్మల వలన కలిగే ఫలితము సక్రమముగా ఉండవలెనన్న, తాను ఏ కులమందు జన్మించిననూ, తాను అనుసరించవలసిన ధర్మమునకు తగినట్లుగా కర్మలను చేయుచుండవలయును.

8. శ్రీదత్తుడు అల్ప సంతోషి. శ్రీదత్తుని నామమున ఎవరికయినా అన్నము పెట్టినచో, అన్నగ్రహీత యోగ్యుడైన యెడల అన్నదాతకు విశేష ఫలము కలుగును. ఆ అన్నసారములో కొంత భాగము మనస్సుగా మారును. అన్నదాత యొక్క మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, శరీరము, మంగళప్రదమైన స్పందనలతో నిండును. దానివలన వానికి సృష్టిలోని పదార్ధములను ఆకర్షించుశక్తి గలుగును. ఆ వస్తు సమృద్ధియే లక్ష్మీ కటాక్షముగా గుర్తించవలయును.

9. గాయత్రీ మాత యందు ప్రాతఃకాలమున హంసారూఢ అయిన బ్రాహ్మీ శక్తి, మధ్యాహ్న కాలమందు గరుఢారూఢ అయిన వైష్ణవీ శక్తి, సాయం సమయమునందు వృషభారూఢ యయిన శాంభవీ శక్తి యుండును. గాయత్రి మంత్ర అధిష్ఠాన దేవత సవితాదేవి. ఈ సవితాదేవి ప్రాతఃకాలమందు ఋగ్వేద రూపముగా, మధ్యాహ్న సమయమున యజుర్వేద రూపముగా, సాయంకాలమందు సామవేద రూపముగా, రాత్రి యందు అధర్వణ వేద రూపముగా నుండును. అసంఖ్యాకములైన ఈ ఖగోళములన్నింటియందు సృష్టి, స్థితి, లయములు గావించు సవితాశక్తినే సావిత్రి యందురు. ఆమెను ఉద్దేశించినదే సవితృకాఠకచయనమను యజ్ఞము. ఆ యజ్ఞ ప్రభావము వల్లనే శ్రీవల్లభులు ఉద్భవించిరి. అందుకే శ్రీవల్లభులు గాయత్రీమాత స్వరూపము. గాయత్రి మాత, సావిత్రి మాతలు వేరుగాదు. అభిన్నస్వరూపములు. ఒక స్వరూపమే పరాస్థాయిలో గాయత్రిగా అపరాస్థాయిలో సావిత్రి యనెడి మహాశక్తిగా వ్యవహరించున్నది.

జీవరాశుల పరిణామ క్రమములో ఇహలోక సంబంధమైన అవసరములు ఎన్నో కలవు. జీవులకు ఆధ్యాత్మికోన్నతి గాయత్రీమాత అనుగ్రహమువలన, ఇహలోక సంబంధిత అభీష్టములు సావిత్రీమాత అనుగ్రహమువలన తీరును. ఈ రెండింటి స్వరూపము ఒకటే. అదే శ్రీపాద శ్రీవల్లభుల స్వరూపము. అగ్ని అనునది ఒకటే కాని దానికి సందర్భానుసారముగా రెండు పేర్లు గలవు. శవములను కాల్చే అగ్నిని 'లోహిత' అని, వంటలు వండుకొను అగ్నిని

'రోహిత' అని అందురు ఆ క్రమంలోనే గాయత్రియని, సావిత్రియని ఒకే స్వరూపమును పిలుతురు. ఇహలోకమందు సకల సుఖ భోగములు అనుభవించుటకు, పరలోకమున దివ్యానందము పొందుటకు సాధకులు సమన్వయము ఏర్పరచుకోవలసియున్నది. ఇది వల్లభులను ఆశ్రయించినవారికే సాధ్యపడును. ముఖ్యమైన ఈ రెండూ కూడ శ్రీవల్లభులే ఏకకాలములో ప్రసాదించగలరు. ఇదే తక్కిన దేవతారాధనకు దత్తారాధనకు గల ముఖ్య వ్యత్యాసము. ఎందుకనగా ఇహ లోక సుఖమునకు ఒక దేవతను పరలోక సుఖమునకు మరొక దేవతను ఆరాధించాలి. కాని శ్రీవల్లభులను ఆరాధిస్తే వారే రెండింటిని సమకూర్చగలరు.

దీనికి ఒక ఉదాహరణను చూస్తే, వివాహమైన తన చెల్లెల్ని చూచుటకు ఆమె అన్న వారింటికి వెళ్లగా, ఆమె అత్తగారు ఆతనితో మీచెల్లెలు మాయింట్లో పాలు, పెరుగు, నెయ్యి, మజ్జిగ దొంగచాటుగా తింటున్నదని తెలిపి, ఒక వస్తువు తినినచో సరిపెట్టకొనగలము గాని, ఇన్ని వస్తువులను దొంగిలించి సేవిస్తూ ఉంటే ఎలా సరిపెట్టుకోవాలి అని ప్రశ్నించింది. దానికి అన్నగారు తన చెల్లెలిని పిలచి పెరుగు, నెయ్యి, మజ్జిగ మొ॥ పదార్థములన్నియు పాలనుండియే వచ్చుచున్నవి. కావున చిక్కని పాలను సేవిస్తే, మిగిలిన పదార్థములన్నియూ సేవించినట్లే. అందువలన కేవలం ఒక్క పాలనే సేవించమని సలహా ఇచ్చెను. ఒక్క వస్తువును మాత్రమే సేవిస్తే మీ అత్తగారి నుండి ఎటువంటి మాటను పడనవుసరము లేదని కూడ తెలిపెను. అదేవిధముగా ఒక్క దత్తుని ఆరాధిస్తే సమస్తము చేకూరును. లోకులు భిన్న రుచులు గలవారు గనుక భిన్న భిన్న దేవతారాధనలు చేయుచుందురు. పాపరాశి క్షీణిస్తూ, పుణ్యరాశి ప్రోగగునప్పుడు దత్త భక్తి కల్గను. దత్తుడు భక్తుల నుదిటి వ్రాతను గూడ మార్చి, వారికి శుభములు చేకూర్చగల శక్తిమంతుడు. కావున దత్తుని పూజించుట వలన సర్వదేవతలను పూజించిన ఫలితము దక్కును.

10. సృష్టి లీలలో ఏదియునూ స్థిరముగాదు. మనము ఈనాడు ఎవరిని సత్కర్ములుగా, ఎంతో మంచివారిగా చూచుచున్నామో వారు క్రిందటి జన్మలలో ఎన్నోకొన్ని దుష్కర్మలను ఆచరించినవారే. అందువలన ఈ జన్మలో వారు ధర్మతత్పరులుగా జీవించుచున్నప్పటికీ వారికి ఏదోవిధమైన దుఃఖములు కలుగుచున్నవి. అటులనే దుర్మార్గులు కూడ సుఖములు అనుభవించుట కూడ వారి పూర్వజన్మకృత పుణ్యఫలానుభవము తప్ప వేరుగాదు. సామాన్య పాపముగాని, పుణ్యముగాని వెంటనే ఫలితములనీయవు. అధర్మము మితిమీరి ధార్మికులు ఇబ్బందులను ఎదుర్కొనుచున్నప్పుడు పరమాత్మ అవతరించును. శ్రీపాద వల్లభులను ఆశ్రయించినచో కష్టములు తొలగిపోవును. వారు సమస్యలను సృష్టించుటలో బహునేర్పరి. అదేవిధముగా ఆ సమస్యలను పరిష్కరించుటలో గూడ బహు చతురులు.

11. ఆహారమునకు వర్షము కావలెను. ఆ వర్షము యజ్ఞము చేయుట వలన సంభవించును. యజ్ఞమనునది కర్మనుండి పుట్టినది. సమస్త కర్మలకు వేదమే మూలమయివున్నది. యాగములచేత మనుష్యులు దేవతలను ఆరాధించవలయును. దేవతలు ఆ యజ్ఞములకు సంతుష్టులై శ్రేయస్సులను ఇచ్చెదరు. ఈ విధముగా మానవులకు, దేవతలకు పరస్పర సంబంధముగలదు. వేదములందు యజ్ఞము అనునది అంతఃప్రవృత్తికి బాహ్య చిహ్నము. యజ్ఞముల ద్వారా మానవులు దేవతలకు ఎన్నో పూజాద్రవ్యములు సమర్పింతురు. వానిని దేవతలు గ్రహించి, మానవులకు గో గణములు, అశ్వములు మొ॥నవి ఎన్నో ఇత్తురు. మానవుల కోర్కెలనుకూడ తీరుస్తారు. గో గణములు అనగా తేజస్సు యొక్క సంపద. అశ్వములు అనగా శక్తి సంపద. వాటితోపాటు కొన్ని తపశ్శక్తులు కూడ అనుగ్రహింతురు.

12. గతములో బ్రహ్మకల్పములో ప్రళయం వచ్చినపుడు భవిష్యత్ సృష్టికోసం సమస్త జీవరాశులు, వృక్షములు, ఔషధములు మొదలగువాటిని విత్తనములుగా చేసి ఒక కలశమందు నింపిరి. ఆ కలశములో అమృతము, అన్ని సముద్రముల, పుణ్యనదుల జలమును పోసిరి. గాయత్రీ మంత్రముతో ప్రాణశక్తిని ఆ కలశములోనికి ఆవహింపజేసిరి. దీనినే పూర్ణకుంభమందురు. ఈ పూర్ణకుంభములోని అమృతమునే నిరంతర ధారాపాతముగా భూమిపై అభిషేకించి, సృష్టిని ప్రారంభించారు. అటుపిమ్మట ఆ కలశమును బోర్లించగా అందుండి ఇద్దరు మహామునులు ఉద్భవించిరి. అందులోనుండి తెల్లని తేజస్సుతో వశిష్ఠుడు, నీలమైన తేజస్సుతో అగస్త్యుడు, దేవతలైన మిత్రావరుణుల అంశలతో జన్మించారు. అందువల్లనే పూర్ణకుంభాన్ని ఎంతోపవిత్రమైన కలశంగా పరిగణిస్తారు. అన్ని దేవాలయాలలోను, దేవతారాధనలలోనూ, విశేష కార్యక్రమములలోను పూర్ణకుంభంతో శుభ ప్రక్రియలను ఆరంభిస్తారు.

13. ప్రతి మానవునికి పుణ్యఫలరూపముగా ఆయువు, ఐశ్వర్యం, అందము, ప్రఖ్యాతి మొ॥నవి సిద్ధించును. పాపఫలరూపముగా అల్పాయువు, దారిద్ర్యము, అనాకారితనము కుఖ్యాతి మొ॥నవి వచ్చును. కావున మానవులు సత్కార్యములు ఆచరిస్తూ, పుణ్యఫలాలను ఆస్వాదించాలి.

13. ఆనందం అనునది పరమేశ్వరునికి సంబంధించిన విషయం. పారవశ్యం యోగికి కలిగే అనుభవం. అసలు కోరికలులేని వానికి కలిగేది హర్షం. సమస్త జీవులకు అందుబాటులోనున్నది సుఖం. అయితే దానితోబాటు దుఃఖః కూడ అనివార్యంగా ఉందని జనులు గుర్తించాలి. అందుకే సుఖంవల్ల పొంగిపోకూడదు. దుఃఖంతో కృంగిపోకూడదు. అంతా దైవేచ్ఛగా భావించాలి.

14. మనిషి అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా శ్రద్ధ, దానితోబాటు దృఢమైన విశ్వాసము ఉండాలి. శ్రద్ధ అంటే సంపూర్ణమైన నమ్మకముతో కూడిన అంగీకారము. విశ్వాసం అనునది అనుభవం వలన పొందవలసిఉంటుంది. మనం దేనికోసమయినా సరే విశ్వాసాన్ని ఆధారంగా తీసుకుని జీవించాలి. అవసరమయిన వేళల్లో తప్పకుండా సహాయము అందగలదనే విశ్వాసము మనలో నిరంతరమూ ఉండాలి. విశ్వాసముతోబాటు ఒక విధమైన భద్రతా భావన కూడ మనలోనున్నప్పుడు అది ఆత్మవిశ్వాసమవుతుంది. శక్తిహీనమైన జ్ఞానం నిర్లిప్తతకు దారితీస్తుంది. జ్ఞానహీనమైన శక్తి గ్రుడ్డిదై వినాశనానికి దారితీస్తుంది. అందుచేత మనం జ్ఞానంతో ప్రకృతి బంధాలనుండి విడుదల పొందాలి. ఆ తరువాత శక్తి అనుగ్రహంతో పరిపూర్ణతను సాధించాలి. శక్తికి జ్ఞానం నుంచి అనుమతి లభించాలి.

15. మనుషులు మాట్లాడే మాటలను వాక్కులు అంటారు. ఈ వాక్కు అయిదు రకాలుగా ఉంటుంది. బయటకు వినిపించే వాక్కును స్థూలవాక్కు అంటారు. పెదిమలమధ్య గొణుగుతూ ఉన్నట్లు, బయటకు వినపడకుండా ఉండే వాక్కును మధ్యమ వాక్కు అంటారు. వినపడీ, వినపడనట్లు కొద్దికొద్దిగా అర్థంకానట్లుగా బయటకు వచ్చే వాక్కును వైఖరీవాక్కు అంటారు. గొంతు నుండి బయటకు రాకుండా మనస్సులో ఉండిపోయే వాక్కుని పశ్యంతీ వాక్కు అంటారు. కడుపులోనే ఉండి, అసలు బయటకు తెలియకుండా సంకల్పమాత్రంగా మిగిలిపోయే వాక్కును పరావాక్కు అంటారు. వాక్కు అనునది అమ్మవారి స్వరూపం. ఇది ప్రతీవ్యక్తిలోనూ పలుకుతుంది.

16. దత్తాత్రేయస్వామి తమ అవతార మూలతత్త్వముగల అంశలతో ఎన్నో అవతారాలు కాలానుగుణంగా ధరించారు. ఆ అవతారాలు శ్రీ నృసింహ సరస్వతి, మాణిక్య ప్రభువు, అక్కలకోట మహరాజ్, శిరిడీ సాయిబాబా ఇలా మరెన్నో గలవు. ఈ అంశావతారాల విషయంలో ఒక పర్యాయము వల్లభులు ఇలా అన్నారు. కొన్ని కొన్ని ధర్మ సూత్రములకు లోబడి అంశావతారములకు స్వేచ్ఛయీయబడును. అందువలన సంకల్పము వారికి మూలతత్త్వము నుండి వచ్చును. ఆ మూలతత్త్వము యొక్క సంకల్పము అమలుచేయవలసిన బాధ్యత అంశావతారము లకు ఈయబడును. ఏదైనా సమస్య ఉత్పన్నమైనపుడు అంశావతారములు ఆ సమస్యలను మూలావతారమునకు నివేదించి, మూలతత్త్వము యొక్క అనుమతి పొంది, జీవులకు శ్రేయస్సు కలుగజేయుదురు. మూలతత్త్వము ఏయే కార్యములు చేయునో, ఆ కార్యములను అంశావతారములు కూడ చేయును. అందువలన జీవులకు సంబంధించి నంతవరకూ భగవంతుడు పూర్ణావతారముగా వచ్చినా లేదా అంశావతారముగా వచ్చినా తేడా ఏమీ ఉండదు. శిరిడీ సాయిబాబా తమ అచేతన శరీరమును మహల్సాపతికి అప్పగించి, మూడు దినములలో తిరిగివత్తునని, తన శరీరమును కాపాడమని మహల్సా పతికి తెలిపి విగతజీవుడయ్యెను. తిరిగి మూడు రోజుల పిదప వచ్చి ఆ శరీరములో ప్రవేశించి, తన దైనందిన కార్య క్రమములలో పాల్గొనెను. ఈ మూడు దినములు భగవంతుని దగ్గరకు వెళ్లి, కొన్ని అత్యవసర విషయములు చర్చించి నానని బాబా తన అంతరంగీకులకు తెలిపెను. అంటే అంశావతారమైన బాబా కొన్ని సమస్యలను తన మూలతత్త్వ మైన దత్తాత్రేయునితో చర్చించుటకు వెళ్లినట్లుగా శ్రీవల్లభుల మూలతత్త్వ వివరణను బట్టి అర్థం చేసుకోవాలి.

17. పితృదేవతలనగా చనిపోయిన పెద్దలుగారు. పితృదేవతలనగా చనిపోయిన వారి పేరున మానవులు చేసే శ్రార్ధకర్మలు స్వీకరించి, చనిపోయిన వారికి ఉత్తమగతులు ప్రసాదించువారు. వీరినే జన్యుదేవతలని కూడ అంటారు. వీరికి మరుజన్మము అనేది ఉండదు. గతజన్మములలో మానవులు చేసిన పాపకర్మలను ఈ తరములో వారు జన్మించునపుడు ఆయా కర్మలను వీర్యకణముల రూపంలో ఈ జన్యు దేవతలు వారికి సంక్రమింపజేస్తారు.

శ్రీపాదుల వారిది గురుస్వరూపము. వారు తమ వాక్సుధ ద్వారా ఎన్నో అద్భుతమైన విషయాలను మానవాళికి అందించి, వారి మనస్సులలో గల అనంతమైన సందేహాలను నివృత్తి చేసారు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-16

# శ్రీపాద వల్లభుల తత్త్వము

అనంతకోటి బ్రహ్మాండముల సృష్టి, స్థితి, లయములనొందించు మహాసంకల్పమేదైతే, ఉన్నదో అట్టి నిరాకార నిర్గుణతత్వమే, సాకార సగుణ స్వరూపమై, పూర్వయుగమందు శ్రీ దత్తాత్రేయుడిగా అవతరించి, ప్రస్తుతం ఈ కాలమున శ్రీపాద శ్రీవల్లభరూపమున అవతరించినది. ఈ అవతారము నరాకారముగా తోచు నిరాకారము. సగుణముగా తోచు నిర్గుణము. ఒక దేవతాస్వరూపముగా కనిపించే సర్వదేవతాస్వరూపము. అన్ని యోగ మార్గములకు గమ్యము. సృష్టి ఆదినుండియూ మహర్షులు తమ తమ సాధనా విశేషముల వలన సాక్షాత్కారము పొందిన దేవతాస్వరూపములన్నియూ శ్రీపాదులవారి దివ్య స్వరూపములే. కావున దత్తుడు సనాతనుడు అదియే వారి సనాతనతత్త్వము.

దత్తాత్రేయుని తత్త్వం అఖండ తత్త్వం. శ్రీపాదశ్రీవల్లభస్వామిగా ఒక సామాన్య స్థితినుండి అఖండతత్త్వం చేరే మార్గం దత్తుడు చూపారు. అసలు శ్రీపాదవల్లభుల తత్త్వమంతా వేర్వేరు రూపాలలోలేదు. అంతా ఒక్కటే. అంతా తానేనని నిరూపించి, తానే దత్తుడని నిర్ద్వంద్వంగా ప్రకటించిన అవతారమది. శ్రీపాద శ్రీవల్లభుడంటే మోక్షలక్ష్మికి స్థానమైనవాడని, యోగలక్ష్మికి ప్రభువైనవాడని తెల్సుకోవాలి. అతడే అనఘాలక్ష్మీసమేత అనఘుడనబడే దత్తుడు- శ్రీపాదశ్రీవల్లభుడు. యోగలక్ష్మియే అనఘాలక్ష్మి. వల్లభులవారిది అనన్యత్త్వం, అభిన్నత్త్వం, అఖండతత్త్వం. ఈ మూడు తత్త్వాల ప్రాతిపదికగా శ్రీవల్లభులు వినుతికెక్కారు. శ్రీదత్తతత్త్వములో గల మూలతత్త్వము విక్షేపతత్త్వము, కరుణాతత్త్వము, నారసింహతత్త్వము, మోక్షతత్త్వము. మరియు భక్తసులభ తత్త్వముతోబాటు మరెంతో తత్త్వసంపద వారిలో గలదు. ముఖ్యంగా సర్వకార్యములకు ఏకైకతత్త్వము ఆధారము. అది అతీతము. నేను అనేకం అగుదును గాక అన్న పరబ్రహ్మ సంకల్పమే. దత్త సంకల్పం. ఆ పరబ్రహ్మమే దత్తుడు- శ్రీపాద వల్లభుడు.

శ్రీపాదులు సృష్టి, స్థితి, లయములకు అతీతమైన స్థితినుండి మానవజాతిని ఉద్ధరించుటకు అవతరించారు. వారి అవతరణము అష్టాదశవర్ణముల వారికి మేలు చేయుట. శ్రేయస్సు సమకూర్చుట, సర్వవ్యాపితము, సర్వజ్ఞత్వము, అనంతశక్తిమత్వము. వారు మనదేశంలోని ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక గొప్ప విలక్షణమైన పద్ధతికి బాట వేశారు. వారి తత్త్వము త్రిమతాచార్యుల తత్త్వానికన్నా భిన్నమైనది. వారు యేనాడు సనాతనధర్మాలనుగాని, పద్ధతులనుగాని, విధి విధానాలను గాని వ్యతిరేకించలేదు. అన్ని కులముల వారు వారి వారి ధర్మములను యధావిధిగా పాటించాలని పదేపదే తెలిపేవారు. సృష్టిలోని ఏకత్వమునందలి అనేకత్వమును, అనేకత్వమునందలి ఏకత్వమును తనయందే నిలుపుకుని భూమిపై అవతరించిన వారు శ్రీపాద శ్రీవల్లభులు. ఈ సృష్టికి ఆది, అంతము వారే. ఆ విషయాన్ని వారే స్వయంగా తెలిపారు. వారి మాటలలో చెప్పాలంటే "నీవెంత సత్యమో, ఈ లోకమెంత సత్యమో, ఈ సర్వసృష్టియును ఎంతటి సత్యమో, ఈ సమస్తమునకు నేనే మూలకారణము అనుట కూడా అంతే సత్యము. నేనే అన్ని సత్యములకును పరమమైన పరమ సత్యమును" అని పదే పదే నొక్కి వక్కాణించేవారు.

దత్తభక్తిలో పరిపూర్ణత సిద్ధించినప్పుడు ఏ యుగమందైననూ ఏ కాలమందైననూ శ్రీపాద శ్రీవల్లభులు భౌతిక రూపములో దర్శన, స్పర్శన సంభాషణాభాగ్యము నిచ్చెదరు. దత్తపురాణము ననుసరించి శ్రీ దత్తాత్రేయుల వారే ధర్మశాస్తగా అవతరించిరి. ధర్మశాస్త అనగా హరిహరసుతుడైన అయ్యప్పస్వామిగా దత్తుడు అవతరించినప్పుడు, దేవేంద్రుడు వ్యాఘ్ర రూపమును ధరించగా వ్యాఘ్రవాహనరూఢులైన శ్రీవల్లభులు అయ్యప్పస్వామిగా అనిపించిరి. అంబ సింహవాహినియైనట్లే వ్యాఘ్రవాహిని కూడా కనుక వ్యాఘ్రవాహనరూఢుడైన శ్రీపాదశ్రీవల్లభులు, జగన్మాత అభిన్నస్వరూపముగా భావించవచ్చు. దీనినిబట్టి, శ్రీపాదవల్లభులవారిది సకలదేవతా స్వరూపముగా తెలియును. సర్వదేవతాస్వరూపములకు అతీతమైన

మహాతత్త్వము. అదే విక్షేపతత్త్వము. శ్రీపాదశ్రీవల్లభుడనిన పరిమితమైన నామరూపము గాదు. సంపూర్ణ దత్తావతారము. వారే గాయత్రీ మాతస్వరూపము, సాక్షాత్తూ శ్రీవేంకటేశ్వరస్వామి స్వరూపము. సకల దేవతాస్వరూపములను, సమస్త శక్తులను అంశలుగా గలిగిన విరాట్ స్వరూపము. భక్తుల అభీష్టములకు అనుగుణంగా వారు భిన్న, భిన్నతత్త్వములలో తోచెదరు.

శ్రీదత్తప్రభువుల సంకల్పమువలన భవిష్యత్తు వర్తమానముగాను, వర్తమానము భూతకాలముగాను, భూతకాలము వర్తమానముగాను మార్పు చెందును. శ్రీదత్తప్రభువుల చైతన్యము నిత్య వర్తమానము. గతములో జరిగినది, ప్రస్తుతము జరుగుచున్నది, భవిష్యత్తులో జరుగబోవునది అంతయును వారి సంకల్పము ననుసరించి యుండును. ఒక విషయము జరుగుటకుగాని, జరుగకుండుటకుగాని, వేరొక కొత్త పద్ధతిలో జరుగుటకుగాని, శ్రీదత్త ప్రభువు యొక్క సంకల్పమే ప్రధానము. ఏ మహాసంకల్పములో సృష్టి, స్థితి, లయములు జరుగుచున్నవో ఆ మహాసంకల్పము యొక్క స్వరూపమే శ్రీ దత్తాత్రేయస్వామి. వారే శ్రీపాదశ్రీవల్లభులు. సమస్త దేవీదేవతల సంకల్పములను, సమస్త మానవకోటి సంకల్పములను నడిపించునదే మహాసంకల్పము. భగవదావతారములన్నియూ ఏ బ్రహ్మ స్వరూపమునుండి వెలువడునో ఆ బ్రహ్మమే దత్తుడు. ఆది ప్రబోధనాశక్తియే శ్రీదత్తులు అనగా మహాసంకల్పస్వరూపము. ఇదియే వారి విక్షేపతత్త్వము. వారి అనుగ్రహముతో కురువపురమునందలి మత్స్యకారుల వంటి అల్పజ్ఞులు బ్రహ్మజ్ఞానము పొందిరి.

శ్రీపాదులవారి భక్తపాలనాతత్త్వమెంతో ఆనందదాయకము. శ్రీపాదుల వారి యందు భక్తి కలిగియుండినచో సర్వమూ సిద్ధించును. తాబేలు తన బిడ్డను చాలా దూరమునుండి వీక్షించుచూ తన ఆలోచనా తరంగములతో కాపాడును. పిల్లి తన పిల్లలను నోటితో కరచుకొని ఇంటింటికీ తిప్పుచూ సురక్షిత ప్రాంతమునకు చేర్చి కాపాడును. అట్లే శ్రీపాదులు కూర్మకిశోర న్యాయమనగా తాబేలు తన పిల్లలను దూరమునుండి కాచినట్లే, వారెక్కడ ఉన్నా భక్తుల మంచి చెడ్డలను చూచెదరు. కొంత కాలమునకు ఆ భక్తులను మార్జాల కిశోరన్యాయముగా అంటే పిల్లి తన పిల్లలను సురక్షిత ప్రాంతమునకు తరలించినట్లు, భక్తులను సురక్షితంగా ఉండునట్లు చేస్తూ భక్తపాలన గావించెదరు. తదుపరి కోతి తన పిల్లలను అంటిపెట్టుకున్నట్టు మర్కట కిశోర న్యాయముగా భక్తులను అంటిపెట్టుకొనే ఉందురు. అటుపై తల్లి చేప, పిల్ల చేపకు ఈదుటకు స్వేచ్ఛనిచ్చినట్టు, తమ భక్తులు స్వేచ్ఛగా ధ్యానములో కూర్చుంటే, వారికి దర్శన భాగ్యమిత్తురు. ఇది వారి ఆశ్రితజన రక్షణాతత్త్వము. భక్తపాలనా తత్త్వము.

శ్రీవల్లభుల వారి పరబ్రహ్మ తత్త్వమునందు త్రిశక్తి స్వరూపిణియయిన అనఘాలక్ష్మి, వారియొక్క శక్తిస్వరూపముగా, వారి శరీరమునందు వామభాగముననున్నది. కుడిభాగమున వారి త్రిగుణాత్మకమైన త్రిమూర్తిస్వరూపము గలదు. సమస్త సృష్టియూ వారియందేయున్నది. సృష్టి, స్థితి, లయ, తిరోధాన అనుగ్రహములను కార్యములు వారి పర్యవేక్షణలో నిరంతరము జరుగును. వారియందే మహాసరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి రూపములు ఉన్నవి. ఒక్క క్షణములో శక్తిగాను మరుక్షణములో స్వామి శాక్తుడుగా విరాజిల్లగలరు. ఈ సమస్తసృష్టికి మాతా, పితా, గురు స్వరూపము వారే. ఇదియే సృష్టిలో సర్వము వారయిన వారి పరబ్రహ్మతత్త్వము.

లోకమునందలి సమస్తధర్మములను, సంప్రదాయములను, పద్ధతులను అన్నిటినీ సమన్వయమొనర్చి సనాతనధర్మమున కలిపివేయుట శ్రీవల్లభుల వారి సంకల్పము. కలియుగాంతమున తిరిగి సనాతనధర్మము విశ్వమంతా ప్రతిష్ఠింపచేయాలన్నదే వారి ప్రయత్నం. ఇదే శ్రీవల్లభుల అచింత్యమైనతత్త్వం.

దత్తాత్రేయుడు హరిహరపుత్రుడైన ధర్మశాస్తయే. విష్ణురూపముతో బ్రహ్మరుద్రులు విలీనమైరి. అదియే దత్తరూపము. ధర్మ శాస్త రూపములో గణపతి, షణ్ముఖులు విలీనమైనదికూడా దత్తరూపమే. దత్తుడెల్లప్పుడూ త్రిమూర్త్యాత్మకుడు. శ్రీపాదశ్రీవల్లభరూపమందు మహాగణపతి తత్త్వమున్నందుకు నిదర్శనముగా శ్రీపాదవల్లభులు గణేశచతుర్దశినాడు అవతరించిరి, సుబ్రహ్మణ్యతత్త్వము వారిలో ఇమిడియున్నందున వారిది జ్ఞానావతారము. ధర్మశాస్తతత్త్వము వలన వారిది సమస్తకర్మములకు ఆదియు, మూలమని గ్రహించవలయును.

శ్రీపాదశ్రీవల్లభులవారు ఈ చరాచరసృష్టికంతటికినీ మూలము. వారు వటవృక్షము వంటివారు. వారి అంశావతారములన్నియూ ఆ వృక్షముయొక్క ఊడలవంటివి. ఊడలు భూమిలోనికి దిగి స్వతంత్రమైనతత్త్వము గలవిగా

కనిపించిననూ, వాటికి ఆధారభూతమైనది మాత్రము ఆ వటవృక్షమే. సమస్త ప్రాణులకు వారే ఆధారము, ఆశ్రయము. వారినుండియే సమస్తశక్తులు ప్రకటితమై వారిలోనే లీనమగును. ఆ రకంగా అన్ని సాంప్రదాయముల వారునూ దత్తతత్త్వములో సమన్వయము పొందెదరు. సర్వసత్యములకు, సర్వతత్త్వములకు మూలము దత్తప్రభువులే. అరుణము అనగా పాపరహితమైనది. శ్రీపాదులవారు చిత్తా నక్షత్రమందు, మరియు మంగళవారమునందు సాక్షాత్తూ శ్రీ అరుణాచలేశ్వరుని రూపములోనుందురు. అరుణాచలేశ్వరుడు అగ్నిలింగరూపుడు కాబట్టి అగ్నితత్త్వము కలిగిన ఈ రూపమున స్వామి ఆయారోజులలో విలసిల్లెదరు. వారిది అగ్నిస్వరూపము. వారు ధరించునది అగ్నివస్త్రము. వారిది పవిత్రమైన యోగాగ్నిస్వరూపము.

ఒకసారి నరసావధానులతో శ్రీవల్లభులు పంచభూతాత్మకమైన ఈ సృష్టిలోని ప్రతీ అణువణువునందునూ అంతర్లీనముగా నున్న ఆద్యశక్తి తామేనని, పశుపక్ష్యాదుల లగాయితూ సమస్త ప్రాణికోటినందునూ మాతృస్వరూపముగాను, పితృస్వరూపముగాను ఉన్నది గూడా తామేనని, సమస్తసృష్టికి వారే గురుస్వరూపముగా తెలియజేశారు. ఇదే వారి గురుతత్త్వము. సమస్త ప్రాపంచిక బంధములనుండి విడివడిన అవధూతలందరూ తనలోనే లీనమగుచూ, బ్రహ్మానంద స్థితిని పొందుచున్నారని, ఆ అవధూతలలోని వ్యక్తిత్వము, సంకల్పము ఒకసారి తనలో లీనమైన పిదప ఇక వారికి వ్యక్తిత్వముగాని, సంకల్పముగాని ఉండదని ఈ సృష్టియొక్క మహా సంకల్పములో, మహాశక్తిలో తామున్నామని, జీవుని యందు గల మాయాశక్తి రూపము గూడా తమదేనని, తనలో లీనమయిన అవధూతలందరూ ఆజ్ఞాపిస్తే వెంటనే తిరిగి జన్మిస్తారని, అందువలననే తమది సంకల్పము నశించని సత్య జ్ఞానానందరూపమని శ్రీవల్లభులు తెలిపారు. ఇది వారిలోని సత్యజ్ఞానానందతత్త్వముగా విరాజిల్లుచున్నది.

భక్తులయొక్క స్వభావములనుబట్టి, వారి కర్మలయొక్క శుభాశుభములను బట్టి వల్లభుల ప్రవర్తన ఆయాభక్తుల యెడ ఉండును. సర్వస్యశరణాగతి చెందిన భక్తుల చేతిని వారు విడువరు. దైవము భావప్రియుడేగాని బాహ్యప్రియుడు మాత్రము గాదు. భక్తుల భావమును బట్టి దైవము పనిచేయుచుండును. బ్రహ్మజ్ఞాన సంబంధవిషయములు వచ్చినప్పుడు తాము బ్రాహ్మణులమని, దర్బారు చేయుచూ భక్తుల యోగక్షేమములు విచారించుచూ, వారిని అనుగ్రహించునప్పుడు తాము క్షత్రియులమని, ప్రతిజీవికీ, ఆజీవిచేయు పాపపుణ్యకర్మములనుబట్టి లెక్కలుచూస్తూ కర్మఅనెడి వేతనము నిర్ణయించునప్పుడు వైశ్యుడనని, భక్తుల బాధలను, కష్టములను తన శరీరము పైకి ఆకర్షించుకుని వారికి సుఖశాంతులు కలుగజేస్తూ సేవాధర్మము నిర్వహించు సమయమున శూద్రుడనని, జీవుల యొక్క పాపములను ప్రక్షాళన చేయునప్పుడు చాకలినని, మరణించిన జీవులను కాల్చి బూడిద చేసి, ఉత్తమ జన్మను ప్రసాదిస్తున్నవేళ కాటికాపరినని తెలిపారు. వారు అన్ని కులములందు కలరని, కులరహిత సమాజ స్థాపనే వారి ధ్యేయమని, అష్టాదశ వర్ణములలోని వారందరూ తమ వారేనని తెలిపారు. దీనినిబట్టి వారిది కులాలకు, వర్ణాలకు వివక్షతలేని అతీతమైనతత్త్వమని గ్రహించాలి. వారు అంత్య కులస్థులనెందర్నో ఆదరించి ఉద్ధరించారు. బ్రాహ్మణ కులసంజాతుడైన, శంకరభట్టుకు రజకకుల సంభవుడైన తిరుమలదాసుచే బ్రహ్మ జ్ఞానమును బోధింపచేయుట శ్రీపాదుల వారి చమత్కారము.

కోటానుకోట్ల బ్రహ్మాండములనంతా వ్యాపించియున్న ఏకైకతత్త్వమే దత్తతత్త్వము. దత్తతత్త్వము అనుభవములోనికి రావలెనన్న కొన్ని లక్షల జన్మలు ఎత్తిరావలసియున్నది. విశ్వమంతా వ్యాపించిన ఏకైక తేజో మహారాశియే దత్తుడు. దిక్కులనే వస్త్రములుగా గలవాడైనందున దిగంబరుడని నామమును బడసినాడు. ఎవరయితే త్రికరణశుద్ధిగా దత్త దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా! అని కీర్తన చేయుదురో వారి ఎదుట పిలిచిన వెంటనే సూక్ష్మ రూపములో సదా వారికి అందుబాటులో వల్లభులుందురు. అందుకే వారు స్మర్తృగామిగా అంటే పిలిస్తే పలికే దేవుడుగా సుప్రసిద్ధులైనారు. ఆ దత్తప్రభువే సాక్షాత్తూ శ్రీపాదశ్రీవల్లభులు. ఇదే వారి భక్త సులభతత్త్వము.

ప్రతి వ్యక్తిలోనూ ఒక్కొక్క ఇంద్రియము ఒక్కొక్క దేవతచేత ప్రభావితమౌతుంది. సమాధిస్థితిలోనున్న యోగికి ఆత్మ సాక్షాత్కారమైనప్పుడు పదహారుకళలు వారి, వారి భూతములలో లీనమౌతాయి. వీనినే షోడశకళలందురు. శ్రీవల్లభులు తమ అనేకలీలల ద్వారా షోడశకళాపరిపూర్ణమైన మహాయుగావతారమను విషయము బోధ చేయుచుండిరి.

శ్రీపాదులవారితత్త్వవిచారణలో ఎంతో ప్రముఖమైనది షోడశకళాపరిపూర్ణ అవతారము. షోడశకళలనగా పదహారుకళలని అర్థం. శ్రీపాదులవారిని విష్ణువు రూపంలో కొలిస్తే శివునిగా దర్శనమిస్తారు. శివునిగా దర్శనమిచ్చారు గదా అని శివుని రూపంలో అర్చిస్తే బ్రహ్మగా దర్శనమిస్తారు. బ్రహ్మరూపంలో పూజిస్తే శక్తిరూపంగా దర్శనమిస్తారు. దీనిని బట్టి ఇది భిన్నత్వంలో ఏకత్వతత్త్వంగా గోచరమవుతుంది. అందుకే వారు తాము సర్వదేవతాస్వరూపమని, ఏ రూపంలో ఏ దేవతను పూజించినా అది తమకే చెందుతుందని, వారిని సద్గురువుగా తలిస్తే సద్గురువుగాను, పరమాత్మునిగా తలిస్తే పరమాత్మునిగాను అనుభవమిచ్చెదరు. మన మనస్సునందు తర్కించు గుణము తగ్గించుకుని వారిని శరణుజొచ్చినచో శ్రీవల్లభులు మనకు యాదార్ధరూపమున గోచరించెదరు. ఈ పదహారుసంఖ్యకు మరొక ప్రాముఖ్యముగలదు. శ్రీదత్తాత్రేయస్వామివారు పూర్వయుగములో పదహారురూపములలో దర్శనమిచ్చిరి. అవి: యోగిరాజు, అత్రివరదుడు, దిగంబరావధూత దత్తాత్రేయుడు, కాలాగ్నిశమనుడు, యోగిజనవల్లభుడు, లీలావిశ్వంబరుడు, సిద్ధరాజు, జ్ఞానసాగరుడు, విశ్వంబరావధూత మాయాముక్తావధూత, ఆదిగురువు, సంస్కారహీన శివస్వరూపుడు, దేవదేవుడు, దిగంబరుడు, దత్తావధూత మరియు శ్యామ కమలలోచనుడు. కావున స్వామిని ఫలానాదేవుడని పరిమితి విధించే అవకాశమే లేదు. వారు సర్వశక్తిత్వము, సర్వజ్ఞత్వము, సర్వాంతర్యామిత్వముతోబాటు బ్రహ్మ, విష్ణు, రుద్ర రూపముల వలన షోడశకళాప్రపూర్ణులు. వల్లభులు స్వయంగా ఒకానొక సందర్భంలో 'నాయొక్క అష్టవిధ ప్రకృతినే అష్ట భార్యలుగా పొందిన శ్రీకృష్ణుడనని, తనది షోడశ కళాపరిపూర్ణ అవతారమని, వారియొక్క శరీరమునుండి, మనస్సు నుండి శ్రీపాద వల్లభ అవతారమనెడి దివ్యాత్మ నుండి దశదిశలలోనూ శక్తి స్వరూపములైన స్పందనలు ప్రతిక్షణము వెలువడుచుండునని, ఈ విధముగా ప్రతీ క్షణమునూ, ఒక్కొక్క కళకూ, శరీర, మనో, ఆత్మతత్త్వములుగల పదహారు కళలనుండి మొత్తం పదహారువేల స్పందనలు వెలువడునని, అవియే పదహారువేల గోపికలని, మానవావతారమైన శ్రీకృష్ణుని అవతారములో అవి ప్రత్యక్షంగా కనిపించినా, ఇప్పుడు ఈ వల్లభావతారమున అంతర్గతముగా పరోక్షంగా, నిరాకారముగా స్పందించుచున్నవని తెలిపిరి.

శ్రీదత్తప్రభువునుండి త్రిమూర్తులు, వారినుండి ముక్కోటిదేవతలు వారినుండి ముప్పదిమూడుకోట్ల దేవతలు ఆవిర్భవించారు. అందువలన దత్తనామస్మరణచేసిన యెడల సమస్తదేవతాస్మరణ చేసిన ఫలము లభించును. శ్రీదత్తుని బ్రహ్మ ముఖమునకు ఋషి పూజ చేయవలయును, విష్ణుముఖమునకు శ్రీ సత్యనారాయణ వ్రతము, విష్ణుసహస్ర నామము చేయవలయును. రుద్రముఖమునకు రుద్రాభిషేకము చేయవలయును. వారి బ్రహ్మముఖ జిహ్వయందు సరస్వతి, మధ్య ముఖ వక్షస్థలమందు లక్ష్మి, శివముఖ వామభాగమున గౌరీదేవి గలరు. సృష్టియందలి సమస్త స్త్రీ దేవతా శక్తులు శ్రీపాదుల వారి వామభాగమున, సమస్తపురుష దేవతాశక్తులు శ్రీపాదులవారి కుడి భాగమున గలవు. దీనినిబట్టి వారిది సకల దేవతాస్వరూపమైన సకల దేవతాతత్త్వము.

ఒక పర్యాయము శ్రీవల్లభులు వారి తాతగారైన బాపనార్యులవారితో నేను దత్తుడని చెప్పినప్పుడు నేను దత్తుడనగుచున్నాను. నేను దత్తఉపాసకుడనని చెప్పినప్పుడు దత్తోపాసకుడుగానే అగుచున్నాను. నేను శ్రీపాద వల్లభుడనని తెలిపినప్పుడు శ్రీపాదవల్లభుని అగుచున్నాను. నేను ఏది సంకల్పిస్తే అదే జరుగుతుంది. నేను యేవిధంగా అనుకుంటే ఆ విధంగా అవుతాను. ఇదే నాతత్త్వము. శ్రీపాదతత్త్వమనిరి. తమ భక్తులయొక్క సమస్త విఘ్నములను పోగొట్టదలచి తమ చైతన్యములో విఘ్నేశ్వతత్త్వము స్థిరముగా నిలుపుకొని శ్రీపాదులువారు అవతరించిరి.

ఒకానొకసందర్భంలో కురువపురమందు వల్లభులు తమ భక్తులతో 'నిరాకారుడయిన నేను నరాకారముగా మీ ముందుకు వచ్చుట కడు చోద్యము. నిర్గుణుడైన నేను సగుణుడుగా మీకు తోచుట ఆశ్చర్యము. అసలు పరిమితులు, అవధులు లేని నేను పరిమితులతో, అవధులతో ఉన్నట్టు మీకు అనుభవమగుట వింతనుగొలుపు విషయము. సర్వశక్తులూ నాయందున్నవి. ఈ అనంతకోటి బ్రహ్మాండమునందలి ప్రతి అణువణువులోనూ ఉన్నవాడిని నేనే. అణువణువును కలిపి ఉంచెడి సంకల్ప స్వరూపము నేనే! అణువణువునూ విడగొట్టగలిగి నూతనసృష్టి రచనకు రంగము సిద్ధము చేయు ప్రళయకాల రుద్రుడను నేనే! ఇది జ్ఞానమని, ఇది అజ్ఞానమని మీకు బోధచేయుచూ సర్వజీవులనూ మాయలో పడవేసి వినోదించుచూ, ఆర్తితో మీరు పిలిచినప్పుడు సహస్రబాహువులతో మిమ్ములను రక్షించువాడను నేనే! ఇదే నా అనాది

తత్త్వమని తెలిపిరి. శ్రీపాదులవారు జాతి, మత, వర్ణ, వయో వివక్షత లేకుండా వారి వారి యోగ్యతానుసారము భక్తులపై తమ అనుగ్రహము ప్రవహింపజేతురు. ఇదే వారి అనుగ్రహతత్త్వము.

శ్రీపాదుల వారి లీలావిధానములో తమ ఆశ్రితుని విపత్కరపరిస్థితులలో పడవేసి, వాడు శరణు, శరణు అన్నప్పుడు, విచిత్రమైన పద్ధతిలో భక్తరక్షణ చేయుట వారికి అలవాటు. సమస్యను సృష్టించునదియును వారే. దానికి పరిష్కారము జూపి ఆదుకొనువారును వారే. ఈ రకమయిన లీలావిశేషము దత్త భక్తులందరికీ అనుభవమే. ఇది ఒకరకమైన చమత్కార తత్త్వము.

శ్రీవేంకటేశ్వరస్వామి కృతయుగమునుండీ ఏడుకొండలమీద కొలువైయున్నారు. వారు సాక్షాత్తూ దత్తాత్రేయస్వామియే 'వేం' అనగా పాపములను 'కట' అనగా ఖండించువాడని అర్థము. వేంకారము అమృత బీజము 'కట' అనునది ఐశ్వర్య బీజము. శ్రీ వేంకటేశ్వరస్వామి అమృత, ఐశ్వర్య ప్రదాత. సకలపాపములను హరియించువాడు. శ్రీవల్లభుల పరమ భక్తుడైన శంకరభట్టు తిరుమల సందర్శించి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించగా, ముందుగా వేంకటేశ్వరస్వామిని స్త్రీ మూర్తిగా కనుగొనెను. ఆ స్త్రీ మూర్తియే బాలా త్రిపురసుందరిగా తోచిన కొద్ది క్షణములలోనే ఆ రూపము పరమేశ్వర రూపముగా మారినది. తరువాత శ్రీమహావిష్ణు స్వరూపముగా మారినది. అంతలోనే ఆమూర్తి పదహారుసంవత్సరముల వయస్సుగల మహాసుందరాకారుడైన బాలయతిగా దర్శనమిచ్చెను. ఆ బాలయతియే శ్రీవల్లభులు. అందువల్ల శ్రీవల్లభులలో శ్రీవేంకటేశ్వరతత్త్వము గలదని తెలియుచున్నది.

స్త్రీ, పురుషుల ఉభయులలోనూ స్త్రీ పురుషతత్త్వములు రెండూ ఉంటాయని, శరీరంలో కుడిభాగంలో ఉండే శక్తిని పురుషశక్తిగాను, ఎడమభాగంలో ఉండే శక్తిని స్త్రీశక్తిగాను గుర్తించవలెను. యోగి అయినవారు తన శ్వాసలోని సాధన ద్వారా కాలచక్రములోని సమస్తమును సిద్ధింపజేసుకుంటారు. భూత, భవిష్యత్, వర్తమానాల సమస్తమును గ్రహించగల కాలజ్ఞానాన్ని పొందుతాడు. ఈ కాలచక్రమునే అర్ధనారీశ్వరతత్త్వముగా, ఎన్నడూ విడదీయరాని జంటగా తెలుసుకోవలెను. ఈ సృష్టికంతయూ ఆధారభూతము, మూలపురుషులైన శ్రీవల్లభుల శరీరమందు వామభాగమున త్రిశక్తి స్వరూపిణి యయిన అనఘాలక్ష్మి యున్నది. కుడిభాగమున వారి త్రిమూర్తిస్వరూపముగలదు. సృష్టికంతయూ తల్లి, దండ్రులుగా వీరిలో అర్ధనారీశ్వరతత్త్వము ఇమిడియున్నది. యోగస్థితి వలన ఏర్పడే కామజయము వలన స్త్రీ పురుష భేదము నాశనమై ఏకత్వస్థితిని పొందినదే అర్ధనారీశ్వరరూపము.

శ్రీవల్లభులవారి తత్త్వానికి నిలువుటద్దంలా సిద్ధమంగళస్తోత్రాన్ని పేర్కొనవచ్చు. దీనిని శ్రీపాదులవారి మాతామహులైన శ్రీ బాపనార్యులవారు రచించారు. దీనిలో దత్తతత్త్వాన్ని బాపనార్యులవారు నర్మగర్భ రీతిలో తెలిపారు. శ్రీపాదులవారే దత్తులన్న విషయం వారి జన్మమునకు ముందు కలిగిన శుభశకునముల ఆధారంగా, తన జ్యోతిష్య, యోగదృష్టితో బాపనార్యులవారు తెలుసుకున్నారు. అందుకే శ్రీవల్లభుల మాతామహులు అయిన బాపనార్యులవారు, వారి సతీమణి రాజమాంబ, శ్రీవల్లభుల తల్లిదండ్రులు, సోదరీమణుల నామధేయముల ఆధారంగా, వల్లభులవారి శక్తి, సామర్థ్యాలను కూడా ఇనుమడింపజేస్తూ ఈ మంగళశాసనము చేశారు.

సృష్టిలోని వృక్ష, జంతు, మానవ ఇలా అంతటా దత్తుడే ఏకకాలంలో వ్యాపించి యున్నాడని తెలుపుటకు 'శ్రీమదనంత శ్రీవిభూషిత అప్పల లక్ష్మీనరసింహరాజా' అని సంబోధించారు. వల్లభులవారు సర్వాంతర్యామి గనుక 'శ్రీమదఖండ' అనే పదాన్ని వాడారు. వారి సోదరీమణుల పేర్లలో అంతరార్థంగా మిళితమైన శక్తిరూపాలయిన ఆదిపరాశక్తి (శ్రీవిద్యాధరి), రాధ (జ్యోతిర్మయ రూపం), సురేఖ (రూపనామాత్మకము), వారిచే రక్షాబంధనం (రాకీ) కట్టించుకొనువాడా (శ్రీ రాఖీధరా) అని పేర్కొన్నారు. దీనిలో ఆదిపరాశక్తి రూపంలో వారి సోదరీమణి వాసవీ కన్యకను గూడా ఊహించుకోవచ్చు. అంటే ఈ మూడు శక్తులు వారి వలన రక్షింపబడుతున్నవని బాపనార్యుల భావం. 'మంగళరూపా' అనడంలో దత్తుడు నిరాకారుడు, నిర్గుణుడై స్థూల వ్యవహారమునకు మంగళప్రదమైన రూపము ధరించుచున్నాడని తెలిపారు. ఇదేవిధంగా ఆ స్తోత్రంలో దత్త స్వరూపములో అంతర్గతంగా అనుభవమయ్యే తత్త్వంతోబాటు పీఠికాపురాన్ని, భరద్వాజ ఋషిని సవితృకాఠకచయన యజ్ఞాన్ని స్మరించారు. ఈ స్తోత్రమంటే వల్లభులవారికెంతో ఇష్టం. ఈ స్తోత్రము

పఠించుటవల్ల దత్తులవారి కృపకు పాత్రులు కాగలరు. ఈ స్తోత్రంలో దత్తతత్త్వాని ఇనుమడింపజేసి, భక్తులకు శ్రీబాపనార్యులవారు అందించారు.

దత్తతత్త్వములో మరో కోణము నిషిద్ధ పదార్థములచే రోగములు కుదుర్చుట. అద్భుతమైన కార్యములను బొత్తిగా ఏమీ తెలియని వారిచే చేయించుట. తద్వారా విజయపరంపరతో వినోదిస్తూ వినుతికెక్కుట. మల్లయుద్ధ వీరునిపై అర్చకుడు మరియు గూనిగల్గిన కులశేఖరుని విజయము ఈ తరహా లీలలో భాగమే.

శ్రీవల్లభులలో కరుణాతత్త్వము ఎంతో మెండుగాయుండెడిది. అనంతకోటి బ్రహ్మాండనాయకుడు, ఆదిమధ్యాంతరహితుడు, చతుర్దశభువనములకు సార్వభౌముడైన లీలావతారుడు శ్రీపాదశ్రీవల్లభస్వామి వారే దత్తులు వారికి స్మర్తృగామి అనే మరో నామధేయమున్నది. అంటే భక్తులు పిలవగానే ఎదుట నిలిచి కోర్కెలు తీర్చేవాడని అర్థం. ఎంతోమంది భక్తుల కడగండ్లు తీర్చి, వారి కోర్కెలను సఫలీకృతంచేసి, వారి పాపకర్మలను హరింపజేసిన కరుణా సముద్రులు శ్రీవల్లభులు. ఒక్కొక్క పర్యాయము తన ఆశ్రితుల పాపకర్మలను నిర్జీవ పదార్థములైన రాళ్లు, రప్పలకు బదలాయించుట ద్వారా, రాళ్లను,శిలలను భక్తులచేత పగలగొట్టించి తద్వారా కర్మఫలము ధ్వంసముచేసి, భక్తులకు స్వస్థత చేకూర్చేవారు. నంబూద్రిని పునర్జీవితునిగా చేశారు. నరసావధానికి ప్రాణ దానం చేశారు. శ్రేష్ఠిని రక్షించుటకై క్షుద్రశక్తులను ధ్వంసం చేశారు. ఇలా భక్తుల యెడ ఎంతో కరుణ జూపి, భక్తుల బాధలు రూపుమాపినదే వారి కరుణాతత్త్వము.

శ్రీవల్లభుల వారిలో నారసింహతత్త్వము గూడ ఇమిడి యున్నది. ఒకసారి ప్రహ్లాదుడు తన భవనమందు శ్రీనరసింహ స్వామి అవతరించిన ఔదుంబర వృక్షస్తంభము వద్ద ధ్యానస్థుడై యుండగా, అందుండి శ్రీ దత్తాత్రేయ స్వామి సాక్షాత్కరించి అతనికి జ్ఞాన బోధ చేసిరి. దీనినిబట్టి విష్ణుస్వరూపులైన దత్తులే నరసింహావతారము దాల్చి హిరణ్యకశిపుని సంహరించారని తెలియును. ఒక పర్యాయము నరసింహరాజవర్మ అను భక్తునికి ముప్పది రెండు నరసింహస్వామి రూపములు దర్శనమిచ్చినవి. అందు ముప్పదవఅవతారంలో శ్రీనరసింహమూర్తిగా శ్రీవల్లభులు ముప్పది ఒకటవ అవతారంగా శ్రీనృసింహసరస్వతి, ముప్పది రెండవ అవతారంగా స్వామి సమర్థుల వారు దర్శనమిచ్చిరి. దీనినిబట్టి వారు తమ అనంతతత్త్వమును, దిగంబరత్త్వమును, భక్తజనపాలనను ఈ నరసింహతత్త్వము ద్వారా తేటతెల్లం జేశారు. ఔదుంబర వృక్షమూలమున తానుందునని ఔదుంబర వృక్షమునకు వరమిచ్చి, అందుండి నరసింహాకృతిలో వెలువడిన కారణంగా మరొక అవతారంలో నృసింహసరస్వతి నామము ధరింతుని తెలిపిరి.

శ్రీవల్లభుల వారిలో మోక్షతత్త్వము మెండుగా కనిపిస్తుంది. వారిని ఆశ్రయించిన వారందరికీ మోక్షమును ప్రసాదించారు. ధర్మమునకు విరుద్ధముకాకుండా కోర్కెలను అనుభవింపవలయునని, సత్కర్మలను ఆచరించుటవలన మోహము నశించునని, మోహము క్షయమయితే గాని మోక్షము లభించదని తెలిపారు. ఉత్తరక్రియల లోపం వలన ముళ్లచెట్టు రూపంలో ఉన్న విస్సావధాన్లు వారికి, వారి వంశజుడైన గురుచరణునిచే లఘుకర్మ చేయించి, విస్సావధాన్ల వారికి మోక్షప్రాప్తి కల్గించారు. ఎవరికి ఎంత యోగ్యత ఉంటే అంతే దత్తులు ప్రసాదించేవారు. దత్తునిలో ఎంతో మంది అవధూతలు ఐక్యమై మోక్షమును పొందారు. ద్వైత స్థితిగాని, విశిష్టాద్వైత స్థితిగాని, అద్వైత స్థితిగాని జీవులయొక్క కోరిక మేరకు శ్రీపాదులవారు ప్రసాదించేవారు. ఇదే వారి మోక్షతత్త్వానికి ప్రతీక.

“జ్ఞానం మహేశ్వరా దిచ్ఛేత్ – మోక్ష మిచ్ఛేత్ జనార్ధనాత్” అన్నది ఆర్యోక్తి. జ్ఞానం కోసం పరమేశ్వరుని, మోక్షంకోసం విష్ణువును ప్రార్థించాలి. ఇక బ్రహ్మ విషయానికొస్తే బ్రహ్మకు పూజలుగాని, ఆలయాలుగాని ఉండరాదని శివుని శాపముంది. దత్తాత్రేయస్వామి యందు త్రిమూర్తులు కొలువైయున్నారు. వీరిది శివకేశవుల అబేధతత్త్వం. దత్తాత్రేయుడ్ని పూజిస్తే, శివ, విష్ణువుల అనుగ్రహం కలిగి జ్ఞానం, మోక్షం రెండూ లభిస్తాయి. శైవం గొప్పా? లేక వైష్ణవం గొప్పా? అని వాదులాడుకునే మూర్ఖులకు రెండూ వేర్వేరుగాదని, రెండూ ఒకటేనని తెలిపేటందుకే దత్తతత్త్వముదయించినది. ఒక వస్తువును ముక్కలులుగా చేస్తే, ఆ ఒక్కొక్క ముక్క యొక్క విలువ ఏమీ లేకుండా శూన్యమయిపోతుంది. ఆ ముక్కలన్నీ ఒకచోట చేరిస్తే ఒక ఆకారముమేర్పడి, ఆ ఆకారం ఎంతో విలువను సంతరించుకుంటుంది. అదే శివకేశవులకలయిక. జ్ఞానంలేకపోతే మోక్షాన్ని అందుకోలేము. మోక్షాన్ని జ్ఞానం సముపార్జించుకోకుండా పొందలేము. కావున శివకేశవుల ఆ

బేధతత్త్వాన్ని అంగీకరించవలసిందే. దత్తాత్రేయుని పూజిస్తే బ్రహ్మను కూడా శివ, విష్ణువులతో బాటు పూజించినట్లే. ఈ రూపంగా దత్తుడు బ్రహ్మకు గూడా సముచితస్థానమిచ్చి, పరోక్షంగా బ్రహ్మకు కూడా శివవిష్ణువులతో బాటు సమానస్థాయిలో పూజార్హత కల్పించాడు. ఆ విధంగా త్రిమూర్తులకు సమానత్వం కల్పించి "శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే – శివస్యహృదయః విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః" అన్న వేదవాక్కును త్రిమూర్త్యాత్మక రూపంతో శ్రీదత్తాత్రేయుడు సత్యం చేసారు. ఇదే దత్తాత్రేయ అవతార విశిష్టత. అదేవారి సర్వమత సమానతత్త్వం. ఈ విధంగా శ్రీవల్లభులు శివకేశవుల అభేదతత్త్వాన్ని ప్రభోధించారు.

అవతారములు కాలానుగుణ్యముగా వచ్చుచుండును. యాచనా ప్రవృత్తినిగల తమోగుణప్రధానముగా వచ్చినది వామనావతారము. రజోగుణ ప్రధానముగా వచ్చినది పరశురామావతారము. సత్త్వగుణ ప్రధానముగా వచ్చినది రామావతారము. త్రిగుణములకు అతీతమైన నిర్గుణతత్త్వ ప్రధానముగా వచ్చినది శ్రీకృష్ణావతారము. కర్మ ప్రధానముగా వచ్చినది బుద్ధావతారము. సమస్త సృష్టిలోని ఏకత్వము నందలి అనేకత్వమును, అనేకత్వమునందలి ఏకత్వము తనయందే నిలుపుకొని వచ్చిన, అత్యంత అద్భుతమైన, అత్యంత విలక్షణమైన యుగావతారము శ్రీపాద శ్రీవల్లభావతారము. శ్రీవల్లభుల వయస్సు అనేక లక్షల సంవత్సరములనియు, ఈ సృష్టికి ముందునుంచీ తామున్నామని, ప్రళయానంతరము కూడా ఉందుమని ఒకానొక సందర్భంలో వారి తాతగారైన బాపనార్యులకు తెలిపిరి. దీనినిబట్టి వారెంత సనాతనులో, వారి తత్త్వమెంత సనాతనమైనదో, వారి ధర్మమెంత సనాతనమైనదో అంతుబట్టని అంశం.

శ్రీ దత్తప్రభువువారి సగుణతత్త్వమునకు, నిర్గుణతత్త్వమునకు అతీతము మరియు ఆధారమైనది వారి పరమతత్త్వము. అదియే చరమతత్త్వము, అదియే ఆదితత్త్వము, అదియే ఆద్యంతరహితతత్త్వము. దీనిని కేవలము అనుభవపూర్వకంగా తెలుసుకొనవలెనే గాని, అది ఈ రకంగా ఉందునని, మనము తర్కబుద్ధితో యోచించుట కేవలం నిష్ఫలము.

దత్తతత్త్వము ఇదియని ఇతిమిద్ధముగా తెల్పుటకుగాని, ఇంతయని గాని తెలుపుట మానవమాత్రులకుగాని, వేయి పడగలున్న ఆ ఆదిశేషునికిగాని తరముగాదు.

భగవంతుడు దుష్టశిక్షణ–శిష్టరక్షణ చేస్తే, గురు రూపంలో వల్లభులు దుష్టశిక్షణకు బదులు దుష్టపరివర్తన చేబట్టి దానితోబాటు శిష్ట రక్షణను చేయుచూ, తద్వారా భక్తులకడగండ్లు తీర్చి, ఆర్తజనరక్షణే ధ్యేయంగా ముందుకుసాగారు.

**శ్రీపాద రాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-17

# శ్రీ వల్లభుల అవతార పరిసమాప్తి

శ్రీ వల్లభులు అమృతమధురములైన తమదివ్యలీలలెన్నో, తమ భక్తులకు ప్రతిదినము చూపెడివారు. వారిని భక్తితో సన్మార్గములో నడచుకోవలసినదిగా బోధించేవారు. జనులకు భక్తి మార్గమును మించినది లేదని ప్రభోదించెడివారు.

శ్రీ వల్లభుల వారి ప్రియతమభక్తుడు, వారి కనుసన్నలలో వారి ఆశీర్వాదబలంతో, వారి దివ్యచరిత్రను సంస్కృతము నందు రచించి, వారికి వినిపించి, శ్రీవల్లభుల ప్రశంసలందుకున్న, పరమపుణ్యాత్ముడైన శంకరభట్టు ప్రతినిత్యము ఎంతో ఆనందపారవశ్యములో మునిగి తేలుతూ సదా శ్రీవల్లభుల సేవయందు నిమగ్నుడై, కాలము వెళ్లబుచ్చు చుండెను.

ఒక రోజు కృష్ణానదీసంగమములో ఉషఃకాలమందు స్నానమాచరించుచూ, వారికి ముప్పది సంవత్సరముల వయస్సు వచ్చియున్నందున, గతంలో వెల్లడించిన ప్రకారం, వారి అవతారం పరిసమాప్తి చేయవలయునని శ్రీవల్లభుల వారు నిశ్చయించుకొనిరి. వారు అంతర్హితులయ్యేందుకు హస్తానక్షత్రముతో కూడిన ఆశ్వయుజ కృష్ణ ద్వాదశిని ముహూర్తంగా నిర్ణయించుకొనిరి. ఈ విషయము వారెవరికీ తెలుపక గోప్యముగా ఉంచిరి.

అవతారము పరిసమాప్తి చేయాలనుకున్న శ్రీపాదులవారి గుప్తసంకల్పము వారి ప్రియతమ భక్తులైన శ్రీశైలంలో ఉన్న నిర్మలానంద బ్రహ్మచారికి, గోకర్ణంలోవున్న గోవిందభట్టుకు, బదరీక్షేత్ర నివాసియైన సదానంద బ్రహ్మచారికి, మహూర్‌గడ్‌లోనున్న యోగానందుడు మొదలగువారికి వారియొక్క దైవీశక్తి వలన క్షణములలో వారి అంతరంగములకు తాకినది. శ్రీవల్లభులను ఆప్రయత్నం నుండి విరమింపచేయాలని అందరూ వెంటనే కురుంగడ్డకు పయనమయ్యారు. గోవిందభట్టు మాత్రం వార్ధక్యం వల్ల కురుంగడ్డ బయలుదేరలేకపోయెను. అతని శిష్యులను మాత్రం స్వామిని దర్శించమని కురుంగడ్డకు పంపెను.

ఇట్లుండగా, ఒకరోజు ఉదయము, మఠమునందు ఎన్నిసార్లు ప్రయత్నించిననూ శంకరభట్టుకు మహానైవేద్యము, వంటకములు తయారు చేసేందుకు గాడిపొయ్యినందు నిప్పు రాజుకోలేదు. ఇటువంటి పరిస్థితి ఇదివరకెన్నడూ అతనికి ఎదురుకాలేదు. అందువల్ల ఇది ఒక పెద్ద అపశకునముగా తోచి, వికలితమనస్కుడై బాధతో ఏమియును తోచక, మనోవేదన పడుచున్న అతనికి గతంలో శ్రీపాదులవారు నీ గాడిపొయ్యిలోని అగ్నికి దానంతగా అది మండి, రాజుకునే శక్తి లేదు. అది కేవలం నాయోగాగ్నిని ఆధారం చేసుకుని మాత్రమే మండుచున్నదని, నా యోగాగ్నిని నాకు ముప్పది సంవత్సరముల వయస్సు వచ్చువరకే గాడిపొయ్యికి అందించి మండించగలనని, అటుపై తమ శరీరమును గుప్తపరచెదమని అన్నమాటలు గుర్తుకువచ్చెను. వెంటనే నిశ్చేష్టుడై, కంగారుతో, పరుగులు తీయుచూ, భయభ్రాంతుడై వల్లభులకడకేగి గాడిపొయ్యి మండుటలేదని తెలిపెను. వారు చిరునవ్వు నవ్వి, మరొక్కసారి స్నానము చేసి అగ్నిని గాడిపొయ్యిలో ప్రజ్వలింపజేయుటకు ప్రయత్నించమని తెలిపిరి. శంకరభట్టు తిరిగి స్నానము చేసి ప్రయత్నించిననూ గాడిపొయ్యిలో మంటరాజుకోలేదు. వెంటనే శ్రీవల్లభుల వారు తమ యోగాగ్నిని జతచేయని కారణంగానే గాడిపొయ్యిలోని అగ్నిరాజుకొనలేదని గ్రహించి, లెక్కలు వేసుకొనుచూ, ఆనాటికి శ్రీవల్లభులవారి వయస్సు ముప్పది సంవత్సరములుగా శంకరభట్టుకు స్ఫురించెను.

ఎన్నిసార్లు ప్రయత్నించిననూ, గాడిపొయ్యి మండుటలేదని శంకరభట్టు దైన్యముగా మరొక్కసారి వల్లభుల కడకేగి విన్నవించెను. అతని ఆవేదనను గ్రహించిన వల్లభులు, చిరునవ్వు చిందించుచూ, నాయనా! శంకరభట్టూ! నేను గుప్త రూపమున ఉండుటకు సమయమాసన్నమైనది అందుకే గాడిపొయ్యి మండుటలేదు. ఇక, ఈ వల్లభావతారమును పరిసమాప్తి చేయుదునని తెలిపిరి. ఆ మాటలు విన్న శంకరభట్టుకు మైకంక్రమ్మి, కొంచమయినా చలనం లేకుండా, శిలాప్రతిమవలే ఉండిపోయాడు. అతని శరీరమంతా కంపించింది. ఆకస్మికమైన వారి నిర్ణయంతో కృంగిపోయి కన్నీరు

కారుస్తూ, దిగులుతో స్వామివారి పాదాలపై బడి తనను విడిచిపోవద్దని, ఆ ప్రయత్నం విరమించమని రోదించసాగాడు. కాని, శ్రీవల్లభులు అతని కోర్కెను మన్నించలేదు. శంకరభట్టు మెల్లగా తేరుకుని లేచి, కరములు జోడించి శ్రీవల్లభులవారిని చూచి, అశ్రునయనాలతో, రోమాంచితుడై, ఉద్వేగము చెంది స్వామినిలా స్తుతించాడు. ఓ శ్రీపాదవల్లభా! సుమతీరాజనందనా! కోటి సూర్యుల జ్ఞానమనే తేజస్సుతో శతకోటి చంద్రుల ఆనందమనెడి చల్లదనము కలిగి, దేవతలందరి చేత పూజింపబడే విశ్వాశ్రయుడు, భక్తప్రియుడు, సర్వశ్రేష్ఠుడైన అత్రి అనసూయ కుమారరత్నమైన ఓ దత్త సార్వభౌమా! నీకివే నా హృదయపూర్వక నమస్కారములు. ఆద్యంతములు లేనివాడవు. సకల లోకాలకు ప్రభువైనవాడవు. సకల ధర్మములను ఎరిగినట్టివాడవు. సకల పాపములను పరిహరించి భక్తులను పవిత్రులను చేయువాడవు. మంగళకరమునకు మంగళకరుడవు. దేవతలకు కూడ దేవతవైనట్టి వాడవయిన ఓ యోగిపుంగవా! నీకు ఇవే నా నమఃసుమాంజలులు. నీ పాదకమలాలను వేదాలు, శాస్త్రాలు స్తుతిస్తున్నాయి. అష్టాంగయోగ తత్వనిష్ఠతో ఆత్మ సంతుష్టుడవైయున్న జ్ఞానసాగరా! నీచరణారవిందములకు ఇదే నా సర్వశ్యశరణాగతి. చిరకాలం కఠోరతపస్సులు చేసిన యోగులకు గూడ లభ్యముగాని సాక్షాత్కారము ప్రత్యక్షముగా నాకు కలిగినది. దుఃఖసాగరమున మునిగి, దారితెన్నూ కన్పించక బాధపడుచున్న భక్తులను రక్షించడానికి మీరు శ్రీవల్లభులుగా అవతరించారు. ఇక ఈ లోకంలో మీ పాదాలను ఆశ్రయింపక, ఇతర మార్గాల కోసం అన్వేషించడం వ్యర్థము. తెలివిమాలిన చర్యఅని గ్రహించితినని వేనోళ్ల కొనియాడుతూ, భువనైక ముగ్ధమనోహరమైన శ్రీదత్తాత్రేయస్వామి వారి విశ్వరూపాన్ని ధరించిన శ్రీవల్లభులను తన మనోనేత్రములతో తనివితీరా వీక్షించి ఆనందసాగరంలో శంకరభట్టు మునిగి తన్మయత్వము చెంది తరించాడు. శరీరము, వాక్కు, మనస్సు, ఇంద్రియములతో గాని, బుద్ధితో గాని, ఆత్మతో గాని, ప్రకృతిస్వభావము వలన గాని తెలిసిగాని తెలియకగాని తాను చేసిన సమస్తకర్మలను పరాత్పరుడైన శ్రీవల్లభులవారి దివ్యచరణములకు సమర్పించుకుంటూ క్షమాపణ వేడుకుంటూ వినయపూర్వకముగా కడసారి నమస్కరిస్తున్నాని వారి పాదములపైబడి కన్నీటితో అంజలి ఘటించాడు.

అద్వితీయమైన అతని నిష్కళంక భక్తికి మెచ్చి, శ్రీవల్లభులు అతనిని పైకి లేవనెత్తి ఆలింగనము చేసికొని దిగులుపడవద్దని సమాధానపరచారు. యోగులకు, దేవతలకు, అవతార పరిసమాప్తి, మానవులకు జననమరణములు సర్వసామాన్యములని తెలుపుతూ, శంకరభట్టుతో నాయనా! నేను కురువపురమున గుప్తరూపమున సంచరించుచూ, భక్తులకు నిత్యప్రసన్నుడనై, శాశ్వతంగా ఉంటానని, నన్నేనమ్మి, శ్రద్ధతో, భక్తిగా కొలిచే, భక్తుల ఇళ్లలో నేను ప్రత్యక్షంగా సూక్ష్మరూపంలో శాశ్వతంగా ఉంటానని అనిరి. ఇంకా, భక్తాగ్రేసరుడవైన నీవు నాకెంతయో సేవ చేసితివి. కన్నతండ్రిని అంటిపెట్టికొనియున్న బిడ్డలా నన్ను ఎల్లవేళలా అనుసరించితివి. నీయందు నాకు అవ్యాజమైన కరుణ, ప్రేమ గలవు. దుఃఖించవలదని కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న శంకరభట్టు తలనిమిరి, స్థిమితపడమంటూ ఓదార్చిరి. నాయనా! నీవు నా అవతార పరిసమాప్తి అయినా గూడ మూడు సంవత్సరములపాటు ఇచ్చటనే యుండి ప్రతినిత్యము నా తేజోమయరూపమును దర్శింపుము. నీవు వ్రాసిన నాసచ్చరిత్ర పఠింపుము. నీకు అనేక యోగ రహస్యములను గూడ తెలియజేయుదుననిరి.

ఇంకా, భట్టూ! నీవు రచించిన, నా ఈ జీవితచరిత్ర మహాపవిత్రగ్రంథమై, పారాయణ చేయు భక్తజనులకు, ఆశ్రిత కల్పవృక్షమై వెలుగొందును. నేను దిక్కులనే అంబరముగా కలిగినవాడనుగాన నన్ను దిగంబరనామముతో కొలిచెదరు. ఈ గ్రంథము నాపర్యవేక్షణలో లిఖింపబడినది గావున, ఈ గ్రంథమందలి విషయములన్నియూ అక్షరసత్యములు. వేదవాక్కులతో సమానమైనవి. ఈ గ్రంథము పారాయణ చేయువారికి, ఇహపరసాధనములను సమకూర్చెదను గ్రంథ పారాయణచేయువారి ఇండ్లలో నేను అదృశ్యముగా సూక్ష్మరూపమున సంచరించెదను. నీవు వ్రాసిన ఈ సంస్కృత గ్రంథప్రతి నా జన్మస్థలమైన పీఠికాపురమందు ఏర్పడు నా మహాసంస్థానమందు గల ఔదుంబర వృక్షము కింద అనేక అడుగులలోతులో గంధర్వులచే ప్రతిష్ఠితమై శబ్దగ్రాహికగా సజీవమై, నా దర్శనమునకు వచ్చు భక్తులను సదా జాగృతము చేసి సంరక్షించుచుండును. పీఠికాపురములో నా సంస్థానము నెలకొల్పబడి ఆర్యవైశ్యులచే నిర్వహింపబడుచుండును. వశిష్ఠుని వంశమున జన్మించిన ఒక మహాసాధకుడు నా సంస్థానమున పూజారిగా నియమింపబడును. కొన్ని వందల

సంవత్సరముల పిదప నా జన్మస్థలమైన పీఠికాపురమందున్న నా మాతాగృహమున ఉన్న, ఔదుంబర వృక్షము కింద నాపాదుకలు ప్రతిష్ఠింపబడును. అత్యంత ప్రాచీనయుగము నాటి అత్రి, అనసూయానందనుడే ఈ శ్రీపాదవల్లభుడు. భారద్వాజసమహర్షి కిచ్చిన వాగ్దానము ప్రకారము ఈ పీఠికాపురమున అవతరించినాడు. భక్తులను జాతి, మత, వర్గ, వయో, వివక్షత లేకుండా వారి అర్హతలను బట్టి వారిని అనుగ్రహించును.

భక్త శిఖామణీ! నా ఈ జీవితచరిత్ర గ్రంథరూపమున వెనువెంటనే జనబాహుళ్యములోనికి పోయి ప్రకటితమగుట నాకు ఇష్టంలేదు. తెలుగు భాషలోనికి అనువాద గ్రంథము, నా మాతామహులైన శ్రీబాపనార్యులవారి ముప్పదిమూడవతరము వ్యక్తి ద్వారానే బహిర్గతమగును. అతనికి నా ఆశీర్వచనసిద్ధిగా, నా ఈ మాటకు నిదర్శనంగా గంధర్వపురము నుండి అప్రయత్నముగా నా ప్రసాదము వారికి నా జీవిత చరిత్రను తెలుగులో ప్రకటితము చేయుటకు అనుమతిరూపంలో సంకేతముగా వచ్చిచేరును. అతడే నా జీవితచరిత్రను తెలుగుభాషలో ప్రజలకు ప్రకటితము చేయుటకు యోగ్యుడైన వ్యక్తిగా గ్రహించవలెను.

నా ఈ సచ్చరిత్ర కల్గిన గ్రంథము సామాన్యముగాదు. అది ఒక సజీవమైన మహాచైతన్య స్రవంతి. ఆ గ్రంథములోని అక్షరములలో గల అపారమైనశక్తి, భక్తులు పారాయణ చేయునపుడు, నా భావనా చైతన్యములోనికి ప్రవహించును తద్వారా నాతో భక్తులు వారికి తెలియకుండగనే భావసంపర్కము కలిగి యుండుటవలన ధర్మబద్ధమైన వారి కోరికలన్నియూ నా కృపవలన తీరును. ఈ గ్రంథము భక్తులు తమ పూజామందిరమందు ఉంచుకున్నచో శుభప్రదమైన స్పందనలు కలుగును. దురదృష్టము కల్గించెడి శక్తులు, భూత, ప్రేత, పిశాచ దృష్టి, నరదృష్టులను గృహమునకు రాకుండా తరిమివేయును.

నాయనా! సృష్టి ప్రారంభమయిన నాటి నుండియు మహర్షులు, మహోన్నతులైన పురుషపుంగవులు, భక్తశిఖామణులు తమతమ సాధనావిశేషముల వలన సాక్షాత్కారము పొందిన దేవతాస్వరూపములన్నియూ, శ్రీపాద శ్రీవల్లభుల దివ్య స్వరూపముగా గుర్తింపుము. శ్రీపాద శ్రీవల్లభావతారము మాత్రము నిత్యసత్య రూపముగా ఆచంద్రార్కము నిలచియుండును. వల్లభునిగా అవతారము చాలించిన నేను, నృసింహసరస్వతిగా అవతరించి, గంధర్వపురమందు భక్తులను బ్రోచెదను. అటుపై 300 సంవత్సరములు శ్రీశైలము సమీపమున గల కదళీవనములో తపమాచరించి, ప్రజ్ఞాపురమున స్వామి సమర్థుడనై, అచ్చటనున్న వటవృక్షములో నా ప్రాణశక్తిని ఉంచి, శ్రీశైలమల్లిఖార్జునలింగమందు విలీనమయ్యెదను.

భక్తాగ్రేసరా! నా చరిత్ర పారాయణచేసినచో అభీష్టసిద్ధి కల్గును. పీఠికాపురములోని నా సంస్థానమందు ఏ సత్కార్యములో పాల్గొనిననూ, ప్రతిబంధకములు తొలగిపోవును. పీఠికాపురములో నా జన్మనక్షత్రమైన చిత్తానక్షత్రము నాడు గాని, నా జన్మదినమైన బాద్రపద శుక్లచతుర్థి (వినాయక చతుర్థి) నాడు నన్ను అర్చించినా ఋణబాధలు తీరును. అవివాహితలకు యోగ్యులతో వివాహము జరుగును. భూత, ప్రేత, పిశాచాది, అదృశ్యశక్తుల బాధలు తొలగును. శ్రావణ శుద్ధ పౌర్ణమినాడు, నా సోదరి వాసవీకన్యక నాకు రక్షాబంధనము కట్టును. ఆ దినము నా సన్నిధిలో నన్నర్చించు వారలు ఎంతో మేలు పొందెదరు. శనిప్రదోష సమయమున నన్నర్చించినవారు, శనిదోషములు తొలగి సుఖశాంతులొందగలరు. నేను సర్వగ్రహదోషములను నివారించెదను. నావారు అనుకున్న ప్రతీవారిని జుట్టు పట్టుకుని, ఈడ్చుకుని వచ్చి పీఠికాపురములో పారవేయుదును. ఎంతటి ధనవంతుడైననూ, యోగిఅయిననూ, నిరుపేదయిననూ, నా సంకల్పము లేనిదే కనీసము స్థానికులు కూడ పీఠికాపురములోని నా సంస్థానమునకు రాలేరు.

ఈ గ్రంథమందు గల దేవతాధర్మములు, శక్తులు, లీలలు విచిత్రములై యుండి, మానవుల అవగాహనకు అందకుండా ఎంతో అతీతముగా ఉండును. అంతమాత్రమున ఇందలి విషయములపై సంశయాత్మకధోరణి పనికిరాదు. వీనిని మానవలోకమునందు జరుగు నిత్యకృత్యములతోనూ, దైనందిన విషయములతో ముడిపెట్టి విమర్శనాత్మక దృష్టితో చూచుట తగదు. పొంతనలు, స్వారూప్య స్వభావములు నాస్తికధోరణితో ఎంచరాదు. ఈ గ్రంథమందలి సాధ్యాసాధ్యములను గాని, నా శక్తియుక్తులను గాని ప్రశ్నించి, అందలి విషయములను అవహేళన చేయువారు నా ఆగ్రహమునకు గురి కాకతప్పదు. రౌరవాది నరకములనుభవించుట తథ్యము. భూలోకమునందు గూడ కష్టనష్టములతో బాటు సకలదరిద్రములకు గురికాబడుదురని గ్రహించవలయును.

సర్వసత్యములకును, సర్వతత్త్వములకునూ మూలమైన దత్తుడను నేనే. మహాసిద్ధి పురుషులు, మహాయోగులు, మహాభక్తులు ప్రేమతో ఆహ్వానింపగా నేను ఈ కలియుగములో శ్రీపాద శ్రీవల్లభునిగా అవతరించితిని. సమస్త ధర్మములయందును, మతములయందును, సిద్ధాంతములయందును, స్వీయ ప్రకాశముతో వెలుగొందువాడను నేనే. ఆయా జీవుల అభీష్టములను బట్టి అభిరుచులను బట్టి వారనుసరించు మార్గములను బట్టి, ఆయా స్థితి గతులను బట్టి భిన్న, భిన్నతత్త్వములతో తోచువాడను నేనే. నేను సర్వతంత్ర స్వతంత్రుడను. సాధ్యాసాధ్యములు లేనివాడను. నాకు నిర్దిష్ట విధానమనునది లేదు. సమస్త దేవీదేవతా స్వరూపములందు, అంతర్హితముగా, జాజ్వల్యమానముగా ప్రకాశించువాడను నేనే. ఆయా వేర్వేరుస్వరూపముల ద్వారా పూజలను, స్తోత్రములను అందుకొనువాడను నేనే. అందర్నీ అనుగ్రహించువాడను కూడ నేనే. నేనే సర్వాంతర్యామినని అంటూ స్వామి సకల దేవతాస్వరూపముల శిరములతో అనేక ఆయుధములతో, కరములతో వారి దత్త విశ్వరూపము చూపిరి. ఆ విశ్వరూప సందర్శనముతో శంకరభట్టు ఆనందపారవశ్యము పొంది చేతులు జోడించి నమస్కరించి స్వస్థుడయ్యెను. అతనిని మరల ఆశీర్వదించి స్వామి, అతనికి బహుమతిగా తమ చెక్క పాదుకలొసంగి, వాటిని నిత్యము పూజించుకొనమని తెలిపిరి.

శ్రీవల్లభులు తమ అవతార సమాప్తికి నిర్ణయించిన ముహూర్తము రానేవచ్చింది. ఆరోజు హస్తా నక్షత్రంతోకూడిన ఆశ్వయుజ కృష్ణ ద్వాదశి. శ్రీపాద శ్రీవల్లభులు ఆరోజు బ్రాహ్మీ ముహూర్తములో యథాప్రకారం కృష్ణానది దాటి ఆవలి ఒడ్డునకు చేరి, స్నానఅనుష్టానములు పూర్తి చేసుకొని, సూర్యనమస్కారాలు ఆచరించి, తిరిగి కురువపురం చేరుకున్నారు. సూర్యుని ప్రకాశము ప్రతి దినము నాలుగుఝాములలో నాలుగువిధములుగా మారును. శ్రీవల్లభులు మధ్యందిన భాస్కరుడైన రెండోవఝాము సూర్యుని సమయమందు అవతారం పరిసమాప్తి చేయవలయునని మఠమునుండి బయలుదేరి, కృష్ణాతీరం చేరారు. ఈ వార్త దావానలంలా గ్రామం అంతా పాకింది.

శ్రీవల్లభస్వామివారు తమ అవతారమును పరిసమాప్తి చేయుచున్నారన్న విషయము వారి అంతరంగిక భక్తులైన వాసుదేవరావు, అంజనేయశర్మ మరియు ఇంకా చాలామంది భక్తులకు, స్థానికులకు, శిష్యులకు తెలిసినది. వారందరూ వేగముగా పరుగు పరుగున కురవపురములో మఠమునకు దగ్గరగానున్న కృష్ణానదీ తీరమునకు చేరిరి. ఇంతలో వారి ప్రియతమ భక్తులైన నిర్మలానందబ్రహ్మచారి, సదానందబ్రహ్మచారి, యోగనందుల బృందం కూడా కృష్ణాతీరానికి చేరుకున్నారు. ఆ ప్రాంతమంతా జనసంద్రమైంది. వారందరూ స్వామిని చూచి స్వామీ! ఇంత తొందరగా, పిన్నవయస్సులోనే మీరు ఈ అవతారకార్యం పరిసమాప్తి చేసి మమ్మల్ని ఒంటరివారిని చేయుట మీకు భావ్యంగాదు. మీ అండనే బ్రతుకుతున్న మాకు వేరే దిక్కేది? ఇంతకాలము మీ అనుగ్రహంతో మా కష్టాలు, అభీష్టాలు తీర్చుకున్నాము. మీరీ కురువపురగ్రామాన్ని వైకుంఠంతో సమానమైన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దారు. నిజానికి మీరే మా కులదేవత. మమ్మల్ని విడచి వెళ్లవద్దు. మీరీ ప్రయత్నం విరమించి, మా కోరిక మన్నించండి. మీరులేని ఈ మఠాన్ని కలలో గూడ ఊహించుకొనలేమని వారి కాళ్లా, వేళ్లా పడి ప్రాధేయపడిరి. ఆ భక్త జనుల ప్రేమానురాగాలకు చలించిన శ్రీవల్లభస్వామి బిడ్డలారా! మాపై ఇంత భక్తితో మెలిగే మిమ్ము విడచి మేము మాత్రం పోగలమా? నిజానికి మేము ఎల్లప్పుడూ సూక్ష్మరూపంలో కురవపురం మరియు పిఠాపురమందు సంచరించుటయే గాక, ఏదో రూపంలో భిక్ష చేస్తూ అదృశ్యంగా భక్తులకు నిత్యప్రసన్నులమై వారి యోగక్షేమాలు కనిపెట్టుకుంటూ గుప్తరూపంలో సంచరిస్తామని తెలిపి, దుఃఖించవలదని తమ ప్రియతమ భక్తులకు పదేపదే విజ్ఞప్తి చేసారు. ఇంకా, మీ అందరి సహచర్యంతో పద్నాలుగు సంవత్సరములు ఈ పవిత్రక్షేత్రమందు చక్కగా ఆధ్యాత్మికంగా గడిచిపోయినవి. మేము ఇక్కడ నిర్వహించవలసిన కార్యములు, సాధనలు పూర్తి అయినవి. అందువల్లనే మేము అవతారపరిసమాప్తి చేయాలని నిర్ణయించుకున్నాము. భగవంతుని నిర్ణయానికి అందరూ తలవాల్చవలసిందే! ఎవరూ స్వయంగా ఏమీ చేయలేరు. కాలచక్రం ఈశ్వరాజ్ఞకు లోబడి ఈ భువిపైన ఎవరెంతకాలం ఉండవలయునో, ఏమేమి కార్యములు చేయవలెనో సమస్తము భూమిపైకి రాకమునుపే నిర్ణయించబడుతుందని మీకు తెలియదా! అందరికీ కాలధర్మం ఒక్కటే అని గ్రహించండి. మనము ఎన్నెన్నో జన్మలలో తిరిగి కలుసుకుంటాము. మనకు ఎడబాటు లేదు. విచారించకండి. గురుభక్తిని మరువకండి అన్నారు. దుఃఖముతో రోదిస్తున్న వాసుదేవరావుని చూచి నీవు నీ తదుపరి జన్మలో నరకేసరి అనుపేర కల్లేశ్వరునికి అంకితభక్తుడవై, నేను నృసింహసరస్వతిగా అవతరించినప్పుడు నన్ను కలుస్తావు. అటుపై జన్మలో

శిరిడిసాయి అవతారంలో మాధవరావు దేశ్‌పాండే (శ్యామా) గా నావద్ద చేరి నన్ను సేవిస్తావు. బెంగపడవలదని ఓదార్చారు. వెక్కివెక్కి ఏడుస్తున్న అంజనేయశర్మను చూచి నీవు వచ్చేజన్మలో నందిశర్మగా జన్మించి నేను నృసింహసరస్వతిగా అంతరించి నప్పుడు నావద్ద శిష్యరికం చేయుటయేకాక, అక్కలకోటమహారాజుగా అవతరించినప్పుడు నీవు నా శిష్యుడైన పాండురంగ పురాణిక్‌గా నన్ను సేవిస్తావు. ధైర్యంగా ఉండు అన్నారు. శ్రీశైలంలో వారిని గురుభావంతో కొలిచిన నిర్మలానందబ్రహ్మచారి వైపు చూచి నీవు రాబోవు జన్మలో త్రివిక్రమభారతిగా జన్మించి నృసింహసరస్వతిగా అవతరించినప్పుడు నన్ను సేవించగలవు. తరువాత జన్మలో స్వామి సమర్థ అవతారంలో వామన్‌బువా గా జన్మించి నన్ను కలుస్తావు. దిగులుచెందవద్దని వారందరినీ ఓదార్చారు. మిగిలిన ప్రజలను చూచి చేతులు చూపుతూ భక్తులారా! మీరు భక్తితో నాకు ఏది సమర్పించినా స్వీకరించి మీకు అంతకు ఎన్నో రెట్లు శుభాలు కలుగజేస్తాను. నాపై గురుభక్తిని నిలిపి విశ్వాసంతో మెలగండి. ఆధ్యాత్మిక ప్రగతి సాధించండి. భక్తి మార్గం విడువకండి అని అందరికీ వినపడేటట్లు బిగ్గరగా తెలిపారు.

శంకరభట్టుకు, అచట చేరిన భక్తజన బృందములకు చివరిసారిగా స్వామి మంగళమయ ఆశీర్వాదములు చేసి, మెల్లగా నడుచుకుంటూ కృష్ణానదిలోనికి దిగిరి. తన ఒడిలో నుంచి వైకుంఠానికేగబోతున్న శ్రీవల్లభుల యందు మూర్తీభవించిన తేజస్సు, ముఖవర్చస్సు చూసి, ముకుళితవదనారవిందంతో కృష్ణమ్మ కరములు జోడించి గురుస్వాముల వారికి స్వాగతం పలుకుతూ, తన నీటివడిని తగ్గించి, దారిచూపిస్తూ, ఆ ప్రాంతాన్నంతా ప్రశాంతంగా మార్చి స్వామి పట్ల తన కృతజ్ఞత చాటుకున్నది. మరొక్కసారి అక్కడ గుమిగూడిన వారందర్నీ పరికిస్తూ, శ్రీవల్లభులు నదీ మధ్యమునకువెళ్లి, నదీ అంతర్భాగమునందలి లోతులలో ప్రవేశించి అంతర్హితులై తమ శ్రీపాద శ్రీవల్లభావతారమునకు స్వస్తి పలికారు. దిగంబరా! దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా అంటూ అక్కడున్న భక్తజనులు బిగ్గరగా దిక్కులు పిక్కటిల్లేలా, ధ్వని తరంగములు మిన్నంటేలా జయజయధ్వానములు చేయసాగిరి.

ఈ బాధాతప్తదృశ్యము గాంచి సద్గురు ఎడబాటును తలచుకుంటూ శంకరభట్టు వెక్కివెక్కి ఏడుస్తూ, సొమ్మసిల్లి పడిపోయెను. అక్కడి భక్తులు అతనిని ఓదార్చి సేదదీర్చిరి. శంకరభట్టు మెల్లగా లేచి స్వామి వారిచ్చిన పాదుకలు హృదయానికి హత్తుకొని, కృష్ణానదిలోనికి దిగి, స్నానము చేసి వచ్చి, ఒడ్డున కూర్చుండి ధ్యానస్థుడయ్యెను. శ్రీవల్లభుల ప్రియతమ శిష్యులు, భక్త సమూహములు విచారవదనములతో, స్వామివారి నామస్మరణ చేసుకుంటూ మెల్లమెల్లగా వారి గృహములకు పయనమైరి. అటు పిమ్మట కొద్దిసేపటికి ధ్యానములోనున్న శంకరభట్టు మనోనేత్రములకు శ్రీపాద శ్రీవల్లభస్వామి తమ తేజోమయదర్శనమిచ్చి, తమ అనుంగు భక్తునికి ఆనందము కల్గించిరి. స్వామి వారి దర్శనానంతరము శంకరభట్టు వదనంలో ప్రశాంతత, స్వస్థత మరియు ధైర్యము గోచరించినవి.

ఈ విధముగా శ్రీదత్తాత్రేయస్వామి కలియుగములో తమ ప్రప్రథమ అవతారమైన శ్రీపాద శ్రీవల్లభావతారమును పరిసమాప్తి చేసిరి.

శ్రీ వల్లభావతారము పరిసమాప్తి అనంతరము గూడ, స్వామి తమ నామస్మరణ చేయు భక్తుల కష్టములను ఎడబాపి, వారికోర్కెలు తీర్చి ఇచ్చిన అభయమునకు కట్టుబడి ఈనాటికీ గూడ భక్తులను బ్రోచి, అక్కున చేర్చుకుంటున్నారు.

**శ్రీపాదరాజం శరణం ప్రపద్యే**

అధ్యాయం-18

# శ్రీ నృసింహసరస్వతిగా శ్రీవల్లభులు

శ్రీపాద శ్రీవల్లభులు కురువపురంలో ఆత్మహత్యకు పాల్పడుతున్న అంబిక అను బ్రాహ్మణస్త్రీని, ఆ ప్రయత్నము నుండి విరమింపజేసారు. ఆత్మహత్య మహాపాపమని, దాని ప్రభావము వచ్చే జన్మమునందు ఉండగలదని తెల్పి, తెలివితక్కువ వాడు, మందమతి అయిన ఆమె కుమారుని పండితునిగా తమ ఆశీర్వాదబలంతో తీర్చిదిద్ది, అంబికను ఆమె శేషజీవితమంతా శివపూజ చేసుకుంటూ జీవించమని తెలిపారు. శివపూజ వలన విశేషఫలితాలు కల్గి, వచ్చే జన్మలో తమవంటి పుత్రుని పొందగలవని అంబికను ఆశీర్వదించారు. అందుకు అంబిక స్వామినే తన కుమారునిగా వచ్చే జన్మలో పుట్టవలసిందిగా కోరింది. ఆమె కోరికను స్వామి మన్నించారు. అనతి కాలములోనే అంబిక మరణించి, తన తదుపరి జన్మలో మహారాష్ట్రలోని అకోలా జిల్లాలోగల కారంజా అను గ్రామములో అంబ అను నామధేయంతో సనాతన బ్రాహ్మణ కుటుంబంలో కుమార్తెగా జన్మించింది. యుక్తవయస్సు రాగానే ఆమెకు మాధవశర్మ అను బ్రాహ్మణోత్తమునితో వివాహము జరిగింది. పదహారు సంవత్సరముల వారి దాంపత్యము తరువాత వారికి పుత్రోదయమయినది. గతజన్మలో అంబికకు ఇచ్చిన మాట ప్రకారము వల్లభులు ఆమెకు కుమారునిగా జన్మించిరి. ఆ బాలుడు పుట్టగానే 'ఓం' అని స్పష్టంగా ప్రణవముచ్చరించాడు. ఆ బాలునికి వారు 'శాలగ్రామదేవ' అను పేరు పెట్టారు. కాని ఇంట్లో అతనిని అందరూ ముద్దుగా నరహరి అని పిలిచెడివారు.

ఆ బాలునికి ఉపనయనమయిన పిదప ఒకేసారి మాటలు వచ్చి, అందరి ఎదుట వేదాలు వల్లించాడు. ఒకనాడు నరహరి సన్యసించుటకై తల్లిదండ్రుల అనుమతి కోరాడు. తల్లిదండ్రులు వారిని విడువలేక బాధతో అతని కోర్కెను నిరాకరించారు. సన్యసించుట తప్పదని తెలిపి వారి తల్లి అయిన అంబికకు కురువపురంలో శ్రీవల్లభులు ఆమెకు కుమారునిగా జన్మించెదనని మాట ఇచ్చిన సంగతిని ఆమెకు గుర్తుచేశారు. గత జన్మ విషయాలన్నీ గుర్తుకు తెచ్చుకున్న అంబిక నరహరివారికి సన్యసించుటకు అనుమతిని ఇచ్చి తనకు సంతానం అనుగ్రహించమని కోరింది. ఆమెకు నల్గురు మగ పిల్లలు, ఒక ఆడ పిల్ల కలిగెదరని వరం ఇచ్చారు. ఆమెకు ఇద్దరు మగ పిల్లలు కలగగానే, తల్లిదండ్రుల అనుమతి పొంది నరహరివారు ఇల్లు వదలి వెళ్లిపోయారు. శ్రీవల్లభావతారంలో మాధవాచార్యుడను భక్తునికి నృసింహ సరస్వతి అవతారం దాల్చినపుడు కాశీలో వారి వద్ద సన్యాసదీక్ష తీసుకుని, వారి నామధేయాన్ని తమనామంతో కలుపుకుంటానని వరమిచ్చారు. ఆ క్రమంలోనే అనేక క్షేత్రములు సందర్శించుచూ కృష్ణ సరస్వతిస్వామిగా జన్మించిన మాధవాచార్యుల వారి ఆశీర్వాదములతో కాశీలో సన్యాసదీక్ష తీసికుని తన పేరును నృసింహసరస్వతిగా మార్చుకున్నారు. ఆ పేరుతో వారు లోక ప్రసిద్ధులైనారు. శంకరాచార్యులవారు నిర్దేశించిన సన్యాసాశ్రమాన్ని తిరిగి పునరుద్ధరించారు.

ఈయన మహత్యం చెప్పనలవిగాదు. పుట్టిన తరువాత ఇనుమును తాకి బంగారంగా మార్చారు. తను గ్రోలుటకై తల్లికి స్తన్యము ఏర్పాటు చేసుకున్నారు. అక్షరాభ్యాసం లేకుండా శిష్యులకు వేదపాఠం చెప్పారు. బాల్యంలోనే తల్లిదండ్రులకు జ్ఞానముపదేశించారు. వీరికి బాలుడు, కృష్ణుడు, ఉపేంద్ర, జ్ఞానజ్యోతి, సదానందుడు, మాధవుడు, సిద్ధుడను ముఖ్య శిష్యులుగలరు.

నదీ పరిక్రమణలతో బాటు సర్వతీర్థాలు పాదచారియై దర్శించి పావనం చేసారు. అష్టాంగయోగమభ్యసించారు. అపథ్య భోజనంతో ఒక భక్తుని ఉదరరోగం పోగొట్టారు. క్షణకాలంలో భక్తులను త్రిస్థలీయాత్ర చేయించారు. చనిపోయిన వానినిపునర్జీవితుని చేసారు. తన మహిమచేత ఒక భర్తను కొల్పోయిన స్త్రీకి తిరిగి ఆమె భర్తను బ్రతికించి సౌభాగ్యం నిలిపారు. భక్తులకు దీర్ఘకాలిక రోగాలనుండి చర్మవ్యాధుల నుండి ఉపశమనం కలుగజేసారు. అకాలంలో కోసిన పంటకు సస్యసమృద్ధినిచ్చారు. తీర్థయాత్రా ప్రాముఖ్యాన్ని విశదీకరించారు. సుమంగళీ ధర్మములు, విధవా జీవనశైలి, పరాన్న భోజన

విధులు మరిన్ని సనాతనధర్మాలను భక్తులకు ప్రబోధించారు. శివపూజ, రుద్రాక్ష, విభూదుల మహిమల గూర్చి వివరించారు. గంధర్వపుర సమీపాన గల సంగమ క్షేత్రమునందుగల అనేక పుణ్యక్షేత్రాలను భక్తులచేత దర్శింపజేసారు. ఇలా ఎన్నెన్నో మహిమలు చూపి, భక్తుల కర్మలను బాపి, కృష్ణా-అమరజా నది సంగమ తీరమైన గంధర్వపురంలో 24 సంవత్సరాల పాటు అనేక దివ్యలీలలు చేస్తూ, ఈ నాటికీ అదృశ్యరూపంలో అచ్చటనే సంచరిస్తున్నారు.

ముఖ్యంగా శ్రీపాదులువారు తమ వల్లభావతారము ముగించి, నృసింహసరస్వతి అవతారం ధరించిన పిదప, తాము వల్లభావతారంలో వరాల రూపంలో చేసిన వాగ్దానాలనన్నింటినీ గూడా నెరవేర్చారు.

శ్రీవల్లభుల వరప్రభావమున రజకుడైన రవిదాసు మ్లేచ్ఛరాజుగా (యవనరాజు) జన్మించాడు. తనకోర్కె ప్రకారం, రాజుగా జన్మించి, రాచరికపు సౌఖ్యాలనన్నింటినీ అనుభవిస్తూ, ఒక ఆరోగ్య సమస్యపై గంధర్వపురంలో శ్రీనృసింహ సరస్వతిస్వామి వారిని దర్శించాడు. అతనికి స్వామి పూర్వ జన్మములో వారిరువురి మధ్య గల కురువపురస్మృతులను గుర్తుకు తెప్పించారు. శ్రీనృసింహసరస్వతిస్వామిని తాను గత జన్మములో సేవించిన శ్రీవల్లభులుగా గుర్తించి, ఆ మ్లేచ్ఛరాజు వారిని పల్లకిలో కూర్చుండబెట్టుకొని, మేళతాళములతో ఊరేగింపుగా తన రాజ్యానికి తీసుకునివెళ్లి అఖండ సత్కారము చేసాడు. ఆ విధంగా వల్లభులపై గల ప్రేమను, తన విశ్వతనీయతను చాటుకున్నాడు. పిమ్మట, రాజ్యాన్ని కుమారులకు అప్పగించి, సర్వసౌఖ్యాలను త్యజించి స్వామివారి సేవకు పునరంకితమై, చివరకు కురువపురం చేరుకుని, అక్కడ వల్లభులకు మందిరం నిర్మించి తనువు చాలించాడు. తమ తదుపరి అవతారంలో కూడ దర్శనమిచ్చి, పూర్వజన్మ జ్ఞానం కలుగజేస్తానని వల్లభులు, రవిదాసుకు ఇచ్చినమాట ప్రకారం అతనికి శ్రీనృసింహసరస్వతిగా దర్శనమిచ్చి మాట నిలుపుకున్నారు.

శ్రీవల్లభులవారు కురువపురంలో వారి మరో శిష్యుడైన వాసుదేవరావును, తాము నృసింహసరస్వతిగా అవతరించినపుడు, తిరిగి సేవించగలవని తెలిపారు. అతడే 'హిప్పరిగి' అను గ్రామంలో నరకేసరిగా జన్మించి కల్లేశ్వరుని పేరుతో గల శివాలయంలో ప్రతినిత్యము కల్లేశ్వరునిస్తుతిస్తూ, పద్యాలను వ్రాసి, ఆ స్వామికి సమర్పిస్తూ విశేషంగా స్వామిని అర్చించేవాడు. ఎంతో మంది మిత్రులు నృసింహసరస్వతివారి మహిమల గూర్చి తెలిపి, వారిపై పద్యాలు వ్రాసి సమర్పించి పూజించమని తెలిపినా, కల్లేశ్వరుని తప్ప వేరెవరినీ అర్చించనని తెలిపాడు. ఒకసారి నృసింహసరస్వతివారు ఆ గ్రామంలో భిక్ష చేస్తూ, శివాలయంలో కల్లేశ్వరుని స్థానంలో నృసింహసరస్వతి వారు ఆసీనులై దర్శనమివ్వగా, అతనికి జ్ఞానోదయమై స్వామిని ప్రత్యక్షంగా దర్శించి, వారినే కల్లేశ్వరునిగా భావించి పూజింపసాగాడు. గత జన్మలో గూడ ఇదే విధానముతో అతడు కురువపురంలో మొదట్లో వల్లభులను దర్శింప నిరాకరించి, తర్వాత పాదాక్రాంతుడైనాడు. ఈ జన్మలో కూడా అతడు అదే పంథాలో స్వామిని గుర్తించాడు.

కురువపురంలో శ్రీవల్లభుల వేరొక శిష్యుడు ఆంజనేయశర్మ తిరిగి నందిశర్మ అను బ్రాహ్మణునిగా జన్మించాడు. కాలాంతరంలో అతనికి కుష్ఠువ్యాధి సోకింది. తుల్జాపురం వెళ్లి భవానీదేవిని అర్చించగా ఆ మాత అతనికి స్వప్న దర్శనమిచ్చి చన్దాలపరమేశ్వరిని అర్చించమని తెలిపింది. అతడట్లే చేయగా, కొంత కాలానికి పరమేశ్వరి సాక్షాత్కరించి, గంధర్వపురంలోనున్న శ్రీనృసింహసరస్వతి వారిని దర్శిస్తే ఆ వ్యాధి పోగలదని తెల్పింది. మొదట్లో దేవతల వల్ల కాని పని మానవులవల్ల కాబోదని సంశయిస్తూ, చివరికి శ్రీనృసింహసరస్వతి వారిని దర్శించాడు. కాని వారిని దర్శించగానే అతడు ఉద్వేగభరితుడై వారిని కవిత్వంతో స్తుతిస్తూ, వారి పాదాలపై బడి తనను రక్షించమనికోరాడు. శ్రీగురుడు కరుణాసముద్రులై అతనిని కుష్ఠురోగం నుండి విముక్తి కలుగజేసారు. ఆనాటి నుండి అతడు స్వామి సేవకే అంకితమయ్యాడు.

ఇదేవిధంగా ఒక కర్ణాటక రాష్ట్ర బ్రాహ్మణుని కుమార్తెను పట్టిపీడిస్తున్న బ్రహ్మ రాక్షసునికి, నృసింహసరస్వతిగా అవతరించినపుడు విముక్తి కల్గిస్తానని కురువపురంలో శ్రీవల్లభులు వాగ్దానం చేసారు. గంధర్వపురం వెదుతూ దారిలో ఒక రావి చెట్టుపై వారికొరకై ఎదురుచూస్తున్న బ్రహ్మరాక్షసుని చూడగానే శ్రీనృసింహసరస్వతి వారు అతనిని పిలిచి, అతనికి విముక్తి కల్గించి మోక్షం ప్రసాదించారు.

శ్రీశైలంలో శ్రీవల్లభులవారిని ఎంతో భక్తి ప్రపత్తులతో సేవించిన వారి శిష్యుడైన నిర్మలానందబ్రహ్మచారిని గూడా తాము నృసింహసరస్వతిగా అవతరించినపుడు కలుసుకొనగలనని మాటయిచ్చారు. అతడు కుమసీగ్రామంలో త్రివిక్రమ

భారతి అను సన్యాసిగా జన్మించాడు. అతడు ప్రతినిత్యము నృసింహావతారాన్ని మానసపూజతో ఉపాసిస్తూ ఉండేవాడు. అతడు నృసింహసరస్వతివారి మహిమలు ఆనోటా, ఈనోటా విని కూడా వారి విధానాలను ఆక్షేపిస్తూ ఉండేవాడు. అయితే అతనికి ప్రతిరోజూ తన పూజలో దర్శనమిచ్చే నృసింహస్వామి అతనికి ఒకరోజు దర్శనమివ్వలేదు. నేను నదీతీరంలో ఉన్నాను. వచ్చి దర్శించుకో అన్నమాటలు అతనికి దివ్యవాణి ద్వారా వినిపించాయి. వెంటనే అతడు నదీతీరానికి పోగా నరసింహావతారముగా శ్రీనృసింహసరస్వతి దర్శనమిచ్చారు. అంతట త్రివిక్రమభారతి స్వామి వారికి క్షమాపణలుచెప్పి వారిని సేవించసాగాడు.

శ్రీశైలంలో శ్రీవల్లభులను సేవించిన సింగన్నదొర అను భిల్లునికి గూడా ఇచ్చిన మాట ప్రకారం నృసింహసరస్వతి వారు తమ దర్శన భాగ్యముకలుగజేసారు. ఇద్దరు పండితులు విజయ గర్వముతో శ్రీనృసింహసరస్వతిస్వామివారిపై వేదచర్చకు దిగగా ఆ గ్రామంలో, మాతంగుడను పేరుతో కడజాతిలో జన్మించిన ఆ భిల్లుని పిలచి, శ్రీనృసింహసరస్వతి అతనిపై విభూది చల్లగానే, అతడు ఒకజన్మలో వేదవిదుడైన బ్రాహ్మణునిగా జన్మించి నేర్చుకున్న వేదాలన్నీ గుర్తుకు వచ్చి, వాటిని వల్లెవేసి, ఆ పండితులను ఓడించాడు. దానితో ఆ పండితుల గర్వమణగి, స్వామివారి శాపానికి ఆ పండితులు గురిఅయ్యారు. ఈ విధంగా ఆ భిల్లునికి గూడా దర్శనమిచ్చారు. భిల్లుని కోర్కె ప్రకారం, రాబోయే జన్మలో అతడు బ్రాహ్మణునిగా జన్మిస్తాడని, తిరిగి తమ దర్శనం పొందగలడని వరమిచ్చారు.

అలాగే నరసావధానులగార్కి వల్లభుల ఇచ్చిన మాట ప్రకారం నృసింహసరస్వతిగా అతనికి గూడా దర్శనభాగ్యం కలుగజేసి వారింట్లో భిక్ష స్వీకరించి, వారి దారిద్ర్యాన్ని కూడా పోగొట్టారు. అమరపురంలో ఒక బీద బ్రాహ్మణునిగా నరసావధానులు జన్మించి, ఆర్థికబాధలతో సతమతమయ్యేవాడు. అతని వద్ద శ్రీగురులు ప్రతిరోజూ భిక్ష స్వీకరించేవారు. అతడు ముందుగా గ్రామంలో భిక్షచేసి, దానిలో కొంత భాగాన్ని శ్రీగురువులు వచ్చినపుడు భిక్షగా ఇచ్చేవాడు. ఆ విధంగా అతనికి ఇచ్చిన మాట ప్రకారం భిక్షరూపంలో అతని ఆతిధ్యం స్వీకరించారు. ఒకరోజు ఆ బ్రాహ్మణునికి గ్రామంలో భిక్ష లభించలేదు. స్వామివారికి గూడా ఆ కారణంగా ఏమీ భిక్ష ఇవ్వలేకపోయాడు. స్వామి అతని ఇంటి నుండి తిరిగి వెళ్లిపోతూ ఆ ఇంటి ముందు గల ఒక పాదును పీకి పారవేసి, వడి, వడిగా వెళ్లిపోయారు. అక్కడే ఆ పాదును తిరిగి నాటాలని, ఆ బ్రాహ్మణుడు సంకల్పించి, త్రవ్వుచుండగా బంగారు నాణెములు గల లంకెల బిందెలు దొరికినవి. ఆ విధంగా శ్రీనృసింహసరస్వతి ఆతని దారిద్ర్యము పోగొట్టారు. ఈ విషయాన్ని వల్లభులవారు నరసావధానులకు గత జన్మలోనే స్ఫురింపచేసారు.

అదే విధంగా నరసావాధానులగారింట్లో శ్రీవల్లభుల వారికి ప్రదక్షణలుచేస్తూ, మూగభాషలో వారింట్లోని గొడ్డు ఆవు శ్రీవల్లభులవారిని తన పాలను గ్రోలవలసిందిగా కోరింది. రాబోయే జన్మలో ఆ కోరిక తీర్చగలనని ఆ రోజు శ్రీవల్లభులు ఆ గోవుకు వరమిచ్చారు. గంధర్వపురంలో శ్రీనృసింహసరస్వతివారు ఒక బ్రాహ్మణుని ఇంటికి ప్రతిరోజు భిక్షకు వెళ్లేవారు. వారింట్లో ఆ గొడ్డు ఆవు ఒక గొడ్డుగేదెగా జన్మించింది. దానిని వారు సామాన్లు మోయుటకై ఉపయోగించుకునేవారు. ఒకసారి వల్లభులు ఆ ఇంటికి భిక్షకై వెళ్లి, ఆ బ్రాహ్మణుని భార్యను ఆ గేదె పాలు పితికి ఇవ్వమని అన్నారు. దానికి ఆ బ్రాహ్మణుని భార్య అది గొడ్డుదని, దానికి పాలురావని పలికింది. అయినా వల్లభులు వినకుండా ప్రయత్నించమని పలికారు. ఆమె గిన్నె తీసుకుని వెళ్లి పాలుపిండగా గిన్నెల కొద్దీ పాలు వచ్చినవి. ఆ బ్రాహ్మణ స్త్రీ సంతోషముతో స్వామివారికి పాలుకాచి ఇచ్చింది. శ్రీనృసింహసరస్వతి ఆ పాలు త్రాగి వెళ్లిపోయారు. ఈ విధంగా గతజన్మలో ఇచ్చిన మాట ప్రకారం ఆ గేదె పాలు శ్రీనృసింహసరస్వతి వారు సేవించుటయేగాక, ఆ బ్రాహ్మణునికి ఆ గేదె పాల ద్వారా ఆదాయం కల్పించి ఆతని దారిద్ర్యం పోగొట్టారు.

శ్రీ నృసింహసరస్వతి అవతార పరిసమాప్తి పిదప, శ్రీశైలం నుండి వారి ప్రియతమ శిష్యులైన సాయందేవుడు మరియు యవనరాజైన రవిదాసు మిగిలిన శిష్యులతో కూడి కురువపురం చేరారు. యవనరాజు పూర్వజన్మలోని అనుభవంతో శ్రీ వల్లభులు కురువపురంలో ఎక్కడెక్కడ సంచరించారో, తపోనిష్టలో ఉన్నారో వారికి ఆ స్థలములు చూపించి వివరించాడు. అక్కడ శిష్యులందరూ యవనరాజుతో కలిసి శ్రీ వల్లభులవారి తపోస్థానంలో వారికి ఒక మందిరం నిర్మించారు. ఆ సందర్భంలో అక్కడ వల్లభులవారితో చాలాకాలం గడిపి, వారికి సేవ చేసిన యవనరాజైన రవిదాసు నుండి


సాయందేవుడు శ్రీ వల్లభులవారి జీవిత చరిత్రకు సంబంధించిన ఎన్నో సంఘటనలపై ముఖ్యసమాచారాన్ని సేకరించాడు. ఆ లీలలను సాయందేవుడు కొన్నింటిని మాత్రమే కన్నడ భాషలో తాను వెలువరించిన గురుచరిత్రలో పొందుపరచాడు. ఆ సాయందేవుడే గత జన్మలో శ్రీ వల్లభుల వారిని గోకర్ణక్షేత్రంలో ఎంతో భక్తిశ్రద్ధలతో సేవించిన గోవిందభట్టు. అతడే, 'శ్రీపాదవల్లభ దిగంబరా' గేయరచయిత గతజన్మలో ఆ చరిత్రనే గురుచరిత్ర పేరిట సాయందేవుని మునిమనుమడైన గంగాధర సరస్వతికి శ్రీగురుని ప్రియతమశిష్యుడైన సిద్ధ సరస్వతి వివరిస్తాడు. దానినే గంగాధర సరస్వతివారు సిద్ధుడు నామధారకుల మధ్య జరిగిన సంవాదంగా ప్రశ్నోత్తర రూపంలో మరాఠీలో గురుచరిత్రగా రూపొందించారు. ఈ గ్రంథం ఎంతో ప్రజాదరణ పొంది ఇతర భాషల్లోనికి అనువదింపబడింది.

ఒకసారి శ్రీనృసింహసరస్వతి వారి మఠానికి భాస్కరశర్మ అను బ్రాహ్మణుడు కేవలం ముగ్గురికి సరిపోయే ధాన్యం తెచ్చాడు. ఆ ధాన్యంతో తన శక్తి కొలదీ ఒకరిద్దరికి సంతర్పణ చేయాలని కోరిక గలదని శ్రీ నృసింహసరస్వతి వారి అనుమతి కోరాడు. అతడు తెచ్చిన కొద్దిపాటి ధాన్యం సంతర్పణకు సరిపోదని, తోటివారందరూ అతనిపై విమర్శలు కురిపించారు. కానీ గురుని మహిమ వల్ల ఆ కొద్ది ధాన్యంతోనే అతడు నాలుగు వేల మందికి భోజన సమారాధన షడ్రోపేతంగా చేశాడు. ఆ భాస్కరశర్మయే గత జన్మలో వల్లభులను ఆశ్రయించిన వల్లభేశుడు. దొంగల చేతిలో మరణించిన అతనికి వల్లభులు ప్రాణదానం చేశారు.

బహుధాన్యనామ సంవత్సరంలో ఉత్తరాయణ పుణ్యకాలం రాగానే మాఘమాసమందు, కృష్ణ పక్ష పాడ్యమి తిథి శుక్రవారం రోజున శ్రీశైలం వద్దనున్న పాతాళగంగలో శిష్యులచే సిద్ధం చేయబడిన ఒక పుష్పవాహనమెక్కి కదళీవనమను పుణ్యస్థలి చేరి మల్లిఖార్జునస్వామిలో శ్రీనృసింహసరస్వతివారు ఐక్యమయినారు. శ్రీ స్వామి వారి పాదుకలు గాణుగాపురంలో ప్రతిష్ఠింపబడ్డాయి. ఈ నాటికి కూడా వారు ప్రతీరోజూ గాణుగాపురంలో మధ్యాహ్న సమయంలో ఏదో ఒక రూపంలో భిక్ష చేస్తుంటారని భక్తుల విశ్వాసం.

ఈ విధంగా శ్రీవల్లభులు కరుణాసముద్రులై, తాము ఇచ్చిన వాగ్దానాలన్నీటినీ నెరవేర్చి, భక్తులకు కల్పవృక్షంగా నృసింహసరస్వతి అవతారంలో గూడా నిలచారు. ఇదే వారి ప్రత్యేకత. నృసింహసరస్వతిగా వారెన్నో మహిమలుజూపి, భక్తులనుబ్రోచి, గంధర్వపురము (గాణుగాపురము)లో నివసించారు. అయినప్పటికీ, గతజన్మ మమకారం మరువలేకనేమో మరి, శ్రీనృసింహ సరస్వతివారు కురువపురం సందర్శించారు.

**జై దత్తాత్రేయ ! జైజై వల్లభ ! జైజై నృసింహ సరస్వతి !!!**



## స్వస్తి - మంగళశాసనం

శ్రీయఃకాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్

శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం

మంగళం కౌసలేంద్రాయ మహనీయ గుణాత్మనే చక్రవర్తి

తనూజాయ సార్వ భౌమాయమంగళం

# శ్రీ దత్త వల్లభ భక్తులకు వినయపూర్వక మనవి

**(శ్రీవల్లభులు సంచరించిన ప్రదేశాల అభివృద్ధికై ఆయా సంస్థలకు చేయూతనీయవలసిందిగా మనవి)**

ఈ పుస్తకం పారాయణం చేసిన పిదప, మీకు దత్తవల్లభుల శక్తి సామర్థ్యాలు అనతి కాలంలోనే అనుభవంలోకి వచ్చి, మీ అభీష్టాలు సిద్ధించాలని శ్రీ వల్లభుని మనసారా ప్రార్థిస్తున్నాను. అనుకున్న పని సఫలీకృతం కానిచో మరిన్నిసార్లు ఈ గ్రంథ పారాయణ చేయుట వల్ల ఆ కార్యం తప్పనిసరిగా నెరవేరుతుంది. అయితే మన కోర్కెలు ధర్మబద్ధంగాను, మన భక్తి, విశ్వాస, నియమ నిష్ఠలు స్వామి మనసును రంజింపజేసే విధంగాను ఉండాలి.

ముఖ్యంగా, శ్రీ వల్లభులు నడయాడిన పుణ్యక్షేత్రాలుగా వెలుగొందుచున్న పవిత్రప్రాంతాలు మూడు. అవి:

1) పిఠాపురం

2) పంచదేవపహాడ్

3) కురువపురం.

పిఠాపురంలో ఆర్యవైశ్యులు శ్రీవల్లభుల వారి సేవలో ఎంతో ప్రముఖపాత్ర వహిస్తూ, శ్రీవల్లభుల దేవాలయ నిర్వహణ బాధ్యత స్వీకరించి, ఆ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడుపుతున్నారు. అంతేకాకుండా స్వామివారి నిత్య పూజా సేవాకార్యక్రమములతో బాటు, భక్తులకు అనేక సౌకర్యాలను కల్పిస్తూ, ఉచిత భోజన వసతులను కూడా ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గృహసముదాయాల మధ్యనున్న ఈ ఆలయ విస్తరణ సమస్యాత్మకమైనప్పటికీ, భవిష్యత్ అవసరాన్ని దృష్టిలోనుంచుకుని ఇక్కడ కూడ దేవాలయానికి విశాల ప్రాంగణ స్థల సేకరణకై కృషి సలుపవలసిన అవసరం కనపడుచున్నది.

పంచదేవపహాడ్ (శ్రీక్షేత్ర వల్లభాపురం)లో కూడా శ్రీ విఠల్ బాబాజీ మహారాజ్ వారి ఆధ్వర్యంలో దత్తాత్రేయ స్వామివారికి చక్కని దేవాలయం నిర్మింపబడి నిత్య పూజా, సేవా కార్యక్రమాలతోపాటు, భక్తులకు భోజన వసతి మొదలగు సౌకర్యాలను బాబాజీ కలుగజేస్తున్నారు. శ్రీవల్లభుల వారి దర్బారు, వారి జ్ఞాపికలు ఎంతో రమ్యంగా భక్తుల కొరకు ప్రదర్శిస్తున్న తీరు బహుప్రశంసనీయం. ఇక్కడ వల్లభులవారికి ప్రత్యేక దేవాలయం వారి నిలువెత్తు విగ్రహంతో నిర్మిస్తే సముచితంగా ఉంటుంది.

ఇక మూడవ ప్రదేశమున కురువపురం శ్రీవల్లభుల చరిత్రలో అత్యంత ముఖ్యమైన ఘట్టాలను సంతరించుకున్న స్థలము, స్థల మహిమ ఉన్నప్పటికీ, ఆ ప్రదేశం అంతగా అభివృద్ధికి నోచుకున్నట్లుగా కనబడదు. ఈ గ్రంథం చదివిన ప్రతీవారు గుర్తు చేసుకుంటే శ్రీ వాసుదేవానంద సరస్వతివారు కురువపురం విడచి వెళ్లాలనుకున్న సందర్భంలో శ్రీ వల్లభులు శ్రీ వాసుదేవానందుల వారితో ఆ స్థలంలో తమ ఆర్థిక వెనుకబాటు పరిస్థితిని తెలుపుతారు. విచిత్రమేమంటే ఆనాటి వారి ఆర్థిక పరిస్థితి ఈనాటికి కూడా పుంజుకోలేదనట్లుగా అక్కడి మందిరం, ఆ ప్రాంత వాతావరణం చూసిన వారికి అనిపించక మానదు.

ఈ కారణంగా రాబోయే తరాలవారికి, శ్రీ వల్లభుల చరిత్రలో ముఖ్యాంశమైన వారి కురువపురనివాసం గురించి తెలియాలంటే ఈ అంశంపై ఆలోచించవలసిన తరుణం ఏర్పడింది. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్ర వాసులైన ఒక కుటుంబము వారు వంశపారంపర్యంగా స్వామి వారికి ఒక ట్రస్టు రూపంలో యథాశక్తి సేవలందిస్తున్నారు. దేవాలయ ప్రాంగణ అభివృద్ధి, గాలి గోపుర నిర్మాణము శ్రీ వల్లభుల కొరక మందిరము నిర్మించవలసి ఉంది. ఈ బృహత్ కార్యభారము సామాన్యుల వల్ల కానేరదు. కావున ఈ కార్యభారము ఒక ప్రత్యేక సంస్థ ద్వారా ఆర్య వైశ్య సోదరులే వహిస్తే సముచితంగా

ఉంటుంది. ప్రతీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీ వల్లభుల ఉపాలయం నిర్మాణం చేస్తే, వల్లభుల చరిత్ర మరింత వెలుగులోకి వస్తుంది. దీనితోపాటు కురువపుర అభివృద్ధిని కూడా చేపట్టాలని ఆర్యవైశ్య సోదరులందరినీ వినమ్రతతో ప్రార్థించుచున్నాను. ఆర్యవైశ్యుల పట్ల శ్రీవల్లభులు కనపరచిన ప్రేమాభిమానాలకు ప్రతీకగా విశ్వాసంతో ఈ కార్యక్రమాన్నీ ఆర్యవైశ్యులు భుజాన వేసుకోవాలని ప్రార్థన. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సత్రములు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు ఇది కూడా ఆ కార్యక్రమంలోనే ఒక భాగంగా పరిగణించాలని మనవి. దీనికి సర్వసమర్థులు వారే కావున, కష్ట, నష్టాలకోర్చి ఈ రెండు కార్యక్రమాలపై శ్రద్ధ వహించగలరని కోరడమైనది. ఈ క్షేత్రం కర్ణాటక రాష్ట్రంలో ఉన్నప్పటికీ, శ్రీ వల్లభులు మన రాష్ట్ర వాసి, తెలుగువారు కావున ఇది మన కర్తవ్యంగా గుర్తించాలి. అదేవిధంగా పెనుగొండలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ సహిత నగరేశ్వర స్వామి ఆలయంలో శ్రీవల్లభుల వారికి గూడ ఒక ప్రత్యేక ఆలయంతోబాటు వారి విగ్రహాన్ని నిర్మిస్తే రాబోయే తరాలకు చరిత్ర తెలిసే అవకాశం ఉంటుంది.

శ్రీవల్లభులు సంచరించిన పిఠాపురం, వల్లభాపురం మరియు కురువపురంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే ఆర్యవైశ్య సోదరులకు గాని, వేరేవరికైనా గాని శక్తి మేరకు విరాళములిచ్చి, ఈ బృహత్తర కార్యక్రమానికి చేదోడు వాదోడుగా నిలువగలరని దత్త వల్లభ భక్తులను కూడా ప్రార్థించుచున్నాను.

వల్లభ భక్తులు ఎవరైనా ఈ బృహత్తర కార్యక్రమానికి నడుంబిగించవచ్చు. కేవలం ఆర్యవైశ్యులకే ఇది పరిమితం కాదు. ఆర్యవైశ్యులే మిగిలిన వల్లభ క్షేత్రాలలో ప్రముఖ పాత్ర వహించుచున్న కారణంగా ఈ బాధ్యత వారిపై ఉంచినచో సముచితంగా ఉండుననే భావనతో ఈ ప్రతిపాదన చేయడమైనది.

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లతో బాటు మరెన్నో రాష్ట్రాలలో శ్రీవల్లభులవారి పేరున ట్రస్టులున్నప్పటికీ, మిగిలిన ప్రదేశాలతోబాటు ముఖ్యంగా కురువపురం అభివృద్ధిపై వారు దృష్టిని సారిస్తే సముచితంగా ఉంటుంది. గాణుగాపురం శ్రీనృసింహసరస్వతుల వారిది. కురువపురం వల్లభుల వారిది. ఈ రెండిటికి మధ్య తల్లికి, పినతల్లికి మధ్యగల వ్యత్యాసముంది. అందుకే శ్రీనృసింహ సరస్వతి వారు గూడ కురువపురం సందర్శించారు. కావున ఈ వల్లభ సంఘముల వారు కురువపురంతో పాటు వల్లభక్షేత్రాల అభివృద్ధిని ప్రథమ కర్తవ్యంగా ఎంచి తోడ్పడాలని సూచన. అందువల్ల వారందరూ ఈ విషయంపై శ్రద్ధ వహించాలని మనవి.

ఈపై మనవిని సంబంధీకులందరూ విమర్శలకు తావివ్వక సహృదయంతో స్వీకరించగలరు.

**సం/- రచయిత**



# కృతజ్ఞతలు

ఈ గ్రంథ రూపకల్పనలో ఎంతోమంది తమ విలువైన సహాయ సహకారములు అందజేసారు. వారందరికి ఈ గ్రంథ ముఖంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ముఖ్యంగా తమ అమూల్యమైన ఆశీర్వచనములతో పాటు వల్లభుల గూర్చి ఎన్నో విషయాలు వివరంగా ముఖస్థంగా తెలియజేసిన గురుదేవులు వారణాసి వాసులైన బ్రహ్మశ్రీ డా॥ శాంభవీ అంబాసహిత శాంభవానంద గారికి, ముద్రణకు ముందుగా గ్రంథ చిత్తుప్రతిని తమ పవిత్రమైన హస్తములతో స్పర్శించి, విజయాన్ని ఆకాంక్షిస్తూ దీవెనలందజేసిన పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభుల దేవస్థాన ప్రతిష్ఠాపకులు బ్రహ్మశ్రీ సజ్జన్‌ఘడ్ రామస్వామి గారికి, శ్రీవల్లభుల వారి కృష్ణాతీర నివాస విశేషాలను వివరించిన శ్రీక్షేత్ర వల్లభాపురం (పంచదేవపహాడ్) జగద్గురు శ్రీశ్రీశ్రీ దత్తాత్రేయ స్వామి మహా సంస్థాన వ్యవస్థాపకులు శ్రీ విఠల్ బాబాజీ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని వెలువరించాలనే కోర్కె ఉదయించగానే, ముద్రించడానికి తన అంగీకారం తెలియజేసిన నాకెంతో ఆప్తులు, సన్నిహితులు, చిరకాలమిత్రులు శ్రీ బండ్ల సాయిబాబు, 'బండ్ల పబ్లికేషన్స్' గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. డిటిపి సహకారాన్ని అందజేసిన 'బండ్ల పబ్లికేషన్స్' ఉద్యోగులు స్వామి, లక్ష్మారెడ్డి మరియు ఇతర ఉద్యోగ బృందానికి, కవర్‌పేజీ తీర్చిదిద్దిన శ్రీ బసవేశ్వర్ (ప్రజాశక్తి) గారికి, కలర్ పేజీలు రూపొందించిన శ్రీ సత్యనారాయణ గారికి నా అభినందనలు.

పిఠాపురం శ్రీవల్లభ దేవస్థాన ఆఫీస్ మేనేజర్ శ్రీ కుమార్ గారికి మరియు వల్లభాపురం దేవస్థానానికి చెందిన శ్రీ జ్యోతిప్రసాద్ గారికి నా ధన్యవాదాలు.

ఈ గ్రంథం ప్రారంభం నుండి నాకు ప్రోత్సాహాన్ని, సహకారాన్ని ఇచ్చిన శ్రీ పరకాల మార్తాండం గారికి, శ్రీ కె. నాగేశ్వరరావు, శ్రీమతి లలితగార్లకు, శ్రీ జయంతి బలరామమూర్తి గారికి, శ్రీ పోగునూళ్ళ రంగారావు గారికి, ఎపిపియస్‌సి ఉద్యోగి శ్రీ ఇ. భరత్ గారికి ధన్యవాదాలు.

ఈ గ్రంథ డిటిపి, కవర్ మరియు కలర్ పేజీల పర్యవేక్షణలో ఎంతో సహకరించిన శ్రీ ఎస్.వి.మారుతి గారికి నా ధన్యవాదాలు.

వీరందరికి శ్రీపాద శ్రీవల్లభస్వామి ఆయురారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించి సర్వకాల సర్వావస్థలయందు కాపాడాలని మనస్ఫూర్తిగా ప్రార్థించుచున్నాను.

– రచయిత

Sripada Sri Guru Sangamam

Seva Trust

# Jai Guru Datta